









వ్యక్తిత్వ వికాసం

సైకాలజీ,జ్ఞాపక,మానసిక శక్తి

మనస్తత్త్వ శాస్త్రము








సదాశివ సమారంభాం


గురు దక్షిణామూర్తి


గురు వేదవ్యాస మహర్షి


గురు శుక మహర్షి



గురు నారద మహర్షి


గురు వాల్మీకి మహర్షి


గురు శ్రీకృష్ణ


శంకరాచార్య మధ్యమాం


గురు దత్తాత్రేయ


గురు బాబాజీ


గురు గౌతమ బుద్ధ


గురు ఆదిశంకరాచార్య



గురు రామానుజాచార్యులు


గురు జ్ఞానేశ్వర్


గురు రవిదాస్


గురు కబీర్ దాస్


గురు చైతన్య మహా ప్రభువు



గురు నానక్


గురు రాఘవేంద్ర స్వామి


గురు వీరబ్రహ్మేంద్ర స్వామి


యోగి వేమన

అస్మదాచార్య పర్యంతాం


గురు త్రైలింగ స్వామి


గురు లాహిరి మహాశయ



గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి


గురు వివేకానంద



గురు సాయి బాబా


గురు అరబిందో


గురు రమణ మహర్షి


గురు యోగానంద


గురు భక్తివేదాంత ప్రభుపాద


గురు మళయాళస్వామి


గురు విద్యాప్రకాశానందగిరి


గురు చంద్రశేఖర పరమాచార్య

వందే గురుపరంపరాం..




నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

"నేను" గా ఉండటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి, అంతేగాక విలువైన గ్రంధాలు సరైన సంరక్షణ లేక కనుమరుగైపోతున్నాయి, కనుక మన అందరి కోసం భారత ప్రభుత్వం పురాతన ఆధ్యాత్మిక గ్రంధాలను సంరక్షించే నిమిత్తం ఎంతో శ్రమతో కంప్యూటరీకరణ ద్వారా ఒక చోట చేర్చుతూ ఆన్ లైన్ చేయటం జరిగింది. ఇటువంటి విలువైన జ్ఞాన సంపదను మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావటానికి సాయి రామ్ సేవక బృందం ఉడతా భక్తి గా ఇప్పటివరకి దాదాపు **5000** పుస్తకాలను వివిధ వర్గాలుగా విభజించి PDF(eBOOK) రూపంలో ఆన్ లైన్ లో ఉచితంగా అందించటం జరిగింది. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం అందించిన భారత ప్రభుత్వపు వెబ్ సైట్(డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా http://www.new.dli.ernet.in), ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(https://www.google.co.in), మైక్రోసాఫ్ట్ వెబ్ సైట్(http://www.microsoft.com) కు మేము ఋణపడివున్నాము.అలాగే ఇటువంటి బృహత్తర కార్యక్రమానికి పెద్ద మొత్తం లో గ్రంధాలను అందించిన తిరుమల తిరుపతి దేవస్థానమునకు కూడా మనం ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలతో నిండిపోవాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in లేక http://www.dli.ernet.in
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సేవక బృందాన్ని సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com
సాయి రామ్ భక్తి,జ్ఞాన సమాచారం: https://www.facebook.com/SaiRealAttitudeManagement
సాయి రామ్ భక్తి,జ్ఞాన సంబంద వీడియోలు: https://www.youtube.com/user/sairealattitudemgt

ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము. మీరు చదువుకోవటంలో ఏమైనా ఇబ్బంది కలిగితే సేవక బృందంను సంప్రదించగలరు. ఒకవేళ మా సేవలో ఏమైన పొరపాటు వస్తే మన్నించగలరు.

ఈ గ్రంధపు భారత ప్రభుత్వ డిజిటల్ లైబ్రరీ గుర్తింపు సంఖ్య: 2020010012408

గమనిక: భక్తి,జ్ఞాన ప్రచారార్ధం **ఉచితంగా eBook** రూపంలో భారత ప్రభుత్వపు సహాయంతో ఇవ్వడం జరిగింది. ఈ గ్రంధముపై వ్యాపార,ముద్రణ హక్కులు రచయిత,పబ్లిషర్స్ కి గలవు, కనుక వారిని సంప్రదించగలరని మనవి చేసుకొంటున్నాము.

Sai**R**eal**A**ttitude**M**anagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)

* సర్వం శ్రీ సాయినాధ పాద సమర్పణమస్తు *

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in

Digital Library of India: Inc ×

www.new.dli.ernet.in

Digital Library of India

Hosted by: Indian Institute of Science, Bangalore in co-operation with
CMU, IIIT-H, NSF, ERNET and MCIT for the Govt. of India and 21 major participating centres.

Home | Vision | Mission | Goals | Benefits | Content Selection | Current Status | People | Funding | Copyright Policy | FAQ | RFP

Books Journals Newspapers Palm-Leaves (Manuscripts)

Title: Ramayanam
Author:
Year: to
Subject: Any Subject
Language: Telugu
Scanning Centre: Any Centre

Clear | Search

Presentations and Report
Statistics Report
Status Report
Feedback | Suggestions | Problems | Missing links or Books

Click here for PDF collection
DLI MIRROR at IUCAA Data Center PUNE

DLI

For the first time in history, the Digital Library of India is digitizing all the significant works of Mankind.

Click Here to know More about DLI New!

Books	Journals	Newspapers	Manuscripts
Rashtrapati Bhavan CMU-Books Sanskrit TTD,Tirupathi Kerala Sahitya Akademi	INSA	Times of India Indian Express The Hindu Deccan Herald Eenadu Vaartha	Tamil Heritage Foundation AnnaUniversity NEW!

Title Beginning with.

A B C D E F G H I J K L M N O P Q R S T U V W X Y Z

Author's Last Name

A B C D E F G H I J K L M N O P Q R S T U V W X Y Z

Year

1850-1900	1901-1910	1911-1920	1921-1930	1931-1940	1941-1950	1951-

Subject

Astrophysics	Biology	Chemistry	Education	Law	Mathematics	Mythology	Religion	For more subjects...

Language

Sanskrit	English	Bengali	Hindi	Kannada	Marathi	Tamil	Telugu	Urdu

అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

శ్రీరామచంద్రసహాయోఽస్తు.

మనస్తత్త్వశాస్త్రము.

ప్రథమప్రకరణము.

పీ ఠి క.

జ్ఞానశక్తినిఁ బ్రకాశింపఁజేయు తర్కశాస్త్రములోని ప్రత్యక్షాదిప్రమాణములు, వాని లక్షణలక్ష్యములు, ఇంద్రియజ్ఞానము, ప్రమ, భ్రమ, విపరీతాదులు, శాబ్దబోధ లోనగువిషయములు చతుర్థప్రకరణమందు వివరింపఁబడినవి. న్యాయశాస్త్రమువలనఁ గాని యథార్థజ్ఞానము కలుగదు. ఈ ప్రమాజన్యజ్ఞానముచే నెల్లవిషయములుఁ జక్కఁగ నెఱుఁగఁదగును. విజ్ఞానసుధార్ణవములో నవిచ్ఛిన్నములుగ నభివ్యాప్తములగు భావవీచికలనుఁ దెలియఁజేయు రసశాస్త్రవిషయములు తృతీయప్రకరణమందును, ఇచ్ఛలు పొడమినప్పుడు స్వేచ్ఛగాఁ బోనీయక, ఆత్మహితకరంబులుగను, జగత్కళ్యాణదాయకంబులుగ నొనరించు నీతిశాస్త్రవిషయములు, కామక్రోధాద్యరిషడ్వర్గము వివరించుసందర్భమున ద్వితీయప్రకరణమునందు నుఁ జక్కఁగ తెలుపఁబడినవి.

10. మానసికశాస్త్రమున కేవల మనస్సంబంధవిషయములకే ప్రసక్తి కాని తదితరశాస్త్రవిషయములకు ప్రసక్తిలేదని, పాశ్చాత్యశాస్త్రజ్ఞులు నుడివినను ప్రాచ్యశాస్త్రజ్ఞులు దార్శనికులు మనస్సును కరణముగ (సాధనము) గ్రహించి, దానిని శుద్ధిఁజేసి దానివలన పరమపురుషార్థంబగు బ్రహ్మ(జ్ఞాన)విద్యారూపక్రియాసిద్ధినిఁ బడయుటయె శాస్త్రప్రయోజనమని నిరూపించిరి. మానసికశాస్త్రమునుఁ జదివి మనశ్శుద్ధినిఁ గావించి, దానివలనఁ బొందు ప్రయోజన మేమని ప్రశ్నించిన ఆత్మజ్ఞానమునుఁ బడసి, నిరతిశయసుఖంబును, అమృతానందరూపంబగు మోక్షమును బొందుటయే యని చెప్పక తప్పదు. పరమపురుషార్థంబగు మోక్షశాస్త్రమునకు సంబంధించిన శాస్త్రవిషయములు మానసికశాస్త్రమున కనుబంధములని తెలియఁదగును.

11. మోక్షప్రతిబంధియు మనోమాలిన్యంబునగు కామక్రోధాద్యరిషడ్వర్గము విస్తరించి ద్వితీయప్రకరణమున వ్రాయఁబడెను. దీనిని శ్రద్ధతోఁ జదివి యనుభవమున నుంచికొనినచో దైనందినజీవితమున విషమ ఘట్టనల నీశత్రువుల నెదుర్కొని జయించి జీవితమును సుఖదంబుగఁ గడుప

వచ్చును. ఈ యరిషడ్వర్గ ప్రకరణమును అనుభవసిద్ధముగ వ్రాయునపుడు క్షేమేంద్రమహాకవికృత కళావిలాసము, దర్పదళనము, మహాకవి బాణభట్ట కృత కాదంబరిలోని శుకనాసహితోపదేశంబును, శ్రీ పండిత మదనమోహన మాలవీయ పితృపాద శ్రీ వ్రజనాథ చతుర్వేద మాలవీయవిరచితంబగు "సిద్ధాంతదర్పణము" గ్రంథవ్యాఖ్యలోని యనేకాంశములును నెంతయు నుపయోగించినవి. ఉన్మార్గగామియగు మనస్సును శిక్షించి, సన్మార్గంబునఁ బ్రవర్తింపఁ జేయుటంజేసి నీతిశాస్త్రమనియుఁ జెప్పవచ్చును. (Ethics Morality)

12. ఆత్మజ్యోతి స్వయంప్రకాశంబును, సర్వావభాసకంబును, అనన్యావభాస్యంబు ననువిషయము ననేకదృష్టాంతములతోడ బృహదారణ్యక షష్ఠాధ్యాయ జనక యాజ్ఞవల్క్యసంవాదము ననుసరించి సుగమముగ వ్రాయఁబడెను. సాంఖ్యయోగశాస్త్రముల ననుసరించి త్రిగుణములు, వృత్తులు, బుద్ధిశక్తులగు స్మృతి, ధారణ, గ్రహణ, అవధానత, ప్రజ్ఞామేధాదులు పంచమప్రకరణమున వివరింపఁబడెను. ఇతరు లనుభవించు సుఖదుఃఖములు తా ననుభవించినట్లు తత్థ్సానీయుఁడై తద్భావభావనచే ననుభవములన్నియు వ్రాయుటవలన చిరకాలము పట్టెను. ఇది యనుభవజ్ఞులకుఁ దెలియనివిషయము కాదు.

13. మానవులు సుఖమునుఁ గోరుటయు, దుఃఖమును ద్వేషించుటయు సహజము. సుఖములఁ గోరినను రాకుండుటయు, దుఃఖములు వలదనినను వచ్చుటయు, మానవప్రయత్నము విఫలమగు వైచిత్ర్యము, సుఖదుఃఖస్వరూపము చక్కఁగ నిందు వివరింపఁబడినది. ఈ వ్యావహారిక ప్రపంచమున సంసారమున సంభవించు విషమసంఘట్టనల నెదుర్కొనువిషయము తద్భావభావనచే నెల్లమానవులకుఁ గలుగు సర్వవిధదుఃఖముల వర్ణించి, వ్యాధులకు దివ్యౌషధమ్ములంబోలె తన్నివారణోపాయములు లోకశాస్త్ర దృష్టాంతములచే వివరింపఁబడియె. ఎవని కేదుఃఖము కలిగినను, భయముఁ

గలిగినను, ఆధ్యాత్మికజ్ఞానభావన దివ్యౌషధముచే నివర్తింపఁ జేసికొనవచ్చును. మహాభారత శాంతిపర్వమునఁ జెప్పఁబడిన భవరోగదివ్యౌషధములన్నియు నిందు దృష్టాంతసహితముగఁ దెలుపఁబడెను. ఆత్యంతిక దుఃఖనివృత్తియే మోక్షమని సాంఖ్యశాస్త్రమును, అనాద్యవిద్యారూప సుఖదుఃఖజనక సంసారబంధనివృత్తియే కైవల్యమని వేదాంతశాస్త్రంబును, చిత్తవృత్తినిరోధజనిత నిర్వికల్పకసమాధియే అమృతానందచిద్ఘనమని యోగశాస్త్రంబును దెలుపుచున్నవి. అట్టిస్థితి సాధనచతుష్టయసంపత్తిలో నొకటి యగు శమాదిషట్కంబుచేఁ గలుగుచున్నది.

14. మోక్షసాధనంబులగు శమ, దమ, ఉపరతి, తితిక్ష, శ్రద్ధ, సమాధానములును, వాని నలవఱచుకొనుపద్ధతులు, ఆత్మశిక్షణము, దైనందినజీవితమందు ఆధ్యాత్మికాభ్యున్నతిఁ జెందుట లోనగువిషయములు పంచమప్రకరణాంశమందు తెలుపఁబడినవి. కేవల విషయపరాయణుఁడును, తమోభిగ్రస్తుఁడగు మూఢునకు శాస్త్రము బోధించియు నుపయోగము లేదు. బ్రహ్మవిద్వరిష్ఠులగు సిద్ధపురుషులు లోకాతీతులు కావున శాస్త్రజ్ఞానమావశ్యకత లేదు. దుఃఖభూయిష్ఠమగు సంసార మసారమని తెలిసి గృహమును వీడఁజాలక, అడవుల కేగఁజాలకయుండు ముముక్షువు, జిజ్ఞాసువునకే శాస్త్రమంతయుఁ బోధించుచున్నది. సన్న్యసించి యడవులకేగ నావశ్యకతలేక గృహస్థాశ్రమమందే యుండి మనశ్శాంతిని బడసి యుత్తమపురుషార్థముఁ బొందనగునని యోగవాసిష్ఠమునఁ జెప్పఁబడినవిధమున నీ మనస్తత్త్వశాస్త్రపఠనమున సకలదుఃఖముల నివర్తింపఁజేసికొని, మనశ్శాంతినిఁ బడసి, అమృతానందచిద్ఘనంబగు పరమాత్మునిఁ బొందనగును. ముప్పదిసంవత్సరములు బహుగ్రంథావలోకనముఁ గావించి విశేష పరిశ్రమించి, లోకశాస్త్రానుభవములఁ బట్టి రచియించిన యీగ్రంథము మానవకోటికిని, అందు ముఖ్యముగ శాంతాశ్రమములు యోగాశ్రమములలోనుండు జిజ్ఞాసువులగు ముముక్షువులకు నుపకరింపక పోవదని తలఁచెదను. తర్కరససాహిత్యప్రకరణాంశములు కళా

శాలావిద్యార్థులకును, దుఃఖవ్యాకులితమనస్కు లగువారికందఱికి మనస్సమాధాన దుఃఖోపశమనవిషయములును, మిగుల యుపయోగించునని నమ్మెదను.

శరీరములోని జ్ఞాననాడులు షట్చక్రములు (Ganglionic Centres and Plexuses) గ్రంథులు వానిస్థానములు, అనుభవరహస్యవిషయము లనేకములు "యోగవిద్యాప్రకాశిక" యను గ్రంథమున వెలువరింపఁబడును.

15. ముద్రణమువలయు సాహాయ్య మొనరించిన కావలిపురవాస్తవ్యులును, గీతాహృదయ (ఆంధ్రవచనీకృత) దొడ్డ రామాయణగ్రంథకర్తలును, సౌజన్యనిధులు నస్మన్మిత్రులు నగు శ్రీయుత దొడ్లా వేంకటరామరెడ్డిగారికిని, వంగోలుపుర B. S. O. కంపెనీ యేజెంట్లునగు శ్రీయుత నాట్లు అణ్ణాజిరావుగారికిని నెంతయు కృతజ్ఞుఁడను. మఱియు చెన్నపురివాస్తవ్యులు అముద్రితానేక సంస్కృతాంధ్రగ్రంథముద్రణదీక్షాబద్ధకంకణులును, త్రిలింగపత్త్రికాధిపతులును, భాషోద్ధారక సార్థక బిరుదాంచితులు నగు శ్రీయుత వావిళ్ల వేంకటేశ్వరశాస్త్రులుగారు స్వీయముద్రణాలయంబున ముద్రింపించి, సాహాయ్య మొనరించినందుల కెంతయు కృతజ్ఞతాపూర్వకాభివందనముల నర్పించువాఁడ. ఈ గ్రంథవిషయమునఁ దోడ్పడినవారెల్లరు వంద్యులు. సర్వజనులకు సుగమముగ నుండునట్లు కొన్నియెడల సంధుల విడఁదీసి, క్లిష్ట సంధులఁ గావింపక, దీర్ఘ సమాసముల నొనరింపక, భావబోధకనుగుణముగ వ్రాసితిని. సదయహృదయులగు సహృదయతత్త్వజ్ఞులు గుణముల గ్రహించి భ్రమప్రమాదజనితదోషములఁ దెలిపిరేని ద్వితీయముద్రణమగుభాగ్య మబ్బెనేని సంస్కరింతునని సప్రణయముగ వారినిఁ బ్రార్థించుచున్నాఁడను.

వంగోలు ప్రమాది పుష్య బ ౧౦ లు. 3-2-1940.	ఇట్లు, విన్నవించు సుధీవిధేయుఁడు, ముక్తినూతులపాటి గోపాలకృష్ణశాస్త్రి.

విషయసూచిక.

ప్రథమప్రకరణము.

మనస్స్వరూపము.

ఆత్మస్వరూపవిచారము.

విషయసూచిక.

ద్వితీయ ప్రకరణము.

అరిషడ్వర్గము.

విషయసూచిక.

విషయసూచిక.

పంచమ ప్రకరణము.

విషయసూచిక.

విషయసూచిక.

శమాదిషట్కసంపత్తి.

విషయసూచిక సమాప్తము.



శ్రీరామచంద్రసహాయోఽస్తు.

మనస్తత్త్వశాస్త్రము.

ప్రథమ ప్రకరణము.

మంగళాచరణము.

శ్లో. నమస్యే సచ్చిదానందరూపిణే మోక్షదాయినే,
బుద్ధీంద్రియమనోవృత్తిసాక్షిణే పరమాత్మనే.
ప్రాచ్యపాశ్చాత్యశాస్త్రాణి సమాలోచ్య యథామతి,
గోపాలకృష్ణవిదుషా రచితం బుధసమ్మతం.
మనస్తత్త్వాఖ్యశాస్త్రం తత్సర్వశాస్త్రసముద్ధృతం,
సర్వలోకోపకారాయ జీయాదాచంద్రతారకం.

శ్రీమదనంతకోటిబ్రహ్మాండనాయకుండును, అపారకృపాసముద్రుండును, సర్వజ్ఞుండును, సచ్చిదానందస్వరూపుండునగు పరమేశ్వరుండు మానవుల సృజియించి, దుఃఖమయంబగు నరకంబునం బడక, శాశ్వతానందసుఖరూపంబగు పరబ్రహ్మపదవి నొందఁ గర్మజ్ఞానేంద్రియంబులు నంతఃకరణంబు ననుకూలశరీరంబు లొసంగి, ప్రవృత్తి నివృత్తిమార్గములం దెలుపు విహితశాస్త్రంబుల స్వాంశసంభూతులగు మహనీయులమూలమునఁ దెలిపి, యెల్లఱకుం గమ్యుండై యున్నవాఁడు. ఆదయామయుని యుద్దేశ్య మరయఁజాలక యంతఃకరణ సహితేంద్రియ

వర్గంబు నసద్విషయంబగు కామక్రోధరాగద్వేషాదులలోనికిం జొనిపి, యాత్మను దుఃఖరూపనరకకూపంబునఁ బడఁద్రోయు మానవునికన్న నాత్మద్రోహి మఱియెవఁడు గలఁడు? అటుగాక సత్సాంగత్య సద్గ్రంథ శ్రవణ మననాదులఁ గావించి, యాత్మానాత్మవివేకముఁ బడసి, విమలజ్ఞానంబున నాత్మనుద్ధరించి, శాశ్వతానందసుఖమయంబగు మోక్షమునుఁ జెందుటయె మానవ జన్మసాఫల్యము.

పరమసుఖము - కైవల్యము.

ప్రపంచమునందలి మానవకోటియంతయు దుఃఖము నపేక్షింపక సుఖంబునే కోరుచున్నటుల యెల్లఱకుం దెల్లంబయిన విషయంబు. సుఖమనుశబ్దమునందు రెండుపదములు గలవు. "సు + ఖం" అని. సు అనగ లెస్సయని యర్థము. ఖం. అనగ ఇంద్రియము. ఇంద్రియములకు లెస్స యనుకూలతయే సుఖము. సామాన్యసుఖము; పరమసుఖము; అని సుఖము రెండువిధములు. సామాన్యసుఖము నిత్యము కాదు. అనఁగా కొంతకాలమే యుండునది. ఏమియు సుఖమెఱుఁగనివారును, గత్యంతరము తోఁచనివారును, సుఖము కొంతకాలమున్నను బ్రదుకుదుము; ఎల్లకాలము దుఃఖ మనుభవింపలేము; అను వృత్తితోఁ గోరినం గోరవచ్చును. అట్టివార లరుదు. ఎల్లఱు నెల్లప్పుడును సుఖము వలయుననియే కోరుట సహజము. ఎప్పుడు నుండుసుఖము పరమ సుఖము. అనఁగా నెప్పుడును దుఃఖమును శోకమును బొందక యానందముతో మెలఁగుట

కనుపించునటుల, మానవులమనం బెవ్విధంబుగ నుండునో, లోకంబు నవ్విధంబుగ నుండు. సంతుష్టాత్ములకు సంతోషానందభరితముగను, దుఃఖితాంతఃకరణులకు నెటఁ జూచినఁ దనివిలేక వ్యసనాంధకారబంధురితముగను, కామాత్ములకుఁ బ్రణయమయంబుగను, ధనసంపాదనాపరాయణులకు ధనమయంబుగను, బ్రహ్మానుభవతత్పరులకు బ్రహ్మమయంబుగను, లోకము కన్పట్టుచున్నది. లోకమందలివస్తువు లేకాకారముగ నుండినను వారివారిచిత్తమునకుఁ దగినటుల వస్తువు లాయావిధంబునఁ దోఁచుచున్నందున, మనస్సు ననుసరించి లోకము విస్తరింపఁబడుచున్నది కాని లోకము ననుసరించి చిత్తముండుట లేదు. సుషుప్తికాలమందు మనస్సు లీనమై యుండుట వలన, లోకమున్నను మనోగోచరమగుట కానము. దీనింజూడ మనస్సు లయించిన లోకంబు లడంగుననియు, మనస్సు వికాసమునొందిన లోకములు విస్తరించుననియుఁ దెలియుచున్నది.

సంకల్పజాలమే మనస్సు.

చంద్రునియందు చంద్రికవలెనున్న, పరమాత్మసంకల్పమే మనస్సనంబడు. మనస్సన వేఱొండు లేదు. సంకల్పసముదాయమై యున్నది. సంకల్పసంచయ మనునాహారము లేనిచో మనస్సు నశించును.

శ్లో. సంకల్పనం మనో విద్ధి సంకల్పాత్తన్న భిద్యతే,
యత్ర సంకల్పనం తత్ర మనోఽస్తీత్యవగమ్యతాం.

సంకల్పమనసీ భిన్నే న కదాచన కేచన,
అవిద్యాసంసృతిశ్చిత్తం మనోబంధో మలం తమః.

యోగవాశిష్ఠే-ఉత్పత్తిప్రకరణే.

మన ఏవాఖిలం విశ్వం సృజత్యత్ర తు నో విధిః,
స్వప్నవన్న హి స్వప్నార్థో బ్రహ్మణా సృష్ట ఈక్ష్యతే.
రూపం నామ చ జాతిం చ కల్పయిత్వా స్వశక్తితః,
బ్రహ్మజ్ఞమపి వా చిత్తం సంసారయతి పూరుషం.
సంసారో మనసా పుంసః కల్పితోఽస్తి న వస్తుతః,
మనశ్శూన్యే సుషుప్త్యాదౌ సంసారో నైవ దృశ్యతే.
యత్ర యత్ర మనస్ఫూర్తిస్తత్ర తత్ర జగత్త్రయం,
యత్ర యత్ర మనో నాస్తి తత్ర తత్ర న కించన.

మహావాక్యదర్పణే.

సంకల్పంబే మనంబు, సంకల్పంబునకన్న మనం బెప్పటికిని భేదింపదు. ఎచట సంకల్పముండు నచట మనస్సు నుండు. అవిద్య, సంసృతి, చిత్తము, మనస్సు, బంధము, మలము, తమస్సు, అని మనస్సునకుఁ బేళ్లు గలవు. ఈమనస్సే చిత్రవిచిత్రముగ లోకముల సృజించి, నామ రూప జాత్యాది భేదములఁ గల్పించి, ప్రజ్ఞావంతునేని; బ్రహ్మజ్ఞునేని; వివేకశీలునేని; తనశక్తిచే సంసారప్రవాహంబునఁ బడవైచి భ్రమింపఁ జేయుచుండు. ఎచట నెచట మనస్సుండు నచేట నచేట లోకంబు లుండు; మనస్సు నశించిన లోకంబు; సంసారంబు నాశమగునని శ్రీభగవత్పాద శంకరాచార్యులువారు మహావాక్యదర్పణమందు వాక్రుచ్చియున్నవారలు.

శ్లో. సంకల్పజాలకలనైవ జగత్సమగ్రం
సంకల్పజాలకలనాత్తు మనోవిలాసః,
సంకల్పమాత్రమలముత్సృజ నిర్వికల్ప
మాశ్రిత్య నిశ్చయమవాప్నుహి రామ శాంతిమ్.
సంకల్పవాసనాజాలైస్స్వైరేవాయాతి బంధనం,
మనోలీలామయైర్బంధైః కోశకారక్రిమిర్యథా.

యో

సంకల్పము బంధకారణము.

ప్రాణుల సుఖదుఃఖములకును, రాగద్వేషముల
జనన జరామరణరూప సంసారప్రవాహమునకును, సం
రూపమనస్సే కారణము. సంకల్పసమూహమువలనఁ గల్పి
బడిన జగత్తు, పట్టుపురుగు తాను విలాసమునకై నిర్మి
కొనిన భవనము బంధమయినట్లు, ప్రాణులకు బంధ
నేర్పడినది. అట్టి నిర్బంధమగు బంధములోఁ జిక్కి
తప్పించుకొనఁజాలక, పలువిధపాట్లుబడు ప్రాణులయెడఁ
కరము కలిగి, యీశ్వరాంశసంభూతులును, మహనీ
నగు యోగీశ్వరులు, బంధవిముక్తిమార్గమును గని
యోగశాస్త్రముఖంబునఁ దెలిపిరి.

అనుబంధచతుష్టయము.

మనస్సుయొక్క యాథార్థ్యమునుఁ దెలుపునట్టిశాస్త్ర
కాఁబట్టి మనస్తత్త్వశాస్త్రమని అభిధేయము. మనస్సు
సర్వప్రాణుల చిత్తవృత్తులు, భావనలు, వేదనలు, తచ్ఛక్తి,

ద్రియమనియుఁ, బదునొకండవ యింద్రియమనియు వ్యవహారము కలదు.

అంతఃకరణభేదములు.

ఆకాశాదిపంచమహాభూతముల సత్త్వగుణసమష్ట్యంశములవలనఁ గలిగిన యంతఃకరణము వృత్తిభేదముచే మనస్సు, బుద్ధి, అహంకారము, చిత్తము నను నాలుగువిధములఁ బరగుచున్నదని యిదివఱలోఁ జెప్పఁబడెను. అందు సంకల్పవికల్పాత్మకంబు మనస్సు, నిశ్చయాత్మకంబు బుద్ధి, కర్తృత్వాభిమానంబు నహంకారము, ధ్యానయోగ్యచైతన్యాత్మకంబు చిత్తంబునై వెలయు. మఱియు నీ యంతఃకరణము; ఇచ్ఛాశక్తి; జ్ఞానశక్తి; క్రియాశక్తి యను మూఁడుశక్తులు గలదియనియు, సత్త్వగుణ; రజోగుణ; తమోగుణముగల ప్రకృతియనియుఁ జెప్పఁబడు.

మనశ్శబ్దనిర్వచనము.

మన్యతే బుధ్యతేఽనేనేతి; మనః; సర్వధాతుభ్యోఽసున్;

ఎద్దానిచే విషయములు తెలిసికొనఁబడుచున్నవో అయ్యది మనస్సనఁబడునని (మన్యతే= తెలియఁబడుట) వ్యుత్పత్త్యర్థము.

మనో నామ - సంకల్పవికల్పాత్మికా - అంతఃకరణవృత్తిరితి.

వేదాంతసారః.

మనస్స్వరూపము.

సంకల్పవికల్పాత్మకమగు నంతఃకరణవృత్తియే మనస్సని వేదాంతసారము. ఒకపదార్థమునుఁ జూచినంతట యుక్తా

యుక్తవివేచన లేక తలంచుచు,సంశయించుచు, నిశ్చయజ్ఞానము లేక తదాసక్తమయినది మనస్సనఁబడు. సంకల్పసమూహంబ మనస్సు. మనస్సునకు సంకల్పంబున కేమిట భేదంబు లేదు. సంకల్పంబనఁగ తలఁచుట; వికల్పంబనఁగ తలఁచినదానిని అవును కాదని నిశ్చయజ్ఞానము లేక, తర్కించుట సంశయించుట. మన స్సెప్పుడు నేదే నొకదానినిఁ దలంచుచునే యుండు. తలంపుల గుమియను నూతకట్టు లేక మనసు నిలువఁజాలదు. ఈ సంక ల్పంబు లనేకవిధంబులుగ నుండు. ఒకపదార్థము మీాదికి నేత్రేంద్రియముద్వారా మనసు ప్రసరించి; దానిం గాంచి భావించుచుగాని అంతకు ముందుఁ జూచినదానిని అనుభవ స్మృతిమూలముగఁ దలంచుచుఁగాని యుండును. లేక మనో రథపరంపరలనేని సంకల్పించుకొని ఆకాశమునం దడ్డులేక యండజము చరించినట్లును, పుడమియందు జింకలు పరువిడి నట్టును, హృదయాకాశముం దెడతెగక సంచరించుచుండు. విద్యుచ్ఛక్తివేగమునకన్న వాయువేగమునకన్న నుత్తమ ధూమశకటవేగమునకన్న ననేకమడుంగులు మనోవేగ మధిక మని తత్త్వజ్ఞులు నిశ్చయించిరి.

మనస్స్వరూపము - తద్వృత్తులు.

శ్రు. కామస్సంకల్పో విచికిత్సా శ్రద్ధాఽశ్రద్ధాధృతి
రధృతిర్హ్రీర్ధీర్భీరిత్యేతత్సర్వం మన ఏవ.

బృహదారణ్యకోపనిషత్.

కామము, సంకల్పము, విచారేచ్ఛ, శ్రద్ధ, అశ్రద్ధ, ధైర్యము,

అధైర్యము, లజ్జ, జ్ఞానము, భయము; ఇవి మొదలగు వృత్తు లన్నియు మనస్సని చెప్పఁబడును.

చక్షురాదీంద్రియములకు ఘటాదిపదార్థములు ప్రత్యక్ష మైనటుల, సాక్షిచైతన్యమునకుఁ బ్రత్యక్షము లైయుండు. కామసంకల్పాదివృత్తులు మృత్పిండమువలన ఘటాదులువలె, దేనివలనఁ బుట్టుచుండు నయ్యది మనస్సని చెప్పఁబడు.

మనసు కలదనుటకుఁ బ్రమాణములు.

శ్రు. అన్యత్ర మనా అభూవం నాఽదర్శం,
అన్యత్ర మనా అభూవం నాఽశ్రౌషం.
మనసా హ్యేవ పశ్యతి మనసా శ్రుణోతి,

నామనంబు మఱియొకచోట నుండినందున దీనినిఁ జూడలేక పోయితిని. నామనస్సు వేఱొకచోట నున్నందున నీశబ్దమును వినలేక పోతినని; లోకంబునఁ జెప్పుచుండుట కలదు. ఇంద్రియము లున్నను వాని యధిష్ఠానమగు మనస్సం యోగము లేకున్న నవి యేమిజేసినను జేసినటుల తలంపఁ బడవు. దీనింబట్టి యింద్రియములకన్న నతీంద్రియమగు మన స్సనునది వేఱొకటి కలదని తెలియఁబడుచున్నది. ఈ పురు షుఁడు మనసుచేతనే చూచుచున్నాఁడు. మనసుచేతనే విను చున్నాఁడని పైశ్రుతికి నర్థము.

ఇంద్రియములకు స్వాతంత్ర్యము లేమి.

ఇంద్రియాణి న స్వతంత్రాణి, సర్వేషాం మనోఽనుసారిత్వాత్,
యస్యావధానానవధానాభ్యాముపలబ్ధ్యనుపలబ్ధీ భవత స్తన్మనః.

కంటికి నెదురుగఁ జీకటిని వెలుతురులో నుండు ఘట మున్ను; చెవులదగ్గఱఁ బెద్దగఁ జెప్పఁబడుశబ్దమున్ను; ఎయ్యది అజాగ్రతగ నున్నందునఁ దెలియఁబడదో, ఎయ్యది జాగ్రతగ నున్నందునఁ దెలియఁబడునో, అదియే మనస్సు. ఇంద్రియము లకు స్వాతంత్ర్యము లేదు. మనస్సు ననుసరించి మెలంగ వలయు.—ఈమనస్సు అన్నివిషయములనుఁ దెలిసికొనుటకు సామాన్యకారణమై యున్నదని భావము.

ఇంద్రియములకన్న మనస్సునకు సూక్ష్మభేదగ్రహణశక్తి యెక్కువ.

శ్రు. తస్మాదపి పృష్ఠత ఉపస్పృష్టో మనసా విజానాతి.

ఒకపురుషుఁ డొకనిచేత వెనుకభాగమునందు స్పృశింపఁ బడినవాఁడై, యిప్పుడు చేతితో స్పృశించినాఁడని యిపుడు వ్రేలితో స్పృశించినాఁడని విశేషముగఁ దెలిసికొనుచున్నాఁడు. ఇందు స్పర్శమాత్రము త్వగింద్రియముచేఁ దెలియఁబడినను, ఇది యంగుళిస్పర్శయని, ఇది హస్తస్పర్శయని విశేషముగఁ దెలిసికొనునది మనస్సయ్యే యుండి తీరవలయు. చక్షురింద్రియము తనకెదుటనుండు విషయములనే కనిపెట్టునుగాని, వెనుకభాగమునందుండు విషయములఁ గనిపెట్టనేరదు గదా? గనుక వెనుక భాగమునందుండు అంగుళీస్పర్శాదివిశేషవిషయజ్ఞానము మనస్సునకే కలిగియున్నదని నిశ్చయింపవలయు. శ్రవణేంద్రియముచే శబ్దము మాత్రము గ్రహించినను, ఇయ్యది వీణాధ్వని; అయ్యది వేణుధ్వని, మురజధ్వని, భేరీధ్వని; షడ్జమ

స్వరము, మధ్యమస్వరము, కాకలీస్వరము లోనగు సూక్ష్మ భేదములనుఁ గనుఁగొనునది మనస్సనుటకు సంశయం బించుకేని లేదు.

శబ్దస్పర్శరూపరసగంధములు విషయములుగాఁగల, శ్రోత్రత్వక్చక్షుర్జిహ్వాఘ్రాణములను, జ్ఞానేంద్రియపంచకము తమకు నియమితమయిన యొక్కొక్కవిషయమునే గ్రహింపఁ జాలునుగాని; ఆయా విషయములలోని సూక్ష్మ పరమసూక్ష్మ భేదములను గ్రహింపఁజాలదు. సర్వేంద్రియవిషయములు నందలి సూక్ష్మాతిసూక్ష్మభేదముల గ్రహింపఁజాలినంతశక్తి మనస్సునకుఁ గలదుగాని యింద్రియములకు లేదు. దానిం బట్టియే విషయములకన్న నింద్రియములు, ఇంద్రియములకన్న మనస్సు, క్రమంబుగ శ్రేష్ఠంబని

శ్లో. ఇంద్రియాణి పరాణ్యాహురింద్రియేభ్యః పరం మనః.

భగవద్గీతాశాస్త్రంబునఁ జెప్పఁబడియున్నది.

> అపి చ శిశోః మాతృనువర్తనం భృత్యస్య ప్రభోరనుసరణం యథా తథా ఇంద్రియగణస్య మనోనువర్తిత్వం దృష్టం లోకే.

ఇంద్రియములకు మనోనుసరణము.

ఇంద్రియములు స్వాతంత్ర్యమును బొందక, భృత్యులు ప్రభువు ననుసరించినమాడ్కిని, బిడ్డలు తల్లి ననువర్తించిన పగిదిని, మనఃప్రభువునాజ్ఞల ననుసరించి మెలంగుచుండు.

ఇంద్రియముల సాహాయ్యము లేక బాహ్యవిషయ జ్ఞానము మనస్సునకు లేకుండుటంబట్టియు, మనస్సాహాయ్యము

లేక యింద్రియములు బహిర్విషయములఁ గనుఁగొనమి చేతను, ఇంద్రియమనంబుల కన్యోన్యసంబంధమును పరస్పరానుసరణంబును గలదు. విషయేంద్రియసంయోగమువలననే మనస్సునకు బహిర్విషయజ్ఞానము కలుగుచున్నది కాని కేవలవిషయములచేతను కేవలేంద్రియములచేతను గలుగుట లేదు. మనస్సునకు విషయజ్ఞానమం దింద్రియము లుపకరణములగుచున్నయవి.

మానసికతేజస్సులేని ఇంద్రియములు వ్యర్థములు.

ఇంటనుంచిన దీపపువెలుఁగు ద్వారములగుండ వెలికిఁ బ్రసరించినటుల నవద్వారపురమగు నీశరీరమందుండిన మానసికజ్యోతిస్సు ఇంద్రియములద్వారా వెలుపలఁ బ్రకాశించుచున్నది. దీపములేని యింటికి ద్వారములున్ననుఁ బ్రయోజనము లేనిచందంబున మానసిక తేజఃప్రసారములేని యింద్రియగోళంబులును వ్యర్థము లగుచున్నవి.

మనస్సు వృత్తిరూపముగఁ బరిణమించియున్నదనుట కీ క్రిందిప్రమాణము వేదాంతపరిభాషయందుఁ గలదు.

వృత్తిస్వరూపనిరూపణము.

యథా తటాకోదకం ఛిద్రాన్నిర్గత్య కుల్యాత్మనా కేదారాన్ ప్రవిశ్య, తద్వదేవ చతుష్కోణత్వాద్యాకారతాం భజతే, తథా తైజసమంతఃకరణమపి చక్షురాదిద్వారా ఘటాదివిషయదేశం గత్వా

ఘటాదివిషయాద్యాకారేణ పరిణమతే సఏష పరిణామో వృత్తి రిత్యుచ్యతే.

సంపూర్ణతటాకములోని జలము తూముగుండ కాలువరూపముగ వచ్చి త్రికోణ చతుష్కోణ పంచకోణాకారముగ నుండు మాగాణిలోనికిఁ బ్రవేశించి ఆయామాగాణియాకృతినిఁ బొందినట్లు, తేజోరూపముగనుండు నంతఃకరణంబును, చక్షురాదీంద్రియములద్వారా బాహ్యములగు ఘటపటాదివిషయములమీఁదికిఁ బ్రసరించి తదాకారముగఁ బరిణమించుట వృత్తి యనఁబడును.

బంగారు, వెండి మొదలగు లోహములు మూసలోఁ బెట్టి కఱఁగించి యెద్దానంబోసిన దానియాకృతిగఁ బరిణమించు చందంబున, అంతఃకరణంబును బహిర్విషయములమీఁదికిఁ బ్రసరించి, విషయాకారంబుగను లోపల సుఖదుఃఖరాగద్వేషాది వృత్తిరూపముగను బరిణమించును.అంతఃకరణవృత్తులన్నియుఁ బ్రమాణ విపర్యయ వికల్ప నిద్రా స్మృతులనెడు నయిదువృత్తులలో నంతర్భవించియున్నవని పాతంజలయోగశాస్త్రమునఁ జెప్పంబడినది.

ఇంద్రియములకు, మనసునకు, అధోముఖప్రసరణము.

చెఱువునీరు, పల్లముగనుండు ప్రదేశములకు కాలువలుగుండ నతివేగముగఁ బ్రవహించి, మెఱకప్రదేశములగ నీరు పాఱనప్పుడు అతిప్రయాసముగ బహువిధప్రయత్న

ములచే నీటియంత్రములగుండఁ బ్రవహింపఁజేసిన చందమున మానసికతేజోద్రవంబును చక్షురాదీంద్రియములద్వార తుచ్ఛములును దుఃఖకరములునగు కామ క్రోధ రాగ ద్వేషా ద్యైహికవిషయంబులమీఁదికి నతివేగముగఁ బ్రవహించి, శాశ్వతానందసుఖసంజనకంబులగు శమ దమ తితిక్షా భక్తిజ్ఞాన వైరాగ్యంబులను నూర్ధ్వభూమికలకుఁ బ్రవహించునపుడు, ధ్యానధారణాది యోగాభ్యాసాది యంత్రసాధనములఁ బైకిఁ బ్రసరింపఁజేయవలయు.

శ్రు. పరాఞ్చి ఖాని వ్యతృణత్స్వయంభూ
స్తస్మాత్పరాఙ్పశ్యతి నాంతరాత్మా.

ఇంద్రియముల కెల్లపుడు నధోముఖప్రసరణముగాని, ఊర్ధ్వముఖప్రసరణము లేదు. పృథివీసంబంధములయిన యణు మహత్త్వముచే నింద్రియములు మనస్సు సృష్టికర్తచే నిర్మితములగుటంబట్టి, స్వకారణంబులగు నైహికవిషయంబుల మీఁదికి నింద్రియములు మనస్సుతోడఁ బోవుచుండుట స్వభావధర్మము. ప్రకృతిసంబంధములయిన మనస్సును,ఇంద్రియ వర్గంబును, ఉదకములు పల్లపుఁబ్రదేశములలోనికిఁ బాఱు చందంబున నధోముఖములగుచుండునుగాని, యూర్ధ్వాభిముఖములగుట కానము. (ప్రకృతి యన జలంబు) జలస్వభావమగు నధోముఖప్రసరణము ప్రాకృతికమగు నింద్రియవర్గము నకుఁ గలదని పైశ్రుతికిఁ దాత్పర్యము.

బాహ్యవిషయానీకతృణకణాహారము లేక, ఇంద్రియ పశుగణంబు జీవింపలేదని పైవిషయంబువలనఁ దేటపడుచున్న యది.

ఒక యింద్రియము వికలమైన నితరేంద్రియములకు గ్రహణశక్తి యెక్కువ.

చెఱువునందలి నీరు అయిదు తూములగుండ మాగాణి ప్రదేశములకుఁ బ్రవహించునపుడు ప్రవాహావేగ మన్నిటి యందు సమానముగ నుండు. అందేదేనొక తూము పూడి పోయినయెడ తక్కినతూములగుండ నతివేగముగఁ బ్రవహించు నవ్విధంబుననే మానసికతేజోద్రవము పంచేంద్రియములద్వార ప్రసరించునపుడు జ్ఞానబలము సమానముగ నుండు. అటుగాక అందేదేనొక యింద్రియమునకు వైకల్యము గలిగెనేని తక్కినయింద్రియములకు గ్రహణశక్తియందుఁ బటుత్వ మధికముగఁ జూపట్టు. గ్రుడ్డివారికి వినికియందును చెవిటివారికిఁ జూపునందును విశేషగ్రహణశక్తి యున్నట్టు మనమనుభవమువలనఁ దెలిసికొనుచున్నారము. చెఱువునకుఁ గల యైదుతూములలో నొకదానికి రంధ్రము చేక్కఁగఁగను పించినను, చెత్త, ఆకులు, మలినపదార్థములోనగునవి, రంధ్రద్వారమున కడ్డుపడి, నీరు ప్రవహించనిచందంబున, గ్రుడ్డి వారికిఁ గనులును, చెవిటివారికిఁ జెవులు నుండినను ఆ యింద్రియగోళరంధ్రద్వారములందుఁ బ్రాక్తనజన్మకృతపాప

కల్మష మడ్డుపడినందున, మానసికతేజస్సు ప్రసరింపక, అంధత్వ బధిరత్వములు కలుగుచున్నవని తెలియనగును.

మానసాజ్ఞలయందు ఇంద్రియములు మెలఁగుట.

జ్ఞానేంద్రియపంచకంబును, కర్మేంద్రియపంచకంబును, మనఃప్రభువుప్రేరణ లేనిది, తమకార్యములయందుఁ బ్రవర్తింపఁజాలవని యిదివఱలోఁ జెప్పఁబడెను. ఆయాయింద్రియములు వెలుపలి విషయములను గ్రహించి, మనస్సునకుఁ దెలియఁబఱిచినంత మనంబు యోజించి, యేయే కార్యముల నేయే యింద్రియముల కాజ్ఞాపించవలయు నటుల యాజ్ఞల నొసంగును. ఆయా యింద్రియములకు విషయములను గ్రహించుట తప్ప, వైషయికజ్ఞానంబును, గుణదోషవివేచనాశక్తియును, మనస్సంబంధకార్యము లైయున్నవి.

అనవధానమనసునకు బహిర్విషయజ్ఞానములేమి.

మనస్సు కార్యాంతరాసక్తమై వ్యత్యంతరముఁ జెంది యనవధానముగ నుండుతఱిఁ జూచుచున్నను జూడనట్టులను, వినుచున్నను విననియట్లును, భుజించినను భుజింపనట్లును, స్పృశించినను స్పృశింపనట్లును, ఆఘ్రాణించిన నాఘ్రాణింపని యట్టులను ఇఁక నేమి చేసినను జేయనట్టులగ భావింపఁబడును.

ఇందుకు దృష్టాంతముగ గొప్పకార్యములు చెడిపోయినందువలనఁ గలిగినమనోవ్యథ గలవారును, వియోగావస్థనుఁ జెందినవారును, తామేమికార్యము లొనరించునది వారికిఁ దెలి

యదు. న్యాయస్థానములం దభియోగములు, విజయవంత
ములు గాక నష్టము లయినపుడు, విశేషదుఃఖంబునఁ బలు
మాఱు నాభియోగికవిషయంబులనే తలపోసికొనుచుండుట
వలనను, వియోగదుఃఖావస్థనుఁ జెందినవారు, తమప్రియా
సంబంధసరసాలాపదర్శనస్పర్శనాలింగనాదిక్రియలను, మాటి
మాటికి భావించుచుండుటం బట్టియు, దుఃఖార్ణవమగ్నమన
స్కులై వారీలోకమునం దుండినట్టులే తెలిసికొనఁజాలరు.

పూర్వానుభూతవిషయంబులఁ దలపోసికొనుచుగాని,
ఖేదము నొందుచుగాని, కార్యంబుల నేకాగ్రవృత్తితో భావిం
చుచుగాని యుండువారికి, మనస్సు ఇంద్రియములద్వారా
బహిర్విషయములందు వ్యాపింపఁజాలదు. ఒకవేళ నింద్రియ
ములు బహిర్విషయములయందు స్వాభావికాభ్యాసమునఁ బ్రవ
ర్తించి తమకార్యములఁ జేయుచున్నను, మానసికజ్ఞానము చేఁ
జేయుట లేదు. కావునఁ జేయనట్టుల భావింపఁబడును. మనః
పూర్వకముగఁ జేసినది చేసినట్టుల యెన్నఁబడునుగాని లేనిచో
నది క్రియగ నెన్నఁబడదని యోగవాసిష్ఠమునం దీక్రిందఁ
బొందుపఱచినవిధంబునఁ జెప్పఁబడినది.

మనఃపూర్వకము కాని కృత్యము పరిగణింపఁబడకుండుట.

శ్లో. మనో హి జగతాం కర్తృ మనో హి పురుషస్స్మృతః,
మనఃకృతం కృతం లోకే న శరీరకృతం కృతం.
భావితం తీవ్రవేగేన మనసా యన్నహీపతే.
తదేవ పశ్యత్యచలం న శరీరవిచేష్టితం.

సర్వ ఏవ జగత్యస్మిన్ ద్విశరీరాశ్శరీరిణః,
ఏకం మనశ్శరీరం తు క్షిప్రకారి చలం సదా.
అకించిత్కరమన్యత్తు శరీరం మాంసనిర్మితం.

"యోగవాసిష్ఠే"

నిఖిలప్రపంచములకు మనస్సే కర్తయగు. మనస్సే పురుషశబ్దవాచ్యుండు నగు. మనస్సుచేఁ జేయఁబడినది చేయఁబడినట్లు యెన్నఁబడును గాని, శరీరముచే నొనరింపఁబడినది యెన్నఁబడదు. మనఃపూర్వకంబుగ దృఢముగ భావించిన దానినే చూచునుగాని, శరీరముచేఁ జేయఁబడినదానిని లెక్కింపఁడు. ఈలోకంబున జీవునకు సూక్ష్మశరీరము, స్థూలశరీరమునని రెండుశరీరములు గలవు. అందు సూక్ష్మంబగు మానసికశరీరము, చుఱుకుఁదనము, తీవ్రవేగము, సర్వకార్యఘటనాశక్తియును గలది. రెండవదియగు స్థూలశరీరము, మాంసనిర్మితమై కాష్ఠమువలె నేమియు నొనరింపఁజాలక, జడముగ నుండు. ఇందు మనస్సనగా మనోవిశిష్టపురుషుఁడని భావము.

మానసధర్మము శ్రేష్ఠము.

దీనింబట్టియే శారీరధర్మమునకన్న మానసికధర్మము కడుంగడు శ్రేష్ఠమని మహాభారత శాంతిపర్వమున నీక్రింది విధమునఁ జెప్పంబడె.

శ్లో. మానసం సర్వభూతానాం ధర్మమాహుర్మనీషిణః,
మనఃకృతం కృతం లోకే న శరీరకృతం కృతం,
యాభ్యామాలింగితా కాంతా తాభ్యామాలింగ్యతే సుతా.

సకలప్రాణివర్గమునకు మానసధర్మము గొప్పది పెద్దలు వక్కాణింతురు. దీనికి దృష్టాంత మెట్టులనిన: పు డొకరుఁడు తనబాహువులచే మందస్మితోదంచిత సుంద నారవిందయగు తనకాంత నాలింగనముఁ గావించుకొ ఆచేతులచేతన ముద్దులమూటఁగట్టు తనపట్టిని గట్టిగ గనముఁ జేసికొనును. ఇట శారీరకధర్మమగు నాలింగన రెంటికి నొకవిధముగనున్నను, మనోధర్మమగు భావభేద మొదటిది యనురాగభావంబని, రెండవది వాత్సల్యభా తెలియఁబడుచున్నది. కాఁబట్టి జడాత్మికములగు బ వులకు రెంటియాలింగనంబున భేదము లేకున్నను, మన ముచే రెంటియందు గొప్పభేదము కలదు. గావున ధర్మమే ముఖ్యమని తాత్పర్యము.

అవ్యవహితమనస్సునకు విషయజ్ఞానము లేకుండుఁ

మేదోమజ్జాస్థిరక్తమాంసపూరితంబగు నీస్థూలశ మనస్సునకును, తద్వ్యాపారములకు లోనై యెట్టు త్రిప్పిన నావలనికిఁ దిరుగుచు, స్వాతంత్ర్యముఁ జెందక ప్రభువునకు (జీవునకు) వాహనరూపమున నొప్పియున్న

ఒకకథనుగాని, ప్రసంగమునుగాని, వినుచుండు కథామధ్యమున తనమనంబు విముఖమై వేఱొక కా మీఁదికిఁ బోవ మఱలించుకొని, మఱియొకపరి వాక్రు వక్తను వేఁడికొనును. ఇచట వినుచుండుటచే శ్రోత్రే

మును, ఊకొనుటచే వాగింద్రియమును, తమకార్యముల నిర్వర్తించుచుండినను, మనస్సంయోగము లేమింజేసి, యుండి యు నిరుపయోగము లగుచున్నవి. పెక్కుచిక్కులుగల యభి యోగము నొకదాని నేకాగ్రచిత్తవృత్తితో నాలోచించు చుండు నొక న్యాయవాదియొద్దకు, నాతనిబంధువు దూర దేశమునుండి వచ్చి తనయోగక్షేమంబులం దెలిపి యనుగ్ర హముఁ బడయఁగోరి, కట్టెదుట నిలువంబడియున్నను, కార్యాంతరాసక్తమనస్కుఁడగు నాన్యాయవాది వచ్చిన వానిని జూచుచున్నను గడియసేపువఱకుఁ బలుకఁజాలక యూరకుండెను. ఈతఁడు విద్యాధనకులబలమదములఁ గనులుఁగానక, "ఎప్పు డేతెంచితివి, కుశలమా యని" తననుఁ బలుకరించి యాదరింపకుండెనని యాగంతుకుఁడు చింతిలు చుండ, నాతఁ డాలోచననుండి మఱలించుకొనిన మనసుగల వాఁడై, మనఃపూర్వకంబుగ నీతనిం జూచినంతన లేచి యెదు రుగఁబోయి "యెప్పుడు విచ్చేసితిరి? మీ కెల్లఱకుం గుశలంబే" యని సాదరంబుగ విచారించి, తాను కార్యాంతరాసక్త మనస్కుఁ డగుటంబట్టి పలుకరింపలేకపోయెననియు, వ్యవహా రార్ణవమున మగ్నుఁ డయితిననియు విన్నవించి, మన్నింపుమని వేఁడి, సంతోషామృతరసమగ్నమానసునిఁ గావించెను.

ఇందు నేత్రములఁ జూచుచున్నను, మనస్సన్నిధానము లేమింజేసి, పదార్థాభివ్యక్తి చిత్తమునకు స్ఫురింపక, పలుక రింపఁజాలక పోయెనుగాని, విద్యాధనకులబలమదములచేఁ

గాదు. లోకంబునఁ గొందఱు కార్యాంతరాసక్తమనః
వారని తెలిసికొనఁజాలక, తమ్ము నాదరించి సత్కరిం
దురభిమానమున దురభిప్రాయంపడి లేనిపోని మనస్తా
దెచ్చిపెట్టుకొనియెదరు. పదంపడి నిజము తెలిసికొని,
తలంచినది పొరబాటని పరితపించెదరు.

ఏకాగ్రమనస్సునుఁ జలింపఁజేయఁగూడదనుట

ఒకదానినిఁ జక్కఁగ నాలోచించుచుండువా
యోజనతో వ్రాయువానింగాని, బలాత్కారముగ
డించిన నాలోచించుచు వ్రాయుచే నున్నకార్యమ
పోవుటయె గాక, వేఱొకకార్యమందుంచిన మనసుగః
గనుక అప్పుడాతనితోఁ జక్కఁగ మాటాడఁజాలఁడు.
గారణము మనస్సు మిగుల కలవరపడి యుండుటయె.
దీర్ఘాలోచనాపరులును, యోగాభ్యాసరతులును జనస
కలిగినచోఁ జిత్తవిక్షేప మొదవునని, విజనప్రదేశమం
రిగ నుందురు. చిత్తైకాగ్రతకు నైర్మల్యంబును
వాయుప్రసారంబునుగల విజనప్రదేశం బపేక్షితం ;
డునని యోగశాస్త్రమునఁ జెప్పఁబడినది.

మనస్సునకు శబ్దాకర్షణయంత్రమునకుఁ (Gramopl బోలిక గలదనుట.

మనస్సంతయు విషయాకారముగఁ బరిణమించి,
కృతులనన్నింటిని, వాసనారూపముగ నంతఃకరః

యందుఁ జేర్చి, సమయము గలిగినపుడు స్మృత్యనుభవమూలముగ సంకల్పపరంపరల నభివృద్ధి నేయుచుండు. శబ్దాకర్షణయంత్రమునఁ (Gramophone) బెట్టఁబడెడు ఫలకమునందు, మనము మాటలాడిన పాటఁబాడిన నాశబ్దములు వాసనారూపముగ స్థితినిఁజెంది, సమయము తటస్థించినపుడు మాటలాడి పాటఁబాడుచేందంబున, బహిర్విషయంబులన్నియు నంతఃకరణఫలకమునఁ బ్రతిఫలించుటచే సంస్కారరూపమున స్థితినిఁజెంది, విషయేంద్రియసంయోగము గలిగినపుడు, స్మృత్యనుభవ పూర్వక సంకల్ప వికల్పాత్మిక వృత్తిరూపముగఁ బరిణమించుచుండును.

చిత్ప్రకాశమున మనస్సునకు విషయజ్ఞానము కలుగుట.

బహిర్విషయాకారముగఁ బరిణమించు మనస్సు, స్వచ్ఛమగు దర్పణమును బోలియున్నది. స్వచ్ఛమగు ముకురమునందు సూర్యకాంతి ప్రసరించుటచే, బాహ్యపదార్థములన్నియుఁ బ్రతిఫలించునుగాని, స్వచ్ఛాదర్శమయ్యు భాస్కరప్రకాశము లేనితఱిఁ బ్రతిఫలించేనిచేందంబున, చిత్ప్రకాశము ప్రసరించిన మనోదర్పణమునంద బహిర్విషయములు ప్రతిఫలించునుగాని, లేనియపుడు ప్రతిఫలింపనేరవు. అన్నిటినిఁ బ్రతిఫలింపఁజేయుశక్తి చిత్ప్రకాశమునకుఁ గలిగియున్నది. వెడల్పు పొడుగు మందము గణుపులు బుడుపులు గలిగియున్న బాహ్యపదార్థములు తమస్వరూపములతో

నెట్లు ప్రతిఫలించేనన్న, నచ్చును గూర్చెదు నక్షరములు, ముద్రణావస్థయందుఁ దమకుఁ గలిగియున్న, గుంటలు బుడుపులు కోసులతోడి ప్రతిఫలింపక, యక్షరాత్మకముగఁ బ్రతిఫలనము జెందుచేందమునను, తేజోల్లేఖనమునందు (ఛాయాపటము. Photograph) ప్రతిబింబించెదు, పదార్థములు, తమకుఁగల మార్దవ, కాఠిన్య, మసృణత్వ, కిణరంధ్రాదులతోఁ బ్రతిఫలింపక, స్వాకృతులు ప్రతిఫలనముఁ జెందువిధంబునను, బహిఃపదార్థప్రతిబింబములన్నియు, మనోదర్పణమందు సంస్కారవాసనారూపముగఁ జేరియున్నవి. ఇవ్విధంబునఁ బరిశీలింపగ, బాహ్యప్రపంచమే మనస్సుగను, మనస్సే బాహ్యప్రపంచముగను బరిణమించియున్నది.

మనస్సు, స్వప్నావస్థ, సినిమిటోగ్రాఫ్ అను యంత్రమునుఁ బోలియుండుట.

జాగ్రదవస్థయందు బాహ్యప్రపంచవిషయంబుల ననుభవించినట్లు, స్వప్నావస్థయందును మనస్సునందు సంస్కారవాసనారూపముగ స్థితినిఁ జెందియుండిన బాహ్యాభ్యంతరవిషయంబుల ననుభవించుచేన్నారము. స్వప్నప్రపంచమునందును లింగశరీరముతో బాహ్యప్రపంచమునందువలెనే విషయంబుల ననుభవించుచుఁ దన్మయతనుఁజెంది, జాగ్రదవస్థఁ బొందుదనుక యథార్థముగ భావించుచేందుము. సినిమిటోగ్రాఫ్ (Cinematograph) అను యాంత్రికవిషయప్రదర్శనమునుఁ గాంచునపుడు, అందలి పురుషచేష్టలను, యుద్ధములను, జలప్రవాహ

చూడఁబడుపదార్థములు దృశ్యములు, వానినిఁ జూచునది దృక్కు. బాహ్యపదార్థములు దృశ్యములు, వానినిఁ జూచునేత్రము దృక్కు. చక్షురాదీంద్రియవ్యాపారములు మనస్సుచేఁ జూడఁబడుచున్నవి గాన, ఇంద్రియములు దృశ్యములు, మనస్సు దృక్కు. మానసికవ్యాపారములన్నియు సాక్షియగు నాత్మచేఁ జూడఁబడుచున్నవి గనుక, మనస్సు దృశ్యము, ఆత్మ దృక్కగుచున్నది. సాక్షి చైతన్యస్వరూపుఁడగునాత్మ, మఱియొకపదార్థముచేఁ జూడఁబడఁడు గనుక, ఆత్మకుమించిన దృక్పదార్థము మఱియొకటి లేదు. లోకమందు నన్నిపదార్థములు భాస్కరునివలనఁ బ్రకాశింపఁబడుచున్నవి గాని, పదార్థములచే నాతఁడు ప్రకాశింపఁబడనిచందంబున, చిత్ప్రకాశస్వరూపుఁడగు నాత్మవలన నన్నిపదార్థములు సకలేంద్రియవ్యాపారములు ప్రకాశించుచున్నవి గాని, ఆత్మనుఁ బ్రకాశింపఁజేయుట లేదని శ్రీశంకరభగవత్పాదులు వివేకచూడామణిగ్రంథమందు వ్రాక్రుచ్చినవారు.

చిద్రూపుఁడగు పరమాత్మువలన నంతయుఁ బ్రకాశించుచున్నదనుట.

శ్లో. యో విజానాతి సకలం జాగ్రత్స్వప్నసుషుప్తిషు,
బుద్ధి తద్వృత్తి సంభావ మభావ మహమిత్యయం.
యః పశ్యతి స్వయం సర్వం యం న పశ్యతి కశ్చన,
యశ్చేతయతి బుద్ధ్యాది న తద్యం చేతయత్యయం.

యేన విశ్వమిదం వ్యాప్తం యన్న వ్యాప్నోతి కించన,
ఆభారూపమిదం సర్వం యం భాంత మనుభాత్యయం.
యస్య సన్నిధిమాత్రేణ దేహేంద్రియమనోధియః,
విషయేషు స్వకీయేషు వర్తంతే ప్రేరితా ఇవ.
అహంకారాది దేహాంతా విషయాశ్చ సుఖాదయః,
వేద్యంతే ఘటవద్యేన నిత్యబోధస్వరూపిణా.

వివేకచూడామణి.

జాగ్రత్స్వప్నసుషుప్తులను మూఁడవస్థలయందలి సకల విషయంబుల నెవఁడు సాక్షియై తెలిసికొనుచున్నాఁడో, అంతఃకరణవృత్తుల నెవఁడు చూచుచున్నాఁడో, బుద్ధ్యాది సకలేంద్రియంబు లెవ్వనిచేఁ బ్రకాశించుచున్నవో, ఎవ్వనిచే నీజగమంతయు నిండియున్నదో, నిత్యప్రకాశుఁడగు నీతని ననుసరించి యెవ్వి వెలుంగుచున్నవో, ఏతత్త్వముయొక్క సన్నిధియందుండుటచేతన దేహేంద్రియమనోబుద్ధులు తమతమ వ్యాపారములయందుఁ బ్రేరితము లగుచున్నవో, మహత్తత్త్వము మొదలు జడతత్త్వమువఱకు నుండువిషయములు ఏజ్ఞానశక్తిచేఁ దెలియఁబడుచున్నవో, ఎవ్వాని నేవియుఁ గనఁజాలవో, ప్రకాశింపఁజేయఁజాలవో, యెఱుంగఁజాలవో, అట్టివాఁడే పరమాత్మ యనంబడునని తాత్పర్యము.

స్వయంప్రకాశుఁడగు సూర్యుని వెలుంగులో నన్నియుఁ బ్రకాశించుచు, నాసూర్యునిఁ బ్రకాశింపఁజేయలేని చందంబున నాత్మసాన్నిధ్యమహిమచే నన్నింటికి నయస్కాం

తపుటాయియొద్ద లోహసూచికలు చలించుమాడ్కి చైతన్య శక్తి కలుగుచేసున్నది.

కూటస్థుఁడు, చిదాభాసుఁడు, చిత్ప్రకాశము, అంతఃకరణము.

నిర్వికార సాక్షిచైతన్యము కూటస్థుఁడనియు, నంతఃకరణప్రతిబింబితుఁడై యంతఃకరణోపాధిగలిగిన చైతన్యము చిదాభాసుఁడనియు, శ్రీవేదాంతపంచదశియందుఁ దెలుపఁబడినది.

శ్లో. ఖాదిత్యదీపితే కుడ్యే దర్పణాదిత్యదీప్తివత్,
కూటస్థభాసితో దేహో ధీస్థజీవేన భాస్యతే.

వేదాంతపంచదశి - కూట - దీప.

ఆకాశంబునఁ బ్రకాశించెడి సూర్యునివెలుఁగుచే గోడ సామాన్యముగఁ బ్రకాశించుచు, నద్దమునందుఁబడిన సూర్య బింబప్రతిఫలనముచే విశేషముగఁ బ్రకాశింపఁజేయఁబడినవిధంబున, నిర్వికారియగు కూటస్థ చైతన్యముచేఁ బ్రకాశింపఁబడిన దేహము బుద్ధి ప్రతిబింబితుఁడగు చిదాభాసునిచే విశేషముగఁ బ్రకాశింపఁబడుచున్నదని తాత్పర్యము. ఇట నంతఃకరణము అద్దమునకుఁ బోల్పఁబడినది. అద్దమునందుఁ బ్రతిఫలించిన సూర్య మండలప్రభ దుర్నిరీక్ష్యమై గోడమొదలగువానిని విశేషముగఁ బ్రకాశింపఁజేయుచున్నట్లు, జడమయమగు నంతఃకరణము పరమాత్మార్కప్రకాశమును బొంది, చైతన్యవంతమై దేహమును అందలి వ్యాపారములను విశేషముగఁ దెలియఁజేయుచున్నదని భావము.

సర్వశక్తుఁడగు పరమాత్ముని మననశక్తి మనస్సనుట.

ఇట్లు పరిశీలింపఁగ ఆత్మప్రకాశముచేతనే మనస్సు ప్రకాశించి యన్నింటిని బ్రకాశింపఁజేయుచున్నది గాని; మనస్సునకు స్వయంప్రకాశము లేదు. సర్వశక్తియగు పరమాత్మ చిచ్ఛక్తియే మనస్సునందుఁజేరి మననశక్తియై (సంకల్పశక్తియై) యద్భుతావహములగు నిఖిలజగద్వ్యాపారముల నొనరించుచున్నదని యోగవాసిష్ఠమునం దీక్రిందివిధమునఁ జెప్పఁబడినది.

శ్లో. అనంతస్యాత్మతత్త్వస్య సర్వశక్తేర్మహాత్మనః,
సంకల్పశక్తిరచితం యద్రూపం తన్మనో విదుః.

చిచ్ఛక్తిర్బ్రహ్మణో రామ శరీరేషూపలభ్యతే,
స్పందశక్తిశ్చ వాతేషు దార్ఢ్యశక్తిస్తథోపలే.

ద్రవశక్తిరథోఽంభస్సు దాహశక్తిస్తథాఽనలే,
శూన్యశక్తిస్తథాఽకాశే నాశశక్తిర్వినాశిని.

స ఆత్మా సర్వగో రామ నిత్యోదితమహావపుః,
యన్మనాఙ్మననీం శక్తిం ధత్తే తన్మన ఉచ్యతే.

యోగవాసిష్ఠే - ఉత్పత్తిప్రకరణం.

అనంతుఁడును, మహనీయుఁడును, సర్వశక్తియునగు పరమాత్ముని జ్ఞానశక్తి ప్రాణులయందుఁ జేతనాశక్తిగను, వాయువునందుఁ జలనశక్తిగను, శిలయందు దృఢశక్తిగను, జలమందు ద్రవశక్తిగను, అగ్నియందు దాహశక్తిగను, ఆకాశమందు శూన్యశక్తిగను, నశించుపదార్థమందు నాశ

శక్తిగ నున్నట్లు, మనస్సునందు మననశక్తి (సంకల్పశక్తి)గ నున్నదని తాత్పర్యము.

అంతఃకరణమునకుఁ జంద్రునివలె స్వయంప్రకాశము లేదనుట.

శ్రు. చంద్రమా మనసో జాతః.

విరాట్పురుషుని మనస్సునుండి చంద్రుఁ డుత్పత్తి యయ్యెనను శ్రుతినిఁ బరికింప, మనస్సునకును, చంద్రమండలమునకును, సంబంధము కలిగియున్నది. చంద్రునకు స్వయం ప్రకాశము లేక, సూర్యకాంతిప్రసారమువలననే కళలుగలిగినట్టుల మనస్సునకును, పరమాత్మచిత్ప్రకాశమువలననే చైతన్యశక్తి కలుగుచున్నది. భానుప్రభావిరహితంబగు సుధాకరబింబంబు జడంబగు మృత్పిండం బగుచందంబున, పరమాత్మచిత్ప్రకాశశూన్యంబగు నంతఃకరణంబును, ఘనంబగు జడపదార్థమగుచున్నదని భావము.

దర్శనశక్తియగుబుద్ధివలన మనస్సంకల్పవికల్పము లడఁగుట.

పలువురు దుష్టులొకచోటఁ జేరి యల్లకల్లోలముఁ జేయుచుండి, యచటికి వచ్చుచున్న ధీరాగ్రేసరుని ప్రభునిఁ జూచినంతన, యులికిపడి యుండనేరక తడఁబడి పరువులిడుచందంబున; లెక్కలేని సంకల్పవికల్పములు- మనస్థానమునఁ జేరి సంక్షోభముఁ గలిగించుచుండి దర్శనశక్తియు నిశ్చయాత్మికమనగు బుద్ధిప్రకాశము ప్రసరించినంత బలముడిగి నిలువలేక పారిపోవును. (పటాపంచలగును.) అప్పుడు నిశ్చయాత్మికమగు

నేకవృత్తి మనస్సునందుఁ జేరి, విమలప్రకాశంబునఁ జిత్త స్థైర్యముఁ గావించును.

పరమాత్మదృక్ఛక్తి, బుద్ధి దర్శనశక్తి, మనోవ్యాపారములు దృశ్యములు. దృగ్దృశ్యములకు మధ్యనుండు దర్శనశక్తి చిత్ప్రకాశాత్మికమగు బుద్ధి, ఇయ్యది యూర్ధ్వాభిముఖ మయ్యెనేని, సంకల్పవికల్పము లడఁచి, నిశ్చయాత్మికమగు నేకవృత్తితో నన్నింటిని యథార్థముగఁ జూచును.

చిత్తేజస్తీవ్రత కోశములయందుఁ గ్రమంబుగ తగ్గును.

విషయంబులకన్న నింద్రియంబులును, ఇంద్రియంబులకన్న మనస్సును, మనస్సునకన్న బుద్ధియు, బుద్ధికన్నఁ బరమాత్మయుఁ గ్రమంబుగ శ్రేష్ఠంబులని యిదివఱలో సూచింపఁబడియె. ఇటుల యేకోత్తరవృద్ధిగ బలీయములగుచున్నందులకుఁ గారణ మేమన; చిత్ప్రకాశసన్నిధియే యని యీదిగువదృష్టాంతమువలనఁ దేటఁబడుచున్నది. ఒకచోటనున్న తేజఃపుంజపు కాంతి అద్దములద్వారా క్రమక్రమంబున తగ్గి, ప్రసరించునటుల పరమాత్మకు సమీపమందున్న బుద్ధితత్త్వముగల విజ్ఞానమయకోశమం దెక్కువప్రకాశంబును, అచటికన్న మనోమయకోశమందుఁ గొంచెము తక్కువగను, దానికన్న ప్రాణాన్నమయకోశములయందు మఱికొంత తక్కువగును, చిత్ప్రకాశము ప్రసరించుచుండును. ఒకదానిలోనుండి మఱియొకదానిలోనికిఁ బోవునపుడు, తేజశ్శక్తి తీవ్రత తగ్గిపోవుచుండును.

మనస్థానము హృదయగోళక మనుట.

విద్యుచ్ఛక్త్యుత్పాదకస్థానమునుండి (Battery) బయలు వెడలిన విద్యుజ్జ్యోతి తీఁగెలగుండ కాచపాత్రగోళముల లోనికిఁ బ్రసరించి, పదార్థములఁ బ్రకాశింపఁజేయుచేందమున మనశ్శక్తి తనకుఁ గారణస్థానమగు హృదయమునుండి, ప్రాణ వాయుముఖంబున జ్ఞాననాడులగుండ మేదస్సునందుఁ జేరి, యచటినుండి యింద్రియగోళములలోనికిఁ బ్రసరించి విషయ ముల గోచరింపఁజేయును. జ్ఞానేంద్రియయుక్తమగు మనస్సు నకుఁ గార్యస్థానము మేదస్సనియు (Brain) (మస్తిష్కము) కారణస్థానము హృదయమనియు తత్త్వజ్ఞులు కన్గొనియున్న వారలు. విద్యుచ్ఛక్త్యుత్పాదకస్థానమందు శక్తిని నిరోధించిన తేజస్సు ప్రసరింపక స్వస్థానమందే లీనమై యుండినటుల, హృదయస్థానమందుండు ప్రాణవాయువును నిరోధించిన మాన సము ఊర్ధ్వాభిముఖముగాక ప్రాణముతోఁ జేరి, కారణస్థాన మగు హృదయమందు లీనమైయుండును. ప్రాణస్పందమయిన మనస్సు చలించును, ప్రాణము నిరోధించినఁ జలింపక కారణ మందుఁ జేరియుండు. మనస్థానము హృదయమని శ్రీవేదాంత పంచదశియందు వర్ణింపఁబడెను.

శ్లో. మనో దశేంద్రియాధ్యక్షం హృత్పద్మే గోళకే స్థితం,
తచ్చాంతఃకరణం బాహ్యేష్వస్వాతంత్ర్యాద్వినేంద్రియైః.

వేదాంతపంచదశి. పంచభూత-వివేకము.

కర్మేంద్రియజ్ఞానేంద్రియములకు ప్రభువగు మనస్సునకు హృదయగోళకము స్థానము. లోపలనుండు పని చేయునది గనుక అంతఃకరణమని పేరు. ఇంద్రియముల సంబంధము లేక బాహ్యవిషయము కనుగొనఁజాలనిది యస్వతంత్రము. చిత్తముయొక్క గోళమగు హృదయము శరీరములోపల నాభికి మీఁద జానెడెత్తున నంతఃపురమునందు ప్రకాశించుచు, ఎనిమిదిదళములు గల తామరపుష్పమువలె నుండి అధోముఖముగ వ్రేలుచుండును.

ప్రాణవాయుస్థానము హృదయగోళకమనుట.

ప్రాణవాయుస్థాన మెప్పుడుండునో యచ్చటనే మనస్స్థానముండును. ప్రాణవాయువును నిరోధించిన మనస్సు లయించునని యోగశాస్త్రమందుఁ గలదు.

శ్లో. మనో యత్ర విలీయేత పవనస్తత్ర లీయతే.
పవనో లీయతే యత్ర మనస్తత్ర విలీయతే.

హఠయోగప్రదీపిక, 4 ఉ.

“హృది ప్రాణః” అను ప్రమాణప్రకారము, ప్రాణవాయువుస్థానము హృదయము గనుక, మనస్స్థానమును హృదయమయియే యుండవలయును. ప్రాణము ఎప్పుడు లయమగు నప్పుడే మనస్సును లయించును. కావున హృదయస్థానమందు ప్రాణవాయువు నిరోధించిన మనోవ్యాపారము నశించును. మనోవృత్తిని, తత్ప్రసారణయంత్రమునందు నిరోధించిన నది

పాత్రగోళములలోని వెలుఁగు తిరోధానమయినట్లు, ఇంద్రియములనుండి మఱలి కారణస్థానమందు లీనతఁ జెందియుండు.

మనస్థ్సానము కొందఱు పెక్కువిధములఁ జెప్పుట

ఎచట కర్మజ్ఞానేంద్రియవర్గముండు, నచట దాని నధిష్ఠించి ప్రేరకుఁడగు మనస్సుండితీరవలయునని నిశ్చయింపవలయు. కాని, మనస్సున కునికిపట్టు కంఠస్థానమని కొందఱు తత్త్వజ్ఞులు చెప్పెడుదాని నాలోచింప, నాధునికమతమునకు సరిపడి యుండ లేదు. విశేషముగ నాలోచించినను, ధ్యానించినను తలయందు (Brain మేదస్సు) నొప్పి పుట్టునుగాని, కంఠమందు నొప్పి కలుగదు. ధ్యానాలోచనలు రెండును మనః కార్యములని యంగీకరించినవారు, వానికి స్థానమగు మస్తిష్కమే (మేదస్సు) యునికిపట్టని యొప్పుకొనక తప్పదు.

శ్రు. స యథా శకునిస్సూత్రేణ ప్రతిబద్ధో దిశం దిశం పతిత్వా ఽన్యత్రాయతనమలబ్ధ్వా బంధనమేవోపశ్రయతే. ఏవమేవ ఖలు సోమ్య తన్మనో దిశం దిశం పతిత్వాఽన్యత్రాయతనమలబ్ధ్వా ప్రాణమేవో పశ్రయతే. ప్రాణబంధనం హి సోమ్య మనః.

ఛాందోగ్యోపనిషత్.

ఒకస్థానమున దారముచేఁ గట్టఁబడినపిట్ట పలుచోట్లకుఁ బోయి తిరిగి తిరిగి, యలసి స్వస్థానమునకుఁ జేరి సుఖముగ విశ్రమించువిధంబున, హృదయస్థానమునఁ బ్రాణసూత్రముచేఁ గట్టఁబడిన మనస్సును, జాగ్రత్స్వప్నావస్థలయందు బహిర్విషయంబులమీఁదికిఁ బోయి వివిధసుఖదుఃఖంబుల ననుభవించి, తనివిలేక తిరిగి తిరిగి యలసి హృదయస్థానమునకుఁ జేరి, సుషు

త్త్వావస్థారూపమున సుఖంబుగ విశ్రాంతిం జెందును. అయియుంచి యుండునని భావము. దీనిచే మనస్సునకు హృదయగోళకము స్థానమని స్పష్టపడుచున్నది.

మనస్థానవిషయమునఁ బాశ్చాత్యులయభిప్రాయము.

కొందఱు పాశ్చాత్యశాస్త్రజ్ఞులు Pinial Gland; Pitutary Gland) మనస్సునకు స్థానంబని కొంతకాలము వఱకు నిశ్చయించి; శాస్త్రానుభవము, పరిశోధన మభివృద్ధి యగుకొలఁదిని; యది కాదనియు, Brain మేదస్సనియు, కొంతకాలమునకు హృదయమనియు నిశ్చయించి; పిమ్మట మనస్తత్త్వము సర్వవ్యాపి యనియు, నొకచోట నియమితస్థానము లేనిదనియు సిద్ధాంతీకరించుచుండిరి.

ప్రాగ్దేశీయతత్త్వజ్ఞులు ప్రాణమనంబుల కవినాభావసంబంధము గలదనియు, నొకదాని నెడఁబాసి మఱొకటి యుండదనియు, ప్రాణనిరోధంబున మనోనిరోధం బగుననియు, ప్రాణస్థానము హృదయగోళకమనియుఁ, జిరకాలము యోగాభ్యాసము గావించి శాస్త్రానుభవమూలమున నిర్ణయించిరి. తత్త్వనిర్ణయంబున పాశ్చాత్యులకన్న సూక్ష్మవిచారవిశారదులగు ప్రాగ్దేశీయులమత మాదరణీయము.

మనస్స్వరూపము - పర్యాయవాచకములు (MIND)

శ్లో. మనో మహాన్ మతిర్బ్రహ్మా పూర్బుద్ధిః ఖ్యాతిరీశ్వరః,
ప్రజ్ఞా సంవిత్ చితిశ్చైవ స్మృతిశ్చ పరిపఠ్యతే,
పర్యాయవాచకాశ్శబ్దాః మనసః పరికీర్తితాః.

మహాభారతే - శాంతి - మోక్షధర్మ.

మనః, మహాన్, మతిః, బ్రహ్మా, పూః, బుద్ధిః, ఖ్యాతిః, ఈశ్వరః, ప్రజ్ఞా, సంవిత్, చితిః, స్మృతిః, ఇయ్యవి మనస్సునకుఁ బర్యాయవాచకశబ్దంబులని మహాభారతమోక్షధర్మపర్వంబునఁ జెప్పఁబడియె. సంకల్పవికల్పాత్మికమగు నంతఃకరణవృత్తియే మనస్సనఁబడు. ఇది గర్భమందున్న జీవున కేడవమాసమునఁ గలుగుచున్నదని సుఖబోధాచార్యులును, అయిదవమాసము నందే ప్రబోధమగునని సుశ్రుతకారులును నుడువుచున్నారు.

చిత్తం, చేతః, హృదయం, మానసం, స్వాంతం,హృత్ = అని అమరసింహుఁడును,

అనంగకం, అంగం = అని శబ్దరత్నావళియందునుఁ బర్యాయవాచకములు.

పరత్వం, అపరత్వం, సంఖ్యా, పరిమితిః, పృథక్త్వం, సంయోగః, విభాగః, వేగః=ఇయ్యవి మనస్సునకుఁ గలగుణంబులని న్యాయదర్శనమందుఁ జెప్పఁబడినవి.

సుఖము, దుఃఖము, ఇచ్ఛ, ద్వేషము, మతి, యత్నము= ఇవి మనోగ్రాహ్యములగు విషయములు.

ఈమనస్సు, వాయవీయపరమాణురూపంబని, శిరోమణిభట్టాచార్యమతము.

మనోగుణములు.

శ్లో. స్థైర్యోపపత్తిర్వ్యక్తిశ్చ విసర్గః కల్పనా క్షమా,
సదసచ్చాశుతా చైవ మనసో నవ వై గుణాః.

మహాభారత - మోక్షధర్మ.

1 ధైర్యం = ధీరత్వము, 2 ఉపపత్తిః - ఊహాపోహా కౌశల్యము, 3 స్మృతిః = స్మృతిజ్ఞానము, 4 విభ్రమః - విపరీత జ్ఞానమగు భ్రాంతి, 5 కల్పనా - మనోరథమాత్ర యగుసంకల్పము, 6 క్షమా = ఓర్పు, 7 సత్ = వైరాగ్యాదిధర్మజ్ఞానము, 8 అసత్ - రాగద్వేషాది అధర్మజ్ఞానము, 9 ఆశుతా - చాంచల్యము. ఈ తొమ్మిదియును మనస్సునకుంగల గుణంబులని, మహాభారత శాంతిపర్వమునఁ జెప్పఁబడెను.

శ్లో. అధ్యాత్మం మన ఇత్యాహుః పంచభూతాత్మ భావినం,
అధిభూతం చ సంకల్పశ్చంద్రమాశ్చాధిదైవతం.

అధ్యాత్మము=మనస్సు, అధిభూతము=సంకల్పము, అధిదైవతము=చంద్రుఁడు.—

మనోభావములఁ దెలిసికొను నుపాయములు.

మనస్సునకు కట్టిరూపముగలదని చెప్పఁబడమి చేతను, నిరూపింప సాధ్యము కామి చేతను, అతిగహనమగు మనోభావంబుల మన మెవ్విధంబునఁ దెలిసికొనఁగలుగుదు మనినఁ గొన్ని లక్షణములచేఁ దెలిసికొన సాధ్యమగునని, తత్త్వజ్ఞులీక్రిందివిధమునఁ దెల్పియున్నారు.—

శ్లో. జనానాం హృదయం సద్యః సువ్యక్తం నయనేన ప్రై,
శిష్యే కళత్రే కన్యాయాం దౌహిత్రే బాంధవేఽపి చ.
పుత్రే పౌత్రే చ వచసి ప్రతాపే యశసి శ్రియాం,
బుద్ధౌ వాణిని విద్యాయాం జ్ఞాయతే హృదయం నృణాం.

బ్రహ్మవైవర్తే - శ్రీకృష్ణజన్మఖండే. 1. అధ్యాయః.

శ్లో. ఆకారై రింగితైర్గత్యా చేష్టయా భాషణేన చ,
నేత్రవక్త్రవికారైశ్చ లక్ష్యతేఽంతర్గతం మనః.

మనుస్మృతౌ.

ప్రియశిష్యునియందు ప్రియురాలగు భార్యయెడఁ బుత్రపౌత్రదౌహిత్రాప్తబాంధవులయెడ, కీర్తిప్రతాపసంపదలయందుఁ, విద్యాబుద్ధులయందు నుపయోగించు వచస్సరణిచే జనుల మనోభావము తెలియఁబడును. మఱియు, ముఖనేత్రవికారముల (మార్పుల) చేతను, రూపముచేతను, అభిప్రాయముచేతను, గమనముచేతను, చేష్టలచేతను, సంభాషణలచేతను లోనున్న మనోభావము తెలియఁబడునని పైశ్లోకమునకుఁ దాత్పర్యము. కొందఱు గంభీరహృదయులు, తమ మనోభావము లొరులకుఁ దెలియఁగూడదని ప్రవర్తించినను, ప్రియబంధుపుత్రమిత్రకళత్రాదులతోడ సంభాషించుచుఁ గనపడుచు ముఖనేత్రవికారాకారేంగితములచే వారిహృదయమందలి భావములు చెక్కఁగ వ్యక్తములగును. ఎంత దాఁచినను ప్రేమాతిశయముచే, వారికిఁ దెలియకనే బహిర్గతము లగును. సంతోషానందభరితమనస్కునకు ముఖంబునఁ బ్రసన్నతయు, వికాసంబును, ఉత్సాహంబును, లోనగునవి కలుగుటయు, దుఃఖశోకాకులితచేతస్కుని వదనమునందు దైన్యము, వైవర్ణ్యము, నిరుత్సాహము : మొదలగునవి కలుగుటయు, మన మనుభవమువలనఁ దెలిసికొనినవిషయంబ. కావున, పరేంగితజ్ఞులగు పండితులును, బుద్ధిశాలురును, మానవుల ముఖనేత్ర

వికారాకారంబులును, స్వరసంభాషణాదులునుఁ జెక్కఁగ గమనించి, వారిహృదయంబులఁ గన్గొనవచ్చును. బుద్ధిమంతులగు మంత్రులయెడ నీవిషయ మధికముగఁ గన్పించెడిని. చాణక్యుఁడు, యుగంధరుఁడు, తిమ్మరసు, లోనగు సచివాగ్రేసరుల చరిత్రములయందుఁ బరేంగితజ్ఞతచే వారు కనుపఱచిన విషయంబు లత్యద్భుతావహంబులు, నత్యంతానందదాయకములునై వెలయుచున్నవి.

హనుమంతుఁడు స్వరలక్షణాదులచే విభీషణునిమనంబు గన్గొనుట.

విభీషణుఁడు శ్రీరామచంద్రుని శరణుఁ జొచ్చుతఱి, నతనిని గ్రహింపవలయునా? త్యజింపవలయునా? యని సంశయము గలిగి సుగ్రీవజాంబవదంగదనలనీలాదిమంత్రులను శ్రీరామమూర్తి యడుగ, శత్రుపక్షమునుండి వచ్చినవాఁడును, ప్రబలవిరోధి సోదరుఁడును, రక్కసుఁడు నగు వీనిని గ్రహింప, దేశకాలపాత్రసందర్భములఁ దెలియఁజేయు నీతిశాస్త్రము లంగీకరింపవు. కాఁబట్టి గ్రహింపకుండుటయే యుక్తమనిరి. ధీమంతుఁడగు హనుమంతుఁడు విభీషణుని ముఖనేత్రవికారాకారేంగితములును, సంభాషణస్వరలక్షణంబులనుఁ జెక్కఁగ గమనించి, నిక్కముగ నీతఁడార్తుఁడు, శరణాగతుఁడు, సరసహృదయుఁడు, సదాచారసంపన్నుఁడు, భాగవతోత్తముండునని నిరూపింప, సర్వలోకశరణ్యుండును, సర్వభూతాభయప్రదాయియు, బుద్ధిని బృహస్పతితుల్యుండునగు శ్రీరామ

మనస్తత్త్వమునుగూర్చి చరకాచార్యునిమతము.

మనస్తత్త్వమునుగురించి, యింతవఱకు పాశ్చాత్యులు నెట్లు నిరూపించినది యింతవఱకు విచారించితిమి. ఇఁకను ప్రాచ్యవైద్యశాస్త్ర నిర్మాతయగు చరక(అగ్నివేశ)మహర్షి స్వగ్రంథమున, శారీరస్థానమం దీక్రిందివిధముగ వర్ణించియున్నాఁడు.

అతీంద్రియం పునర్మనస్సత్త్వసంజ్ఞకం చేత ఇత్యాహురేకే, తదర్థాత్మసంపదాయత్తచేష్టం, చేష్టాప్రత్యయభూతమింద్రియాణాం, స్వార్థేంద్రియార్థసంకల్పవ్యభిచరణాచ్చానేకమేకస్మిన్ పురుషే సత్త్వం, రజస్తమస్సత్త్వగుణయోగాచ్చ; న చానేకత్వం, న హ్యేకం హ్యేకకాలమనేకేషు ప్రవర్తతే, తస్మాన్నైకకాలా సర్వేంద్రియప్రవృత్తిః, యద్గుణం చాభీక్ష్ణం పురుషమనువర్తతే సత్త్వం, తత్సత్త్వమేవోపదిశన్తి మునయో బాహుల్యానుశయాత్, మనఃపురస్సరాణీంద్రియాణ్యర్థగ్రహణసమర్థాని భవన్తి. "మనసస్తు చింత్యమర్థః." అని సూత్రము ... మిథ్యాయోగాత్, ప్రవృత్తివిపత్తి ... భవతి.

ఇతి చ. సూ. ఇంద్రియోపక్రమణీయాధ్యాయః

శ్లో. లక్షణం మనసో జ్ఞానస్యాభావో భావ ఏవ చ,
సతి హ్యాత్మేంద్రియార్థానాం సన్నికర్షే న వర్తతే.
అణుత్వమథ చైకత్వం ద్వౌ గుణౌ మనసః స్మృతౌ,
చింత్యం విచార్యమూహ్యం చ ధ్యేయం సంకల్ప్యమేవ చ.
యత్కించిన్మనసో జ్ఞేయం తత్సర్వం హ్యర్థసంజ్ఞకం,
ఇంద్రియాభిగ్రహః కర్మ మనసస్స్వస్య నిగ్రహః.
ఊహో విచారశ్చ తతః పరం బుద్ధిః ప్రవర్తతే,
ఇంద్రియేణేంద్రియార్థో హి సమనస్కేన గృహ్యతే.

కల్ప్యతే మనసాపూర్వ్యార్థ్వం గుణతో దోషతో యథా,
జాయతే విషయే తత్ర యా బుద్ధిర్నిశ్చయాత్మికా.
వ్యవస్యతే తథా వక్తుం కర్తుం వా బుద్ధిపూర్వకం,
యా యదింద్రియమాశ్రిత్య జంతోర్బుద్ధిః ప్రవర్తతే.
యాతి సా తేన నిర్దేశం మనసా చ మనోభవా,
బుద్ధీంద్రియమనోఽర్థానాం విద్యాత్ యోగధరం పరమ్.

ఇతి చరకే - శారీరస్థానే - ప్రథమేఽధ్యాయే.

అతీంద్రియమగు మనస్సు సత్త్వసంజ్ఞకమని కొందఱు వచియింతురు. ఇంద్రియముల చేష్టాప్రత్యయభూతమగు మనస్సు, ఆత్మేంద్రియార్థములఁబట్టి ప్రవర్తించుచు నొకపురుషునియం దనేకవిధములుగ నున్నట్టు పొడఁగట్టు. సత్త్వరజస్తమోగుణములభేదముచే ననేకముగ నున్నట్టు కనుపించునుగాని, పారమార్థికముగ నొక్కటియే? ఒక్కటి యయ్యెనేని, అనేకులయం దేకకాలంబునఁ బ్రవర్తింపలేదు. అనేకమంటిమేని బహుత్వకల్పనదోష మాపాదించుటయే గాక, ఏకకాలమందు సర్వేంద్రియప్రవృత్తి లేదు. కాఁబట్టి ఏయేయింద్రియమునకు మనస్సుతోడ సంబంధము గలుగునో, ఆయాయింద్రియమునకు విషయజ్ఞానము కలుగును. సర్వేంద్రియముల కొక్కపర్యాయమే, మనస్సుతోడి సంబంధము గలుగుట న్యాయశాస్త్రమతంబునకు విరుద్ధము. కావున, మనస్సుతోఁ గూడిన యింద్రియమునకే విషయప్రవృత్తిగాని, తదితరమునకు విషయప్రవృత్తి లేదు. మనస్సున కేగుణంబులో, అవియే కొంచెమెచ్చుతక్కువలుగ బుద్ధికిని గలిగియున్నవి.

ఆత్మేంద్రియార్థముల సన్నికర్షము ననుసరించు విషయప్రవృత్తి గలది. అణుత్వము, ఏకత్వము అను గుణములు గలది. తలంచుట, యూహించుట, విచారించుట, ధ్యానించుట, లేక తలంపు, ఊహ, విచారము, ధ్యానము, సుఖదుఃఖానుభవజ్ఞానము, ఇవి యీమనస్సు యొక్క వ్యాపారములు. ఈపదార్థము గోచరించక బాహ్యేంద్రియములు [illegible] విచారించి, దానియందు సక్తము నిర్వికల్పజ్ఞానములచే సవికల్ప పరంపరల నొందును, [illegible] పలుకుటను గాని, [illegible] రించుటను గాని, [illegible] యములు, ఇంద్రియ[illegible] చేయఁ[illegible] [illegible] పుర[illegible].

న్యాయదర్శనమందలి మనస్తత్త్వము.

సూ. యుగపజ్జ్ఞానానుత్పత్తిర్మనసో లింగమ్.

(న్యాయదర్శనే 1 అధ్యాయే 16 సూత్రమ్.)

సూ. జ్ఞానాయౌగపద్యాదేకం మనః.

(న్యాయదర్శనే 3 అ. 60 సూత్రమ్.)

స్మృత్యనుమానాగమసంశయప్రతిభాస్వప్నజ్ఞానోహాః [illegible] తమిచ్ఛాదయశ్చ మనసో లింగాని.

[illegible]

ఇంద్రియప్రత్యక్షములుగాని, స్మృత్యనుమా[illegible] స్వప్నాదివృత్తులును, సుఖాదివృత్తులును, [illegible]

చేన్నవో, అయ్యది మనస్సు ఒకపర్యాయము సర్వేంద్రియములకు జ్ఞానము కలుగమిచేతను, ఏయింద్రియముతోడ సంబంధముగలిగిన నాయింద్రియమునకే జ్ఞానము కలుగుటచేతను, మనస్సొక్కటియ అణుత్వధర్మము గలదని న్యాయదర్శనమందు భాష్యకారుఁడగు వాత్స్యాయనమునిచేఁ దెలుపఁబడినది.

ఆధునిక తార్కికమతమందలి మనస్తత్త్వమునుగూర్చి.

శ్లో. సాక్షాత్కారే సుఖాదీనాం కరణం మన ఉచ్యతే,
అయోగపద్యాజ్జ్ఞానానాం తస్యాణుత్వమిహేష్యతే.

కారికావళి. 85.

సుఖదుఃఖరాగద్వేషాదివృత్తుల సాక్షాత్కారమందు మనస్సు సాధనమగుచేన్నది. సర్వేంద్రియములజ్ఞాన మొక్కపర్యాయమే లభింపమింజేసి, మనస్సునకణుత్వము నిశ్చయింపఁబడుచేన్నది. కాని విభుత్వము సిద్ధాంతీకరింపఁబడలేదు.

ఏతేన మనసి ప్రమాణం దర్శితం. తథాహి.—సుఖసాక్షాత్కారస్సకరణకః. జన్యసాక్షాత్కారత్వాత్ చాక్షుషసాక్షాత్కారవత్, ఇత్యనుమానేన మనసః కరణత్వసిద్ధిః, న చైవం దుఃఖాదిసాక్షాత్కారాణామపి కరణాంతరాణి స్యురితి వాచ్యం లాఘవాదేకస్యైవ తాదృశసకలసాక్షాత్కారకరణతయా సిద్ధేః ఏవం సుఖాదీనామసమవాయికారణసంయోగాశ్రయతయా మనసస్సిద్ధిర్బోద్ధవ్యా, తత్ర మనసోఽణుత్వే ప్రమాణమాహ. జ్ఞానానాం చాక్షుషరాసనాదీనామయౌగపద్యమేకకాలోత్పత్తిర్నాస్తీత్యనుభవసిద్ధం. తత్రజ్ఞానేంద్రియాణాం సత్యపి విషయసన్నిధానే, యత్సంబంధాదేకేనేంద్రి

యేన జ్ఞానముత్పద్యతే. యదసంబంధాచ్చ పరైర్జ్ఞానం నోత్పద్యతే తన్మనః. విభుత్వే చాసన్నిధానం న సంభవతీతి న విభు మనః, న చ తదానీమప్యదృష్ట విశేషాదోద్బోధకవిళంబాదేవ తద్జ్ఞానవిళంబ ఇతి వాచ్యం, తథా సతి చక్షురా దీనామప్యకల్పనాపత్తేః. న చ దీర్ఘశష్కులీభక్షణాదౌ, నానావధానభాజాం చ, కథమేకదాఽనేకేంద్రియజన్యజ్ఞానమితి వాచ్యం. మనసోఽతిలాఘవా త్త్వరయా, జ్ఞానేంద్రియసంబంధాన్నానాజ్ఞానోత్పత్తేః. ఉత్పలశతపత్ర భేదాదివ యౌగపద్యప్రత్యయస్య భ్రాంతత్వాత్. న చ మనసస్సంకోచ వికాసశాలిత్వాదుభయోపపత్తిరస్త్వితి వాచ్యం. నానావయవతన్నాశ కల్పనే గౌరవాల్లాఘవాన్నిరవయవస్యాణురూపస్యైవ మనసః కల్పనమితి సంక్షేపః.

ఘటపటాదిపదార్థములు చక్షురింద్రియమునను సాక్షాత్కరించినట్లు, సుఖదుఃఖాదివృత్తులును, మనస్సునను గోచరించుటం జేసి, యనుమానప్రమాణముచే మనస్సనునది యొకటి కలదని సిద్ధించుచున్నది. దుఃఖాదివృత్తులను సాక్షాత్కరింపఁ జేయు సాధనములు మఱికొన్ని కలవని చెప్పి, సాధనబాహుళ్యమును గల్పించుటకన్న, సకలవృత్తిసాక్షాత్కరణశక్తి మనస్సున కొక్కదానికే కలిగియున్నదని చెప్పుట యుక్తియుక్తముగ నుండు. ఇట్లు సుఖాదివృత్తులతోడి యసమవాయికారణ సంయోగాశ్రయముచే మనస్సను పదార్థము సిద్ధించుచున్నది. జ్ఞానసాధనములగు చక్షురాదీంద్రియముల కొక్కటస్వయమే విషయగ్రహణశక్తి లేక, యేయింద్రియముతోడ మనస్సు సంబంధించియుండు నాయింద్రియమునను విషయజ్ఞానము గల్గి, తక్కుంగలయింద్రియములు జ్ఞానశూన్యములగుట సర్వలోకా

నుభవము. ఇతరజ్ఞానేంద్రియంబులకు విషయసన్నిధానంబు గలిగియున్నను, మనస్సంయోగము లేమిచేఁ దద్విషయకజ్ఞానము కలుగకపోయెను. మనస్సునకు విభుత్వము కలిగియున్న, సర్వేంద్రియములకు విషయజ్ఞాన మొక్కపర్యాయమే కలుగవలసియుండెడి. అట్లు కలుగక, యేయింద్రియముతోడి సంబంధమున్న నాయింద్రియమునకే కలుగుచున్నందున, మనస్సునకణుత్వము సిద్ధించెను. దీర్ఘశష్కులికమును (చేక్కిలము) భక్షించుచు ననేకవిషయంబుల నవధానము గావించువారికి, సర్వేంద్రియజ్ఞాన మొక్కపర్యాయమే లభించెఁ గదా యని యాక్షేపించిన, మనస్సునకతిలాఘవంబును, అతిత్వరితగతియు గలిగినందున, మనకు గోచరముకానియంత విళంబమున నన్నియింద్రియములయందు సంచరించును గాని, ఏకకాలీనసర్వేంద్రియజ్ఞానము లభింపదు. ఉత్పలశతపత్త్ర ఛేదమువలె యుగపత్కాలసంజనితమని భ్రాంతి కలుగును. సంకోచవికాసములు స్వభావములుగాగల మనస్సునకు నుభయోపపత్తి కలుగనేరదు. నానావయవములు తన్నాశనమును మనస్సునకుఁ గల్పించుభారమునకన్న, నిరవయవత్వము, అణుత్వము, కల్పించుటయే యుక్తియుక్తముగను, సమంజసముగ నుండునని, సిద్ధాంతముక్తావళియను తర్కప్రకరణమునందు నిర్ణయింపఁబడియున్నది.

సాంఖ్యదర్శనమందలి మనస్తత్త్వము.

సూ. సత్త్వరజస్తమసాం సామ్యావస్థా ప్రకృతిః; ప్రకృతేర్మహాన్ మహ

లోకంబున ప్రభువు సేవకులకు నాజ్ఞలనొసంగి, లోఁబఱచుకొని ప్రధానుఁడయినట్లు, మనస్సును జ్ఞానేంద్రియకర్మేంద్రియముల నధిష్ఠించి వ్యాపారముల నడపుచున్నందున, రెంటికిఁ బ్రధానమగుచున్నది.

సూ. త్రయాణాం స్వాలక్షణ్యమ్.

సాంఖ్య, 2 అధ్యాయ. 30 సూ.

వృత్తి. మహదహంకారమనసాం స్వాలక్షణ్యం స్వం స్వం లక్షణమ్. మహతః అధ్యవసాయః, అహంకారస్య అభిమానః, మనసః సంకల్ప ఇతి.

సాంఖ్యశాస్త్రమునందు అంతఃకరణము త్రివిధభేదము గలదియగు. బుద్ధియగు మహత్తత్త్వమునకు నిశ్చయజ్ఞానము (అధ్యావసాయము) అహంకారమునకు నేనను అభిమానజ్ఞానము, మనస్సునకు సంకల్పము (తలఁచుట), ఇవి లక్షణములని అనిరుద్ధవృత్తియందుఁ జెప్పఁబడినవి. ఇందు బుద్ధ్యహంకారమనస్సులు మూఁడును, ప్రకృతి (ప్రధానతత్త్వము) తత్త్వమువలనఁ గలిగెననియు, అయస్కాంతసన్నిధినుండు, లోహసూచిక నిష్క్రియమయ్యుఁ జలించువిధంబున, చిద్రూపుఁడగు పురుషునిసాన్నిధ్యబలంబున నీయంతఃకరణమునకు శక్తి గలిగెననియు ముఖ్యతాత్పర్యము.

మనస్తత్త్వమునుగూర్చి వివిధశాస్త్రజ్ఞుల యభిప్రాయము.

ముందుఁ జెప్పినట్లు మనస్సునకు నిరవయవత్వమును, అణుత్వమును, నిత్యత్వమును, తార్కికులు సిద్ధాంతీకరించినను,

వేదాంతిమతమునందు తద్భిన్నముగ నుండును. సువర్ణాదిద్రవ్యము కటకమకుట గ్రైవేయకాదిరూపములుగఁ బరిణమించు నేవిధమున, మనస్సును నానావిధములుగఁ బరిణమించుస్వభావము గలదియు, నానావయవములు గలదియు, అనిత్యత్వము గలుగుటందున నాశము గావింపనొప్పుననియు, ధ్వనింపజేయుచున్నది. అగ్నికి ఉష్ణస్వభావ మగునట్టుల, మనస్సునకుఁ జాంచల్యము స్వభావమనియు, నిరాకారమగునాకాశమున కట్టిరూపము గలదో, చిత్తమున కట్టిరూపము గలదనియు, ఒకసంకల్పమునకును, మఱియొకసంకల్పమునకును, మధ్య యట్టిరూపమున్నదో, అట్టిరూపము మనస్సునకుఁ గలదనియు, జ్ఞానవాసిష్ఠమునందు మనస్సును గూర్చి పెక్కువిధములఁ జెప్పఁబడినది. మఱియు నాగ్రంథమునందె తత్త్వజ్ఞానము, మనోనాశము, వాసనాక్షయము, ఈమూఁడును మోక్షమునకు ముఖ్యములనియు, వీనిలో నొకటి లభించనేని, తక్కినరెండును ప్రయత్నము చేసియు లభించుననియు, నీమూఁడు నొకదానితోనొకటి సంబంధమనియు దెలిపిరి. దీనింబట్టి మనోనాశము గావింపనొప్పునని తెల్లమగుచున్నది. మనోనాశమువలన వాసనాక్షయంబును, వాసనాక్షయమువలన తత్త్వజ్ఞానప్రాప్తియు, దానివలన నిరతిశయసుఖంబగు కైవల్యపదవియు లభించును. ఇందువలన మనోనాశము వేదాంతిమతమునందుఁ గలదని తెలియుచున్నది. పరిశీలింపగ, నిరతిశయసుఖంబగు పరబ్రహ్మపదంబు నందుటకుఁ గారణము మనోనాశమని వేదాంతులును, చిత్తవృత్తినిరోధ.

మని యోగులును,అంతఃకరణమునుఁ బ్రకృతియందు లయింపఁ జేయుటయని సాంఖ్యులును, తమ మతానుసారముగ సిద్ధాంతీకరించుచున్నారు.

బుద్ధిస్వరూపము (Buddhic Plane)

అంతఃకరణచతుష్టయంబులో రెండవది యగు బుద్ధి తత్త్వము. దీనిని సాంఖ్యదర్శనమందు మహత్తత్త్వమని చెప్పుదురు.

బుధ్యతేఽనయేతి బుద్ధిః-ఎద్దానిచేఁ దెలిసికొనఁబడు నయ్యది బుద్ధియనఁబడు. నిశ్చయాత్మికమగు నంతఃకరణ వృత్తియే బుద్ధి యని వేదాంతసారమునఁ గలదు. సంకల్ప వికల్పములచే నాందోళనముఁ జెందుచున్న మనస్సును, నిశ్చయజ్ఞానమునకుఁ దెచ్చు నంతఃకరణవృత్తియే బుద్ధి యనియు, నియ్యది మనస్తత్త్వంబుపైనుండి విమర్శించు ప్రకాశాత్మక మయిన చిచ్ఛక్తితోఁ గూడినదనియు, తత్త్వజ్ఞులు వచించుచున్నారు.

1 బుద్ధిః, 2 మనీషా, 3 ధిషణా, 4 ధీః, 5 ప్రజ్ఞా, 6 శేముషీ, 7 మతిః, 8 ప్రేక్షా, 9 ఉపలబ్ధిః, 10 చిత్, 11 సంవిత్, 12 ప్రతిపత్, 13 జ్ఞప్తిః, 14 చేతనా. ఇతి అమరసింహః.

15 ధారణా, 16 ప్రతిపత్తిః, 17 మేధా, 18 మననం, 19 మనః, 20 జ్ఞానం, 21 బోధః, 22 హృల్లేఖః, 23 సంఖ్యా,

24 ప్రతిభా ఇతి రాజనిఘంటుః. 25 ఆత్మజా, 26 పండా, 27 విజ్ఞానం, ఇతి శబ్దరత్నావళిః.

పైని చెప్పినచొప్పున, పంచ్యాయవాచకశబ్దములు నిఘంటువులందుఁ గన్పించుచున్నవి.

శ్లో. బుద్ధిర్వివేచనారూపా సా జ్ఞానజననీ శ్రుతా.

బ్రహ్మవైవర్తే - ప్రకృతిఖండే. 23 అధ్యాయః.

శ్రుతియందు జ్ఞానమును గలిగించునదియు, యుక్తాయుక్త వివేచనారూపమయినదియు, బుద్ధియని బ్రహ్మవైవర్త పురాణమునఁ జెప్పఁబడినది.

శ్లో. అధ్యాత్మం బుద్ధి రిత్యాహుష్షడింద్రియవిచారిణీ,
సాధిభూతం చ మంతవ్యం బ్రహ్మా తత్రాధిదైవతం.

మహాభారతే - అశ్వమేధపర్వణి.

మనస్సహితజ్ఞానేంద్రియములయొక్క వ్యాపారములను విచారించునట్టి బుద్ధి అధ్యాత్మము, నిశ్చయాత్మకజ్ఞానము (బోధ) అధిభూతము, చతుర్ముఖబ్రహ్మ అధిదైవతము.

బుద్ధిగుణములు.

శ్లో. ఇష్టానిష్టవిపత్తిశ్చ వ్యవసాయస్సమాధితా,
సంశయః ప్రతిపత్తిశ్చ బుద్ధేః పంచగుణాన్విదుః.

మహాభారతే - మోక్షధర్మపర్వణి.

1 ప్రియాప్రియరూపవృత్తివిశేషముయొక్క నాశము. అనగా, నిద్రావృత్తి, 2 ఉత్సాహము, 3 చిత్తస్థైర్యము, 4

సంశయజ్ఞానము, 5 ప్రత్యక్షాది ప్రమాణవృత్తి ఇవి యైదును బుద్ధియొక్క గుణంబులు.

శ్లో. శుశ్రూషా శ్రవణం చైవ గ్రహణం ధారణం తథా,
ఊహాపోహోఽర్థవిజ్ఞానం తత్త్వజ్ఞానం చ ధీగుణాః.
ఇతి హేమచంద్రః.

1 ఆసక్తి, 2 శ్రద్ధాపూర్వకముగ వినుట, 3 బుద్ధిపూర్వకముగ గ్రహించుట, 4 గ్రహించిన విషయముల మఱవక జ్ఞప్తియందుంచుకొనుట, 5 ఊహాపోహ (తర్కజ్ఞానము), 6 అర్థవిషయకజ్ఞానము, 7 తత్త్వజ్ఞానము, ఈయేడును బుద్ధిగుణములు.

బుద్ధిదోషములు.

శ్లో. శోకః క్రోధశ్చ లోభశ్చ కామో మోహః పరాసుతా,
ఈర్ష్యా మానో విచికిత్సా కృపాసూయా జుగుప్సతా.
ద్వాదశైతే బుద్ధినాశహేతవో మానసా మలాః,

1 శోకః=దుఃఖము, 2 క్రోధః=తీవ్రమయినకోపము, 3 లోభః = అత్యాశ, 4 కామః = స్త్రీవిషయికానురాగము, 5 మోహః=భ్రాంతి, 6 పరాసుతా=ప్రాణాత్యయము లేక, పారతంత్ర్యము, 7 ఈర్ష్య = ఈసు (మచ్చరము), 8 మానః=అభిమానము, 9 విచికిత్సా=సందేహము, 10 కృప=కనికరము, 11 అసూయా=ఓర్వలేనితనము, 12 జుగుప్సతా=ఏవగింత. ఈ పండ్రెండును బుద్ధినాశనమునకు హేతువు లగు మానస

మలములని కాళికాపురాణమున 28 అధ్యాయమునఁ జెప్పఁ బడినవి.

బుద్ధితత్త్వము.

సర్వలోక ప్రకాశకుఁడగు ప్రభాకరునిచుట్టు నెలుంగు ప్రకాశమువలెను, సుధాకరు నాశ్రయించి ప్రకాశించు చంద్రిక విధంబునను, మణియందలి కాంతిభాతిని, పరమాత్మ నాశ్రయించి ప్రకాశించు ప్రభాశక్తికే చిచ్ఛక్తియనియు, ప్రజ్ఞాశక్తియనియు, బుద్ధితత్త్వంబనియు, తత్త్వజ్ఞులు వ్యవహరింతురు.

ఈబుద్ధితత్త్వము, చిత్, ప్రజ్ఞ, బోధ, వివేకము, జ్ఞానము, సంవిత్, ధీ, జ్ఞప్తి, లోనగు పర్యాయవాచకశబ్దములచేఁ బిలువఁబడుచున్నది. సూర్యచంద్ర, మణులను, కాంతి విడనాడక యవినాభావసంబంధముగ నున్నట్టుల, చిత్ప్రకాశంబును పరమాత్మ నెడఁబాయక నిత్యసంబంధము గలిగియున్నది. ఆనిరిశక్తిచే యంత్రములు ప్రేరితములయి, విచిత్రవ్యాపారము లొనరించుచందమున,చిచ్ఛక్తిప్రభావంబు వలనన దేహేంద్రియ మనఃప్రాణంబులు, శక్తిమంతంబులై, తమతమ నియతవ్యాపారములయందు వర్తించుచున్నవని యిదివఱలో సూచింపఁబడెను. మహత్తత్త్వమగుబుద్ధి, విజ్ఞాన మయకోశమందుండి, చిత్ప్రకాశమును బొంది, నిఖిలజగ ద్వ్యాపారము నొనరించుచు, జీవునకుఁ బ్రధానోపకరణమన

నొప్పియున్నది. బుద్ధ్యుపాధికుఁడే జీవుఁడనియు, చిదాభాసుఁడనియు, చిత్ప్రతిబింబితుఁడనియు, శ్రీవిద్యారణ్యస్వాములువారు వేదాంతపంచదశీగ్రంథమునందు వివరించి యున్నవారలు.

బుద్ధ్యుపాధికుఁడు జీవుఁడనుట.

శ్లో. చైతన్యం యదధిష్ఠానం లింగదేహశ్చ యః పునః,
చిచ్ఛాయా లింగదేహస్థా తత్సంఘో జీవ ఉచ్యతే.

పంచదశి - ద్వైతవివేకము 11.

శ్లో. చిచ్ఛాయావేశతశ్శక్తిశ్చేతనేవ విభాతి సా,
తచ్ఛక్త్యుపాధిసంయోగాద్బ్రహ్మైవేశ్వరతాం వ్రజేత్.

పంచదశి - పంచకోశవివేకము. 40.

లింగదేహమున కాధారమైన చైతన్యంబును, ఆచైతన్యంబునందుఁ గల్పింపఁబడిన లింగదేహంబును, చిచ్ఛాయాప్రతిబింబితుఁడును, ఈమూఁడును గలిసి, జీవుఁడని చెప్పఁబడుననియు, మాయాశక్తి చిచ్ఛాయయందుఁ బ్రవేశించుటవలన, శక్తిగలదానివలెఁ దోచుచున్నదనియు, ఆశక్త్యుపాధితోఁడి గూడిన బ్రహ్మమే, సర్వజ్ఞత్వాదిధర్మములుగల ఈశ్వరభావమును బొందుననియు తాత్పర్యము.

మనోమయ, విజ్ఞానమయకోశంబులు

శ్లో. కర్తృత్వకరణత్వాభ్యాం విక్రియేతాంతరింద్రియం,
విజ్ఞానమనసీ అంతర్బహిష్ట్వే చ తే పరస్పరమ్.

పంచదశి-పంచకోశవివేకము. 8 శ్లోకం.

మనోబుద్ధులు రెంటికిని, అంతఃకరణరూపమునందు భేదము లేకున్నను, జ్ఞానేంద్రియకర్మేంద్రియములతోఁ గూడి సంకల్పవికల్పాత్మికమగు నంతఃకరణవృత్తి మనోమయకోశంబనియు, నిశ్చయాత్మికమగు నంతఃకరణవృత్తి విజ్ఞానమయకోశంబనియు, వ్యవస్థ యేర్పఱచఁబడినది. అంతరింద్రియమనెడి యంతఃకరణము, దేహములోపల నేననెడి కర్తృరూపముగఁ బరిణమించి బుద్ధియను నామముతోను, కరణరూపముగఁ బరిణమించి, దేహమునకు వెలుపల గృహక్షేత్రాదులయందు వర్తించుచు, నాదియను నభిమానముగలది, మనస్సను నాహ్వాయముతోను బరగుచున్నది. కర్తృరూపబుద్ధి (Subjective mind.) కరణరూపమనస్సు, (Objective mind) అని పాశ్చాత్యులు వ్యవహరింతురు. విజ్ఞానమయకోశమందునున్న యీ బుద్ధితత్త్వము, మనోమయకోశంబునకును, ఆనందమయకోశంబునకును, మధ్యయందుండి, ఊర్ధ్వభూమిక యగు నానందమయకోశంబుతో నొకానొకప్పుడు, తాదాత్మ్యము నంది యంతర్ముఖమై (లీనమై) యానందపారవశ్యముఁ జెందును. అధోభూమికయగు, మనోమయకోశముతోఁ జేరి రాగద్వేషాదివృత్తులుగఁ బరిణమించి, వివిధసుఖదుఃఖంబుల నందుచుండు.

అహంవృత్తి, ఇదంవృత్తియని అంతఃకరణభేదము.

శ్లో. అహంవృత్తిరిదంవృత్తిరిత్యంతఃకరణం ద్విధా,
విజ్ఞానం స్యాదహంవృత్తిరిదంవృత్తిర్మనో భవేత్.
పంచదశి - చిత్రదీప. 70 శ్లోకము.

శ్లో. అహంప్రత్యయబీజత్వమిదంవృత్తే రతిస్ఫుటం,
అవిదిత్వా స్వమాత్మానం బాహ్యం వేత్తి న తు క్వచిత్.
పంచదశి - చిత్రదీప. 71 శ్లోకము.

అహంవృత్తి యనియు, ఇదంవృత్తి యనియు, నంతఃకరణము రెండువిధములు. లోపల నేననునభిమానముగల యహంవృత్తి, విజ్ఞానమయకోశమందున్న బుద్ధియనియు, వెలుపల గృహక్షేత్రవిత్తాదులయందు నాదియను నభిమానముగల ఇదంవృత్తి, మనోమయకోశమందునున్న మనస్సనియుఁ దెలియవలయు.

తాను అనునది లేక, వెలుపలివస్తువులఁ దెలిసికొనలేఁడు గనుక, బాహ్యవిషయములయందు నాదియను నభిమానముగల యిదంవృత్తికి, లోపల నేనను నభిమానముగల యహంవృత్తి కారణమగుచున్నది. కారణము లేక, కార్యము కలుగదు కావున అహంవృత్తియగు బుద్ధి కారణంబును, ఇదంవృత్తియగు మనస్సు కార్యము నగుచున్నదని తాత్పర్యము.

చక్షురాదీంద్రియవిషయములను, మనస్సు సాక్షియై చూచుచున్నట్లు మానసికవృత్తులగు, రాగద్వేషకామక్రోధ సంకల్పవికల్పాదులను బుద్ధి సాక్షియై చూచుచున్నదని యిది వఱలోఁ జెప్పఁబడెను. దీనివలన మనస్తత్త్వంబునకన్న, బుద్ధితత్త్వము మిన్నయు, సూక్ష్మంబునని తెలియుచున్నది.

బుద్ధితత్త్వమునకు బలమధికము.

సూ. ఉపరాగాత్ కర్తృత్వం చిత్సాన్నిధ్యాత్ చిత్సాన్నిధ్యాత్.

సాంఖ్యదర్శన. 1 అధ్యాయ. 164 సూత్రం.

చిత్సన్నిధానంబువలన మహత్తత్త్వంబగు బుద్ధికి కర్తృత్వాభిమానము కలిగి, నిఖిలజగద్వ్యాపారముల నిర్వర్తించుచున్నదని సాంఖ్యదర్శనమందు గలదు.

మనస్సు, సకలము విషయములమీఁదికిఁ బోయి, యుక్తాయుక్తవివేచన లేక సంకల్పవికల్పములఁ జెందునపుడు బుద్ధితత్త్వము ప్రమాణానుసారజ్ఞానముచే నిశ్చయస్థితికిఁ దెచ్చును. అధ్యవసాయకమగు నిశ్చయజ్ఞానము బుద్ధికి గలదు కాని మనస్సునకు లేదు. మనసు తనస్వభావముచే సంకల్పముల నింద్రియవర్గముచే నాకర్షించబడి, విషయగహనమునఁ బ్రవేశపెట్టఁబడినపుడు అనుభవానుసార జ్ఞానము గలబుద్ధి, (అంతరాత్మ) అట్టి దుర్విషయంబులలోనికిఁ బోవనీయక, మనంబును, ఇంద్రియవర్గంబునుండి, విషయగహనంబునుండి మఱలించి, సద్విషయములలోనికిఁ బ్రవేశపెట్టును.

పంచకోశములు.

ఆనందమయము. శమ దమ తితిక్ష భక్తి
విజ్ఞానమయము. న్యాయ ధర్మ జ్ఞాన వివేక వైరాగ్య ధైర్య
మనోమయము. సద్బుద్ధి శుద్ధం నిశ్చలత్వము **Higher Mind**
TUG OF —————— WAR
Lower Mind అశుద్ధం సంకల్ప చాంచల్య వికల్ప అధీరత్వ
ప్రాణమయము. కామ క్రోధ లోభ మోహ
అన్నమయము. మద మాత్సర్య ఈర్ష్యా అసూయ అనృత అధర్మ

దుర్మార్గములోనికి నింద్రియవర్గంబును, సన్మార్గములోనికి బుద్ధియు లాగుచుండినతఱి, నాందోళనావస్థనుఁ జెందినమనస్సు ఎద్దానియందు బల మధికంబుగనుండు నద్దానిలోనికిఁ బ్రవేశించు. నివ్విషయము లోకములోని (Tug of war) ఆకర్షక పందెమువలన దృష్టాంతీకరింపఁబడుచున్నది.

మనోమయకోశదురవస్థ, వృత్తులపోరాటము.

దుర్విషయేంద్రియరూపమగు కామక్రోధరాగద్వేషాహంకారేర్ష్యాసూయాదిసైనికసమూహం బొకప్రక్కను, సద్విషయరూపమగు శమదమవివేకవిజ్ఞానవైరాగ్యాదిశూరసమూహం బొకప్రక్కను, లాగుచుండినపుడు రెంటికిని మధ్యనున్న మనస్సు, ఔదాసీన్యము వహించి, యెద్దానియందు బల మధికంబుగనుండు నద్దానివలనకుఁ జేరును. ఇదెట్టులనినః ఊర్ధ్వభూమికలగు, ఆనందమయ విజ్ఞానమయ కోశముల రెంటికిని అధోభూమికలగు, ప్రాణమయాన్నమయకోశముల రెంటికిని, మధ్యనున్న మనస్సు, సద్విషయంబులగు శమదమాదులచేఁ బైకిని, దుర్విషయంబులగు రాగద్వేషాదులచేఁ గ్రిందికిని లాగఁబడినపుడు, ప్రారబ్ధకర్మఫలానుసారముగఁ బ్రేరితమై, దుఃఖఫలమనుభవింపవలసి వచ్చునపుడు క్రిందితట్టును, సత్ఫల మనుభవింపవలసివచ్చునపుడు పైతట్టునుఁ జేరును. అప్పుడు మనస్సుతోఁ గూడిన మూఁడుకోశములకు జయమును, తక్కిన రెండుకోశముల కపజయమును గలుగుట లోకానుభవము.

బుద్ధిప్రమాదమువలన క్లేశప్రాప్తి.

ఒకానొకప్పుడు మనస్సు, ఇంద్రియప్రేరితమై దుర్విషయంబులగు పరకాంతావిలాసంబులఁ గని వ్యభిచరించవలెననియు, పరధనంబుల నపహరింపవలెననియు, సంకల్పములు పొడమినపుడు అనేక జన్మములయందలి సుఖదుఃఖానుభవ సంస్కారజ్ఞానముగల బుద్ధి, పరకాంతాసక్తివలన రావణకీచకాదులువలె హతులై నశింతురనియు, పరధనాపహారణము వలనఁ జోరులువలె కారాగృహప్రాప్తియు, రాజదండనము, అపకీర్తియుఁ గలుగుననియు, మనస్సునకుఁ జెక్కగ ప్రబోధించి,యాదుర్విషయంబులనుండి మఱలించును. అటుగాక బుద్ధి ప్రమాదావస్థఁ జెందెనేని, మద్యపానపరాయత్తచిత్తుఁడగు సారథి పగ్గముఁలవీడ దుష్టాశ్వములు రథంబును గోతిలోనికిఁ బడఁద్రోసిన విధంబున, నింద్రియాశ్వములును జెక్కనిప్రబోధములేని మనస్సును, విషయగహనములోనికిఁ ద్రోసి, దుఃఖములపాలు గావించును.

సంస్కారవాసనలు, బుద్ధివృత్తులు.

జీవుఁడనుభవించు సకలవిషయానుభవంబులును, వాసనారూపముగ బుద్ధియందు స్థితినిఁ జెంది, సంస్కారనామమునఁ బరగుచుండి, మనస్సు విషయగహనంబునఁ బ్రవేశించి, యవివేకకృత్యముల సంకల్పించుచుండ, వానినుండి మరలించి సత్పథంబునఁ జేర్చుచుండు.

ప్రభువుయొక్క రాజ్యగృహక్షేత్రవాహనాభరణాం బరాన్నైశ్వర్యరూపమగు ఆస్తియంతయు, పత్రరూపముగ నంతఃపురములోని, ఇనుపపేటికయం దుంచుకొనువిధంబున జీవుండును, తాను జన్మజన్మాంతరములయం దార్జించిన పుణ్య పాపసుఖదుఃఖానుభవరూప వాసనాసర్వస్వమును, అంతఃకరణ ములోనిదగు, బుద్ధిపేటికయందుఁ జేర్చిపెట్టుకొని, ఆయా జన్మములనుఁ దగినట్టుల కర్మఫలము ననుభవించుచుండును. జీవుని యాస్తియంతయు బుద్ధియందు వాసనారూపముగ నున్న దని భావము. ఈ బుద్ధి యేవృత్తి నవలంబించిన తదాకార ముగఁ బరిణమించును. జ్ఞానవిషయకబుద్ధి, పారమార్థికబుద్ధి, ప్రాపంచికబుద్ధి, విషయాసక్తబుద్ధియని, తద్వృత్త్యనుగుణం బుగఁ బిలువఁబడును. తైలధారవలె నవిచ్ఛిన్నమగు నేకా కారవృత్తిక, ధారావాహికబుద్ధి యని పేరు.

బుద్ధిబలముగల ధీరుఁడు లోకమందు శ్లాఘ్యుఁడనుట.

ఆస్థ, శ్రద్ధ, ఆసక్తి, అధ్యవసాయము, ఉత్సాహము, వ్యవసాయము, పట్టుదల, ఈపదములన్నియు, బుద్ధిగుణము లుగ నుపయోగింపఁబడుచున్నవి.

మనస్సునకు సంశయమువలనఁ జలనశక్తిగాని, నిశ్చల శక్తిలేదు. నిశ్చలత్వము, ఉత్సాహము లోనగునవి బుద్ధిశక్తులు.

మహోత్సాహవంతులు గొప్పకార్యములు సేయఁ దలపెట్టి, మధ్య కొన్ని యిక్కట్టులు వాటిల్లినను, బ

మిత్రులు విడనాడినను, దారాపుత్రు లెడఁబాసినను, పౌరులు త్యజించినను, రాజకీయాధికారులు బెదరించినను, ఐహిక సుఖములగు, ధనకనకవస్త్రాభరణాంబరాదులు తొలఁగినను, నిశ్చలబుద్ధితోను, పట్టుదలతోడను, తాము తలఁచినవానిని నిర్వహింతురు ఇట,మానవుని మనోనిశ్చయముఁ గన్గొన ననేక విఘ్నములు, కష్టములు,పంపగ వీనినన్నిటి జయించి, ధీరుఁడయి నంత, నిదివఱలోఁ దననెడఁబాసినవారలును, పరిహసించిన వారలు, అవమానించినవార లాశ్చర్యము పొందునట్లు దైవము అనేకభోగభాగ్యములను, అనన్యసాధ్యమగు పదవి, నానందసౌఖ్యంబుల నొసంగును.

బుద్ధిబలము ఐశ్వర్యాధికారయశోపూజ్యతలకుఁ గారణము.

లోకములోఁ గొందఱు మానవులు మహనీయులు వలె గొప్పపదవులును, భోగభాగ్యసౌఖ్యంబులును, దిగంత విశ్రాంతకీర్తియుఁ బొందఁ దలంతురుగాని, ఆమహనీయు లనుభవించిన కష్టములలోను, పడినపాట్లలోను, సహస్రాంశ మేని యనుభవింప నోపకుందురు శ్రద్ధాళురు, శ్రమయని భావింపక, యనేకకష్టముల కోర్చి, గురుశుశ్రూషవలన ననేక శాస్త్రీయ రహస్యంబుల గ్రహించి, అనేకదేశములు తిరిగి, గ్రంథములఁ బరిశోధించి, వివిధవిషయంబుల బుద్ధియందు ధారణజేసి, మహాసభలయందుఁ బ్రేక్షకులెల్లరు విస్మితులగు నట్లు ఉపన్యాసములు గావింతురు. ఇట శ్రద్ధాగ్రహణధార

లు బుద్ధిగుణములై యున్నవి. మేధాసంపన్నులు ఆత్మప్రకములగు సనాధానములను ప్రజ్ఞావిశేషములను జూపించెను. బుద్ధిబలము సర్వోత్కృష్టబలములలోనెన్న సర్వోత్తమమైనదగుటను నున్నది, దుర్బలుఁడైనను బలాఢ్యుని జయించును. మానవునికి గల భాగ్యములయందెల్లను, బుద్ధిబలమును బట్టి యుండును.

ఆత్మస్వరూపవిచారము.

Self ఆత్మ, శక్తిత్రయము.

ఆత్మ: జ్ఞానశక్తి, ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి అని మూఁడుశక్తులు గలది.

జ్ఞానశక్తి · Thought: Cognition; Knowledge, Intelligence.

ఇచ్ఛాశక్తి :- Will: Desire, Volition.

క్రియాశక్తి Activity; Emotion, Feeling. Energy.

ప్రజ్ఞారూపమగు నాత్మ యవిభాజ్యమైనను బాహ్యార్థసహకారముచేత త్రివిధశక్తులుగలదని వ్యవహరింపఁ బడుచున్నది. నిరాకారమగు పదార్థము వ్యక్తమగుటకు రూపములు దాల్చును. సూర్యునినుండి కిరణములు వెలువడి

నట్లును, అగ్నినుండి మిడుగురులు లేచినట్లును, పరిపూర్ణాత్మ నుండి జీవులు వెడలుదురు. కిరణమునందు సూర్యగుణమును మిడుగురునం దగ్నిగుణమును పరమసూక్ష్మముగ నుండినట్లు జీవునియం దీశ్వరశక్తులు బీజమందు వృక్షగుణములు నిగూఢముగ నుండినట్లు ఇమిడియున్నవి. అట్టి సర్వశక్తుఁడును, సర్వవ్యాపియు నగుపూర్ణాత్మ, జ్ఞానేచ్ఛాక్రియాశక్తులు గలవాఁడు. ఈ మూఁడుశక్తులును ఒకదాని నొకటి యాశ్రయించి యవినాభావసంబంధముగ నున్నవిగాని, భిన్నములు కావు. ఒకప్పు డొకటి ప్రాముఖ్యత వహించిన, తక్కిన రెండును దాని ననుసరించి లోఁబడి యుండును. ఆత్మ తెలియును. ఇచ్ఛయించును. కార్యకారియు నగును. తెలిసి యిచ్ఛయించును. ఇచ్ఛయించినదానినిఁ గార్యరూపముగఁ జేయును. త్రివిధప్రధానములనుండి సృష్టి వెలువడినటుల యీత్రివిధశక్తులనుండి బాహ్యప్రపంచవ్యాపారమంతయు నిర్వర్తింపఁబడును.

జ్ఞాన, ఇచ్ఛా, క్రియాశక్తుల కార్యములు.

ఆత్మ జ్ఞానశక్తి నవలంబించియుండిన, ఇచ్ఛాక్రియాశక్తులు, మఱుగుపడి దానికుపోద్బలము చేయుచుండు. అప్పుడు జ్ఞానశక్తికిఁ బ్రాధాన్యము గలిగి సకలసంకల్పములు వెడలుచుండు. దీనివలన సంకల్పముల మూలము జ్ఞానశక్తియని తెలియుచున్నది. (Thinking) Thoughts.

ఆత్మ, ఇచ్ఛాశక్తి నవలంబించియుండిన, జ్ఞానక్రియా శక్తులు తిరోధానముఁ జెంది, పైదానికి బలము కలిగించుచుండు. అప్పుడు, ఇచ్ఛాశక్తికిఁ బ్రాధాన్యతఁ గలిగి, పలువిధములగు కోరికలు, దానినుండి వెడలును. దీనివలన నిచ్ఛలన్నింటికి, ఇచ్ఛాశక్తిమూలమని తెలియనగు. (Willing) Desires.

ఆత్మ, క్రియాశక్తి నవలంబించియుండిన, జ్ఞానేచ్ఛాశక్తు లంతర్గతము లైయుండి, దానికి బలము కలిగించుచుండు. అపుడు క్రియాశక్తికిఁ బ్రాముఖ్యత కలిగి, వెలుపల వివిధకార్యములు, నిర్వర్తింపఁబడు. దీనినలనఁ గ్రియలన్నింటికి మూలము. క్రియాశక్తియని విదిత మగుచున్నది. (Feeling) Action. Emotions.

Three aspects of Atma. ఆత్మశక్తులు.

నిశ్చలమగునాత్మసన్నిధానమున నొకపదార్థ ముండెనేని, తద్విషయిక జ్ఞానము (సంకల్పము) కలుగును. ఆత్మ తన స్థితియందు మార్పుఁ గోరుచు నేకాగ్రతఁ జెందెనేని, ఆపదార్థవిషయికేచ్ఛాభావ మగపడును. పిమ్మట నాత్మ, సముఖమున నుండు పదార్థమును దడవుటకు దనశక్తినిఁ బ్రసరింపఁజేసిన, దాని క్రియాభావము వ్యక్తమగును. పదార్థసన్నికర్షసంయోగాదులయందు, ఆత్మయొక్క జ్ఞానేచ్ఛాక్రియాశక్తు లభివ్యక్తము లగుచుండు. ఇట్లీమూఁడు, ఆత్మయొక్క వేరువిభాగములు గావనియు, త్రివిధపదార్థము లొకటిగాఁ జేరిన

మిశ్రమము గాదనియు, అయితే, మూఁడువిధములుగ వ్యక్త మగు నొక యవిభాజ్యమయిన పూర్ణతత్త్వ మున్నదనియు స్పష్టమగుచున్నది.

నేను సంకల్పించుదును, లేక నేను తెలిసికొందును, నేను కోరెదను, నేను కార్యకారి యగుదునని చెప్పుటయం దీమూఁడును, (నేనసు) ఆత్మయొక్క శక్తు లగుచున్నవి. అసంఖ్యాకమగు సృష్టిజాలమంతయు నీ త్రివిధశక్తులవలనఁ గలుగుచున్నది. ఆత్మ ఇచ్ఛయించువాఁడు, ఆత్మ కర్త, ఆత్మ జ్ఞాత: దేశకాలములయందు భిన్నత్వమున కాతఁడే మూలము. సూర్యబింబమునందుఁ బ్రకాశము, ఉష్ణము, స్థితి, ఒకటిగ నుండి విభజింపఁబడక, యవినాభావసంబంధము కలిగియున్నట్లు, ఆత్మయందును, జ్ఞానేచ్ఛాక్రియాశక్తులు, వేరుగాక, యొకటిగ నవినాభావసంబంధముగ నున్నవని స్పష్టము.

త్రిపుటి - జ్ఞాతృజ్ఞానజ్ఞేయములు.

జ్ఞాత, జ్ఞానము, జ్ఞేయము.
Knower, Knowledge, Known.

జ్ఞాత తెలియువాఁడు; జ్ఞేయము తెలియఁబడుపదార్థము; జ్ఞానము పై రెంటికిని గల సంబంధము. జ్ఞాతృ-జ్ఞాన-జ్ఞేయముల స్వరూపముఁ దెలిసికొనుటకు మున్ను, జ్ఞానరూపమయిన ప్రజ్ఞాస్వరూపమును ఆత్మస్వరూపమునుఁ దెలిసికొనుట యావశ్యకము గనుక, అన్నింటికి నాధారమై యన్నింటిఁ బ్రకా

తెలియఁజేయును, స్వయంప్రకాశముగల యాత్మస్వరూపమును విచారింతము.

ఆత్మస్వరూపవిచారము (Self Consciousness.)

శ్లో. కిం జ్యోతిస్తవ? భానుమానహని మే రాత్రౌ ప్రదీపాదికం
స్యాదేవం రవిదీపదర్శనవిధౌ కిం జ్యోతి? రాఖ్యాహి మే,
చక్షుస్తస్య నిమీలనాదిసమయే కిం? ధీర్ధియో దర్శనే
కిం? తత్రాహ? మతో భవాన్పరమకం జ్యోతిస్తదస్మి ప్రభో.

ఏకశ్లోకి-వేదాంతశాస్త్రము.

ఆత్మజ్యోతిస్స్వరూపమును దెలుపు నీ శ్లోకముయొక్క తాత్పర్యము గురువు శిష్యునికి బోధించినటుల యీక్రింద వివరించఁబడుచున్నది.——

గురువు శిష్యుని కిట్లు ప్రశ్నించుచున్నాఁడు. నిజముగా నీ యాత్మ యనఁగ నేమి? నీ యాత్మ ఈ స్థూలశరీరమా? లేక బుద్ధియా? లేక యింద్రియములద్వారమున బాహ్యశబ్దాదివిషయములను గ్రహించుచు, సుఖదుఃఖముల ననుభవించుచు, నేను వినుచున్నాను, నేను తెలిసికొనుచున్నాను, నేను సుఖిని, నేను దుఃఖిని, యనుకొనెడి జ్ఞాతయా? ఈమూటిలో నేదియును నీ నిజమైన యాత్మ కానేరదు. ఏలన? ఇవి కాలత్రయమునందు మారుచుండునవి. కాలత్రయమునందబాధితముగా నుండెడిదియే సత్యము. ఇవి జలమందలి అలలవలె నొకప్పుడు ప్రతీతములై, మఱియొకప్పుడు వ్యభిచరించుచుండును. కావున

నివి సత్యములు కావు. ఈమూటికన్న విలక్షణమై యొప్పారు జ్ఞానము ఆత్మస్వరూపము (శుద్ధమైన తెలివి) నీలో నొకటి యున్నది అదియే నీనిజమైన యాత్మస్వరూపము. అదియే కాలత్రయమునందు సత్యమైనది.

లోకములోఁ బగలు పురుషుఁడు (కార్యకరణసంఘాతాత్మకుఁడు - Unit of consciousness) బాహ్యపదార్థములఁ దెలిసికొనును; క్షేత్రముల కేగి యచటఁ బనులు జేసికొని, యింటికి వచ్చి యిటునటు విహరించును; బంధువులతోఁ గలిసికొనును; దేశాంతరముల కేగును; మఱియు నితరములైన నానా వ్యవహారములు సలుపును. ఈవిధమున లోకవ్యవహారములన్నియు ఏదే నొక జ్యోతిః ప్రకాశ ముండునపుడే, ఇతఁడు సలుపఁగలఁడు గాని, కేవల తమస్సునందు సలుపఁజాలఁడు. కావునఁ బగలు ఈపురుషుఁడు ఏజ్యోతిః ప్రకాశముచే, నీ లోకవ్యవహారములు సలుపఁ గలుగునన్న, "నతనికి సూర్యుఁడే జ్యోతిస్సు; సూర్యప్రకాశము చేతనే స్వక్షేత్రగమనము,బంధు దర్శనము లోనగు సకలవ్యవహారములు సలుపఁగలుగు"నని నీవు పలికెదవు. అయితే ఆసూర్యుఁ డస్తమించును. అప్పుడే జ్యోతిః ప్రకాశముచే నీపురుషుఁడు వ్యవహరింపఁగలుగునన్నఁ, "జంద్రుఁడే యతనికి జ్యోతిస్సు; ఆచంద్రప్రకాశముచేతనే యన్నివ్యవహారములు చేసికొనఁ గలుగును" అని నీవనెదవు. అయితే ఆచంద్రుఁడును అస్తమించును. అవ్వేళ నీపురుషుఁడు ఏజ్యోతిస్సుచే నీపదార్థములఁ దెలిసికొనఁగలఁడన్న,"అగ్నియే

యతనికి జ్యోతి; అగ్ని చేతనే యతఁడు దీపమును వెలిఁగించు
కొని, యాదీపముచే సమస్తమునుఁ దెలిసికొనఁ గలుగును;
స్వగృహవ్యాపారముల నిర్వర్తించుకొనఁ గల్గును" అని నీవనె
దవు. సూర్యుఁడును, చంద్రుఁడును, అస్తమించును. అగ్ని
యును వర్షకాలమందు సంతతవృష్టిచేఁ బ్రజ్వలింపఁ జాలదు
గాలివలన దీపమును ఉండఁజాలదు. మేఘోదయముచే నక్ష
త్రకాంతియును లేక యంతట నంధకారము వ్యాపించియుం
డును. అవ్వేళ నీపురుషుఁడు తనహస్తమును తానే తెలిసి
కొనఁ జాలఁడు. అప్పు డీతనికేమి జ్యోతిస్సు? ఏజ్యోతిచే నీ
లోకవ్యవహారములు నలుపఁగలఁడన్న, "శబ్దమే అతనికిజ్యోతి.
ఒక శునకమైనఁగాని, యొక గర్దభమైనఁగాని యఱచును. ఆశబ్ద
ముచే శ్రోత్రేంద్రియము దీపింపఁబడి, దానిసంబంధముచే మన
స్సునం దిది శునకము, ఇది గార్దభము, అని వివేకజ్ఞానము
పుట్టును. అంత వానికడకుఁ బోయి, వాఁడు తాడనాదివ్యవ
హారములు సేయఁ గలుగును. ఇటుల బాహ్యగంధముచే
ఘ్రాణేంద్రియ మభివ్యంజితమయి, దానిసంబంధముచే మనస్సు
నందు ఇచట సుగంధద్రవ్యము కలదని వివేక ముదయించి,
దానిం గైకొని లేపనాదులఁ జేసికొనఁ గల్గు. ఇటుల ఆయా
గంధశబ్దాదివిషయములు శ్రోత్రాదీంద్రియములతో సంయో
గించుటవలన, మనస్సుచేతనే యాయావిషయములఁ దెలిసి
కొని,

శ్రు. "మనసా హ్యేవ పశ్యతి, మనసా శృణోతి."

యను శ్రుతిప్రమాణంబునఁ బురుషుఁడు లోకంబున వ్యవహ రింపఁ గల్గు''నని నీ వనెదవు. స్వప్నములోను జాగరమునందు వలె వీఁడు బంధుదర్శనము, తద్వియోగము, క్షేత్రాదిగమ నము, ఆగమనము మొదలగు సకలవ్యవహారములు సలుపును. సుషుప్తినుండి మేల్కాంచినతోడనే నేను సుఖముగా నిద్రిం చితి అయితే అచ్చట నాకేమియుఁ దెలియలేదు. "సుఖమహ మస్వాప్సం న కించిద వేదిషం" అని వాఁడు స్మరించును గావున, సుషుప్తిలోను సర్వవేదనాభావముఁ దెలిసికొనుచున్న వాఁడే. స్వప్నసుషుప్తులలో ఈసూర్యుఁడుగాని, ఈచంద్రుఁడుగాని, ఈనక్షత్రములుగాని, ఈదీపములుగాని, ఈశబ్దాదివిషయములు గాని యుండవు. జాగరమునందుఁ దనకంటె నతిరిక్తములైన సూర్యాదిజ్యోతిస్సులచే నీతఁడు బంధుమిత్రాదులఁ జూడఁ గలుగు; తెలిసికొనఁ గలుగు; సర్వలౌకికవ్యవహారములును సలుపఁగలుగు. కావున స్వప్నావస్థయందును బంధుమిత్రాదివిష యములఁ దెలిసికొన వీనికి (సంఘాతపురుషునికి) తనకంటె నతి రిక్తమైన జ్యోతియొకటి యుండవలెను. జాగరమునందు సమస్త జ్యోతిస్సులు ఈ దేహబుద్ధీంద్రియములకన్న వేఱుగాఁ గనఁ బడు. స్వప్నమందును ఏజ్యోతిచే వాఁడు పదార్థములఁ దెలిసి కొనుచుండునో, ఆజ్యోతి ఈదేహమునకన్న, నింద్రియముల కన్న, బుద్ధికన్న, వేఱుగా నుండునదియే కావలయు. ఈబాహ్య జ్యోతిస్సులనన్నింటి చక్షురాదీంద్రియములు తెలిసికొనఁ గలు గును. ఆయాంతరమైనజ్యోతిని (అతీంద్రియము గాన)చక్షురా

దీంద్రియములు తెలిసికొనఁజాలనిదై యున్నది. ఇయ్యది అభౌ
తికమనియు, బాహ్యభౌతిక జ్యోతిస్సులకన్న విలక్షణమైనదియు
నని మనము తెలిసికొనవలెను. స్వప్నములోను ఇతఁడు దేహాం
తరగమనాదిస్వరూపకము సంభవముండును గనుక, ఆ స్వప్నావ
స్థను వెలిగించున జ్యోతి, సర్వబాహ్యజ్యోతిస్సులు నశింపఁగా
మిగిలినదై భాసించుచుండెడిని. ఇందుచే ఆదిత్యాదిజ్యోతి
స్సులవలె దేహబుద్ధీంద్రియములకన్న నతిరిక్తముగా దేహేం
ద్రియములను భాసకముగా, అన్యజ్యోతిస్సులచే నవభాసింపఁ
జేయఁబడనిదిగా నీ యాత్మజ్యోతిని నీవు తెలిసికొనవలయును.
అదియే నీనిజమైన యాత్మజ్యోతి యనుచును భావింపఁదగిన
దగును. దీనినే వేదాంతులు సత్తు, చిత్తు, ఆనందము ననియుఁ
జెప్పుదురు. సత్తు అనఁగా కాలత్రయమునందు బాధింపఁబడక
సత్యముగా నుండునది. (Existence.)

చిత్తు అనఁగా, తాను అన్యముచేఁ దెలిసికొనఁబడనిదైయు,
తనసంబంధముచే నితరములను దెలిసికొను సమర్థములనుగఁ
జేయునది. (Consciousness-will) ఆనందమనఁగ నిరతిశయ
సుఖము (Bliss). ఈ సచ్చిదానందములు మూఁడును, అవినా
భావసంబంధముగ నేకముగ నుండునవియే యాత్మ యనఁబడు.
సూర్యునియందు బింబము, ప్రకాశము, ఉష్ణము, ఈమూఁడును
వేఱుగనుండక యొకటిగ నుండినట్లు ఆత్మయందును, సచ్చిదా
నందము లొకటిగ నుండు. ఆ స్వప్నపురుషస్వరూపాకారాను

మేయమైన జ్యోతియే శుద్ధమైన తెలివిరూపము. ఇదియే స్వయంప్రకాశము. అగ్నిసంబంధముచే లోహము ఇతర పదార్థములను దహింపఁ జేయఁగలిగెడిరీతిని, దీనిసంబంధము చేతనే బుద్ధీంద్రియాదులు స్వస్వవిషయములఁ దెలిసికొన సమర్థము లగుచుండును.. కాని అవి స్వతంత్రముగ విషయములఁ దెలిసికొనఁ జాలవు. కావున ఈస్థూలశరీరము నీవు కావు. ఈబుద్ధియు నీవు కావు. ఈ విషయానుభవముఁ జేయు జ్ఞాతయు నీవు కావు. స్వప్నమున సంఘాతపురుషవ్యవహారముచే నను మేయమును స్వయంప్రకాశమును అయిన జ్యోతియే నీవు. జాగ్రదవస్థయందు నీనిజమైన స్వయంప్రకాశ స్వరూపము నీ వెఱుఁగఁ జాలవు. ఎందుకనిన? అప్పు డీసంఘాతాత్మకమైనజ్ఞాత బాహ్యములును తనకంటె నన్యములైన ఆదిత్యాదిజ్యోతిస్సులచేఁ బ్రకాశింపఁ జేయఁబడుచుఁ, బదార్థములఁ దెలిసికొనుచుండునని తలఁచుచుండెడిని. కావునఁ దనను ప్రకాశింపఁజేసెడి యితర సూర్యాదిజ్యోతిస్సు లుండువేళ వేఱుగా వివేకముచేఁ దనను స్వయంప్రకాశరూపునిగఁ దెలిసికొన సమర్థుఁడు కాఁజాలఁడు. స్వప్నమందయితే, బాహ్యములైన ఆదిత్యాదిజ్యోతిస్సు లుండవు కావునఁ దనను స్వయంప్రకాశునిగా వివేకముతోఁ దెలిసికొన సమర్థుఁడు కాఁజాలును. గనుకనే శ్రు. "అత్రాయం పురుషః స్వయం జ్యోతిరితి." అనుశ్రుతియును, స్వప్నమందే నిరతిశయస్వయం జ్యోతిష్ట్వము చూపుచున్నది.

ఆత్మస్వరూపలక్షణము.

ఆత్మస్వరూపమును గుఱించి శ్రీ శంకరభగవత్పాదులు వివేకచూడామణి యను గ్రంథమున నీవిధంబున నిర్వచించి యున్నారు:—

శ్లో. సోఽయమాత్మా పరంజ్యోతిః పంచకోశవిలక్షణః,
అవస్థాత్రయసాక్షీ సన్ నిర్వికారో నిరంజనః,
సదానందః స విజ్ఞేయః స్వాత్మత్వేన విపశ్చితా.

వివేకచూడామణి.

ఎవఁడు పంచకోశములకు విలక్షణుఁడై స్వయంప్రకాశమానుఁడో, ఎవఁడు అవస్థాత్రయమునకు సాక్షియై వికారములులేని జ్ఞానానందఘనుఁడై నిరంజనుఁడో, ఎవఁడు నిస్సంగుఁడో, ఎవఁడు నిత్యానందుఁడో, అట్టివాఁడు తన యాత్మయగునట్లుగా బుద్ధిమంతునిచేఁ దెలియఁదగినది. మఱియు,

శ్లో. జాగ్రత్స్వప్నసుషుప్తిషు స్ఫుటతరం యోఽసౌ సముజ్జృంభతే
ప్రత్యగ్రూపతయా సదాహమహమిత్యంతః స్ఫురన్నేకధా,
నానాకారవికారభాగిన ఇమాన్ పశ్యన్నహంధీముఖాన్
నిత్యానందచిదాత్మనా స్ఫురతి తం విద్ధి స్వమేతం హృది.

వివేకచూడామణి.

జాగ్రత్స్వప్నసుషుప్త్యవస్థలయందు స్ఫుటముగ నెవఁడు అంతరంగమున నున్నాఁడో? ఎవఁడు పరంజ్యోతిస్స్వరూపముచే నెల్లప్పుడు "నేను నేను" అని లోపల వెలుఁగుచు, బహువిధ వికారరూపములను బొందిన బుద్ధ్యహంభావము మొద

లుగాఁ గలవానినిఁ జూచువాఁడై, సత్యజ్ఞానానందస్వరూప
ముచే హృదయమందుఁ బ్రకాశించుచున్నాఁడో, అట్టివాని
యాత్మగాఁ దెలిసికొనుమని తాత్పర్యము.

శ్లో. ఘటోదకే బింబితమర్కబింబ
మాలోక్య మూఢో రవిమేవ మన్యతే,
తథా చిదాభాస ముపాధిసంస్థం
భ్రాంత్యాఽహమిత్యేవ జడోఽభిమన్యతే.

వివేకచూడామణి.

ఏప్రకారము ఘటములోనినీటియందుఁ బ్రతిఫలించిన
సూర్యబింబమును మూర్ఖుఁడు చూచి, సూర్యునిఁగనే తలఁ
చునో, ఆలాగుననే జడుఁడు ఉపాధియందుండు జీవుని
భ్రాంతిచే నాత్మయని యూహించుచున్నాఁడు.

శ్లో. ఘటం జలం తద్గతమర్కబింబం
విహాయ సర్వం వినిరీక్ష్యతేఽర్కః,
తటస్థ ఏతత్త్రితయావభాసక
స్స్వయంప్రకాశో విదుషా యథా యథా.

వివేకచూడామణి.

ఏరీతి సూర్యుఁడు ఘటమును, దానియందుండు జల
మును, దానియందుండు నిజప్రతిబింబమును విడిచి, జిజ్ఞాసు
వుచేఁ జూడఁబడుచున్నాఁడో, ఆరీతి దేహము, బుద్ధి, ఆబుద్ధి
యందుఁ బ్రతిఫలించిన చిదాభాసుఁడు నగు నీమూఁటినిఁ
బ్రకాశింపఁజేయువాఁడును, సాక్షిస్వరూపుఁడును నగు స్వయం
జ్యోతియైన పరమాత్మ జ్ఞానిచేఁ జూడఁబడుచున్నాఁడు.

కాలత్రయమందు మార్పుఁజెందక నిత్యుఁడైనట్టియు, నిర్వి కారుఁడైనట్టియు, చిత్స్వరూపుఁడు నగు పరమాత్మకును మిగుల భేదము కలదు. ఘటోదకప్రతిబింబితమగు సూర్య బింబమునుఁ జూచి సూర్యుఁడనియు, అగ్నితప్తమగు నయః పిండమును గాంచి అగ్నియనియు, మూఢుఁడు, భ్రాంతిఁజెంది నట్లు, చిత్ప్రకాశితములగు పంచకోశములను గని, యాత్మయని భ్రమఁజెందుచున్నవాఁడు.

ఆత్మ, అన్నమయకోశమునకన్న విలక్షణత్వము.

Physical Sheath.

మాతాపితృశుక్లశోణితసముద్భవమై, అన్నాది రసము లచే వృద్ధిఁబొంది, త్వఙ్మాంసమేదోమజ్జాస్థిపురీషసముదాయ స్వరూపమై, జడమై, ఉత్పత్తి, అభివృద్ధి, పరిణామ, అపక్షీణ, వినాశము, లోనగు షడ్భావవికారములను జెంది, హేయ మయినట్టి అన్నమయకోశము నిత్యమై నిర్వికారమై ప్రకా శించు సత్యజ్ఞానానందస్వరూపమగునాత్మ కాఁజాలదు. దేహాత్మ వాదులు కొందఱు, శరీరము జీర్ణమైన ఆత్మ జీర్ణమగుననియు, శరీరము నశించిన ఆత్మ నశించుననియు, నవివేకముచేఁ దలం తురు. ఘటోదకప్రతిబింబములకు నుపాధులగు ఘటములు నశించినను, బింబభూతమగు సూర్యుఁడు నశింపనట్టులను, ఉపాధులగు ఘట, పట, మఠ, కుడ్యాదులు నశించినను, దాని యందు లోపల వెలుపల వ్యాపించిన యాకాశము నశింప

నట్టులను, ఉపాధులగు నన్నమయాదికోశములు నశించినను, ఆత్మ నిత్యమై, అవ్యయమై ప్రకాశించుచుండు.

ప్రాణమయకోశమునకన్న విలక్షణత్వము. Vital Sheath.

ఏవాయువు దేహమందు పాదము మొదలుకొని శిరస్సు పర్యంత మంతట వ్యానరూపముచే వ్యాపించి, దేహమునకు బలము నిచ్చుచు, చక్షురాదీంద్రియములనుఁ బ్రేరేపించు చున్నదో, వెలుపలికి, లోపలికి వచ్చుచుఁ బోవుచు దేహధారణ గావించుచున్నదియో, యది ప్రాణమయకోశమని చెప్పఁబడును. ఈప్రాణవాయువు చైతన్యము గాక, జడస్వభావము గలిగియుండుటచే, ఘటాదులవలెఁ దెలియఁబడుచున్నది కాన, ఆత్మ కానేరదు. దేహప్రాణాదులు వేద్యములు. ఆత్మ వేత్త. దేహప్రాణాదిధర్మములు ఆత్మచేఁ దెలిసికొనఁబడు చున్నవి కాని, ఆత్మ వానిచేఁ దెలియఁబడుట లేదు. కాఁబట్టి, ఆత్మ చైతన్యస్వరూపంబును, దేహప్రాణాదులు జడంబులని యెఱుంగునది. దేహధర్మములు జరామృతులు, ప్రాణధర్మములు క్షుత్పిపాసలని తత్త్వశాస్త్రమునఁ గలదు.

మనోమయకోశమునకన్న విలక్షణత్వము Mental Sheath.

దేహమందు నేననెడి భావంబును, గృహాదులయందు నాది యనెడి యభిమానంబును గల మనస్సు, మనోమయకోశ మనఁబడు. శ్రోత్రత్వక్చక్షుజిహ్వాఘ్రాణంబులను జ్ఞానేంద్రియ పంచకముతోడను, వీని కధిష్ఠానమైన మనస్సుతోడనుఁ గూడిన

మనోమయకోశము ప్రాణమయకోశము నంతటనుఁ బూరించి, కామక్రోధరాగద్వేషాది సంకల్పవికల్పవృత్తులను గలిగి నియత రూపము లేక, వికారభావములను బొందుటవలన, దేహాదులు వలె జడముగాని, చైతన్యస్వరూపమగునాత్మ కానేరదు. మనో వికారములును, రాగద్వేషాదివృత్తులును, ఆత్మచేఁ దెలిసి కొనఁబడుచున్నవి కాని, అయ్యవి యాత్మనుఁ దెలిసికొనుట లేదు. చిత్సాన్నిధ్యబలంబున మనస్సునకు శక్తి కలదుగాని, స్వయముగ మనస్సు జడమని యెఱుంగవలయు. మఱియు, శ్రు. "అన్నమయం హి సోమ్య మనః." మనము భుజించిన యన్నములోని సూక్ష్మాంశమువలన మన స్సభివృద్ధిఁ జెంది, సంకోచవికాసములచేఁ బ్రకాశించుచుండు. తైలాధారము వలన దీపము వెలుంగుచు, తైలము తగ్గుకొలఁదిని ప్రకాశము తగ్గినవిధంబున, అన్నరసము లేనిచో మనస్సు వికాసముఁ జెం దక లీనమైయుండును కాఁబట్టి, అన్నసారసూక్ష్మాంశమయినది మనస్సని శ్రుతి నుడువుచున్నది.

విజ్ఞానమయకోశమునకన్న విలక్షణత్వము
Supra mental Sheath.

చిదాభాసునితోఁ గూడిన బుద్ధి, సుషుప్తికాలమందు లయించుచు, జాగరితకాలమందుఁ బాదము మొదలు శిరస్సు వఱకు శరీరమును విశేషముగ వ్యాపించి వర్తించుచు, విజ్ఞాన మయకోశమనఁబడు. ఈవిజ్ఞానమయకోశము జ్ఞానేంద్రియపం చకముతోఁ గూడి, మనోమయకోశము నంతటఁ బూరించి,

కర్తృత్వాభిమానముగలిగి దేహేంద్రియములయందు నేనని తలంచుటయు, నానావిధప్రవృత్తి కారణములును, సుఖదుఃఖాదుల ననుభవించుచున్నందున జీవాత్మ నా నేనను. బుద్ధివృత్తు లన్నియును నాత్మచేఁ దెలియఁబడుచున్నవి కాని, ఆయ్యవి యాత్మను దెలిసికొనుట లేదు.

మనోమయ ముక్తస్వరూపముగనే యెఱుఁగుటచేఁ దెలిసి కొనుచుండుటయు; సంకల్పించుచుండుటయు; వినుచుండుటయు; చూచు చుండుటయు యాతఁడే స్వరూపముగ విజ్ఞానముగలెస్సగు ప్రత్యక్ష ముగఁ గన్పించుచున్నది. దాని జ్ఞానము నిస్పృహాదియును, దానివిశిష్ట సర్వజ్ఞమయుక్తమును, మేఘమెట్లు ప్రత్యక్షముగఁ బొందఁబడుట లేదు. యాతఁడే స్వరూపముగనే స్వప్నముందును మేల్కొనుట యెఱుఁగుచు నిద్రించుచుండుటను. దాని నెఱుఁగు నతఁడి కర్తను ప్రత్యక్షముగనే నేనుగా నెఱుఁగు బోధాననులే కదా. యాతఁడే యాత్మయని యుంటిమేని, అట్టియనటుల దాని యెఱుక, ప్రత్యక్షప్రమాణము, ఏవిధముననుసు, లోకములందుండుట లేదు. యట్లయిన స్వభావధర్మ మూ, యయ్యది దానిని విడువలేదు. యెన్నఁడుఁ బ్రకాశము స్వభావధర్మముగల సూర్యుఁడు దాని స్వభావమును విడిచిపెట్టునా? విడిచిపెట్టఁడు. బుద్ధియొక్క వృత్తులను దీసికొని, దానిగుణ ములగుటను, స్వరూపమునను మఱచియుండక, నశింపఁజేయఁ గలుగునా? యనిన ఏవిధానము చేతను, ఇంపిడి జేసినను, దానిగుణములను విడనాడదు. కనుక, స్వభావధర్మమునను నేమనస్థితుండును సదాయును సంభవింపనేరదు.

శ్లో. నహి స్వభావో భావానాం వ్యావర్త్యేతౌష్ణవద్రవేః.

న్యాయశాస్త్రము.

అను ప్రమాణముచొప్పున, సూర్యునకు స్వభావధర్మములగు ఉష్ణప్రకాశము లాసూర్యుని నెడఁబాయనివిధంబున, లోకంబునను వస్తువులయొక్క స్వభావధర్మము లావస్తువునుండి యెప్పటికి వేఱుపఱుపఁబడఁజాలవు.

బుద్ధికి చైతన్యము (స్వయముగ విషయములఁ దెలిసికొను తెలివి) స్వభావగుణమైనచో, అయ్యది దానియందు నన్ని వేళలయందును, అన్నియవస్థలయందు నేమార్పును జెందక, దానిని వదలకయే యుండవలెను. మనము క్లొంచెము (Chloroform) మత్తుమందు నాఘ్రాణించితిమేని, తత్క్షణమే బుద్ధికుండెడి తెలివి లోపించిపోవును. ఆగంతుకగుణములు లోపించును. కాని స్వభావగుణములు లోపించుట ప్రత్యక్ష ప్రమాణమునకు విరుద్ధము. అన్నోపయోగముచే మనస్సునకు స్వవిషయప్రకాశనసామర్థ్యంబును, అన్నోపయోగము లేకపోవుటచే, విషయప్రకాశనసామర్థ్యము లేకపోవుటయునుఁ జూచుచున్నారము. అటుల, బుద్ధికిని ప్రకాశాప్రకాశము లు గలవు.

స్వభావధర్మమునకు దృష్టాంతములు.

యువకుని (వయోవంతుని) బుద్ధియందుండు చుఱుకుఁదనమును, దెలివియు,వృద్ధునిబుద్ధియందుఁ గనఁబడునా? కావున, బుద్ధికి విషయములఁ దెలిసికొనుబోధనము, స్వభావసిద్ధమయిన

ధర్మము కానేరదు. స్వభావమునకు వృద్ధిక్షయములుగాని, యొకప్పు డుండుటకు, వేఱొకప్పు డుండకపోవుటయుఁ గాని సంభవింపవు. కావున, ఆబోధ మన్యపదార్థమునుండియే కలుగుచున్నది యని మనము తెలిసికొనవలయును. అగ్నితప్తమయిన యుదకమునందు ప్రేలి నుంచితిమేని, ఆయుదకము దానిని దహించును. ఆదహనశక్తి యగ్నివలన దానికిఁ గలిగినదియా? లేక, దానికి స్వభావగుణమా? స్వభావముచే నుదకము శీతస్పర్శ గలిగియుండును. కావున నాజలమునందలి దహనశక్తి జలమునకు స్వభావధర్మము కానేరదు. ఆయుష్ణాది యగ్నికి కావున నగ్నికి స్వభావధర్మములయినవి. ఆజలమందలి యౌష్ణ్యమునకు నొకప్పుడు వృద్ధియు, నొకప్పుడు క్షయముఁ గలవు. స్వభావధర్మమునకు నట్టి మార్పులు లేకుండును. ఈ హేతువులచే జలము స్వభావముగ నుష్ణము కాదని మనకు స్పష్టము. అట్లు బుద్ధియందలి బోధ యొకసమయమున నుదయించుటయు, వేఱొకసమయమున నశించుటయు ననుభవసిద్ధము కావున, బుద్ధికి స్వభావముచేత బోధ లేదనియు, జడమనియు, మనము గ్రహించితిమి. కాబట్టి, బుద్ధికి దెలివినిచ్చునది, వేఱొకటి యుండవలెను. అదియే యగ్నివలె స్వయంప్రకాశము కావలయును. ఈబుద్ధి స్వయంప్రకాశము కానేరదు. స్వయంప్రకాశమయినది యగ్నివలె నెప్పుడు నేకరీతిగానే యుండవలయును. ఈబుద్ధి యట్టుల లేదు గావున, దీనికిఁ

ప్రకాశమునిచ్చెడిదే శుద్ధచైతన్యము. అదియే యాత్మ యని భావింపవలయు.

ఆత్మయే "విజ్ఞానమని" విజ్ఞానవాదులమతము.

అయ్యది బుద్ధికంటె విలక్షణమైనదయినను, దానికంటె వేఱుగా నొఱలోనుండు కత్తివలె వివేకముచేఁ దెలిసికొనన సాధ్యమైయుండు. ఏలయనిన? మరకతమణి నొకదానినిఁ బరిశుద్ధము క్షీరమందుంచితిమేని, ఆమణి యాపాలను దన ఛ్ఛాయఁగలవానినిగాఁ జేయును. అటుల స్వయంప్రకాశ మయిన చైతన్యజ్యోతియు బుద్ధియందు వ్యాపించి, దానిని దన చ్ఛాయగలదానినిగఁ జేయును. మన మొక కుండలో నీళ్లు పోసి, దానినిఁ బొయ్యిమీద నుంచి, క్రింద నగ్ని ప్రజ్వలింపఁ జేసితిమేని, అప్పుడు దానియౌష్ణ్యము మొట్టమొదటఁ దనకు నవ్యవహితమైన ఘటమందు సంక్రమించి, పిమ్మట నాఘటసంపర్కమువలన నయ్యది నీటియందు సంక్రమించును. అప్పు డానీరే యుష్ణరూపమై కాల్పఁగలిగెడిని. అటుల బుద్ధియు, మిక్కిలి స్వచ్ఛమయిన పదార్థము. అయ్యది యాత్మకానంతర్యమైనది గనుక, చైతన్యజ్యోతి మొట్టమొదట బుద్ధియందే వ్యాపించును. (ప్రతిఫలించును). అప్పుడు బుద్ధి విజ్ఞానరూపమై తెలిసికొనఁ గలుగును. స్వచ్ఛాయాపత్తినిఁ జెందినక్షీరములకంటె, మరకతము వేఱుగాఁ దెలిసికొన సాధ్యము కానటుల, చైతన్యచ్ఛాయనుఁ బొందిన బుద్ధికంటెఁ జైతన్యమును వేఱుగాఁ

నికొన మేధావులకును, సాధ్యముకానిదై యున్నది. మ చేతనే మేధావులను బుద్ధియందే యాత్మాభిమానము [illegible] తాను సభిమానము) లోకప్రసిద్ధమైనది. [illegible] డు వ్యాపించిన [illegible]త్వమును, [illegible] కొలుగా [illegible] విజ్ఞాన[illegible]ను, సూ. “[illegible] విజ్ఞాన మాత్రేతి [illegible]” [illegible] [illegible] [illegible] బుద్ధియే యాత్మ [illegible].

తార్కికప్రాభాకరమతము.

తార్కికప్రాభాకరులును, [illegible] [illegible] [illegible] [illegible] [illegible] త్వము పుట్టును. [illegible] [illegible] [illegible] [illegible] ము [illegible] [illegible] ములు [illegible] వెలసకొన గలుగు [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] ంధము లేకపోవును. [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible], [illegible], [illegible].

భాట్టసర్వజ్ఞమతము.

“ప్రకాశాప్రకాశస్వరూప [illegible]త్మేతి” భాట్టసర్వజ్ఞ [illegible] జ్ఞులును, ఆత్మ జాగరమున [illegible] గలుగుట్టు నిజమునుఁ

దెలిసికొనుచుండును. సుషుప్తియందుఁ దెలివిలేనిదియై జడభావముచే భాసించుచుండును. కావున ఆత్మ ఖద్యోతమువలెఁ బ్రకాశాప్రకాశస్వరూపము గలదైనందున, జడబోధమని భ్రమఁ జెందిరి.

పాతంజలిమతము.

సూ. ద్రష్టాదృశిమాత్రః శుద్ధోఽపి ప్రత్యయానుపశ్యః.

పతంజలిః.

సాంఖ్యపాతంజలులు మాత్రము, బుద్ధి బోధల వివేకముచేఁ దెలిసికొని, బోధమాత్రమే యాత్మ, బుద్ధి జడము అని వచించిరి.

"అపరిణామినీ హి భోక్తృశక్తిః, అప్రతిసంక్రమా చ, పరిణామిన్యర్థే. ప్రతిసంక్రాంతేవ, తద్వృత్తిమనుపతతి, తస్యాశ్చ ప్రాప్తచైతన్యోపగ్రహరూపాయాః బుద్ధివృత్తేరనుకారమాత్రతయా బుద్ధివృత్త్యవిశిష్టా హి జ్ఞానవృత్తిరితి. పంచశిఖః."

ఈయాత్మతత్త్వ మతీంద్రియము గావున, తత్త్వజ్ఞులనేకులు దీనిని యథార్థముగఁ దెలిసికొనఁజాలక మోహముఁ జెందియుండిరి.

ఆనందమయకోశమునకన్న విలక్షణత్వము.

(Sensual Body)

పుణ్యకర్మఫలానుభవకాలమందొకానొకప్పుడు, బుద్ధివృత్తి బాహ్యభావమును విడిపించి, యంతర్ముఖముఁ గలది

యగుచు నాత్మస్వరూపమగు నానందబింబముయొక్క ప్రతిబింబమునుఁ బొందుచున్నది. ఆవృత్తియే పుణ్యకర్మఫలభోగము క్షయించినతోడనే నిద్రారూపముగ లీనమగుచున్నది. అట్టివృత్తియే ఆనందమయమని చెప్పఁబడు. ప్రియ, మోద, ప్రమోదములను సుఖవిశేషవృత్తులు గలిగి, మూలాజ్ఞానమునకుఁ గారణమయి, ప్రకృతివికారము గలిగి, యానందప్రతిబింబమునుఁ బొందిన దగుటచే నెల్లప్రాణులు దేనియందు మైమఱచి యతిశయసుఖమునుఁ జెందుదురో, అయ్యది ఆనందమయకోశ మనఁబడు. ఇష్టవస్తువునుఁ జూచుటచేఁ గలిగిన సంతోషము ప్రియమనియు, ఆయిష్టవస్తువు లభించుటచేఁ గలిగిన సంతోషము మోదమనియు, ఆయిష్టవస్తువు ననుభవించుటవలనఁ గలిగెడిసంతోషము ప్రమోదమనియుఁ జెప్పఁబడును. ఈయానందమయకోశ మాత్మకు మిగుల సన్నిధానమగుటవలనఁ బ్రతిబింబముచే తాదాత్మ్యస్థితిఁ జెందును. ఈయానందమయకోశము అజ్ఞానమునకుఁ బ్రధానకారణమగుటవలనను, ప్రకృతివికారములనుఁ జెందుటవలనను, అంతఃకరణోపాధిసహిత మగుటవలనను, సుషుప్తియందుఁ బూర్ణసుఖమును, స్వప్నజాగరితావస్థలయం దించుకసుఖమును గలదియగుటవలనను, నిరుపాధికుఁడును, నిర్వికారుఁడును, నిరంజనుఁడును, నిరతిశయానందస్వరూపియు నగు నాత్మ కాఁజాలదు.

చైతన్యజ్యోతి సర్వవ్యాపకము. (Self Consciousness.)

ఆత్మస్వరూపమగు చైతన్యజ్యోతి సర్వాంతరమయినది. దానికి మొట్టమొదట బుద్ధియందే ప్రతిఫలనము. మనస్సు బుద్ధి కంటె స్థూలమును, అనంతరమందు నుండెడిది గనుక, మనస్సునందు బుద్ధిసంసర్గచేతనే చైతన్యముయొక్క యవభాసత (ప్రకాశము) కలిగెడిని. పిమ్మట దానికంటె స్థూలమును, అనంతరమునందు నుండెడివియుఁ గనుక యింద్రియములయందు నామనస్సంయోగమువలననే చైతన్యప్రకాశము గలిగెడిని. పిమ్మట వానికంటె స్థూలమును, ఆనంతర్యమైనదియు గనుక శరీరమందు నాయింద్రియసంబంధముచేతనే చైతన్యావభాసత కలిగెడిని. ఈప్రకారము చైతన్యజ్యోతి పరంపరగ బుద్ధి, మనస్సు, ఇంద్రియములు, శరీరము, వీనియందు స్థూలసూక్ష్మ తారతమ్యవిధమున వ్యాపించియుండుటచే, నాబుద్ధీంద్రియాదులు చైతన్యశక్తి కలిగి యాత్మగ వ్యవహరింపఁబడును. బుద్ధి తత్త్వము ఆత్మజ్యోతికి సన్నిధానమున నుండుటచే నెక్కువ తీవ్రతయు, చుఱుకుఁదనము గలిగియుండు. అటనుండి చైతన్య జ్యోతి ప్రసరించుటచే నాయాతత్త్వముల కనుగుణంబుగ శక్తి గలిగియుండు. ఒకచోట నుంచిన తేజఃపుంజము క్రమ క్రమముగా నావరణములచే, తీక్ష్ణత ప్రకాశము తగ్గువిధంబున, పంచకోశములయందునుఁ బ్రసరించు చైతన్యజ్యోతి క్రమక్రమముగ తీక్ష్ణత తగ్గియుండును. ఇట్టి ప్రకాశప్రసరణా

తీక్ష్ణస్థితి, ఉపాధిని బట్టి యుండునుగాని జ్యోతియం దుండ నేరదు.

దేహేంద్రియపంచకోశాదులు ఆత్మ నావరించుట.

సూర్యునివలనఁ గలిగిన మేఘపఙ్క్తి సూర్యుని నావరించినట్లుగను, అగ్నివలనఁ బుట్టిన ధూమము అగ్నినిఁ గప్పిన విధంబునను, దిగుడుబావియందు జలములఁ బుట్టిన నాచు తీఁగె, పాచి, జలములఁ గన్పడనీయక కప్పివేసినచందంబునను, ఆత్మశక్తివలనఁ గలిగిన పంచకోశములు ఆత్మ నావరించి కనుపడనీయకపోవును. అంతట వ్యాపించియుండిన చైతన్యజ్యోతి దేహేంద్రియాదిసంఘాతముచే నావృతమైనదానివలెఁ గనపడును. పారమార్థికమునఁ బరమాత్మ పంచకోశములకు విలక్షణుఁడై, వానివ్యాపారములకు సాక్షియై, నిస్సంగుఁడై ప్రకాశించుచున్నవాఁడు. ఇట్లు చైతన్యజ్యోతిరూపి యగునాత్మకుఁ బంచకోశవైలక్షణ్యమునుఁ జూపి శరీరత్రయవిలక్షణత్వమునుఁ జూపుచున్నారు.

ఆత్మ శరీరత్రయవిలక్షణము.

స్థూలము, సూక్ష్మము, కారణము, అని శరీరములు మూఁడు. అన్నమయకోశము స్థూలశరీరమనియుఁ, బ్రాణమయ, మనోమయ, విజ్ఞానమయకోశములు సూక్ష్మశరీరమనియు, ఆనందమయకోశము కారణశరీర మనియుఁ జెప్పఁబడును. ఇట్లు

పంచకోశములును మూఁడుశరీరములయం దంతర్భవించి యున్నవి.

ఆత్మానాత్మవివేకము.

శరీరము జడమైనందున అనాత్మ, చైతన్యజ్యోతి స్వయం ప్రకాశమై నిత్యమైనందున ఆత్మ; అనృత జడ దుఃఖములు, అనాత్మయగు శరీరధర్మములు. సత్తు, చిత్తు, ఆనందములు, చైతన్యజ్యోతియగు నాత్మ ధర్మములు. తేజస్సునకుఁ దిమిరమునకు నెంత భేదముకలదో, అంత భేదము ఆత్మకు ననాత్మకుఁ గలదు. అనాత్మయు జడము నగు శరీరధర్మములు. పొడుగు, పొట్టి, లావు, కుఱుచ, పెరుగుట, క్షీణించుట, పుట్టుట, గిట్టుట, గ్రుడ్డి, కుంటి, అవిటి, చెవిటి, మూఁగ లోనగునవియు, నామరూప గోత్రసూత్రాదులు ఆత్మయందును, ఆత్మధర్మములగు (సచ్చిదానందములు.) అస్తి, భాతి, ప్రియములు, అనాత్మయందును, ఆరోపితము లగుటవలన, నవివేకు లాత్మజ్ఞానము లేక భ్రాంతి జెందుచున్నారు. నేను పొట్టివాఁడను, పొడుగువాఁడను, నేను పెఱుగుచున్నాను, కృశించుచున్నాను, కుంటివాఁడను, గ్రుడ్డివాఁడను, సోమదత్తుఁడను, భారద్వాజసగోత్రుఁడ నని లోకమందు వ్యవహరించుచున్నారు. ఈ పొడుగు, పొట్టి, కుఱుచ, గ్రుడ్డి, కుంటి, పెరుగుట, విరుగుట మొదలగునవి స్థూలదేహధర్మముగాని, నిర్వికారుఁడును, నిరాకారుఁడును, నిస్సంగుఁడు, అవ్యయుఁడును, నిత్యుఁడును, సచ్చిదానందస్వరూపుఁ

డును నగు నాత్మధర్మములు కాఁజాలవు. నాశరీరము కలదు. నా శరీరము ప్రకాశించుచున్నది. నాశరీరము ప్రియమైనది యను లోకప్రతీతివలన, ఆత్మధర్మములగు కలిమి, ప్రకాశము, ప్రియము, ఇవి అనాత్మయగు శరీరమం దారోపింపఁబడుచున్నవి. అనృతజడదుఃఖస్వరూపమగు శరీరమునకు అస్తి, భాతి, ప్రియములను ఆత్మధర్మములు లేవు. ఇవ్విషయంబునే శ్రీశంకరాచార్యులువారుస్వకృత సర్వవేదాంతసిద్ధాంతసంగ్రహమునం దీక్రిందివిధంబునఁ జెప్పియున్నవారు.

శ్లో. అస్మిన్నాత్మన్యనాత్మత్వ మనాత్మన్యాత్మతాం పునః,
విపరీతతయాఽధ్యస్య సంసరంతి విమోహతః.
భ్రాంత్యా మనుష్యోఽహమహం ద్విజోఽహం
తజ్ఞోఽహమజ్ఞోఽహమతీవ పాపీ,
భ్రష్టోఽస్మి శిష్టోఽస్మి సుఖీ చ దుఃఖీ
త్యేవం విముహ్యాత్మని కల్పయంతి.

సాదృశ్యముచే (సమానధర్మము గలిగియుండుట) ముత్తెపుచిప్పయందు వెండియనియు, త్రాటియందు సర్పమనియు భ్రాంతి గలిగినట్లు ఆత్మయం దనాత్మధర్మములను, అనాత్మయం దాత్మధర్మములను ఆరోపించి, యవివేకులు జననజరామరణ ప్రవాహరూపసంసారమునందుఁ జిక్కి భ్రమించుచున్నారు. ఇదియే అన్యోన్యాధ్యాసమని చెప్పఁబడుట. ఈయధ్యాసము వలననే (భ్రాంతి) సర్వానర్థములు గలుగుచున్నవి. నేను మనుష్యుఁడను, నేను బ్రాహ్మణుఁడను, తెలిసినవాఁడను, తెలియని

వాఁడను, కడునికృష్టుఁడను, భ్రష్టుఁడను, సదాచారసంపన్నుఁడను, సుఖవంతుఁడను, దుఃఖవంతుఁడనని, సచ్చిదానంద స్వరూపుఁడును, నిర్వికారుఁడును, నిరాకారుఁడునునగు నాత్మయందు జడదుఃఖానృతస్వరూపమును అనాత్మయు నగు శరీర ధర్మములను ఆరోపించి భ్రాంతిఁజెందుచున్నారని పై శ్లోక తాత్పర్యము.

ఆత్మానాత్మవివేకముచే స్థూలశరీరధర్మములగు పొడుగు, పొట్టి, కుఱుచ, పెరుగుట, కృశించుట, కుంటి, గ్రుడ్డి లోనగు వానిని, నిర్వికారుఁడును, నిత్యుఁడును, నిస్సంగుఁడు నగు నాత్మయం దారోపింపక, శరీరధర్మములు అనృతజడదుఃఖము లనియు, ఆత్మధర్మములు అస్తి భాతి ప్రియము లనియుఁ దెలిసి కొని, యీశరీరమునకన్న నాత్మ విలక్షణుఁడని శాస్త్రయుక్త్యను భవములచేఁ జూచువారికి భ్రాంతిజన్యజ్ఞానము తొలఁగి, స్వరూపానందము కలుగును.

ఆత్మకు శరీరత్రయవిలక్షణత్వము.

స్థూలదేహధర్మములగు పొడుగు, పొట్టి, కుంటి, గ్రుడ్డి, పెరుగుట లోనగువానిని, ఆత్మయందు నారోపింపక తొలఁగించినట్లుగనే, సూక్ష్మదేహధర్మములగు సంశయము, సంకల్పము, వికల్పము, ఊహాపోహ, లోనగువానినిన్ని కారణ దేహధర్మములగు భోక్తృత్వ, ప్రియత్వ, ముదితత్వాదుల నున్ను, తొలఁగింపవలయును.

తనను తాను దెలిసికొనుట.

మఱియును, లోకంబున నాదేహము, నాప్రాణము, నామనస్సు, నాబుద్ధి, నాయానందము, నాకన్ను, నాకాలు, నాగృహము, నాక్షేత్రము, నావాహనమునని వ్యవహరించుట వలన, తనయొక్క దేహమనియు, తనయొక్క ప్రాణమనియుఁ దేలుచున్నది. దీనివలన, తాను వేఱనియు, తన ప్రాణము వేఱనియు, తనమనస్సు వేఱనియు, నిట్లే చక్షుశ్శ్రోత్రాదులు వేఱనియు స్పష్టమగుచున్నది. నేను దేహము, నేను ప్రాణము, నేను మనస్సు, నేను కన్ను, నేను ఇల్లు,అని చెప్పుట వ్యవహారములో లేనందువలన, మనోబుద్ధీంద్రియదేహాదులన్నియుఁ దనకన్న భిన్నములనియు, వీనికన్నింటికిఁ దాను ప్రభువనియు, సాక్షియనియు, నవియన్నియుఁ దాను కాదనియు విదితమగుచున్నది. గుఱ్ఱము నెక్కి స్వారిచేయు రౌతు గుఱ్ఱము కానియట్లును, రథము నెక్కినప్రభుపు రథము కానివిధంబునను, శరీరము నధిష్ఠించియుండిన యీయాత్మ శరీరము కాఁజాలదు. ఇట్లు ఆత్మను శరీరత్రయమునకు విలక్షణునిగఁ దెలిసికొనవలయును.

ఆత్మకు అవస్థాత్రయసాక్షిత్వము.

ఇఁక నాత్మకు అవస్థాత్రయసాక్షిత్వము విచారింపవలయు. జాగరము, స్వప్నము, సుషుప్తి యని యవస్థలు మూఁడు. వెలుపల ఘటాది విషయములతోడఁ జక్షురాదీంద్రియములకు సంబంధమువలనఁ గలిగిన జ్ఞానము ప్రత్యక్ష

జ్ఞానము. ఇయ్యది ఆదిత్యాదిజ్యోతిస్సులచేఁ బదార్థములు ప్రకాశించునపుడు కలుగును. దీనినే జాగ్రదవస్థ యందుము. జాగ్రదవస్థయందుఁ జూచిన, వినిన, యనుభవించినవిషయములు వాసనారూపముగ నంతఃకరణమందు నెలకొనియుండి, నిదురించిన తర్వాత నావాసనావిషయము లన్నియుఁ బొడఁగట్టును. దీనినే స్వప్నావస్థ యందుము. ఏవృత్తులతోఁ గాని కూడక నిర్విషయమైన యంతఃకరణము కారణమగు నజ్ఞానమందు లయించియుండుట, సుషుప్త్యవస్థ యనఁబడు. స్థూలశరీరాభిమానియగు జీవుఁడు, జాగ్రదవస్థావిషయముల ననుభవించుచు, విశ్వుఁడనియు, సూక్ష్మశరీరాభిమానియగు జీవుఁడు, స్వప్నావస్థయందలి విషయంబుల ననుభవించుచు, తైజసుఁడనియు, కారణశరీరాభిమానియగు జీవుఁడు, సుషుప్తియందలి యానందము ననుభవించుచుఁ బ్రాజ్ఞుఁడనియుఁ జెప్పఁబడును. అంతఃకరణోపాధికుఁ డగుజీవుఁ డొక్కఁడే, యాయా యవస్థలయం దభిమానముఁగలవాఁడై యనుభవించుటచే మూఁడు విధములుగఁ బిలువఁబడుచుండుట యీక్రింది లౌకికదృష్టాంతముచేఁ దేటపడుచున్నది. ఒకప్రభువు ప్రజలనుఁ బాలించుచు, వారివలనఁ బన్నులు దీసికొనుటవలన కరగ్రాహి (Collector) యనియు, దండనన్యాయస్థానమందు అపరాధులను శిక్షించుచు, దండనల విధించుటవలన దండనాధికారి (Magistrate) యనియు, స్థానికశాఖ కధ్యక్షుఁడై, తత్సభాసభ్యులతోడ ప్రజోపయోగకరములగుకార్యముల నిర్వర్తిం

చుటచే స్థానికశాఖాధ్యక్షుఁడనియుఁ, (President of Local Boards) బిలువఁబడుచుండునటుల, ఒకజీవుఁడే త్రివిధావస్థల యందు త్రివిధనామములచేఁ బిలువఁబడుచున్నాఁడు. ఈ త్రివిధావస్థలయం దభిమానము గలిగి యాసక్తితో విషయ ముల ననుభవించు జీవునివ్యాపారములఁ గనుఁగొనుటకు తటస్థుఁడైన సాక్షి యొకఁ డుండవలయు. ఏవిషయముతో జోక్యముఁ గలుగఁజేసికొనక నిర్వికారుఁడై, తటస్థముగఁ జూచుట, సాక్షిధర్మము గనుక, యీయవస్థాత్రయమందలి జీవునివ్యాపారములఁ గనుఁగొన నిర్వికారుఁడును, నిస్సం గుఁడు సర్వావభాసకుఁడును, చైతన్యజ్యోతిస్వరూపియు నగు. నాత్మయే సాక్షి యగుచున్నాఁడు.

ఆత్మకు స్వయంప్రకాశత్వము, సర్వావభాసకత్వము కలదనుట.

జాగరావస్థయందు బాహ్యములగు నాదిత్యచంద్ర దీపాదిజ్యోతిస్సులచేఁ బదార్థముల నీపురుషుఁడు దెలిసికొను చుండును గాని, వీనికంటె నతిరిక్తమైన యన్యజ్యోతిస్సుచేఁ బదార్థములఁ దెలిసికొనుచుండునట్లు కనుఁబడుట లేదు. స్వప్న మందన్ననో, బాహ్యజ్యోతిస్సులు లేనందున స్వాప్నికపురుష వ్యవహారముచే నన్యమైన జ్యోతి యొకటి యుండవలెనని యనుమేయ మగుచున్నది. జాగ్రదవస్థయం దాదిత్యాదిజ్యోతి స్సులు లేకుండ, కేవలచైతన్యజ్యోతిచేతనే ఘటాదుల మనము

తెలిసికొనుచున్నామా? తెలిసికొనుట లేదు. ఆదిత్యజ్యోతి చేతఁగాని, చంద్రజ్యోతిచేతఁగాని, దీపాదిజ్యోతిస్సులచేత గాని విషయములు ప్రకాశింపఁజేయఁబడినప్పు డీపురుషుఁడు వానిఁ దెలిసికొనఁ గలుగును. కావున, స్వప్నములో చైతన్య జ్యోతి స్వయంప్రకాశమయినను జాగరమునందు స్వయం ప్రకాశస్వభావముకలది కానేరదు! జాగరమునం దాత్మకు సర్వావభాసకత్వము స్వయముగ ననన్యావభాస్యత్వ మెట్లు సిద్ధించును? ఆదిత్యచంద్రాదిజ్యోతిస్సులచేతనే యింద్రి యాదులు భాసింపఁజేయఁబడినవై స్వవిషయములఁ బ్రకా శింపఁ జేయఁగలిగెడిని. స్వప్నమందైతే యింద్రియముల నను గ్రహించెడి బాహ్యజ్యోతిస్సులు లేనందున, సంఘాతపురు షుఁడు జాగ్రత్తునందువలె నతిరిక్తజ్యోతిస్సుచేతనే ప్రకా శింపఁజేయఁబడి విషయములఁ దెలిసికొనుచుండును.

ఆదిత్యాదిజ్యోతిస్సులు, జడములు, ఆత్మజ్యోతిస్సు చైతన్యవంతము

గనుక, అప్పుడు చైతన్యజ్యోతికి సర్వావభాసకత్వము, స్వయమనన్యావభాస్యత్వము సిద్ధించినను, జాగరమునం దా దిత్యాదిజ్యోతిస్సు లుండుటచే, చైతన్యజ్యోతి యకించిత్కర మైనందున, స్వయంప్రకాశము కాఁజాలదని యాక్షేపము కలిగెనేని, ఆదిత్యాది జ్యోతిస్సులు సంఘాతములు, జడములు అయినందున, పర్యంకశయ్యాదులవలెఁ బరార్థములు, దేహేం

ద్రియములకు స్వభావముగఁ జైతన్యము లేదు. మనస్సంబంధమువలన నయ్యది కలుగును. పరార్థములయిన బాహ్యజ్యోతిస్సులకు స్వార్థోపపత్తి కలుగనేరదు. స్వార్థమయిన చిజ్జ్యోతి యొక్క యవభాసనము దేహబుద్ధీంద్రియాదిసంఘాతమునకు లేనిచో, సంఘాతాత్మ బాహ్యవిషయములఁ దెలిసికొనఁ జాలఁడు. కావున, జాగరావస్థయందును చైతన్యజ్యోతి దేహబుద్ధీంద్రియసంఘాతమునుఁ బ్రకాశింపఁజేయుచున్నను, బాహ్యజ్యోతిస్సులు ఆదిత్యాదులు ప్రకాశించుటవలన స్వప్నావస్థయందువలె సర్వావభాసకుఁడును, స్వయంప్రకాశుఁడువలెఁ గనఁబడుట లేదనుకొనినను, సూక్ష్మబుద్ధితో నాలోచించిన, బాహ్యములగు నాదిత్యాదిజ్యోతిస్సులు జడములును, స్వయంప్రకాశములు కావనియు, పరార్థములనియు, చైతన్యజ్యోతి వలననే సర్వంబునుఁ బ్రకాశించుచున్నదనియు స్ఫురింపక మానదు.

ఆత్మకు నిర్వికారిత్వము.

అవస్థల ననుభవించువాఁడు వికారి; అనుభవింపనివాఁడు నిర్వికారి. అంతఃకరణతాదాత్మ్యముచే నేను సుఖిని, దుఃఖిని, కర్తను, భోక్తను లోనగు వికారములనందుటచే నవస్థాభిమానియగు జీవుఁడు వికారవంతుఁడు. ఏయవస్థలు లేక నిర్వికారుఁడై, అసంగుఁడై, అవస్థావంతుని యవస్థలఁ జూచువాఁడు కూటస్థుఁడనియు, సాక్షియనియు, ఆత్మయనియుఁ జెప్పఁబడును. ఇందుకుఁ బ్రమాణము. శ్రు. 'సాక్షీ చేతా కేవలో నిర్గుణశ్చ.

ఆకాశమువలె సర్వవ్యాపకుఁడై అసంగుఁడై చూచుచుండునని తాత్పర్యము.

ప్రతిదినమును ఆదినమునకుఁ బూర్వపుటనుభవములను మనము స్మరించుకొనుచుందుము. ఒకజన్మములోని వివిధావస్థానుభవములను జ్ఞప్తికిఁ దెచ్చుకొనుటయందు ఒకఁడే యీ యనుభవము లన్నియు ననుభవించుచున్నట్లు తోఁచేక మానదు. అనుభవము లేక స్మృతి కలుగదు.

శ్లో. బాల్యాదిష్వపి జాగ్రదాదిషు తథా సర్వాస్వవస్థాస్వపి
వ్యావృత్తాస్వనువర్తమానమహమిత్యంతస్స్ఫురంతం సదా
స్వాత్మానం ప్రకటీకరోతి భజతాం యో భద్రయా ముద్రయా
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే.

దక్షిణామూర్త్యష్టకం.

బాల్య, కౌమార, యౌవన, వార్ధికావస్థలయందును; జాగ్రత, స్వప్న, సుషుప్త్యవస్థలయందును; దర్శన, శ్రవణ, కర్తృత్వ, భోక్తృత్వాద్యవస్థలయందును; నేను నిర్వికారుఁడును, నిస్సంగుఁడును, నిత్యానందుఁడనై యీపైయవస్థ లెన్ని పర్యాయములు మాఱుచు వచ్చుచున్నను వానితోఁ గలియక సాక్షినై చూచుచున్నాఁడను. వీనిలోఁ గొన్ని జడమగుశరీరమునకును, మఱికొన్ని యంతఃకరణోపాధికుఁడగు జీవునకును గలుగుచున్నవని, సద్గురువు ననుగ్రహమువలన నెవఁడు తెలిసికొనుచున్నాఁడో వాఁడు జీవన్ముక్తుఁడని శ్రీశంకరాచార్యులవారు స్వకృత దక్షిణామూర్త్యష్టకంబున బోధించియున్నవారలు. గతానుభవములనుఁ దలఁచుకొనుచున్నప్పుడు నివి

ధ్యున్నిఁటిం నేనొక్కఁడనే యనుభవించితి కదా యని యాశ్చర్యము కలుగక మానదు.

జీవుని యవస్థలకన్నింటికి ఆత్మసాక్షిత్వము.

బాల్య, యౌవన, కౌమార, వార్ధికావస్థలు ఒకదాని వెంట నొకటి మాఱుచు వచ్చుచున్నను,ఆయాయవస్థల ననుభవించువాఁడను నేనే యనియు, జాగ్రదాద్యవస్థలు ననుభవించువాఁడను నేనే యనియు, ప్రతివాఁడును తలఁచుచునే యుండును. పాంచభౌతిక మగుశరీర మెన్నిమార్పులు జెందినను, నిర్వికారుఁడును, నిరాకారుఁడును, స్వయంప్రకాశుఁడు నగు నాత్మ సాక్షియై యవస్థలయం దభిమానముగల జీవుని యవస్థలనుఁ జూచుచు నిర్లేపుఁడై యుండు.

ఆత్మ ద్రష్ట-శరీరేంద్రియాదులు దృశ్యములు.

తనముఖసౌందర్యము తనచేఁ జూడఁబడ నలవిగాక, దర్పణమునందలి ప్రతిబింబముద్వారా చూడఁబడినట్లు, నిర్వికారియగు నాత్మయు, నంతఃకరణమందుఁ బ్రతిఫలించిన తన బింబమునుఁ జూచుచున్నాఁడు. దర్పణము తనయందుఁ బ్రతిఫలించిన బింబభూతముఖమును జూడఁజాలనియట్లు, జడమగు శరీరమును, అంతఃకరణమును తనయందుఁ బ్రతిఫలించిన ప్రతిబింబచైతన్యమును కనుఁగొనఁజాలదు. ఆత్మ దేనిచేఁ జూడఁబడుననిన? దేనిచేతను జూడఁబడదు. ఏలయన? చూడఁబడు పదార్థము దృశ్యము. చూచువాఁడు ద్రష్ట యనఁబడు. ఆత్మ

దృశ్యమైనచో నాత్మనుఁ జూచు ద్రష్ట యొకఁ డుండవలయు. అట్లు లేనందున నాత్మకన్న ద్రష్ట మఱియొకఁడు సంభవింప నందున, తదపేక్షచే నెల్లపదార్థములు దృశ్యము లగుచున్నవి. ఆత్మ తాను ప్రకాశించుచు నెల్లపదార్థములనుఁ బ్రకాశింపఁ జేయుచున్నందున, స్వయంప్రకాశుఁడును, ద్రష్టయు, సాక్షి యు నగుచున్నాఁడు.

శరీరత్రయ అవస్థాత్రయాభిమానియగు జీవునకు దృష్టాంతము.

న్యాయాధిపతియగు ప్రభు వొకరుఁడు మూడంతస్థులు గల భవనములోఁ గ్రిందనుండు ప్రదేశమున సభఁ జేయుచు, వాదిప్రతివాదుల వ్యవహారములను విచారించుచు, న్యాయ వాదులవాదముల నాలకించుచు, సాక్షులవాఙ్మూలములఁ బత్త్రములయందు వ్రాసికొనుచుఁ బగటికాలమున జరిగిన చర్య నంతయు సంపుటీకరణము (Record) జేసికొని పైయంతస్థు నకుఁ బోయి, దారాపుత్రులతోఁ గూడి విహారించుచుఁ, బగటి కాలము జరిగిన వ్యవహారచర్యనంతయు నొకపర్యాయము పత్త్రములలోఁ జూచుచు, చేదువుచుఁ, దలఁచుకొనుచుండుట వలనఁ బగటికాలమున సభలో నెల్లఱతోఁగూడి వ్యవహారము సలుపుచుండినట్లుగనే భావించుచుండును. అప్పటికిని మనస్థిమితము లేనందున, దారాపుత్రాదు లనువీడి యేకాంతముగ నుండు మూఁడవ యంతస్థునకుఁ బోయి, యీ వ్యవహార చర్యాసంపుటిని (Record) ఒకప్రక్కనుంచి సుఖముగ మై

మఱచి నిద్రించును. ఇట్లు కొంతకాల ముండినతర్వాత, మూఁడవయంతస్థునుండి రెండవయంతస్థునకు వచ్చి, అచ్చట నుంచిన వ్యవహారచర్యాసంపుటినిఁ దీసికొని మొదటియంతస్థునకు వచ్చి, న్యాయస్థానమునఁ బ్రవేశించి పూర్వమువలె వ్యవహరించుచుండును. అట్టుల జీవుఁడు జాగ్రదవస్థయందు స్థూలశరీరమున నైంద్రియికవిషయముల ననుభవించుచు; విశ్రాంతిఁ గోరి, సూక్ష్మశరీరమునుఁ బ్రవేశించి,జాగ్రదవస్థయందలి విషయములను స్వప్నావస్థయందుఁ దలంచుకొనుచు, మనశ్శాంతి లేక కారణశరీరమునఁ బ్రవేశించినంతట మనోబుద్ధీంద్రియవృత్తులు లీనమై సుషుప్త్యవస్థయం దానందమునుఁ జెందును. మఱల వాసనాప్రేరితుఁడై, కారణశరీరమునుండి సూక్ష్మశరీరములోనికిని,అచ్చేటనుండి స్థూలశరీరములోనికినిఁ బ్రవేశించుచుండును. పూర్వోక్త శరీరత్రయాభిమానియై జాగ్రత్స్వప్నసుషుప్తులను మూఁడవస్థలయందు పరిభ్రమించుచుండు జీవుఁ డొక్కరుఁడే.

అజ్ఞానిశరీరము పచ్చిచింతకాయకుఁ బోల్చుట.

శ్లో. పరమేశస్యాత్మతత్త్వచింతకాయ శుభప్రదః,
శుద్ధాంతఃకరణాత్సోయం శరీరత్రయబోధకః.

స్థూలసూక్ష్మకారణములను నుపాధులుగల యీశరీరము (కళేబరము) కండలు గలిగి యీనెలతో గట్టిగనుండిన పచ్చిచింతకాయతోఁ బోల్చ నగును. పైనున్న బెరడు స్థూలశరీరముగను, లోపల నున్నకండ, యీనెలు, సూక్ష్మశరీరము

గను, దానిలోపలనున్న విత్తనము కారణశరీరముగను భావింపఁదగును. గృహక్షేత్రపుత్రకళత్రవిత్తాదులయందున్న ఆశాపాశశతములతో దృఢముగ బంధింపఁబడిన అజ్ఞునిశరీరము, ఈనెలతో దృఢముగ కట్టఁబడిన పచ్చిచింతకాయ, బెరడు, కండ, గింజ తెలియనివిధంబున, త్రివిధభేదంబు తెలియక యొకటిగనే యుండును. చింతకాయ చక్కఁగ పండినట్లయితే, యీనెలు సడలి, బెరడు, లోపలపండు, గింజ, వేర్వేఱుగ విభజింప నగును. అట్లులే విషయాసక్తుఁడగు నీయజ్ఞుఁడు, ప్రాజ్ఞులసన్నిధిని శ్రవణమననాదులఁ బడసి, సత్కర్మానుష్ఠాన తపశ్చరణమువలన వివేకవైరాగ్యములఁ బొందుటచే నంతఃకరణము పక్వముఁ జెంది, ఆశాపాశశతబంధముల వీడి, స్థూల సూక్ష్మకారణశరీరముల వేర్వేఱుగఁ జూచును. ఆశాపాశములను వీడిన సాధకుఁ డగువివేకి, స్థూలకళేబరమును అవలీలగ విడుచును. ఆశాపాశబద్ధుఁడగు నవివేకి, మృత్యుకాల మాసన్నమగుతఱి, స్థూలశరీరమును విడువఁజాలనందున యమదూతలు బలాత్కారముగ నాయుధసహాయముచేఁ గొనిపోవుదురు.

ఆత్మస్వరూపము.

ఆత్మకు, సచ్చిదానందస్వరూపత్వము.

సూర్యమండలమును, ప్రకాశము, ఉష్ణము, ఎడఁబాయక స్వభావధర్మములుగ నుండినట్లు, ఈ సచ్చిదానంద

ములు, మూఁడును ఒకటిగ నుండి, యొకటి నొకటి నెడఁబాయక, యవిభాజ్యమును, అఖండమును, అద్వితీయముగ నుండు తత్త్వమే యాత్మ యనఁబడు.

భూతభవిష్యద్వర్తమానములనెడు కాలత్రయమందును, సకలావస్థలయందును, అబాధితముగనుండి నిత్యమై, సత్యమై యుండునది సత్తు (Existence) అనఁబడు.

ఇతరములగు సూర్యచంద్రాది జ్యోతిస్సులచేఁ బ్రకాశితముగాక, సర్వకాల సర్వావస్థలయందు స్వయముగఁ బ్రకాశించుచు, తనకన్న భిన్నములగు నెల్ల జడపదార్థములనుఁ బ్రకాశింపఁజేయుచు, (సర్వావభాసకము) నిత్యమై వెలయు చైతన్యజ్యోతి చిత్తు (Intelligence) అనఁబడు.

తన సంసర్గచే నెల్లప్రాణుల నానందపరవశులుగఁ జేయుచు, నిత్యమై, నిరతిశయమై, నిరుపాధికమై వెలయు పరమసుఖము, ఆనందము (Bliss) అనఁబడు.

దేశకాల వస్తువులచే పరిచ్ఛిన్నమయినది. ప్రకృతి (Matter) అపరిచ్ఛిన్నమయినది (Spirit) గణితశాస్త్రమందును కాలము (Time) దేశము (Space) వస్తువుల (Causality or Matter) సంఖ్యాపరిచ్ఛిన్న గణితమందు, ఆత్మతత్త్వము తెలియును.

ఆత్మకు నాట్యశాలయందుండు దీపమువలె సాక్షిత్వము.

శ్లో. నృత్యశాలాస్థితో దీపః ప్రభుం సభ్యాంశ్చ నర్తకీం,
దీపయేదవిశేషేణ తదభావేఽపి దీప్యతే.

శ్లో. అహంకారః ప్రభుస్సభ్యా విషయా నర్తకీ మతిః,
తాలాదిధారిణ్యక్షాణి దీపస్సాక్ష్యవభాసకః.

వేదాంతపంచదశి - నాటకదీపం.

నాటకశాలయందు అహంకారుఁడు, (తదభిమాని) ప్రభువు, విషయములు సభ్యులు ప్రేక్షకులు, బుద్ధి నర్తకి (నాట్యాంగన), ఇంద్రియములు; మృదంగ వాద్యతాళము లోనగువానిని ధరించువారు. వీరి నన్నిటినిఁ బ్రకాశింపఁ జేయు దీపము సాక్షిగ (ఆత్మదీపము) నుండి ఇవి యున్నను, లేకున్నను, స్వయముగఁ బ్రకాశించుచుండును.

ఆత్మస్వరూపము.

శ్లో. ఆత్మా నిత్యోఽవ్యయశ్శుద్ధో హ్యేకః క్షేత్రజ్ఞ ఆశ్రయః,
అవిక్రియః స్వదృగ్ఘేతుర్వ్యాపకోఽసంగ్యనావృతః,
ఏతైర్ద్వాదశభిర్విద్వానాత్మనో లక్షణైః పరైః.

శ్రీభాగవత. 7 స్కంధ. 7 అధ్యాయము.

నిత్యః=ఎల్లప్పుడునుండువాఁడు, అవ్యయః = నాశరహితుఁడు, శుద్ధః=పరిశుద్ధుఁడు, ఏకః=అద్వితీయుఁడు, క్షేత్రజ్ఞః= సర్వప్రాణులయందుండువాఁడు, ఆశ్రయః = సర్వమునకాధారుఁడు, అవిక్రియః=వికారరహితుఁడు, స్వదృక్=స్వయంప్రకా

శుఁడు అన్నింటిఁ జూచువాఁడు, హేతుః = సర్వకారణుఁడు, వ్యాపకః = సర్వవ్యాపకుఁడు, అసంగి=సంగరహితుఁడు, అనావృతః=దేనిచేత నావరింపఁబడనివాఁడు. ఈపండ్రెండులక్షణములచేత ఆత్మస్వరూపము తెలియఁదగినదని భావము.

శ్లో. అనాదిరాత్మా పురుషో నిర్గుణః ప్రకృతేః పరః,
ప్రత్యగ్ధామా స్వయంజ్యోతిర్విశ్వం యేన సమన్వితం.

శ్రీభాగవతం. 3 స్కంధం.

మొదలు లేనివాఁడు సర్వవ్యాపకుఁడు, గుణరహితుఁడు, ప్రకృతికన్న పరుఁడు, జీవులకాశ్రయుఁడు, స్వయంప్రకాశుఁడు, చరాచరవిశ్వమును ధరించినవాఁడు, దేహమున సాక్షిగనుండువాఁడు. ఇవియన్నియు నాత్మస్వరూపలక్షణములని కపిలమహాముని దేవహూతి కానతి యిచ్చెను.

శ్లో. శశ్వత్ప్రశాంతమభయం ప్రతిబోధమాత్రం
శుద్ధం సమం సదసతః పరమాత్మతత్త్వం
శబ్దో న యత్ర పురుకారకవాన్ క్రియార్థో
మాయాపరైత్యభిముఖే చ విలజ్జమానా.

శ్రీభాగవత. 2 స్కంధ. 7 అధ్యాయము.

ఎల్లప్పుడును ప్రశాంతంబుగ నుండునది భయరహితమును, ప్రజ్ఞయే స్వరూపంబును, శుద్ధంబును, సర్వసమంబును, సత్తుకన్న అసత్తుకన్న విలక్షణంబును, దేనియందు కర్మలనుఁ


గావించు వైదికతంత్ర పురుషప్రయత్నాదు లుండవో,
అను మోసగించునట్టి, త్రిగుణాత్మికమగు మాయ, ఏః
నీయుని సన్నిధికి రాక, సిగ్గుపడి పరాఙ్ముఖి యగుచున్న
అట్టి సర్వజ్ఞత్వ సర్వేశ్వరత్వాది లక్షణములుగలది య
యని తెలిసికొనవలయును. ఇంకను అనేక లక్షణము లా
శాస్త్రమునం దిదేవిధమునఁ బ్రకారాంతరమునఁ జెప్పఁబడి

ఇట్లు ఆత్మస్వరూపవిచారము గల

ప్రథమప్రకరణము సమాప్తము.

మనస్తత్త్వశాస్త్రము.

ద్వితీయప్రకరణము - అరిషడ్వర్గము.



ఈశ్వరసంవిత్తు సర్వసృష్టికిఁ గారణము.

పూర్వప్రకరణమున మనస్స్వరూప ఆత్మస్వరూపములనుఁ దెలిపి,మానసదోషంబులును జ్ఞానప్రతిబంధకములు నగు కామక్రోధాదులను (అరిషడ్వర్గము) వివరించుటకు ముందు, ఆత్మీయ జ్ఞానేచ్ఛాక్రియాశక్తులు సర్వమున కాధారమని నిరూపింపఁబడుట. సకలచరాచర ప్రపంచసృష్టికి నాధారభూతుండును, అవ్యయుండు, ననంతుండు, నప్రమేయుండు నగు పరమేశ్వరుండు, సత్తు, చిత్తు, ఆనందస్వరూపుండు. జడప్రకృతి, అనృతజడదుఃఖాత్మికమగు. సర్వశక్తుఁడగు పరమేశ్వరునిదృష్టి జడప్రకృతిపైఁ బ్రసరించినపుడు, సృష్టికిఁ బ్రారంభమై, జ్ఞానశక్తి, ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి యను మూఁడుశక్తులు వెలువడును.

శ్రు. సోఽకామయత బహు స్యాం ప్రజాయేయ ఇతి.

తైత్తిరీయ. 2-6

శ్రు. తదైక్షత బహు స్యాం ప్రజాయేయ ఇతి.

ఛాందోగ్య 6-2-3

శ్రు. స ఈక్షత లోకాన్ను సృజా ఇతి.

ఐతరేయ. 1-1

నేను అనేకమై సృజింతునని పరమేశ్వరుఁ డిచ్ఛయించెను. "అనేకమై సృజింతునని సంకల్పించెను." అను శ్రుతులవలన, సంకల్పము, ఇచ్ఛ, కృతి, సర్వశక్తునినుండి వెలువడెనని స్పష్టము.

"జీవో జానాతి ఇచ్ఛతి యతతే." జీవుఁడు తెలిసికొని, తెలిసికొనినదానినిఁ దనకుఁ గావలయునని యిచ్ఛయించి, యిచ్ఛయించినదానికై ప్రయత్నించుచున్నాఁడని న్యాయశాస్త్రమునఁ గలదు. జ్ఞాన, ఇచ్ఛ, క్రియాశక్తులకు పర్యాయములుగా, ప్రకాశ, (ప్రఖ్య) స్థితి, క్రియ (ప్రవృత్తి) పదములు, సాంఖ్యయోగశాస్త్రములయందును, వ్యాసాచార్య కృత యోగభాష్యమునందును, ఉపయోగింపఁబడినవి. ప్రాచీనులు వృత్తులని వ్యవహరించినవానిని పాశ్చాత్యులు మనోవికారములని (Emotions) వాడిరి. అంతఃకరణవిశిష్టుఁ డగు జీవునకు త్రివిధ వ్యాపారములు కలవని శాస్త్రజ్ఞు లెల్లరు నంగీకరించిరి.

జ్ఞానశక్తి (Cognition, Intellects)
ఇచ్ఛాశక్తి (Volition, Will.)
క్రియాశక్తి (Emotion, Action, Feeling.)

సంవిత్స్వరూపము.

పైఁజెప్పఁబడిన అంతఃకరణ వ్యాపారత్రితయమునకు నాధారమై సాక్షియైన చైతన్యము,సంవిత్తు (Consciousness) త్రికాలాబాధితమై, నిర్వికారమై, ఉదయాస్తమయములఁ జెందక ప్రకాశించుచుండెనని అనేక గ్రంథములయందుఁ గలదు.

శ్లో. మాసాబ్దయుగకల్పేషు గతాగమ్యేష్వనేకథా,
నోదేతి నాఽస్తమేత్యేకా సంవిదేషా స్వయంప్రభా.
శ్లో. సంవిదో వ్యభిచారశ్చ నాఽనుభూతోఽస్తి కర్హిచిత్,
యది తస్యాప్యనుభవస్తర్హ్యయం యేన సాక్షిణా,
అనుభూతస్స ఏవాత్ర శిష్టస్సంవిద్వపుస్స్వయమ్.

వేదాంతపంచదశి-వివేక.

శ్లో. జాగ్రత్స్వప్నసుషుప్తిషు స్ఫుటతరం యా సంవిదుజ్జృంభతే,
యా బ్రహ్మాదిపిపీలికాదితనుషు ప్రోతా జగత్సాక్షిణీ.

వివేకచూడామణి.

ఈ చిన్మూర్తి (సంవిత్తు) దేశకాలవస్తువులచే నపరిచ్ఛిన్నమై, అవస్థాత్రయసాక్షియై, బ్రహ్మ మొదలు పిపీలికము వఱకుఁగల సకల ప్రాణులయం దనుస్యూతమై, స్వయంప్రకాశమై వెలుఁగుచుండును. ఈ సంవిత్తు, అన్యునిచేఁ జూడఁబడక, తెలియఁబడక స్వయంద్రష్టమై, సాక్షిగా నుండును. ఒరునిచేఁ జూడఁబడెనేని, అది మఱియొకనిచేఁ జూడఁబడవలయును. ఈప్రకారము అనవస్థాదోషము ప్రాప్తించును. (Self

consciousness) ఆత్మజ్ఞానము స్వయంప్రకాశమై, సకల వృత్తులనుఁ బ్రకాశింపఁజేయుటం జేసి, అన్నింటికి నాధారమని చెప్పఁబడెను. ముమ్ముందు జడమగు నంతఃకరణమును, తద్వృత్తులును, ఆత్మభానముచే భాసితము లగుచున్నవని తెలియనగును. ఆత్మ (Self) అనాత్మ (Notself) చైతన్యము,(Spirit) జడము (Matter) పురుషుఁడు (Purusha) ప్రకృతి (Prakriti) ప్రత్యగాత్మ, మూలప్రకృతి యని ఈద్వంద్వములు, ఆయా శాస్త్రపారిభాషికమునుఁబట్టి వ్యవహృతములయినను, అందలి విషయమొక్కటియె.

అంతఃకరణవృత్తులు ఆత్మకార్యములా ? అనాత్మకార్యములా యని విచారించునెడ సంశయము కలుగక మానదు. నిర్వికారమగు నాత్మనుండి మనోవికారము లుదయింపఁజాలవు. జడమగు ననాత్మనుండి భాసమానము లగువృత్తులు జనింపఁజాలవు. ఆత్మభానము జడమగు ననాత్మయందుఁ బ్రసరించునపుడే మనోవృత్తులు (వ్యాపారములు) ప్రకాశించుటం బట్టి, ఆత్మానాత్మసంబంధము వీనికంతటికిఁ గలదని స్పష్టము.

అంతఃకరణ విశిష్టుఁడగు జీవుఁడు, జ్ఞాన, ఇచ్ఛ, క్రియా శక్తులు గలవాఁడని యిదివఱలోఁ జెప్పఁబడెను. వేదనను అనుభవించుటవలనను, తెలిసికొనుటవలనను, జీవత్వవ్యవహారము ప్రత్యక్షమని యీ క్రిందిశ్లోకములలో వివరింపఁబడెను.

శ్లో. అనుభూతేర్వేదనస్య ప్రతిపత్తేర్యథావిధమ్,
ప్రత్యక్షమితి నామైవ కృతం జీవస్సఏవ నః.

శ్లో. వాసనైవ మహారాజ స్వరూపం విద్ధి చేతసః,
చిత్తశబ్దస్తు పర్యాయో వాసనాయా ఉదాహృతః.
జీవశ్చిత్త పరిస్పందః పుంసాం చిత్తం స ఏవ చ.

యోగవాసిష్ఠ.

వాసన (Desire, Inclination) చిత్తముయొక్క స్వరూపము. చిత్తశబ్దము వాసనకుఁ బర్యాయపదము. చిత్త పరిస్పందము జీవుఁడనఁబడు. వేయేల ? చిత్తమే (అంతఃకరణ విశిష్టుఁడే) జీవుఁడని **యోగవాసిష్ఠమునందును,** శ్రు. "కామ మయ ఏవాయం పురుషః" సంకల్పస్వరూపుఁడు (ఇచ్ఛా మయుఁడు)జీవుఁడని బృహదారణ్యకోపనిషత్తునందునుఁ గలదు. "యో యచ్ఛ్రద్ధస్స ఏవ సః." శ్రద్ధామయుఁడు జీవుఁడని గీతా శాస్త్రమునందునుఁ గలదు. మఱియు, జీవుని బాహ్యాభ్యంతర ప్రవృత్తికి అంతఃకరణము సాధనము. మనస్సు, బుద్ధి, అహం కారము, చిత్తమను నంతఃకరణచతుష్టయమునందు మనో వ్యాపారమే ముందు వివరింపఁబడును గనుక, బుద్ధి చిత్తాహం కారములును ఉపలక్షణముగా గ్రహింపవలయును.

సుఖదుఃఖోదాసీనత్వస్థితులు.

మానసికవృత్తులన్నియుఁ బ్రధానముగ సుఖాకారముగ దుఃఖాకారముగనుండు రెండువృత్తులలో నంతర్భవించును. సుఖపరిణామము దుఃఖపరిణామమని ద్వివిధావస్థ మనస్సునకుఁ

గలదని యోగశాస్త్రమందున్నను తృతీయావస్థయునుఁ గల దని మహాభారత అరణ్యపర్వమునఁ జెప్పఁబడియె.

శ్లో. యథా శీతోష్ణయోర్మధ్యే భవేన్నోష్ణం న శీతతా,
ఏవం వై సుఖదుఃఖాభ్యాం హీనమస్తి పదం క్వచిత్.
వేద్యం యచ్చాత్ర నిర్దుఃఖ మసుఖం చ నరాధిప,
తాభ్యాం హీనం పదం చాన్యన్న తదస్తీతి లక్షయే.

శీతోష్ణములమధ్య శీతము, ఉష్ణముఁ గాక మఱియొక స్థితి యుండినట్లు, సుఖదుఃఖముల మధ్యను సుఖముగాక, దుఃఖముగాక వేఱొకస్థితి యుండును. ఇట్లు సుఖదుఃఖరహితమై, నిర్ద్వంద్వమైన స్థితియేదికలదో అయ్యది బ్రహ్మాకారస్థితి కైవల్యము. దీనింబట్టి పరికింపఁగా సుఖము, దుఃఖము, ఉదాసీనత (తటస్థము) అను మూఁడుస్థితులు మనస్సునకుఁ గలవు. ఈవిషయమే మహాభారతమునఁ జెప్పఁబడియె.

శ్లో. మునేరపి వనస్థస్య స్వాని కర్మాణి కుర్వతః,
ఉత్పద్యంతే త్రయః పక్షాః మిత్రోదాసీనశత్రవః.

అరణ్యమందు వసించి, నిత్యకర్మల ననుష్ఠించు మునీశ్వరునకైనను, మిత్ర, శత్రు, ఉదాసీనులను మూఁడు తెఱంగులగు పక్షములు (భావములు) కలుగుచుండును. రాగమువలన మిత్రత్వము, ద్వేషమువలన శత్రుత్వము, మోహమువలన ఉదాసీనత్వము, సంభవించుచుండునని మున్ముందు న్యాయభాష్యరీతిగ వివరింపఁబడును.

సుఖదుఃఖవృత్తులయందు మనస్సునకు వికాస సంకోచములు గలుగుట.

చిత్తవృత్తులన్నియు సుఖాకారములుగనో దుఃఖరూపములుగనో యుండునని యిదివఱలోఁ జెప్పఁబడెను. సుఖదుఃఖరూపమగు మనస్సునకు సంకోచ వికాసములు, వృద్ధిక్షయములు కలుగుచుండును. ఎట్లన ? సుఖరూపములగు హర్షము, ఆనందము, ప్రీతి, సమ్మోదము, సంతుష్టి, ఆశ్చర్యము మొదలగునవి కలుగునపుడు, వికాసము, విస్తారము, వృద్ధి అభివ్యాప్తియును, దుఃఖరూపములగు విషాదము, శోకము, ద్వేషము, అప్రీతి, అసంతుష్టి, భీతి మొదలగునవి కలుగునపుడు, సంకోచము, హ్రాసము, క్షయము, నిరోధములును, మనస్సునకుఁ గలుగుచుండును.

పుష్పమునకుఁబోలె సంకోచవికాసములును, లతకువలె విస్తృతినిరోధములు వృక్షమునకువలె వృద్ధిక్షయములు, దీపమునకుఁ బలె ప్రకాశ హ్రాసములును, సుఖదుఃఖరూపమగు మనస్సునకుఁ బొడముచుండునని, యనుభవమువలన నెల్లఱకుఁ దెలియును. చంద్రోదయమున సాగరము తరంగపరంపరలచే నుప్పొంగినట్లు, హర్షాదిసుఖవృత్తులచే మనంబు నుప్పొంగుచుండు. సుఖము (Pleasure) దుఃఖము (Pain) ద్వంద్వములగు నీసుఖదుఃఖములు జ్ఞానేచ్ఛాక్రియలందు మూఁటియం దనుస్యూతముగ నుండును.

(రాగము)

జ్ఞానము = సుఖము. అనుకూలేచ్ఛ=సుఖము. సత్క్రియ=సుఖము.

ద్వేషము.

అజ్ఞానము=దుఃఖము. ప్రతికూలేచ్ఛ=దుఃఖము. దుష్క్రియ=దుఃఖము.

మానసికవృత్తిత్రితయమును పాశ్చాత్యపండితు లంగీకరించుచు, వేర్వేరు నామములతోఁ జేర్కొనిరి.

Intellects,	Feeling,	Volition.
Thought,	Emotion,	Conation.
Intelligence,	Feeling,	Will.
Thinking,	Feeling,	Willing.
Imagination,	will,	Activity.
Cognition,	Affection,	Conation.
Presentation,	Attention,	Feeling.
Intellection,	Emotion,	Will.
Wisdom,	Will,	Love.
Will,	Wisdom,	Activity.
Will,	Wisdom,	Power.
Reception,	Affection,	Action and So on

ఆర్షదర్శనములందును మానసికవృత్తిత్రితయము ప్రకారాంతరములుగఁ జెప్పఁబడియె.

ప్రఖ్య, ప్రవృత్తి, స్థితి = సాంఖ్యదర్శనము.
ప్రకాశ, స్థితి, క్రియ = యోగదర్శనము.
జ్ఞాన, ఇచ్ఛ, క్రియ = వేదాంతదర్శనము.

విషయమునుఁ దెలిసికొనుట, తెలిసికొనిన దానిని ఇచ్ఛయించుట, ఇచ్ఛయించినదానినిఁ బొందుటకుఁ బ్రయత్నించుట, యను వ్యాపారక్రమము అవ్యవధానముగ జరుగుచుండును. ఇందు క్రియాశక్తికి, ప్రయత్న, కృతి, వ్యవసాయ చేష్ట అను పర్యాయపదము లాయాసందర్భప్రకరణములఁ బట్టి ప్రయోగింపఁబడు. మానసికేచ్ఛ శారీరక్రియల ననుసరించి వెలువడును గావున, శారీర మానసక్రియాసంబంధము భావోదయమునకుఁ గావలసియుండు. పాశ్చాత్యశాస్త్రజ్ఞుల ప్రణాళినిఁబట్టియు, Cognition జ్ఞానము, Volition ఇచ్ఛ, Action క్రియ, అను వ్యాపారక్రమము నిశ్చితము. ఇందు Action క్రియ, యత్నమునకు (Emotion, Feeling) అని పర్యాయపదములచే వ్యవహారము గలదు.

Emotion - మనోవికారము - భావము.

మహోదధి, ప్రబలానిలమున సంక్షుభితమై తరంగపరంపరలచే నుప్పొంగినట్లు, మనస్సును, ఇంద్రియార్థ సన్నికర్షముచే వికారముఁ జెందును. ఈవికారములు, వృత్తులు, వ్యాపారములని పర్యాయపదముచే వ్యవహరింపఁబడు. కఱగినలోహము, మూసలోఁ బోసినపుడు మూసాకారముఁ జెందినటుల తైజసాంతఃకరణము బాహ్యవిషయముమీఁదికిఁ బోయినపుడును, ఆభ్యంతరవిషయముఁ దలఁచినపుడును ఆయాయాకృతినిఁ జెందును. దీనినే వృత్తియందురు. ఆంగ్లేయ

భాషయందు, **Aspects ; Functions, Moods, Psychoses** అను పర్యాయపదములచే వ్యవహరింతురు.

ఇచ్ఛ. Desire, Will.

మనస్సున వాసనానుగుణ్యముగ, ఇచ్ఛ లుదయించు చుండును. సద్వాసన ననుసరించి కలుగు నిచ్ఛలు సుఖాకారముగను, దుర్వాసనల ననుసరించి కలుగునిచ్ఛలు దుఃఖాకారముగను పరిణమించును. మనస్సునకుఁ గలిగిన యవస్థాత్రితయమందు ఇచ్ఛారూపముగ నుండుటయొకటి. ఒకవిషయమునుఁ దెలిసికొని "ఇదం మే భూయాత్," ఇది నాకుఁ గావలయునని కోరుట, ఇచ్ఛ, లేక అభిలాషమనఁబడు. ఇచ్ఛలన్నియు నేదే నొకవిషయము నాశ్రయించి యుండును. విషయాకారమగు ప్రపంచముపై మనస్సు ప్రసరించి, విషయములను ధ్యానించు నపుడు వానియందు సక్తిగలిగి, ఇచ్ఛ లుత్పన్నము లగుచుండును. పూర్వానుభూతవిషయములనుఁ దలఁచుకొని లోపలను, బాహ్యవిషయములు గోచరించునపుడు వెలుపలను, విషయము నాశ్రయించి వివిధాభిలాషములు పొడముచుండును.

ఇచ్ఛ, కాంక్ష, స్పృహ, ఈహ, తృష, వాంఛ, లిప్స, మనోరథము, కామము, అభిలాషము, ఇయ్యవి ఇచ్ఛకుఁ బర్యాయపదములుగ నిఘంటువునం దున్నను, సామాన్యావస్థలోఁ గొన్నియు, విశేషావస్థలోఁ గొన్నియు, ఉద్రిక్తా

వస్తులలో మఱికొన్నియు, శబ్దశక్తిఁగలిగినందున, సందర్భమునుఁ బట్టి ప్రయోగింపవలయుఁగాని,పర్యాయపదములని యుపయోగించిన భావభేదముచే ననర్థము కలుగును.

మానవుని జీవయాత్రయం దిచ్ఛలేక, యేకార్యమును జరుగనేరదు. శరీరపోషణమునకై భోజనేచ్ఛ, పానేచ్ఛ (పిపాస) మొదలగునవి తప్పని సరియైనందున, నీయిచ్ఛల వలన ననర్థమేమియుఁ గలుగనేరదు. సామాన్యముగఁ గాలు సేతులు కదలింప నిచ్ఛఁ గలిగినదానికిని, శత్రువునుఁ బీడింపఁ గాలుసేతులు కదలింప నిచ్ఛఁ గలిగినదానికి నెంతయు భేదము గలదు. ప్రతిప్రయత్నమును (ప్రతిక్రియయు) ఇచ్ఛాపూర్వకముగ నుండును గాని యిచ్ఛలేక యేదియు నుండదు. ఇట్లు సామాన్యముగ నుండు నిచ్ఛలు దేహయాత్రను నిర్వహించుచుఁ బురుషార్థమునకు సహకారములుగ నుండును. స్వార్థ, పరార్థములలోఁ బరులకొఱకుఁ గావించు నుపకారము, హితము, సేవ లోనగుకార్యములకై కలుగు నిచ్ఛలు బంధకములు గానేరవు. స్వార్థమునకై యొనరించు జిజ్ఞాసుత, ముముక్షుత, సద్గ్రంథ శ్రవణ పఠన సత్సంగతి దేవతాదర్శన తీర్థయాత్ర లోనగు క్రియావిషయకేచ్ఛలును బ్రహ్మానందమునకుఁ బరంపరాసాధనములు కాఁబట్టి ధర్మ్యము లగును.

కామపదార్థ విశేషము.

ంమ్యములగు విషయములు గోచరించినపుడు వానిని ధ్యానించి, తనకుఁ గావలయునని కోరుట కామ మనఁబడు.

విషయాసక్తి ప్రీతి, ప్రీతివలనఁ గామము కలుగుననియు, నీ కామమే ఉద్రిక్తావస్థయందు తృష్ణయనఁబడుననియు, గీతా భాష్యమునందుఁ గలదు. కామము, అభిలాషము. వాంఛ, స్పృహా, సాధారణముగ నిచ్ఛకుఁ బర్యాయపదములయినను, కామశబ్దము గీతాశాస్త్రమునందు సామాన్యమగు నిచ్ఛా పర్యాయము గాక, తీవ్రాభిలాషయగు తృష్ణార్థమందు నుపయోగించి మోక్షమార్గప్రతిబంధకముగ పలుచోట్ల బోధించిరి. దప్పిగలిగినప్పు డెంత మధురోదకముఁ ద్రావినను, నుపశాంతిఁ గలుగక మఱిమఱి త్రాగవలెనని కోరిక గలిగినట్లు, విషయోపభోగము లెన్ని కలిగినను, ఇంద్రియములకుఁ దృప్తికలుగక, మఱియు ననుభవించేవలెననెడి యభిలాష మేదికలదో,అయ్యది తృష్ణ యనఁబడు. విషయసుఖముల ధ్యానించి, తనకుఁ గావలెననుట సక్తి. దృఢాభినివేశము అనఁగా తీవ్రాభిలాషము ఆసక్తియనఁబడు. సాధారణదశయందుఁ గలుగు ప్రీతి, కామమనఁబడు. ఇదియే ఉద్రిక్తావస్థయందు తృష్ణ యనఁబడు. అగ్నియం దెన్నికట్టెలు వైచినను (అలం) చాలుననక, మఱిమఱి కోరునట్లు కామానలమున విషయసుఖము లెన్ని వైచినను (యనుభవించినను) ప్రజ్వలించుచు నతృప్తిఁ జెందును. ఇచ్చోట కామము, విషయ తృష్ణాపరముగఁ జెప్పఁబడినందున గర్హ్యము. ధర్మార్థ కామమోక్షము లనియెడు చతుర్విధ పురుషార్థములలోఁ జెప్పఁబడిన కామము ధర్మసమ్మతమై, సహకారమై, యుత్తమ పురుషార్థమునకుఁ బరంపరాసాధన మైనందున

గ్రాహ్యము. కామస్వరూపము, తద్విచారము, కామక్రోధ ప్రకరణములో విస్తరింపఁబడును గనుక, యిచ్చట సూక్ష్మముగఁ జెప్పఁబడినది.

స్పృహ.

సామాన్యముగ వస్తువిషయిక తృష్ణ, స్పృహా యనఁబడునని గీతాభాష్యమందును, ఉత్కృష్టములగు నితరుల ధనము వస్తువాహనాదులు చూచినంతమాత్రముననే వానిని గ్రహించవలెననెడి తీవ్రాభిలాష మేది కలదో అయ్యది స్పృహా యని మధుసూదనీయవ్యాఖ్యయందునుఁ గలదు.

శ్లో. ఆత్మోపభోగకరణం స్పృశంతీ ప్రియవర్త్మనా,
యా జహాతీతరాన్ భోగాన్ సా స్పృహేత్యభిధీయతే.

భావప్రకాశ.

ఇతరభోగములను విడిచి ప్రీతిమార్గముచేత ఆత్మోపభోగసుఖము నిచ్ఛయించు చిత్తవృత్తి స్పృహా యని భావప్రకాశమునందుఁ గలదు

తృష్ణ.

ఇంద్రియములు తృషార్దితములై విషయసుఖానుభవముకొఱకుఁ బరుగిడుచుండుట తృష్ణ యనఁబడు. ఈతృష్ణ దుఃఖరూపముగఁ బరిణమించి బంధముఁ గలిగించును. కాంక్ష, లిప్స, మనోరథము సామాన్యముగ నిచ్ఛాపర్యాయపద

ములు. అత్యంత రమణీయములగు శబ్ద స్పర్శ-రూప-రస-గంధరూపక విషయములు గోచరించినపుడు, మనస్సు ఇంద్రియములద్వారా, వానిమీఁదికిఁ బ్రసరించి, అచ్చటనే సక్తమగును; మఱలదు. అందువలన నావిషయములు మనోహరములయ్యెను. రూపయౌవన సంపన్నులగు నాయికానాయకులు, సర్వేంద్రియాకర్షకమగు సౌందర్యసర్వస్వరూపమునుఁ బరస్పరము విలోకించి సురేంద్రు సహస్రాక్షత్వమును, ఆలింగనమునందు కార్తవీర్య సహస్రబాహుత్వమును, అధరసుధారసపానమునందు శేషాహిద్విసహస్రరసనత్వము నభిలషించుట అలంకారశాస్త్రమునందుఁ గన్పట్టుచుండెడిని. సుశిక్షితముఁ గాని మనస్సునుండి పొడమిన యిచ్ఛలు స్వేచ్ఛగాఁ బ్రవర్తిల్లి తృష్ణాజనకములై యనర్థముఁ గలిగించును. ఆకసమునుండి వర్షించిన వర్షము, పర్వతాగ్రములనుండి ప్రవహించి, శాఖోపశాఖలుగ నదీరూపములై, నిరుద్ధములుగాక క్షేత్రములను గ్రామములను ముంచి, సముద్రములోనికిఁ జేరును. అటులగాక, ఆనకట్టఁ గట్టి, తటాకములలో నింపినయెడల, పశుపక్షి మృగాదులకును, మానవకోటికి నెంతయు నుపకరించును. అవ్విధంబుననే ఇంద్రియలౌల్యముఁ జెందక, ధర్మసంబంధములు గావించినచో, కామములు (ఇచ్ఛలు)పురుషార్థదాయకము లగును. ఆత్మశక్తిఁ గల యిచ్ఛలు వాని స్వరూపధర్మములఁ దెలియక వ్యర్థముగఁ బోనీయఁగూడదని యోగశాస్త్రము దెలుపుచున్నది.

రాగ ద్వేషములు. Love, Hate.

మానసికవృత్తులగు రాగద్వేషముల స్వరూపధర్మములఁ దెలిసికొనుటకు ముందు, వాని కాధారములయిన సుఖదుఃఖముల తత్త్వమును విచారించవలయును.

సుఖమునందు సు+ఖం, అను రెండుపదములు గలవు. సు=లెస్స, ఖం=ఇంద్రియము, ఇంద్రియములకు లెస్స యనఁగ, ఆనుకూల్యము. ఏజ్ఞానము (వేదన) ఇంద్రియముల కనుకూలమో అది సుఖమనియు, ఏజ్ఞానము (వేదన) ఇంద్రియములకుఁ బ్రతికూలమో, అది దుఃఖమనియు భావము. "అనుకూల వేదనీయం సుఖమ్," "ప్రతికూలవేదనీయం దుఃఖమ్." అని నైయాయికులమతము. మనస్సునకు, ఇంద్రియములకు నానందము ప్రీతినిఁ గలిగించునది సుఖమనియు, బాధను, వ్యథనుఁ గలిగించునది దుఃఖమనియు స్పష్టమగుచున్నది. నిరుపాధియగు నిచ్ఛకు విషయమై, ధర్మమున కసాధారణకారణమై, సత్త్వగుణ పరిణామంబగు చిత్తవృత్తి సుఖమనియు, నిరుపాధియగు ద్వేషమునకు విషయమై, అధర్మమున కసాధారణకారణమై, రజోగుణపరిణామంబగు చిత్తవృత్తి దుఃఖమనియు, గీతాశాస్త్రవ్యాఖ్యాతలు నిర్వచించిరి.

శ్లో. దుఃఖాదుద్విజతే సర్వ స్సర్వస్య సుఖమీప్సితమ్.

మహాభారత. శాంతిప 139-61.

లోకములోని ప్రాణివర్గమునకంతయు దుఃఖమనిన భయంబును, సుఖమనినఁ బ్రీతియుఁ గలుగును. ఈసుఖదుఃఖముల

బడు. దీనికే మన్యువు, జిఘాంస, క్రోధమని యోగభాష్యము నందుఁ గలదు.

ఒకఁడు దుఃఖము ననుభవించుచు, ఆబాధను సహింపఁ జాలక, తనకుఁగాని తన పగవారికిఁగాని యెన్నఁడునుఁ గలుగఁ గూడదనియు, నిది నశించవలెననియు, తత్సాధనములగు శత్రు వ్యాధి చోర వ్యాఘ్ర సర్పాదివిషయములం దనిచ్ఛ (అప్రీతి) ద్వేషమనఁబడును. దీనిచే నాత్మ ద్వేషింపఁబడునని వ్యుత్పత్త్యర్థము. మన్యు (శోకము) జిఘాంస (చంపవలెనని యిచ్ఛ) క్రోధము ఈవృత్తులు ద్వేషమందుఁ గలుగును.

ఇష్టవిషయములందుఁ బ్రీతి రాగము; అనిష్టవిషయము లందు అప్రీతి ద్వేషము నని పర్యవసితము.

(Attraction) ఆకర్షణ ధర్మముఁగలది రాగము Love, ప్రీతి Like.
(Repulsion) వికర్షణ ధర్మముఁగలది ద్వేషము Hate, అప్రీతి Dislike.

రాగద్వేషములు.

ఆకర్షణమనఁగా (Attraction) నొకవిషయమునుఁ జూచి నపుడు దాని నాకర్షించి సక్తమై ప్రీతిఁ గలిగియుండునది రాగము-సమీపస్థము. వికర్షణమనఁగా (Repulsion) నొక విషయమునుఁ జూచినపుడు దానిని త్రోసివైచి, యప్రీతిఁ గలిగి యుండునది ద్వేషము-దూరస్థము;

కన్పింపకయున్నను, అంతట సర్వమయంబుగ నుండునని యీ క్రింది సూత్రమునఁ జెప్పఁబడెను.

సూ. తన్మయత్వాచ్చ.

వైశేషికశాస్త్ర. 6 అ. 2-11 సూ.

రాగద్వేషములు.

ఆజన్మమునందు కామినీసుఖ మనుభవింపకున్నను, యౌవనకాలమందు కామినియందు రాగమును, సర్పదంశ దుఃఖము లేకున్నను, సర్పములయందు ద్వేషమును గలుగుట. లోకానుభవసిద్ధము. హిరణ్యాక్ష హిరణ్యకశిపులు విష్ణువు నందు ప్రబలద్వేషబుద్ధిఁ గలవారలై, విష్ణుమయమగు జగత్తును ద్వేషమయంబుగఁ జూచిరి. గోపికలు శ్రీకృష్ణపరమాత్మ యందు బద్ధానురాగలై, వనమందు విహరించుచు నప్పరమేశుఁ గనఁజాలక, రాగాత్మికబుద్ధిచే శ్రీకృష్ణమయముగఁ గాంచిరి. రాగము చిత్తదోషములోఁ జేరినదయినను, ప్రేమస్వరూపుఁ డగు భగవంతునియం దీరాగము దృఢముగఁ జేరెనేని, రాగభక్తి యనఁబడు. ఇయ్యది మోక్షమునకన్న నుత్కృష్టమని భక్తి శాస్త్రమునందుఁ గలదు. విషయాసక్తి రాగము భవబంధమునకుఁ గారణము. ఇదియే భగవంతునియెడఁ గలిగినచో, చిత్త దోషములనెల్ల నశింపఁజేసి నిరతిశయానందదాయకమగు తత్సాయుజ్యము నొసంగును భక్తివిచారప్రకరణమునం దీ విషయము విశదీకరింపఁబడును గనుక యిచ్చట దిఙ్మాత్ర సూచితము.

మానసదోషము లీక్రిందఁ బొందుపఱచినవిధంబున న్యాయశాస్త్రమునందుఁ జెప్పఁబడెను.

సూ. తథాదోషాః, సూ॥ తత్త్రైరాశ్యమ్ రాగద్వేషమోహార్థాంతరభావాత్.

రాగపక్షాః, కామో, మత్సరః, స్పృహా, తృష్ణా, లోభ, ఇతి.
ద్వేషపక్షాః, క్రోధః, ఈర్ష్యా, అసూయా, ద్రోహో, అమర్ష, ఇతి.
మోహపక్షాః, మిథ్యాజ్ఞానం, విచికిత్సా, మానః, ప్రమాద, ఇతి.

ఆసక్తిలక్షణో రాగః. Love, Like.
అమర్షలక్షణో ద్వేషః. Hate, Dislike.
మిథ్యాప్రతిపత్తిలక్షణో మోహః. Infatuation.

ప్రవర్తనాలక్షణముగల దోషము లన్నియు, మూఁడు రాసులుగ విభజించి (రాగ, ద్వేష, మోహ) తక్కినవన్నియు వీనియందు అంతర్భూతములుగ నున్నట్లు సూత్రమునఁ జెప్పఁబడియె. సాత్త్వికరాజస, తామస, గుణముల పరిణామమగు సుఖ, దుఃఖ, మోహములవలన రాగ, ద్వేష, మోహములను మూఁడురాసులనుఁ బ్రధానపక్షములుగ నిర్దేశించిరి. అనాలోచితముగ విషయములందు దృఢముగ సక్తమైనది రాగము. స్వాభావికముగ విషయములందు ద్వేషముఁ గలిగి తొలఁగునది ద్వేషము. లేనిది ఉన్నట్టుల, ఉన్నది లేనట్టుల, విపరీత జ్ఞానముఁ గలిగి మూఢ్యముఁ జెందునది మోహము. ఈమూఁడు దోషములును, జననమరణరూప సంసారబంధమునకుఁ గారణములు.

రాగపక్షగత కామాదిదోషనిర్వచనము.

కామము = స్త్రీవిషయికమగు సురతేచ్ఛ.

మత్సరము = స్వప్రయోజనము లేకున్నను, పరాభిమతమును నివారింపఁ దలఁచుట.

స్పృహా = ధర్మమునకు విరుద్ధముఁ గానటుల విషయప్రాప్తీచ్ఛ.

తృష్ణ = తా ననుభవించేసుఖము క్షీణింపకుండ నుండవలెనని కోరుట.

లోభము = అధర్మముగనైననుఁ బరద్రవ్యముఁ బొందవలెనను నిచ్ఛ, అధిక ధనలాభముఁ గలిగినను, అనుక్షణమది వృద్ధిఁబొందవలెననెడి కోరిక. ఎంత లభించినను, దృప్తిఁబొందఁజాలని యిచ్ఛావిశేషము.

మాయ = పరవంచనేచ్ఛ, దంభము = కపటముచేత ధార్మికత్వ తపస్విత్వాదిగుణములుఁ గలిగియున్నట్లు స్వాతిశయమునుఁ బ్రకటించుకొను కోరిక.

ద్వేషపక్షగతములగు క్రోధాదిదోషములు.

క్రోధము = బాహ్యాభ్యంతరేంద్రియములును, శరీరమును సంక్షోభముఁ జెందుట. నేత్రములు జేవురించుట, ఏదేనాయుధముఁ దీసికొని శత్రువుపై నుఱుకఁ దలఁచుట, ఇట్టిలక్షణములచేఁ బ్రజ్వరిల్లు చిత్తవృత్తి.

ఈర్ష్య = సాధారణముగ నితరుఁడు, తన సొత్తును తాను దీసికొనుచుండఁగఁ జూచి యోర్వలేక ద్వేషించుట.

(ఈసు)అని వైకృతము. ఇది దాయాదులయందుముఖ్య ముగఁ గన్పించును.

అసూయ = ఇతరులను గొనియాడుచుండ, సహింపలేక ద్వేషించుట.

ద్రోహము = దుర్బలుఁడు బలవంతుని నాశముఁ జేయవలెనని తలంచుట, ద్వేషబుద్ధి హింస=ద్రోహమువలన గలిగినది.

అమర్షము = అపరాధముఁ జేసినవానియందు అసమర్థునకుఁ గలుగు ద్వేషబుద్ధి, అభిమానము = అపకారముఁజేసిన వానియందు (నిష్కి_ంచినునకు)దీనునకుఁ గలుగు ద్వేషబుద్ధి.

మోహపక్షగతములగు దోషములు.

మిథ్యాజ్ఞానము = విపరీతజ్ఞానము; అనఁగా, అయథార్థ నిశ్చయము. ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు నిశ్చయించుట.

విచికిత్స = ఇదియా ? అదియా ? యని నిశ్చయజ్ఞానము లేక సంశయించుట; సందేహము.

మానము = తనయందు లేని యుత్తమగుణముల నారోపించుకొని గొప్పవాఁడను,ధనవంతుఁడనని (అభిమానించుట) విఱ్ఱవీఁగుట, ఇతరులయందుఁగల గొప్పగుణములఁ బ్రశంసింపక కప్పిపుచ్చుట.

ప్రమాదము = ఇది చేయవలసినదని పూర్వము నిశ్చయించు

కొనినను, అజాగ్రతచేఁ జేయకుండుట, సోమరితనము పొరబాటు.

భయము = అనిష్ట హేతువులు గన్పించినను, వానిని నివర్తింపజాలని బుద్ధి.

శోకము = ఇష్టవియోగము గలిగినపుడు దానిని బోఁగొట్టఁజాలని బుద్ధి.

ఈ విషయమును యోగశాస్త్రమునందుఁ గలదు.

సూ. అవిద్యాఽస్మితరాగద్వేషాభినివేశాః.

పాతంజలయోగశాస్త్ర. 2 అ. 3 సూ.

అవిద్య, అస్మిత, రాగము, ద్వేషము, అభినివేశము, అను నయిదుక్లేశములు గలవు. ఈక్లేశములు సంసారబంధమునకు హేతువులు.

మాయ.	Illusion	ఈ మూఁడును అవిద్యకుఁ బర్యాయపదములు.
మోహము.	Delusion	
తమస్సు.	Infatuation Blind darkness	

రాగద్వేషములు.

ఈ రాగద్వేషములు విషయము నాశ్రయించి, ఉత్తమ సమానమధ్యములయెడ వేర్వేఱు పదములచే వ్యవహరింపఁబడును. తనకన్న నధికులయందు గొప్పగుణము, మహత్త్వము

ఔదార్యము మొదలగునవి యుండుటచే, వారియందుఁ గలుగు ప్రీతికి (రాగము) గౌరవము, భక్తియని పేరు. Reverence, Respect.

తనతో సమానగుణములుగల సములయెడ గలుగు ప్రీతికి (రాగము) మైత్రి, స్నేహమని పేరు. Friendship.

తనకన్న నధములయందుండెడు దైన్యము,దారిద్ర్యము, క్లేశములఁబట్టి, వారియెడఁ జూపుప్రీతికి (రాగము) వాత్సల్యము, కనికరమునని పేరు. Compassion, Benevolence.

శ్రీభాగవతమునం దీవిషయమునుఁగూర్చి :—

శ్లో. గుణాధికాన్ముదం లిప్సేదనుక్రోశం గుణాధమాత్,
మైత్రీం సమానాదన్విచ్ఛేన్న తాపైరనుభూయతే.
మహతాం బహుమానేన దీనానామనుకంపయా,
మైత్ర్యా చైవాత్మతుల్యేషు యమేన నియమేన చ.

శ్రీభాగవతే. 4 స్కంధ. 8 అ.

ఉత్తములయెడ సంతోషమును, అధములయెడఁ గనికరమును, సమానులయెడల మిత్రభావమునుఁ గలిగియున్న యెడల, తాపత్రయము గలుగదు. గొప్పవారిని గౌరవముతోడను, దీనులనుఁ గనికరముతోడను, తనతో సమానులను మిత్రభావముతోడనుఁ జూడవలయునని పై శ్లోకములకు ...ము.

...శములగు దేవతలు, గురువులు, మహాత్ములు, సంయ...రియెడ భక్తి, గౌరవము, వందనము, పూజ,

కైంకర్యము, నమ్రతఁ జూపినయెడల అహంకారము, అభిమానము నశించును. వారి యనుగ్రహమునకుఁ బాత్రుఁడై యుపదేశముచే నంతఃకరణశుద్ధిఁ బడయును.

రాగద్వేషములు.

సమానగుణధర్మములు గలవాఁడు మిత్రుఁడు. వీని యందు నమ్రత, కనికరమును రెండును గలుగవు. తనకన్న నధికుఁడు గానందున నమ్రత లేదు. దీనుఁడు గానందున కనికరమును లేదు.

శ్లో. భుఙ్క్తే భోజయతే చైవ గుహ్యం వక్తి శృణోతి చ,
దదాతి ప్రతిగృహ్ణాతి షడ్విధం మిత్రలక్షణమ్.

మిత్రునింట భుజించును, అతనిని భుజింపఁజేయును, రహస్యమునుఁ జెప్పును, అతనివలన వినును, ఇచ్చును, గ్రహించును. ఈయాఱును మిత్రలక్షణములు. ఇవిగాక కరస్పర్శముఁ జేసి భుజముమీఁద భుజము వైచి, యాలింగనమునుఁ జేసికొందురు. ఇవి మిత్రునియెడఁ జూపు ప్రీతిలక్షణములు. ఈప్రీతి పరస్పరాకాంక్షితము. ఇచ్చట మానసికభావమేగాక, శారీరక చేష్టలునుఁ జూపఁబడినవి.

తనకన్న నధములనఁగా, దీనులును, దారిద్ర్యక్లేశముచే బాధపడువారును, వికలాంగులును, సాహాయ్యము నపేక్షించువారు. వీరెట్లు జీవింతురు? వీరిబాధ లెట్లు తొలఁగును? వీరికి

మనశ్శాంతి యెట్లుకలుగునని వారియెడఁ గృప, కరుణకలుగును. దీనినే Compassion, Kindness, Benevolence, Pity అని యందురు. దీనులయెడఁ గృప కలిగినపుడు, కన్నీరువిడుచుట, భయపడవలదని చేతితో పరామర్శించుట, ధైర్యోత్సాహకరము లగుమాటలు జెప్పుట లోనగు శారీరక్రియలును గలుగుచుండును.

జీవకారుణ్యము లేనివాఁడు పశుతుల్యుఁడు గాని, మానవుఁడు కాఁజాలఁడని ప్రాజ్ఞులు వచింతురు. ఈశ్వరారాధన మనిన భూతదయయేయని తలఁచి, మహనీయులగు సాధువులు సర్వప్రాణులయెడ సేవారూపమగు కనికరముఁ జూపుదురు. ఉత్తములయెడ తాను గౌరవము, భక్తిఁ జూపినయెడల, వారు తనయందు వాత్సల్యమునుఁ బ్రేమనుఁ జూపుదురు. అధములయెడ తాను కనికరముఁ జూపినయెడల, వారు తనయందు గౌరవమును భక్తినిఁ జూపుదురు. ఇట్లు ప్రీతి పరస్పరాకాంక్షితముగ నుండును.

ద్వేషము. Hate.

తనకన్న నధికులయెడఁ దనకు ద్వేషముఁగలిగిన వారిని నగౌరవింపఁదలఁచుట, దూషించుట, పగతీర్చుకొనఁ దలఁచుట, లోనగు ద్వేషభావములుఁ గలుగును. సామాన్యముగ ద్వేషమనఁగ అప్రీతి. ఈయప్రీతి యొకరికొకరికి మనస్సు కలియనందునఁ గలుగుచుండును. ప్రీతి యాకర్షించి పరస్పరాను

సంధానముఁ గావించును. అప్రీతి ద్వేషముఁ గలిగించి, మనస్సుఁ దొలఁగించి వేఱుసేయుచుండును. అప్రీతి ప్రథమావస్థ, ద్వేషము ద్వితీయావస్థ, క్రోధము తృతీయావస్థ. ఈ ద్వేషము జనించుట కనేకకారణములు గలవు. తాను కోరి ప్రయత్నించినవిషయము, మఱియొకరు కోరి ప్రయత్నించినను, తనప్రయత్నములకు మనోరథముల కాటంకముఁ గలిగించినను, తన శత్రుకోటితోఁ జేరి యాలోచనలు సలుపు చుండినను, ద్వేషము గలుగుచుండును. సాధారణముగ తన యభిమతమునకు విరుద్ధముగ నేది జరిగినను చిఱచిఱలాడు నొక విధమగు ద్వేషము (Moroseness) సమానులయందుఁ గలుగును. సభలయందు విద్యాధికులు, కవులు, పండితులు, కళాప్రవీణులు, తమ సామర్థ్యమునుఁజూపి, గొప్పసన్మానమునుఁ బొందుతఱిఁ గొంద ఱసూయాపరులు వారి యుత్కర్ష నోర్వఁ జాలక కొన్ని యాటంకములఁ గల్పింతురు. అసూయాగ్రస్తులును, విద్యాధికు లయినందున వారి సన్మానమునకు సమ్మతించి నచోఁ దమ కగౌరవమును, న్యూనతఁ గలుగునని తలంపుతో నకారణకలహములఁ బెట్టుకొందురు. వివాదములఁ బెంచుకొని యొకరినొకరి నోడించినందుచేనఁ గలుగునవమానము ప్రబలద్వేషమునకుఁ గారణ మగును. ఈద్వేషము క్రోధరూపముగఁ బరిణమించి యొకరినొకరు కొట్టుకొని, ప్రాణము పోవునంతపని యగును.

ద్యూతమునందును, వ్యాయామఖేలనమందును,తనకుఁ బరాజయముఁ గలుగునపుడును, ప్రతికక్షివారు హర్షోత్ఫుల్ల మనస్కు లయినపుడును, ద్వేషము గలుగును. ఈద్వేషము క్రోధముగఁ బరిణమించి యనర్థముఁ గలిగించేను.

ద్వేషము.

వినోదమునకుఁగాక, పణయుక్తమగు ద్యూతమునందుఁ బరాజయము కలుగుకొలఁదిని, చేలము, పట్టుదల ద్వేష మతిశయించుచుండును. జ్వరాపస్మారాదివ్యాధులచే దౌర్బల్యముఁ గలిగినపుడు మనస్సు చెడి ప్రీతిజనకములగు పదార్థములయందును ద్వేషము గలుగును.

జాతివైరముగల గజసింహములకును, గోవ్యాఘ్రములకును, నకుల భుజంగములకును, మూషికమార్జాలములకును, శ్యేనకపోతములకును, సహజద్వేషము పరస్పరముగ నుండును. ఇందు బలాధికునివలన, బలహీనునకుఁగల ద్వేషము భయ మనఁబడు. మూషికభుజంగాదులు తమవైరులగు మార్జాల నకులాదులనుఁ జూచి, తమ్ము భక్షించునని భయపడి పరుగెత్తిపోవును.

ఉత్తములయెడ ద్వేషము.

తనకన్న నుత్తములగు ప్రభువులు, అధికారులు, యజమానులు, తనయెడ నప్రీతిఁ జూపునపుడు, అశక్తుఁడగు తాను

చేయునది లేక లోపల ద్వేషమున్నను, ధైర్యహీనత, పిరికి తనము, భయముఁ జెందుచుండును.

ఆచార్యులు, గురువులు, ఉపదేష్టలు, తనయెడ ననాదరము (అప్రీతి) జూపినపుడు, వారియెడ ద్వేషభావ ముదయించినపుడు, దానిఁ బ్రశ్రయభావముగా మార్చుకొని,వారియెదుట తననుఁ దాను నిందించుకొనుచుఁ బెద్దలయనుగ్రహమునకుఁ బాత్రుఁడఁ గాఁజాలనైతిననుచు, మందభాగ్యుఁడననుచు, వారికిఁ గనికరము ప్రీతి కలుగునట్లు ఆశ్రయించి, పాదములపైఁబడి ప్రసన్నులఁ గావించుకొనును. ఇది మహనీయులయెడఁ జూపువిధము.

సమానులయెడ ద్వేషము.

శ్లో. "మిత్రదండమభాషణమ్."

అను న్యాయము ననుసరించి తనకు సమానులగువారియెడ ద్వేషముఁ గలిగినపుడు, పలుకకుండుట కరస్పర్శ పరిష్వంగనాది ప్రీతిసూచకములగు మర్యాదలఁ జూపకుండుట, చిఱచిఱలాడుచు మాట్లాడిన సులభముగఁ గోపముఁ దెచ్చుకొనుట,ముఖవికాసము లేక చిట్లించుకొనుట, షడ్విధమిత్రలక్షణములు లేకుండుట, లోనగుసూచన లగపించును. భీతినిఁ జెందఁడు. తిరస్కారముఁ జూపఁడు.

అధములయెడ ద్వేషము.

తనకన్న నధములు తప్పొనరించినను, ద్వేష్యకోటిలోఁ జేరి యాలోచనములు సలుపుచున్నను, ప్రయత్నభంగముఁ

జగత్పూజ్యులయెడ ద్వేషము, అసూయ కలుగుట అనర్థకరము.

స్వార్థత్యాగులును, పరోపకారనిరతులును, సౌజన్య నిధులును, జితేంద్రియులును, సమదర్శిత్వమునుగల మహనీయులు కొందఱు ఉత్తములు గలరు. తమయుపదేశామృత మున నాశ్రితుల తాపములఁ బోఁగొట్టి యానందాబ్ధి నోలలా డింపఁగల మహాత్ములయెడ నెవ్వరును ద్వేషభావముఁ జూపఁ జాలరు. లోకబాంధవుని దివ్యప్రకాశమునుఁ జూచి యోర్వ లేక ద్వేషించిన ఘూకంబు మాడ్కి నీయసూయాపరుఁడును నిందితుఁ డగును. జగత్పూజ్యమగు నీశ్వరశక్తియగు నీమహి మ నెవరు వారింపఁగలుగుదురు? మహత్తరమగు నయస్కాం తము, లోహసూచీగణముల నాకర్షించినటుల మహనీయుఁడు తన దివ్యతేజస్సుచే తలిదండ్రులు బిడ్డలఁ దమయొద్దకుఁ దీసి కొనినటుల, తనవైపునకు లాగికొనును. మహనీయులచుట్టు దివ్యతేజస్సు (Aura) ఆవరించి యుండునని యోగశాస్త్రజ్ఞులు చెప్పుచున్నవారలు. మకరందభరితమగు పుష్పగుచ్ఛమును, భృంగము లాశ్రయించినట్లు,ఆమహనీయునిదివ్యామృతమునుఁ గ్రోలుచు, వేనవేలు జనములు మూఁగియుందురు. ఆమహనీ యుఁడును మానోన్నతిఁ జెందక, సర్వసముఁడై సమదర్శియై యెల్లఱ నాదరించుచు, నాబాలగోపాలముగ మాట్లాడుచుఁ

ఆత్మప్రకాశము ప్రాకృతగుణములచే నావృతముఁ గాక సర్వభూతహితేచ్ఛకై, విస్తారముగ వికసించుట మహనీయతకుఁ (Superiority, Greatness) గారణమనియు, రజస్తమోగుణావృతమై, స్వార్థమునకై ప్రసరించి సంకుచితమగుట అధమత్వమునకును (Inferiority Smallness) గారణమనియు విమర్శమువలనఁ దెలియనగును.

ఉత్తమసమానాధములయెడఁ జూపఁదగిన భావములు.

పైనిఁ జెప్పిన నిదర్శనమువలన నుత్తములయెడ నీశ్వరాంశములగు కళ్యాణగుణము లున్నవని వారి నాశ్రయించి, యాగుణముల నభివృద్ధిఁ జేసికొనవలయుఁ గాని, యసూయచే ద్వేషింపఁగూడదనియు, నధములయెడ దుర్గుణము లున్నవని, వారినిఁ దిరస్కరించి తృణప్రాయముగఁ జూడక, కనికరముఁ గలిగి, సాదరముతో సద్గుణములు పట్టుపడునట్లు ప్రయత్నించవలెననియు నీతత్త్వశాస్త్రాభిప్రాయము.

ఈయభిప్రాయమే మహాభారతమున భీష్ముఁడు యుధిష్ఠిరునితోఁ జెప్పెను.

శ్లో. అకృత్వేర్ష్యాం సమానేషు వృద్ధానవమాన్య చ,
దీనేష్వకృత్వా దర్పం త్వం నరేషు శ్రేష్ఠతాం గతః.

ఓధర్మరాజా! "నీవు సమానులయెడఁ జిరచిఱలాడుచు, ముంగోపితనముగల యీసునుఁ జూపక, ఉత్తములగు

పెద్దలయెడ నగౌరవమును, (అవమానము)అలక్ష్యముఁ గలుగునట్లు ప్రవర్తింపక, అధములగు దీనులయెడ నేనధికుఁడనను గర్వమును, అహంకారమును విడిచి, కృపఁగలిగి ప్రవర్తించినట్లయిన మానవోత్తముఁడ వగుదువు" అని యిట్లు గాంగేయుఁ డుపదేశించుటచే, లోకములో నెవ్వఁడేని ఈర్ష్య, అసూయ; గర్వములను విడిచి మెలఁగెనేని లోకమాన్యతఁ జెందునని భావము.

వ్యక్తులు.	చూపఁదగినవి.	చూపఁదగనివి
ఉత్తములయెడ. Superiors.	నిగర్వము. Humility.	అగౌరవము, అలక్ష్యత. Slightingness.
సమానులయెడ. Equals.	మర్యాద. Courtesy.	ఈర్ష్య, ముంగోపము. Irascibility.
అధములయెడ. Inferiors.	కృప. Compassionateness.	దర్పము, స్వాతిశయత్వము. Arrogance.

కామక్రోధములు

కామము.

మానవుని యభ్యుదయమునకుఁ గారణములగు చతుర్విధపురుషార్థములలో ధర్మార్థకామములకు త్రివర్గసంపద

గంధములనెడి విషయములందు, ఆనుకూల్యప్రవృత్తి కామ మనఁబడును. ఇంద్రియములతోఁ గూడిన మనస్సునకు విషయోపభోగస్వభావము (ఇచ్ఛ) కామమని తాత్పర్యము. విషయోపభోగేచ్ఛ మనస్సునకు స్వభావసిద్ధమనియుఁ, బ్రవృత్తికిఁ గారణమనియు, నిది లేక సృష్టి విస్తరింపఁబడదనియు, వేదమునందునుఁ గలదు.

కామము.

శ్రు. కామస్తదగ్రే సమవర్తతాధి మనసో రేతః ప్రథమం యదాసీత్,
సతో బంధుమసతి నిరవిందన్ హృది ప్రతీష్యా కవయో మనీషా.
ఋగ్వేద. 29-4.

మనస్సుయొక్క యే రేతస్సు అనఁగా బీజము ప్రారంభమున బయలువెడలెనో, అదే ప్రారంభమున కామము (సృష్టిని నిర్మించు ప్రవృత్తి లేక శక్తి) అయ్యెను. అసత్తునందు, అనఁగా మూల పరబ్రహ్మమునందు, సత్తుయొక్క అనఁగా, వినాశి దృశ్యసృష్టియొక్క (మొదటి) సంబంధమని ప్రాజ్ఞులు అంతఃకరణమునందు విచారించుకొని బుద్ధిచే నిశ్చయించినారు. అనఁగా మనస్సుయొక్క బీజమగు కామమే ప్రవృత్తికిఁ (సృష్టికి) గారణమని భావము.

శ్రు. "కామమయ ఏవాయం పురుషః."

పురుషుఁడు కామమయుఁడని (మనోమయుఁడు) బృహదారణ్యకోపనిషత్తునందును గలదు.

లోకమునందు సంకల్పము లేక యెట్టి క్రియయు జరుగదు. ఇష్టఫలమును సాధింపవలెననెడి బుద్ధిఁ గలిగినతర్వాత, దానియం దిచ్ఛ కలుగును. పిమ్మట దానికొఱకై ప్రయత్నము చేయును. ఇట్లు సంకల్ప, (జ్ఞాన) ఇచ్ఛ, (ప్రయత్న) క్రియలు, క్రమముగ జరుగునని యిదివఱలోఁ జెప్పఁబడెను. అరిషడ్వర్గములోఁ జేరిన కామము ధర్మ్యముఁ గాక, విషయాసక్తమైనందున బంధమునకు హేతువై దూష్యమయ్యెను. కాని, లోకయాత్ర కావశ్యకమై, ధర్మయుక్తమై ఫలాభిసంధి లేని కామము మోక్షమునకుఁ బరంపరాసాధనమైనందున, గీతాశాస్త్రమునందు "ధర్మాఽవిరుద్ధః కామోఽస్మి" ధర్మమునకు విరుద్ధము కాని కామము నేనే యగుచున్నానని విభూతియోగమందు భగవానుఁ డానతిచ్చెను. కాఁబట్టి, ధర్మసమ్మతమైన కామము, గీతలయంగీకారముఁ బడసినదయ్యెను.

కామము.

శ్లో. కామాత్మతా న ప్రశస్తా న చైవేహా స్త్యకామతా,
కామ్యో హి వేదాధిగమః కర్మయోగశ్చ వైదికః.

సంకల్పమూలః కామో వై యజ్ఞాస్సంకల్పసంభవాః,
వ్రతాని యమధర్మాశ్చ సర్వే సంకల్పజాస్స్మృతాః.

అకామస్య క్రియా కాచిద్దృశ్యతే నేహ కర్హిచిత్,
యద్యద్ధి కురుతే కించి త్తత్తత్కామస్య చేష్టితమ్.

మనుస్మృతి. అధ్యాయ. 2; శ్లోక. 2-3-4.

ఫలాపేక్షతోఁ గార్యము లొనర్చుట ప్రశస్తమైనది కాదు. అయినను ఇహలోకంబున ఫలాపేక్ష లేకుండుట యసాధ్యము. సాంగ వేదాధ్యయనము, వేదోక్తములైన కర్మలయందాసక్తియుఁ గామ్యమైనదే. ఈ యీవస్తువులు కావలయునని కోరుట సంకల్పము. దానివలన కామము పుట్టుచున్నది. యజ్ఞములయం దాసక్తి, వ్రతములు, నియమములుఁ నివి యన్నియు సంకల్పమువలననే పుట్టుచున్నవి. లోకంబున కోరికలేనివానికి ఏకార్యమును లేదు. నడచిపోవ నిచ్ఛఁ గలిగినపుడు నడచిపోవుటయు, భోజనము చేయ నిచ్ఛ గలిగినపుడు భుజించుటయు, విన నిచ్ఛ గలిగినపుడు వినుటయు, నివియన్నియు కామముయొక్క వ్యాపారములు మనుజుఁడు చేయు నొక్కొక్క క్రియయు, కామచేష్టితమే కాని, వేఱుకాదు. అని మనువు చెప్పియున్నాఁడు.

బంధహేతువగు ఫలాసక్తిని వదలి, మంచి తలంపుతో ధర్మయుక్తముగ కార్యము లొనర్చువాఁడు, అమృతత్వమగు బ్రహ్మభావమును బొంది యైహికములగు సర్వమనోరథములు బొందుచున్నాఁడనియు, నిష్కామకర్మానుష్ఠానమువలన నంతఃకరణశుద్ధి గలుగుననియు, రాగాదిదోషములు నశించుననియు, ధర్మయుక్తమగు కామము పురుషార్థప్రదమనియు స్పష్టమగుచున్నది. విషయాసక్తమగు తుచ్ఛకామము విడువవలయునని కాని పురుషార్థప్రదమై ధర్మమునకు విరుద్ధముగాని కామము విడువవలయునని తాత్పర్యము కాదు.

జేరును. నిర్వికల్పకసమాధి యనిన, కైవల్యమనిన, బ్రహ్మానంద పదవియనిన, అమృతత్వమనిన నిట్టి స్థితియే యగును. నైష్ఠిక బ్రహ్మచారి నివృత్తిమార్గస్థుఁడై సన్న్యసించి విషయసుఖము లకు దూరగుఁడయినందున, కామాదిసంకల్పములు నశించును గాని, గృహస్థాశ్రమమందుండు ప్రవృత్తిమార్గస్థునికి వేదోక్త కర్మలు, తన్నిమిత్తమర్థ మార్జింపవలసియుండును గాన, సంక ల్పములు, కామములు, వీడను వలనుపడదు. లోకయాత్రకై కర్మానుష్ఠానముఁ గావించునపుడును, సంకల్పమును, కామ మును లేక యేదియును జరుగదు. కామసంకల్పాదుల విష యమై ప్రవృత్తి నివృత్తిమార్గస్థులకుఁ బరస్పరవిరోధముఁ గలుగుచుండ నెట్లు ప్రవర్తింపవలయునని విచారము గలుగు నెడ శాస్త్రములన్నియు నైకమత్యముఁ జూపినవి.

ఎట్లనఁగా: ప్రవృత్తిమార్గస్థుఁడు కర్మయోగి ఇంద్రియ ములను లోఁబఱచుకొని, శుద్ధమనస్కుఁడై ఫలాసక్తిని వదలి వేదోక్తకర్మల ననుష్ఠించెనేని కామసంకల్పాదులచే బద్ధుఁడు గానేరఁడు. కామసంకల్పాదులు విషయాసక్తములు గాక, పరోపకృతికి భగవదారాధనకు దీనజనసేవకు ధర్మకార్యముల కుపయోగపఱచిన బంధకములు గాఁజాలవు. స్వార్థమై విష యాసక్తములయిన రాగద్వేషములు జనించి యనర్థకరము లగును. గృహస్థుఁడగు కర్మయోగి ఫలాసక్తిని వదలి, విధ్యుక్త కర్మానుష్ఠానము సలిపెనేని, అంతఃకరణశుద్ధినిఁ బడసి క్రమ

ముగా మోక్షమునుఁ బొందును. కామసంకల్పాదులు ధర్మము నకు విరుద్ధములు గానందున,జగత్కళ్యాణమునకుఁ గారణము లగును. ఇట్టి సంకల్పజనితములగు కామములు లోకకళ్యాణ దాయకములయినందున ప్రవృత్తిమార్గములో ప్రవృత్తిమార్గ స్థునకు ప్రేయము, శ్రేయమునుఁ గలిగించును.

నివృత్తిమార్గస్థుఁడగు జ్ఞానయోగి, లోకవ్యాపార మేమియు లేనందున, విషయవిముఖుఁడై మనస్సునుండి సం కల్పజనితములగు కామములనన్నింటిని బారఁదోలి, వివేక వైరాగ్యములచే మనస్సును నిర్మలమును నిర్వృత్తికమునుఁ జేసి, పరమాత్మయందు లయింపఁజేయును. అట్టి జ్ఞానయోగి అంతర్ముఖుఁడై, బాహ్యవ్యాపార మేమియు లేక బ్రహ్మానందము నందియుండును. మనంబు బ్రహ్మాకారవృత్తిని జెందియుండిన యట్టి మహనీయునకుఁ గామసంకల్పాదు లుండవు.

"సంకల్పప్రభవాన్ కామాంస్త్యక్త్వా సర్వానశేషతః."

భగవద్గీత.

యోగాభ్యాసముచేయు ఆరురుక్షువు సంకల్పజనితము లగు సర్వకామములను నిశ్శేషముగా విడువవలయునని భగవ ద్గీతలయందుఁ జెప్పఁబడిన విషయము అంతర్ముఖునివిషయము. చిరకాలము విషయాసక్తములగు కామములను, వానినిఁ గలిగించు సంకల్పములను విడిచినఁగాని, మనస్సు ఏకాగ్రత నొందదు. ఏకాగ్రతఁ జెందనిమనస్సు, విక్షేపములచే సమాధి కుపయోగింపదు. కాఁబట్టి దుఃఖజనకములగు విషయములయం

దాస_క్తమై, రాగాత్మికమగు కామమునుఁ బూ_ర్తిగా విడువ వలయునని భావము.

దేవ, ఋషి, పితృఋణములఁ దీర్చి మోక్షమునకై ప్రయత్నించవలె ననుట.

మానవుఁడు దేవర్షి పితౄణములు మూఁడింటచే బద్ధుఁడై పుట్టుచున్నాఁడు. యజ్ఞములు చేసి హవిర్భాగములచే దేవతలను, అధ్యయనముఁ జేసి ఋషులను, పుత్త్రులఁ బడసి, శ్రాద్ధాదులచేఁ బితరులనుఁ దృ_ప్తిఁ గావించి, ఋణవిము_క్తుఁడై మోక్షమునకుఁ బ్రయత్నింపవలయును. లేనిచో ప్రతిబంధముఁ గలుగును. విధాత దేవతలను, పితరులను, మానవులను సృజించి పరస్పరసహాయముచే శ్రేయమునుఁ బొందుఁడని, వారివారికిఁ దగినట్లు ఆహారములనుఁ గల్పించి, ప్రవృ_త్తిచక్ర మునం దిడగ, నప్పరమేష్ఠిసంకల్పము నుల్లంఘించి, తదను గ్రహముఁ బడయక మోక్షమునకుఁ బ్రయత్నించెనేని యథః పతనముఁ గలుగుచుండు. దేవర్షి పితరుల యనుగ్రహంబున శరీ రంబును, ఇంద్రియంబులును, మనస్సును, పుత్త్రకళత్రగృహ క్షేత్రాదిభాగ్యంబునుఁ గలిగినపుడు కృతజ్ఞుఁడై వారివారికిఁదగి నట్లు క్రియలచే సంతుష్టులఁజేసి ఋణవిము_క్తుఁడై, వారియను గ్రహంబున మోక్షమునుఁ బడయవలయును. ఇహలోకంబున మానవునకుఁ గలిగిన పుత్త్రమిత్రకళత్ర గృహక్షేత్రధనాది వైభవములు ఋణానుబంధరూపమైనవి కాని వేఱు కావు. పుణ్యా

పాపకర్మలు క్షయించెనేని, అంతఃకరణశుద్ధిఁ గలిగి జ్ఞానవైరాగ్యములచే ముక్తుఁ డగును. మానవుఁడు తా నెల్లఱకు ఋణపడి యుండినాఁడని తెలిసికొని,తన్నాశ్రయించినవారిఋణములనుఁ దీర్చుటకే బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థాశ్రమములును, ధర్మార్థకామములును, ప్రవృత్తి ధర్మసాధనసౌకర్యములను, భగవంతుఁ డనుగ్రహించినాఁడని గ్రహింపవలయును. మన్వాది ధర్మశాస్త్రములు మానవుని ప్రవృత్తిమార్గమునుండి, కర్మాను ష్ఠానముచేతను, తపోవ్రత నియమాదులచేతను, ఋణవిముక్తునిఁ గావించి, నివృత్తిమార్గములోనికిఁ దీసికొనిపోవు ధర్మములను, పద్ధతులును, అనుష్ఠానక్రమమును బోధించెను. కాఁబట్టి ధర్మార్థకామములను సేవించి, పక్వఫలంబునుఁ బోలె పరిశుద్ధాంతఃకరణుఁడై నివృత్తిమార్గంబునకుఁ గడంగవలయు.

కా మ ము

శ్లో. వాంఛా సజ్జనసంగతౌ పరగుణే ప్రీతిర్గురౌ నమ్రతా,
విద్యాయాం వ్యసనం స్వయోషితి రతిర్లోకాపవాదాద్భయమ్.
భర్తృహరిసుభాషితం.

సజ్జనసాంగత్యమునం దభిలాషయు, పరులగుణము నందుఁ బ్రీతియు, వేదాంతాదివిద్యల నభ్యసించుటయందు దృఢాభిలాషము, అనఁగా ఆసక్తియు, నివియన్నియు ధర్మసమ్మతములయిన కామములు కాఁబట్టి ఇట్టి నిర్మలగుణములుగల మహనీయులు పూజ్యులని భర్తృహరియోగీంద్రుఁడు వచించెను.

తృష్ణారూపకామము.

ఇఁకను విషయాసక్తమయి రాగాభిధమను కామమును విమర్శింపవలెను.

శ్లో. ధ్యాయతో విషయాన్ పుంసస్సంగస్తేషూపజాయతే,
సంగాత్సంజాయతే కామః కామాత్క్రోధోఽభిజాయతే.

భగవద్గీత. 2 అ.

శబ్దాదివిషయములందు విశేష రమణీయత్వము నారోపించుట సక్తి యనఁబడు. సక్తి యనఁగా ప్రీతి. ఈప్రీత్యతిశయమువలన కామము కలుగును. ఇచ్చట కామము తృష్ణ యనఁబడునని శాంకరభాష్యమునఁ గలదు.

ప్రీతి (సక్తి) యనఁగా సాధారణాసక్తిమాత్రమనియు;

తృష్ణ (కామము) యనఁగా ఉద్రిక్తాసక్తియనియు, ఆనందగిరివ్యాఖ్యయందుఁ గలదు. స్రక్చందన వనితాదివిషయములను మాటిమాటికి మనస్సుచే భావన చేయువానికి ఆ విషయములందు ఇవి నా కత్యంతసుఖహేతువులని ఆసక్తిఁ గలుగును. శోభనాధ్యాసలక్షణ మగుప్రీతి విశేషము. సుఖహేతుత్వజ్ఞానలక్షణమగు (సక్తి) ప్రీతివలన నివి నాకుఁ గలుగవలెననెడి కామము (తృష్ణ) జనించునని మధుసూదనీ వ్యాఖ్యానము. విషయాసక్తిచేత వానియం దధికకామము గలుగుచుండునని స్వామిటీక. వీనినన్నింటినిఁ బరిశీలింపఁగా, శబ్దాదివిషయములు గోచరించినపుడు ఇవి మిగుల రమణీయ

ములుగా నున్నవి. ఇవి నా కత్యంతసుఖహేతువులుగా నున్న వని తలఁచుట ప్రీతి యనియు ఇవి నాకుఁ గలుగవలెననెడి దృఢాభిలాషము (అధికకామము) తృష్ణయనియు, ఈతృష్ణకే యిచ్చుట కామమనియుఁ బర్యవసితాభిప్రాయము. ఈకామమున కేకారణముచేతఁగాని విఘాతము (అడ్డు) కలిగిన ప్రజ్వలించెడిక్రోధ ముత్పన్న మగును.

గీతాశాస్త్రమునందు ద్వంద్వములగు కామక్రోధములు చెప్పునప్పు డంతట తృష్ణారూపమగు తీవ్రవిషయాభిలాషము, ఉద్రిక్తావస్థ గలది కామమని భాష్యకారాదులు నిర్వచించిరి. త్రివర్గగతమగు కామమునకును, ఈకామమునకు నెంతేని భేదము గలదని, ఆయాసందర్భప్రకరణములఁబట్టి విదితమగును. తృష్ణారూపమగు నీకామము పరమానర్థకరము కాఁబట్టి శ్రేయస్కాముఁడు (ముముక్షువు) దీనిని నశింపఁజేయఁ బ్రయత్నింపవలెనని అనేకఘట్టములందు నొక్కి వక్కాణించిరి.

శ్లో. కామ ఏష క్రోధ ఏష రజోగుణసముద్భవః,
మహాశనో మహాపాప్మా విద్ధ్యేనమిహ వైరిణమ్.

భగవద్గీత. 3 అ. 37 శ్లోకం.

శ్లో. శక్నోతీహైవ యస్సోఢుం ప్రాక్శరీరవిమోక్షణాత్,
కామక్రోధోద్భవం వేగం సయుక్త స్స సుఖీ నరః.

భగవద్గీత. 5 అ. 23 శ్లోకం.

కామినీవిషయిక తృష్ణ-కామము.

కామినీగతాభిలాషము చక్షుఃప్రీత్యాదిదశలచే నుత్కటావస్థనుం జెంది, యభిమతార్థసిద్ధి గలుగనపుడు ఉన్మాదము, మూర్ఛ, మరణము సైతము సంభవించును. తనయెడ వలపుం జూపి యాశం గలిగించినకాంత అన్యాక్రాంత యైనను, నిరాకరించినను, దుర్భరమగు మనోవ్యథను సహింపఁజాలక కొందఱు ఆత్మహత్యనుం గావించుకొనుటయు లోకానుభవసిద్ధము. కాముకులు కామినీమణులయం దత్యంతానురక్తులై, తద్గతప్రాణులై, యదియే లోకమని భ్రమింతురు. చేతిలోనిపిట్టనెటు లాడించిన నటు లాడునటుల, కామినీవశంగతులగు కాముకులును, మోహబద్ధులై యాడించినట్లు ఆడుదురు. కామినీలగ్నమనస్కు లగుటంబట్టి కాంత తనయెడ ననురక్త యయ్యెనేని మనస్సు అమృతమయంబుగను, విరక్త యయ్యెనేని విషమయంబుగ నుండును. ఏవ్యాధికేని యౌషధము గలదు గాని, కాంతావ్యామోహమునకు భగవదనుగ్రహముం దక్క వేఱొకయౌషధము లేదని పురూరవశ్చక్రవర్తి ఊర్వశీవిరహపరితప్తుఁడై పిమ్మట ఉద్బోధితుఁడై తన అజ్ఞానమునుఁగూర్చి యీక్రిందివిధముగఁ జింతించెను.

శ్లో. అహో మే మోహవిస్తారం కామకశ్మలచేతసః,
దేవ్యా గృహీతకంఠస్య నాయుఃఖండా ఇమే స్మృతాః.
అహో మే ఆత్మసమ్మోహో యేనాఽత్మా యోషితాకృతః,
క్రీడామృగశ్చక్రవర్తీ నరదేవశిఖామణిః.

సపరిచ్ఛదమాత్మానం హిత్వా తృణమివేశ్వరం,
యాంతీం స్త్రియం చాన్వగమం నగ్న ఉన్మత్తవద్రుదన్.
కిం తస్యానుభావస్సా న్యత్తేజ ఈశిత్వ మేవ వా,
యోఽన్వగచ్ఛం స్త్రియం యాంతీం ఖరవత్పాదతాడితః.
పుంశ్చల్యాపహృతం చిత్తం కోన్వన్యో మోచితుం ప్రభుః,
ఆత్మారామేశ్వరమృతే భగవంతమధోక్షజం.

శ్రీభాగవతం.

కామకలుషితచిత్తుఁడనగు నేను ఊర్వశిచే నాలింగితుఁడనై ఆయువు క్షీణించుచుండినను దెలిసికొనలేక పోయితి. చక్రవర్తియంతటివాఁడు ఆఁడుదానిచేతి క్రీడామృగ మయ్యెను. మహదైశ్వర్యసంపన్నుండగు నేను పరివారముతోఁ గూడ తృణప్రాయమై, వస్త్రహీనుఁడనై సిగ్గువిడిచి వెఱ్ఱివానివలె నేడ్చుచుఁ బోవుచున్నట్టి కాంతను వెంటనంటితి. సిగ్గుమాలి వెంటఁబడిన నాయొక్క తేజస్సు, ప్రభావము, అభిమానము కాల్పనా? ఎందుకు? స్వైరిణిచే నపహృతమైనచిత్తమును మఱలించుటకు నప్పరమేశ్వరునకుఁ దప్ప నితరులకు సాధ్యము కానేరదనియు, నార్తులగు భక్తులమోహమును (అజ్ఞానమును) దయానిధి హృషీకేశుఁడు తొలఁగింపవలయును గాని మాయాబద్ధుఁడగు నరపశువుచేఁ గాఁజాలదనియుఁ జింతించి, యజ్ఞానమునుండి మేల్కాంచెను.

శ్లో. వేధా ద్వేధా భ్రమం చక్రే కాంతాసు కనకేషు చ,
తాసు తేష్వప్యనాసక్తస్సాక్షాద్భర్గో నరాకృతిః.

విష్ణుమాయ కాంతలయందును, కనకమందును, రెండు విధములుగ విభజింపఁబడెను. ఆరెంటియందు నాశను విడిచిన వాఁడు మానుషాకారముతో నుండిన శంకరుఁడే యని చెప్ప వచ్చును. విష్ణుమాయ యోషిద్రూపముగ నుండి, యెట్టిధీరుల నేని వశవర్తులఁ గావించుకొనును. లోకమునందు సామాన్య ముఁగ కామినీతృష్ణ ధనతృష్ణయు లేనివాఁ డుండ నేరఁడని పై శ్లోకాభిప్రాయము. పురూరవశ్చక్రవర్తియంతటి తేజస్వి, శూరుఁడు, ధీరుఁడు, తా నొనరించిన యవివేకకృత్యమునకు నెంతయుఁ జింతించి, కామవ్యామోహమునుఁ బోఁగొట్టుమని పరమేశ్వరుని శరణుఁ జొచ్చెను. మాయామోహితుని దృష్టి యందు నీలోకంబున నేరెండును (కాంతాకనకములు) పరమ సుఖదాయకము లయ్యెనో, తత్త్వజ్ఞునిదృష్టియం దా రెండును మృత్యుప్రదము లయ్యెను. జ్యోతిశ్శాస్త్రమునందు ద్వితీయము ధనస్థానమని సప్తమము కళత్రస్థానమని కలదు. ఏరెండును మానవుని జీవయాత్రకు ముఖ్యసాధనములో అవియే మారక స్థానము లయ్యెను. ధర్మము నతిక్రమింపక హితమితముగ ననుభవించిన ప్రవృత్తిమార్గస్థునకు సుఖదములనియు, ధర్మే తరముగ మితిమీరిన మృత్యుదాయకములనియు పర్యవ సితము.

విషయోపభోగముచే కామతృష్ణ ఉపశమింపఁజాలదు.

కామము విషయోపభోగముచేఁ దనివిఁ జెందుననిన; నెప్పటికిఁ దనివిజెందక పోవుటయే గాక యభివృద్ధిఁ జెందునని మనువు చెప్పియున్నాఁడు.

శ్లో. న జాతు కామః కామానా ముపభోగేన శామ్యతి,
హవిషా కృష్ణవర్త్మేవ భూయ ఏవాభివర్ధతే.

మనుస్మృతి.

ఆజ్యాహుతిచేతను, సమిధలచేతను, అగ్నిహోత్రుఁడు ప్రజ్వరిల్లునట్లు కామము (కోరిక) విషయోపభోగములచేత నభివృద్ధిఁ జెందును గాని యుపశమింపదు. విషయసుఖముల ననుభవించుకొలఁది మఱిమఱి నూత్నవిషయసుఖముల నభిలషించుచుండునని భావము.

యయాతి శాపమువలన జరను బొంది, విషయసుఖముల ననుభవింపఁ దలఁచి, తన ముదుసలితనమునుఁ గైకొని, యౌవన మొసఁగుఁడని పుత్రుల నడుగగఁ బూరువుతప్ప తక్కినవా రొల్లకయుండిరి. పితృభక్తిమంతుఁడగు పూరువు తన యౌవనము నీయఁగ నయ్యయాతి బహువర్షములు విషయసుఖముల ననుభవించి తృప్తిఁ జెందక, నిర్విణ్ణుఁడై కామతృష్ణయందలి దోషమునుఁ జూపుచు నిందించెను.

శ్లో. యత్పృథివ్యాం వ్రీహియవం హిరణ్యం పశవస్త్రియః,
ఏకస్యాపి న పర్యాప్తం తస్మాత్తృష్ణాం పరిత్యజేత్.
పూర్ణం వర్షసహస్రం మే విషయాసక్తచేతసః,
తథాప్యనుదినం తృష్ణా మమ తేషూపజాయతే.

విష్ణుపురాణం. 4 అంశ. 10 అధ్యాయము.

భూమియందలి ధనధాన్యవస్తువాహన హర్మ్యప్రాసాద కాంతాకనకాది విషయోపభోగము లెన్నియైనను, ఒక కామ

మును (అభిలాషమును) తృప్తిఁ బొందింపఁ జాలవు. వెయ్యి సంవత్సరములు సంపూర్తిగ విషయసుఖముల ననుభవించిన నాకుఁ దనివి కలుగలేదు. ప్రతిదినమును ఆవిషయోపభోగమునం దధికాశ కలుగుచున్నది. దుష్పూరమగు నీతృష్ణను విడువవలయును. పరమానర్థకరమగు నీ కామతృష్ణను విడువని యెడల మనశ్శాంతి కలుగదని తెలిసికొనియెను.

శ్లో. యశ్చైతాన్ ప్రాప్నుయాత్సర్వాన్
యశ్చైతాన్ కేవలాంస్త్యజేత్,
ప్రాపణాత్సర్వకామానాం
పరిత్యాగో విశిష్యతే.

మనుస్మృతి - అధ్యాయము. 2 శ్లోకం. 95.

ఎల్లకోరికలనుఁ బొందినవాఁ డొకఁడు సకలకామములఁ బరిత్యజించినవాఁ డొకఁడు వీరిద్దఱిలో నెవఁడు శ్రేష్ఠుఁడనఁగాఁ బరిత్యజించినవాఁడు. ఏలయనఁగా: విషయాభిలాషము గలవానికి వానిని సంపాదించుటకై కష్టము హెచ్చు, ఆపదఁ గలిగినపుడు కష్టము మఱియు హెచ్చు, విషయాభిలాష లేని వాని కేకష్టమును లేదు. కాఁబట్టి కామముల నుపేక్షించిన వాఁడే సుఖి యగునని పైశ్లోకమునకుఁ దాత్పర్యము.

అనిత్యములగు విషయసుఖములందలి దోషములఁ దెలిసికొని, యింద్రియముల వానిమీఁదికిఁ బోవనీయక నిగ్రహించువానికి (జితేంద్రియునకు) సిద్ధి గలుగును.

సౌభరిమహర్షి చరిత్రము.

సౌభరిమహర్షి యగాధజలములలోపలఁ దపస్సుఁ జేసి కొనుచు, సమాధిస్థుండై యుండ నొక మత్స్యరాజము పుత్ర పుత్రికా కళత్రసహితముగ నామహర్షి చుట్టు తిరుగుచుండెను. సమాధినుండి బహిర్ముఖుఁడై, యీమత్స్యకుటుంబమును వాని హర్షానురాగములనుఁ జూచి, తానును కుటుంబియై అవ్విధం బున సుఖింపవలయునని తలంపుఁగలిగి, మాంధాతృమహారాజు నొద్దకు వచ్చి, సౌందర్యవతులగు పుత్రికల వివాహ మాడఁ దలఁచితినని చెప్పఁగ, నిరాకరించిన శపించునేమో యని భయ పడి, నాకుమార్తెలు తమరిని వరించినఁ గైకొనుఁడని మనవి చేసెను. వృద్ధుఁడైన తననుఁ జూచి యారాజపుత్రికలు వరింప రని, యుక్తిచే నుపాయము నొనరించెనని యామహర్షి తన దివ్యప్రభావంబున నవమన్మథాకారుండై రాచకన్యకలకుఁ గన్పింప, వారెల్లలు నీమహనీయుని వరించిరి. రాజు విస్మయా న్వితుఁడై, తనపుత్రికలను బహుమానపురస్సరముగ సమ ర్పింపఁగ నా సంయమీంద్రుఁడు తపఃప్రభావముచే దివ్య మందిరముల నిర్మించి, యా సుందరీమణులతోఁ గూడి కామ సుఖముల ననుభవించుచుండఁగ నూటయేఁబండ్రుపుత్రులు గలిగిరి. వారియెడ దినదినప్రవర్ధమాన స్నేహవాత్సల్యములు గలిగి, వీడరాని మమకారముతోఁ గూడినవాఁ డయ్యెను.

ఈపుత్త్రులు వీనులకింపుగ తియ్యనిపలుకు లెపుడు పలుకు దురు? ఎపుడు నడతురు? ఎపుడు యౌవనవంతు లగుదురు?

వివాహముఁ జేసికొని భార్యలతోఁ గూడిన వీరి నెపుడు జూతును? వారికిఁ బుత్త్రులు పౌత్త్రు లెపుడు గలుగుదురని యనుదిన మభివృద్ధిఁ జెందుచుండిన మనోరథపరంపరలనుఁ జూచి, తపస్వి గనుక తన అజ్ఞానాతిశయమున కాశ్చర్యపడి యిట్లు చింతించెను.

శ్లో. మనోరథానాం న సమాప్తిరస్తి
వర్షాయుతేనాఽప్యథవాపి లక్షైః,
పూర్ణేషు పూర్ణేషు మనోరథానా
ముత్పత్తయస్సంతి పునర్నవానాం. 116

శ్లో. పద్భ్యాంగతా యౌవనినశ్చ జాతా
దారైశ్చ సంయోగమితాః ప్రసూతాః,
దృష్టాస్సుతాస్తత్తనయప్రసూతిం
ద్రష్టుం పునర్వాంఛతి మేఽంతరాత్మా. 117

శ్లో. ద్రక్ష్యామి తేషామపి చేత్ప్రసూతిం
మనోరథో మే భవితా తతోఽన్యః,
పూర్ణేఽపి తస్యాప్యపరస్య జన్మ
నివార్యతే కేన మనోరథస్య. 118

శ్లో. అమృత్యుతో నైవ మనోరథానా
మంతోఽస్తి విజ్ఞాతమిదం మయాఽద్య,
మనోరథాసక్తిపరస్య చిత్తం
న జాయతే వై పరమార్థసంగి. 119

విష్ణుపురాణే - 4 అంశ. 2 అధ్యాయము.

అనేకవేలసంవత్సరములు విషయసుఖముల ననుభవించి నను, మనోరథములకు సంపూర్తి లేదు. అభిలాషములు బూర్తియగు కొలఁదిని ఆస్థానమునందు నూతనాభిలాషములు పొడముచుండును. (116)

కలిగినబిడ్డలు నడచి యౌవనవంతులై వివాహమాడి పుత్త్రులఁ బడసినారని తృప్తిలేక వారిబిడ్డలనుఁ జూడవలయు నని మఱల వాంఛ కలుగుచున్నది. (117)

మనుమలును వారిబిడ్డలనుఁ జూడవలెనని మఱియొక కోరిక కలుగును. ఆకోరిక ముగిసినంత మఱియొకకోరిక పొడ ముచుండును. ఈకోరిక కలుగకుండ నెట్టుల నివారింపఁ బడును? ఒకతరంగము పోయినతర్వాత మఱియొక తరంగము వచ్చినటుల, సంసారసముద్రమున మనోరథవీచికాపరంపరల విచ్ఛిన్నముగఁ బుట్టుచుండును. (118)

బ్రహ్మానందామృతమునుఁ బొందినట్లయిన మనోరథ ములు క్షయించునని యిప్పుడు దెలిసికొంటిని. చిత్తమును అంతర్ముఖముఁ జేసి అమృతస్వరూపునియందుఁ జేర్చితినేని బహిర్విషయాసక్తము గానేరదు. విషయాసక్తచిత్తునకు బ్రహ్మా నందామృతముఁ గలుగఁజాలదని సౌభరిమహర్షి కామతృష్ణను విడిచి స్వస్వరూపానందలగ్నమనస్కుఁడయ్యెనని తాత్ప ర్యము. (119)

శ్లో. న తథాస్య భవేత్క్లేశో బంధశ్చాన్యప్రసంగతః,
యోషిత్సంగాద్యథాపుంసో యథా తత్సంగి సంగతః.

శ్రీభాగవతే 6 స్కంధము.

కాంతాకనకవిషయకాభిలాషములు పురుషుని బాధించు నట్టుల యితరవిషయకాభిలాషము లంత బాధింపఁజాలవు. కనకాభిలాషమునకన్నఁ గాంత చైతన్యవతి గనుక యెక్కువ బాధించును. కాంతావిషయాసక్తునికే ధనము, భోగములు, లోకము కావలయును. "నిస్త్రీకస్య తృణం జగత్త"ను లోకోక్తినిఁబట్టి స్త్రీని జయించినట్టి వైరాగ్యవంతునకు లోకము తృణప్రాయమని చెప్పినపుడు, ధనభోగాదులఁ గూర్చి యిఁకనేమి చెప్పవలయును! కామినీ మోహముచే ముగ్ధుఁడై యితర విషయములను విడిచి అనలమునుఁ గాంచి, ఫలమని భ్రాంతిఁ జెంది యందుఁబడిన పతంగమువలె నశించును. అయస్కాంతమునుఁ బోలె నీకాంతయు సర్వేంద్రియసహితమనస్సు నాకర్షించి, మనోహారిణి యనఁబరగి, విషయాసక్తుఁడగు పురుషుని తనవశముఁ జేసికొనును. ఉమేశుని,రమేశుని, వాగీశునిఁ జేరి యాశ్రయించిన మాయాశక్తి సామాన్యమానవుని వశవర్తిగఁ జేసికొనుటయందాశ్చర్య మేమిగలదు. వివేకి, మాయాశక్తిస్వరూపమునుఁ దెలిసికొని, మాయికములగు విషయసుఖములు దుఃఖదాయకములని వానియందలి దోషములను గ్రహించి యింద్రియములను వాని దెసకుఁ బోనీయక నిగ్రహింపవలయును.

కా మ ము.

శ్లో. కామినీకాయకాంతారే కుచపర్వతదుర్గమే,
మా సంచర మనఃపాంథ తత్రాస్తే స్మరతస్కరః.

భర్తృహరిసుభాషితము.

ఓమనఃపాంథ! విషయారణ్యములయందు విచ్చలవిడిగ తిరుగుచున్నావు. అయితే కామినీ శరీరారణ్యమునందు కుచ పర్వతదుర్గము నాశ్రయించి, క్రోధలోభాది మిత్రవర్గముతోఁ గూడి, కాముఁడను దొంగలఱేఁడు వసించియున్నవాఁడు. నీవచ్చోట సంచరించితివేని జ్ఞానధనము నపహరించును గావున నచటి కేగవలదని యోగీశ్వరుఁడు హిత ముపదేశించెను. అరి షడ్వర్గములోఁ గామము ప్రధానము కాఁబట్టి దానికి లోఁ బడవలదనియు, విషయారణ్యములలో స్వేచ్ఛగ సంచరించు నింద్రియమత్తేభములను, వివేకాంకుశముచే లోఁబఱచుకొని వైరాగ్యాలానస్తంభములకుఁ గట్టివేయవలెననియు నభి ప్రాయము.

కామవేగము నిగ్రహించినవాఁడు యోగి యనుట.

శ్లో. శక్నోతీహైవ యస్సోఢుం ప్రాక్ఛరీరవిమోక్షణాత్,
కామక్రోధోద్భవం వేగం స యుక్తస్స సుఖీ నరః.

భగవద్గీత. 5 అధ్యాయము. 23 శ్లోకము.

శరీరము విడుచుటకుఁ బూర్వమున జీవించియున్న పుడే కామక్రోధములవలనఁ బుట్టిన వేగమును (సంక్షోభ

మును) సహించుట కెవ్వఁడు సమర్థుఁ డగుచున్నాఁడో, వాఁడే యోగియు, సుఖియు, మానవుఁడు నగుచున్నాఁడు. మృతిఁ జెందినతర్వాత విలపించుచున్న యువతులచే నాలింగితుఁడైనను, శత్రువులచే దూషింపఁబడినను, పుత్రులచే దహింపఁబడినను, ప్రాణము లేనందున కామక్రోధోద్భవవేగమును సహించినట్లే, ప్రాణముండినపుడు ఎవ్వఁడు సహించుచున్నాఁడో వాఁడే ధీరుఁడు, యోగియు సుఖియు నని భావము. జీవించి యున్నప్పుడు కామవేగమునకుఁ గారణములగు కాంతాదర్శన స్పర్శనాలింగనాదులు సంభవించునెడ కామవికారములనుఁ జెందక నిశ్చలుఁడై, మేదోమజ్జాస్థినిర్మిత మాంసపుబొమ్మ యని దోషదృష్టిఁ గలిగి, విషయవిముఖుఁ డైనవాఁడు ధీరుఁడు, యోగి, సుఖి యనియు, నటుల గానివాఁడు విషయలోలుఁడు, నరాకృతియగు ద్విపాదపశువనియు మధుసూదనీయవ్యాఖ్య యందు వివరించిరి.

కామవేగము అధోగతిఁ గలిగించుననుట.

దీని ననువదించి యీభావమే యోగవాసిష్ఠమునఁ జెప్పఁబడెను.

శ్లో. ప్రాణే గతే యథా దేహస్సుఖం దుఃఖం న విందతి,
తథా చేత్ప్రాణయుక్తోఽపి స కైవల్యాశ్రమే వసేత్.

ఇట్టిస్థితిగల జీవన్ముక్తుఁ డానందాశ్రమమునందు వసించును. భగవద్గీతాశ్లోకమునందు, "కామక్రోధోద్భవం వేగం"

అని చెప్పఁబడినదానిని వ్యాఖ్యాతలు వివేకోదయమునకై విశదీకరించిరి. వర్షాకాలమునం దచ్చటచ్చట విశేషవర్షములు గురిసి, శాఖోపశాఖలుగ ప్రవాహము లన్నియు నొకటిగఁ జేరిన నదీప్రవాహము మహావేగముతోఁ బ్రవహించుచు, నిలుచుండినవానిని బలాత్కారముగ గోతిలోఁ బడవైచి ముంచి అడుగంటించి సముద్రములోనికిఁ గొట్టుకొనిపోవును. అట్టుల విషయాభిధ్యానమువలనఁ గలిగిన సంక్షోభరూపమగు కామవేగము పురుషుని బలాత్కారముగ విషయగర్తములోఁ బడవైచి సంసారసముద్రములో ముంచి నరకరూపమగు నధో గతినిఁ బొందించును. తృష్ణారూపమగు కామముచే సంక్షుభిత మనస్కుఁడై రజోగ్రస్తుఁ డయినందున, అంధుఁడై యుక్తా యుక్తపరిజ్ఞానము లేక, స్వసృ దుహితృ మాత్రాదులనుఁ గవయ నుంకించినవాఁడై, నిరయాంధకూపమునఁ బడును. సంక్షుభితమైన కామవేగము గలిగినపుడు రోమాంచనము, సంభ్రమము, హృష్ట నేత్రవదనములు, మదోద్ధతిఁ గలిగిన బహిరింద్రియము లుత్కంఠతఁ జెందుట లోనగు చిహ్న ములు గలుగును. లోపలనున్న జ్ఞాననాడులు, చలననాడులు, తుపాను కొట్టునపుడు విశేషముగ సంచలనముఁ బొందినట్లు చలించి, అంతఃకరణప్రక్షోభమునుఁ గలిగించును. ఎంత నీరు త్రావినను దప్పిక తీఱనట్లు, విషయోపభోగ మెంతగలిగినను ఈకామతృష్ణ యుపశమింపనందున ఆసురవ్యాపార మనఁబడు. లోకములోఁ గొందఱు కాముకులు విషయలోలుపులై, చిర

కాలము విషయసుఖము లనుభవించి తనివిఁ జెందక మృతిఁ జెంది సూక్ష్మశరీరముతో నుండి, తమవాంఛలనుఁ బూర్తిఁ జేసికొనుటకై స్థూలశరీరములు లేక, విషయలోలుపులగు నీకామినీకాముకశరీరములలోఁ బ్రవేశించి తమయాశలఁ దీర్చుకొనుచుందురు. ఆసురవృత్తిఁగల యీ కామినీకాముకులు సురతక్రియానంతరము వారేమి యొనరించినది తెలియక శరీరేంద్రియపాటవమునుఁ గోల్పోయి, దుర్బలులు వ్యాధిపీడితులునై దుఃఖితు లగుచుందురు.

శ్లో. కామేన నాశితమతిః ప్రతిషిద్ధే ప్రవర్తతే,
అగమ్యాగమనే చౌర్యే తథైవాఽభక్ష్యభక్షణే.
కామేనైవ హి కార్పణ్యం కామినీషు సతాం మతం,
ప్రార్థయంతి యతస్తుచ్ఛాః ప్రవేశ్య వదనే కరం.

శ్రీహరిరాయసూక్తి.

కామముచే బుద్ధిచెడి నిషిద్ధకర్మల నొనరించును. అగమ్యాగమనమును చౌర్యమును, అభక్ష్యభక్షణమును గావించును. కామముచేతనే కామినీలోలుపత్వము కలుగును. తుచ్ఛులు నోటిలో చెయివెట్టి ప్రార్థింతురు. కామవశులై యేమి యొనరింపరని భావము.

శ్లో. యశ్శాస్త్రవిధిముత్సృజ్య వర్తతే కామకారతః,
న స సిద్ధిమవాప్నోతి న సుఖం న పరాం గతిమ్.

భగవద్గీత. అ 16. శ్లో. 23.

ఎవఁడు విధినిషేధములచే కర్తవ్యాకర్తవ్యములను బోధించు వేదమును, తదుపజీవకములగు స్మృతిపురాణాదుల

లోని మార్గములను విడిచి, స్వేచ్ఛానుసారముగఁ (కామ వశుఁడై) ప్రవర్తించునో, వాఁడు పురుషార్థసిద్ధినిఁ బడయఁ జాలఁడు. ఐహికసుఖమును, ఆముష్మికసుఖముఁ బొందఁజాలఁ డని శ్రీకృష్ణభగవానుఁ డానతిచ్చియున్నవాఁడు.

ధర్మ్యమగు కామము, పురుషార్థసాధనము.

పై శ్లోకములలోని భావమునుఁ బరికింపఁగ, విశృంఖల మగు స్వేచ్ఛాచరణము, స్వైరవిహారము, పరమపురుషార్థము నకు ప్రతిబంధకమనియు, నధర్మములోనికిఁ జొనిపి నిరయ గర్తమునఁ బడవైచుననియుఁ దెలియఁదగును. త్రివర్గసంపద నపేక్షించు ప్రవృత్తిమార్గస్థునకుఁ గామముల సమున్మూల ముగ నశింపఁజేయ సాధ్యము గాదనియు, నింద్రియములను విషయములమీఁదికిఁ బోవనీయక వశ్యములఁ గావించుకొని పథ్యాశనము భుజించునటుల, ధర్మమునకు విరుద్ధముఁగాని యభిలాషముల ననుభవించుచే, నిష్కామకర్మానుష్ఠానమున నంతఃకరణశుద్ధినిఁ బొంది, విషయములయందు దోషదృష్టిచే సంకల్పరాహిత్యమునఁ గామముల నణఁపవచ్చుననియు గ్ర హింపఁ దగును. లౌకికప్రవృత్తి యుండువఱకు నంతఃకరణ ముండును. అంతఃకరణమన వాసనాజాలము (కామమయము) అంతఃకరణమును సమున్మూలముగ నశింపఁ జేయుశక్తి నివృత్తి మార్గస్థుఁ డగుయోగికి (ముక్తునకు) సాధ్యమగును కాని సామాన్యమానవునకు సాధ్యము కాదు. కాఁబట్టి ఇంద్రియ

ముల లోఁబఱచుకొని విశుద్ధమనస్కుఁడై విషయగతదోష ములఁ దెలిసికొని, సత్సంకల్పవంతుఁడై పరమపురుషార్థమునకు సాధకములగు సత్సాంగత్య, సద్గ్రంథ శ్రవణ, పఠన, సత్కర్మానుష్ఠాన, భగవద్భజన, దేవతోపాసన, భూతదయ, ధర్మా చరణ, బ్రహ్మజిజ్ఞాస లోనగు కామములు సేవించినచో దూష్య ములు గాఁజాలవు. నిష్కామకర్మానుష్ఠానమున నంతఃకరణా శుద్ధి గలుగును. ఇదియే మోక్షమునకు (నిరతిశయసుఖము నకు) సాధన మగును.

మనోధర్మమునకు మూఁడుమార్గములు గలవు. అందు కేవల విషయలోలుపత్వముగల పశుధర్మము నికృష్టమైనది. విషయవైరాగ్యముగల ముముక్షుధర్మము ఉత్కృష్టమైనది. మొదటిది ధర్మహీనమై నీతిబాహ్యమయిన పశుధర్మము లౌకిక శాస్త్రవిరుద్ధమైనందున శ్రేయోదాయకముఁ గాఁజాలదు. రెండ వది బాహ్యప్రవృత్తి లేనందునను, బ్రహ్మమునందు మగ్నమై లోకాతీతమయినందునను, ముముక్షుధర్మము నిఃశ్రేయస్కరమై యుత్కృష్ట మైనదయినను, లోకప్రవృత్తి లేనందున ముక్తునకే సుఖదాయకము గాని లోకమున కుపకరింపఁ జాలదు.

శ్లో. "అశ్రయేన్మధ్యమాం వృత్తిమతిసర్వత్ర వర్జయేత్."

అనురీతిని ఈ రెండునుఁ గాక మధ్యమార్గము నవలంబింపవల యును. అదెట్లన? కేవల విషయలోలుపుఁడు గాక కేవలవిర క్తుఁడు గాక జితేంద్రియుఁడై, ధర్మమార్గము నవలంబించి

[illegible]

శ్లో. [illegible]

[illegible]

[illegible]

శ్లో. [illegible]

[illegible]

[illegible]

లగుకామములు గలుగుచున్నవి. కాన ఈకామములు పురుషార్థదాయకములై ఐహికాముష్మికసుఖములఁ గల్గించును. నివృత్తిమార్గస్థుఁడగు ముముక్షువు వినశ్వరములగు నైహికాముష్మికసుఖముల నపేక్షింపఁడు గనుక తన్నిమిత్తములగు సంకల్పములును, కామములును విడుచును. సాధకుని మనోభవములగు కామములు విడువవు గనుక మార్కండేయపురాణమునం దీవిధముగఁ జెప్పఁబడెను.

శ్లో. కామస్సర్వాత్మనా హేయస్స చేత్త్యక్తుం న శక్యతే,
ముముక్షాం ప్రతికర్తవ్యస్సా చ తస్యాఽపి భేషజమ్.

కామము సర్వవిధముల విడువఁదగినది. విడువ శక్యము కాదేని అమృతమును, సత్యమును, నిత్యమునగు మోక్షమునం దుంచఁదగును. మోక్షమునం దపేక్ష కలిగెనేని, విషయసుఖోపభోగములవలనఁ గలుగుదుఃఖములఁ బోఁగొట్టుటకు నౌషధ మగును. భగవత్తత్త్వమునుఁ దెలిసికొన నపేక్షఁ గలుగువాఁడు (జిజ్ఞాసువు) చతుర్విధభక్తులలోఁ బరిగణింపఁబడినందున సద్విషయకకామము దూష్యము గాక మోక్షమునకుఁ బరంపరాసాధన మగును.

శ్లో. యద్యత్త్యజతి కామానాం తత్సుఖస్యాభిపూర్యతే,
కామానుసారీ పురుషః కామానను వినశ్యతి.

మనుస్మృతి.

కామసంకల్పములు గలుగునపుడు దేనిని విడుతుమో, ఆ సుఖమునకు హేతువగుచుండును. క్షణికము

లును, వినశ్వరములు నగు కామముల నపేక్షించిపోవువాఁడు కామములవెంటనే తానును నశించునని చెప్పుటచేత, వివేకి యగువాఁడు మాయికములగు నైంద్రియికవిషయములకు లోఁబడక, తత్త్వజ్ఞానముచే విషయములందు దోషదృష్టిఁ గలిగి, జాగరూకతతో మెలఁగవలయునని తెలియుచున్నది.

సద్విషయకకామము శ్రేయోదాయకము.

అసద్విషయములు బంధనములనియు, సద్విషయములు మృదుబంధనములనియుఁ దెలిసికొని, మోక్షసాధనములగు సద్విషయములను ముముక్షువు వివేకదృష్టిచే గ్రహించుటం జేసి ప్రతిబంధకములు కాఁజాలవు. ఈలోకము విషయసుఖ పూరితమై ప్రవృత్తిధర్మముతోఁ గూడినందున సామాన్యముగ ప్రాణివర్గమంతయు నానావిధ కామసంకల్పములతోఁ గూడి యుండును. క్రమవికాసముచేఁ బక్వమై యెచటనుండి యుత్పన్నమయ్యెనో అచటనే లీనమగును. ఇదియే బ్రాహ్మీస్థితిమోక్ష పదవి.

అంకురించి, పల్లవించి, కుసుమించి, ఫలించినట్లు మానవాంతఃకరణంబును, బ్రహ్మచర్యంబున నధ్యయనంబుచే నంకురించి, గార్హస్థ్యంబునఁ గామసుఖంబులచేఁ బల్లవించి, వానప్రస్థంబున మునివృత్తిచేఁ గుసుమించి, సన్న్యాసాశ్రమంబున సమ్యక్ జ్ఞాననిష్ఠచే యోగబలంబున ఫలించి, యనుభవింపఁ బడును గాని అంకురితావస్థయందే ఫలితము కనఁబడనట్లు

బ్రహ్మచర్యాశ్రమమునందే సామాన్యముగ మోక్షము గలుగదు. ఎవరికో కొందఱు మహనీయులకు జన్మాంతర సంస్కార విశేషంబున బ్రహ్మచర్యమునందే సమ్యగ్జ్ఞాననిష్ఠచే మోక్షము గలుగుఁగాని, సామాన్యముగఁ గలుగదు. ఇది అసాధారణము. సామాన్యముగ క్రమవికాసముచే నంతఃకరణము పరిపక్వమగునట్లు లోకానుభవముచేతనుఁ గన్పట్టుచున్నది.

బ్రహ్మచర్యాశ్రమమున సన్న్యసింపఁదగునా?

శ్లో. శైశవేఽభ్యస్తవిద్యానాం యౌవనే విషయైషిణాం,
వార్ధకే మునివృత్తీనాం యోగేనాంతే తనుత్యజాం.
రఘువంశ - ప్రథమసర్గ.

రఘువంశ్యులు బాల్యమున బ్రహ్మచర్యముచే విద్యల నభ్యసింపుచు, యౌవనమున గార్హస్థ్యముచే విషయసుఖముల ననుభవించుచు, వార్ధకమున వానప్రస్థముచే మునివృత్తి నవలంబించుచు, నంత్యమున సన్న్యసించి యోగబలముచే బ్రహ్మపదవినిఁ బొందుచున్నారని కాళిదాసమహాకవి వర్ణించుటచే క్రమవికాసమున నంతఃకరణము పక్వమగుచున్నట్టుల తెలియుచుండెడిని.

బ్రహ్మచర్యాశ్రమమునందే సన్న్యసించినచో, యౌవనదశయందు ఇంద్రియవర్గము దేహధర్మములు విషయసుఖమహాగర్తమునఁ బడఁద్రోయఁ బ్రయత్నించుచుండు.

శ్లో. "బలవానింద్రియగ్రామో విద్వాంసమపి కర్షతి."

అను నారోక్తిని, ఎట్టి ప్రజ్ఞావంతునేని, విద్వాంసునేని, ఇంద్రియవర్గము తమవిషయములచే లోఁబఱచుకొని మహాగర్తమునఁ బడఁద్రోయును. ప్రాక్తన జన్మతపోబలముచే నంతఃకరణశుద్ధినిఁ బడసిన మహాయోగులు శ్రీమంతులు గృహమున జన్మించి, బ్రహ్మచర్యాశ్రమమునందే సన్న్యసించినను, జితేంద్రియులు గనుక విషయములు విషతుల్యముగఁ జూతురు. వారి పరిశుద్ధాంతఃకరణము బ్రహ్మాకారవృత్తిగఁ బరిణమించి నందున లోకమంతయు బ్రహ్మమయముగ నుండును. దేహాత్మాభిమానము లేని మహనీయులు నిర్వికారులు గనుక ఇంద్రియవిషయములు వారిని బాధింపవు.

ప్రవృత్తిధర్మశాస్త్రకర్తలగు మన్వాదులయభిప్రాయము.

పరమేశ్వరుఁడు లోకానుగ్రహార్థము ప్రవృత్తిధర్మప్రవర్తకులగు దక్షాదిప్రజాపతులను, నివృత్తిధర్మప్రవర్తకులగు సనకసనందనాదియోగీశ్వరులను సృజించి, వీరలద్వారా నిఖలధర్మములఁ బ్రవర్తింపఁజేసెను.

దక్షాదిప్రజాపతులు ప్రవృత్తిధర్మప్రవర్తకులు గనుక మానవుఁడు బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థాశ్రమములను క్రమముగ స్వీకరించి దేవర్షి పితౄణములనుఁ దీర్చి మోక్షమునకై ప్రయత్నింపవలయుఁ గాని, లేనిచో నధఃపతితుండగుననియు, క్రమవికాసముచే నంతఃకరణము పక్వమై, యాత్మసుఖానుభవమున కర్హమగుననియు, లోకానుభవము

లేక యాత్మజ్ఞానోదయము కలుగదనియు నీక్రిందివిధమున నుడివిరి.

శ్లో. నానుభూయ న జానాతి పుమాన్ విషయతీక్ష్ణతాం,
నిర్విద్యేత స్వయం తస్మాన్నతథాభిన్నధీః పరైః.
శ్రీభాగవతే. 6 స్కంధ. 5 అధ్యాయము.

పురుషుఁడు విషయసుఖానుభవము లేక విషయము లందలి తీవ్రతనుఁ దెలిసికొనఁ జాలఁడు. విషయసుఖముల నను భవించి, యనుభవించి విసుగుఁజెంది విముఖుఁడై విరక్తినిఁ బొందినట్లు, ఇతరులచే బోధింపఁబడి యాత్మానుభవము లేక వైరాగ్యమునుఁ బొందఁజాలఁడు. గృహస్థాశ్రమమునందు కామసుఖముల ననుభవించి వానినుండి విముఖుఁడై విరక్తిఁ జెందినవానికిని, బ్రహ్మచర్యమునందే విషయములందు దోష దృష్టిచే (భావనచే) అనుభవము లేక విరక్తిఁ జెందినవానికి నేంతేని భేదము గలదు. ఇందు మొదటివానికి విషయాను భవమువలనఁ గలిగిన దుఃఖాదులచే విషయములు సన్నిధాన మున నుండినను, విముఖతచే వైరాగ్యము గలుగును. క్రమ ప్రాప్తమయినది. రెండవవానికి విషయానుభవము లేక విష యానుభవము: గలిగిన పెద్దలచేతను, శాస్త్రములచేతను, బోధితుఁడై విషయములందు దోషదృష్టిచే విరక్తినిఁ జెందును. విషయములు సన్నిధానమున నున్నప్పుడు ఇందలి విషయ సుఖ మెట్లుండునో యని సంశయము గలుగును గాని, మొదటివానివలె నివి రుచి చూడఁబడినవి. నీరసములు దుఃఖ

దాయకములని యనుభవముఁ గలిగినట్లు కలుగదని ప్రవృత్తి ధర్మప్రవర్తకుల యభిప్రాయము.

నివృత్తిధర్మప్రవర్తకు లగు యాజ్ఞవల్క్యసనకాదుల యభిప్రాయము.

నివృత్తిధర్మప్రవర్తకులగు జ్ఞానులు, ఆశ్రమనియమము బనిలేదనియు, ఏనిమిషమున బుద్ధికి విరక్తి కలిగెనో, యానిమిషముననే సన్న్యసింపవలెననియు,

శ్రు. "యదహరేవ విరజేత్ తదహరేవ ప్రవ్రజేత్."

అని జాబాలశ్రుతి నుడువుచున్నదనియు వచింతురు

బ్రహ్మచర్యమునుండి గృహస్థము, గృహస్థమునుండి వానప్రస్థమును స్వీకరించి పిమ్మట సన్న్యాసమును గ్రహింపవలెనను నంతవఱకు నిరీక్షింప నవసరము లేదనియు, దృఢవైరాగ్యయుక్తమగు జ్ఞాన ముదయించినవెంటనే సన్న్యసింపఁ దగు ననియు, కాలవిళంబముచే తనువు శాశ్వతము కానందున నశించుననియు, దానివలన నుత్తమపురుషార్థము భంగమగు ననియు, జన్మాంతరసంస్కారమువలన నంతఃకరణముఁ పరిపక్వమై. విషయములమీఁదికిఁ బోవక సంసార మసారమని తలఁచి, బ్రహ్మాకారవృత్తిమంతునకుఁ గ్రమవిధాన మక్కఱలేదనియు, బ్రహ్మవేత్త ఋణత్రయబద్ధుఁడు కాఁడనియు, విద్యచే ముక్తుఁ డనియు, పరమహంస యేగోత్రమునందు జననమందినాఁడో,

ఆగోత్రజులు పూర్వాపరముల నేఁడుతరములవారు ఉత్తమ గతిఁ జెందుదురనియు, మోక్షధర్మప్రవర్తకులగు యాజ్ఞవల్క్యాదిమహర్షులు బోధించిరి.

శ్లో. కౌమారే ఆచరేత్ప్రాజ్ఞో ధర్మాన్ భాగవతానిహ,

శ్రీభాగవత, సప్తమస్కంధము.

జ్ఞానవైరాగ్యము లుదయించిన భక్తుఁడు బాల్యదశ యందే భాగవతధర్మముల నాచరింపవలెననియు, వార్ధకము వచ్చువఱకు నిరీక్షింప నవసరము లేదనియు, నస్థిరమగు దేహ ముండునని భ్రాంతిఁ జెందఁగూడదనియు, భాగవతోత్తముఁడు ప్రహ్లాదుఁడు వచించెను.

శ్రు. పూర్వే విద్వాంసః ప్రజాం న కామయన్తే కిం ప్రజయా కరిష్యా మో యేషాం నోఽయమాత్మాఽయం లోక ఇతి తే హ స్మపుత్రై షణాయాశ్చ విత్తైషణాయాశ్చ లోకైషణాయాశ్చ వ్యుత్థాయా ఽథ భిక్షాచర్యం చరంతి.

బృహదారణ్యకే, ౬ అధ్యాయము.

ప్రాచీనులగు జ్ఞానులకు, పుత్త్రాదులయెడ నిచ్ఛలేమిచే నే హేతువుచే సర్వలోకములును మాయాత్మకములే యైనవో, ఆ హేతువుచేతనే మాకు ప్రజ (సంతతి) యేల కావలయును అని యిట్లు చెప్పి సంతతి, సంపత్తి, స్వర్గాదిలోకములలో దేని యొక్క యీషణను (ఇచ్ఛను) మనంబున నుంచేక, దానియం దుండి నివృత్తులైనజ్ఞానులు బొత్తిగా భిక్షాటనముఁ జేయుచుఁ దిరుగుచున్నారని తాత్పర్యము.

జ్ఞాననిష్ఠులు సకలమును బ్రహ్మమయముగఁ జూతురు. నిత్యసంతుష్టులగు బ్రహ్మవేత్తలజ్ఞానాగ్నిచే సర్వకర్మలును దగ్ధములైనవి గనుక ఋణానుబంధరూపములగు పశుపత్నీసుతాదులయందు ఈషణము (కోరిక) ఉండదు. ఇట్టి దృఢవైరాగ్యయుక్తజ్ఞానులకు ఆశ్రమముల క్రమముగా స్వీకరించి, పిమ్మట సన్న్యసింపవలసినది లేదనియు, బ్రహ్మచర్యమునందే సన్న్యసింతురనియు స్పష్టము. జనుషాంధునకు (పుట్టుగ్రుడ్డి) లౌకిక విషయజ్ఞానము లేనట్టుల బ్రహ్మచర్యమునందే సన్న్యసించిన జ్ఞానయోగికి విషయసుఖానుభవజనిత కామసంకల్పము లుండనేరవు. ఆయోగి యంతఃకరణము విషయవాసనాదూషితముగాక శుద్ధసత్త్వమై బ్రహ్మాకారవృత్తిఁ గలిగినందున అంతట బ్రహ్మమయమై స్త్రీపురుషభేదమును స్వత్వ, పరత్వభేదమును లేక, నిరుపాధికమై అఖండమై ఆనందమయముగ నుండును. బ్రహ్మచర్యానంతరము గృహస్థాశ్రమము స్వీకరించినవానికి అంతఃకరణము విషయసుఖానుభవపు రుచిమరఁగి,మాటిమాటికి ఆసుఖానుభూతియే కోరునుగాని, సామాన్యముగ మఱలదు. ఒకప్పుడు మఱలినను, దృఢవైరాగ్యము లేనందున ఇంద్రియవర్గమునకు లోఁబడును. గృహస్థాశ్రమానంతరము వానప్రస్థము పిమ్మట సన్న్యాసాశ్రమము స్వీకరింతుమనినను,మనోరథపరంపరలు పీడఁజాలవనియు, దుస్త్యజమనియు, పూర్వము సౌభరిచరిత్రమునందుఁ దెలుపఁబడెను.

విషయాసక్తుఁడగుయోగిని, కామము మోసపుచ్చుననుట.

శ్లో. నిత్యం దదాతి కామస్య ఛిద్రం తమనుయేఽరయః,
యోగినః కృతమైత్రస్య పత్యుర్జాయేవ పుంశ్చలీ.

శ్రీభాగవతే, షష్ఠఅధ్యాయే.

యోగి విషయాసక్తుఁ డయ్యెనేని అరిషడ్వర్గములో మొదటిదగు కామము, ఇంటికి కన్నము వేసి దొంగ ప్రవేశించునటుల, అవకాశముఁ జేసికొని హృదయములోనికిఁ బ్రవేశించును. వెంటనే క్రోధాదులును బ్రవేశింతురు. అనుకూలుఁ డగుపతిని స్వైరిణి మోసపుచ్చినట్లు కామాదులును విషయాసక్తుఁ డగు యోగిని మోసపుచ్చునని భావము.

కొంచె మవకాశము కామునికి దొరికినట్లయిన నదియే యాధారముఁ జేసికొని, క్రోధాదిమిత్రులు లోపలఁ బ్రవేశించి, యెట్టి ప్రజ్ఞావంతునేని, ధీరునేని, సంక్షుభితునిఁ గావింతురు. గృహస్థాశ్రమమునందు విషయలంపటునకు వైరాగ్యము గలుగుట, సామాన్యముగ నసంభవము. వార్ధకమునందు ఇంద్రియపటుత్వ ముడిగి, వైరాగ్యము శాంతముగలుగుట సహజము. ఇది మనోనిగ్రహమువలనఁ గలిగినది గాక, వయోఽవస్థాప్రకృతిధర్మముచేఁ గలిగినది కాఁబట్టి, వరిష్ఠమైనది కానేరదు. ఇంద్రియములు పటుత్వముఁ గలిగియున్నప్పుడు, విషయములు సన్నిధిని నుండినపుడు, దోషదృష్టిచే విరక్తుఁ డయిన వాఁడు యోగియు, జితేంద్రియుఁడును, తురీయాశ్రమమున కర్హుఁడు నగునని యోగశాస్త్రములవలనఁ దెలియుచున్నది.

ఏయాశ్రమమునం దయినను, విషయాసక్తుఁడు గాక, ఇంద్రియములకు లోఁబడక, ధర్మ్యములును, హితములు నగు విషయములును, పథ్యాశనమువలె ననుభవించుచు, విహిత కర్మలను నిష్కామముగ నాచరించుచు, సర్వభూతములయెడ నాత్మభావనచే దయగలిగి యుపకరించువాఁడు శ్రేయస్సునుఁ బొందుననీ, యెల్లఱ యభిప్రాయమై యున్నది.

శ్లో. మనో హి ద్వివిధం ప్రోక్తం శుద్ధం చాఽశుద్ధమేవ చ,
అశుద్ధం కామసంకల్పం శుద్ధం కామవివర్జితం.

మహోపనిషత్.

మనస్సు శుద్ధము, అశుద్ధము నని రెండువిధములు. కామసంకల్పములతోఁ గూడికొనినది అశుద్ధమనియు, కామ సంకల్పములు లేనిది శుద్ధమనియుఁ దెలియవలెను.

జ్ఞానయోగులు సంకల్పములవలన కామము కలుగు చున్నదని కామరహస్యముఁ దెలిసికొని, సంకల్పములు కలుగ కుండ మనస్సును పరిశుద్ధము చేయుదురు.

కామసంకల్పజయోపాయము.

శ్లో. కామ జానామి తే మూలం సంకల్పాత్కిల జాయసే,
న త్వాం సంకల్పయిష్యామి తతో మే న భవిష్యసి. 1
శ్లో. నైవ త్వం వేత్థ సులభం నైవ త్వం వేత్థ దుర్లభం,
నిత్యోద్వేగేన దుష్పూరో మాం దుఃఖైర్యోక్తుమిచ్ఛసి. 2
శ్లో. త్యజామి కామ త్వాం చైవ యచ్చ కించ ప్రియం తవ,
న తవాఽహం న వా త్వం మే త్యజ మాం త్వం పిశాచవత్. 3

యోగవాసిష్టము.

ఓ కామమా! నీగుట్టు నాకుఁ దెలియును. సంకల్పము వలనఁ గలుగుచున్నావు. కాఁబట్టి నిన్ను సంకల్పించను. దానం జేసి నీవు కలుగవు. 1

ఇది సులభము, ఇది దుర్లభము నని తెలిసికొనఁ జాలవు. ఎంత లభించినను తృప్తిఁ జెందక, నన్ను దుఃఖము లలోఁ బడవేయుచున్నావు. 2

ఓ కామమా! నీకేదేది ప్రియమో దానినంతయు విడుచు చున్నాను. నీకును నాకును సంబంధము లేదు. పిశాచము వదలినట్లు నన్ను విడిచిపొమ్ము. 3

అని జ్ఞానయోగులు ఉపాయముచే కామమును జయింతురు. దుశ్చింతలవలనఁ గలిగిన క్షుద్రకామము (Lust) నణఁచునుపాయములు, కామక్రోధప్రకరణాంతమందుఁ జెప్పఁ బడినది.

శ్రు. పరిజ్ఞాయోఽపభుక్తో హి భోగో భవతి తుష్టయే,
విజ్ఞాయ సేవితశ్చోరో మైత్రీమేతి న చోరతాం.

మహోపనిషత్. 5 అధ్యాయ.

వివేకదృష్టిచేఁ దెలిసికొని భోగ మనుభవించినను తుష్టి కలుగునుగాని దుఃఖము కలుగదు. ఎట్లన? చోరుఁడని తెలిసి యుపాయముచే సేవించినట్లయితే మిత్రత్వమునుఁ బొందును —ాని చోరభావమును బొందఁడు. అట్టులే వివేకి విషయ వమునుఁ దెలిసికొని జాగరూకుఁడై కామము ననుభ ౦ు త్రత్వమునుఁ జెంది తనస్వరూపస్వభావములనుఁ వివేకిని మోసపుచ్చఁ జాలఁడు. కేవలము

నిగ్రహించుటకన్న, నుపాయముచే మైత్రిఁ జేసికొని కార్య నిర్వాహణముఁ గావించుట యుచితము.

క్రోధము. (Wrath) Anger.

అరిషడ్వర్గములో రెండవది యగుక్రోధము మానసిక వ్యాధులలో దుర్నివార్యమైనది. ద్వంద్వములగు కామక్రోధములలో కామమువలన తనకే హాని కలుగునుగాని, క్రోధము వలన తనకును, ఇతరులకును, మహత్తరమైనహాని కలుగును. క్రుద్ధుఁడు గ్రహావిష్టుఁడుబోలె నొడలు తెలియక తనచేతిలో కఱ్ఱగాని, కత్తిగాని, యేదేనినుండిన దానితో నితరులకు హాని గలిగించును, తనకును గలిగించుకొనును.

తనకు ప్రతికూలము లయినట్టియు, దుఃఖహేతువులు నగు విషయములు వినఁబడినను, చూడఁబడినను, తలఁపఁబడినను ద్వేషము గలుగును ఈద్వేషమువలన ప్రజ్వలనాత్మకమగుక్రోధ ముదయించును. తాను కోరినవిషయమునకే కారణముచేతఁగాని ఆటంకమును, ప్రతిఘాతమును, విఘ్నమునుఁ గలిగెనేని యహంకారముచేత క్రోధముఁ గలుగును. తన నుండి యితరులమీఁదికిఁ బ్రసరించునది ఆత్మకర్తృకము. (Subjective) ఇతరులనుండి తనమీఁదికిఁ బ్రసరించునది. (Objective) అన్యకర్తృకమని యీక్రోధము సామాన్యముగ ద్వివిధము.

తనయిష్టమునకుఁ బ్రతికూలముగ సేవకులు, శత్రువులోనగువారు ప్రవర్తించినను, కార్యముల చెడఁగొట్టినను,

విలువగలవస్తువులనుఁ పగులఁగొట్టినను, తనశత్రువులతోఁ గలసి మెలసి యాలోచించుచున్నను, వారియెడ కోపము గలుగును. ఇది ఆత్మకర్తృకము (Subjective). ఒకఁడు తన యజమానునియెడ నపరాధముఁ గావించినను, ప్రతికూలముగ ప్రవర్తించినను, ఆయన శత్రువర్గముతోఁ గలసి మెలసి యాలోచనలు సలుపుచుండినను, తనవలన (కారణమున) యజమానునకుఁ గలుగు కోపము అన్యకర్తృక మనఁబడును (Objective). తనకన్న తక్కువవారలగు సేవకులు లోనగు వారిమీఁద కోపముఁ జూపునపుడు తిరస్కరించుట, తిట్టుట, కొట్టుట, తన్నుట, బెదరించుట, కండ్లు ఎఱ్ఱజేయుట, పండ్లు పటపటఁ గొఱుకుట లోనగు చేష్టలు కనఁబడును. దీనులు, ఆశ్రితులు, వశ్యులు నగువారు అపరాధముఁ జేసినపుడు క్షమించి, భీతులగువారియెడ దయారసము లేక తా నధికుఁడు, మహనీయుఁడు, పూజ్యుఁడునను దురహంకార దురభిమానిత్వముచేఁ గోపముఁజూపుట యుత్తములకు లక్షణముఁ గాదు. తనకన్న నధికులు, యజమానులు తనను దూషించి తిరస్కరించి తిట్టి కొట్టినయెడల తనకు భయముఁగలిగినటుల తనవలనను సేవకులకు భీతియు, కష్టముఁ గలుగునని వివేకి గ్రహింపవలయును.

క్రోధోత్పత్తికిఁ గారణములు.

విషయములను ధ్యానించుటవలన దానియం దాసక్తియు, ఆసక్తివలనఁ గామమును (కోరిక), ఆకామమున

కే హేతువు చేనయినను విఘాతము, ప్రతిబంధముఁ గలిగెనేని ప్రజ్వలనాత్మకమగు క్రోధముఁ గలుగునని యిదివఱలోఁ జెప్పఁబడెను. ఈక్రోధ ముత్పన్నమగుట కనేకమార్గములు గలవు. ఒరులచే నవమానము, తిరస్కారము, పరిభవము పొందఁబడినపుడును, తన యభిమతకార్యములకు విఘ్నము వాటిలినప్పుడును, పరోత్కర్షముఁ జూచి యోర్వలేక ద్వేషముఁ గలిగినపుడును, తాను గొప్పవాఁ డనుకొని యభిమానపూరితుఁడై వ్రాసిన వ్రాఁతలమీఁదను, గ్రంథములమీఁదను, విమర్శనములు, ఖండనములు బయలువెడలినపుడును, అధికారము నుండి తొలఁగినతర్వాత తనచర్యలను విమర్శించునెడ కీర్తికి భంగము కలుగునపుడును, అన్యాపదేశములచేతను శ్లేషగర్భితవాక్కులచేతను తనకు నింద గలుగునపుడును, తాను కామించిన సుందరీమణుల నితరులు వలఁచినను, తనసొత్తును గృహక్షేత్రవాహనాదుల నపహరింపఁదలఁచిన జ్ఞాతి, శత్రు, చోరాదులయెడను, న్యాయస్థానములందు వ్యవహారముల చెడఁగొట్టి, ధననష్టముఁ గలిగించినవారియెడను, పోటీవ్యాపారములును, కంపెనీలును, సంస్థలనుఁబెట్టి తనవృత్తికి నష్టముఁ గలిగించినవారియెడను, ఇంకను ననేకసందర్భములలో ద్వేషముదయించి క్రోధముగఁ బరిణమించును.

ఆధివ్యాధులచే దుర్బలత్వముఁ జెంది స్రుక్కియున్నప్పుడును, క్షుత్పిపాసాపీడితుఁ డయినపుడును, మనోవైకల్యముఁ జెందినపుడును, విసుగుఁదలయు, చిఱచిఱలాడుటయు, చిఱు

కోపంబును కసరుటయు లోనగునవి కలుగును. ఇందు జ్ఞాతి, శత్రుచోరాదులు ఆలంబనవిషయములు కాఁజాలవు. ఆత్మీయా స్వస్థతయే కారణము ఆసమయమున పలుకరించినచో చిఱు కోపము కలిగినయెడల, తమ్ము ననాదరించి, వైమనస్యముఁ జూపెనని భావింపఁగూడదు. ఇతరుల మనస్తత్త్వమునుఁ దెలిసికొనలేక, భావాంతరమునుఁ బొంది ద్వేష్యు లగుచున్న వారలు. భావజ్ఞుఁడు, అకారణకోప మేల కలుగునని యోఁజించి, వాని యస్వస్థతయే కారణమగునని యూహించి, సౌమనస్యతఁ జెందును. లోకములో ననేకులు పరస్పరభావములుఁ దెలిసి కొనలేక లేనికష్టములఁ దెచ్చికొనుచున్నవారలు. ఈవిషయము భావప్రకాశప్రకరణమున వివరింపఁబడును.

క్రోధాగ్ని హృదయమును దహించుననుట.

క్రోధము ప్రజ్వలనాగ్నితో సమమని తత్త్వవాఙ్మయ గ్రంథములందంతటఁ జెప్పఁబడినది. అగ్నియందు మిడుతపడి నట్లు క్రోధాగ్నియందు శత్రుశలభములు పడినట్లును, దావాగ్ని అరణ్యములు దహించునట్లు, క్రోధాగ్ని శాత్రవపంశారణ్య ములు దహించునట్లును, కావ్యములందు వర్ణింపఁబడుచున్నం దున, క్రోధ మెంత దారుణమైనదో యూహింపఁ దగును. తృణ కుటీరమునఁ బడినయగ్ని స్వాశ్రయమును దహించునట్లు, దుర్బలులహృదయమునఁ బ్రవేశించిన క్రోధాగ్ని సకలపురుషా ర్థముల నశింపఁ జేయును. క్రోధవిహ్వాలమనస్కుఁడై క్రోధో

ద్రిక్త మనస్కుఁడై వచ్చుచున్నాఁడని కథాసందర్భమునఁ జెప్పఁబడుటచే, వచ్చి యెట్టి ఘోరకార్యమును (దారుణకర్మను) గావించునో యని స్ఫురింపక మానదు. ఆత్మీయబంధువులను వధించుటచేతను, బంధించుటచేతను, అవమాననముఁ గావించుటచేతను, తీవ్రక్రోధాగ్ని జనించి ఘోరకర్మల నొనరించును.

క్రుద్ధుండు ఘోరకృత్యముల చేయుననుట.

క్రుద్ధుండు తామ్రాక్షుఁడై మధ్యందిన మార్తాండమండలము పగిది దుర్నిరీక్ష్యుఁడై, నిట్టూర్పులు విడుచుచు, నెవరేని యడ్డువచ్చిరేని వారలనుఁ గొట్టుచు, బెదరించుచుఁ జూపరులకు వెఱపుఁగొలుపుచు, క్రోధమునకు విషయులైన శత్రుచోరాదులను వధించి కసిఁ దీర్చుకొనును. ఆయుధపాణియగు క్రోధోద్రిక్త మనస్కునియొద్దకు గురువులు, పూజ్యులు, సాధువు లరుగఁగూడదు. క్రోధవశుండగు నతఁడు వారిని గౌరవింపక యనాదరముచే తిరస్కరించుటవలన వారిమానము పోవును.

శ్లో. క్రుద్ధః పాపం న కుర్యాత్కః క్రుద్ధో హన్యాద్గురూనపి,
క్రుద్ధః పరుషయా వాచా నరస్సాధూనధిక్షిపేత్.

మహాభారతము, శాంతిపర్వము.

క్రుద్ధుఁ డెట్టిపాపకార్యమునుఁ జేయుటకునైనను సాహసించును. గురువులనయిననుఁ జంపును. కఠినంపుఁబలుకులచే

సాధువుల నాక్షేపించును. మనస్సునొచ్చునట్లు యుక్తాయుక్తములు తెలియక మాట్లాడును. కాఁబట్టి ఆత్మగౌరవపరులు శ్రేయస్కాములు క్రుద్ధుని సమీపింపఁగూడదు.

నిరపరాధులును, అకృతాస్త్రవిద్యులు నగు ద్రౌపదీపుత్త్రులు శిబిరమున నిద్రించుచుండ నపరరాత్రమున అశ్వత్థామ వారలను వధించి సుయోధనునకుఁ బ్రీతిఁ గలిగించెను. పుత్రమరణమువలన దుఃఖించుచుండిన పాంచాలిని నూరడించి, క్రోధవిహ్వలమనస్కుఁడై కాలాంతకునివలె దుర్నిరీక్ష్యుఁడైన భీమసేనుఁడు అశ్వత్థామనుఁ జంపఁ బ్రయత్నించినంతట నతఁడు భీతుఁడై పలాయితుఁ డయ్యెను. వెంటఁబడి పరుగిడుచుండ, నార్తరక్షకుండగు పుండరీకాక్షుండు భీమసేనునిఁ బట్టుకొని, పవనతనయా! ద్రౌణి హంతవ్యుఁడు, మన్నింపఁదగినవాఁడు కాఁడు, ఘోరపాపి, యని యతని మానసికవృత్తికిఁ దగినమాటలు చెప్పి, వశ్యునిఁ జేసికొనినపిమ్మట బ్రాహ్మణుఁ డెంతయపరాధముఁ జేసినను, జంపఁబడఁదగినవాఁడు కాఁడు. శిరోమాణిక్యమునుఁ గొని యవమానపఱిచి వెడలఁగొట్టుటయే శిరశ్ఛేదమునకుఁ దుల్యమగుక్రియ యని చెప్పి సమాధానపఱిచి యటులఁ గావించెను.

ధర్మవీరుల కపరాధులయెడ క్రోధముఁ గలుగుననుట.

తనతండ్రియగు జమదగ్నిమహర్షినిఁ జంపి, కామధేనువునుఁ గొనిపోవుచుండిన కార్తవీర్యార్జునుని పుత్రమిత్ర

బాంధవసహితముగ పరశురాముఁడు క్రోధోజ్జ్వలిత మన స్కుఁడై సమున్మూలముగ నాశముఁ గావించెను. పితృవధసం జనిత క్రోధాగ్ని అంతటితోఁ జల్లాఱక ఇరువదియొక్క మాఱులు క్షత్రియవంశారణ్యముల దహించివైచెను.

కౌరవసభాంగణమున ద్రౌపదీ వస్త్రాపహరణాత్మికమహా పరాధమానభంగజనితక్రోధాగ్ని పాండవుల హృదయమం దును, అందు ముఖ్యముగ ద్రౌపదీ భీమసేనులమనంబునందును నెలకొని ప్రజ్వలించి దుశ్శాసను వధానంతరము చల్లాఱెను.

శ్రీకృష్ణరాయబారమునందు ద్రౌపది చెప్పినవాక్యము లలో అచ్యుతా! నాఁటిదినము మహాజనసమక్షమున సభా మధ్యమందు దుశ్శాసనుం డొనరించిన యవమానమువలనఁ గలిగిన క్రోధాగ్ని నాహృదయమును దహించుచున్నది. ఆ సంతాపము మఱియొకదానివలన నుపశమింపదు. పుండరీకాక్షా! నాసంతాపముఁ బాపవే యని ప్రార్థించిన దుశ్శాసనువధచే, నీ తాపముఁ బాపెదనని యాదవుఁడు డానతిచ్చెను. మహావీర చరిత్రమునందు రావణాదులయెడ వీరరాఘవక్రోధంబును, వేణీసంహారమునందు కౌరవులయెడను, ముఖ్యముగ దుశ్శాస నునియందును, భీమసేనునిక్రోధంబును చేక్కఁగ వర్ణింపఁబడి నవి. పద్మవ్యూహమున నసహాయుఁడగు అభిమన్యుని నక్రమ ముగఁ జంపిన మహాపరాధజనితక్రోధాగ్ని అర్జునుని (ధనంజ యుని) హృదయమునఁ బ్రవేశించి, మఱునాఁటి సూర్యాస్త మయములోపల సైంధవుని యమసదనమునకుఁ బంపివైచెను.

ధార్మికులగు మహావీరుల క్రోధాగ్నిచే నిట్లనేకులు మదాంధులు మడసినట్లు పురాణేతిహాసములయందుఁ గన్పట్టుచున్నయది. అంత్యకాలము సమీపించినవారలు తేజస్వులగు మహనీయులయెడ మహాపరాధముఁ గావించి, వారికిఁ గోపము తెప్పించి, వారిక్రోధాగ్నిలో మిడుతలవలెఁ బడిపోవుచుందురు.

ధర్మరక్షణార్థము భగవచ్ఛక్తి క్షత్రియులయెడ క్రోధరూపముగ నుండుట.

దుష్టశిక్షణము శిష్టరక్షణముకొఱకు భగవంతుఁ డవతారమెత్తి అధర్మాత్ములగు దుష్టులను శిక్షించుటకు క్షత్రియులను, ఆయుధోపకరణములను సృజించి, వారికిఁ దగినట్లు శౌర్యమును, రౌద్రరసమును గల్పించి ధర్మసంస్థాపన మొనరించుచుండును. రౌద్రరసమునకు స్థాయీభావము క్రోధము. దుష్టులు సాధువులను బాధించి వారిసొత్తుల నపహరించునెడ, పాలకులగు క్షత్రియులకు వారియెడ క్రోధముకలిగి వారిని శిక్షింతురు. ఈక్రోధమును భరించుటకు పరాక్రమవంతులును, ధీరులు నగుక్షత్రియులు సమర్థులుగాని ఇతరులు కాఁజాలరు. ఏలన ? క్రోధము రజోగుణసముద్భవము. క్షాత్రము రజోగుణసంభవము. ఈరెండును ఒకేగుణమునుండి పుట్టినవి కాఁబట్టి క్షత్రియజాతి క్రోధమను నాయుధముచే నధార్మికుల దుష్టుల శిక్షించును. అర్జునుఁడు తనవారికపరాధ

మొనరించినవారియెడ క్రోధమునుం జూపి, స్వధర్మమగు యుద్ధముచేయక, బ్రాహ్మణధర్మమగు సన్న్యాసమును స్వీకరించి, శాంతచిత్తుండగుతఱి, ధర్మవ్యతిక్రమము కలుగుచున్నదని గీతాశాస్త్రమును భగవానుం డుపదేశించి, స్వధర్మనిర్వహణ మొనరింపం జేసి, సమ్యక్జ్ఞాననిష్ఠచే శాంతచిత్తునిం గావించె. తపస్సంపన్నులగు యోగులు, జ్ఞానులు, క్రోధమును దూర ముగ తరిమివేయవలయు. భాగవతోత్తముండగు అంబరీషుండు ద్వాదశీవ్రతపారణము సేయుతఱి నతిథిగవచ్చిన దుర్వాసోమహామునినిం బారణకు రమ్మని ప్రార్థింప యమునా నదికిం బోయి, కృత్యములు సలుపుచుండ, వ్రతకాల మతిక్రమించిపోవునని విప్రులయానతిచే నబ్భక్షణముం గావించెను. తన్ను నతిథిగం బిలిచి రాకమున్నె అబ్భక్షణముం గావించి యవ మానపఱచెనని క్రోధముచే జడనుం బెఱికివేయగ కృత్యశక్తియై యంబరీషుని బాధింపం బోవుచుండ, స్వభక్తుండగు అంబరీషుని శత్రునాశనమునకును, ఆత్మరక్షణమునకును, శ్రీహరి యొసంగిన సుదర్శనచక్రము జాజ్వల్యమానమై, కృత్యశక్తిని దహించి, దుర్వాసోమునిమీఁదికిం బోవఁగా భీతుండై ముల్లోకములు సంచరించి, తుదకు అంబరీషుని శరణువేఁడగా, నాభాగవతోత్తముండు సుదర్శనచక్రమునుం బ్రార్థించి మునిని రక్షించెను. స్వశక్తి పరశక్తి తెలియక క్రోధమును భగవద్భక్తునిమీఁదికిం బంపఁగ, తుదకు తనకే యవమానము కలిగెను. శాంతచిత్తులగు భాగవతోత్తములకును, యతీశ్వరుల

కును, మునిపుంగవులకును, మహనీయులకు నెంతయపరాధ మొనరించినను, వారిహృదయమునందు క్రోధ ముదయించేదు. కోపము జనించెనేని తపస్సు భంగమగును. విశ్వామిత్ర మహర్షి చరిత్రమున పలుమాఱు క్రోధము జనించి,శపించుటచే తపస్సు భంగమగుచుండ, కడపట యజ్ఞవిఘ్నకారులగు మారీచసుబాహువులవధకు శ్రీరామలక్ష్మణుల సాహాయ్యముం గోరెను. శపింప శక్తుండయ్యు, కష్టార్జితతపస్సు నేల వ్యయ పఱచేవలెనని యుత్తమక్షత్రియులచే వారిధర్మమును (నిర్వహింపఁ జేసెను) నిర్వర్తింపఁ జేసెను. వసిష్ఠమహర్షికి పుత్ర శోకము గలిగినను, క్రోధమును సహించి శపింపకుండ తపస్సును రక్షించుకొనెను.

మతధర్మవిప్లవకారులయెడ క్రోధ ముదయించుట.

సామాన్యముగ మహనీయులకు, భక్తులకు, మతోద్ధారకులకు, శాస్త్రజ్ఞులకు, తమ్ము దూషించినను కోపమంత రాదుగాని తమమతమును, మతధర్మములను, ఆరాధిత స్వేష్టదేవతలను దూషించినపుడు ప్రజ్వలనాత్మక మగుక్రోధ ముదయించును ధర్మవిప్లవము కలిగించి మతమును పాడుచేయుచున్నారనియు, అజ్ఞానప్రలపితములనియు, నవిశ్వసనీయములనియు, అప్రామాణ్యవాదములనియు, నొకరినొకరు మహాసభలలో దూషించుకొని, కొట్టుకొని, అభియోగములఁ దెచ్చికొని, న్యాయస్థానముల కెక్కిన వెన్నియో కలవు. కొందఱికి జరి

మానాలు, శిక్షలు, అవమానములు మొదలగునవి కలుగును. మతముకొఱకు కలహములు, యుద్ధములు జరిగినట్లు చరిత్రల వలనఁ దెలియుచున్నది

ధర్మవిప్లవకారులగు ద్రోహులయెడ సాధువులకును క్రోధము కలుగుననుట.

మతము, మతాచార్యులు, మతధర్మములు, అభిమాన దేవతలు, వీరిని దూషించినపుడు కలుగుకోపము ధర్మవిషయకమును సాంఘికమును నయినది కాఁబట్టి, స్వార్థమయినది కానేరదు. అధర్మము, అన్యాయము, అసత్యము, దురాచారము, వీని నాశ్రయించువారియెడ ద్వేషము, కోపము కలుగుట, ధార్మిక సజ్జనస్వభావము. లోకములో దీనులను, సాధువులను, అమాయికులను, బాధించునట్టి దుష్టులయెడ నేవారికి కోపముదయించేదు? పరమేశ్వరుఁడొసంగినట్టి శక్తిసామర్థ్యముల చేత దుష్టు లొనరించుబాధలనుండి తొలఁగింపవలయును. శక్తిమంతుఁడు దుష్టులొనరించు దుర్మార్గకృత్యములనుఁ జూచి, ఆశ్రితులను దీనులను రక్షింపక, వీర లేమిసేయుదురని బలగర్వముచే నుపేక్షించెనేని పాపమును, అపకీర్తినిఁ బొందును. వీనిపైని లోకులు అశక్తి భీరుత్వము లారోపింతురు. అట్టి నిందఁ బొందినతర్వాత వీనికుండిన శక్తిసామర్థ్యములచే నేమి ప్రయోజనము?

శాంతము పురుషులకు భూషణమే కాని, అవమానము గలుగునపుడు శక్తిసామర్థ్యములఁ జూపవలెనని నీతికోవిదుల మతము.

శ్లో. అన్యదా భూషణం పుంసాం శమో లజ్జేవ యోషితాం,
పరాక్రమః పరిభవే వైయాత్యం సురతేష్వివ.

అర్థశాస్త్రం.

స్త్రీలకు లజ్జవలె పురుషులకు శాంతము భూషణము. అయితే అవమానము గలుగునపుడు పరాక్రమమును (సామర్థ్యమును) జూపి, ఆత్మగౌరవమును గాపాడుకొనవలయును: లజ్జ భూషణముగా నున్నను, వనితలు సురతక్రీడలయందు ధార్ష్ట్యమును (ప్రాగల్భ్యమును-Boldness) జూపినట్లు, పురుషులును పరాక్రమమును జూపుదురని భావము. వ్యావహారిక ప్రపంచమున మహనీయులు శాంతచిత్తులయినను భృత్యాదులు కార్యములు చక్కఁగ జరుపక యాలస్యము సేయునపుడు వారి యెడ నించుక కోపము చూపక తప్పదు. అటుల కోపము చూపఁడేని శాంతచిత్తుఁడని, సాధువని, భీతిలేక కార్యములఁ జక్కఁగ నిర్వర్తింపరు.

కోపమందలి భేదములు స్థితులు.

శ్లో. వధావజ్ఞాదిభిశ్చిత్తజ్వలనం క్రోధ ఈరితః,
ఏష త్రిధా భవేత్కో(ఽ)ధ కోపరోషప్రభేదతః.

రసార్ణవసుధాకరే.

కోపము మూఁడవస్థలు గలది. కోమలావస్థయందు కోపము (Angry), మధ్యమావస్థయందు రోషము (Rage), ఉత్కటావస్థయందు క్రోధము (Wrath) నని చెప్పఁబడును.

ఉత్తముల నాశ్రయించి కోమలావస్థయందున్న కోపము, భగ్గు భగ్గని మండుచున్న తాటియాకులనిప్పువలెను, చేబుకుచెత్తనిప్పువలె నొకక్షణకాల ముండి చల్లాఱును. ఔష్ణ్య మెక్కువలేనందున విశేషముగ బాధింపదు. మధ్యమావస్థ యందున్న రోషము మధ్యముల నాశ్రయించి సమిధలనిప్పువలెను, చేబుకుపుల్లల నిప్పువలెను, రెండుగడియలకాల ముండి, వెంటనే చల్లాఱక చాలకాలముండక వేఁడిమి కొంత చూపి బాధించును. ఉత్కటావస్థయందలి క్రోధము క్రూరులను, అధముల నాశ్రయించి తుమ్మకట్టెలు (మొద్దులు) చింతకట్టెలు చంద్రకొయ్యలనిప్పువలె నహోరాత్ర ముండి చల్లాఱక అధికవేఁడిమిచే దహించుచుండును. తీవ్రక్రోధము ఇనుప పట్ర Foundry (కార్ఖానా) లో క్రాగుచున్న పోఁతపోయఁబడుచున్న లోహమువలె నత్యుష్ణతాతీక్ష్ణతచేఁ జూచినంత మాత్రమున తాకినంతమాత్రమున దహించివైచును. హిమాలయంబున తపోనిష్ఠమైయున్న శివుని (మహేశ్వరుని) మనంబు కలఁతపఱచిన పంచబాణుఁడు రౌద్రక్రోధాగ్నిని దగ్ధుండయ్యె. సగరపుత్త్రులు కపిలమహాముని తపస్సమాధినిష్ఠను భంగపఱచి, ఆయన క్రోధాగ్నిచే భస్మీభూతు లయిరి. కౌశికుండు వృక్షమూలంబున తపం బొనరించుచుండ, పైని రెట్టవైచిన బకం

బును క్రోధంబునఁ జూచినంత ప్రాణములఁ గోల్పోయె, నిట్టి వెన్నేని నిదర్శనములు కలవు. కాఁబట్టి తపస్సంపన్నులకు సామాన్యముగ కోపము రాదు. వచ్చెనేని క్రోధాగ్నియై తద్విషయుల నశింపఁజేయు సముద్రములోఁ బుట్టిన హాలా హలవిషాగ్నినిఁ బరమేశ్వరుఁ డొక్కరుఁడే కంఠమున భరించి నీలకంఠుం డయ్యె. అమ్మహాదేవుఁడు తాపసులకు వరప్రదుండై వరముల నొసంగును. విఘ్నము గావించువారిని రౌద్రాగ్ని క్రోధమై దహించును. ఇదివఱలో రౌద్రరసమునకు క్రోధము స్థాయీభావమని చెప్పఁబడెను.

శ్లో. ఉత్తమే క్షణకోపం స్యాన్మధ్యమే ఘటికాద్వయం,
అధమే తు అహోరాత్రం నీచేతు మరణాంతకమ్.

శ్లో. ఆమరణాంతాః ప్రణయాః కోపాస్తత్క్షణభంగురాః,
పరిత్యాగాశ్చ నిశ్శంకా భవంతి హి మహాత్మనామ్.

నీతిశాస్త్రము.

ఉత్తములకుఁ గలుగుకోపము క్షణకాలమును, మధ్యములకు రెండుగడియలకాలమును, అధములకు రాత్రింబవలును, నీచునకు మరణపర్యంతము నుండునని తాత్పర్యము.

ఉత్తములు తమకన్న నించుక తక్కువవారియెడఁజూపు కోపలక్షణములు.

ఉత్తమాధికారులకు తమకన్న నొకించుక తక్కువయధికారముగల మానవంతులగు ప్రజ్ఞావంతులయెడ కోపము

గలిగినపుడు తలయెత్తి చూడకుండుట, ముఖమునందు ప్రసన్నత లేకుండుట, వందన మొనరించినను మౌనముగ నుండుట, కొంతసేపటికి మాటాడనెంచి ఇక్కార్యము మఱియొకవిధమునఁ జేసిన బాగుగ నుండెడిని. మీబోఁటిబుద్ధిమంతు లీలాగున అజాగ్రత సలుపఁ దగునా? పూర్వము చేక్కఁగా లెక్క లుంచేఁబడినవి. ఏకారణముచే పొరబాటులు దొరలినవో యెఱుఁగఁజాలము. ఇఁకముం దింతకన్నఁ జేక్కగ నుండునని తలంతుమని మృదువుగ మనము నొవ్వాడక, మందలించి భయభక్తివినమ్రులగువారి నాదరించి, ప్రసన్నముఖవీక్షణులై హర్షోల్లసితవచనముల కరస్పర్శఁ గావించి, సంతసమునఁ బంపివైతురు. ఆశ్రితులు భయభక్తివినమ్రులై ప్రతిమలాడుకొను (అభ్యర్థనము) పర్యంతము ఉత్తములకుఁ గలుగు కోపముండి తత్క్షణమే చెల్లారును. ఉత్తమాధికారులు ఆదరించినంతట, చిన్నఅధికారులు నిర్భయులై సంకోచము, బెదరు విడిచి, హర్షోత్ఫుల్లమనస్కు లగుదురు. మానవంతు లగుటచే నిశితమును కోమలము నగువారిబుద్ధి (Maunderliness) అంతట ప్రసరించుటంజేసి, కొలఁదిగ మందలించినను, ఇంచుక పారుష్యముఁ జూపినను వారిమనస్సు నొచ్చును. కాఁబట్టి నిశితమును కోమలము నగు బుద్ధిగల మానవంతులకు రోష మతిశీఘ్రముగఁ గలుగును. కనుక గొప్పవారు అట్టి మాననీయుల యెడ నాతికఠినముగ మృదువుగ వ్యవహరింపఁ దగును.

ఉత్తములు మధ్యములయెడఁజూపు కోపలక్షణములు.

ఉత్తములగు నాగరికులు మధ్యములయెడ కోపము చూపునపుడు ఎత్తిపొడుపు (Sarcasm) మాటలు, కొండితో కుట్టినట్లు చుఱుకుపలుకులు, అపహాస్యము, హేళన, నిందా గర్భితపుఁ బలుకులు, క్రిందుచూచుట, భీష్మీకరించుకొనుట, శిరఃకంపము లోనగు చేష్టలు కన్పించును.

ఉత్తములు అధములయెడఁజూపు కోపలక్షణములు.

అధములయెడఁ గోపము చూపునపుడు తిరస్కరించుట, అలక్ష్యముచేయుట, తృణప్రాయముగఁ జూచుట, చీవాట్లు పెట్టుట, గర్హించుట, అగౌరవము చేయుట, బెదరించుట, భీతినిఁ గలిగించుట, తలమూచేుట, కండ్ల నెఱ్ఱఁజేయుట లోనగు శారీరక చేష్టలునుఁ గన్పించును. భృత్యులు, పరిచారకులు, క్షుద్రులునగువారు, మందబుద్ధులును, తామసప్రకృతిగలవారు కాఁబట్టి, వారిని నీవిధముగఁ జూచినఁగాని, నియమితకార్యముల నిర్వహింపఁజాలరు. వీరికి సూక్ష్మబుద్ధి లేనందున కఠినముగ నొత్తి పలుకవలయును. యజమానునికిఁ గోపముగలిగి యేమిసేయునో యని భీతిఁజెంది పనులుసేయుదురు.

సమానులకుఁ బరస్పరముకలుగు కోపలక్షణములు.

సమానులగు మిత్రు లొకరిమీద నొకరికిఁ గోపము కలిగినపుడు, "మిత్రదండ మభాషణమ్" అనునట్లు మాటాడు

కొనకుండుట, నేత్రాంతములం దశ్రుబిందువులు జారుట, యూరక తలపోసికొనుట, నిట్టూర్పులుఁ బుచ్చుట, ముఖమును వంచుట, వంకలగఁ జూచుట, అన్యాపదేశముగ ననుకొనుట, వైవర్ణ్యము, వికాసాభావము, నిశ్చేష్టత లోనగునవి కనుపించును.

ఉన్నతాధికారులు మాననీయులగు నాశ్రితులయెడ కోపమువిడిచి ధర్మావలంబులై యుందురు.

న్యాయస్థానవ్యవహారసభలయందు న్యాయాధికారులేదేనొక యభిప్రాయమును మనంబున నిడికొని వ్యవహారధోరణిని ధర్మము తొలఁగునపుడు ప్రజ్ఞావంతులును, ధీరులు నగు (పరార్థ) న్యాయవాదులు వాఙ్మాధుర్యముచేతను, భాషాపటిమచేతను, గంభీరార్థముల నన్యాపదేశముల వారితప్పు వారిమనస్సునకుఁ దోఁచునట్లు సరసముగఁ బ్రసంగించి మార్చుదురు. అప్పటికిని ధర్మేతరాభిప్రాయమును మార్చుకొనక, పక్షావలంబిరై యుండునెడ, ధర్మము తొలఁగుచున్నదని భాషాకాఠిన్యమును, వాక్పారుష్యంబును గల ధర్మనిష్ఠురవాక్యంబులను, సోల్లుంఠనముగఁ బలుకుచు, ననేకధర్మశాస్త్రగ్రంథముల తీర్పునుఁజూపి యార్భాటనముఁ గావింపునపుడు ఇంక నభిప్రాయము మార్చుకొననియెడల గౌరవముఁ దక్కదనియు, తమయెడ నెల్లఱకు నితఁడు పట్టుదలగలవాఁడు, అధర్మాత్ముఁడునని యప్రతిష్ఠఁ గలుగుననియు,బహుజనద్వేషముఁ గలుగుననియుఁ

దలఁచి, మేధాశాలియగు నా న్యాయాధిపతి తన యభిప్రాయమును మార్చుకొని, యుభయపక్షములవారికి ధర్మము న్యాయము కలుగునట్లు తీర్పు చెప్పును. ప్రతికూలముఁ జెందినవారు తమలోపముల నీన్యాయాధిపతి తెలిసికొని న్యాయముగ తీర్మానించెనని లోపల సమ్మతింతురు. ధర్మముకొఱకై యా న్యాయవాది అంత శ్రమఁదీసికొని తన ప్రజ్ఞాబలముచే న్యాయాధిపతిని ధర్మమార్గమునఁ బ్రవర్తింపఁ జేసెనని విజ్ఞులెల్లఱు వార్షింతురు. దానం జేసి లబ్ధప్రతిష్ఠుఁ డయినందున ననేకులు క్లిష్టవ్యవహారములఁ దీసికొని వచ్చి తగినట్లు ధనము నొసంగెదరు. కీర్తియునుఁ గలుగును. సరసహృదయుఁడై న్యాయాధిపతి ధర్మేతరమగు తన దురభిప్రాయమునుఁ దెలిసికొని, మార్చుకొనలేక పట్టుదలతో నుండినపుడు ఈన్యాయవాది ధర్మవిప్లవ సూచకములగు నెన్నివాక్యములు చెప్పినను, భాషామాధుర్యయుక్తవాక్పటిమనుఁ గనపఱచినను, ఇదియంతయు నరణ్యరోదన మగును. తనయభిప్రాయమును మార్పఁదలఁచి విమర్శనఖండనవాక్యములు చెప్పుచున్నాఁడనియు, తనయెడ వినమ్రయుక్తగౌరవభావముఁ జూపలేదనియు, ధీరుఁడనియుఁ దెలిసికొని, పైకిఁ జక్కఁగ మాట్లాడుచు, వ్యవహారములఁ బ్రతికూలముఁ గావించుచుండును. రజస్తమోగుణభావములుగల పుత్రులు, తమప్రకృతులకుఁ దగునట్లు తల్లియొద్ద స్వాతంత్ర్యముఁ జేసికొని మాట్లాడునపుడు, ఉదారభావముతో సహించి, వారినిఁ దగున ట్లాదరించువిధంబున న్యాయాధిపతులును,

[illegible]

[illegible]

(Revengefulness)

ఉన్నతుల కోపపడుతురై అధములు పగఁబట్టి ఘోరకృత్యములుఁ గావించుదురనుట.

[illegible] (Cowardice) Timidity, Timorousness [illegible]

మోటుదనము మూర్ఖత్వముఁగల క్రూరులీ గొప్పవాఁడు, తనకధికారము ధనము బలము గలదని, మనల నవమానించెననియు, వ్యవహారముల చెడఁగొట్టెననియుఁ దలఁచి (Vindictiveness, Revengefulness) పగపట్టి ప్రత్యపకారము నేయఁ బూనుకొందురు.

తమకన్న నధికుఁడు ప్రజ్ఞాబలవంతుఁడు, రాజకీయాధికారిక పురుషవశీకరణశక్తిఁ గలవాఁడు, ఉత్తమోత్తమ న్యాయస్థానములందుఁ బ్రతివ్యవహారము మనకుఁ బ్రతికూలము నేయుచున్న వాఁడు, ఇతఁడుండిన మనము కాపురములఁ జేయఁ జాలము. ఎవ్విధంబుననేని నీతని హత్యఁ గావించవలెనని పగఁబట్టి మార్గమున నొంటరిగఁ బోవుచున్నప్పుడును, నిద్రించునప్పుడును, సమయముఁజూచి గొడ్డటఁగాని, కత్తివాటునఁగాని, ఘోరహత్యలుఁ గావింతురు.

పశువులనుఁ జంపి, వాహనముల విఱుగఁగొట్టి, గుఱ్ఱములకు తోకలుకోసి, గడ్డివాములు తగులఁబెట్టి, పొలములలో పైరులను పాడుచేసి, అనేకవిధముల భయపెట్టి వారు సౌమ్యతకు మిత్రత్వమునకు వచ్చునట్లు చూతురు దీనికిని భయపడి లొంగక పట్టుదలతో కార్యముల సాధించుచున్న యెడఁ గడపట విసిగి హత్యగావింపఁ బూనుకొందురు.

తమకుఁగాని, ఆత్మీయబంధువులకుఁ గాని, గొప్పయవమానము సంభవించినపుడును, వధించినపుడును, క్రూరజనులకు

క్రోధ ముత్పన్న మగును. ప్రత్యపకారముఁ జేసి పగఁ (కసి) దీర్చుకొనువఱకు వారి క్రోధాగ్ని చల్లాఱదు.

శ్లో. వధచ్ఛేదాదిపర్యంతః క్రోధః క్రూరజనాశ్రయః,
అభ్యర్థనావధిప్రాయః కోపో వీరజనాశ్రయః.

రసార్ణవసుధాకరే.

క్రోధము క్రూరజనుల నాశ్రయించి వధము, ఛేదనము, హత్యలు గావించినంతట పోవుననియు, కోపము వీరజనులగు ఉత్తముల నాశ్రయించి, ప్రతిమాలుకొనుపర్యంత ముండి పిమ్మటఁ బోవుననియు తాత్పర్యము. దీనింబట్టి క్రోధము తీక్ష్ణాగ్నివలె నుత్కటావస్థఁ గలదనియు, కోపము తృణాగ్ని వలె కోమలావస్థగలదనియు నిదివఱలోఁ జెప్పఁబడినది స్పష్టము.

అధములకు (నీచులకు) పరస్పరము కోపము కలుగునపుడు కలుగులక్షణములు.

అధములకు అధములయెడఁ గోపము కలుగునపుడు, అశ్లీలములు అవాచ్యములు నగు పలుకులు పలుకుకొనుట, తిట్టుకొనుట, తిరస్కరించుకొనుట, గొంతెత్తి యఱచుకొనుట, ఎవరేని నడ్డము వచ్చినవారిని గౌరవములేక మాటాడుట, వీనితోఁ బ్రారంభమై (Aggressiveness) ద్వేష ముద్రేకించి బడితకఱ్ఱలు, ఱాళ్లు, గడ్డలు, విసరివైచుకొనుచు, కొట్టుకొనుచు, కేశాకేశి, బాహాబాహి, ముష్టాముష్టియుద్ధము సలుపుకొందురు.

ఈకలహములో పూర్వమున్న ద్వేషములు, విరోధములు జ్ఞప్తిఁ జేసికొని, మఱియు చెలరేగి కొట్టుకొని గాయములుఁ జేసికొందురు. ఇట్టిక్రోధము నీచ నిమ్న జాతులగు ఎఱుకలు, దొమ్మరులు, కోయలు, కొండజాతులు, బుడుబుడుక్కలు లోనగు పశుప్రాయులును, అనాగరికులును, మూర్ఖులు నగు వారిలోఁ బ్రవేశించి అర్థప్రాణముల నాశనముఁ జేయును. మఱియు, ఈనీచజాతులు మద్యపానముఁ జేసి యొడలు తెలియక యున్మత్తులై తిట్టుకొనుచు, కొట్టుకొనుచు, రక్షకభటులచే బంధింపఁబడి శిక్షితు లగుచుందురు. ఇట్టి దొమ్మియుద్ధము లోనికి (కలహములోనికి) ఆయుధపాణులగు రక్షణాధికారులు పోయి, గుంపును చెదరఁగొట్టి బెదిరించి చేక్కఁబఱచవలయునుగాని, నిరాయుధుఁడగు నాగరికుఁడు మాన్యుఁడు పోఁగూడదు. పోయెనేని అగౌరవమును గాయములనుఁ జెందును. రక్షణాధికారులకుఁ దెలిపి వారిసాహాయ్యముచే నొకగుంపునుఁ దీసికొని పోయి వారిని చెదరఁగొట్టవలయును.

ఈక్రోధస్వభావముఁగలవారు (క్రోధనులు) మద్యపానముఁ జేసి యొడలు తెలియక తిట్టుకొనుచు, కొట్టుకొనుచు, నొడలు రక్తమయముఁ జేసికొనుచునుండ, పూర్వము అతి క్రోధనులై కొట్టుకొనిచచ్చినవారు వారిద్వేష ముపశమింపక వాయుమయశరీరులై (Spirits or Devils) అవకాశముఁ జిక్కునా యని వెదకికొనుచునుండ నీ యున్మత్తక్రోధనుల స్థూలదేహములలోఁ బ్రవేశించి, యావేశముఁ గలిగించి

వధిఁ(బ్రతిమాలుకొనుపర్యంతము)ఉండును. కుటిలమైనచూపు, అధరస్ఫురణము,అపాంగారుణిమత్వము, నిశ్శ్వసితము లోనగు చేష్టలు గలుగును.

స్త్రీకి పురుషునిమీఁదఁ గలుగుకోపము ద్వివిధము. అందు ప్రథమము సపత్నీహేతుకమయినది ద్వితీయము అన్యహేతుక మయినది. తనవల్లభుఁడు పరస్త్రీరక్తుఁ డయినప్పుడు తనవైభవము తగ్గెననియు, పలువురు చెలికత్తెలలో చులకఁదనము గలిగెననియు, ప్రాణవిభుఁ డిట్లొనరించునని స్వప్నమందునుఁ దలఁపలేదనియుఁ జింతించి రోషాన్విత యగును. మానవతులయెడ రోషము శీఘ్ర ముదయించును. దయితుఁడేతెంచుటకుముందు శిరోబాధ యధికమైనదని తలకు గుడ్డ కట్టుకొని, జ్వరముగలిగినట్లు తాపముచే మూల్గుచు, చెలికత్తెలచే నుపచరింపఁబడుచు, చికిత్సలు జేయించుకొనుచు, ముసుగు వెట్టుకొని పరుండును. ఇదియంతయు ప్రాణేశ్వరునకు తనయెడ ననురాగము కలదా? లేదా? యని కనుఁగొనుటకు పన్నిన యుపాయము. పిమ్మట విభుఁ డేతెంచి యనునయించి పాదములుబట్టుకొని నీయందే యనురక్తుఁడనని శపథము చేయు వఱకు ఈరోషము విడువదు. దయితునిమనస్సునుఁ బరీక్షించి యనురాగచిహ్నములఁ జూచి, సమాధానముఁ జెందిన చిత్తముగలది యగును. ఈరోషమును పొలయలుకయని ఆలంకారికులు వ్యవహరింతురు. కృత్రిమకోపము గనుక అంతయు కుటిలవర్తనముతోఁ గూడియుండు. పారిజాతాప

హారణప్రబంధమున మానవతియగు సత్యభామాచరితముచే స్పష్టముగఁ దెలియును.

బాహ్యచిహ్నములచే కుపితత్వము విశ్వసింపఁజనదు.

కొందఱు ముంగోపులు చిఱచిఱలాడుచు, సుముఖత్వము లేక యేది మాటాడఁబోయినను జంకును గలిగింతురు. కాని, వారిహృదయము సౌహార్ద్రముతోను, ప్రీతిభావముతో నుండి యెవరికి నపకార మొనరింపరు. బాహ్యస్థితినిబట్టి యితఁడు కోపి, అనుసరణీయుఁడు కాఁడని యుపేక్షింపఁ జనదు. వారి భావముఁ దెలిసికొని వర్తించినట్లయిన ప్రసన్ను లగుదురు. దావాగ్నిజ్వాల చుట్టుఁబట్టుల వృక్షములకొమ్మల దహించుఁ గాని, వానిని సమున్మూలము నాశనముఁ గావింపనేరదు. కార్యవాదులు కొందఱు బాహ్యకోపమున కార్యము జెడునని లోపల కోపముఁబెట్టుకొని పైకి చిఱునగవుఁ దోలకాఁడు మోముగలవారలై చల్లగా మాటాడుచుఁ జేరఁదీసి నమ్మించి ఘాతుకముఁ జేయుదురు. అట్టివారిని నమ్మి దగ్గరఁ జేరఁగూడదు. నదీజలప్రవాహము చల్లగ నుండి గట్టుపైనున్న చెట్లను క్రుంకుడువేళ్లతోఁగూడ పెకలించి నాశనముఁ జేయును. క్రిందుగనే ప్రవహించి క్రుంకుడువేళ్లనుఁ బెకలించినట్లు, అంతర్దాహులగు దుష్టులు నమ్రులై పాదావనతులై నమ్మించి నాశనముఁ జేయుదురు. కాఁబట్టి బాహ్యలింగములచే విశ్వసనీయులని తలంపఁగూడదు.

మాననీయులరోషము (Provocation, Rage.)

చిత్తసమున్నతి మానమనఁబడు. మానవంతులు, తామే పూజనీయులు, గౌరవార్హులు, సత్కారప్రసూతులు, ఎల్లవిషయములుఁ దెలిసినవారు నని అహంకారపూరితులై రజోగుణాధికులై యుందురు. వీరి యభిప్రాయములకుఁగాని, క్రియలకుఁగాని యెవరేని ప్రతికూలముగా వర్తించినపుడు రోషము కలుగును. దీనినే అమర్షమందురు. ప్రతికూలభావము నేమాత్రమేని యోర్వకుండుట రాజులు, అధికారులు, ధన - కుల - విద్యా-బలాధికులయెడ ప్రాయికముగఁ గన్పడుచుండును. వీరు మహాజనసభలకుఁ గాని, సంస్థలకుఁ గాని, అధ్యక్షులైనప్పుడు వారు చెప్పునదే శాసనము. వారలే శాస్త్రలుగా భావింపవలసియుండునని వారి యాంతరాశయము. సభ్యులెల్లలు వారి యోగ్యతనుఁబట్టి అధ్యక్షునిఁ గావించినందున ధర్మ్యమును సర్వజనసమ్మతము నగు నభిప్రాయము నంగీకరింతురు. కార్యనిర్వహణమునకై యుపసంఘమును నిర్మింతురు అచ్చోటి సంఘాధ్యక్షునితో నాయకు లేకీభవింపక, భిన్నాభిప్రాయులగునపుడు వివాదములును, తమయభిప్రాయమును గౌరవింపలేదని రోషమును ప్రారంభమై ద్వేషము లతిశయించి యొకరినొకరు దూషించుకొనుచు, కుర్చీలు విఱుగఁగొట్టుచు, పుస్తకములు విసరివైచుకొనుచు, చేతులు కలియవేసికొనుచుండుటవలన నుభయపక్షములవారికి నానావిధకష్టములును,

[illegible]

[illegible]

క్రోధము మహానర్థకరము.

[illegible]

లగు ముముక్షువులు కామక్రోధాదులనుఁ బూర్తిగ విడిచినఁ గాని, అంతఃకరణశుద్ధిఁ గలిగి కైవల్యమును బడయఁజాలరు. సాధనచతుష్టయసంపత్తిలో నొకటియగు శమాదిషట్కమును బొందినవాఁడే బ్రహ్మజిజ్ఞాస కధికారి యని చెప్పఁబడినందున, శమదమాదులచే కామక్రోధాదులు నిగ్రహింపనగునని విదిత మగుచున్నది. క్రోధము మహానర్థకరము, మోక్షప్రతిబంధక మని గీతాశాస్త్రమున పలుచోట్ల శ్రీకృష్ణభగవానుఁ డాన తిచ్చెను.

శ్లో. త్రివిధం నరకస్యేదం ద్వారం నాశనమాత్మనః,
కామః క్రోధ స్తథాలోభ స్తస్మాదేతత్త్రయం త్యజేత్.
గీతాశాస్త్ర 16 అధ్యాయం. 21 శ్లోకం.

శ్లో. కామ ఏష క్రోధ ఏష రజోగుణసముద్భవః,
మహాశనో మహాపాప్మా విద్ధ్యేనమిహ వైరిణమ్.
గీత 3 అ. 27 శ్లో.

శ్లో. శక్నోతీహైవ యస్సోఢుం ప్రాక్శరీరవిమోక్షణాత్,
కామక్రోధోద్భవం వేగం స యుక్తస్స సుఖీ నరః.
గీత. 5 అ. 23 శ్లోకం.

శ్లో. కామక్రోధవియుక్తానాం యతీనాం యతచేతసాం,
గీత. 16 అ.

శ్లో. ధ్యాయతో విషయాన్ పుంసస్సంగ స్తేషూపజాయతే,
సంగాత్సంజాయతే కామః కామాత్క్రోధోఽభిజాయతే.
క్రోధాద్భవతి సంమోహస్సంమోహాత్స్మృతివిభ్రమః,
స్మృతిభ్రంశాద్బుద్ధినాశః బుద్ధినాశాత్ప్రణశ్యతి.
గీత. 2 అ.

విషయములను ధ్యానించుటవలన దానియందాసక్తియు, ఆసక్తివలన కామము (కోరిక), ఆకామమున కేవిధముననేని విఘాతము ప్రతిబంధము గలిగెనేని ప్రజ్వలనాత్మకమగుక్రోధ ముదయించును. క్రోధమువలన ఇది చేయఁదగినది, ఇది చేయఁదగనిది యని వివేచనారూప మగు తెలివి నశించును. ఇదియే అవివేకము సంమోహమని చెప్పఁబడును. ఈ సంమోహమువలన (అవివేకము) శాస్త్రాచార్యోపదిష్టమయి సంస్కారరూపముననుండు స్మృతి (జ్ఞప్తి) వలన భ్రంశముఁ బొందును. ఈస్మృతి భ్రష్టమగుటచే కార్యాకార్యవిషయములను వివేచనసేయుటయందర్హమైనట్టియు, నిశ్చయాత్మికమైనట్టియు బుద్ధి నశించును. పురుషార్థప్రద మగుబుద్ధి నశించుటచే పురుషుఁడును నశించినవాఁ డాయెనని తాత్పర్యము.

కామక్రోధలోభము లను నీమూఁడును నరకమునకు ద్వారములు. ఆత్మను నశింపఁజేయునట్టి యీమూఁటిని ముముక్షువు విసర్జింపవలయును. కామక్రోధములు రెండును రజోగుణమువలనఁ బుట్టునవియు, మహాపాపమునుఁ గలిగించునవియు, నెంత కలిగినను తృప్తిఁ జెందనివియునై మోక్షమార్గమునకు ప్రతిబంధములుగా నుండును. (గీ. 16. అ. 21.) శరీరమును విడుచుటకుమున్నె (జీవించియున్నపుడే) కామక్రోధములవలనఁ గలిగినవేగము నెవఁడు సహించుటకు శక్తుఁడగుచున్నాఁడో, వాఁడే సుఖి, యోగి, మానవుఁ డనఁబడుచున్నాఁడు. (గీ. 5-23)

క్రోధవేగము ప్రవాహవేగమునకుఁ బోల్చుట.

కామక్రోధోద్భవవేగమని శ్లోకములోఁ జెప్పఁబడుటచే, కామదోషప్రకరణమున విస్తరించి కామవేగము వివరింపఁబడియె. ఇచ్చట క్రోధవేగమునుగూర్చి మధుసూదనీయ వ్యాఖ్య విశదముగావించెడిని.

శరీరమును విడుచుటకుమున్నే యనఁగ జీవించియున్నప్పుడే కామక్రోధములవలనఁ బుట్టినవేగమును (సంక్షోభమును) సహించుట కెవ్వఁడు సమర్థుఁ డగుచున్నాఁడో, వాఁడే యోగియు, సుఖియు, మానవుఁడు నగుచున్నాఁడు. మృతిఁ జెందినతర్వాత శత్రువులచే దూషింపఁబడినను, పుత్త్రులచే దహింపఁబడినను, ప్రాణములేమిచే క్రోధవేగమును సహించినట్లే, ప్రాణ ముండినప్పుడు ఎవఁడు సహించుచున్నాఁడో వాఁడే ధీరుఁడు, యోగియు, సుఖియు నని భావము. జీవించియున్నప్పుడు క్రోధవేగమునకుఁ గారణములగు జ్ఞాతి శత్రుకృతావమాన వధాపరాధదూషణాదులు సంభవించునెడ క్రోధమువలన మనస్సంక్షోభమునుఁ బొందక, నిశ్చలుఁడై "ప్రాక్తనకర్మవలన నివి శత్రుమూలమున సంభవించుచుండు ˊ ...వునందును, తనయందునుండు నాత్మ యొక్కటియ, ఆత్మ ...ఁడును దూష్యుఁడును గాఁజాలఁడు"అని తలఁచి, అహం ...ఁడై శత్రువు అవివేకముచే దూషించినను, క్షమాకవచమును వహించి, శాంతుఁడై యున్నవాఁడు ధీరుఁడు,

సుఖి, యోగియనియు, నటుల గానివాఁడు క్రోధవశుఁడు, నరాకృతియగు ద్విపాదపశువని మోక్షతత్త్వజ్ఞులు పలుచోట్ల పెక్కు తెఱంగుల బోధించిరి.

వర్షాకాలమునం దచ్చటచ్చట విశేషవర్షములు గురిసి శాఖోపశాఖలుగ ప్రవాహములన్నియు నొకటిగఁ జేరిన నదీప్రవాహము మహావేగముతోఁ బ్రవహించుచు నిలుచుండిన వానిని బలాత్కారముగ గోతిలోఁ బడవైచి ముంచి అడుగంటించి సముద్రములోనికిఁ గొట్టుకొనిపోవును. అట్టుల కామప్రతిఘాతమువలనను అవమానాపరాధముల వలనను గలిగిన సంక్షోభరూపమగు క్రోధవేగము పురుషుని బలాత్కారముగ విషయగర్తములోఁ బడవైచి సంసారసముద్రములో ముంచి నరకరూపమగు నధోగతినిఁ బొందించును. ద్వేషరూపమగు క్రోధముచే సంక్షుభిత మనస్కుఁడై, రజోగ్రస్తుఁడైనందున అంధుఁడై (మూఢుఁడై) కార్యాకార్యవివేచనాశూన్యుఁడై పూజ్యులగు గురువులను, తలిదండ్రులను, బంధుమిత్రులనుఁ గొట్టనుంకించినవాఁడై నిరయగర్తమునఁ బడును. వర్షాకాలమున నవిచ్ఛిన్నవర్షములు గురిసి చెఱువులు తెగి కాలువ లేకమై, పశువులు చెట్లు జెముడుకంపమట్టలు కొట్టుకొని అడుసుతోఁ గలిసివచ్చిన నదీప్రవాహము, తీరమందున్న పూజాప్రదేశములు, తులసికోటలు, అనుష్ఠానఘట్టములు, దేవతావిగ్రహములను ముంచివైచి కొట్టుకొని పోవుచేందమున అనేకకార్యములు భగ్నమై జ్ఞాతిశత్రుకృతావమానాప

రాధములచే పలువిధముల సంక్షోభముఁ జెంది కలుషితమన స్కుఁడై తీవ్రప్రవాహవేగమువలె క్రోధవేగముచే నొడలు తెలియక గురువులను, పూజ్యులను, తలిదండ్రులను, మిత్ర బాంధవాదులను హింసించును. ప్రవాహవేగము తగ్గినంతట పూజాప్రదేశములు, అనుష్ఠానఘట్టములు, దేవతావిగ్రహ ములు, తులశికోటలు కన్పించువిధంబున క్రోధవేగము తగ్గి నంతట గురువులు, పూజ్యులు, తలిదండ్రులు మిత్రబాంధవు లని తెలిసికొని తాను అవివేకముచే నొనరించినట్టి ఘోర కృత్యమునకు సిగ్గుపడును.

ప్రవాహవేగమును నిగ్రహించిన తిమింగిలముతో యోగి పోల్చఁబడుట.

తిమింగిలము నదీప్రవాహవేగదోషమునుఁ దెలిసికొని తత్ప్రతికూలక్రియానుష్ఠానముచే అనర్థమునుండి తొలఁగి స్వస్థమయి నిలిచినటుల ముముక్షువగు యతీశ్వరుండును, బాహ్యవిషయరూపగర్తమునఁ బడక సంసారసాగరమున కొట్టుకొని పోఁబడక, వశీకారసంజ్ఞారూపవైరాగ్యముచే ననర్థమునుండి తొలఁగి ధీరుఁడై క్రోధవేగము నణఁచి జితేంద్రి యుఁడై యుత్తమపురుషార్థమును బడయును.

నదీప్రవాహజలము పంకిలమగునపుడు (బురద) కతక రేణువుచే నిర్మలముఁ గావించునటుల క్రోధముచే సంక్షోభ మును జెంది కలుషితమయిన మనస్సును యోగి ప్రతికూల

[illegible] నిష్ఫలము [illegible] క్రోధము [illegible]

క్రోధోద్రేకమున శారీరవిఘ్నములు మహత్తరముగ గలుగుట.

[illegible]

కామక్రోధములు నరకపురద్వారములు.

[illegible]

లోకశాస్త్రవిరుద్ధములగు దుష్కృతముల, మాతృపితృగుర్వాచార్య మిత్ర బాంధవహింసనము ఇండ్లు, గడ్డివాముల తగులఁబెట్టుట, కొట్టుట, తిట్టుట లోనగునవి కావించుటవలన ప్రత్యక్షముగ రాజదండనము పరోక్షముగ నరకపతనముఁ గలుగుచున్నవి. తృష్ణారూపమగు కామమువలనను ముగ్ధులై తాము వలఁచిన కాంతను మఱియొకరు ప్రేమించిరని ద్వేషముచే క్రోధము కలిగి, స్త్రీపురుషహత్యలనుఁ గావించుటచేతను నరకము కలుగును. కామక్రోధములు నరకపురమునకు ద్వారములని పై నిదర్శనములవలన స్పష్టమగుచున్నది.

శాంతచిత్తుఁడును తపస్వియగు యోగికి క్రోధము గలిగినచో, పచ్చికుండకు (ఆమఘటము) రంధ్రముకలిగి జలము స్రవించినట్టుల శాపరూపమున తపస్సు వ్యయమైపోవును. జితేంద్రియుఁడై విషయాసక్తుల సాంగత్యమును విడిచి, కామక్రోధాదుల నణఁచివేయవలెనని మను యాజ్ఞవల్క్యవసిష్ఠాదులు నొక్కి వక్కాణించినవారలు.

అతిమూఢుఁడు క్రోధావమానములచే బాధింపఁబడఁడు.

గాయములు వ్రణములు దెబ్బలు కలిగి యొడళ్లు కాయలుగాచినవారికి ముల్లు, సూది గ్రుచ్చుకొనినను, బాధ తెలియనివిధంబున కామక్రోధములతోఁ గూడిన మూఢులు తమ్ము నొరు లవమానించినను, దూషించినను, అపరాధ మొనరించినను, రోషాభిమానములఁ జెందక నీచత్వముచే తాము

మఱల వారిని దూషించుచు, నవమానించుచు, సహించుకొందురు. ఒరులవలనఁ గలిగిన కోపబాణములు (కాయలుఁ గాచిన) తమోమూఢమయిన మనస్సు నెక్కువ బాధింపఁ జాలవు.

సుకుమారశరీరునకు కఱకుటాకులమీఁది నూఁగు తగిలినను విశేషబాధ గలిగినటుల, నవనీతమువలె నతిమృదులమై, దర్పణమువలె నతిస్వచ్ఛమై ప్రకాశించు యోగియొక్క పరిశుద్ధాంతఃకరణమునకు నించుక కోపవృత్తి (కోపబాణము తగిలినను) గలిగినను (అక్షిపత్త్రము) కంటిలో నలుసుపడినవిధంబున విశేషబాధఁ జెందును.

ఉత్తములు పూజ్యులగు గొప్పవారు, ప్రీతిపూర్వక సంభాషణముచేతను సమాదరముచేతను ఆశ్రితుల సంతుష్టులఁ గావించిరేని, వారిమనస్సు వికాసముఁ జెందును. కోపించిరేని భయమును, భయమువలన మనస్సంకోచమును గలుగును. వికసితముఁ గాక సంకుచితమగు మనస్సునకు నిరుత్సాహంబును, ఆందోళనంబును గలుగును.

వాక్పారుష్యము సప్తవ్యసనములలో నొకటి. కాఁబట్టి, శ్రేయస్కాముఁడు ఒరులమనంబును కఠినంపుఁ బలుకుములుకులచే నొవ్వనాడఁగూడదు. కత్తివాటులచే దెబ్బతగిలిన చెట్టునఁ జిగిరించిన చిగిరించునుగాని, వాగ్బాణములచేఁ గొట్టఁబడిన (సూక్ష్మశరీరము) సుకుమారమనంబు వ్రణితమగునుఁ గాని, పల్లవింపనేరదు అని మహాభారతమునఁ గలదు.

శ్లో. రోహతే సాయకైర్విద్ధం వనం పరశునా హతం,
వాచా దురుక్తయా విద్ధం న సంరోహతి వాక్‌క్షతం.

మహాభారత-శాంతిపర్వ.

పాచకులు భోక్తలు క్రోధనులగుటచే కర్మలు వ్యర్థము లగుననుట.

వంటలు చేయువారును, వడ్డించువారును, క్రోధరహితులై శాంతమనస్సుతో భోక్తలను సమాదరముతో భుజింపఁ జేసిన సంతుష్టమనస్కులై భుజింతురు. అటుగాక కోపయుక్తమనస్కులై వంటఁజేసి వడ్డనఁ జేయవలసివచ్చినదే యని విసిగికొనుచు, చిఱచిఱలాడుచు కోపయుక్తులై వడ్డించునప్పుడు, భోజ్యపదార్థములను భోక్త లడిగినపుడు కోపపడుచు విసుగుకొనుచు ముఖము చిట్లించుకొని చిందులుత్రొక్కుచు వడ్డించిరేని భోక్తలు విధిలేక భుజించుచు నిచ్చోటికేల వచ్చితిమి, నిరాదరపుటన్నము నేల భుజింపవలెనని సంకుచితమనస్సుతో భుజించునపుడు, భోజ్యపదార్థములలో కోపాణువులుఁ జేరి భయకోప సంకోచాకులితమనస్కులఁ గావించుననియు, శ్రాద్ధముఁ బెట్టునపుడు కర్తలు, భోక్తలు, పాచకులు, క్రోధయుక్తులయిరేని, పితృదేవతలు విముఖులైపోవుటచే శ్రాద్ధమంతయును వ్యర్థమగుననియు, "శ్రు. అన్నమయగ్ం సోమ్యమనః" అను ఛాందోగ్యోపనిషదర్థములను తత్త్వదర్శులగు మహర్షులు బోధించుచున్నవారలు.

ఎట్టిభావనలతో భుజించిన అన్నము తదాకారముగఁ బరిణమించుఁ గావున హర్షముతో భుజించినయన్నము అమృతమయముగను, కోపముతో భుజించినయన్నము విషాభముగ నుండునని యనుభవజ్ఞులు నుడివెదరు.

శ్లో. క్రోధయుక్తో యద్యజతే యజ్జుహోతి యదర్చతి,
సర్వం హరతి తత్తస్య ఆమకుంభ ఇవోదకం.

"స్మృతి"

క్రోధనుఁడు ఎట్టియజ్ఞ మొనరించినను, ఏది హోమముఁ గావించినను, ఎట్లు పూజించినను, పచ్చికుండలోనుండి నీరు కారిపోయినట్టుల అంతయు వ్యర్థమగును. కాఁబట్టి యేకార్యమందును కోపములేక శాంతముతో నుండవలెను.

ఉన్నతాధికార వైద్యోపాధ్యాయ గుర్వాచార్యాదులు కోపములేక శాంతులై యుండవలెననుట.

ఉన్నతాధికారులు కోపయుక్తులై ప్రసన్నతలేక విముఖులైనపుడు ఆశ్రితులు తక్కువయధికారములో నున్నవారు తమస్థితిగతులు చెప్పుకొనఁదగినవిషయములు భయసంకోచములచే విన్నవింప నవకాశము లభింపలేదని చింతిల్లుదురు. ఆమహనీయులు శాంతచిత్తులును, ప్రసన్నముఖులునై యుండిరేని తమస్థితిగతులు చెప్పుకొనఁ దగినవిషయములు భయసంకోచములు వీడి విన్నవించుకొనియెదరు. పిమ్మట ఫలితములు కర్మానుగుణ్యముగ నెట్లున్నను ముందు వక్తవ్యవిషయములు

మానదు. అట్టిసందర్భమున మహనీయులు కార్యార్థము చిఱు కోపమునుఁ గల్పించుకొని అనవసరప్రసంగముల కవకాశ మీయక సాత్త్విక, రాజస, తామసప్రకృతులకుఁ దగునట్లు శాంతముగను, ఉచ్చైస్స్వరముతోను, పారుష్యముగను సమాధానములు నొసంగుచు మూఁగినమూఁకను వారింతురు. ఈ విషయమునే యోగవాసిష్ఠమునందు సయుక్తికముగఁ జెప్పఁబడియె.

శ్లో. బహిః కృత్రిమసంరంభాం హృది సంరంభవర్జితః,
కర్తా బహిరకర్తాంతర్లోకే విహర రాఘవ.
అంతర్నైరాశ్యమాదాయ బహిరాశోన్ముఖే హితః,
బహి స్తప్తోఽంతరా శీతః లోకే విహర రాఘవ.

"యోగవాసిష్ఠ"

"శ్రీరామచంద్రా! బాహ్యమున కోపమున్నట్లును,అంతరంగమున శాంతముగను, వెలుపల కర్తృత్వ మున్నట్టుల లోపల కర్తృత్వము లేనట్టుల బహిరుష్ణంబు అంతశ్శీతంబుగ లోకవ్యవహారమున కనుగుణంబుగ ప్రవర్తింపుము" అని వసిష్ఠముని యానతిచ్చుటంజేసి ప్రాజ్ఞులు అంతఃకరణక్షోభమును వికారమునుఁ గలిగించుకొనక, బాహ్యమున కోపముగలిగినట్లు నటింతురు. ఈకోపమును స్వీకరించునపుడు స్వస్వభావమును మఱవక జాగ్రతతో సేవకునిఁ జూచినట్లు చూచి విడువవలయునుగాని తాదాత్మ్యము నొందఁగూడదు.

కొన్నిసమయములందు విషపదార్థములును శుద్ధిఁజేసి నిపుణులగు వైద్యులు ఔషధములలో నుపయోగించి ఆరోగ్యమును గలిగించునటుల కోపస్వభావధర్మములనుఁ దెలిసికొని, మనస్తత్త్వజ్ఞులు లౌకికవ్యవహారములయందు కార్యార్థము హితమితముగ నుపయోగించి యభిమతార్థములనుఁ బడయుదురు. లోకవ్యవహారములందు త్రివర్గసంపదయందు మెలంగునట్టి మహనీయులు నీతిధర్మముల ననుసరించి యించుక రజోగుణజన్యమగు కోపమును (పరాక్రమము) స్వీకరించి వర్తింపఁ దగునుగాని, లౌకికవ్యవహారములను విడిచి, శాంతాశ్రమమున వసించునట్టి ముముక్షువు యోగియునగు యతీశ్వరుఁడు కోపమును ముఖ్యముగ విడువఁదగునని ప్రకరణ సారాంశము.

అతిమూఢుఁడు బ్రహ్మవిద్వరుఁడు వేదనయందు సమానులు.

శ్లో. యేచ మూఢతమా లోకే యేచ బుద్ధేః పరంగతాః,
ద్వావేతౌ సుఖమేధేతే క్లిశ్యత్యంతరితో జనః.

యోగవాసిష్ఠము.

లోకమునం దెవఁడు అతిజడుఁడో, (మూఢతముఁడు) ఎవఁడు బుద్ధితత్త్వము నతిక్రమించి బ్రహ్మవిద్వరిష్ఠుఁడో,యీ యిరువురు ఆత్యంతికసుఖమునుఁ బొందినవారలు.తక్కినవారలు

మధ్యస్థులు, వీరలే సంసారచక్రమునందు పరిభ్రమించువారు. వీరికే శాస్త్రమంతయు నుద్దేశింపఁబడినది. "తమప్" ప్రత్యయమువలన అతిమూఢుఁడు జడుఁడు పశుప్రాయుఁడు గనుక రోషాభిమానములు హర్షవిషాదములు లేక స్థాణువుగ నిర్వికారుఁడై యుండును. విద్యచేఁ గాక యవిద్యచే తమోగ్రస్తుఁ డయినందున ఎట్టివేదనయు లేదు. బుద్ధీంద్రియములనతిక్రమించిన యోగీశ్వరుఁడు సమ్యగ్జ్ఞాననిష్ఠుఁడై సమదర్శిత్వమునుఁ బొంది, బ్రహ్మీభూతుఁ డయినందున రాగద్వేషములును, హర్షవిషాదములును లేక నిత్యసంతుష్టుఁడును, నిర్వికారుఁడును, నిరతిశయసుఖవంతుఁడునై యుండును. అతిజడుఁడు అజ్ఞానముచే సుఖవంతుఁడు, బ్రహ్మవిద్వరిష్ఠుఁడు జ్ఞానముచే సుఖవంతుఁడు, అతిజడునకు (మూఢునకు) బోధింపవలసిన దేమియును లేదు. బోధించినను దెలిసికొనఁజాలఁడు. బ్రహ్మవిద్వరిష్ఠుఁడు సమ్యగ్జ్ఞాననిష్ఠచే సమాధిస్థుఁడై యాత్మానందమున మగ్నుఁడై యున్నందున, బోధింపవలసిన దేమియును లేదు. ఈ లోకము శాస్త్రమంతయు మధ్యస్థునకే యగును. బ్రహ్మవిద్వరిష్ఠుఁడు శుద్ధసత్త్వగుణమునందునను, అతిజడుఁడు (అంధతామిస్ర) గాఢ తమోగుణమందునను నుండును. వీరలు లోకాతీతులు. మధ్యస్థులు రజోగుణయుక్తులు కాఁబట్టి వారినిమిత్తమే శాస్త్రోపదేశములు.

Psychometer, భావమాపక (దర్శిని)

డిగ్రీలు	గుణములు	వృత్తులు.
107		సమాధిస్థితి, బ్రహ్మీభూత
106		నిస్పృహత్వ, స్వనిర్వృతి, వాసనాక్ష
105		ప్రకాశ, ఆనంద, ప్రమోద
104		నిరహంకార, సమదర్శిత్వ, వైరాగ్య
103	సాత్త్విక	ధృతి, క్షమ, తితిక్షుత్వ, స్మృతి
102		తపస్సు, సత్య, దయ, సంతుష్టి
101		శమ, మనోనిగ్రహత్వ, వివేక
100		దమ, ఇంద్రియనిగ్రహత్వ, ప్రణతి
99		నిష్కామకర్మ, అహింస, త్యాగ
9		ప్రాభవాధికారిత్వ, ఐశ్వర్యమద
8		బలోద్యమ, శౌర్య, ధార్ష్ట్య
7		అతిమానిత్వ, ఆత్మగౌరవ
6		యశఃప్రీతి, దంభ, వంచన
5	రాజస	కర్మాభినివేశ, విషయసుఖిత్వ
98.4		అహంకృతి, మానిత్వ, కామ
3		మద, దర్ప, గర్వ
2		రాగ, ద్వేష, కోప
1		లోభ, తృష్ణ, అసంతుష్టి
98		కలి, వివాద, అసూయ
97		క్రోధ, అత్యాశ, హింసా
96		అజ్ఞాన, అవివేక, మోహ
95		శోక, విషాద, నిద్ర
94	తామస	ప్రమాద, సమ్మోహ, జడత్వ
93		స్మృతిభ్రంశ, అప్రకాశ
92		అనృత, నాస్తిక్యత, భయ
91		ధర్మద్వేష, భ్రాంతి
90		అంధతామిస్ర, మరణ

భావమాపక(దర్శిని)యంత్రమున Psychometer మానసారోగ్యస్థితులు.

ఉష్ణమాపకయంత్రమున పారదము 98.4 డిగ్రీలలో నుండిన సహజారోగ్యమనియు, నంతకన్న నధికములోనుండిన ఉష్ణమనియు, 100-కి మించిన జ్వరమనియు, 105, 106 డిగ్రీలలో నుండిన సన్నిపాతజ్వరమనియు, నంతకన్న నధికమగు 107, 108 డిగ్రీలలోనుండిన లోకమున కుపయోగింపఁడనియు, 98.4 డిగ్రీలకన్న తక్కువగు 96, 95 డిగ్రీలలో నుండిన, ఉష్ణము తగ్గి శైత్య మాపాదించి, 94, 93 డిగ్రీలలోనుండిన లోకమున కుపయోగింపఁడనియు, ఆరోగ్యవైద్యశాస్త్రజ్ఞులు నిర్ణయించినట్లే, మనస్తత్త్వశాస్త్రజ్ఞులును (Psychometer) భావమాపకయంత్రముద్వారా మానసికారోగ్యస్థితులను నిర్ణయించిరి. సాత్త్వికము రాజసము తామసము ననుమూఁడుగుణములు మనస్సునకుఁ గలవు. ఈ గుణములవలన క్రమముగ దేవత్వ, మనుష్యత్వ, పశుత్వ ధర్మములుగల స్వభావము లుండును.

రజోగుణమందలి అహంకార, కామ, ఈహా, యశః ప్రీతి, సుఖాదివృత్తులు గలమానవుఁడు ప్రవృత్తి ధర్మప్రవర్తకుఁడై లోకమున కుపకరించినందున సహజ ఆరోగ్యవంతుఁడనఁబడు. శమ, దమ, తితిక్షా జ్ఞానవైరాగ్య స్వనివృత్తి వృత్తులు క్రమముగ నభివృద్ధియై సాత్త్వికగుణస్థుఁ డయ్యెనేని,

105, 106 డిగ్రీలకుమించిన ఉష్ణతత్త్వము గలవాఁడు లోకమున కుపయోగించేనట్లు, ఈ శమదమాస్పృహాదివృత్తులు గలిగి శుద్ధసాత్త్వికగుణముచే బ్రహ్మీభూతుఁడైనయోగి లోకమున కుపయోగింపఁడు. లోకవ్యాపారమున కనుగుణములగు వృత్తులన్నియు లయించి, బ్రహ్మాకారవృత్తిఁ బొంది నందున, లోకాతీతుఁడు బ్రహ్మవిద్వరిష్ఠుఁ డనఁబడు. క్రోధమోహ శోక నిద్రాహింసాదివృత్తులు క్రమముగ నభివృద్ధియై, తమోగుణస్థుఁడగు మానవుఁడు సహజారోగ్యమునుఁ దెలుపు 98.4 డిగ్రీలకన్న తక్కువ 93, 92 డిగ్రీలు కలిగినపుడు శైత్యమాపాదించి లోకమున కుపయోగించేనట్లు, అతిజడుఁడు అతిమూఢుఁడు లోకజ్ఞానము లేక పశుప్రాయుఁడై పురుషార్థముల నుండి భ్రష్టుఁడై లోకమున కుపయోగింపఁడు. కాఁబట్టి శుద్ధసాత్త్వికగుణస్థుఁ డగుబ్రహ్మవిద్వరిష్ఠుఁడును, గాఢతమోగుణస్థుఁడగు అతిమూఢుఁడును (అతిజడుఁడు) లోకవ్యాపారశూన్యు లయినందున లోకమున కుపయోగింపరు. రజోగుణస్థుఁడై ప్రవృత్తి ధర్మప్రవర్తకుఁడై నీతిమంతుఁడును నగు మానవుఁడు లోకమున కుపయోగించును. ఈతనికే శాస్త్రమంతయు ప్రవర్తించినది.

క్రోధమువలన జ్ఞానచలననాడులు, రక్తము చెడును.

98.4 డిగ్రీలుకలిగి సహజారోగ్యవంతుఁడగు మానవునకు ఆకస్మికముగ 105° డిగ్రీ లుండినచో (Temparature

Fall) ఆరోగ్యము మార్పుఁజెంది ఉష్ణ మతిశయించినట్లు శమ దమ తితిక్షాదులచేఁ బరిశుద్ధాంతఃకరణుం డగు యోగికి నేదేని కారణమున కోపము గలిగినచో, సూక్ష్మశరీరమున మార్పుగలిగి, రక్త ముడికినందున జ్ఞాననాడులు, చలననాడులు సంతప్తములై, వేఁడినిట్టూర్పులు జనించి ఆరోగ్యము చెడును. వెంటనే మనస్తత్త్వజ్ఞుఁ డగుయోగి, యేకారణమున నే గుణముచే కోపజ్వరవ్యాధి కలిగెనో తెలిసికొని యోగా భ్యాసమున ప్రతికూలభావనలచే చికిత్సఁ గావించి, మఱల ఆరోగ్యస్థితిలోనికిఁ గొనివచ్చును. యోగాభ్యాసమున ధ్యాన యోగమే (Healing) దీనికి చికిత్స యగును.

కోపజ్వరనిదానము.

కోమలావస్థలోనుండునది కోపము (Rage), ఉత్కటా వస్థలో నుండునది క్రోధము (Wrath). ఇది జనులలో సర్వసా ధారణముగ సంచరించుచుండును. దీనివేడిమి 105-డిగ్రీలుగల జ్వరమునకును లేదు. దీనిచే నావిష్టుఁ డైనమనుజుఁడు ఉన్మత్తు లలో ముదిరినవాఁ డనవచ్చును. (ముగ్ధుఁడు) నోట తడియుం డదు. నాడి తీక్ష్ణముగ కొట్టుకొనుచుండును. కం ఠెఱ్ఱఁబాఱును. దృష్టి వికారమగును. నాసికనుండి శ్వాసము లతితొందరగ వెలువడుచుండును. తల దిమ్ముగనుండును. న్యాయాన్యాయ పరిశీలనజ్ఞాన మతనికడ నుండదు. సత్యాసత్యముల నెఱుఁగ కతనినోరు వదరుచుండును. పెదవు లదరుచుండు. నాలుక తడ

బడుచుండును. చేతులు వణఁకుచుండును. వేయేల? జ్వరపీడితుని కన్న నితఁడే కడుబాధితుఁ డననొప్పును.

అక్కటా! కోపానలమున మండుచున్న మహాను భావుని, చక్కని నీతివచనములుగాని, ప్రేమించిన మిత్రవర్గము గాని, సుందరులగు కాంతలుగాని, వచ్చిరాని నుడువులుపలుకు సుతులుగాని, చల్లార్పలేరు గదా? మఱియు నట్టి క్రోధా నలమే ప్రపంచమున సంభవించు పలువిధములగు హత్యలకుం గారణం బగుచున్నది. చిరకాలమునుండి యచ్ఛపుమైత్రిని మెలఁగుచున్న మిత్రబృందములో భేదబుద్ధినిఁ గలిగించుటకీ (కోపమే) క్రోధమే కారణము గదా? తుట్టతుదకు పశ్చా త్తాపముఁబొందిన మనుజునిచేత నతికఠినముగ నిందింపఁబడు నది యాకోపమే గదా? కొన్నిసందర్భముల నరయునెడల, మనుజులబుద్ధులు మాఱుట కాస్పదమగుచున్నది. కాఁబట్టి అట్టిసమయముల నతిజాగ్రత వహించి, శాంతమనుబల్లెముచేత కోపమును ఖండించుచు మానవుఁడు సంచరించుచుండుట శ్రేయస్కరము.

క్రోధశమనోపాయములు.

క్రోధమునకు చికిత్స.

శ్లో. క్రుధ్యంతం న ప్రతిక్రుద్ధ్యేదాక్రుష్టః కుశలం వదేత్,
అతివాదాం స్తితిక్షేత నాఽవమన్యేత కంచన.

సురేశ్వరాచార్యవార్తికము.

"ముముక్షు వగుయోగి తనన్నొరుఁడు కోపించుచున్నను, తాను కోపింపఁగూడదు. పెద్దగ తిట్టుచున్నను, తిన్నగ మాటాడవలయును. అతిపరుషవాక్యములతో దూషించుచున్నను సహించవలెను. త న్నవమానించినను తాను మాత్ర మెవరిని నవమానింపఁగూడదు." అని తాత్పర్యము.

శ్లో. తాపత్రయేణాభిహతం యదేత దఖిలం జగత్,
తథా శోచ్యేషు భూతేషు ద్వేషం ప్రాజ్ఞః కరోతి కః.
బద్ధవైరాణి భూతాని ద్వేషం కుర్వంతి చే త్తతః,
శోచ్యాన్యతీవ మోహేన వ్యాప్తానీతి మనీషిణా.

జ్ఞానవాసిష్ఠము.

ఆధ్యాత్మిక, ఆధిదైవిక, ఆధిభౌతికములనెడు తాపత్రయముచే నీజగమంతయు తపింపఁబడుచు నించుకేని సుఖములేక దుఃఖితమగుచున్నది. కనికరింపఁదగిన యీప్రాణుల యెడ ఉదారాశయుఁడును, వివేకియు నగు ప్రాజ్ఞుఁ డెవఁడు ద్వేషించును? కోపముఁ జూపును? పరస్పరవైరముఁ గలిగి ద్వేషించుకొనుచు అజ్ఞానములో మునిఁగిన యీప్రాణులు దయాళుఁడును, ప్రాజ్ఞుఁడు నగుయోగిచే కరుణింపఁదగినవార లని తాత్పర్యము.

అజ్ఞానములో మునిఁగి యొకరినొకరు ద్వేషించుకొని, సుఖములేక దుఃఖించుచున్న ప్రాణులఁ జూచి కనికరింపఁదగిన దీనులని ప్రాజ్ఞులు కరుణఁజూపుదురుగాని ద్వేషించి కోపింపరని భావము.

శ్లో. రిపౌ మిత్రే స్వదేహే చ సమైకాత్మ్యం ప్రపశ్యతః,
వివేకినః కుతః కోపస్స్వదేహావయవేష్వివ.
స్వాంతఃకరణదోషేణ కల్పితేఽస్మిన్ జగద్భ్రమే,
కః ప్రాజ్ఞః కలహం కుర్యాత్స్ఫటికే మంటపే శ్వవత్.

సురేశ్వరాచార్యవార్తికము.

తన శరీరావయవములందు భేదబుద్ధిలేక సమత్వముగఁ జూచినట్లే శత్రువునందును, మిత్రునియందును, తనయందును, ఆత్మస్వరూపమును సమభావముతోఁ జూచునట్టి వివేకియగు యోగికి కోప మెట్లు కలుగును? బ్రహ్మవేత్త అంతయు తనయందును, తానంతటను నుండినట్లు సమభావముతోఁ జూచును. మిత్రశత్రులయం దుండెడునాత్మ, తనయాత్మ నొక్కటియే యైనందున ఎవనిని ద్వేషించును? కోపించును? అట్లు కోపించె నేని తన ఆత్మను తానే ద్వేషించినట్లగునని సమదర్శిత్వముచే ద్వేషింపఁడు స్వచ్ఛమయిన స్ఫటికమంటపమున శునకము తన ప్రతిబింబమునుఁ జూచి మఱియొకశునకము వచ్చినదే యని కలహించినట్లయితే యెంత అవివేకమో? అంతఃకరణదోషముచే కల్పితమైన యీజగత్తునందు వివేకి ప్రాణికోటిని ద్వేషించినట్లయితే అంతయవివేకము. శునకము తెలియక తన ప్రతిబింబమును తాను ద్వేషించిన ట్లగునని తాత్పర్యము. ఉదారాశయుఁడును సమదర్శియు నగుయోగి తాను వేఱు, ఇతరుఁడు వేఱు అను భేదబుద్ధిలేక యెల్లఱ ఆత్మలయందు తా నుండెనని భావించి, అఖండానందమయుఁ డగుటచే నెవరిని ద్వేషింపఁడు, కోపింపఁడని భావము.

భేదదృష్టిలేని యోగికి మహాశయునకు ద్వేష్యులు లేనందున కోపము కలుగదనుట.

శ్లో. త్వయ్యస్తి భగవాన్విష్ణుర్మయి చాన్యత్ర చాస్తి సః,
యతస్తతోఽయం మిత్రం మే శత్రుశ్చేతి పృథక్కుతః?
సర్వభూతాత్మకే తాత జగన్నాథే జగన్మయే,
పరమాత్మని గోవిందే మిత్రామిత్రకథా కుతః?
అయం బంధురయం నేతి గణనా లఘుచేతసాం,
ఉదారచరితానాం తు వసుధైవ కుటుంబకం.

సురేశ్వరాచార్యవార్తికము.

సర్వభూతాత్మస్వరూపుఁడును విశ్వమయుఁడు నగు వాసుదేవుఁడు నీయందును నాయందును అంతటను వసించి యుండఁగ వీఁడు మిత్రుఁడు, వీఁడు శత్రువు అను భేదభావ మెట్లు కలుగును?

అల్పబుద్ధులకు వీఁడు తనవాఁడని, వాఁడు పరుఁడని భేదభావము కలుగునుగాని, జగమె కుటుంబముగాఁగల ఉదారస్వభావులు అందఱు తనవారనికొనియెదరుగాని భిన్న భావము కలుగదు. మహాత్ములు ఉదారస్వభావులు నగు యోగులు సర్వభూతములందుండు నాత్మయు, తనయాత్మయు నొకటియై యుండినట్లు అనుభవసిద్ధముగఁ జూచినందున స్వత్వ పరత్వభేదము లేక సమభావముఁ గలిగియుందురు. అందఱియెడ నుండు నాత్మస్వరూపమునుఁ జూచి ప్రేమించుటవలన ద్వేష మున కించుకేని యవకాశము లేదు. సామాన్యముగ భేదము

వలన ద్వేషము, అభేదమువలన ప్రేమయుఁ గలుగుచున్నట్లు లోకానుభవము.

అన్యనిష్ఠకోపము తనమీఁదికి వచ్చునపుడు ప్రశమనోపాయము.

శ్లో. క్రుద్ధే స్మేరముఖావధీరణమథాఽవిష్టే ప్రసాదక్రమో
వ్యాక్రోశే కుశలోక్తిరాత్మదురితచ్ఛేదోత్సవస్తాడనే,
ధిగ్జంతోరజితాత్మనోఽస్య మహతీ దైవాదుపేతా విప
ద్దుర్వారేతి దయారసార్ద్రమనసాం క్రోధస్య కుత్రోదయః?

ప్రబోధచంద్రోదయము.

అన్యుఁడు తనపై క్రోధముఁ గలిగి పైకిఁ గవయుచున్న చిఱునగవుతోఁ గూడిన ముఖమును, ఆవేశము (ఒడలు తెలియక) కలిగినపుడు అనునయించుటయు (బతిమాలుఁటయు) తిట్టునపుడు ప్రీతిగా మాటాడుటయు, తన్నునపుడు దేహమందలి పాపపరిహారమునకు ప్రాయశ్చిత్తము కలిగెననియు, ఉదారాశయులును, శాంతస్వభావులు నగు మహనీయులు తలఁతురు. అక్కటా! ఇంద్రియములకు లోఁబడి వివేకము లేక పశుప్రాయుఁడగు నీతనికి దైవికముగ ననివార్యమగు క్రోధవ్యాధిరూప మహావిపత్తు సంభవించెనని దయారసము చే శాంతులగు మహనీయులమనస్సునందు క్రోధ మెట్లు ఉత్పన్నమగును ?

ఆత్మానాత్మజ్ఞానము లేక పశుప్రాయుఁడై క్రోధము చే దుష్కృత్యము లొనరించి నరకగర్తమునఁ బడిపోవుచున్నాఁడే

యని కరుణాశాలు లగు మహాత్ములు వీనినిందలకు చేష్టలకు నవ్వుకొనుచు శాంతచిత్తముతో బుజ్జగించి,వీఁడొనర్చు నవివేక కృత్యముల నోర్చుకొనుచు, క్రోధమున కవకాశమీయరు. మండుచున్న అగ్నియందు కట్టెపుల్లలువైచిన మిగుల మండును గాని, అటుగానిచో క్రమముగా చల్లాఱిపోవునట్లే క్రుద్ధుఁడు తిట్టినపుడును, మీదికిఁ గవిసినపుడును మాఱు పలుకక చిఱునగవుతో నతని చేష్టలు చూచుచుండిన నతనికోపము క్రమముగ తగ్గిపోవును.

శ్లో. ధన్యాస్తే పురుషశ్రేష్ఠా యే బుద్ధ్యా కోపముత్థితం,
నిరుంధంతి మహాత్మానో దీప్తమగ్నిమివాంభసా.
యస్సముత్పతితం క్రోధం క్షమయైవ నిరస్యతే,
యథోరగస్త్వచం జీర్ణాం స వై పురుష ఉచ్యతే.

యోగవాసిష్ఠము.

మండుచున్న అగ్నిని జలముచే నార్పినట్లు తనమనస్సునుండి యుత్పన్నమై యితరులమీఁదికిఁ బోవుచున్నట్టికోపమును ఏమహానీయుఁడు వివేకయుక్తబుద్ధితో నణఁచివైచుచున్నాఁడో, అట్టివాఁడే ధన్యుఁడు పురుషోత్తముఁ డనఁబడు.

భుజగము శిథిలమయిన (కూర్పసము) కుబుసమును విడిచినట్టుల ఇతరునినుండి తనమీఁద పడుచున్నట్టి క్రోధమును, ఓర్పుచే నేమహానీయుఁడు తొలఁగించుచున్నాఁడో అట్టివాఁడే పురుషశ్రేష్ఠుఁ డనఁబడు.

తననుండి యితరునిమీఁదికిఁ బోవునది ఆత్మకర్తృకము (Subjective Anger). ఇతరునినుండి తనమీఁదికి వచ్చునది

అన్యకర్తృకము (Objective Anger). ఇతరునినుండి తన మీఁదికి వచ్చుకోపమును క్షమాకవచమును ధరించి, వివేకము లేని యీతనికి ననర్థకరమగుకోపముగలిగినదే యని కనికరించి, శాంతమూర్తియగు పరమేశ్వరుఁ డీతనికి కోపశాంతిఁ గల్గించుగాతయని ప్రార్థించును. తనమనస్సును ఆవిషయము నుండి మఱలించి మఱియొకవిషయమునఁ (శాంతము) జేర్చును. అదిగానిచో సంఖ్యలను లెక్కఁబెట్టును. మందు వేసవికాల మందును, దావాగ్నిమీఁదను, కుంభవర్షము కురిసినట్లును, రుద్రునిపై అమృతాభిషేకముఁ జేయుచున్నట్లును, గంగా వాహినీ శీతలోదకములందు మునిఁగినట్లును, భావనలుఁ గావించుకొనుచుండును.

కోపస్వభావులగు రజోగుణవంతులు, శాంతమూర్తులగు విష్ణు శివులను ధ్యానించి తత్కళ్యాణగుణముల కీర్తించినట్లయిన కోపస్వభావము తగ్గి శాంతస్వభావ మభివృద్ధి యగును. విష్ణుధ్యానమందు "శాంతాకారం భుజగశయన" మనియు, శివధ్యానమందు "శాంతం పద్మాసనస్థ" మనియుఁ గలదు. కాఁబట్టి తద్భావనచే శాంతస్వభావము గలుగును.

లోకములో మహనీయులగు శాంతమూర్తుల నాదర్శముగఁ జేసికొని వారిశాంతగుణముల భావించినను శాంత స్వభావ మేర్పడును.

త్రిమూర్తులలో యజ్ఞఫలభోక్త, దాతయు నెవరని ..., దేవతలెల్లరు మహర్షుల నడుగగ నట్టిసామర్థ్యము

[illegible] పాదుఁడగు భృగుమహామునికిఁ గల [illegible]. అంత [illegible] భృగుమునినిఁ బ్రార్థింప [illegible] బూని, తొలుత చతుర్ముఖుని [illegible] శీలమా? యని యడు [illegible] నిర్గుణానంతుఁడని [illegible] బోయెను. అంత సన్మహా [illegible] సత్య [illegible], రౌద్రా [illegible] రౌద్రమూర్తి లయముఁ [illegible], శ్రీమహావిష్ణువు [illegible] లనని [illegible] శాంతమూర్తి [illegible] "[illegible]! [illegible] ముక్త [illegible] చింతించి, [illegible] చితోప [illegible] వ్యాపకమనస్కుఁడై, [illegible]? [illegible] పాదములొత్తి [illegible]? [illegible] మూర్తి శుద్ధసాత్త్వికగుణ [illegible]? [illegible] నైచ్య [illegible] మహాప [illegible] కలుగునని చింతించి, ఆ [illegible] మన్నింపు

మని వేఁడెను. శ్రీహరి తనపాదము లొత్తెనని కలిగినయానం దములో కాలియందలి కన్ను పోయినసంగతి కనుఁగొనలేక పోయెను. పిమ్మట దేవతలయొద్దకు వచ్చి కలవృత్తాంతమును దెలుపగ శ్రీమహావిష్ణువు శాంతమూర్తి శుద్ధసాత్త్వికగుణ సంపన్నుఁడు యజ్ఞఫలభోక్త దాతయునని త్రిదశులందఱు నిశ్చయించిరి.

శ్రీమహాలక్ష్మివసించు వక్షస్థ్సలమును మహర్షి పాదము సోకగ, నమ్మహనీయుఁ డించుకేని కోపముఁ జెందక శాంత మూర్తియై యుపచరించెనే, అల్పులగు మనమెంతవారమని వివేకులు సహనబుద్ధితో నిందాపరాధముల నోర్చుకొనియుం డెదరు.

మహోదధిని తృణాగ్ని కలఁచలేక అందు పడి చల్లాఱి నట్టుల పరమశాంతమూర్తుల నితరులకోపానలము క్షోభింపఁ జేయఁజాలక, వారి దివ్యతేజస్సునొద్ద అదృశ్యమై పోవును. మూఢుఁడు సూర్యునిపై నుమిసిన తనమోముపైఁ బడినట్టులే దివ్యతేజస్వులయెడఁ జూపినకోపము మహాపరాధరూపముగ తననే బాధించును.

కొందఱు ఎంతయు కోపముతోను, ఆగ్రహముతోను శాంతమూర్తులగు మహనీయులయొద్దకు వచ్చి పలుకఁజాలక నిరుత్తరులై వారిదివ్యతేజస్సన్నిధిని మనోవృత్తులుమాఱి విస్మ యాన్వితులై పోవుదురు. కణ్వవశిష్ఠభారద్వాజాది మహర్షుల యాశ్రమమున పరస్పరద్వేషము గలజంతువులు జాతివైరము

లేక సఖ్యభావముతో నుండినట్లు పురాణేతిహాసములయందుఁ గన్పట్టుచుండును.

నిందావమానములు యోగిమనస్సును చలింపఁ జేయఁజాలవు.

శ్లో. ఆత్మానం యది నిందంతి నిందంతి స్వయమేవ హి,
శరీరం యది నిందంతి సహాయాస్సంతి తే మమ.
నిందావమానావత్యంతభూషణం యస్య యోగినః,
ధీవిక్షేపః కథం తస్య వాచాద్యైః క్రియతామిహ.

యాజ్ఞవల్క్యస్మృతి.

నిందకులు ఆత్మను నిందించుచేన్నారా? శరీరమును నిందించుచేన్నారా? యని వివేకి విమర్శించును. అంతటను తనయందును వ్యాపించియున్న ఆత్మను నిందించినట్లయిన తనను తానే నిందించుకొనినవాఁ డగును. శరీరమును నిందించినట్లయిన, వివిధమలభూయిష్ఠమై హేయమయిన యీశరీరమును నేనే నిందించుచేన్నాను. నాకు సహాయ్యము చేసినవార లగుదురు. ఆత్మ కనుపింపదు కావున నిందింపఁబడుటకు సాధ్యము కానేరదు. తరుపాషాణకుడ్యాది జడపదార్థములతో తుల్యమగు భౌతికశరీరమును నిందించియు, ప్రయోజనము లేదు. ఎద్దాని నీతఁడు నిందించెను? ఉన్మత్తప్రలాపమనియు, నవివేకకృత్యమనియుఁ ప్రాజ్ఞుఁడు తలఁచేను. తాను దేహాదీంద్రియములకన్న విలక్షణుఁడనియు, సచ్చిదానందస్వరూప మగునాత్మ నిందాదులకు విషయముకాదనియు నిశ్చ

కునివలన తనపాపములు పరిహార మగుచున్నవనియు, నితఁ డప్రయత్నముగ తన కుపకరించుచుండెననియుఁ దలఁచునేగాని కోపముఁజెందఁడు.

యోగి తనను నిందించువానియెడఁ గోపింపక కనికరముఁ దలఁచును.

శ్లో. సతతసులభదైన్యే నిస్సుఖే జీవలోకే
యది మమ పరివాదాత్ప్రీతిమాప్నోతి కశ్చిత్,
పరివదతు యథేష్టం మత్సమక్షం తిరోవా
జగతి తు బహుదుఃఖే దుర్లభః ప్రీతియోగః.

జ్ఞానాంకుశము.

దుఃఖభూయిష్ఠమగు నీప్రాణిలోకంబున నెవనికేని ప్రీతికలుగుట దుర్లభము. నన్ను నిందించుటచే నెవనికేని సంతుష్టి కలుగునేని, నాప్రత్యక్షమునఁగాని పరోక్షమునఁగాని యథేష్టముగ నిందించి ప్రీతిఁ జెందునుగాక. సంతతము దుఃఖితమైనమనస్సున కేవిధముననేని ప్రీతిఁ గలిగించుట సజ్జనకర్తవ్యము గదా యని యోగి యుదారభావమున ప్రాణులయెడ దయాళుఁడై యుండును.

శ్లో. స్వధర్మపీడామపహాయ యోఽయం
మత్పాపశుద్ధ్యర్థమిహ ప్రవృత్తః,
న చేత్క్షమామప్యహమస్య కుర్యాం
మత్తః కృతఘ్నో వద కీదృశోఽన్యః.

శ్లో. కశ్చిత్పుమాన్ క్షిపతి మాం ప్రతిరూక్షవాక్యై
స్సోఽహం క్షమాభవనమేత్య ముదం ప్రయామి,
శోకం వ్రజామి పునరేవ యతస్తపస్వీ
చారిత్రతస్స్ఖలితవానితి మన్నిమిత్తమ్.

జ్ఞానాంకుశము.

తనధర్మమునకు హానికలుగునని యోజింపక నాపాపపరిహారార్థము ప్రయత్నించిన నిందకునియెడ నేను తాల్మిని జూపనియెడల నాకన్న కృతఘ్నుఁడు మఱియెవఁడుండునని సహిష్ణువగుయోగి తలఁచును. క్షమాసౌధము నారోహించిన నన్ను నిందకుని కఠినంపుఁ బలుకుములుకులు బాధింపఁజాలవు. నానిమిత్త మీనిందకుఁడు ధర్మమార్గమును తొలఁగి నిరయగర్తమునఁ బడుటచే శోచనీయుఁడని యోగి ఆతనివిషయమై పశ్చాత్తాపమునుఁ జెందును.

సర్వానర్థకరుఁడగు కోపునిమీద కోపింపవలయు ననుట.

శ్లో. అపకారిణి కోపశ్చేత్కోపే కోపః కథం న తే,
ధర్మార్థకామమోక్షాణాం ప్రసహ్య పరిపంథిని.

సురేశ్వరాచార్యవార్తికము.

అపకారముఁ జేసినవానియెడ కోపము కలిగినట్లయిన ధర్మార్థకామమోక్షము లనుపురుషార్థములకు ప్రతిబంధము చి, మహాపకారము నొనరించు కోపునియెడ కోపమేల గాడదు? పురుషార్థములను నశింపఁజేసి మహానర్థ

మును గలిగించు క్రోధునియెడ క్రోధముఁ గలిగినయెడల క్రోధుని జయించినవాఁడే యగును.

శ్లో. బలాదితో ధర్మయశో౽ర్థనాశన
స్స చేదపార్థస్స్వశరీరతాపనః,
న చేహ నాముత్ర హితాయ యస్సతాం
మనాంసి కోపస్సముపాశ్రయేత్కథం?

ధర్మార్థకీర్తులను నాశనముఁ జేయునట్టియు, ననర్థముఁ గలిగించునట్టియు, ఐహికాముష్మిక హితప్రతిబంధియు, తనశరీరమునకు సంతాపకరమగుకోపము నెవ్వఁ డాశ్రయించును ?

శ్లో. నమో౽స్తు కోపదేవాయ స్వాశ్రయజ్వాలినే భృశం,
కోప్యస్య మమ వైరాగ్యదాయినే దోషబోధినే.

సురేశ్వరాచార్యవార్తికము.

విషయలోలుపతచే నవివేకియై, కోపింపఁదగిన నాకు దోషములను బోధించి, వైరాగ్యమునుఁ గలిగించునట్టి కోపదేవునకు నమస్కారమని క్షమావంతుఁ డగుయోగి పలుకుచున్నాఁడు. శుష్కతృణకుటీరమును అగ్ని దహించునట్లు, కుపితుహృదయమును క్రోధాగ్ని దహించుచుండును.

జామదగ్న్యుఁడు క్రోధమును జయించినంత పితృదేవతలశాపము.

పూర్వ మొకప్పుడు జమదగ్నిసుతుఁడు పితృకార్యార్థము క్షీరముల నేకరించి కలశమందుంచేఁగ, భృగువంశజులు కోపనులని ప్రవాదము కలదు. అందు జామదగ్న్యునిశాంతము

కనుఁగొననెంచి ధర్మదేవత క్రోధమూర్తియై వచ్చి కలశమును దొర్లింపగ, క్షీరములన్నియు నేలపాలాయె. అంత జామదగ్న్యుఁడు దానిం గాంచి,కుపితుండుగాక క్షమావంతుఁడయ్యె. క్రోధదేవుండు విస్మితుండై, జామదగ్న్య! నీకుఁ గోపము కలిగింపఁ దలఁచి పాలొలికించినను, కుపితుండవు కాక శాంతుఁడ వైతివి. నీవు నన్ను జయించినందున జితక్రోధుఁడ వయితివి. నే నోడితిని. నాయపరాధమును క్షమింపుమని వేఁడగ,నిందు నీయపరాధ మేమియును లేదు. దోషబోధకుఁడ వగునీవు నా మనంబును శోధించినందున నా కుపకారకుఁడ వైతివి. ఇఁకను పితృదేవతలు వత్తురు వెడలుమని పంపివైచెను. అంతట పితరులు వచ్చి, మాకార్యమెడ శ్రద్ధలేక, అవజ్ఞ గావించితివి. కాఁబట్టి నకులంబవై పుట్టుమని శపింప, శాపాంతమును వేఁడగ, ధర్మజు నశ్వమేధయాగమువద్దకుఁ జని, ఋత్విజులను, మునులను, యజమానిని యాగవిధమును నిస్సారమగునట్లు దూషించితివేని శాపమోచనము కలుగునని నుడివి, యంతర్హితులైరి. కాఁబట్టి కామక్రోధములను జయించెనా? లేదా? యని పరీక్షించుటకై ధర్మదేవత వివిధరూపంబులతో వచ్చి శోధించి, లేనికష్టములనుఁ గలిగించి, అన్నింటిని సహించి ధీరుఁడగునంత తగినవరంబు లొసంగి, యుత్తమపురుషార్థమునకుఁ దోడ్పడుదురని ఐతిహాసికగాథలవలనఁ దెలియఁబడుచున్నది.

క్రోధము [illegible] ఎనిమిది [illegible] పుట్టునని మనువు [illegible].

[illegible] దూషణం,
[illegible] గణోష్టకః.

[illegible], సాహసము, ద్రోహము, ఈర్ష్య, అసూయ, [illegible], [illegible], దండపారుష్యము, అను [illegible] క్రోధ [illegible] సప్తవ్యసనము [illegible] ఔర్కా-క్క- [illegible] రాగద్వేషమూలకమే.
(Passions)

కామ	Love, Lust	}	Love రాగజనితములు.
లోభ	Greed, Avarice		
మోహ	Infatuation, Blind clinging		
క్రోధ	Anger, Wrath,	}	Hate ద్వేషజనితములు.
మద	Pride, Arrogance		
మాత్సర్య	Jealousy, Envy		

[illegible] కామక్రోధములు, లోభమోహ [illegible] ముగ పరిగ [illegible] స్తమోగుణప్రవృత్తు [illegible].

[illegible] కామజనితపశ్చాత్తాపశమనోపాయములు.

[illegible] మూల్యమగు వీర్య [illegible] యవివేకి మనశ్శరీర

బలంబులఁ గోల్పోవును. విలువగల వీర్యశక్తినిఁ దెలిసికొనిన వాఁడు దానిని దుర్వినియోగముఁ గావింపఁజాలక,ఓజశ్శక్తిని తేజశ్శక్తినిఁ గాపాడుకొనును. మనస్సు, ప్రాణము, వీర్యశక్తి ఈమూఁడును పరస్పరసంబంధము గలిగి యొక సూత్రమునఁ గూర్పఁబడినవి. జీవాత్మ సౌధమున కీమూఁడును మూఁడు స్తంభములు. ఇందేదే నొకటి నష్టమయి నతక్కిన రెండుకంబములతోడ హర్మ్యము కూలిపడును. కాఁబట్టి ప్రాణాధారమయిన వీర్యశక్తిని (Seminal Energy) యోగులు కాపాడుకొని జితేంద్రియులై సిద్ధులను (Psychic Powers) బడయుదురు. ఊర్ధ్వరేతస్కయోగమువలన ఓజస్తేజశ్శక్తు లభివృద్ధిఁ జెందును.

మనము భుజించిన యాహారములోని సారాంశము రక్తముగ పరిణమించును శ్రేష్ఠమయిన నలుబది రక్తబిందువుల నుండి సారమగు నొకవీర్యబిందు వుత్పన్నమగునని ప్రకృతి శాస్త్రజ్ఞులు కనిపెట్టిరి. అట్టి సారతరమగువీర్యము నష్టమయ్యేనేని యెంత రక్తము వ్యయమయియుండునది వివేకు లూహింపఁ దగును.

ఈయమూల్యమగుపదార్థము వ్యయమయిన మనుజుఁడు హీనవీర్యుఁడును, దుర్బలుఁడును, చంచలస్వభావుఁడు నగుటయే గాక, యాతనిశారీరక మానసికశక్తులు హ్రస్వములగును, మానసికశత్రువులయొక్క యొదిపిడి మిక్కుటమగుటవలన, శారీరకయంత్రక్రియలు వైపరీత్యమునుఁ జెంది యింద్రి

యవృత్తులు వికృతము లగును. హృదయయంత్రము మిక్కిలి బలహీన మగును. దానివలన మూర్ఛ, ఉన్మాదము, మృత్యువు గలుగును.

బ్రహ్మచర్యమహిమ.

1. బ్రహ్మచర్యము నవలంబించినవారలకు శారీరకమానసికశక్తు లభివృద్ధి యగుననియు, వీర్యలాభము కలుగుననియు, పాతంజలయోగసూత్రమునఁ జెప్పఁబడెను.

సూ. "బ్రహ్మచర్యప్రతిష్ఠాయాం వీర్యలాభః"

శ్లో. న తపస్తప ఇత్యాహుర్బ్రహ్మచర్యం తపోత్తమం,
ఊర్ధ్వరేతా భవేద్యస్తు స దేవో న తు మానుషః.

జ్ఞానసంకలనతంత్రం.

తపస్సు తపస్సుకాదనియు, బ్రహ్మచర్యమే సర్వోత్కృష్టమగు తపస్సనియు, ఊర్ధ్వరేతస్కుఁడు దేవతగాని మనుష్యమాత్రుఁడు గాదనియు, విద్వాంసులు చెప్పుదురు.

కాఁబట్టి బ్రహ్మచర్యమువలన ననేకలాభములు కలవని ఆధునిక విజ్ఞానశాస్త్రజ్ఞులును శోధనలవలనఁ గనిపెట్టిరి. ముఖ్యముగ పాఠశాలా కళాశాలావిద్యార్థులు బ్రహ్మచర్యము నవలంబించుటవలన మస్తిష్కమునకు బలమును, శరీరమునకు పటుత్వమును,జ్ఞాపకశక్తి, ధారణాశక్తి, మేధాశక్తు లభివృద్ధిఁ జెందుటయు, తేజస్సు, ముఖసౌందర్యము, బుద్ధిబలంబును, తన్మూలకపరీక్షావిజయము, ఉత్సాహము, పోటీపరీక్షలయందు

వ్యాయామఖేలనలయందు గెలుపొందుటచే కీర్తియు, గొప్ప వారి సమాదరంబు లోనగునవి కలుగును.

బాలికలు బాలురును, యువతీయువకులును, ప్రకృతపు కళాశాలలయందుఁ జేదువు సంప్రదాయము కలదు గనుక, తనకన్న నధికులగువారియెడ మాతృభావముతోడను, సమానులయెడ సోదరీభావముతోడను, చిన్నవారియెడ పుత్త్రికాభావముతోడను మెలఁగి వారికిఁ దగుసాహాయ్యము (సేవ) నొనర్చుచుఁ బ్రవర్తించినయెడల, ఆచార్యోపాధ్యాయుల మన్ననకుఁ బాత్రుఁడును, యోగ్యుఁడును, బుద్ధిమంతుఁడు నని లోకులచే కీర్తింపఁబడువాఁడు నగును. ఇదియంతయు బ్రహ్మచర్యమువలనఁ గలుగు మనోబలము, సద్భావనలవలన లభించినదని భావింపవలయును.

దుష్టసహవాసము సర్వానర్థకరము.

2. దుష్టజనసహవాసమువలన కామోద్దీపకములగు నృత్తగీతవాద్యములచే ఖేలనవిలాసములఁ గావించు కామినీమణుల సమాజములకుఁ బోవుటవలన నింద్రియలౌల్యత కలుగు. ఇంద్రియసంయమము లేనందున ననేకయాపనులు మస్తిష్కము యొక్క దుర్బలత్వముచేతను, ధారణాశక్తి లోపమువలనను, జ్ఞాపకశక్తి హీనతచేతను, మానసికౌదాసీన్యమువలనను, చిత్తచాంచల్యము, స్నాయుదౌర్బల్యము (Nervous Debility) హృత్కంపము, అరుచి, శిరోవేదన లోనగు నానావిధరోగ

[illegible] గ్యస్తై న్యప్రకృతిశాస్త్ర [illegible]

[illegible] ఉలుగాంగల లోభజన [illegible]

[illegible]

నీతిశాస్త్రం.

[illegible] మగుసగ్నితో [illegible] నికారణముగ నుండఁ [illegible] దుష్పృథ [illegible] పొడమి [illegible] దూరముగ [illegible] దుశ్చింతయు పాప [illegible] కారణమున నుండఁ [illegible] మము. ఏదేని [illegible] నిని దుశ్చింతలు [illegible]

[illegible] గ్రంథపరి [illegible] ముందు మునింగి యేని [illegible] ప్రవేశింపఁజాలవు. [illegible] యకము లయినవి

కాఁబట్టి అవి యుదయించినపుడు మనస్సును వేఱువిషయ ములవైపునకు మఱలించుకొనవలయును. నిద్రావస్థయందు దు శ్చింత పొడమినపుడు వెంటనే మేల్కాంచి దానివలనఁ గలుగు ననర్థము చింతింపవలయును. జాగ్రదవస్థయం దీశత్రువు పొడ సూపినపుడు తఱిమివేయఁగల యుపాయ మేదనఁగా, వెంటనే లేచివిశేషముగ శరీరపరిశ్రమము చెమటబట్టునంతవఱకుఁ జేయు టకుఁ బ్రారంభించినయెడల పదునైదుదినములలో నీశత్రువును జయింపఁ గలవు. దుశ్చింతలు పొడమక యఁడగిపోవును.

ఆరోగ్యవిషయమున జాగరూకత వహించవలయు.

౫. ఉద్రేకములు గానివియు, పుష్టికరములును, సులభ ముగ జీర్ణించునట్టివియు నగు పదార్థములు మాత్రమే భుజింప వలయును. చాలప్రొద్దుపోవువఱకు రాత్రులయందు మేల్కొనఁ జనదు. ఉషఃకాలముననే నిద్రనుండి లేవవలయును. నిద్రకు పూర్వమందు శీతలోదకమునుఁ ద్రాగవలయును. నిర్మలవా యువు వీచుస్థలమునందుఁ బరుండవలయును. ఆరోగ్యవిషయ మునందు కడుజాగరూకతతో నుండిన, మనస్సునందు దుశ్చిం తలు ప్రవేశింపఁజాలవు. దుశ్చింతలు పొడమి యుద్రేకముచే నింద్రియలౌల్యము కలిగినంతట, శారీరక మానసికారోగ్య ములు చెడునని తెలిసినవివేకి యెంతమాత్రమును దుశ్చింతల కవకాశ మీయఁజాలఁడు.

ఉపవాసములవలన మేలు కలుగుట.

6. మందస్వభావులును మిక్కుటముగ భుజించువారును, విషయవాంఛలవలన (కామదుశ్చింతలు) మిగుల కష్టములపాలగుచుందురు. ఇంద్రియాశ్వములకు ఆహారమధికముగ నిచ్చుకొలఁదిని మదోద్ధతి కలిగి, మనశ్శరీరముల నిరయగర్తములోనికిఁ ద్రోయుచుండును. అశ్వమునకు గ్రాసము తగ్గించిన వశవర్తియైనట్టుల ఇంద్రియములకును, ఆహారము తగ్గించిన కామదుశ్చింతలు కలుగఁజాలవు. ఏకాదసులయందును, అమావాస్య పూర్ణిమాది పర్వములందును, సంక్రాంతులయందును, ఉపవాసము సేయుచుండినయెడల శారీరక మానసికారోగ్య స్థితులు చేకూఁబడి యెంతయు మేలు కలుగును. ఉపవాసములు సేయుటవలన (Fasting) శరీరమున కెంతయు మేలు కలుగుచున్నదని ప్రకృతిశాస్త్రజ్ఞులు కనిపెట్టి అప్పుడప్పుడు ఉపవాసములు సేయుచుండుఁడని యుపదేశింతురు. ఉపవాసము వలన శరీరముయొక్క రసవృద్ధి క్షీణించుటయే కాక శరీరమునకును, మనస్సున కెంతయు లాఘువమును చులుకుఁదనమును గలుగును. నిరాహారరూపమగు తపంబువలన జఠరాగ్ని ఉత్తేజితమై శరీరములోనుండు మలినపదార్థములను మాడ్చివేసి యింద్రియోద్ధతి నుడిగించును. శారీరక మానసిక యంత్ర చక్రములకు విశ్రాంతి కలుగును. ఆహారరసము లేక ఇంద్రియములు క్షీణించి, మనస్సు బలము తగ్గి, శరీరము శుష్కించి

నందున, దుశ్చింత లుదయింపఁజాలవు. భగవంతు నాశ్రయించి పవిత్రనామము కీర్తించుటవలన సచ్చింతలు కలుగును.

ఆసన ప్రాణాయామములవలన కామదమనము.

7. యోగు లవలంబించునాసనములు, ముద్రలు, ప్రాణాయామము మొదలగునవి కామదమనమునకు శ్రేష్ఠము లగు సాధనములు. జితేంద్రియత్వముఁగోరుకు మహనీయులు ఆసనము మొదలగువాని నేర్పఱిచిరి. హిత మితమగునాహార మును, దుఃఖమును శోకమును రోగమునుఁ గలుగఁజేయ నట్టియు, మిక్కిలి చేఁదు, ఉప్పు, పులుసు, కారము వేఁడి లేన ట్టియు నగుపదార్థములను భుజించిన శారీరకారోగ్యంబును, తన్మూలక మానసికారోగ్యంబును, జితేంద్రియత్వమును గలుగు నని యోగశాస్త్రములయందుఁ జెప్పిరి. పద్మాసన, సిద్ధాసనము లందుండి ప్రాణాయామ మొనర్చుచుండినయెడల దానివలనఁ గలుగులాభములు కొలఁదికాలములోనే తెలియనగును.

ఈయాసనము లింద్రియవికారమును నశింపఁజేయుటకు శ్రేష్ఠము లగుసాధనములు. వీనియందుఁ గూర్చుండుపద్ధతినిఁ బట్టియే యింద్రియవికారము లడఁగును. ప్రాణాయామము వలన చిత్తము స్థూలమునుండి సూక్ష్మమున కేకాగ్రమగును. ఇది యుత్తేజనకారియగు కామమునకు ఘోరశత్రువు.

సద్భావనాబలముచే దుశ్చింతలు తొలఁగును.

శ్లో. దేహో దేవాలయః ప్రోక్తః జీవో దేవస్సనాతనః.

స్మృతి.

8. అను నార్యోక్తినిఁబట్టి ఈశరీరము భగవానుని పవిత్రమందిరమనియు, నిట్టి పవిత్రమందిరములోనికి అపవిత్రతరాఁగూడదనియు వచ్చినచో పరిశుద్ధతేజస్సు చెడుననియుఁ దలంచుచున్నయెడల కామదుశ్చింత లుదయింపఁజాలవు. పవిత్రభావములతో ప్రేమ భక్తితో భగవన్మందిరములోనికిఁ బ్రవేశించినట్లయిన భగవానునికి మనమీఁద ప్రీతికలిగినట్లు పరిశుద్ధభావములతో (తలంపులతో) సూక్ష్మశరీరములోనికి ధ్యానయోగమునఁ బ్రవేశించినట్లయిన తేజోమూర్తి ప్రజ్ఞామేధాశక్తు లొసంగుటచే, కామదుశ్చింతలు పొడమక నశించును.

దినమునకు రెండుపర్యాయములయినను చెమటబట్టునట్లు పరిశ్రమము, ప్రాణాయామము చేయుటవలన శారీరకమలంబును, సద్గ్రంథపారాయణము, పఠనము, భగవన్నామసంకీర్తనముఁ గావించుటవలన వాఙ్మలంబును, ధ్యానము చేయుటవలన మానసికమలంబునుఁ బోవును. ఇట్లు త్రికరణంబులును నిర్మలము లగుటవలన కామదుశ్చింత లుదయింపఁజాలవు.

శ్రేయస్కామునికర్తవ్యములు.

9. శ్రీరామకృష్ణపరమహంస, వివేకానందస్వామి లోనగు మహాపురుషులయు, జితేంద్రియులగు దత్తాత్రేయ సనకాది మహర్షులయు, యోగీశ్వరులయు, జీవితచరిత్రములనుఁ బఠించుచు, వారి ఛాయాపటములను పఠనమందిరమం దిడుకొని

దర్శించుచు, కాముని జయించిన మహాదేవుని చరితమును భావించుచు, పవిత్రమగు భగవన్నామము నుచ్చరించుచు నివి యన్నియు నొకకాగితముమీఁద వ్రాసి యెదుట నుంచుకొనినయెడల కామాదిదుశ్చింతలు సమున్మూలముగ నశించి సద్భావములు సచ్చింతలు కలుగును.

అనిత్యశరీరదోషదృష్టిచే భోగాసక్తులు కలుగఁజాలవు.

10. మేదోమజ్జాస్థిమాంసరక్తపూరితంబును, క్రిమిజాలసంకులంబును, స్వభావదుర్గంధమును, మూత్రపురీషపూర్ణంబు నగు కామినీకళేబరము తత్త్వదృష్టితోఁ జూచిన వివేకి భోగాసక్తికిఁ బాల్పడఁడు. రంధ్రద్వారమునుండి వెలువడు చీము నెత్తురుగల వ్రణమునకును, అవాచ్యప్రదేశంబునకుఁ గలభేద మేమి? యని యోగులు భోగాసక్తినుండి విరక్తిఁ జెందెదరు. నవద్వారములనుండి బయటికివచ్చుచుండు మలమును దలంచుకొనినయెడల శరీరమెంతటి యసహ్యపదార్థమో తెలియనగును. అసహ్యమును అనిత్యమును నగు నీశరీరము మరణానంతర మేవిధముగ నుండునది తలంచుచున్నయెడల భోగాసక్తి కలుగక కామదుశ్చింతలు తొలఁగిపోవును.

సత్కార్యఫలితములు.

11. సత్సాంగత్యము, జితేంద్రియులును యోగులునగు మహాపురుష జీవితచరిత్రములు వినుటయు,సజ్జనులతోఁ గూడి

సద్గోష్ఠి[illegible] చేయుచుండుట, ప్రాతఃకాలమున స్నాన [illegible], సాత్త్వికాహారమును భుజించుచుండుట, [illegible] ప్రాణాయామములఁ గావించుట, [illegible]చుటయు, వీనివలన [illegible] గలిగి కామాది [illegible], సౌందర్యము, తేజస్సు, [illegible] గలిగి [illegible]ఆయుష్మంతుఁడై వర్థిల్లును.

క్రోధశమనోపాయములు.

క్రోధ[illegible] సాధించునుపాయము [illegible]బడినను, మఱికొన్ని [illegible] క్రోధోద్రేకమునుఁ [illegible] దూరమందుం [illegible]. క్రోధ[illegible] విషయవిచారమును [illegible]. చిత్తము ప్రశాంతమయిన [illegible]. క్రోధము పోయి [illegible] మనుష్యునిఁగాని, [illegible] నగును. కావున చిత్త[illegible] అట్టివానికి దూరమం[illegible].

1. క్రోధ[illegible] చిక్కకుండునటుల ప్రయ[illegible]. అగ్ని[illegible] (సమిధలు) వైచిన, ప్ర

జ్వలించుఁగాని, పుల్లలు వేయకుండిన నుపశమించినట్లుల మా టాడకుండిన నాక్రోశతఁ జెందకుండిన, ఆక్రోధమునకు స్థానము చిక్కక క్రమక్రమముగ నశించును. ఎవనిమీఁదనయినను క్రోధము గలిగినయెడల నాక్రోధోద్రేకము తగ్గినంతనే, తన క్రోధమునకు విషయుఁడైన (పాత్రుఁడు) వానిని సమీపించి, స్వదోషమును వెల్లడింపవలయును. మఱియు వానిని క్షమింప వలయునని ప్రార్థింపవలయును. అది క్రోధము నశించుటకు మంచి మార్గము.

2. భృత్యునిమీఁదఁగాని,తనకన్న నధములమీఁదఁగాని యాగ్రహము కలిగినపుడు గూడ వారిమనస్సున కెంత బాధ కలిగెనోయని పశ్చాత్తాపముఁ జెంది వారినిఁ జేరఁబిలిచి యాదరించి మంచిమాటలతో మనఃఖేదమునుఁ బోఁగొట్టవల యును. క్షమింపఁగోరుట మంచిది కాని, గౌరవవంతులు భృత్యుని క్షమింపఁగోరుటకు బదులుగా, పుత్రునివలె నాద రించి సంతోషపఱచుట మంచిది. భగవంతుఁడు నాయందును, వానియందును సమానముగ నుండెనుగదా ? దీనులను, అనా థులను, ఆశ్రితులను క్రోధముచే నొప్పించుట భగవంతుని యెడ నపరాధము చేయుటే కదా ? యని తన దోషములగు నీచత్వమును, అహంకారత్వమును, మనోదుర్బలత్వమును మాటిమాటికి స్మరణకుఁ దెచ్చుకొనుటవలనఁ గూడ క్రోధ ముపశమించును.

3. నిజదోషముల కేదో యొక గుర్తును వ్రాసి, సమ్ముఖమం దుంచుకొనుటవలనఁగూడ మిక్కిలి మేలుగలుగును. ఎవరినేని కఠినంపుఁబలుకులచే దూషించి యాగ్రహోదగ్రుఁడయినపు డీకాగితపుగుర్తులనుఁ జూచినంతట లజ్జితుఁడై క్రోధమునకు వశుఁడు గాకుండును.

ప్రతివాఁడును క్రోధసమయమునందు తన్నుఁ దాను మఱచిపోవుచుండును. కాఁబట్టి అట్టిసమయమునం దెవ్వఁడేని మృదుమధురవాక్యములతోడ కోపమువలనఁ గలుగు నష్టములను స్మరణకుఁ దెచ్చినయెడల కోపము చల్లారుననుట నిక్కువము. కాని అట్టుల స్మరణకుఁ దెచ్చువాఁడు కోపస్వభావముఁ గలవాఁడయినచో మేలుగలుగుటకు బదులుగ కీడుగలుగును. అటుగాక శాంతస్వభావముతో నుద్బోధించిన కోప ముపశమించును.

4. క్రోధము గలుగునపుడు నిజదోషములను దుర్బలత్వమును స్మరణకుఁ దెచ్చుటకుగాను, ఎవనినయినను నియమించుకొనినయెడల క్రమక్రమముగ క్రోధము తగ్గిపోవును. లేక క్రోధమువలనఁ గలుగుదోషములఁ దెలియఁజేయు నరిషడ్వర్గచక్రమును చొక్కాయి జేబుయందుంచుకొనిగాని, లేక మఱియొకగుర్తుగలదానిని దేహమున ధరించి కాని యుండి కోపముఁ గలిగినపుడు దానినిఁ జూచినయెడల నుద్బోధితుఁడై క్రోధమునుండి మఱలును.

5. క్రోధపరవశుఁడైయున్నప్పు డద్దమును జూచుకొనినయెడల తన వికృతాకారము తనకే యసహ్యముగఁ దోఁచుటవలన క్రోధము నివృత్తియగును. ఉపేక్ష క్రోధమునకు భయంకరశత్రువు. కాఁబట్టి యుపేక్షాభావము వహించియుండువాని హృదయమునందు క్రోధతరంగములు పుట్టఁజాలవు.

6. క్రోధము గలిగినపుడు స్థానమును మార్చుకొనుట మంచిది. మనస్సును వేఱొకవిషయము మీఁదికి మఱలించవలయును. అరగంటసేపు వడిగా నడిచినను ఉపశమించును. 'ఓమ్ శాంతిః' యని 103 పర్యాయములు ప్రణవము నుచ్చరించినను, శాంతాకారుఁడగు మహావిష్ణువు దశావతారములు స్మరించినను, ఒకటి మొదలు ముప్పదివఱకు సంకెలను లెక్కించినను, ఉచ్చైస్స్వరమున నీశ్వరనామము స్మరించినను క్రోధోద్రేకము తగ్గిపోవును. ముఖ్యముగ మాటాడకుండినను, నిందింపకుండినను తన శరీర ముడుకుచున్నదని తెలిసికొనినను కోపము చల్లారును.

7. శిష్యులుగాని బిడ్డలుగాని తప్పొనరించినపుడు వారిని మంచిమార్గములోనికిఁ ద్రిప్పుటకు దారుణమగు క్రోధభావమును వహించుటకన్న మృదుత్వము వహించుట మంచిది యని తత్త్వజ్ఞులు చెప్పుచున్నారు. క్రోధత్వము చూపుటవలన వారిక్రౌర్య మధికమగును. వారి సూక్ష్మశరీరములకు క్రోధబాణములు సోకుటవలన నష్టము కలుగును. కాఁబట్టి సాదర

వాక్యములును, అనునయంపుటాచరణలును, సామదానో పాయములు లోనగు మృదుభావములచేత మంచిమార్గము లోనికిఁ దీసికొని రావలయునుగాని, కఠినంపుఁ బద్ధతుల నవలం బింపఁగూడదు. ప్రేమించుటవలనను కోప ముపశమించును. ప్రేమభావము చూపినంత సౌకర్యము కఠినభావము చూపఁ జాలదు. మృదుత్వము, కాఠిన్యమునకన్న కార్యకారియని మహాభారతమునందునుఁ జెప్పఁబడినది.

శ్లో. మృదునా దారుణం హంతి మృదునా హంత్యదారుణం,
నాఽసాధ్యం మృదునా కించి త్తస్మాత్తీవ్రతరం మృదు.

మృదుత్వమువలన కఠినత్వమును మృదుత్వమును గూడ వశపఱచుకొనవచ్చును. మృదుత్వమున కసాధ్యమగుకార్య మెద్దియును లేదు. అందువలన కఠినత్వముకంటె మృదుత్వమే బలవత్తరమయినది. నదీతీరమందలి వృక్షములు గొడ్డంటఁగొట్టఁ బడినపుడు నఱకఁబడినపుడు కూలిపోవునుగాని, మూలము (మొదలు) నశింపక మఱల చిగిర్చును. చెల్లగనుండు జల ప్రవాహము, అడుగుననే ప్రసరించి క్రిందుడువ్రేళ్లతోఁ గూడ చెట్లను నాశముఁజేయును. తిరిగి మొలకలెత్తవు. కఠిన మగు గొడ్డలిదెబ్బకన్న మృదువగు జలప్రవాహ మెంత గొప్ప పనిచేసినదో తెలియనగును.

8. అధర్మముచే ధర్మము బాధితమై విప్లవము గలిగి నపుడు దీనానాథసాధుజనులకు దుర్మార్గులవలన కష్టములు గలిగి

నపుడు, మహనీయులకు కోపము వచ్చునుఁగాని దానిచేత వారిమనస్సు వికారమునుఁ జెందదు.

శ్లో. సాధోః ప్రకుపితస్యాపి మనో నాయాతి విక్రియాం,
న హి తాపయితుం శక్యం సాగరాంభస్తృణోల్కయా.

నీతిశాస్త్రము.

గంభీరమగు సాగరోదకమును, తృణాగ్ని (గడ్డి నిప్పు) ఉష్ణముఁ జేయఁజాలనియట్లు, మహాశయుఁడగు సాధువు కుపితుఁడయినను, వానిచిత్తము వికారముఁ జెందదు. సాధుపురుషులు బాహ్యముననుండు అన్యాయములను, అధర్మములను శాసించుటకై క్రోధమను బాణమును ప్రయోగింతురు కాని దానివలన వారు వికారములఁ నొందరని తాత్పర్యము. కాఁబట్టి లోకములో సజ్జనులు వికారముఁజెందని చిత్తముతో బాహ్యప్రపంచకార్యార్థము కోపాటోపముఁ జూపినను బాధితులు కారని క్రోధప్రకరణమున వివరింపఁబడెను.

9. క్రోధనివారణకై కొన్ని శారీరకనియమములను గమనించుట ముఖ్యాంశము. రజోగుణమువలన క్రోధము బుట్టును గనుక, రాజసపదార్థములగు మిక్కిలి చేఁదు, ఉప్పు, పులుసు గలిగి కారమైన వేఁడిపదార్థములను భుజింపరాదు. క్రోధస్వభావముగలవారలు శరీరమును శీతలముగ నుంచుకొనుటకును, పైత్యమును వృద్ధికానీయకుండుటకును, సర్వదా యత్నించుచుండవలయును. ప్రతిదినమును బాగుగ కాళ్లు చేతులు మోమును గడుగుకొనుచుండినయెడల క్రోధము

[illegible] నిత్య [illegible] స్థానమునకును భగవం [illegible] పాద ప్రక్షాళనమును, [illegible] లారోగ్యమార్గము [illegible] పాద ప్రక్షాళనమువలన [illegible] కలుగును. [illegible] దీని యుద్దేశ్యము.

10. [illegible] బంగారము కలిగినట్టుల, [illegible] కలిగించును. [illegible] రక్తము చెడి [illegible] వైద్యశాస్త్రజ్ఞులు [illegible], వ్యాధులు [illegible] కారణములు. [illegible] లోనెంతేని [illegible] గల మహనీయులు కనుc [illegible].

[illegible], భగవన్నామసంకీర్తనమువలనను, [illegible], వాక్శుద్ధి గలు [illegible] ధ్యానించుటవలన, [illegible] ట్లు త్రికరణములు [illegible] యుపయోగించుట కవకాశ [illegible].

ధ్యానపఠనమందిరమందు శాంతమూర్తులగు మహర్షులయు, దేవతలయు, యోగీశ్వరులయు, సంయమీశ్వరులయు ఛాయాపటముల నుంచుకొనవలయును. ఇట్లు పైనఁ జెప్పినవన్నియు క్రోధశమనోపాయములు.

లోభము, Greed, Avarice, Covetousness.

అంతశ్శత్రువులలో మూఁడవది యగులోభము అతి దుష్టమయినది. బలీయమగు నీదుర్గుణమువలన నెల్లపాపములు జనించును.

శ్లో. త్రివిధం నరకస్యేదం ద్వారం నాశనమాత్మనః,
కామః క్రోధస్తథా లోభస్తస్మాదేతత్త్రయం త్యజేత్.

భగవద్గీతా. 16 అధ్యాయ. 21 శ్లోక.

నరకద్వారము లగుమూఁటిలో నిది పరిగణితమయినందునను, ఆత్మవికాసమునకు ప్రతిబంధకమయినందునను, శ్రేయస్కాముఁడు దీనిని విడువవలయును. సర్వానర్థములకు మూలమగు నీలోభమును తత్త్వవేత్తలు పలుతెఱంగుల నిర్వచించినారు.

(మహతిధనాగమే జాయమానేఽప్యనుక్షణం వర్ధమానస్తదభిలాషో లోభః, స్వవిషయప్రాప్తి అనివర్త్య ఇచ్ఛావిశేషః) (విషయకోటి ప్రాప్త్యాపి నివర్తయితు మశక్యో అభిలాషవిశేషో జాయతే.

సనత్సుజాతీయశంకరభాష్యే.

లోభః = పరద్రవ్యేచ్ఛా, న్యాయార్జితద్రవ్యస్య తీర్థే వినియోగాఽసామర్థ్యం వా.

తనకు అధికధనలాభము కలుగుచున్నను, అనుక్షణ మది వృద్ధిఁబొందవలెననెడికోరిక. సమస్తవస్తుజాతము ప్రాప్తించినను, నివర్తింపఁజేయఁజాలని అభిలాషవిశేషము. తనకు బహుళముగ ధనమున్నను, అధర్మముగనైనను పరద్రవ్యాదులను గ్రహించవలెననెడి ఆశావిశేషము. న్యాయార్జితమగు ధనమును సత్కార్యమున వ్యయము చేయ సామర్థ్యము లేకుండుట, ధర్మకార్యములకు తనధనమును వ్యయముఁ జేయఁజాలక అధర్మముగ పరధనమును గ్రహించి వ్యయముఁ జేయఁ దలఁచుట. లోభి (Miser) అనేకవిధముల ధనము నార్జించి, తా ననుభవింపక ఒరులకీయక యెంత లభించినను తృప్తిఁజెందక అధర్మముగనైనను పరద్రవ్యాదులఁ బొందవలె ననెడి అనివార్యమగు నభిలాషముఁ గలిగియుండునని భావము. మహోదధిని నెన్ని నదీప్రవాహములు వచ్చిచేరినను, అనల మున నెన్నిపదార్థములు వైచినను, తృప్తిఁజెందనిచందమున, లోభి కోటివస్తుసముదాయమునుఁ బొందినను, ఇంక నభివృద్ధిఁ బొందవలెననెడి ఇచ్ఛ కలిగియుండునుగాని, ఇచ్ఛాపూర్తి యెన్నఁటికినిఁ జెందనేరఁడు. తృషార్దితుఁ డెంతనీరము ద్రావినను తృష నివర్తింపనట్టుల, వస్తుకోటిప్రాప్తిచే లోభగుణ మతిశయించును గాని ఉపశమింపదు. గృధ్రము మాంసాభిలాషముచే నంతట పర్యటన మొనరించునటుల లోభగుణ ప్రేరితుఁ డగమ్యదేశముల సంచరించి, అకృత్యముల నొనరించి, యెంత లభించినను తృప్తిఁజెందక, ప్రాప్తమగు విత్తము

నేని సత్పాత్రమున వినియోగింపఁజాలక, ఇంత లభించినది, ఇఁక నింత లభింపఁబోవునని ఉపర్యుపర్యభిలాషములచే నువ్విళ్లూరుచు, నీవ్యాధిచే శ్రమపడుచుండును. భర్తృహరియోగీంద్రుఁడును, శ్లో. "లోభశ్చేదగుణేన కిం" లోభమున్న వేఱొకదుర్గుణ మేల యని నుడివెను. లోభమునకు పాశ్చాత్యులు తమభాషయందు Greed అని వ్యవహరింతురు. ఇది గృధ్ర గృధ్ అను సంస్కృతధాతువునుండి జనించియుండునని భాషాశాస్త్రజ్ఞులు తలఁచుచున్నారు.

లోభిజనులప్రవర్తనలు.

సత్త్వశమదమతపసాదులు గలిగి వివేకవైరాగ్యసంపన్నులగు శాస్త్రవేత్తల కోడిపోయి, లోభము కుటిలమగు వణిజుల హృదయగర్తమునందు దాఁగికొనియెను. కావుననే లోభాకృష్టులు మాయఁ గల్పించి యొకవస్తువుఁ జూపి మఱియొకవస్తువు నిచ్చుట, క్రయవిక్రయములందు మోసపుచ్చి ధనమార్జించుట,వివిధాన్యాయనులు చేయుట యీలోభము వలననే కలుగుచున్నవి. పుణ్యకథలు వినుటకుఁ బౌరాణికుని యొద్ద కెంతయో శ్రద్ధగాఁ బోవునుగాని, దానధర్మములు చేయఁబోవునపు డీతఁడు నల్లత్రాఁచు గఱచినవానివలె మాయమగును. అమావాస్య, సంక్రాంతి, గ్రహణము, అర్ధోదయ, మహోదయములు వచ్చినపుడు, చక్కఁగా స్నానము చేసినను, కాసయిన నొక్కనిచేతిలోఁ బెట్టఁడు. ఏమైన నిచ్చెనేని మఱల నెవ్వరయిన వత్తురనుభయంబున దిక్కుదిక్కులు

చూచుచు ముసుఁగు వేసికొని రాజమార్గమును విడిచి, సందు గొందులఁబడి దొంగవలెఁ బాఱిపోవును. ధనలాభము కలుగు నపుడు వచ్చినవారిని గౌరవించి, అతినమ్రుఁడై మిథ్యాభక్తిని నటించుచు, మఱియొకచోటికిఁ బోనీయక తనమాయావాగుర ములో వైచికొనును. సభలలో కీర్తికాముఁడై మెలఁగును గాని, చేందాపట్టిక వచ్చునపుడు, ఏదేనొక మిషఁబెట్టి సభ నుండి జారిపోవును. వ్యయపరాఙ్ముఖతయే లౌభ్యమునకుఁ గారణము. ధనవంతుఁడని విశ్వసించి యెవరేని సొమ్మును దాఁచి, కొంతకాలమైనపిమ్మట వచ్చి యడిగిరేని తానేమియు నెఱుఁగననియు, నేదేని పత్రముగాని, సాక్షులుగాని యున్నారా అనియు ధిక్కరించి ఉచ్చైస్స్వనముతో మాటాడుచు, దాఁపుడుధనము నపహరించును. ధనముఁ గోల్పోయినవా రెంతనిందించినను, అవమానించినను, ధనము ప్రాణమునకన్న నెక్కువ, మానావమానములతో నేమి ప్రయోజనమని ధన తృష్ణచే వీనినన్నింటిని సహించును. దారాపుత్త్రాదులకు వ్యాధులు సంభవించి, ప్రాణముపోవు సమయమందయినను, ఔషధమునకు ధనము వినియోగింపఁడు. యాచకులాశ్రయించి కష్టములఁ జెప్పుకొనుచుండినను పెడచెవినిఁ బెట్టును. వ్యయ విషయముఁ దక్క యితరవిషయము లేవిచెప్పినను ఆలకించును.

ఆశాస్వరూపము పరిమితి.

అత్యాశారూపమగు లోభమువలన ప్రాణనష్టము సయితము సంభవించును. ప్రతిప్రాణికిని ఇచ్ఛ (Desire) (వాంఛ) లేక లోకవ్యాపారమేమియు జరుగనేరదు. ఈయిచ్ఛ సామా

న్యస్థితియం దున్నప్పుడు బాధకమేమియు లేదుకాని ఇంచుక తీవ్రముగ నున్నతఱి ఆశ (Ambition - Hope) యనఁబడి దానికి భంగము గలిగినపుడు మనోవ్యథ మిక్కుటముగ నుండును. లౌకికకార్యములను దీక్షతో సాధించునపుడు తీవ్రేచ్ఛ (Perseverance) యనఁబడు ఆశ యుండును. ఇదియు నంత విశేషబాధనుఁ గలిగించునది కాదు కాని, అతితీవ్రేచ్ఛ యనఁబడు అత్యాశ (Greediness) విశేషబాధనుఁ గలిగించుటయే కాక మృత్యువును సయితము పొందింపఁజేయును. ఈ అత్యాశనే లోభమని తత్త్వజ్ఞులు వ్యవహరింతురు. విద్యుచ్ఛక్తి తత్త్వముఁ దెలిసికొని హితమితముగ వాడుకొనిన నుపకరించును గాని, స్వరూపము తెలియక అమితముగ వాడుకొనిన దహించుచందమున ఆశాస్వరూపమునుఁ దెలిసి, లోఁబఱచుకొని యుపయోగించుకొనిన పురుషార్థము నొసంగును. అటుగాక దానికి లోఁబడి అమితముగ నుపయోగించిన అత్యాశారూపమై అనర్థపరంపరలు కలిగించును.

అత్యాశారూపమగు లోభమువలన మరణప్రాప్తి.

జీవితార్థము ధనసంచయము సేయఁదగును కాని అతిసంచయము సేయఁదగదు. అతిసంచయము సేయునపుడు లుబ్ధత్వము కలుగకమానదు.

శ్లో. కర్తవ్యస్సంచయో నిత్యం కర్తవ్యో నాఽతిసంచయః,
పశ్య సంచయశీలోఽసౌ ధనుషా జంబుకో హతః.

హితోపదేశము.

పూర్వ మొకప్పుడు వ్యాధుఁ డొకఁడు అరణ్యమున వేఁటాడుచు మృగమునుఁ జంపి, యఱకడఁ బెట్టుకొని పోవుచుండ ఘోరాకృతి యగుసూకరము కనుపించెను. మృగమాంసమునఁ దృప్తిఁజెందని లుబ్ధుఁ డగువ్యాధుఁడు మృగమును క్రిందనుంచి, బాణమున సూకరము నేయ నది ఘోరారావము సేయుచే నాకిరాతునిఁ బొడిచి చంపి, తానును మృతిఁజెందెను. వీరిపోరాటమున కాళ్ల చే నలిగి యొకసర్పము హతమాయెను. ఇట్లుండ క్షుధాపీడితమగు నొకజంబుకము ఆహారార్థ మాయరణ్యమున సంచరించుచు, మృతిఁజెంది పడియున్న మృగసూకరకిరాతులఁ జూచి, యుబ్బి యిట్టియాహారము దైవికముగఁ జిక్కినదని సంతసించుచు నరమాంస మొక మాసమును, మృగవరాహములపలలము రెండుమాసములును, సర్పము ఒకదినమునకును నాకాహారముగ లభించినదని తలఁచి, వీనితోఁ దనియక వింటినరమును (అల్లెత్రాడు) వ్యర్థముగ నేల విడువవలయును ? ఈక్షణమున దీనిచే నాఁకటి బాధనుఁ బోఁగొట్టుకొనియెదనని అతిలోభముచే నా యల్లెత్రాటిని (నరమును) కొఱకగ నది బెట్టువీడి కణతకు తీవ్రముగ తగిలినంత ప్రాణములఁ గోల్పోయెను. లోభముచే జంబుకమున కేగతి సంభవించెనో చూడుఁడు.

ఎంతటి గొప్పవారును లోభమునకు లోఁబడి కష్టములపా లగుదురు.

శ్లో. సుమహాంత్యపి శాస్త్రాణి ధారయంతో బహుశ్రుతాః,
ఛేత్తారస్సంశయానాం చ క్లిశ్యంతే లోభమోహితాః.

హితోపదేశము.

గొప్పశాస్త్రములను జదివియు, పెద్దలవలన ననేక లోకానుభవవిషయముల వినియుండియు, ఇతరులసంశయములఁ బోఁగొట్టు సమర్థులయ్యు ప్రాజ్ఞులు సమయ మాసన్నమయినతఱి లోభాకృష్టచేతస్కులై క్లేశములఁ బొందెదరు. మహానుభావుండగు శ్రీరామచంద్రమూర్తి బంగరుజింక కలుగుట అసంభవమని తెలిసియు ప్రేయసీమానసోల్లాసమునకై ఆశపడి బంగరుజింకకై వెంబడించెను. సమయముఁ గనిపెట్టి దశాననుఁడు మాయారూపియై సీతాదేవి నపహరించెను. మాయామృగమగు మారీచుఁడు హతమాయెను. కాఁబట్టి విపత్కాల మాసన్నమగుతఱి ఎంతటి గొప్పవారిబుద్ధులును లోభోపహతము లగును. దానివలన ననేకకష్టములు కలుగును.

శ్లో. లోభాత్క్రోధః ప్రభవతి లోభాత్కామః ప్రజాయతే,
లోభాన్మోహశ్చ నాశశ్చ లోభః పాపస్య కారణమ్.

మహాభారత-శాంతిపర్వము.

లోభమువలన క్రోధము కామము మోహము నాశమును గలుగుచున్నవి. ఎల్లపాపములకు లోభము కారణమగుచున్నది.

మిత్రబంధువు లెవరేని ధనముఁ గైకొని మిత్రరూపముననున్న లోభులవెంట వెడలిరేని ఆలుబ్ధులు మార్గమధ్యమున విశ్వసించిన మిత్రబంధువులను నిర్దయులై చంపి వారి ధనము నపహరింతురు. భూషణాలంకృతులైన పసిబాలురకును,

బాలికలకును, మిఠాయి మొదలగువస్తువుల నిచ్చి తీసికొని వెళ్లి సొమ్మునిమిత్తము హత్యలు గావించెదరు. లోభ మెట్టి పాపములనైన నొనరించును.

లోభము, దానివలనఁ గలుగు దుర్గుణములు.

శ్లో. ఏకో లోభో మహాగ్రాహో లోభాత్పాపం ప్రవర్తతే,
అతః పాప మధర్మశ్చ తథా దుఃఖమనుత్తమం.
నికృత్యా మూలమేతద్ధి యేన పాపకృతో జనాః,
లోభాత్క్రోధః ప్రభవతి లోభాత్కామః ప్రవర్తతే.
లోభాన్మోహశ్చ మాయా చ మానః స్తంభః పరాసుతా,
అక్షమాహ్రీపరిత్యాగః శ్రీనాశో ధర్మసంక్షయః.
అభిధ్యా ప్రఖ్యతా చైవ సర్వం లోభా త్ప్రవర్తతే,
అత్యాగ శ్చాతితర్షశ్చ వికర్మసు చ యాః క్రియాః.
కులవిద్యామదశ్చైవ రూపైశ్వర్యమద స్తథా,
సర్వభూతేష్వభిద్రోహస్సర్వభూతేష్వసత్కృతిః.
సర్వభూతేష్వవిశ్వాసస్సర్వభూతేష్వనార్జవం,
హరణం పరవిత్తానాం పరదారాభిమర్శనం.
వాగ్వేగో మనసో వేగో నిందావేగ స్తథైవ చ,
ఉపస్థోదరయో ర్వేగో మృత్యువేగశ్చ దారుణః.
ఈర్ష్యావేగశ్చ బలవాన్ మిథ్యావేగశ్చ దుర్జయః,
స లోభ స్సహ మోహేన విజేతవ్యో జితాత్మనా.
దంభో ద్రోహశ్చ నిందా చ పైశున్యం మత్సర స్తథా,
భవంత్యేతాని కౌరవ్య లుబ్ధానా మకృతాత్మనాం.

శ్లో. అంతఃక్రూరా వాఙ్మధురాః కూపాశ్ఛన్నాస్తృణైరివ,
ధర్మవైతంసికాః క్షుద్రా ముష్ణంతి ధ్వజినో జగత్.
కుర్వతే చ బహూన్ మార్గాం స్తాన్ హేతుబలమాశ్రితాః,
సతాం మార్గాన్ విలుంపంతి లోభజ్ఞానేష్వవస్థితాః.
దర్పః క్రోధో మదస్స్వప్నో హర్షశ్శోకోఽతిమానితా,
ఏత ఏవ హి కౌరవ్య దృశ్యంతే లుబ్ధబుద్ధిషు.

మహాభారత శాంతిపర్వము. 158 అధ్యాయము.

లోభము గొప్పతిమింగిలము (జలజంతువు, అన్నింటి గ్రహించునది) వంటిది. లోభమువలన పాపము, దానివలన అధర్మము, దానినుండి దుఃఖము కలుగుచున్నది. మూలమగు ధర్మమును ఉన్మూలించి జనులు పాపకృత్యముల నొనరించుచున్నారలు. లోభమువలన క్రోధము, కామము, మోహము, మాయ, అభిమానము, జడత్వము, పరహాని, శాంతిలేకుండుట, లజ్జాపరిత్యాగము, ఐశ్వర్యనాశము, ధర్మక్షీణత, పరద్రవ్యాభిలాషము, స్వశక్తిప్రకటీకరణము, లోనగునవియన్నియుఁ గలుగుచున్నవి. త్యాగశీలతలేమి, ఎంతకలిగినను తృప్తిలేకుండుట, నింద్యము లగుకృత్యము లొనరించుట, కులవిద్యారూపైశ్వర్యమదము, సర్వభూతములయెడ ద్రోహము, అనాదరము, అవిశ్వాసము, కౌటిల్యము, పరదారవిత్తాపహరణము, వాఙ్మనోనిందావేగము, ఉపస్థోదరవేగము, ఈర్ష్యావేగము, ఇవియన్నియు లుబ్ధులయందుఁ గన్పట్టుచుండు. దంభము, ద్రోహము, నింద, పైశున్యము, మత్సరము ఈ

దుర్గుణములు లోభమునకు సహాకారములు. గడ్డిచేఁ గప్పఁబడినబావులవలె నంతరంగమున క్రూరత్వము వాక్కున మాధుర్యముగల యీలుబ్ధులు పైకి తేనియలొలుకు పలుకులు పలుకుచు ధర్మనాశకులై గొప్పవారమని ప్రకటించుకొనుచు, లోకులను మోసపుచ్చుచున్నవారలు. ఇది తృణప్రదేశమని నమ్మి అడుగిడినంత బావిలోఁబడినట్టుల వేషభాషలచే ధార్మికుఁడు వదాన్యుఁడు ధనవంతుఁడును నని నమ్మి యీలుబ్ధుల యొద్దకుఁ జేరినంతట మాయఁగల్పించి వంచనఁజేసి సర్వస్వము నపహరింతురు. హేతువాదము నాశ్రయించి సత్పురుషాశ్రయము లగుధర్మమార్గముల నాశముఁజేసి లోభవంతు లగుదురు. ఈలుబ్ధులయెడ దర్పము, క్రోధము, మదము, స్వప్నము, హర్షము, శోకము అతిమానిత్వము కన్పట్టుచుండునని మహాభారతమున భీష్ముఁడు యుధిష్ఠిరునకుఁ బోధించెను.

శ్లో. యోషిద్ధిరణ్యాభరణాంబరాదిద్రవ్యేషు మాయారచితేషు మూఢః,
ప్రలోభితాత్మా హ్యుపభోగబుద్ధ్యా పతంగవన్నశ్యతి నష్టదృష్టిః.
శ్రీభాగవతే 7 స్కంధ. 14 అధ్యాయ. 5 శ్లోక.

భగవన్మాయాసృష్టములగు కాంతాకనకాభరణాంబరాదివిషయములందు అత్యాసక్తమనస్కుఁ డగుమూఢుఁడు వీని ననుభవింపవలయు ననుబుద్ధితో కండ్లుగానక, జ్వలితాగ్నిని ఫలోపభోగబుద్ధితో మిడుత పడి నశించినచందంబున నితఁడును నశించును. మాయాకల్పితములని తెలియక ప్రలోభితమనస్సుచే వానియందు సక్తమై నశించునని భావము.

శ్లో. యశో యశస్వినాం శుద్ధం శ్లాఘ్యా యే గుణినాం గుణాః,
లోభ స్స్వల్పోఽపి తాన్ హంతి శ్విత్రం రూపమివేప్సితం.

మహాభారతం.

మనోహరమైన రూపమును అల్పమగు కుష్ఠుపొడ చెడఁగొట్టినట్లు కీర్తిమంతుల నిర్మలమగుకీర్తిని గుణసంపన్నుల సద్గుణములను లోభము స్వల్పమయినను నశింపఁజేయును.

శ్లో. శుష్కోపవాసో ధర్మేషు భైషజ్యేషు చ లంఘనం,
జపయజ్ఞశ్చ యజ్ఞేషు రోచతే లోభశాలినాం.

కలివిడంబనశతకం.

ధనము వ్యయముసేయ మనసొప్పని లుబ్ధులకు ధర్మవ్రతములయందు శుష్కోపవాసమును, ఔషధస్వీకరణమందు లంఘనమును, యజ్ఞములందు జపయజ్ఞమును ఇష్టమగుచున్నవి. ఏవిధముచే నయినను ధనవ్యయము కాకుండుటయే వారియభీష్టమని తాత్పర్యము.

శ్లో. అదాతారస్సమృద్ధా యే ద్రవ్యాఢ్యా లోభకారణాత్,
దీనానాథాన్న పశ్యంతి తే వై నిరయగామినః.

మహాభారత. శాంతిపర్వం.

ధనసంపన్నులు లోభకారణమున దాతృత్వబుద్ధి లేక దీనులను దిక్కులేనివారినిఁ జేక్కఁగఁ జూడనందున నరకమును బొందుచున్నారు అజ్ఞానమువలన నతిలోభమును, అతిలోభమువలన అజ్ఞానమును, అన్యోన్యాశ్రయములై వృద్ధిఁ బొందుచున్నవి. దీనివలన నెల్లపాపములు కలుగుచున్నవి.

భూతదయ గలిగి యథాశక్తి త్యాగ మొనరించుటే (దాతృత్వమే) లోభవ్యాధికి సిద్ధౌషధము.

మోహము, Infatuation, Delusion.

అంతశ్శత్రువులలో నాల్గవది యగుమోహము పాపిష్ఠమయినదియు, వినాశకరమయినదియు నగును. దీనికి మాయ అవిద్య తమస్సునని నామాంతరములు కలవు. తమోగుణలక్షణము మోహమని సాంఖ్యాది దర్శనములందును గీతాశాస్త్రమునందునుఁ జెప్పఁబడినది.

శ్లో. అప్రకాశోఽప్రవృత్తిశ్చ ప్రమాదో మోహ ఏవ చ,
తమస్యేతాని జాయంతే వివృద్ధే కురునందన.

భగవద్గీతా. 14 అధ్యాయ. 13 శ్లోకం.

తమోగుణము వృద్ధిఁబొందినపుడు అప్రకాశము బోధించినప్పటికినిఁ దెలిసికొనలేకుండుట, సాధనసామగ్రి యున్నను కార్యప్రవర్తనము లేకుండుట, చేయఁదగినకార్యమును సకాలమునఁ జేయకుండుట, కర్తవ్యాకర్తవ్యజ్ఞానము లేకుండుట, మూఢత్వము, అవివేకమును గలుగును. మోహమనఁగా అజ్ఞానము, అవివేకమునని శంకరభాష్యమునందు పలుచోట్ల వివరింపఁబడినది. (వేదితస్యాన్యథా వేదనమ్) తెలిసికొనఁదగినది వేఱొండువిధముగఁ దెలిసికొనుట అని ఆనందగిరివ్యాఖ్యానము. (మిథ్యాభినివేశము) అనిత్యములగు పుత్రకళత్రగృహక్షేత్రాదులందు నావియని యభిమానము (ఆసక్తి) నుంచుట. అని శ్రీధరీయవ్యాఖ్యానము.

శ్లో. తమస్త్వజ్ఞానజం విద్ధి మోహనం సర్వదేహినాం.

భగవద్గీత.

మోహనమనఁగా హితాహితాది వివేకప్రతిబంధకమునై భ్రాంతినిఁ గలిగించునది.

మోహపదార్థనిర్వచనము, Delusion.

ఎండమావులందు నిజముగ నీళ్లు లేకున్నను, ఉండినట్లు మృగములకు భ్రాంతికలిగినట్లు, పుత్త్రకళత్ర గృహక్షేత్రవిత్తాదులయందు పారమార్థికసుఖము లేకున్నను, ఉండినట్లు భ్రాంతి కలిగి వానియం దాసక్తమగుట మోహ మనఁబడును. శలభము దీపముఁ జూచి ఉపభోగార్హ మని ఫలభ్రాంతిచే దానం బడి నశించునట్లు, దుఃఖపరిణతములును అనాత్మీయములు నగు కాంతాకనకభూషణాంబర గృహక్షేత్రపుత్రకళత్రాదులు నిరతిశయసుఖదంబులను భ్రాంతిబుద్ధిచే నట సక్తమై నశించుట మోహ మనఁబడు. వాస్తవముగ లేనిది యున్నట్లు తోఁచుట, భ్రాంతి, మాయ, మిథ్య యని వ్యవహరింపఁబడును.

శ్లో. అనేకచిత్తవిభ్రాంతా మోహజాలసమావృతాః,
ప్రసక్తాః కామభోగేషు పతంతి నరకేఽశుచౌ.

భగవద్గీతా. 16 అధ్యా. 16 శ్లోకం.

పలుతెఱంగులగు చిత్తభ్రమలు గలవారై మత్స్యములు తమకు బంధకములగు వలలచే నావరింపఁబడినట్లు కాంతాకనకాదులు ఉపభోగార్హములని వానియం దత్యంతా

సక్తులై అజ్ఞానముచే (అవివేకము) నావృతులై దుఃఖరూపమగు నరకమునుఁ బొందుచున్నవారలు. దీపమునకు ఆవరణముగా నుండిన కాచపాత్రము (Glass) శుభ్రముగఁ దుడిచిన నిర్మలమై,స్వచ్ఛమై, దీపమునుఁ బ్రకాశింపఁజేయును. చక్కఁగఁ దుడువకుండిన మలినమై కొంచెముగఁ బ్రకాశింపఁ జేయునుగాని, సంపూర్ణ ప్రకాశ ముండదు. చుట్టు నావరించినమసి (మషి) గల కాచపాత్రము అత్యంతమలినమై దీపమును బొత్తిగఁ బ్రకాశింపఁ జేయనటుల (అవివేక) అజ్ఞానరూపావరణముచే నావృతమైన ఆత్మజ్ఞానము ప్రకాశింపదు. ఇదియే మోహమనఁ బడును. నిర్మలముగనుండిన కాచపాత్రము జ్ఞానప్రకాశముగల సుఖవంతమగు సాత్త్వికగుణమునకును, తుడిచీ తుడువనందున మలినముగల కాచపాత్రము తృష్ణాసక్తి రాగముగల దుఃఖవంతమగు రాజసగుణమునకును, బొత్తిగా తుడువక చుట్టు మసిగలన నతిమలినమగు కాచపాత్రము ప్రమాదాలస్య మోహములచే నజ్ఞానవంతమగు తామసగుణమునకునుఁ బోల్పఁబడెను. అజ్ఞానముచే నావృతమగు నంతఃకరణమునకు ఉన్నది లేనట్టుల, లేనిది ఉన్నట్టుల గ్రహించుట, సకాలమున చేయఁదగినకృత్యములు చేయక యాలసించి అజాగరూకతో నుండుట, సోమరితనము, నిద్ర, మాంద్యము, అవివేకము, మాత్సర్యము, సుఖోపభోగబుద్ధిచే బంధకములగు దుఃఖములలోఁ జిక్కుట లోనగునవి కలుగును. వీనినే మోహమని తత్త్వజ్ఞులు వ్యవహరింతురు.

శ్లో. మమ మాతా మమ పితా మమేయం గృహిణీ గృహమ్,
ఏతదన్యం మమత్వం యత్ స మోహ ఇతి కీర్తితః.
ఇతిపాద్మే-క్రియాయోగసారే, ౧౬ అధ్యాయే.

శ్లో. అహో మే పితరౌ వృద్ధౌ సాధ్వీ భార్యా సుత శ్శిశుః,
కథం త్వనాథా జీవేరన్నితి మోహసమావృతాః.

మృత్యుకాల మాసన్నమగుడు, నాతలిదండ్రులు కడు వృద్ధులు, భార్య యోగ్యురాలు యువతి, కుమారుఁడు శిశువు, నేను లేనిచో వీరు దిక్కులేనివారై యెట్లు జీవింతురని మోహావృతులై (అజ్ఞానము) ప్రాణులు దుఃఖింతురు. తాను మృతిఁజెందుటచే వీరెట్లు జీవింతురని వారియెడఁగల స్నేహ పాశరూపాజ్ఞానముచే నావరింపఁబడి మైమఱచుటయే మోహ మనఁబడునని భావము.

సాంఖ్యదర్శనమందును మమకారమున స్నేహాదులు కలిగియుండుట మోహమని యీ దిగువసూత్రమునఁ జెప్పఁ బడినది.

సూ. అహినిర్ల్వయనీవత్.
సాంఖ్యసూత్ర. 4 అధ్యాయ. 6 సూత్రం.

ఒకానొకసర్పము తన రంధ్రద్వారమున కుబుసము విడిచి, ఇది నాదియని దానియెడ స్నేహబంధమును విడువఁ జాలక యుంచికొనఁగ నొకప్పుడు పాములవాఁడు రాఁగ, ఆ కుబుసము కాళ్లఁజుట్టుకొని వేగముగ పరుగిడఁజాలక వానిచే ననాయాసముగఁ బట్టుపడి బహ్వనర్థములపా లాయెను.

[illegible] మున సతిస్నేహాదిరూపమగు [illegible] భావము.

[illegible] దోషములన్నియు రాగ ద్వేష [illegible], [illegible] మోహపక్షమున మిథ్యా [illegible] ప్రమాదము నని రాగద్వేష [illegible].

మిథ్యాజ్ఞానము [illegible] అయథార్థ నిశ్చయము False apprehension [illegible], లేనిది ఉన్నట్లు నిశ్చయించుట.

విచికిత్స [illegible] నిశ్చయజ్ఞానములేక సంశయించుట. Perplexity: Doubt [illegible] ము; సందేహము.

మానము [illegible] వించుకొని గొప్ప [illegible] ([illegible]సించుట) విఱ్ఱవీగుట. ఇతరుల [illegible] ప్రశంసింపక కప్పి పుచ్చుట. Pride; Self Esteem; Haughtiness.

ప్రమాదము : [illegible] పూర్వము నిశ్చయించుకొని [illegible], [illegible] సోమరితనము, పొరబాటు Carelessness.

భయము [illegible] నివర్తింపఁ జేయఁజాలనిబుద్ధి. Fear; Terror.

శోకము ఇష్ట[illegible] గలిగినపుడు దానినిఁ బోఁగొట్టఁజాలనిబుద్ధి. Grief; Sorrow.

పాతంజలయోగదర్శనమందును సత్త్వరజస్తమోగుణములకు శాంతఘోరమూఢవృత్తులని చెప్పఁబడెను. మూఢవృత్తి యనఁగా మోహము, అజ్ఞానము, మౌఢ్యమని పర్యాయపదములు. మోహము పంచపర్వాత్మికమగు అవిద్యారూపములలో నొకటి. తమస్సు, మోహము, మహామోహము, తామిస్రము, అంధతామిస్రము నని అవిద్య అయిదురూపములు గలది.

శ్లో. తమోఽవివేకో మోహస్స్యాదంతఃకరణవిభ్రమః,
మహామోహశ్చ విజ్ఞేయో గ్రామ్యభోగసుఖైషణా.
మరణం హ్యంధతామిస్రం తామిస్రం క్రోధ ఉచ్యతే,
అవిద్యా పంచపర్వాయా ప్రాదుర్భూతా మహాత్మనః.
విష్ణుపురాణే. ప్రథమ అధ్యాయ.

తమస్సు అనఁగా (అవివేకము) స్వరూపము ప్రకాశించకుండుట, మోహమనఁగా దేహాదులయందు నేనను అభిమానము, (మమకారము) మహామోహమనఁగా భోగేచ్ఛారూపాజ్ఞానము. తామిస్రమనఁగా భోగేచ్ఛకు ప్రతిఘాతము కలుగునపుడు జనించుక్రోధము, (పారవశ్యము) అంధతామిస్రమనఁగా నేను మృతిఁజెందుచున్నాఁడ ననుబుద్ధి మరణావస్థ. క్రోధము ఉత్కటావస్థఁ జెందినపుడు సమ్మోహము కలుగునని భగవద్గీతయందుఁ గలదు.

గర్తవిమూఢత్వము, అధర్మబుద్ధి కలిగినపుడు చేయఁ
దగునుఁ జేయవలెనని బుద్ధి పొడముట, మోహ

మనియు, నే నధికుఁడనని విఱ్ఱవీఁగుట మానమనియు, స్మృతి యందు నిర్వచించిరి.

శ్లో. మోహో ధర్మవిమూఢత్వం మానస్త్వాత్మాభిమానితా.

మోహమును వృక్షరూపముగ వర్ణించుట.

శ్లో. లోభః పాపస్య బీజోఽయం మోహో మూలంతు తస్య హి,
ఆసత్యం తస్య చ స్కంధో మాయాశాఖా సువిస్తరః.
దంభకౌటిల్యపత్రాణి కుకృత్యా పుష్పితస్సదా,
పైశున్యం తస్య సౌగంధ్యమజ్ఞానం ఫలమేవ హి.
ఛద్మపాషండచౌరాశ్చ కూటాః క్రూరాశ్చ పాపినః,
పక్షిణో మోహవృక్షస్య మాయాశాఖాస్సమాశ్రితాః.

మహాభారత, ఆరణ్యపర్వ.

పాపరూపమగు మోహవృక్షమునకు లోభము బీజమును, అవివేకమగుమోహము కూఁకటివేరు, అసత్యము బోదెయు, మాయ కొమ్మలును, దంభవంచనములు ఆకులును, దుష్కృతములు పువ్వులును, పిసినితనము పరిమళంబును, అజ్ఞానము ఫలమును, కపటులు, నాస్తికులు, చోరులు, అసత్యవాదులు, క్రూరులు, వంచకులు, పాపాత్ములు పక్షులుగానుండి మాయాశాఖల నాశ్రయించి ఆయజ్ఞానఫలమును భుజింతురని తాత్పర్యము.

వైద్యశాస్త్రమునందలి మోహస్వరూపము.

మోహమనఁగ ఒడలు తెలియక చిత్తవిభ్రమముగల వ్యాధివిశేషమని సుశ్రుతకారు లీక్రిందివిధముగఁ జెప్పిరి.

శ్లో. సంజ్ఞావహాసు నాడీషు పిహితాస్వనిలాదిభిః,
తమోఽభ్యుపైతి సహసా సుఖదుఃఖవ్యపోహకృత్.
సుఖదుఃఖవ్యపోహాచ్చ నరః పతతి కాష్ఠవత్,
మోహో మూర్ఛేతి తాం ప్రాహుః షడ్విధా సా ప్రకీర్తితా.
సుశ్రుతే - ఉత్తరతంత్రే. 46 అధ్యాయే.

ఉత్కటమనోవ్యాధి కలిగినపుడు సంజ్ఞావహములగు జ్ఞాననాడులు వాతపిత్తాదులచే మూఁతలు పడినందున, సుఖదుఃఖరూపవేదన (ప్రజ్ఞావృత్తి) నశించి అజ్ఞానము కలుగును. స్మృతినాశక చిత్తవిభ్రమరూపమోహముచే నరుఁడు కట్టెవలెఁ బడును. ఈమోహమునే మూర్ఛయందురు. ఇది ఆఱువిధములుగఁ జెప్పఁబడును. అలంకారశాస్త్రమందును విప్రలంభశృంగారమున మన్మథదశావస్థలయందు తురీయావస్థ యగు నిదియు నొకటి. నాయికానాయకులు పరస్పరానురక్తులై ప్రాప్తిలేక అత్యంతోత్కంఠితులై విరహవేదనచే నిద్రాహారములు లేక లజ్జాత్యాగముచే నున్మాదము పిమ్మట మూర్ఛనుఁ జెందుదురు. ఇట్టిసమయములందు శైత్యోపచారములు చేసినట్లు దృశ్యశ్రావ్యప్రబంధములందుఁ జూపట్టుచున్నది. అభిలషితపదార్థము లభింపనపుడు మూర్ఛయుఁ బిమ్మట మరణమునుఁ బ్రాప్తించును. కాఁబట్టి ముముక్షువు మోహస్వరూపమునుఁ దెలిసికొని ప్రజ్ఞాబలముచే నవకాశమీయక జయింపవలయును.

మదము, Pride, Arrogance, Madness.

అంతశ్శత్రువులలో నయిదవదగు మదము. ఇయ్యది రజోగుణమునుండి జనించి పురుషార్థమును నశింపఁజేయునది.

శ్లో. అహం మహాత్మా ధనవాన్ మత్తుల్యః కోఽస్తి భూతలే,
ఇతి యజ్జాయతే చిత్తం మదః ప్రోక్తస్స కోవిదైః.

పాద్మే క్రియాయోగసారే 16 అధ్యాయ.

నేను మహనీయుఁడను, ధనవంతుఁడను, నాతోడ సమానుఁడీభూతలమం దెవఁడు కలఁడు? అని జనించెడు చిత్తవృత్తి మదమనఁబడును. ఇది అహంకారమువలన జనించెడుగర్వము. ఈమదము పలుతెఱంగుల నుండునని తత్త్వజ్ఞులు నిరూపించిరి.

శ్లో. విత్తం బంధుర్వయః కర్మ విద్యా భవతి పంచమీ,
ఏతాని మానస్థానాని గరీయో యద్యదుత్తమమ్.

మనుస్మృతి. 2 అధ్యాయ. 130 శ్లోక.

ధన మధికముగ నాకుఁ గలదు. నాతోడ సమానుఁడెవఁడు? నాకెవరితోఁ బనిలేదని గర్వించుట ధనమదమనియు, గొప్పకులమందు జనించితి. గొప్పవారు బంధువులని అహంకరించుట, ఆభిజాత్యమదమనియు, నవమన్మథాకారుఁడ యౌవనవంతుఁడనని విఱ్ఱవీఁగుట రూపమదమనియు, లోకోత్తరశూరుఁడను వీరుఁడ ననుకొనుట బలమదమనియు, ఎల్లఱను శిక్షించు ప్రభుత్వాధికారము గలదనుకొనుట ఐశ్వర్యమద

మనియు, సర్వశాస్త్రములును కళలును విద్యలునుఁ దెలియునని గర్వించుట విద్యామదమనియుఁ జెప్పఁబడును.

శ్లో. యౌవనం ధనసంపత్తిః ప్రభుత్వమవివేకితా,
ఏకైకమప్యనర్థాయ కిము యత్ర చతుష్టయం.

యౌవనము, ధనసంపద, ప్రభుత్వాధికారము, అవివేకిత్వము ఇందొక్కొక్కటియే మహానర్థము కలిగించుచుండఁగ నీనాల్గునుఁ గలిగినపు డింకేమి చెప్పవలయును? ఎలజవ్వనము గలిగియున్నను ధనసంపత్తి లేనపుడు అడవిలోఁ గాచినవెన్నెలవలె వ్యర్థమగును. యౌవనము ధనసంపత్తి యీరెండు నున్నను, దుండగము లొనరించినయెడల ప్రభువులు శిక్షింతురని భీతియుండును. పైరెండును ప్రభుత్వాధికారమును తనకున్నయెడల నిశ్చయముగ నెట్టికృత్యములైన నొనరింపఁదగును. అయితే వివేకి అయినచో నెవరేని హితము సెప్పినయెడల దుష్కృతములనుండి మఱలును. పైమూఁడునుఁ గలిగి తనకుఁ దెలియక యొరులు చెప్పినను వినక మూర్ఖుఁడై, అవివేకమునుఁ బొందినచో, నింకఁ జెప్పవలసిన దేమున్నది? మొదలు వానరము, పిదప మద్యపానముఁ జేయుట, పిమ్మట తేలుకుట్టుట, ఆవల దయ్యముపట్టుట ఎట్లుండునో అట్టుల యీ మదోన్మత్తునిస్థితి యుండును.

ధనమదము మదములలో నధికమైనది.

మదములలోనికెల్ల ధనమదము బుద్ధిని నాశముఁ జేసినట్టుల వయోరూపగుణసత్కుల శౌర్యదానతపోవిద్యాదుల

వలనఁ గలిగినమదము అట్టుల నశింపఁ జేయఁజాలదని శ్రీభాగవతమునఁ జెప్పఁబడెను.

శ్లో. న హ్యన్యో జుషతో జోష్యాన్ బుద్ధిభ్రంశో రజోగుణః,
శ్రీమదాదాఽభిజాత్యాదిర్యత్ర స్త్రీద్యూతమాసవః.
శ్రీభాగవత, తృతీయస్కంధ.

అభిలషిత విషయోపభోగియగు పురుషునకు ధనమదము బుద్ధినాశముఁ గలిగించునట్టుల విద్యాతపోరూపవయోగుణసత్కులాదులవలనఁ గలిగినమదము, అట్టుల నాశముఁ గలిగింపదు. బహుకుటుంబికి చాలినంతధన ముండదు గనుక యితర వ్యసనము లుండవు. శ్రీమదాంధునకుఁ బుష్కలమగు ధన ముండుటంబట్టి స్త్రీలు జూదము, మద్యపానము లోనగు వ్యసనములు మిక్కుట మగుటవలన జ్ఞాననాశము కలుగునని భావము.

శ్లో. జన్మైశ్వర్యశ్రుతశ్రీభిరేధమానమదః పుమాన్,
న చార్హత్యభిధాతుం వై త్వామకించనగోచరమ్.
శ్రీభాగవతం, దశమస్కంధ.

ఉత్తమకులము ప్రభుత్వాధికారము విద్యాధనము వీని వలనఁ గలిగినమదముచే మనుజుఁడు రజోగుణాధికుఁడై, బుద్ధిభ్రంశమును బొంది, దీనులకు అనాథులకు దరిద్రులకు గోచరుండవగు నిన్ను ధ్యానించుటకుఁ గాని, కీర్తించుటకుఁ గాని, యనర్హుండని కుంతీదేవి స్తుతించినది. కాఁబట్టి ఐశ్వర్యమదము ఉత్తమపురుషార్థమునకు ప్రతిబంధక మయినది. శ్రీమదాంధు

నికి దారిద్ర్యమే పరమౌషధమని చెప్పఁబడుటవలన, కండ్లు పొరలుగ్రమ్మి చూపులేనివానికి శస్త్రచికిత్సవలన సుదృష్టి కలిగి నట్టుల, శ్రీమదాంధుఁడును దగ్గరనున్న దీనమిత్రబంధువులనుఁ గనలేక జ్ఞానదృష్టి చెడినపుడు, కాలపురుషుఁడు దారిద్ర్యముచే చికిత్సచేసి దృష్టి నొసఁగినపుడు ఎల్లఱు కనుపింతురు. గర్వ మడఁగినందున నందఱతోఁ గలసిమెలసి సమదృష్టితో నుండును.

శ్లో. శ్రుతివాగ్దృష్టిహరణం లక్ష్మీః కురుతే నరస్య కో దోషః,
గరళసహోదరజాతా తచ్చిత్రం యన్న మారయతి.

నీతిశాస్త్రం.

శ్రీమదాక్రృష్టునకు దగ్గరనుండి చెప్పుచున్నను వినఁబడదు. పలుకవలెననినను నోరురాదు. చూచుచున్ననుఁ గనుపింపదు. ఇది ధనమదమువలనఁ గలిగిన చిత్రమైనవ్యాధి. గరళము సేవించినవానికి వినికి, పలుకు, చూపు నష్టమయినట్టుల గరళసహోదరియగు లక్ష్మిని సేవించినవానికి బధిరత్వ,మూకత్వ, అంధత్వములు కలుగుటయం దాశ్చర్య మేమి? గరళము చంపును, గరళసహోదరిమాత్రము చంపక వ్యాధిపీడితునిఁ గావించును.

వంశపారంపర్యము నైశ్వర్యము ధనసంపద గలవానికిట్టి విపరీతమైనవ్యాధి కలుగదు. కాని, చెడి బ్రదికినవానికి నడుమంతరపు సిరిగలవానికి నీచిత్రమైనరోగము కలుగును.

శ్లో. ఆవృత్య శ్రీమదేనాంధా నన్యోన్యకృతసంవిదః,
స్వైరం హసంతి పార్శ్వస్థా బాలోన్మత్తపిశాచవత్.
ప్రామాణ్యబుద్ధిస్తోత్రేషు దేవతాబుద్ధిరాత్మని,
కీటబుద్ధిర్మనుష్యేషు నూతనాయాః శ్రియః ఫలమ్.
క్షణమాత్రం గ్రహావేశో యామమాత్రం సురామదః.
లక్ష్మీమదస్తు మూర్ఖాణా మాదేహ మనువర్తతే.

శ్రీహరిరాయ జ్ఞానాంకుశము.

ధనమదాంధులు పరస్పరము సాంకేతికముల నేర్పఱచుకొని బాలురవలెను, ఉన్మత్తులవలెను, భూతావిష్టులవలెను, ఒడలు దెలియక బుద్ధిభ్రంశమును బొంది సమీపమునం దున్నవారిని హేళనఁజేయుచు, నవ్వుచు తామే యధికులమని విఱ్ఱవీఁగుచు నిచ్చవచ్చినట్లు సంచరించెదరు. నడుమంతరపు సిరిగలవారిని ఇంద్రుఁడు చంద్రుఁడు కుబేరుఁడు నని స్తుతించునపుడాస్తోత్రములయందు యాథార్థ్యబుద్ధియు, తాము దేవతాంశసంభూతులనియు, మనుష్యులందఱు పురుగులతో సమానులనెడుబుద్ధియు, వారికిఁ గలుగును. ధనమదమునఁ గండ్లుగానక చిన్న పెద్ద మాన్యులు, ఆదరణీయులను బుద్ధిలేక క్రోధలోభాభిభూతులై దుర్వ్యసనములఁ జిక్కి, దుష్కృత్యములచే నశింతురు. పిశాచావేశమువలనఁ గలుగుమత్తత క్షణకాలముండును. మద్యపానమువలనఁ గలుగునది యామమాత్రము నుండునుగాని, ధనమదము మూర్ఖులకు దేహముండుపర్యంత ముండునని భావము.

శ్లో. సోపానాని తిరోహితాని పదవీచ్ఛన్నా జలైర్న్యూతనైః
కాలుష్యం పయసాం నిరీక్ష్య శనకైరుడ్డీయ హంసా గతాః,
శ్రూయంతే న మధువ్రతోత్తమగిరః పద్మాని మగ్నా జలే
భేకానా మివ గర్జితం శ్రుతమహో వృద్ధ్యైవ నష్టం సరః.

నిర్మలజలపూరితమై సోపానశోభితమై హంసమధువ్ర తాదుల కాశ్రయమై విరాజిల్లు సరోవరమున నూతనకలుషిత జలప్రవాహము చేరినంతటఁ సోపానములు మార్గము మునిఁగి పోయి కన్పించుట లేదు. జలకాలుష్యమునుఁ జూచి రాజహం సలు ఎగిరిపోయినవి. పద్మములు మునిఁగినందున మధుపఝుం కారములు వినఁబడుట లేదు. మండూకముల బెకబెకధ్వనులు మాత్రము మిక్కుటముగా వినఁబడుచున్నవి.

క్రొత్తగా కలుషితజలప్రవాహము విపరీతముగ వచ్చి చేరినందున సరోవరమున కీస్థితి సంభవించెననెడు అన్యాపదేశ శ్లోకమునుఁ బరిశీలింపఁగ వంశపారంపర్యముగఁ గలిగిన సంప న్నునిహృదయము సరోవరమును బోలె, మర్యాద నీతి దయ ఉపకృతి శాంతి దాంతులనెడు సోపానములును, న్యాయ మార్గమునుఁ గలిగి, హితోపదేశకులును మహనీయులు నగు రాజహంసల కాశ్రయమై, మధురోక్తులుగల కవిగాయకపౌ రాణికులకు మధువ్రతములవలె నిలయమై యొప్పుచుండ నాక స్మికధనాగమమున వానిహృదయము కలుషితమై మదమునఁ బరుషంపుఁ బల్కులుపలుకుచు, రోషారుణితలోచనుఁడై తీక్ష్ణ

ముగఁ జూచుచు, నహంకారమున నొరుల నగౌరవించుచు, గర్వమున నాప్తమిత్రబంధువులఁ జూడక, యలక్ష్యము సేయు చున్నంత మర్యాద, నీతి, దయ, ఉపకృతి, శాంతిదాంతులనెడు సోపానములు మునిఁగి, న్యాయమార్గము కనుపింపనంత పరమ హంసలగు మహనీయులు ఉపదేష్టలు వీనిని విడనాడిరి. మాన నీయులగు కవిగాయకపౌరాణికులు, కలుషితాత్ముఁ డగువీని కఠినంపుఁబద్ధతి సైపఁజాలక మఱియొకచోటికి వెడలిరి. స్తుతి పాఠకులు, వంచకులు, పాషండులు, మాయికులు, క్రూరులను భేకములు, కలుషితజలపూరితంబగు హ్రదంబుఁ జేరి బెకబెక ధ్వనులచే గర్జించునట్లు, నూతనధనాగమకలుషితహృదయుని శ్రీమదాంధునిఁ జేరి కోలాహలము సేయుచున్నారని తాత్ప ర్యము.

శ్లో. కితవా యం ప్రశంసంతి యం ప్రశంసంతి చారణాః,
బంధక్యో యం ప్రశంసంతి న చ పార్థ స జీవతి.
సాధవో యం ప్రశంసంతి యం ప్రశంసంతి వై ద్విజాః,
రాజానో యం ప్రశంసంతి స పార్థ పురుషోత్తమః.

మహాభారత-శాంతిపర్వము.

జూదరులు, ధూర్తులు, నటులు, వ్యభిచారిణులు ఎవ నినిఁ బొగడుచుందురో వానిజీవితము వ్యర్థమనియు, సాధు వులు, విప్రోత్తములు, రాజులు, ఎవనినిఁ బ్రశంసింతురో వాని జీవితము ధన్యమయినదనియు, పై అన్యాపదేశశ్లోకభావము స్పష్టీకరించుచున్నది. ధనమదమును గూర్చి శ్రీమహాభారత

శాంతిపర్వమున శంపాకగీతము నీ ప్రకారముగఁ జెప్పఁ
బడెను.

శ్లో. ధనవాన్ క్రోధలోభాభ్యామావిష్టో నష్టచేతనః,
తిర్యగీక్షశ్శుష్కముఖః పాపకో భ్రుకుటీముఖః.
నిర్దశన్నధరోష్ఠం చ క్రుద్ధో దారుణభాషితా,
కస్తమిచ్ఛేత్పరిద్రష్టుం దాతుమిచ్ఛతి చేన్మహీం.
శ్రియా హ్యభీక్ష్ణం సంవాసో మోహయత్యవిచక్షణం,
స తస్య చిత్తం హరతి శారదాభ్రమివానిలః.
అథైనం రూపమానశ్చ ధనమానశ్చ విందతి,
అభిజాతోఽస్మి సిద్ధోఽస్మి నాస్మి కేవలమానుషః,
ఇత్యేభిః కారణైస్తస్య త్రిభిశ్చిత్తం ప్రసిచ్యతి.

మహాభారత శాంతిపర్వ. 176 అధ్యాయము.

ధనవంతుఁడు క్రోధలోభావిష్టుఁడై వివేకశూన్యుఁడై యోరచూపులఁ జూచుచు, ముఖమునఁ బ్రసన్నత లేక బొమలుముడివడ పెదవి నొక్కి పటపటఁగొఱుకుచు నోటికివచ్చిన పరుషవాక్యములు పలుకుచుండ, నతఁడు మహీమండలము నిచ్చెద ననినను, వాని మోము నెవఁడు చూచును? గాఢమైనధనము గల శ్రీసంపద యావేశించినంతట రూపమదము ధనమదము గల్గి, నేనొక్క మగు నుత్తమవంశమందు జనించితి, సిద్ధిపొందినవాఁడను, మనుష్యమాత్రుఁడను గాను, నేనింతటిసంభావితుఁడ నను మూఁడు భావములచే చిత్తముచెడి ప్రమత్తుఁడగుచున్నాఁడు.

బాణభట్టమహాకవి కాదంబరియందు శుకనాసమంత్య్రుఁడు చంద్రాపీడున కుపదేశించిన హితోపదేశమున నీవిషయము విపులముగఁ జెప్పఁబడినది.

(అనువాద మిదిగువను, కడపట బాణభట్టకాదంబరీగద్యపఙ్క్తులును. పొందుపఱుపఁబడినవి.)

మదవిషయమున, శుకనాసహితోపదేశము.

యౌవనమదము.

కుమారా! చంద్రాపీడ! సకలశాస్త్రముల నభ్యసించి, యెల్లవిషయములఁ దెలిసికొనిన నీ కించుకయు నుపదేశింప వలసినది లేదు. లోకంబున ఆగర్భశ్రీమత్త్వము, అభినవ యౌవనము, నిరుపమానసౌందర్యము, అమానుషశక్తి యను నవి యనర్థములపరంపర. ఇం దేయొక్కటియున్నను, సర్వానర్థ ములు సంభవించుచుండ, నన్నియు నొక్కచోటఁ గూడియుం డిన నీకేమి చెప్పవలసియుండు? తలఁచుగ యౌవనారంభ మున సంభవించు ననర్థపరంపరల శాస్త్రజ్ఞానంబను జలంబుచేఁ గడుగఁబడి నిర్మలంబైయున్నను బుద్ధి, కాలుష్యము నొందు చున్నది. యౌవనవంతులయొక్క మనంబు అతిచాపలంబై సర్వకాలములయందు విషయోపభోగంబున లగ్నమైయుండు. ఇంద్రియంబులనెడి హరిణంబులను, సంతతమతిదురంతంబయిన ఉపభోగమృగతృష్ణిక సంచలింపఁ జేయుచుండును. నవయౌవ నంబుచేఁ గషాయితాత్మునకైనవానికి సలిలంబులవలె నాస్వాద్య మానంబులగుచున్న విషయసుఖంబులెల్ల మధురతరంబులై కన్పట్టుచుండును. యౌవనవంతులదృష్టి ధావళ్యమును విడువ కయే సరాగంబ యగుచుండును. సుడిగాలి యెండుటాకునుఁ

గొని చేసినట్లు యౌవనసమయంబున రజోభ్రాంతినొందిన ప్రకృతి, పురుషునిఁ దనయిచ్ఛం గొని చేసును. ఉత్పథప్రవర్తకంబు దిఙ్మోహంబువలె విషయాసంగము పురుషుని నశింపఁ జేసెడిని.

"నీవంటివారలే యుపదేశమునకుఁ బాత్రులు." చంద్రకిరణంబులు స్ఫటికమణియందుఁ బ్రతిబింబించునట్టుల ఉపదేశగుణంబులు నిర్మలమగుచిత్తంబున సుఖంబుగఁ బ్రవేశించును గదా ? గురువచనము నిర్మలమయ్యుఁ జెవిసొచ్చినంత నభాగ్యునకు జలమువలె గొప్పచెవిపోటు పుట్టించును. అదియే సచ్ఛీలునకు నధికతరంబైన ముఖశోభ నావహింపఁజేయును. ప్రదోషసమయంబుననుండు నంధకారమును నిశాకరుం డుపశమింపఁ జేయునట్లు మానవులకు యౌవనావస్థయం దుత్పన్నంబయిన యజ్ఞానతిమిరంబును గురూపదేశంబు తొలంగఁజేయును. విషయసుఖంబుల రసాస్వాదన మెఱుంగని నీకిదియే యుపదేశమొంద నర్హంబయినకాలము. కుసుమశరశరప్రహారంబులఁ జిల్లులువడిన చిత్తంబున నుపదేశంబు లగ్నంబుగాక జలంబువోలె గళితమగును. దుస్స్వభావునకు సద్వంశముగాని పాండిత్యముగాని వినయప్రదాయకము కానేరదు. చందనవృక్షమునఁ బొడమినంతనె యగ్ని కాల్పకుండునా ? అవినీతునకు శాస్త్రంబును వినయసాధకము కానోపదు. తాను నశించుటకు హేతువగు నీటిచేతనే బడబాగ్ని అతితీక్ష్ణతరంబై యలరారుచుండును గదా ? గురూపదేశమన మనుజులకు నఖిలమలం

బులఁ గడుగఁజాలినస్నానంబును, ముదిమిలేని వృద్ధత్వంబును, మేదోదోషంబులేని గురుత్వంబును, సువర్ణమున రచింపఁబడని కర్ణాభరణంబును, జ్యోతిస్సులేని ప్రకాశంబును, ఉద్వేగంబు నిడని జాగరణంబును నగును.

విశేషించి రాజుల కుపదేశకు లుండరు. జనులు భయంబున ప్రతిశబ్దంబువలె (తాళమువేయుచు) రాజవచనంబు ననుసరించుచుందురు. ఆరాజులు గర్వంబను బధిరత్వంబుచే (శ్వయథువ్యాధిచే Dropsy) మూసికొనిపోయిన వీనులు గలవా రగుటంజేసి, యుపదేశింపఁబడువచనంబు విననేరరు. ఒకప్పుడు వినిరేని గజనిమీలితంబున నలక్ష్యముచేసి యుపదేశించుగురువుల కుమ్మలికంబు గలిగింతురు. రాజులప్రకృతి అహంకారమను దాహజ్వరంబునం గలిగినమూర్ఛచే నంధీకృతంబయి వివశంబయి యుండుంగదా ? ధనంబులు వృథాభిమానంబను నున్మాదంబు గలిగించుచున్నవి. రాజ్యలక్ష్మి రాజ్యవిషవికారంబను మాంద్యంబు నొసంగును.

కళ్యాణాభినివేశచిత్తుండవైన నీవు లోలుత చపలస్వాంతయైన లక్ష్మినిఁ గనుఁగొనియెదు గాక.

ధన (లక్ష్మీ) మదము.

దేవదానవులు క్షీరసాగరమథనముఁ గావించునప్పు డందు నుండి యీయామె యుత్పన్నమయినది. వెడలునపుడు సహవాసపరిచయవశంబునఁ బారిజాతపల్లవంబులవలన రాగంబును,ఇందు

శకలంబువలన వక్రగుణమును, ఉచ్చైశ్శ్రవంబువలనఁ జాంచల్యమును, కాలకూటంబువలన మోహనశక్తిని, మదిరవలన మదమును, కౌస్తుభమణివలన కాఠిన్యమును నిట్లు విరహవినోదచిహ్నంబులయిన పైఁజెప్పినవానినన్నిటిని గ్రహించెనో యననొప్పును.

లోకంబున నిట్టివస్తువు మఱియొకటి కనుపింపదు. ఏలన ఈలక్ష్మి కష్టంబున లభించియు దుఃఖంబునఁ బరిపాలింపఁబడుచుండు. గట్టిత్రాళ్లం గట్టి కదలకుండ నునిచినను వదలిపోవును వీరభటసహస్రంబు బట్టిన యసిలతాపంజరమున నునిచినను దప్పించుకొనును. మదజలంబువర్షించు కుంజరపుంజంబులచేఁ బాలింపఁబడియుఁ బరుగిడును. పరిచయమును రక్షింపదు. కులముం జూడదు. రూపము నాలోకింపదు. కులక్రమము నను వర్తింపదు. శీలముం గనుఁగొనదు. వైదగ్ధ్యమును గణింపదు. శాస్త్రము నాకర్ణింపదు. ధర్మము ననురోధింపదు. త్యాగము నాదరింపదు. విశేషజ్ఞతను విచారింపదు. ఆచారమును బాలింపదు. సత్యమును దెలిసికొనదు. లక్షణమును బ్రమాణీకరింపదు. సౌదామినీలతికవలెఁ జూచుచుండఁగనే మాయమగుచున్నది (నశించుచున్నది.)

కృతఘ్నురాలును నీచస్వాంతయు నైన యీమె యల్పసత్త్వునున్మత్తునిగాఁ జేయుచున్నది. సరస్వతీపరిగృహీతుఁ డగు జనుని నసూయచేతనో యన నాశ్లేషింపదు. గుణవంతుని నపవిత్రునింబలె స్పృశింపదు. ఉదారసత్త్వుని నమంగళునివలె

బహుమానింపదు. సుజనుని ననిమిత్తునివలెఁ జూడదు. సత్కుల ప్రసూతుని సర్పమువలె నతిక్రమించును. శూరుని కంటకునిం బలెఁ బరిహరించును. దాతను దుస్స్వప్నమునువలె స్మరింపదు. వినీతుని పాతకునింబలె సమీపింపదు. మానవంతుని నున్మత్తు నింబలెఁ జూచి నవ్వుచుండును. తనచారిత్రము నింద్రజాలము నట్లు పరస్పరవిరుద్ధముగఁ గనఁబఱచును. ఎటులన దాహము నారోపించుచు జాడ్యమునుఁ గలిగించును. ఉన్నతినొసంగుచు నీచస్వభావమును బ్రకటించును. జలధినిఁ బొడమియుఁ దృష్ణను బెంపుసేయును. ఈశ్వరత్వమును దాల్చియు నశివప్రకృతిత్వ మును విస్తరింపఁజేయును. బలవృద్ధి నొసంగుచు లాఘవమును గలిగించును. అమృతసహోదరియయ్యుఁ గటువిపాకయు, పురు షోత్తమరతయయ్యు ఖలజనప్రియయునై ధూళివలె స్వచ్ఛ మయినవానిం గలుషచిత్తునిగాఁ జేయును

ఖలజనప్రియయుఁ జపలయు నైన యీలక్ష్మి ప్రకా శించుకొలఁది దీపశిఖవలె కజ్జలమలినంబగు కర్మంబునే మానవు లాచరింతురు. మఱియు నియ్యది తృష్ణయను విషలతకు వారి ధారయు, ఇంద్రియమృగంబులకు వ్యాధగానంబును, సచ్చరి తంబులను చిత్రంబులకు ధూమలేఖయు, మోహంబు పేరి దీర్ఘ నిద్రలకు విభ్రమశయ్యయు, ధనమదపిశాచంబులకు కూట గృహంబును (పాడుకొంప) శాస్త్రదృష్టులకు తిమిరోద్గమం బును, సర్వావినయంబులకు పురస్సరపతాకయు, క్రోధావేశ గ్రాహంబులకు నుత్పత్తినదియు, విషయమద్యములకుఁ బానీ

యశాలయు, భ్రూవికారనాట్యంబులకు సంగీతశాలయు, లోకాపవాదంబులకు నెలవును, కపటనాటకంబులకుఁ బ్రస్తావనయు, కామగజంబునకు కదళికయు, సాధుభావంబునకు వధ్యశాలయు, ధర్మంబను నిందుబింబంబునకు రాహుజిహ్వయు నగును.

ఈసిరితో స్థిరముగఁ గూడియున్న వానిని, దీనిచే మోసపోనివానిని నే నెఱుంగను. ఇయ్యది చిత్తరువున నున్నను చరించును. పుస్తకరూపురాలయ్యు నింద్రజాలమును రచించును. గట్టిగఁ గట్టినను వదలిపోవును. ఇట్టి దురాచారయగు సిరిచే నెట్లో దైవవశంబునఁ బరిగృహీతులై రాజులు పారవశ్యము నొంది సర్వావినయములకు నధిష్ఠాన మగుదురు.

మదోన్మత్తులగు రాజుల ప్రవర్తనలు.

కొందఱు రాజులు మిణుఁగురుల ప్రకాశంబువలె క్షణమాత్రము మనోహరంబులై, మనస్విజనులచే గర్హితములైన సంపదలచే నాశపెట్టఁబడినవారలై, ధనలవలాభంబువలనఁ గలిగిన గర్వంబున జన్మంబును మఱచి, తమంతటివారు పుడమిపై మఱొకరు లేరని తలంచి, అనేకదోషంబులం బెరిఁగిన దుష్టరక్తంబుచేతనన రాగావేశంబుచే బాధింపఁబడుచు, వివిధంబులగు విషయరసంబుల గ్రసింప లోలుపంబులైన పంచేంద్రియములతోఁ గూడినవారయ్యు ననేక సహస్రసంఖ్యలో యనఁ దనరు నింద్రియములతోఁ గూడినవారినిగాఁ దమ్ము

భావించుకొనుచు నత్యంత చపలంబయిన చిత్తంబుచే నాయాస పెట్టఁబడుచు, పారవశ్య మొందుచున్నారు.

మఱియు గ్రహములచే గ్రహింపఁబడినవారివలెను, భూతములచేఁ దిరస్కరింపఁబడినవారివిధంబునను, మంత్రములచే నావేశ పెట్టఁబడినవారి చందమునను, సత్త్వములచేఁ బట్టుకొనఁబడినవారిరీతిని వర్తింతురు. మదనశరంబులచే మర్మంబులఁ గొట్టఁబడినవారివలె ముఖవికారంబులఁ గనంబఱతురు. ధనదాహంబున నుడుకువారివలెఁ బరితపించుచుందురు. గొప్ప దెబ్బలు తినినవారివలెఁ దమయంగంబుల ధరింపఁజాలకుందురు. అధర్మంబున గమనశక్తి దప్పిన కుంటివారివలె నొరులచే నడిపింపఁబడుదురు. మృషావాదంబను విషవిపాకంబునం గలిగిన ముఖరోగంబు గలవారివలె నతికష్టంబుగ మాటాడుదురు. కుసుమరజంబులచే నేడాకుల యరంటులవలె వికారంబులచే సమీపమున నున్నవారలకుఁ దలనొప్పి గలిగింతురు. ఆసన్నమృత్యువులవలె నెదుటనున్న బంధుజనునైనఁ దెలిసికొనఁజాలరు. కాలసర్పదష్టులవలె మహామంత్రములచేనైనఁ దెలివినొందరు. లక్కబొమ్మలవలె నుష్ణమును సహింపరు. అకాలకుసుమంబులవలె మనోహరాకృతులయ్యు లోకవినాశనంబునకు హేతువు లగుదురు. తిమిరరోగగ్రస్తులవలె దూరదృష్టి లేనివారును, చింతింపఁబడియు మహాపాతకంబువలె నుపద్రవంబు నాపాదింతురు. అత్యధికంబైన తృష్ణావిష వేగముచే మూర్ఛితులై సర్వము కనకమయమని భావించెదరు.

ప్రాభవాధికారమదము.

మఱికొందఱు జూదము వినోదమనియు, పరదారాభిగమనము వైదగ్ధ్యమనియు, వేట పరిశ్రమంబనియు, స్వదార పరిత్యాగము వ్యసనరాహిత్యంబనియు, పానము విలాసమనియు, ప్రమత్తత శౌర్యమనియు, గురువచనము లక్ష్యము సేయమి స్వాతంత్ర్యమనియు, భృత్యులజయింపమి సుఖోపసేవ్యత్వమనియు, నృత్యగీతాదులయందును వేశ్యలయందును నాసక్తిఁ గలిగియుండుట రసికతయనియు, గొప్పతప్పుల వినకుండుట మహానుభావత్వమనియు, లోకాపవాదము సహించుటయే తాలిమియనియు, తనకుఁ దోఁచునట్లు నడచుటయే ప్రభుత్వమనియు, దేవావమాన మొనర్చుటయే మహాసత్త్వతయనియు, వందిజనులపొగడ్తయే కీర్తియనియు, చాంచల్యమే ఉత్సాహమనియు, మంచిచెడుగుల వినకుండుటయే నిష్పక్షపాతమనియు, దోషములయందు గుణత్వము నారోపించుచు, లోలోన నవ్వుచు, దుర్బోధ లాచరించుచు, స్వార్థపరులును ధనపిశితంబు గ్రసింప గ్రద్దలును నగుధూర్తులు, అమానుషోచితంబులగు స్తుతులచేఁ దమ్ము వంచించుచుండ విత్తమదంబుచే మత్తుగొనినచిత్తంబున నిశ్చేతను లగుటంజేసి, యట్టులే యని తమయందు వృథాభిమానంబు నారోపించుకొని మర్త్యధర్ములయ్యును దివ్యాంశంబున నవతరించినవారివలెఁ దమ్ము నమానుషులనుగా నూహించుచు, సర్వజనంబున

కును నుపహాస్యత నొందుచుందురు. భృత్యులు నేయు తమపరి హాసమును విని సంతసింతురు. తమయందు మనంబున దేవతాభి మానము వహించి తక్కిన రెండుచేతులు లోన నున్నవానిఁ గా నెంతురు. తమ మూఁడవకన్ను చర్మంబుచేఁ గప్పఁబడియె నని భావింతురు.

దర్శన మొసంగుటయే అత్యంతానుగ్రహమ్ముగ లెక్కింతురు. కంటఁ జూచుటయే యుపకారపక్షంబున స్థాపింతురు. సంభాషణంబును నీవిలో గణింతురు. ఆజ్ఞ నొసంగుటయు వరప్రదానంబుగఁ దలంతురు. స్పర్శంబును పావనంబుగ భావింతురు. మిథ్యామాహాత్మ్యంబునం బరిపూర్ణగర్వులయి దేవతలకుం బ్రణమిల్లరు. విప్రుల గారవింపరు. మాన్యుల సన్మానింపరు. పూజ్యులం బూజింపరు. పెద్దల కభివాదనము నేయరు. గురువుల కభ్యుత్థానము సల్పరు. నిరర్థకమగు నాయాసంబున విషయోపభోగంబు నెఱుంగరైరని పండితులఁ బరిహసింతురు. ముదిమినగు పారవశ్యమునఁ బ్రలపింతురని వృద్ధజనోపదేశంబు నాకర్ణింపరు. తమప్రజ్ఞకుఁ బరిభవంబని యెంచి సచివోపదేశంబు గ్రహింపరు. హితవాదినిఁ గోపింతురు. మఱియెవ్వఁడేని సకలకృత్యంబుల విడిచి దోయిలిఁబట్టుకొని రేయింబవలు దేవతంబలె స్తుతిచేయునో, మాహాత్మ్యంబుఁ జాటునో (ఆత్మేచ్ఛానుగుణముగ హితవాది యగునో) వాని నెల్లప్పుడు నభినందించెదరు. వానితోడనే సంభాషింతురు. వానిని బార్శ్వమం దిడుకొనియెదరు. వానితోఁగూడి సుఖముగా మెలంగె

దరు. అతఁడే ప్రియమిత్రుఁడని భావించి యాతనికి విత్త మొసంగెదరు. వానిపలుకు నాలకింతురు. వానిం బహూకరి నింతురు. పరమాప్తునిగా భావింతురు. అభిచారక్రియలచేఁ గ్రూరప్రకృతులగు పురోహితులు గురువులు, పరోచ్ఛేదకర్త లగుమంత్రు లుపదేశకులు. పెక్కురాజు లనుభవించి విడిచిన లక్ష్మియం దాసక్తి. మారణరూపములగు శాస్త్రములయందు నభిమానము. సహజప్రేమార్ద్రహృదయులగు తోఁబుట్టువులు నిర్మూలము సేయఁదగినవారు. కుటిలములగు నిట్టి కష్టచేష్ట లచే దారుణమగు రాజ్యతంత్రమునందును, మహామోహాంధ కారకంబగు యౌవనమందును, కుమార! నీవెట్లు ప్రవర్తించె దవో? ఎట్లు జనులచే నుపహాసింపఁబడవో, గురువులచే ధిక్కరింపఁబడవో, సాధువులచే నిందింపఁబడవో, మిత్రులచే నుపాలంభింపఁబడవో, పండితులచే శోచింపఁబడవో, మఱి యెట్లు విటులచే మోసపుచ్చఁబడవో, కుశలులచేఁ బరిహా సింపఁబడవో, ధూర్తులచే వంచింపఁబడవో, వనితలచేఁ బ్రలో భింపఁబడవో, సంపదచే గర్వింపఁబడవో, మదముచే నర్తింపఁ బడవో, మదనునిచే నున్మత్తీకరింపఁబడవో, విషయములచే నాకర్షింపఁబడవో, అట్లు ప్రవర్తింపవలయు. నీవు స్వభావంబు ననే ధీరుండవు. తండ్రిచే మహాప్రయత్నంబున సంస్కరింపఁ బడితివి. ధనంబులు వివేకహీనుండగు చపలచిత్తుని మత్తునిఁ గావించుఁగాని, నినుబోఁటివానిం జేయంజాలవు. అయినను నీగుణములయందగు సంతోషము నన్నిట్లు పలికించెను. దుర్వి

నీతయగు, నీలక్ష్మి విద్వాంసునైనను సచేతనునైన మహాత్ము నైన నభిజాతునైన ధీరునైన ప్రయత్నవంతునైన నీచునిఁ గావించును." అని నీకుఁ బలుమాఱుఁ జెప్పుచున్నాఁడ. కుల క్రమాగతమై పూర్వపురుషులచే వహింపఁబడిన భూభారము వహించి శత్రువుల జయించి, కీర్తిప్రతాపముల వ్యాపింపఁ జేసి, సర్వజనరంజకముగ న్యాయమార్గంబునఁ బాలింపుము.

"తాత చంద్రాపీడ ! విదితవేదితవ్యస్యాప్యధీతసర్వశాస్త్రస్య తే నాల్ప మప్యుపదేష్టవ్యమస్తి. కేవలం చ నిసర్గత ఏవాఽభానుభేద్యమప్రదీపప్రభాపనేయమతిగహనం తమో యౌవనప్రభవం. అపరిణామోపశమో దారుణో లక్ష్మీమదః. కష్టమనంజనవర్తిసాధ్యమపర మైశ్వర్యతిమిరాన్ధత్వ మిత్యతో విస్తరేణాఽభిధీయసే. గర్భేశ్వరత్వ మభినవయౌవనత్వ మప్రతిమరూపత్వ మమానుషశక్తిత్వం చేతి మహతీయం ఖల్వనర్థపరంపరా. సర్వావినయానామే కైకమప్యేషామాయతనం, కిముత సమవాయః, యౌవనారమ్భే చ ప్రాయః శాస్త్రజలప్రక్షాళననిర్మలాఽపి కాలుష్యముపయాతి బుద్ధిః. అపహరతి చ వాత్యేవ శుష్కపత్త్రం సముద్భూతరజోభ్రాన్తి రతిదూరమాత్మేచ్ఛయా యౌవనసమయే పురుషం ప్రకృతిః, నాశయతి చ దిఙ్మోహ ఇవోన్మార్గప్రవర్తకః పురుషమత్యాసంగో విషయేషు; భవాదృశా ఏవ భవన్తి భాజనాన్యుపదేశానాం, అపగతమలేహి మనసి స్ఫటికమణావివ రజనికరగభస్తయో విశన్తి సుఖముపదేశగుణాః. గురువచనమమలమపి సలిలమివ మహదుపజనయతి శ్రవణస్థితం శూలమభవ్యస్య. ఇతరస్య తు కరిణ ఇవ శంఖాభరణమాననశోభాసముదయమధికతరముపజనయతి; హరతి చ సకలమతిమలినమప్యన్ధకార మివ దోషజాతం ప్రదోషసమయనిశాకర ఇవ గురూపదేశః. అయమేవ చానాస్వాదితవిషయరసస్య తే కాల ఉపదేశస్య; కుసుమశర శరప్రహారజర్జ

రితే హి హృదయే జలమివ గళత్యుపదిష్టం. అకారణం చ భవతి దుష్ప్ర
కృతేరన్వయశ్శ్రుతం వా వినయస్య. చందనప్రభవో న దహతి కిమనలః?
కిం వా ప్రశమహేతునాఽపి న ప్రచండతరీ భవతి బడబానలో వారిణా,
గురూపదేశశ్చ నామ పురుషాణామఖిలమలప్రక్షాళనక్షమమజలం స్నానం;
అనుపజాత పలితాది వైరూప్య మజరం వృద్ధత్వం, అసువర్ణ విరచన మగ్రామ్యం
కర్ణాభరణం, విశేషేణ తు రాజ్ఞాం; విరళా హి తేషాముపదేష్టారః. ప్రతిశ
బ్దక ఇవ రాజవచనమనుగచ్ఛతి జనో భయాత్; ఉద్దామదర్పశ్వయథుస్థగిత
శ్రవణవివరాశ్చోపదిశ్యమానమపి తే న శృణ్వంతి, శృణ్వంతోఽపి చ గజ
నిమీలితేనావధీరయంతః ఖేదయంతి హితోపదేశదాయినో గురూన్, అహం
కారదాహజ్వరమూర్ఛాంధకారితా విహ్వలా హి రాజప్రకృతిః.—

ఆలోకయతు తావత్కల్యాణాభినివేశీ లక్ష్మీమేవ ప్రథమం; ఇయం హి లక్ష్మీః; క్షీరసాగరాత్, ఇందుశకలాదేకాంతవక్రతాం, ఉచ్చైశ్శ్రవసశ్చంచలతాం, కాలకూటాన్మోహనశక్తిం, మదిరాయా మదం, కౌస్తుభమణేరతినైష్ఠుర్యం, ఇత్యేతాని సహవాసపరిచయవశాద్విరహవినోదచిహ్నాని గృహీత్వైవోద్గతా; న హ్యేవంవిధమపరమపరిచితమిహ జగతి కించిదస్తి యథేయమనార్యా; లబ్ధాపి ఖలు దుఃఖేన పరిపాల్యతే దృఢగుణపాశసందాననిష్పందీకృతాఽపి నశ్యతి; న పరిచయం రక్షతి. నాఽభిజనమీక్షతే, న కులక్రమ మనువర్తతే, న శీలం పశ్యతి, న శ్రుతమాకర్ణయతి; న ధర్మమనురుధ్యతే; న త్యాగమాద్రియతే; న విశేషజ్ఞతాం విచారయతి; గంధర్వనగరలేఖేవ పశ్యత ఏవ నశ్యతి; అద్యాప్యారూఢ మందరపరివర్త భ్రాంతిజనితసంస్కారేవ పరిభ్రమతి; పారుష్యమేవోపశిక్షితుమసిధారాసు నివసతి; దివసకరగతిరివ ప్రకటితవివిధసంక్రాంతిః; పాతాళగుహేవతమోబహుళా; ప్రావృడివాచిరద్యుతికారిణీ,స్వల్పసత్త్వమున్మత్తీకరోతి; సరస్వతీపరిగృహీతమీర్ష్యయేవ నాఽలింగతి జనం; గుణవంతమపవిత్రమివ న స్పృశతి; ఉదారసత్త్వ

మమంగళమివ న బహుమన్యతే; సుజనమనిమిత్తమివ న పశ్యతి; అభిజాత మహిమివ లంఘయతి. శూరం కంటకమివ పరిహరతి; దాతారం దుఃస్వప్న మివ న స్మరతి; వినీతం పాతకినమివ నో౽పసర్పతి; మనస్విన మున్మత్తమివోప హసతి.—

యథా యథా చేయం చపలా దీప్యతే తథా తథా దీపశిఖేవ కజ్జల మలినమేవ కర్మ కేవలముద్వమతి; తథాహి; ఇయం సంవర్ధనవారిధారా తృష్ణావిషవల్లీనాం; వ్యాధగీతిరింద్రియమృగాణాం; పరామర్శధూమలేఖా సచ్చరితచిత్రాణాం, విభ్రమశయ్యా మోహదీర్ఘనిద్రాణాం; ఆవాసదరీ దోషాశీవిషాణాం; అకాలప్రావృడ్గుణకలహంసకానాం; ప్రస్తావనా కపటనాటకస్య రాహుజిహ్వా ధర్మేందుమండలస్య.—

న హి తం పశ్యామి యో హ్యపరిచితయా౽నయా న నిర్భరముపగూఢః; యో వా న విప్రలబ్ధః. నియత మియమాలేఖ్యగతా౽పి చలతి; శ్రుతాప్యభిసంధత్తే, చింతితా౽పి వంచయతి; ఏవంవిధయా౽పి చానయా దురాచారయా కథమపి దైవవశేన పరిగృహీతా విక్లబా భవంతి రాజానః.

కేచిద్ధనలవలాభావలేపవిస్మృతజన్మానో వివిధవిషయగ్రాసలాలసైః పంచభిరప్యనేకసహస్రసంఖ్యైరివేంద్రియైరాయాస్యమానాః, ప్రకృతిచంచలతయా లబ్ధప్రసరేణైకేనాపి శతసహస్రతామివోపగతేన మనసా౽కులీక్రియమాణా విహ్వలతాముపయాంతి. ధనోష్మణా పచ్యమానా ఇవ విచేష్టంతే; గాఢప్రహారాహతా ఇవాంగాని న ధారయంతి; కుళీరా ఇవ తిర్యక్పరిభ్రమంతి; అధర్మభగ్నగతయః పంగవ ఇవ పరేణ సంచార్యంతే; మృషావాదవిపాక సంజాతముఖరోగా ఇవా౽తికృచ్ఛ్రేణ జల్పంతి ఆసన్నమృత్యవ ఇవ బంధుజనమపి నా౽భిజానంతి; ఉత్కుపితలోచనా ఇవ తేజస్వినో నేక్షంతే; కాలదష్టా ఇవ మహామంత్రైరపి న ప్రతిబుధ్యన్తే; తృష్ణావిషమూర్ఛితాః కనకమయమివ సర్వం పశ్యంతి.—

కింవా తేషాం సాంప్రతం యేషామతినృశంసప్రాయోపదేశనిర్ఘృణం కౌటిల్యశాస్త్రం ప్రమాణం; అభిచారక్రియాక్రూరైకప్రకృతయః పురోధసో గురవః, పరాభిసంధానపరా మంత్రిణ ఉపదేష్టారః, సహజప్రేమార్ద్రహృదయానురక్తా భ్రాతర ఉచ్ఛేద్యాః.—

తదేవంప్రాయే ఽతికుటిలకష్టచేష్టాసహస్రదారుణే రాజ్యతంత్రే ఽస్మిన్ మహామోహకారిణి చ యౌవనే కుమార! తథా ప్రయతేథాః, యథా నోఽపహస్యసే జనైః, న నింద్యసే సాధుభిః, న ధిక్క్రియసే గురుభిః, నోపాలభ్యసే సుహృద్భిః; న శోచ్యసే విద్వద్భిః, యథా చ న ప్రహస్యసే విటైః, న ప్రతార్యసే కుశలైర్నాఽవలుప్యసే సేవకవృకైః, న ప్రలోభ్యసే వనితాభిః, నాపహ్రియసే సుఖేన; కామం భవాన్ ప్రకృత్యైవ ధీరః, పిత్రా చ మహతా ప్రయత్నేన సమారోపితసంస్కారః; తరళహృదయమప్రతిబుద్ధం చ మదయంతి ధనాని; తథాపి భవద్గుణసంతోషో మామేవం ముఖరీకృతవాన్; ఇదమేవ చ పునఃపునరభిధీయసే; విద్వాంసమపి సచేతనమపి మహాసత్త్వమప్యభిజాతమపి ధీరమపి ప్రయత్నవంతమపి పురుషమియం దుర్వినీతా ఖలీకరోతి లక్ష్మీరితి.

సర్వథా కల్యాణైః పిత్రా క్రియమాణమనుభవతు భవాన్ యౌవరాజ్యాభిషేకమంగళం; కులక్రమాగతాముద్వహపూర్వపురుషైరూఢాం ధురం; అవనమయ ద్విషతాం శిరాంసి, ఉన్నమయ బంధువర్గం; అభిషేకానంతరం చ ప్రారబ్ధదిగ్విజయః పరిభ్రమన్విజితామపి తవ పిత్రా సప్తద్వీపభూషణాం పునర్విజయస్వ వసుంధరాం; అయం చ తే కాలః ప్రతాపమారోపయితుం; ఆరూఢప్రతాపో హి రాజా త్రైలోక్యదర్శీవ సిద్ధాదేశో భవతి.''— ఇత్యేతావదభిధాయోపశశామ.''

(బాణభట్టకాదంబరి. ప్రథమభాగః.)

పైనిఁ జెప్పఁబడిన శుకనాసనీతియందు యౌవన ధన ఐశ్వర్యమదములఁ గూర్చి వివరింపఁబడెను. క్షేమేంద్రమహాకవి కృత కళావిలాసమందును మదమునుఁగూర్చి విశదముగఁ జెప్పఁబడెను.

మదమనఁగా గర్వము. ఇది రూప-యౌవన-లావణ్య-కుల-ధన-విద్యా-విభవైశ్వర్యములచేఁ గలుగునని యిదివఱలోఁ జెప్పఁబడెను. ఉత్తముల నాశ్రయించునది మానమనియు, నీచుల నాశ్రయించునది గర్వమనియుఁ దెలియఁదగును.

శ్లో. గర్వో నామ కులైశ్వర్యరూపవిద్యాబలాదిభిః,
ఇష్టార్థవిషయప్రాప్తేర్నీచగోచరతాం గతః.

"ఇత్యాచార్యదండీ"

మానస్థానీయములగు ధనము, కులము, విద్య, రూపము, ఐశ్వర్యము, వీనినిఁ బొంది గర్వింపకుండుటచేఁ బూజ్యత కలుగును మానధనులగు మహనీయులు తమ విద్యాధనవిభవాదులను లోకోపకృతికై వినియోగించి మాన్యులగుచున్నవారలు. అధములు ధన కుల రూపైశ్వర్యాదులచే గర్వించి, స్వార్థపరులై పరులను దృణీకరించుటచే తాము గర్హ్యులగుచున్నవారు. మానవిషయమును వివరించునపుడు తత్ప్రకరణమున వివిధభేదములు విశదీకరింపఁబడును.

గర్వరూపమగు మదము, కుల ధన రూప యౌవన శృంగార కామ లావణ్య విభవ శౌర్య అధికార తప శ్రుత భక్తి శౌచము లను భేదములచే (14) పలుతెఱంగులు.

1. కులమదము.

తమయింటి తొల్లింటి పెద్దలగాథలు చెప్పుటలో నితరులనుఁ దన్నుఁగూడ మఱచిపోవునట్లు చేసి, అజ్ఞానులం గావించునది కులమదము. పుట్టుపూర్వోత్తరములఁ బరికించితి మేని, యొక్కొక్క కులమూలమును పద్మమూలంబుపగిది దోసపుటడుసుతోఁ గూడినదిగనే కనఁబడును. మంచిగుజ్జము నకువలె మంచినడవడిక గలవానికిని కులముపట్టుదల అక్కఱ మాలినపని. యోగ్యుఁడైనతండ్రికిఁ గొఱమాలిన కొడుకు పుట్టుటయు తఱుచుగఁ గలదు. ఒక్కవంశముననే తాతలు విద్యలుఁ జదివి, పెక్కుయజ్ఞము లొనరించి, మిక్కిలి పేరు మోసియుండ మనుమఁడు విద్యావిహీనుఁడై దుర్గుణములుఁ గలిగి నీచకృత్యము లొనర్చి జీవితముఁ గడుపుచుండుటయుఁ గలదు. అట్లయిన నాకులము మరియాద యేరినిఁ బట్టియుండఁ దగునో చక్కఁగ యోజించితిమేని, గుణగౌరవముచేతనే కుల గౌరవమునుఁ బ్రకాశించునని స్పష్టమయ్యెడి. మంచికులమునఁ బుట్టియు, అప్రయోజకుఁడు పొగడికకు దూరుఁడే యగును. సద్గుణసంపత్తియు యోగ్యతయు లేక గొప్పకులమునందు జనించితినని విఱ్ఱవీగుట వెఱ్ఱితనము. ఎటుచూచినను కులోన్నతి గుణాధిక్యతనుబట్టి యుండును గాన కులమదము నుజ్జగించి నడవడిఁ జక్కఁబఱచుకొనుట యెల్లఱకు శ్రేయోమార్గమై యొప్పు.

సత్కులీనులు, సద్వంశజులు, ఒరులయెడ గౌరవము, ప్రీతి, మర్యాద, ఔదార్యముఁ జూపినయెడల వారి పెద్దల గుణములు వీరియందుఁ గలవని జనులు సత్కులీనతాగౌరవమును మర్యాదనుఁ జూపుదురు. అట్లుగాక తామే కులోన్నతిఁ గలవారమని సద్వంశజులమని విఱ్ఱవీగి సాధువులను మాన్యులనుఁ దృణీకరించి, యుక్తాయుక్తవివేకశూన్యులై ప్రవర్తించిరేని యొకానొకప్పుడు భంగపాటు నొందెదరు.

యాథార్థ్య మెఱుకపడనికులమునందును కంటికింగపడుచునే మాయమగు కనకమందును, క్రయవిక్రయరూపమగు విద్యయందును, కాలకబళమగు రూపమునందును, అభిమానముంచుట వెఱ్ఱితనము. పూర్వమొకప్పుడు తేజోనిధియను భూసురుఁడు ఆభిజాత్యగర్వంబునను పాండిత్యమదంబునను నొరుల లక్ష్యపెట్టక తానేమి యొనర్చినను జెల్లునని సదశ్వంబు లుండినను వాని నారోహింపక గార్దభంబునెక్కి మిత్రునింటజరుగు వివాహమునకుఁ బోవుచు మార్గమధ్యమున నడువలేక యీడిగలఁబడిన యాఖరమును, కశాఘాతముల నెత్తురుపరదలు గలుగునట్లు మోదుచుండ జితేంద్రియుఁడు సమదర్శియు దయామయుఁడు నగు నొకయోగీశ్వరుఁడు వాని చెయిదములఁ జూచి యోయీ! సదశ్వంబులుండ లోకశాస్త్రవిరుద్ధంబగు గార్దభంబు నెక్కి మీఁదుమిక్కిలి యించుకేని దయారసములేక నెత్తురు వారలగునట్లు మోదుచుంటివి? భూతదయ వలదా? సత్కులీనుఁడవగు నీకిది పాడియా?

[illegible] వేశించునుగాఁడ హాని [illegible] గినిసి దురాలాపం
[illegible] నగు [illegible]
[illegible] కౌటిల్యము కలిగెఁ
[illegible] నిధి గృహంబు
[illegible] బ్రణతి
[illegible] "[illegible]! మాతృ
[illegible]! [illegible] లనేకములుండు
[illegible]" [illegible] బడసి
[illegible] సలుప
[illegible]! [illegible]
[illegible]? [illegible] మగు
[illegible] సుమా! యని
[illegible] నిరుప
[illegible] ఈ మదమాది
[illegible] గులమనఁ
[illegible].

2. ధనమదము.

[illegible] ధనము
[illegible] నాతోడ సముఁ
[illegible]. ఈగర్వముచే
[illegible] మన్నిఁగాక లోభ్యముచే

త్యాగశీలత లేక, పరులఁ బీడించుచు మహాపాపగర్తము లోఁబడును. కొఱఁత గ్రుచ్చినవానివలెను వాతస్తబ్ధునియట్టుల భూతావిష్టునిపోలికను ప్రథమజ్వరసన్నిపాతునిరీతిని కండ్లు కనఁబడక చెవులు వినఁబడక నోటమాటరాక పరప్రేరితుఁడై కృత్యములొనరించుచు శ్రీమదాంధుం డుండును. విద్యుల్లతికవలె నతిచంచలమగు ధనసంపత్తినిఁ జూచుకొని విఱ్ఱవీగు మూఢునికన్న లోకమం దవివేకి మఱియొకఁ డుండఁడు. ఎందఱు మహాధనసంపన్నులు మనము జూచుచుండఁగనే సంపత్తినిఁ గోల్పోయి దరిద్రులయిరి. మనమనఁగ నెంతయని లోకవృత్తమును గాంచుచు, నుచితరీతిని ధనము నుపయోగించి, యెల్లఱకు ననుకూలుఁడై మెలంగవలె నటుగాక గర్వితుఁడైనచో భంగపాటుఁ జెందును. అచేతనములగు మహీరుహములు సయితము ఫలభారవినమ్రములై తమవిభవము నొరులకొసంగుచున్నట్టుల ప్రకృతివైచిత్ర్యము నుపలక్షించి దురభిమానమును విడిచి యొరుల కుపకరించుచు గర్వమునుఁ బోనడఁచవలయు.

శ్రీమదాంధ్యము శుకనాసనీతియందును, ఈమదప్రకరణాదియందును విస్తరముగ వివరింపఁబడినందున నిచట దిఙ్మాత్రముగ సూచితము. ధనమదమునే శ్రీమదాంధ్యమని శ్రీభాగవతాదిగ్రంథములందు మణిగ్రీవ నళకూబరుల శాపకారణము నందుఁ జెప్పఁబడియె.

3. రూపమదము.

నేనే రూపవంతుఁడను, సౌందర్యవంతుఁడనని తన చెక్కుఁదనమును అద్దములోఁ జూచుకొని మురియుచుండుట రూపమద మనఁబడును. తామరము వేఁకువన మొగ్గగనుండి, ఉదయమున వికసించి సొబగుగఁ గన్పించి సాయంకాలము పయ్యెరగాలిచే దళములు వీడి, రూపము చెడినట్లు ఎలజవ్వాన మున రూప మందముగనుండి కాలక్రమమున తగ్గి ముసలితన మున మార్పుఁజెందును. క్షణభంగురమగు నీరూపముచే గర్వించి కురూపులను వికలాంగుల నపహసించుట బుద్ధిమంతున కుచితము గాదు. ఒరుల నపహసించిన సురూపియు, నొకప్పుడు దైవికమునఁ బతనముఁ జెందియు ఘాతలవలనను స్ఫోటకాదుల వలనను సొబగగు రూపముచెడి విరూపియై తనను తానే నిందించుకొనును. కాలవశమున నంతయు మార్పుఁజెందు చుండ నస్థిరమగు దీనినాశ్రయించి లోకానుభవముగల ప్రాజ్ఞుఁ డెవఁడు గర్వించును? రూపవంతులు నిక్కుచు నీల్గుచు మురి యుచు కులుకుచు నొరులు తమ్ముఁ బ్రశంసించుకొలఁదిని గర్వించుచుందురు. ఇది యనర్థమునకు మూలము. రూపము చెడకుండ, సొగసుగనుండుటకుఁ గొందఱు కొన్ని సాధన ద్రవ్యముల నుపయోగింతురు కాని, పాంచభౌతికవికారము లగుటచే కొలఁదికాలములోపలనే మార్పుఁజెందును. జన్మాం తరసుకృతవిశేషమువలన నీశ్వరవిభూతియగు నీసురూపము లభించినదని భావించి, గర్వించక ధర్మపరుఁడై స్వధర్మముల

నిర్వర్తించుచుం, తత్త్వజ్ఞుఁ డయ్యె నేని ధన్యుఁ డగును. ర
వంతుండయ్యు, విద్యావివేకజ్ఞానశూన్యుండై సభామధ్యవ
నిర్గంధకుసుమంబువలెఁ బ్రకాశించుచుం, నిష్ప్రయోజకుం డ
ను. మాన్యులగు మహనీయులకు విద్యయే రూపము.
రూపమెన్నఁడును మార్పుఁజెందక విజ్ఞానదీపముచేఁ బ్ర
శించుచుండును.

4. యౌవనమదము.

మనుజుల చతుర్విధావస్థలయందు యౌవనమే మిగు
సుఖకరము. అయ్యది పడుచుఁదనపుఁజేష్టల నష్టమయి రో
ముల కాకర మయ్యెనేని సౌందర్యమున కింక చోటెక్కడ
యౌవనమున సౌందర్యము శోభిలుచుండును. యౌవనమద
బున కృత్యాకృత్యంబు లరయక, యధర్మపరుఁడై నీతిమాలి
పను లొనరించిన రోగములచే బాధపడుచుఁ జింతాసాగ
మగ్నుఁడై నిద్రాహారములు లేక క్షీణించి, కొలఁదికాలమ
లోనే నష్టముఁ జెందును. యౌవనమదం బుత్కటంబుగనున్న
తఱి, హితులవాక్యములు వినఁబడవు. చిన్నలు పెద్దలు హితుల
అహితులు ఎవరైనది కనఁబడదు. ఇంద్రియలోలుఁడై విషయ
లంపటుఁడై దేహేంద్రియపాటవమునుఁ బోఁగొట్టుకొని
కురంగ మాతంగ పతంగ మీన భృంగములవలె నష్టముఁ
జెందును. బ్రహ్మచర్యమువలన యౌవనము రక్షితమగును.
విషయారణ్యములయందు విచ్చలవిడిగఁ దిరుగు యౌవన

మత్తేభమును వృద్ధశుశ్రూష సత్సహవాస బ్రహ్మచర్యవ్రత విద్యాభ్యాసములను నిశితాంకుశముచే నణఁచి స్వాధీనమం దుంచుకొని ధర్మపరుఁడై పురుషార్థమున కుపయోగింపవలెను. విద్యుల్లతికవలెను ఝురీవేగంబుమాడ్కి నుండి యచిరకాలం బుననే మార్పుఁజెందు యౌవనము నాశ్రయించి, వివేకి మత్తుఁ డు కాకుండవలయును. అవస్థాధర్మమున నిదియు వచ్చి కొంత కాల ముండిపోవును. కావున నస్థిరమగు దీనినమ్మి పురుషార్థ భ్రష్టుఁడు కాకుండునట్టుల మెలంగవలయు. యౌవనమద మునుగూర్చి శుకనాసహితోపదేశమున వివరింపఁబడినది కావున నిట దిఙ్మాత్రసూచితము.

5. శృంగారమదము.

యౌవనవికారజన్యములగు హావ భావ విలాస కిలికిం చిత స్మేరాదులను శృంగారచేష్టలచే గర్వించి యొరుల లక్ష్య పెట్టక స్వేచ్ఛావిహారణము శృంగారమద మనఁబడు. భూష ణాంబరకుసుమాదులచే శృంగారించుకొని, కులుకుచు నతివేల ముగ గర్వించుట, శ్రేయస్కాములకు నుచితము కాదు. శృం గారమున కధిష్ఠానదైవము విష్ణువు. తద్దేవతాకమగు శృంగా రము నర్హసమయములందు ఉచితరీతిగ నుపయోగించిన శ్లాఘ్య మగును. లేనిచో గర్హ్యమగును. తనశృంగారము నితరుల కన్న శ్రేష్ఠమని విఱ్ఱవీగు నున్మత్తున కెన్నటికేని పతనము కలు గును. రసస్వరూపియగు పరమేశ్వరుని శృంగారించికాని, తద

ర్థము శృంగారించికొని కాని, [illegible]
పక మెలఁగువాఁడు పతితుఁడు [illegible].

6. కామమదము.

స్త్రీలవంకఁ జూచుచు, [illegible]
ఇంద్రియనిగ్రహము లేక [illegible]
బడును. కామబాణవిద్ధుఁడు [illegible]
ము, కళాకౌశలము [illegible]
గాని పిమ్మట [illegible]
వలె నాడించినట్లు ఆడుచు [illegible]
మదమత్తుఁడు [illegible]
లేక వివేకశూన్యు [illegible]
దులవలె వాతుఁ డగును. [illegible]
మున విస్తరింపఁబడెను [illegible].

7. లావణ్యమదము.

తనచక్కఁదనమును [illegible]
మాత్రము లేదని గర్వించుట [illegible]
యేటిప్రవాహమువలెను [illegible]
కాదు. జలబుద్బుదమునుబోలు [illegible]
గర్వించువాఁడు నష్టముఁ జెందును. [illegible]
యొద విస్తరించి చెప్పఁబడెను. కావున [illegible].

8. శౌర్యమదము.

శత్రు[illegible] వాని కన్న నవారిలో నేనే యగ్ర
గణ్యుడను. [illegible] వగినధీరుడు నాకంటె మఱి
[illegible] భుజబలమున నీజగంబున నాకన్న మించిన
[illegible] బలముఁ గలవారికెల్లఱ
[illegible] తనయందుఁ జేరిన శరణాగతు
[illegible] బలమే శౌర్య మని
[illegible] దీనులమీఁదికి గర్వించి
[illegible] శుబల మనిపించుకొనును.
[illegible] జూచి భయపడినట్లు
[illegible] శౌర్యమత్తునిఁ జూచి
[illegible] తుల శౌర్యమదము అంత
[illegible] చేఁబడును. శ్లో. "బలం
[illegible] శౌర్యబలము నాదే
[illegible] యీదేహబలము
[illegible] లభించినది! పరోపకారా
[illegible] నుపయోగింపవలసినది
[illegible] యోగింపరాదని యోగ్యుఁడు
[illegible] గర్వించెనేని గర్వ
[illegible]

ముజ్జగముల నేకచ్ఛత్రాధిపత్యముగ నేలిన కార్తవీర్యుని శౌర్యమదము జామదగ్న్యునిచే నడచఁబడియె. ఇరువది యొక్కమాఱులు మదోన్మత్తులగు క్షత్రియుల గర్వమణఁచిన పరశురామునిశౌర్యబలము రఘురామునిచే నణఁచఁబడియె. లోకములన్నింట తనకన్న మించిన శూరుఁడు లేఁడని గర్వించిన రావణుని వాలి తనచేంక నిఱికించుకొని గర్వము పోఁగొట్టెను. అట్టి వాలిశౌర్యము శ్రీరామచంద్రునిచే నణఁచఁబడియె. కాఁబట్టి లోకమున తమకన్న మించిన మహాశూరులు లేరని గర్వించినవారలే యిట్లగుచుండ మన మెంతటివారమని గర్వించక తమశౌర్యమును ధార్మికవిషయములందును, శరణాగతులయెడ నుపయోగింపవలయును. ఒకప్పుడు లోకము నంతయు జయించి శత్రువుల పలాయితులఁ గావించిన శూరాగ్రేసరులే మఱియొకప్పుడు దైవబలము లేక యోడిపోయి పరుగిడుదురు. ఈశౌర్యబలమునుఁ జూచుకొని విఱ్ఱవీఁగఁ గూడదు. తమకు దేహబలము కలదు కదా ? ఇతరులు తమపైకి వచ్చిన నలుపుదుమని నోటి దుడుకుతనమున వదరుచుందురు. ఇట్టి బలమత్తులగు వదరుఁబోతులు శిశుపాలునివలె నుపహతు లగుదురు. పూర్వము దంభోద్భవుఁడను శూరాగ్రేసరుఁడగు రాజోత్తముండు లోకమునంతయు జయించి గర్వించి ప్రతివారిని కయ్యమునకు రమ్మని కాలుఁద్రవ్వుచుండ బదరికా

[illegible] జూపిరి. అందు నరముని [illegible] విని గర్వించి తనమీఁదికివచ్చు [illegible] గర్వమణఁచి పంపెను. [illegible] దెలిసికొని వినయ [illegible] గర్వముఁ జెందక పరోపకృతికై [illegible].

9. అధికారమదము.

[illegible], వీరినందఱిని తన అధికార [illegible] మేటి కలదో, అయ్యది అధి [illegible] ధనశౌర్యమదమత్తులెల్లను [illegible] లోఁబడుదురు. ఎప్పుడును [illegible], [illegible]గా మోటుమాటలాడుచు, [illegible] చేయుచు, అధర్మమార్గమున [illegible]. వీనికిఁ గనులున్నను గన్పిం [illegible]. నోరున్నను పలుకఁజాలఁడు. [illegible] నుండును. కాళులున్నను నడవఁజాలక [illegible] జీవచ్ఛవములవలె మోసికొని [illegible] గర్వపూరితుఁడు జననిందితుఁ [illegible] కాదనియు, ఈశ్వరాను [illegible] దెలిసికొని తనకన్న తక్కువ [illegible] గలిగి స్వధర్మమును నిర్వ

హించేచే నెక్కువవారియెడ గౌరవవిశ్వాసభక్తులు గలిగి మెలంగుచుండెనేని మంచివాఁ డనిపించుకొనును. అటుగాక యెల్లఱఁ బీడించుచు, అధర్మమార్గము నవలంబించి స్వార్థపరుఁడై స్వకీయులకే కట్టిపెట్టుచు నుపన్యాసవేదికలయందును సభాస్థలులయందు నమృతంపుఁబలుకులు పలుకుచు, సర్వజనహితునిబోలెను పరోపకారనిరతునివలెను త్యాగిచేందమునను నటించుచు, యశఃకామియై దాంబికానర్థకవ్యయము సలుపుచు, తనకధికార మున్నంతకాలములోనే చేమురుచే దీపము వెలుఁగునంతలోపలనే కార్యములఁ జక్కఁబఱచుకొనఁ దలంపు గలయతఁడు వార్తాపత్రికలందును, బాహ్యవేదికలందు (బహిరంగస్థలములందు) దూషితుఁడయి యపకీర్తి (నిరయముఁ) జెందును. తనకన్న నధికులచే దనకుఁ గలుగు కష్టములు అవమానములు కార్యభంగములవలన మనస్సు బాధితమగునట్లు తనకన్న తక్కువవారికి తనవలన నిట్టిసంకటములు గలిగి బాధితు లగునట్లు ఆత్మసాదృశ్యమును దెలిసికొని మెలంగవలయు.

10. మూఢమదము.

అవసరములేనివిషయములోఁ బిచ్చివానివలెఁ దిరుగుచు, వివిధవికారము లగపఱచుచు, సకలసుగుణవిహీనుఁడై చిత్రమును నిరాలంబమునగు మూఢమదావేశితుఁడు లోకమునఁ జరించుచుండును.

ఉత్తమభక్తుఁడు [illegible] జ్ఞాని [illegible] అజ్ఞులకు గర్వముగాఁ దోఁచుఁగాని ప్రాజ్ఞులకు [illegible] దెలియును.

విద్యామదము.

అజ్ఞానాంధకారమునుఁ బోఁగొట్టి [illegible] ములతోడ నొప్పుచుండునది విద్య [illegible]. [illegible] వాదమున తనకన్న మించినవారు [illegible], [illegible] నెట్టివారినైన నోడింతునని [illegible] ననెడిగర్వము విద్యామదమనఁబడు. విద్య[illegible] లేక కల్మషముఁ బ్రవేశ[illegible] బైఁజల్లుకొను మనవు [illegible]. ప్రతిభాసంపన్నుఁడగు విద్వాంసునిఁ [illegible], [illegible] యాగ్రస్తులు [illegible] దోషము [illegible] నుభయులకు ద్వేషము ప్రబల[illegible] నొక రోడించుకొం[illegible]. [illegible] మును లేక గర్వించిన విద్వాంసునితోడ, ప్రాజ్ఞులు [illegible] ముల సలుపరు. విద్య సభ్యసించును గాని, [illegible] శాంతవివేకవినయములఁ బడయఁడు [illegible] దుఃఖంతురు కాని [illegible]. [illegible] యాసచే సకలాలంకారశోభితమగు [illegible] జేడియఁబోలెఁ బరసంతోషైకప్రయోజనఁగ [illegible].

విద్యయు దుష్ప్రభుల యాస్థానములనెడు నంగడులకుఁ దేక మున్నె సంతోషదాయకమై రాణించును. సంతలలో నంగడుల యందుఁ దెచ్చిపెట్టువస్తువులను,ఎల్లరునుఁ బరిశీలించి పట్టిచూచినట్లు రాజాస్థానములఁ దెచ్చిపెట్టు కవితాకన్యకలను, తర్కవ్యాకరణాలంకారాదిగ్రంథరత్నముల నెల్లరు పట్టిచూతురు. రాజాస్థానములకుఁ గొనిపోయి వారొనరించునేర్పాటులకు లోఁబడి, యచ్చటి జ్ఞానలవదుర్విదగ్ధుల కువిమర్శకుల దోషైకదృక్కులపాలఁ బడవైచుట ధనాశచేతఁ గాదె! పుండరీకషండమండితకాసారమందలి మధురోదకములఁ గ్రోలఁ బిపాసువు, అచ్చోటికిఁబోవ నందలి నక్రగ్రాహజలూకాదు లాతనినిఁ బట్టి బాధించుట సహజమే కదా? అట్టుల దుష్ప్రభునాశ్రితులగు వంచకులు దుర్విదగ్ధులు సాధుసచ్చరిత్రు లగువిద్వాంసుల బాధించి వారిగ్రంథముల దోషముల నారోపించి రాజానుగ్రహమునకు కీర్తికి దూరగులఁ జేయుదురు. ప్రభువు సరసుఁడగు విద్వాంసుఁ డయ్యేనేని తనయాస్థానమునకు వచ్చిన విద్వత్కవుల నాదరించి సన్మానముఁ గావించును. అటుగాక ప్రభువు విషయలంపటుఁడు, అవివేకియు నైన, తదాశ్రితులగు వంచకులు స్వార్థపరులై, వచ్చిన విద్వాంసులను, కవుల నాదరింపక రాజున కపకీర్తి నాపాదింతురు. దిక్కులగు కవులు విద్వాంసులు ఉపాయాంతరములేక, ప్రభువు నాశ్రయించునెడ వంచకులు దుర్విదగ్ధులు వారిని నొప్పించుట శోచనీయము. ఇనాలోకములేక రత్నము ప్రకాశింపనట్టుల విద్వత్కవులును,

వారి గ్రంథరత్నములును ప్రభువు ననుగ్రహము లేక ప్రకాశింపవు. లోకోత్తరులగు విద్వాంసులను, కవులను, సాదరముగ రప్పించి సరసులగు విద్వత్ప్రభువులు వారి గ్రంథముల నాదరించి, బహూకరించి తమరాజ్యమునందుఁ బ్రకాశింపఁ జేయుదురు.

దుర్విదగ్ధవంచకులవలన విద్వత్కవులకు నష్టకష్టములు.

ధీరులును మానవంతులునగు విద్వత్కవులు ప్రభువుల సాదరమగు నాహ్వానము లేక వారియాస్థానములఁ బ్రవేశింపరు. ప్రవేశించి తమవైదుష్యముచే ప్రభువును మెప్పించి, తదాదరమునుఁ బడసి, అచ్చోటి దుర్విదగ్ధుల వంచకుల నణఁచివైతురు. కాఁబట్టి ప్రభువు, సరసుఁడు, విద్వాంసుఁడు, వివేకియునై యుండవలయును. వక్తృత్వనైపుణ్యముగల కొందఱు పండితులు తమకుత్సితములగు జాణతనంపుఁ బలుకులచే, ధర్మాధర్మములఁ దాఱుమాఱు గావించుచున్నవారు కదా? పిడివాదమునఁ బేరుమోసిన తార్కికులు, తమ కర్కశవాగ్బాణంబులఁ గటికివారి వాఁడికటారులచందమున సాధుజనమనంబుల నొప్పింతురు. వితండజల్పవాదంబులఁ గుయుక్తులు పన్ని, తమ్మెదిరింపనిసజ్జనుల నవమానింతురు. వేదబాహ్యులగు పాషండుల నాస్తికులకువాదముల ఖండించి, ఆస్తికమతము రక్షింప తర్కశాస్త్ర మేర్పడియుండ, దానియుపయోగముఁ దెలియక పిండార్థము శ్వానములు పోరాడినట్లు, కువాదము

[illegible] యోగము చేయు గర్వితుల
[illegible] మిట్టిపాటున నెదిరిం.
[illegible] జరిగిను పండితులవిద్య కోడె
[illegible] మనుజులమనంబులకు.
[illegible] ఇట్టివిద్వాసలన లాభ మేమి ?
[illegible] గర్వించినపండితుఁడు అంతకన్న
[illegible] గర్వభంగముఁ జెం.
[illegible] సుపాతుఁ డగును. ఇట్లు
[illegible] సర్వజ్ఞుఁడు పరమేశ్వ
[illegible] గర్వము విడనవల
[illegible] ఫలభారనమ్ర
[illegible] ఫలశూన్యమై ఆకసము
[illegible] గల చెట్టు క్రుంకుడు
[illegible] బడునుగదా ? ఇట్టుల వినయ
[illegible] విద్వాంసుఁడు మహాసభల
[illegible] భంగముఁ జెందక, వినయవివే
[illegible] గర్వించిన విద్యావం
[illegible] కాఁబట్టి ఎట్టి విద్యావంతునికేని.
[illegible] డగువిద్వాంసుఁడు ఈసు పెం
[illegible] ప్రయత్నించుఁగాని, మన
[illegible] బడయఁజాలఁడు. కామక్రోధ
[illegible] వానిని బెంపొందించునది.
[illegible] ప్రాజ్ఞులు [illegible].

ఎవనివిద్య యీరసంబునఁ గ్రాఁగి, అహంకారమున హతమగునో అయ్యది వానియాయువుతోడనే యడుగంటు నని యార్యు లనెదరు.

యవక్రీతుచరిత్రము.

పూర్వకాలమున రైభ్య భరద్వాజులను నిరువురు మునులు ఒక్కవనమున నొద్దికతో నివాసము చేయుచుండిరి. అందు రైభ్యునకు విద్యావివేకసంపన్నులైన అర్వావసు పరావసులను నిరువురుపుత్త్రులును, భరద్వాజునకు యవక్రీతుఁడను నొకతనయుఁడును నుండిరి. తల్లిదండ్రుల గారాబమునఁ బెరిగినబిడ్డలు సామాన్యముగ చదువు సంధ్యలు మాని రాలుఁగాయలుగనుండుట సహజమే కదా? విద్వాంసులైన రైభ్య పుత్త్రులకుఁగలుగుగారవముఁ గాంచి, విద్యావిహీనుఁడగు యవక్రీతుఁడు ఈర్ష్యాళువై విద్యల నెట్లయిన సాధించి గౌరవంబున వారిని మించవలెనని పట్టుదలతో గంగాతీరమున కరిగి యింద్రునిఁగూర్చి యుగ్రతపము సలుపుచుండ, నాతనితపంబున కింద్రుఁడు మనస్సున మెచ్చుకొనక యడ్డుపెట్టఁ దలఁచి యతనికగపడి యిట్లనియె.

"ఓయీ! ఇట్లేల వ్యర్థంపుఁదపమున శరీరమును శుష్కింపఁ జేయఁజూచెదు? గురువులయొద్ద నభ్యసింపక, యెట్టివారికైన విద్యలఁ బడయ సాధ్యమగునె? సర్వజ్ఞుండగు శ్రీకృష్ణపరమాత్మయు సాందీపునియొద్దఁ జదువుకొనెనని

వినమా ? బ్రహ్మాదులు సయితము శ్రీపరమేశ్వరునొద్ద బ్రహ్మ విద్యఁ బడసినట్లు వేదము లుద్ఘోషించుచుండెడిని. గురు ముఖంబున నభ్యసింపక విద్యఁ బడయఁగోరుట ఆకాశకుసుమ మునుఁ దలఁదాల్ప నుంకించుటవలె నగును !

కుమారా ! విద్యాభ్యాసమున కర్హమగు బాల్యము కడ చినపిదప, నిష్ప్రయోజనమగు నీపట్టుదలవలని లాభమేమి ? నీవిత్తఱిఁ బెఱతలంపులు మాని విద్యాఫలంబులయెడఁ జిత్త ము హత్తింపుము. శమదమాదిసద్గుణంబులు గలిగియుండు టయు, కామక్రోధాదులగు చెడుగుణంబులు లేకయుండు టయు విద్యాఫలంబు లని యెఱుంగుము. విద్వేషమునుండి విద్వాంసుని, విషయసుఖములనుండి సన్న్యాసిని, పాపమునుండి పార్థివుని క్రోధమునుండి విప్రుని, నివారింపఁజాలువిద్యయే యుత్తమవిద్య యనఁబఱఁగు. అవివేకులకేని వివేక ముత్పా దించుటయే విద్యాగుణంబు. అటుకాదేని బ్రతుకుఁ దెరువని యే యెంచనగును. కామక్రోధములకు శీలమును, లోభ మోహంబులకు విద్యయు, మదమాత్సర్యములకు మనసును లోఁబడియుండువారి మనుగడ వ్యర్థమనియే చెప్పనగును.” అని యిట్లు దేవేంద్రుఁడు వివరించినను, అయ్యవక్రీతుండు తన నియమమునుండి చలింపఁడయ్యె. అంతట నా పురుహూతుండు వృద్ధబ్రాహ్మణరూపమున నేగుదెంచి, యామునితనయున కనతి దూరమున నొకచోటఁ గూర్చుండి, యిసుక పిడికిళుల గంగా నదికి సేతువుఁ గట్టఁదొడఁగె. పనికిమాలినపనికిఁ బ్రయత్నించి

యాయాసపడుచున్న యావృద్ధు నవలోకించి, నగి మనసున జాలిపొడమ నతని డాసి యిట్లనియె. "ఓ భూసురోత్తమా! నిష్ఫలంబగు నిట్టిపనికి సమకట్టి యేల యాయాసపడియెదవు? మహానీయులు ఫలశూన్యమయినపని కాయత్తపడరని విందు. అడ్డుపడిన మహాపర్వతములనయిన నూచముట్టుగఁ గూలఁ ద్రోయు నీయేటిప్రవాహమున కిసుక పిడికిళుల వంతెనఁ గట్ట వచ్చిన నిన్నే మనఁగవచ్చు! ఇంతటనైన నీవెఱ్ఱి మాని పొమ్ము" అనవుడు నావృద్ధబ్రాహ్మణుఁడు చిఱునగవుతోడ "ఓయీ! యొరులకుపదేశించునపు డెల్లఱు పండితులుగా నుందురుగాని, స్వానుష్ఠానసమయమున తమపాండిత్యము నుపయోగింపరు! గురువులేక విద్యలసాధింప పంతముఁబూనిన నీవు నన్నాక్షే పించుచున్నాఁడవు! గురువులేక విద్య లభించునా? నిన్నుఁ జూచియే యీయుద్యమముఁ బూనినాఁడను. ఇతరులు చెప్పి నపుడయిన వినవలదా? బుద్ధిమంతుఁడా! ఇంతటనైన నాత్మ దోషము నెఱింగి యీకార్యము మాను"మని చెప్పెను.

దిట్టతనముగఁ బలికిన యావృద్ధభూసురుపలుకుల నాక ర్ణించి నిరుత్తరుండయ్యు నా మునిపుత్త్రుండు మిూఱినపంతం బున నిశ్చలుండై ఘోరతపంబు సలుప నావేల్పుఱేఁడు అయ్యా వక్రీతుని మనోనిశ్చయమునకు మనంబున సంతసించి, యభి మతము ననుగ్రహించి యంతర్హితుం డయ్యె. అంతట నాయ వక్రీతుండు అభిమతార్థంబులఁ బడసి, సంతసంబున నిజాశ్రమం

బునకుఁ జనుఁదెంచి, జరిగినసమాచారమంతయు నిజజనకునకు విన్నవించెను.

భరద్వాజుండును పుత్రునివిద్యాప్రాప్తికి నంతరంగమున సంతసించి, యాతనిప్రల్లదనమునుఁ గాంచి సంకటమునుఁజెంది ఖిన్నచిత్తుఁడై విన్నఁదనముఁ దోఁప నిట్లనియె. "కుమారా! తపోబలంబున విద్యలసాధించితినని పంతంబునఁ బలుకుచుంటివి. కాని ఇట్టివిద్యలు గర్వహేతువులై యకార్యకరణంబునకే యెల్లప్పుడు పురికొల్పుచుండు ననుమాట మాత్రము మఱవకుము. కోపనుఁడయిన రైభ్యునికొడుకులు గర్వితులై యున్నవారు. అభినవపండితుఁడవయిన నీవు, వారున్నయెడ కేగితివేని, అనర్థపరంపరలు గలిగించుకలహము ప్రాప్తించును. క్రొత్తపండితుఁడు గర్వముతో నొరులయుత్కర్షను సహింపక, శిరఃకంపముఁ గావించును. తలతిక్కమెయిఁ దత్త్వము తాఱుమాఱు సేయఁ దలంచుచుండు. తీవ్రజ్వరితునకుంబోలె నూతనపండితున కుద్భవించు వికారమెంతయు వైషమ్యకరము. కాఁబట్టి రైభ్యాశ్రమమునకుం జని, యచట నీపొగరుఁబోతుతనముఁ జూప సమకట్టితివేని ఆమునివలన కీడువాటిల్లుటయే నిజము. గురూపదేశములేక, ప్రకారాంతరమున విద్యాలాభమునుఁ బడయుట విపత్తునకే కారణమని నామనంబు శంకాకులితం బయ్యెడి. కావున నాపలుకులు పెడఁజెవినిడక శాంతచిత్తుఁడవై మెలంగుము."

ఇట్లు పెక్కురీతుల నాయవక్రీతుండు బోధితుండయ్యు నెడపఁదడప రైభ్యాశ్రమమునకుఁ బోవుటయు, నాతనిపుత్త్రులతోడ శాస్త్రవాదములఁ గావించి పరాభవించుటయు, మానినవాఁడు కాఁడు. రైభ్యతనయు లోకపర్యాయ మాతనియత్యాచారము పొగరుఁబోతుతనంబునకు మనంబునఁ గినిసి, "ఓయీ! ప్రాయంబున నేమి, పాండిత్యమున నేమి, చిన్నవాఁడవయ్యు సమ్మానింపఁదగిన మమ్ముల సరకుసేయక మీఁదు మిక్కిలి జగడము లాడుచున్నాఁడవు! ఈ యకార్యకరణంబున నీకాయువు నశించుట సత్యమని వచించిరి.

ఒకానొకప్పు డయ్యవక్రీతుఁడు రైభ్యాశ్రమమునకుఁ బోవ రైభ్యుండు పుత్త్రులతోడ స్నానార్థము నదీతీరమున కేగియుండె. అచట నొంటరిగ రైభ్యునికోడలు సుందరాంగియు సుశీలయునగు సుప్రభయను యువతి విహరించుచుండ నయ్యవక్రీతుఁ డామె సొబగుందనముం గాంచి, కామమోహితుఁడయి తన విద్యాకులశీలవివేకముల మఱచి, వలపుఁదెలుపనయ్యింతి యెన్నినీతులఁ గఱపినను, హితంబుల బోధించిననుఁ దెలిసికొనలేక, పర్ణశాలకుఁబోవ నుద్యుక్తయగు నత్తలిరుఁబోడినిఁ దారసించి, యామె పైఁటకొంగును బట్టుకొనెను.

శీలరక్షణాసక్తయగు నవ్వివేకవతి వలపుకాండ్రమలపుటకుఁ జేల్లనిమాటలు చాలినవగునని యెదఁదలఁచి, యుక్తియుక్తముగ "ఓయీ! నీచిత్తమున హత్తినమక్కువ నిక్క

మగునో కాదో యని యెకసక్కెములాడితి. సందియంబుడించెదె మన మేకాంతమున మంతనము లాడుచుండ, స్నానార్థమేగిన మామగారు పుత్త్రులతోడ వచ్చుసమయమయినది. ఎడఁబాటు కలిగనే యని చింతిలుచున్నదాన. శీఘ్రముగ నిలువేరుము. ప్రేముడిని మఱవకుమని మృదూక్తులచే నతనిఁ బంపివైచెను.

అంత రైభ్యుఁడు వచ్చి, అగ్నిభవనమునఁ జెన్నుదఱిగి యశ్రువులు విడుచుచున్న, సుప్రభవలన జరిగిన వృత్తాంతము నంతయుఁ దెలిసికొని, దుస్సహరోషావిష్టమనస్కుఁడయి, భరద్వాజుఁడు కొడుకున కిట్టిచదువు నేర్పెనా? యని యుగ్రుఁడయి క్రోధంబున విరాజిల్లు నొకజటను ద్రెంపి, మారణక్రియఁ జేయఁబూని యగ్ని యందుంచఁగా నందఁగత్తెయగు నొకరాక్షసాంగన యుద్భవించెను. అట్టుల మఱియొకజటనుఁ బెఱికి హోమముఁగావింప, ముష్మొనవాలుదాల్పగు నొకరక్కసుం డావిర్భవించెను.

ఇట్లు జనించిన వారిరువురు అమ్మునీంద్రునకు నమస్కరించి, "ముదలయేమి" యని యడుగ, దుర్మార్గుఁడగు నాభరద్వాజపుత్త్రుఁడగు యవక్రీతుని భస్మముఁ గావించి రండని యాజ్ఞాపించెను.

మున్ముంద యారాక్షసాంగన యటకేగి మునితనయుని వలపుఁబలుకుల తనవలలో వైచికొని, చేతిలోనికమండులువు లాగికొనెను. పిమ్మట నారక్కసుఁ డేగి, యపవిత్త్రుఁడగు నా యవక్రీతుని నొడిసిపట్ట నుంకింప, నతఁ డదికని నివ్వెఱఁబోయి

ప్రాణములఁ గాచుకొనఁ బరువులువాఱి నిజజనకు పర్ణశాలలోఁ బ్రవేశించునంతలో గృహపాలకుఁ డపరిశుద్ధుఁ డగునతనిఁ బ్రవేశింపనీయక యడ్డగించెను. అంత నారక్కసుఁడు తడవులేక యీఁటెపోటున నాతనియసువులు హరించి చనియె.

పిమ్మట భరద్వాజుఁడు వచ్చి, పర్ణశాలకడ శవముగఁ బడియుండు కొడుకును జూచి, దుర్భరదుఃఖపరవశంబున మొదలునఱకిన మ్రానువలెఁ బుడమిపై మూర్ఛిలి, కొంతవడికిఁ దెప్పఱిలి దాసునివలన జరిగినవృత్తాంతమంతయుఁ దెలిసికొని, మిక్కిలి దుఃఖించి రైభ్యుఁడును పుత్త్రకారణంబున మృతుఁడగుగాక యని శపించి, చితిఁబేర్చి పుత్త్రునితోడ తాను నందుఁ బ్రవేశించి ప్రాణముల విడిచెను. పుత్త్రశోక మెట్టివారికిని దుర్భరమే కదా ?

ఇట్లు కొంతకాలము చనుఁడు రైభ్యపుత్త్రులగు అర్వావసు పరావసువులు బృహద్ద్యుమ్నుఁడను రాజొనరించు యాగముకడకు వెడలి, యాజకులుగ నియమింపఁబడి యజ్ఞముఁ గావించుచుండిరి. ఒకపరి పరావసువు సంజచీకటి నాశ్రమమునకుఁ బోవుచు, వ్యాఘ్రచర్మముఁ గప్పికొని పొదలపొంతఁ బఱతెంచు నిజజనకుని వ్యాఘ్రమని శంకించి, సంకోచింపక చేతనున్నబడియచే బాదెను. తత్క్షణమే యాతపసి తనయునిఁ దలఁచుకొనుచు ప్రాణములు విడిచెను. ఆవలఁ బరావసువు నిజమెఱిఁగి, తనతొందరపాటుకు వగచుచు, తండ్రికళేబరమునకు

అగ్నిఁ దరికొల్పి, పాపశంకితుఁడై మగిడి, అన్నయొద్దకుఁబోయి యావద్వృత్తాంతమును విన్నవించె. అంత నర్వావసు పితృ మరణమునకుఁ బెల్లుగ దుఃఖించి, యనుజన్ముఁడగు పరావసువు ననునయించుచు నిట్లనియె. వత్సా! దైవము ప్రతికూల మయినచో మనుజునియత్నము తాఱుమాఱగుట తథ్యము. విధిచేఁతకు నడ్డపడ నేరికి వశము? పరాకున నీవొనరించిన యీపాతకమును ప్రాయశ్చిత్తంబునఁ బోఁగొట్టుకొన నగును. నీకై నేనె యీహత్యాపాతకమునుఁ బాపఁగలవ్రతము సలిపి వచ్చెద. నీవిచటనుండి యీరాజేంద్రునియజ్ఞమునుఁ దిన్నగఁ జేయించుచుండుము" అని నుడివి యతని వీడ్కొని యాతఁ డొనరించిన హత్యాపాతకముఁ బోఁగొట్టఁగల వ్రతముపట్టి, యెల్లతీర్థములఁ గ్రుమ్మరుచు, నియమమును నిర్వర్తించి కొలఁది కాలముననే తేనియాగశాలకుఁ జనుదెంచుచుండు నాయ ర్వావసును దోసకారియగు పరావసువు దూరమునుండియే చూచి తనమనంబున నిట్లనుకొనియె.

"యాగము ముగియనున్నది. రాజేంద్రుఁడు నాకొసంగు బహుమతినిఁ గైకొన నాయన్న క్రన్నన నేతెంచుచున్నవాఁడు. నాదురదృష్టము కాకపోయిన నిన్నినోములు వ్రతములు సలిపి చెక్కుచెదరక యుసురులతో మగిడివచ్చుట యేమి? ఇప్పుడైన నేమి మునిఁగిపోయినది? రాజేంద్రునితోఁ జెప్పి యితనిని రాకుండఁజేసెదనని తలఁచి, రాజునొద్దకుఁ బోయి, "ధరణీశ్వరా! పితృహంతకుఁడగు నాతోఁబుట్టువు

అర్వావసు శంకలేక యాగశాలఁ బ్రవేశింప వచ్చుచున్న వాఁడు. దవ్వులఁ దఱిమి వేయుటయే శ్రేయస్కరమని” నుడివె.

కల్లరీఁడగు నాతఁ డాడినపలుకులు నమ్మి, రాజేంద్రుండు ఏనేరమెఱుఁగని యర్వావసుని నెట్టన నెట్టించె. పుట్టుగ్రుడ్డుల పగిదిఁ బుడమితేఁడులు తలఁదాకునది తలపోయక, పరుల మాటలఁబట్టియే పోవుచుఁ బిమ్మట తమయవివేకమునకుఁ గడుం గడుఁ జింతించెదరు.

దుర్మార్గుఁడగు తనసోదరుఁడు నిష్కారణవైరమూని తనను నెట్టించినను, స్వచ్ఛహృదయుఁడగు నర్వావసు తన డెందమున నావంతయేని కుందఁడయ్యె. విపర్యయంబునకు దైవంబ కారణమని, సజ్జనులు సైరణఁబూని వికారమునుఁ జెందరు కదా?

తనసోదరుఁ డొనర్చిన యపకృతి నించుకైన మనసునఁ బెట్టని యామునితనయునెడ యజ్ఞమునకువచ్చిన బృందారకులు సంతసించి దయతో నిట్లనిరి. “ఓ సజ్జనవరేణ్యా! నీ తాలిమి కెంతయు నంతరంగముల మెచ్చితిమి. నీకెందును మేలొనఁగూడుఁ గాక. మది మెచ్చిన వరమడుగు”మని వాక్రువ్వఁడు, నామునిపుత్త్రుఁడు ఆనిర్జరవరులకు నమస్కరించి వినయముఁ దోఁప నిట్లనిగెు. “దేవవరులారా! దయానిధులగు మీరు కనికరించి వరమును గ్రహించెదమని పలికితిరి. నాకోర్కి నెఱవేర్పుఁడు. నాజనకునికోపాగ్నిచే మడసిన యవక్రీతుఁడు తనకైన కీడు తలఁపునకు రాకయుండ, తనతండ్రితోఁ గూడ

కామక్రోధాదుల దూషితంబగు నంతఃకరణంబును, ఇంద్రియములను, కృచ్ఛ్రచాంద్రాయణనిరశనవ్రతాదితపంబులఁ దపింపఁజేసిన సత్త్వగుణభూయిష్ఠంబులై నిర్మలంబు లగును. ఎట్టి దుష్కరంబగు కార్యంబునేని తపంబుచే సాధింపనగును. సౌధప్రాసాదదివ్యగృహక్షేత్ర పుత్త్రకళత్రవిత్తాధికార భోగమంతయు మహత్తరతపఃఫలితంబ యగును. సంకల్పానుగుణంబుగ తపఃఫలంబుఁ గలుగును. కాఁబట్టి కామక్రోధాదులఁ గలిగించు నైహికవిషయభోగంబుఁ గోరక, పరమశాంతయుతంబు నిరతిశయానందదాయకంబు నగు మోక్షము నపేక్షించుటయే నిక్కమగు తపఃఫలితంబగు. దారాపుత్త్రాదులయెడఁగినుక కలిగి సన్న్యసించి కాషాయవసనంబులు దండకమండలువులు ధరించి యొరు లచ్చెరువొందునట్లు తీవ్రవ్రతంబులఁ బూని మహనీయుం డీతఁడని పొగడఁబడుచు, దంభముగ తపంబు సలుపునతఁడు లోకవంచకుఁ డగును. తపంబు త్రివిధంబని గీతాశాస్త్రంబునఁ గలదు. అందు తామసతపస్సు అశాస్త్రవిహితంబు ఘోరంబును, ఆత్మేంద్రియదేహంబులను సంక్షోభింపఁజేయునదియునై లోకంబున కుపద్రవజనకంబునై యుండు. ఇట్టి ఘోరమయిన తపస్సును అసురులగు హిరణ్యాక్షరావణాదు లొనరింతురు. సర్వప్రాణిహితంబును కామక్రోధాదిరహితంబును మనశ్శాంతంబును జగత్కళ్యాణంబును నగు తపస్సును వసిష్ఠాదిమహర్షులు గావింతురు. ఎట్టిదుష్కరమయినదానినేని కోరి, తపంబొనరించిన నద్దాని నొసంగుశక్తి

తపంబునకుఁ గలదు. జన్మాంతరకృతకర్మానుగుణ్యముగ వారి చిత్తవృత్తులు ప్రేరేపించినట్లు తపంబుఁ గావింతురు. మన శ్శాంతిని, ప్రాణిహితంబును, సమదర్శిత్వమునుఁ గలిగించునదియే నిజమయిన తపంబనఁబడు. కామక్రోధాదులకు దాసులై యహంకారముతో నితరుల శపించువారితపస్సు దుర్వినియోగమై తగ్గును విశ్వామిత్రమహర్షి ఘోరమగు తపంబుసలిపి క్రోధముఁ గలిగినపుడెల్ల నొరులను శపించుటవలన తపంబు తగ్గి, చింతిలినవాఁడై తపంబు సేకరించి, తనయాగమునకు విఘాతకారులగు మారీచసుబాహువులఁ బరిమార్ప శక్తుండయ్యు, తపస్సు నశించునని శంకించి, దుష్టశిక్షణ శిష్టరక్షణములు క్షత్రియధర్మములు గావున రామలక్ష్మణులఁ దోడ్కొనివచ్చి వారలచే నయ్యసురుల ద్రుంగించెను. కామపరవశంబున మేన కానురక్తుఁడై చిరకాలార్జితంబగు తపంబునుఁ గోల్పోయెను. వసిష్ఠాదిమహర్షులు కొందఱు పరులచే నపకృతులయ్యు శమాన్వితులై తపోధనంబును రక్షించుకొనిరి.

కౌశికునిచరిత్రము.

పూర్వమొకప్పుడు కౌశికుఁ డను బ్రాహ్మణుఁడు వృద్ధులగు తలిదండ్రులను విడిచి యడవికేగి, వృక్షమూలంబునఁ గూర్చుండి తపంబు సలుపుచుండఁ గొంతకాలమున కాచెట్టు పైనుండి కొక్కెరయొకటి యతనిమీఁద రెట్టవైచెను. మహానీయుఁడను తపస్సంపన్నుఁడ నయిన నామీఁద నీపిట్ట రెట్ట

వైచెనని యహంకారపూరితుఁడయి కోపముతో గ్రుడ్లెఱ్ఱఁజేసి చూచినంతట నాపిట్ట గిరగిరఁదిరిగి క్రిందఁబడి ప్రాణములు విడిచెను. దానింగని తనతపంబు ఫలించెనని గర్వముతో చేరువ మునిపల్లియనున్న పతివ్రతాగృహమునకు భిక్షార్థియై చేని వేచియుండెను. దూరమునుండివచ్చిన తనభర్తకు, సకలోపచారములుఁ గావించి భోజనాదుల నిడి, స్వధర్మము నిర్వర్తించి యాసాధ్వీమణి భిక్షాన్నముఁ దెచ్చి యిడఁబోవఁగ నా పుడమివేలుపు కడుఁగుపితుఁడై యింతతడవేల కావించితివి? అమర్యాద చేయుటకదా? యని కండ్లెఱ్ఱఁజేసి క్రిందుమీదుఁ జూచినంతట నాపతివ్రతాశిరోమణి, "ఓతపస్వీ! నాధర్మమును నేను నెఱవేర్చి వెంటనే వచ్చితిని. నిన్నమర్యాదసేయుట కాదు! తపస్సంపన్నులకు భూతదయయు క్షాంతి శాంతివలదా? అడవిలో నీదృష్టిచే చెట్టుమీఁదనుండి క్రిందఁబడి ప్రాణములు విడిచిన పిట్టననుకొంటివా? నీకోపదృష్టి పతిధర్మపరాయణయగు నన్నేమియు బాధింపఁజాల"దని నుడివెను.

అంతట నాభూసురుఁడు, "అడవిలో జరిగిన పిట్టవృత్తాంతము అబలయగు నీ మెకెట్లు తెలియనయ్యె"నని కడువిస్మితుఁడై, "సాధ్వీమతల్లీ! అనన్యగోచరమగు నడవిలోనివృత్తాంతము నీకెట్లు తెలిసెను? నాకు మిగుల ఆశ్చర్యముఁ గలుగుచుండెడిని." అని అంజలిఘటించి, "నాకు ధర్మ ముపదేశింపు"మని యామెను బ్రార్థించెను.

ఆవల నాపతివ్రతాశిరోమణి భూసురునిం గని "ఓయి తపస్వీ! స్త్రీమాత్రయగు నేను నీ కుపదేశింపఁజాలను. మిథిలాపురసమీపంబున ధర్మవ్యాధుం డనుకిరాతుండు మాంసపుటంగడిఁ బెట్టుకొని విక్రయించుచుండు. నీసందియంబులఁ బాపను నీకుపదేశింపను నాతఁడు సమర్థుండు. అటకుఁ జనుమని నుడివెను. పిమ్మట నాకౌశికుఁడు మిథిలాపురసమీపమునకుఁ బోవ, దివ్యదృష్టిఁగల యాధర్మవ్యాధుఁ డెదురుసని, "యోమహాత్మా! పతివ్రతాశిరోమణిచేఁ బంపఁబడిన తపస్వి నీవేకదా," యని యడిగి,సాదరంబుగ తనగృహమునకుం గొనిపోయి, యాతిథ్య మొనరించి యాతఁ డడిగినసందియములఁ దీర్చి, ధర్మముల నుపదేశించెను. అడవిలో జరిగిన పిట్టవృత్తాంతముఁ దెలిసికొనిన పతివ్రతామహిమకే యాశ్చర్యపడుచుండ నంతకన్న నద్భుతావహంబగు ధర్మవ్యాధుని దివ్యజ్ఞానమునకు కడువిస్మితుండై వీరలచరితము లగోచరములు. బాహ్యమునకు గన్పింపవని మనంబునఁ దలఁచి తన యల్పతపంబునకు నహంకారపూరితకోపంబునకు లజ్జించి గర్వముపీడి అతినమ్రుఁడై యాశ్రయించి ధర్మోపదేశముఁ బడసెను. ఉగ్రమగుతపంబునకు మహిమకలదు. ఆమహిమ భగవదనుగ్రహాసంజనితమని తలఁచి, దీనానాథ సాధుజనధర్మరక్షణమున్కై వినియోగించినచో నష్టము కలుగదు కాని, అహంకారపూరితుఁడై గర్వముతో శపించెనేని దుర్వ్యయమగును. కాఁబట్టి తపోమదమును వీడవలయును.

శ్లో. విద్యయా వినయావాప్తిస్సాచే దవినయప్రదా,
కిం కుర్మః కం ప్రతి బ్రూమో గరదాయాం స్వమాతరి.

నీతిశాస్త్రం.

వాత్సల్యముచే తనతనయుని రక్షణపోషణములఁ గావించుతల్లి విషముఁబెట్టునపు డిఁక నెవరితోడఁ జెప్పికొన వలయు? అట్టుల విజ్ఞానదాయిని యగువిద్య, తన్నాశ్రయించిన వారలకు మూఢత్వము, దుర్వినీతత, అజ్ఞానముఁ గలుపునెడల నిఁకేమి చెప్పవలయు ?

శ్లో. విద్యా వివాదాయ ధనం మదాయ శక్తిః పరేషాం పరపీడనాయ,
ఖలస్య సాధోర్విపరీత మేతత్ జ్ఞానాయ దానాయ చ రక్షణాయ.

నీతిశాస్త్రం.

ఆకాశమునుండి వర్షించు స్వచ్ఛజలము ఊషరక్షేత్రములయందుఁ బడెనేని క్షారోదకముగను, సైకతస్థలముల యందుఁ బడెనేని స్వాదూదకముగను ఆశ్రయానుగుణ్యముగఁ బరిణమించినట్టుల దుర్జనుల నాశ్రయించినవిద్య వివాదమునకును, ధనము గర్వమునకును, బలము పరులను బీడించుటకును, సజ్జనుల నాశ్రయించినవిద్య జ్ఞానముకొఱకును, ధనము దానమునకును, బలము దీనానాథుల రక్షించుటకును ఉపయోగపడుచున్నది.

మ ద ము.

శ్లో. సాక్షరాణాం దమో యస్స్యాదష్టాదశగుణాన్వితః,
ప్రాతికూల్యే తు దోషస్స్యాత్ రాక్షసానాం మదం విదుః.

సాక్షరాః = దమః.

రాక్షసాః = మదః.

సాక్షరు లనఁగా బ్రహ్మవిద్యాసంపన్నులకు అష్టాదశ గుణములుగల దమ మేదికలదో, అయ్యది వైపరీత్యముఁజెంది రాక్షసులకు మదమయ్యెను. ఆమదము పదునెనిమిదిదోషములు గలదియని మహాభారతమున సనత్సుజాతీయులువారు ధృతరాష్ట్రున కుపదేశించిరి.

శ్లో. మదోఽష్టాదశదోష స్స్యాత్పురాణేయః ప్రకీర్తితః,
లోక ద్వేష్యం ప్రాతికూల్య మభ్యసూయా మృషా వచః.
కామక్రోధా పారతంత్ర్యం పరీవాదోఽథ పైశునం,
అర్థహాని ర్వివాదశ్చ మాత్సర్యం ప్రాణిపీడనం.
ఈర్ష్యా మోహోఽతివాదశ్చ సంజ్ఞానాశోఽభ్యసూయతా,
తస్మా త్ప్రాజ్ఞైర్న మాద్యేత సదా హ్యేతద్విగర్హితమ్.

పాఠాంతరము.

శ్లో. దమోఽష్టాదశదోషస్స్యాత్ ప్రాతికూల్యం కృతే భవేత్,
అనృతం పైశునం తృష్ణా ప్రాతికూల్యం తమో రతిః.
లోక ద్వేషోఽభిమానశ్చ వివాదః ప్రాణిపీడనం,
పరివాదోఽతివాదశ్చ పరితాపోఽక్షమాఽధృతిః.
అసిద్ధిః పాపకృత్యం చ హింసా చేతి ప్రకల్పితాః,
ఏతైర్దోషైర్విముక్తో యస్స దమ స్సద్భిరుచ్యతే.
మహాభారత - ఉద్యోగపర్వం.

లోకులకు మహోపద్రవకర కార్యము లొనరించి వారల ద్వేషమునకు పాత్రుఁడగుట, గర్వముచే నెల్లరకుఁ బ్రతికూల

ముగ ప్రవర్తించుట, అహంకారపూరితుఁడు తనగౌరవమునకు లోపము కలుగుచేన్నదని కలుగునను శంకను గల్పించుకొని పరులకు పలువిషయములయం దపకార మొనర్చుట, ఇతరుల ప్రశంసను వినుట కిచ్చగింపక మంచివారిమీఁద దోషముల నారోపింపఁబూనుట, తా నుత్తమస్థానము నాక్రమించుటకై యితరులు తనతో సమానాదరణీయులు కారని మిథ్యావచనములు పలుకుట, విషయములయం దాసక్తి, తనకోరికలకు విఘాతము కలుగునపుడు క్రోధ ముత్పన్నమగుట, అహంకార విషయములను సంరక్షించుకొనుటకై అనర్థమూలకమగు నర్థమును వ్యయముసేయుట, ఇతరులయెడ ప్రణతిభావము లేక ప్రతివిషయమున వివాదము సలుపుట, తన గర్వాహంకారములఁ బొగడువారికి దాసుఁడై యుండుట, సమక్షమునందుఁ బరదోషకీర్తనము పరుల దూషించుట, పరుల భాగ్యైశ్వర్యములఁ జూచి పరితాపముఁ జెందుట, ప్రాణులనుఁ బీడించుట, ఒరులయెడ నీసు, అవివేకము, వ్యర్థప్రలాపము, లోకమర్యాద నతిక్రమించి మాట్లాడుట, గర్వపూరితుఁ డగుటచే ప్రజ్ఞాహీనత, ఈ పదునెనిమిదిదోషములు లోకగర్హితములు. వీనిని విడిచిన దమమగును. ఈదమము సజ్జనులగు బ్రహ్మవిదులకు ధనము, శమాదిషట్కసంపత్తిలోఁ జేరినది ఈ యష్టాదశ దోషములు గలది మదము. ఆసురస్వభావముగల దుర్జనుల కుండును.

యుధిష్ఠిరుఁడు తనసోదరులతోడను, భార్యతోడను, స్వర్గమునకుఁ బోవునపుడు క్రమముగా నొకరొకరు వెనుకపడి పోవుచుండిరి. ముందున్న భీమసేనుఁడు వారలేల పడుచుండి రని ధర్మరాజు నడుగగ వారల నధిష్ఠించినగర్వముచే పడు చుండిరని చెప్పెను. అదియునుంగాక దేవాసురులయుద్ధమందు దేవతలకు విజయము కలుగగ నయ్యది తమమహిమచేఁ గలి గినదని మిథ్యాభిమానిత్వము పొడమ నిది మోక్షప్రతిబంధక మని తలంచి, దయానిధియగు పరమేశ్వరుఁడు యక్షరూపము దాల్చి వారిగర్వములఁ బోఁగొట్టినటుల కేనోపనిషత్తునందును గలదు.

శ్రు. బ్రహ్మహ దేవేభ్యో విజిగ్యే తస్యహ బ్రహ్మణో
విజయే దేవా అమహీయన్త త ఐక్షన్తాస్మాక
మేవాయం విజయో స్మాక మేవాయం మహిమేతి.

"కేనోపనిషత్తు"

ఆయక్షునిఁ దెలిసికొనవలెనని అగ్నిరాగా నీయం దేమి శక్తికలదని బ్రహ్మయడుగ, సమస్తము దహించుశక్తి నాకుఁ గల దని చెప్పఁగా నొకతృణము ముందు వైచి దహింపుమనియెను. తన సమస్తశక్తిని వినియోగించియు, దహింపలేక వ్యర్థుఁడై మఱలెను. పిమ్మట వాయువు రాగ నీకేమిశక్తి కలదన నాకు సమస్తమునుఁ జలింపఁజేయుశక్తి కలదనెను. అయినచో నీ తృణమునుఁ జలింపఁజేయుమన తన సమస్తశక్తిని వినియో గించి, కదలింపలేక మఱలిపోయెను. అప్పు డింద్రాదిదేవత లిది

యేమి? యాశ్చర్యమని తలఁచుచుండ, నాయక్షుఁ డంతర్ధానముఁ జెంది, హైమవతీరూపముగఁ గన్పించి "ఓదేవతలారా! మీరు మిథ్యాభిమానము (గర్వము) చేత మాశక్తిసామర్థ్యములచే గెలుపునొందితిమని తలఁచితిరి. ఇదియంతయు పరమేశ్వరు శక్తియని మీకుఁదెలిపి మీగర్వము పోనడఁచుట కీరూపముతో వచ్చితి"నని నుడివి తిరోహిత యయ్యెను.

మదోన్మత్తుల తలంపులు.

తన్నుఁ దాను గొప్పవాఁ డనుకొనువాఁడు ఇతరులు తనపాదతలమునందు మస్తకము లుంపఁదగినవారని తలఁచును. కాని అహంకారపూరితుఁ డగువానిని లోకులు గణనచేయకుండుటయు, తనయాసకుఁ దగినసన్మానము తనకు లభింపక హృదయవేదన జెందుటయు, పరోక్షమున నితరులు తన్ను దూషింతురనియుఁ దెలిసికొనఁజాలఁడు.

గర్విష్ఠుఁడు ఇతరులకుఁగలుగు సన్మానాదరములఁ జూచి తనకు ప్రాప్యమగు సన్మానాదరములకు లాఘవము గలుగనను నీర్ష్యచే పరితపించును. మఱియు విషకలితహృదయుఁడై యితరులకుఁ గలుగుమర్యాదలను, సన్మానములను నాశనముఁ జేయుటకై కుట్రలు పన్నుచుండును.

వాఁడు నాగొప్పతనమును చక్కఁగా గ్రహింపలేదనియు, వీఁడు నాచరిత్రమహిమను వినుటకు విముఖుఁ డయ్యెననియు, వాఁడు నాసమ్ముఖమునం దెంతదూరముననుండుట

[illegible] దూరమున నుండ లేదనియు, మొదలుగాఁ గల [illegible] సహంకారపూరితుఁడు పరితపించుచుండును. దీని [illegible] లోపించును.

మదదమనము.

“[illegible] న్యాయముగ” తన కుగ్రామములోనే [illegible] సభికుఁడనని విఱ్ఱవీగు దురభిమాన [illegible] మహాసభలకును బోయి యచ్చట [illegible] మిన్నలగు మానవంతులు, [illegible] గనఁబడుచు ప్రణతులు, [illegible] [illegible] లనుఁ జూచి, తన క్షుద్ర [illegible] గర్వము వీడును. ఊర్ధ్వదృష్టిగలిగి భ్రాంతి [illegible] తన భాగ్యము, వైదు [illegible] లోనిదనియు, లోకములో [illegible] మునందుఁ బ్రవీణులుగనుందురు [illegible] సమర్థులుగ నుండఁ [illegible] పరిపూర్ణుఁడనియు,సర్వ [illegible] అనేకవిషయములలో సమ [illegible] నమ్రత్వముఁ జూపుచున్నా [illegible] తాను పరులయెడఁ జూపిన [illegible] లజ్జించి పరితాపముఁ జెందును. కొందఱు [illegible] గావించితిమని గర్వింతురు కాని,

కర్తవ్యకార్యనిర్వహణము స్వధర్మ మగునుగాని, గర్వకార ణము కాఁజాలదు. ఒకవేళ నొనరించినను, పలువుర సాహాయ్య ముతోడను దైవానుకూల్యముతోడను నిర్వహించితినని సజ్జ నుఁడు తలఁచునుఁగాని గర్వముఁ జెందఁడు. లోకానుభవముగల మహనీయులను, ప్రాజ్ఞులను సేవించుచున్న యెడల దురభిమా నము పలాయిత మగును. సజ్జనసహవాసగోష్ఠివలన మనకుఁగలి గిన జ్ఞానము, ధనము, విద్య, మానము, అధికారసంపద లోన గునవియన్నియు పరమేశ్వరానుగ్రహమువలనఁ గలిగినవనియు, నీశ్వరుఁడే మానవులలోఁ బ్రవేశించి వీనినన్నింటి నిర్వహించె ననియు బోధపడినందున గర్వించి దురభిమానముఁ జెందుట కవకాశ ముండ నేరదు.

మాత్సర్యము. Envy, Jealousy.

అరిషడ్వర్గములో నంతిమమగుమాత్సర్యము, మానసిక వ్యాధులలో దుర్నివార్యమయినది. మత్సరమనఁగ స్వప్రయో జనము లేకున్నను పరాభిమతము నివారింపఁదలఁచుట.

(స్వప్రయోజనప్రతిసంధానం వినా పరాభిమతనివారణేచ్ఛా)

ఈర్ష్య అనఁగా నాకు వచ్చినకష్టములు ఇతరులకు రావ లయునను చిత్తవృత్తి. ఇతరుఁడు తనసొత్తును తాను దీసికొను చుండఁగఁ జూచి యోర్వలేక ద్వేషించుట. "ఈసు"అని వైకృ తము. ఇది దాయాదులయందు ముఖ్యముగఁ గన్పించును. పర శ్రేయస్సును సహింపలేకుండుట. అసూయ. అనఁగ తనకుఁ

గలిగినసుఖములు ఇతరులకుఁ గలుగరాదనుచిత్తవృత్తి. గుణవంతుల సద్గుణములు కొనియాడఁబడుచుండఁ జూచి, యోర్వ లేక దోషముల నారోపించుట,(పరోత్కర్షాసహిష్ణుత) పరుల యొక్క యౌన్నత్యముఁజూచి సహింపలేకుండుట. మాత్సర్య (Jealousy), ఈర్ష్య (Envy), అసూయ (Intolerance), ఈమూఁడును కొంచె మించుమించుగా నొకజాతికి సంబంధించి ద్వేషపక్షములోఁ జేరినవని యిదివఱలోఁ జెప్పఁబడెను.

మనుజులలో ననేకలోపము లుండును. లోపములేని మనుజులు సాధారణముగ నెక్కడనోగాని యన్నిచోట్ల గానంబడరు. మనుజులలోఁ గలలోపములలోఁ గొన్ని జనులకుం గీడుసేయునవియుఁగలవు. అట్లు కీడుసేయుపనులలో నోర్వలేని తనమునునది యొకటి. ఇది మిక్కిలి యపాయకరమగులోపమని నొక్కి చెప్పవచ్చును. ఈలోపము గలిగియే గొప్పవార లనఁదగువారు కుజనులై, తరువాత కుమతులై, తుట్టతుదకు జనద్రోహులుగా నెన్నుకొనఁబడుచున్నారు. ఈలోపము దరిద్రులలోను ధనవంతులలోను సమముగానే కలదు. పరుల మేలును జూడలేక, కన్నీరు మున్నీరై పాఱ దుఃఖించువారు కొందఱు, అన్యోన్యమైత్రిని మెలఁగువారలకు భేదబుద్ధిని గల్పించువారు కొందఱు. ప్రక్కనింట ప్రొయిమండుచున్న తనప్రొయ్యిలో నీళ్లుబోసి చేల్లార్చువారు కొందఱు. లోని తాపమును బట్టలేక లేనిపోని యసత్యములు బలికి జనులకుఁ గీడుసేయుటకుఁ బ్రయత్నించువారు గొందఱు. అతివినయముఁ

జూపుచు, నిర్మలహృదయుఁడని జనులచేత నమ్మించి, కట్టకడకు జనులకు హానిచేయువారు కొందఱు. నవ్వుచు నితరులకుత్తు కను ఖండించువారు కొందఱు. ఇట్లనేక తెఱఁగుల నీయోర్వ లేనితనము జనులలో దూరి, వారలను దుర్మార్గులనుగాఁ జేయుచుండును.

సామాన్యముగ స్త్రీలకు తమసవతులుగాని తోడి కోడండ్రుగాని తమకన్న పుత్ర పౌత్ర భూషణాంబరమాల్యా దులయం దున్నతినిఁ జెంది, పతిసమాదరమునుఁ బొంది, యధికముగ శోభిలుచుండునపుడు చూచి, యోర్వలేక ఈర్ష్య కలుగుచుండును. వారిగుణసంపదల వినునపుడు అసూయ పొడముచుండును. ఇది మిక్కిలి చెడుగుణము. పారిజాతాపహరణమున రుక్మిణీదేవియెడ సత్యభామకు ఈసు గలిగినటుల వర్ణింపఁబడినది.

శ్లో. య ఈర్ష్యుః పరవిత్తేషు రూపే వీర్యే కులాన్వయే,
సుఖసౌభాగ్యసత్కారే తస్య వ్యాధి రనంతకః.
దహ్యమానాస్సుతీక్ష్ణేన నీచాః పరయశోఽగ్నినా,
అశక్తాస్తత్పదం గంతుం తతో నిందాం ప్రకుర్వతే.
అభివాద్య యథా వృద్ధాన్ సంతో గచ్ఛంతి నిర్వృతిం,
ఏవం సజ్జనమాక్రుశ్య మూర్ఖో భవతి నిర్వృతః.
ఖలో మృగయతే దోషం గుణయుక్తేషు సాధుషు,
పుష్పవాటీ సమాకీర్ణే పురీషమివ సూకరః.

(హరిరాయజ్ఞానాంకుశము.)

ఇతరులధనమును, రూపమును, బలపరాక్రమములను, వంశప్రతిష్ఠను, సుఖోపభోగసంపదలను, సత్కారగౌరవము లనుఁ జూచి యోర్వలేనివానికి అసూయావ్యాధి కలుగును. ఇది దుర్నివార్యము. ఒరులకు గొప్పపదవి కీర్తి కలుగుచుండఁగ నీచులు, దానిం జూచి యోర్వఁజాలక వారియశోగ్నిచే దహింపఁబడుచు, వారిపదవినిఁ బొందఁజాలక యసూయచే నిందింపఁ బ్రారంభింతురు. సజ్జనులన్ననో వారిసద్గుణములను దానికిఁ దగినపదవిని కీర్తినిఁ జూచి యభినందించి చెలిమిసలిపి సుఖింతురు. దుర్జనుఁడయితే గుణసంపన్నులను తిట్టి యీసువెడలించి సంతోషించును. సౌరభకుసుమోద్యానమందు సూకరము పురీషమును వెదకుచందమున దుర్జనుఁడు సద్గుణసంపన్నులగు సాధువులయెడ దోషములనే వెదకుచుండునని తాత్పర్యము.

ఇతరులు తనకంటె నెక్కుడగువిద్యయును, ఐశ్వర్యమును చక్కఁదనమును భోగమును వర్చస్సును శరీరబలమును పరాక్రమమును గలవారై యుండఁగాఁ జూచి యోర్వఁజాలక మండిపడుచిత్తవృత్తి మాత్సర్యమనఁబడు.

శూరులును మానవంతులు నగురాజులు పరోత్కర్షను సహింపఁజాలక అసూయాగ్రస్తులై తమకు లోఁబడినవారికి గర్వభంగముఁ గావించి, తామే యుత్కృష్టులని పూజ్యులని సంతోషింతురు. తమకన్న నధికులయినచో వారిసద్గుణములందు దోషముల నారోపించి, మహాసభలయందు నిందించి కసిఁదీఱ తిట్టి స్వోత్కర్షనుఁ బ్రకటించుకొందురు. జగత్పూజ్య

ములగు సద్గుణము లున్నపుడు ప్రశంసింపవలయుఁగాని,మహా సభలయందు నిందింపఁగూడదు. జనులు గూడ వీఁ డసూయాగ్రస్తుఁడు, దుర్జనుఁడు, వీనికెప్పుడేని తేజస్వియగు మహానీయునిచే నుపహాతి కలుగునని తలంతురు. దీనికి దృష్టాంతముగ శిశుపాలుఁడు శ్రీకృష్ణమూర్తి సద్గుణములను మహాజనసత్కారమునుఁ జూచి యోర్వలేక యసూయఁ జెంది మహాజనసభయందు దూషించుటచే నామహానీయునిచే హతుఁ డయ్యెను. దక్షప్రజాపతియు మహాదేవునిగుణములందు దోషముల నారోపించుటం జేసి, యజ్ఞవిధ్వంసముఁ బొందె. మంథర శ్రీరామగుణములందు దోషారోపణముఁ జేయుటం జేసి శత్రుఘ్నునిచే వెండ్రుకలనీడ్చి కొట్టఁబడియె. ఇట్టివెన్నియో కలవు. తేజస్వులగు మహాత్ములసద్గుణములయందు దోషముల నారోపించుటచే, నీయీర్ష్యాళువు లోకనిందితుఁ డగుటయే గాక నాశముఁ జెందును. లోకములో యుద్ధములు, పోరాటములు,అభియోగములు కలుగుట, ఒకరిసంపద నొకరుచూచి యోర్వలేక యసూయాగ్రస్తులగుటయే ముఖ్యకారణము. ఎవనికేని నదృష్టవశంబున లాటరిలో నధికధనము లభించినను, సభలలో కీర్తియు సత్కారముఁ గలుగుచున్నను కుజను లోర్వలేక నిర్హేతుకముగ నసూయఁ జెంది వానిని నిందించి వానికి లాభము కలుగకుండ నాటంకములు కల్పింతురు. ఇది కాపురుషులకు సహజగుణము. దాయాదులు తమకురావలసిన ధనభాగములు తాముఁ దీసికొనుచున్నపు డొకరిమీఁద నొకరి కసూయ కలు

గుచుండు. తమకన్న తక్కువవాఁడు సేవకుఁడు నగువాఁడు ఎన్నికలలో సంస్థలయందు సభలయం దధికారపదవిఁ బొంది నపుడు వానికీపదవి కలిగినదా? యని యసూయ జనించును. సమానుఁడు పొందినపుడు అర్హతయున్నను, సహింపలేక యీర్ష్య జనించును. సామాన్యముగ నితరులు తనకన్న సంపద లోను, అధికారములోను, యశస్సులోను, నధికులుగ నెందు కుండవలెను? నేనే యధికుఁడుగ నుండవలెననెడి దురభి మానము, అసహనము (Intolerance) అసూయకు మూల కారణము. వారికి జనాపవాదము, పదవీచ్యుతి, ధనహా నాదినష్టము, మిత్రబంధుజనకష్టము కలిగినపు డీయసూయా పరులు సంతోషింతురు. ఒరులకలిమి మేలోర్వలేకుండుటయే కారణము.

మాత్సర్యగ్రస్తులగు దుర్విదగ్ధ కుకవులు.

తమకన్న నధికమగు పాండిత్యమును కవితాశక్తియుఁ గలిగినపుడు పండితులకును కవులకును నొరులమీఁద, వారికి సభాసత్కారమును కీర్తియుఁ గలుగునని యసూయ జనిం చును. మహాజనసత్కారమును లోకోత్తరకీర్తియుఁ దమకే యుండవలెనని వారి ముఖ్యోద్దేశ్యము. "బోద్ధారో మత్సర గ్రస్తా" యని భర్తృహరియోగీంద్రుఁడును, "మాత్సర్యము త్సృజ్య." యని భవభూతిమహాకవియు నితర కుకవులకు తమ యెడ మాత్సర్యము కలిగి, సద్గ్రంథములయందు దోషారోప

ణముఁ గావించి, నష్టము కలిగింతురని యుగ్గడించిరి. మాజోలికి రావలదని కొందఱు కుకవులనుఁ బ్రార్థించిరి. సహృదయులు కాని కుకవులు మాత్సర్యముచే దోషైకదృష్టిగలవారై గుణములనుఁగూడ దోషములుఁ గావింతురని వారిభయము. దోషజ్ఞుఁడు గుణదోషములను నిష్పాక్షికముగ విమర్శించి,శాస్త్రీయదోషముల సరసహృదయుల సమ్మతముగఁ జూపును. దోషైకదృక్కు అతివేలముగ దోషములనే వెదకుటవలన, గుణములు గూడ దోషములుగనే కన్పట్టును. రసవన్మధురపదార్థములున్నను ఈగ పుంటిచీముపై వ్రాలినట్టుల కుదృష్టి దోషములనే వెదకును.

శ్లో. గుణదోషౌ బుధో గృహ్ణ న్నిందుక్ష్వేళావివేశ్వరః,
శిరసా శ్లాఘతే పూర్వం పరం కంఠే నియచ్ఛతి.

"కువలయానందం"

సర్వజ్ఞుఁడగు మహేశ్వరుండు సముద్రమథనమందు జనించిన చంద్రుని శిరస్సునను విషమును కంఠమునను ధరించినట్టుల సహృదయుఁడగు సత్కవి గుణమును శ్లాఘించి, దోషమును మఱుగుపఱచునని భావము. హంసము క్షీరమును గ్రహించి నీరమును విడిచినట్టుల రసజ్ఞుఁడును గుణగ్రహణైకతత్పరుఁడుగా నుండును. సహృదయుఁడగు భావకుఁడు గుణములను గ్రహించుటయే గాక, దోషములనుగూడ గుణముల లోనికి మార్చును. సాహిత్యదర్పణ, సాహిత్యరత్నాకర, కావ్యప్రకాశిక, కావ్యాదర్శ సాహిత్యమీమాంసాది గ్రంథ

ములయందు నిర్ణయింపఁబడిన శబ్దార్థవాక్యపదాలంకారదోష ములను సముచితముగ నిష్పాక్షికముగ గ్రంథములయందు విమర్శింపవలెనుగాని, వ్యక్తిపరముగ నతివేలముగ నసూయా పరుఁడై విద్వజ్జనదూష్యమగునట్టుల విమర్శింపఁగూడదని పర్య వసితము.

కొందఱు దుర్విదగ్ధులగు కుకవులు అసూయాపరులై విద్వత్కవుల గ్రంథములపై దోషములఁ జూపి విమర్శించి వారి యశస్సునకు భంగముఁ గలిగింతురు. అట్టియెడ గ్రంథ కర్తలగు విద్వత్కవులు అజ్ఞుఁడును కువిమర్శకుఁడునగు వీని కేల సమాధాన మొసఁగవలెను. వృథాకాలయాపనమని యుపేక్షింతురు కాని, వానిపై నీసుఁ జెందరు. సహనశక్తి కలవా రగుటంజేసి వీని దుష్పాండిత్యమునకుఁ జింతించి వీని యెడ ననుకంపఁ జూపుదురు కాని ద్వేషింపరు. అయితే లోకులు వీరిపాండిత్యమును తూఁతిని కనుఁగొనఁజాలక యింతటి గొప్ప విద్వత్కవులేల సమాధాన మొసంగలేదు ? అందు దోషము లుండుటంబట్టియే వీరు తూష్ణీంభావమును వహించిరి ? లేనిచో నీకాకవి నోరుమూయునట్టుల విద్వజ్జనము హర్షించునటుల సత్యము తెలియుటకై సమాధాన మొసంగియుందురని యప కీర్తినిఁ గలిగించుటయే గాక అశక్తిభీరుత్వముల నారోపింతురు. దుర్విదగ్ధులును, కువిమర్శకులునగు కాకవులకు గర్వభంగ మొనరింపనియెడల యశోహానియు, మానభంగము కలుగు నని శిష్యులును, అనుచరులును ప్రార్థించినంతట ఈవిద్వత్కవి

సహృదయులగు విపశ్చిద్వరేణ్యులు హర్షించునట్టుల లోకుల సంశయములఁ దీరునట్టుల, జిజ్ఞాసువులగు విద్యార్థుల కుపయోగించునట్టుల సత్యప్రకటనమునకై లోకశాస్త్రసమ్మతముగ విమర్శముపై ఖండనము వ్రాసి సమాధాన మొసఁగి దుర్విదగ్ధులును కువిమర్శకులునగు కాకవులను, నోరుమూయునటుల తల యెత్తకుండునటుల బ్రహ్మాస్త్రమువలెఁ బ్రయోగించును.

అసూయాపరుఁ డనుకొనిన మనకేమని యుపేక్షించినచో నీవ్యవహారప్రపంచమునందు అర్థయశోహానులు కలుగును. అసూయాగ్రస్తుఁడగు వానిహృదయమునుండి సరసభావకవిత్వము వెలువడదు. అసూయాదిదోషరహితుఁడగు భావకమహాకవి హృదయనిష్యందమగు కవితాసుధాలహరి నిర్దుష్టముగను మాధుర్యముగ నుండునని యనుభవజ్ఞులగు రసికులకే విదితము

విమర్శనములు భాషాభూషణములు.

విమర్శనములు భాషాభూషణములు, విద్యార్థిజనమునకు విజ్ఞానదాయకములు నగుచున్నవి. విమర్శకులు సరసహృదయులును సర్వతోముఖపాండితీధురీణులును నిష్పాక్షికులునై దోషముల నుద్ఘాటించునపుడు గ్రంథకర్తలమనంబు నొవ్వనటుల మృదువుగ విద్వత్కవిబృందము హర్షించునటుల విమర్శించినచో గ్రంథకర్తయు గర్వమునుడిగి సత్యముఁ దెలిసి

కొని దోషముల్ల పవరించుకొనును గాని యీసు జెందఁడు (ద్వేషింపఁడు). ఇటు గావించినచో నాసత్కవిగ్రంథములు నిర్దుష్టములై సానఁదీరినరత్నములువలెఁ బ్రకాశించును. శాస్త్రీయదోషములఁ జూపినను, తనప్రతిష్ఠకు భంగముకలుగు నని యొప్పుకొనక దుర్విదగ్ధతచే వితండవాదములు సలుపుచు, ఖండనములు దానిపై మండనములు, అటుపిమ్మట మండన ఖండనము లెన్నియో కావించుకొని సభాంగణములయం దొకరినొకరు దూషించుకొని న్యాయస్థానములం దభియోగము జరుపుకొనిన వెన్నియో కలవు! దీనికంతయు సహనము లేక అసూయాపరుఁడై సత్యము నొప్పుకొనకుండుటయె మూలకారణము.

న్యాయవేదాంత మతతత్త్వగ్రంథములపై సత్యాన్వేషణమునకును ధర్మరక్షణమునకును ఖండన మండన గ్రంథము లెన్నియో వెలువడినను, వ్యక్తిపరములుగాక విషయపరము లయినందున జగత్కళ్యాణకరములు.

లౌకికవ్యవహారములయందు మెలఁగువారికి సందర్భానుసారముగ నసూయజనించు సంఘటనలు కలుగునపుడు వాని నెదుర్కొనుప్రయత్నములు గావింపవలయు. నివృత్తిమార్గ ప్రవర్తకుఁడగు ముముక్షువు అరిషడ్వర్గములోఁ జేరిన మాత్సర్యమును (అసూయ) హృదయములోనికిఁ జేరనీయఁ గూడదు.

మాత్సర్యనాశనము.

1. ఎవరి భాగ్యైశ్వర్యములఁ జూచి యోర్వలేక అసూయ కలుగునో వారినిఁ బ్రేమించినయెడల నసూయ మాయమగును. ఇరుగుపొరుగువారి కలిమిబలములఁ జూచి, సంతోషించి ప్రేమించినయెడల నసూయకలుగుట కవకాశ ముండదు. ప్రేమించుటయే అసూయ పొడమకుండుటకు సిద్ధౌషధము. పూర్వజన్మకృత సుకృతవిశేషమున వారికి భాగ్యైశ్వర్యములు కలిగినవి. నేనొనరింపలేదు కాఁబట్టి అట్టి భాగ్యైశ్వర్యములు నాకుఁ గలుగలేదు. నేనును సుకృతముఁ జేసి వారివలెనే భాగ్యైశ్వర్యములఁ బడయుదునని తలంచి నచో నసూయ కలుగదు. అట్టితలంపులేక ఒరులభాగ్యైశ్వర్య ములఁ జూచి యోర్వలేక అసూయాగ్రస్తుఁ డగువాఁడు వారిని నిందించి ద్వేషించినందువల్ల వారియదృష్టమునకు లోపము కలుగదు కాని తనకు మాత్రము పరితాపము కలు గును. అసూయవలన మనస్సు కలుషితమగునుగాని శాంతి కలుగదు ఒరులకలిమినిఁ జూచి సంతోషించి వారినిఁ బ్రేమించి నచో, వారును బ్రేమింతురు. పరస్పరప్రేమవలన నసూయ పొడముట కవకాశ ముండనేరదు.

2. తనభాగ్యైశ్వర్యములఁ జూచి యొరులోర్వలేక యసూయఁ జూపినపుడు (Objective Envy) గర్వము విడిచి, వారినిఁ బ్రేమించి వారితోఁ గలసిమెలసి స్నేహముతో

వర్తించినచో వారును బ్రేమింతురు. అసూయ జనించుట కవకాశము లేకుండును. తనకలిమినిఁ జూచి యితరు లసూయఁ జూపిన, తన కెంతకష్టము కలుగునో, అట్టుల యితరులకుఁ గూడ గలుగునని యాత్మసామ్యముచే నొరులనొప్పింపక ప్రేమించి స్నేహముతో మెలఁగినయెడల, వారును బ్రేమింతురు. దానం జేసియు నసూయ యంతరించును. ఇతరుల సద్గుణములను, భాగ్యైశ్వర్యములనుఁ జూచి వీరెంత సుకృతాత్ములో యేమి తపం బొనరించిరో యని, సంతోషించి వారిని ప్రేమించుకొలఁదిని స్నేహముతోఁ గలసిమెలసి వర్తించుకొలఁదిని మాత్సర్య మడుగంటును.

3. సత్రములయందును మహాకుటుంబములయందును పదార్థసమృద్ధి సుఖము సంపదయు నున్నంతవఱకు నందఱు ననుభవించిరనియు, తనకేమియు మిగులలేదనియుఁ దలంచుచుండువాఁ డితరులసుఖమును సంపదనుఁ జూచి యీర్ష్యచే కష్టపడుచుండును. పృథివియందుండు సుఖసంపదల కంతము లేదనియును, ప్రతిమానవుని కేదేనొకవిధమున నీశ్వరుఁడు కల్పించియుండుననియు, శ్రేష్ఠత్వమునొందుట కవకాశము గలదనియునుఁ దలంచుచుండువాని హృదయసీమలయం దీర్ష్య జనింపఁజాలదు. ఉదారస్వభావము వృద్ధియైనకొలఁదిని మాత్సర్యము నశించుచుండును.

శ్లో. అయం నిజః పరో వేతి గణనా లఘుచేతసాం,
ఉదారచరితానాం తు వసుధైవ కుటుంబకమ్.

(హితోపదేశము.)

వీఁడు తనవాఁడు వాఁడు పరుఁడు అను భేదబుద్ధి అల్పుల కుండునుగాని, ఉదారస్వభావులగు మహనీయులకు భేదబుద్ధి యుండదు. జగత్కుటుంబములో వీరందఱు నాసోదరులు వీరు సుఖింతురుగాక యని విశాలబుద్ధితోఁ బ్రేమించునపుడు మాత్సర్యమున కవకాశ మెక్కడనుండును? భేదబుద్ధి మాత్సర్యము కలిగించును. అభేదబుద్ధి ప్రేమనుఁ బుట్టించును.

4. ఇతరుల ప్రశంసనువినుట కిచ్చగింపక మంచివారి మీఁద దోషముల నారోపింపఁబూనుట మాత్సర్యమనఁబడు. (Jealousy) మాత్సర్యమునకు ప్రధానసహచరి పరనింద. మాత్సర్యము వృద్ధియైనకొలఁదిని పరనింద జిహ్వాగ్రమునందు తాండవమాడుచుండు. పరనింద తగ్గిపోయినకొలఁదిని మాత్సర్యమును తగ్గిపోవుచుండును. పరులసుగుణసంపత్తినిఁ జూచి యోర్వలేక తాను నిందించియైనను లేక యితరులు నిందించుచుండిననుఁ జూచి సంతోషించుచుండును. తన సుగుణసంపత్తినిఁజూచి యితరు లోర్వలేక తనను నిందించుచుండిన తన కెంతకష్టమో, నష్టమో యని తలఁచువివేకి యితరుల నిందింపఁజాలఁడు.

ఈయభ్యాసమును నశింపఁజేసికొనుటకు రెండు మంచి మార్గములు గలవు.

(1) నిందకుఁడు తనదోషములను సర్వదా తానుచూచుకొనుచుండవలయును. స్వదోషముల సంబంధమునం దెప్పుడును, జాగరూకుఁడై యుండువాఁడు పరులను నిందించుటకుఁ

బ్రయత్నింపఁడు. ఇతరులదోషములను తాను వెదకిన తనదోష ముల నితరులు వెదకుదురనియు, దోషము లుండనివాఁడు లోకములో నెవఁడు నుండఁడనియుఁ దలఁచి నిందించుట మానుకొనును.

(2) పరులదోషములను వెదకక గుణములనుమాత్రమే వెదకుచుండుటవలన గుణములఁ గీర్తించవలెననెడి కోరిక వృద్ధి యగును. అందువలన పరుల నిందించుస్వభావము తగ్గిపోవును. సర్వదా పరులగుణకీర్తనముఁ జేయుచుండువారి సహవాసము చేయుటవలనఁ గూడ మిక్కిలి మేలుకలుగును. నేనిఁక దోష ములవెద కనుగుణములనే, వెదకెదనని ప్రతినఁ బూనుకొనిన యెడల, తా నెవరిని నిందించుట కుత్సాహముఁ గలిగియుం డునో వానిచరిత్రనుఁ బరిశీలించి గుణసంధానమును జేయును. పాపాత్మునియందుండు గుణములను గూడ వెదకి తెలిసికొని, వానిగుణకీర్తననుఁ జేయుచుండినయెడల హృదయ మానంద పూరిత మగును. ఇట్లు గుణసంకీర్తనాభ్యాసము చేయుటవలన నితరులసంబంధమునం దెప్పుడు ప్రసంగింపవలసివచ్చిననుగూడ గుణములనే పేర్కొనుచుండును. వారి గొప్పతనమునే వెల్ల డించుచుండును. ముముక్షువు సాధువు యోగియు నగువారిని నిందించుచున్నయెడల వారి పాపపుంజములను నిందకుఁడు తనజిహ్వాగ్రముతో తీసివైచుచుండుటవలన వారికుపకారముఁ జేసినవాఁడే యగునుకాని, తానుమాత్రము వారిపాపములను మూటఁగట్టుకొనును. నిందించుటవలన పాపములు గలుగునని

వివేకి గుణకీర్తనమే కావించును. ఈవిధముగఁ జేయుచుండిన యెడల పరులను నిందింపవలెననుకోరిక దూరమగును.

5. ఈర్ష్యాన్వితుఁ డెప్పుడు నితరులకు నష్టమును గలిగించుటకుఁ బ్రయత్నించుచుండును. అందువలన నాతఁడు బాగుపడుటకే యవకాశ ముండదు. బాగుపడవలయు ననుకోరిక ప్రబలముగ నుండువాఁడు పరులయందుండు సుగుణములు మాత్రమే గ్రహించి, దానిని తనజీవితమునం దలవఱచుకొనుటకుఁ బ్రయత్నించుచుండును. నిజగుణములు లేనివారలు పరులగుణములను జూచి యీర్ష్యాన్వితు లగుచుందురు. పరునిగుణములను సంగ్రహింపఁగలనను నమ్మకము లేనివాఁడు అతనిని క్రిందికిలాగి తనకు సమానునిగఁ జేసికొనుటకుఁ బ్రయత్నించుచుండును. బాగుపడుటకై తలంచువాఁడు తనతో సమానులగుటకు నితరులను క్రిందికిలాగక తా నున్నతినిఁ బొంది వారితో సమానుఁడగుటకుఁ బ్రయత్నించుచుండును. వాఁడు పరులకెప్పుడును నష్టమును గోరఁడు. పరులతో సమానుఁడగుటకు శక్తిలేనివాఁడు క్రమక్రమముగ పరులు తనతో సమానులు గావలయునని కోరుచుండును. ఇది యీర్ష్యకుఁ బునాది. ఈర్ష్యాళువు నిజోన్నతిని మఱచి పరులపతనమునకుఁ బ్రయత్నించుచుండును.

6. విద్యార్థులు పోటీపరీక్షలలో గెలుపుఁ జెందినపుడును, పరీక్షలయందు విజయముఁ బొందినపుడును, వ్యాయామఖేలనలయం దగ్రశ్రేణిలోఁ జేరి బహుమతు లందునపుడును,

వారిమేలుఁ జూచి యోర్వలేక యీర్ష్యానలసంతప్తుఁడై వారికి నష్టమునుఁ గలిగించుటకంటెను, వారిని క్రిందికిలాగి తనతో సమానులుగఁ జేసికొనుటకంటెను, తా నభివృద్ధినొంది వారితో సమానుఁడ నేల కాఁగూడదని ప్రయత్నించువాఁడు బాగు పడును.

7. మాత్సర్యమువలనఁగలుగు నష్టములఁగూర్చి యాలోచించుటవలన మాత్సర్యము నశించును. దోషచింతనమును దోషదర్శనమును వ్యవసాయముగాఁగల దౌర్భాగ్యునిఁ దలఁచినంతనే సజ్జనులహృదయము తల్లడిల్లుననుట నిక్కువము. చంద్రునికళంకము మాత్రమే చూడఁగలిగి, కుసుమమందలికటంకములను మాత్రమే భావింపఁ గలిగి, మృణాళకంటకములను మాత్రమే తెలిసికొనఁ గలిగినవానివంటి దుఃఖభాజనుఁ డీప్రపంచమునందు మఱియొకఁ డుండఁడు. ఈర్ష్యాళుని హృదయ మెప్పుడును కంటకాకీర్ణమును క్లేశపూర్ణమునై యుండును.

శ్లో. ఈర్ష్యీ ఘృణీ త్వసంతుష్టః క్రోధనో నిత్యశంకితః,
పరభాగ్యోపజీవీ చ షడైతే దుఃఖభాగినః.

(హితోపదేశము.)

ఈర్ష్యాళువు, కనికరించువాఁడు,సంతోషములేనివాఁడు, క్రోధనుఁడు, ఎల్లపుడు సంశయముగలవాఁడు, ఇతరభాగ్యము నాశ్రయించి జీవించువాఁడు నీ యాఱుగురును దుఃఖభాజనులని తాత్పర్యము.

8. ఈర్ష్యాన్వితుని కారోగ్యము చెడును. మనోదౌర్బల్య మేర్పడును. కర్తవ్యకార్యములనుఁ జేయుట కిచ్ఛయుండదు. చిత్తస్వాధీనత దూరమగును. ఈజగత్తునందు జరుగు వివాదములు మొదలగువానికంతటికి, ఈర్ష్యయే మూలము. కాఁబట్టి యీర్ష్యకలుగుట కవకాశమీయక జాగరూకతతో మెలఁగవలయు.

అరిషడ్వర్గదమనసారాంశము.

ఉత్తమపురుషార్థమగు మోక్షమునకు ప్రతిబంధకులు అంతశ్శత్రువులు నగు కామక్రోధలోభమోహమదమాత్సర్యములును, వానిస్వరూప స్వభావధర్మములును, వానివలనఁ గలుగునష్టములును, వాని నణఁచువిధమును, ఈప్రకరణము నందంతయు విస్తరముగఁ జెప్పఁబడెను. ఈయరిషడ్వర్గము జయింపఁబడినఁగాని శమాదిషట్కసంపత్తి కలుగఁజాలదు. శమాదిషట్కసంపత్తి సాధనచతుష్టయములో నొకటి. కాఁబట్టి శ్రేయస్కాముఁడు తొలుదొలుత నరిషడ్వర్గమును జయించి మానసదోషములనుఁ బోఁగొట్టి, యోగాభ్యాసముచే నమృతత్వముఁ బడయుటకుఁ బ్రయత్నింపవలయు.

నవద్వారపురరక్షణము.

శ్లో. పురమేకం జగత్యస్మిన్నస్తి మాంసాస్థినిర్మితం,
ధర్మభిత్తిమహాయామం సర్వతస్స్నాయువేష్టితం.

నృపశ్చ పురుషస్తత్ర చేతనావానవస్థితః,
మంత్రిణౌ తస్య బుద్ధిశ్చ మనశ్చైవ విరోధినౌ.
య ఏతే తస్య నాశాయ తావుభావితరేతరం,
నృపస్య తస్య చత్వారో నాశమిచ్ఛంతి విద్విషః.
కామః క్రోధ స్తథా లోభో మోహశ్చాన్యో మహాన్ రిపుః,
యదా తు స నృపస్తాని ద్వారాణ్యావృత్య తిష్ఠతి.
తదా స్వస్థబలశ్చైవ నిరాతంకశ్చ జాయతే,
తస్మాత్ప్రజాగరః కార్యః ప్రబుద్ధేన దివా నిశం.
న ముష్ణంతి చ్ఛలాద్యస్మాత్కామక్రోధాదయో౽రయః.

"మార్కండేయపురాణే"

ప్రవిమలజ్ఞానప్రాకారంబును, శల్యాకీలకంబును, చర్మకుడ్యంబును, రక్తమాంసానులేపనంబును, నానాస్నాయువేష్టనంబును, మహామాయాముఖంబునైన పురంబొకటి కలదు. (పురమనఁగ శరీరము. అందు వసించువాఁడు పురుషుఁడు). ఆ పురంబునకు జీవుఁడు (పురుషుఁడు) రాజు. ఆరాజునకు మనోబుద్ధులు పరస్పరవిరోధులైన మంత్రులు. కామ-క్రోధ-లోభ-మోహము లత్యంత బలవంతులైన శత్రువులు. నలువురయినను వీరియనుచరులు, మదమాత్సర్యము లిరువురు వెంట నుందురు. మంత్రు లిరువురకు నైకమత్యము లేక యొకరు పైకిని, మఱి యొకరు క్రిందికిని లాగుచుండఁగ రాజునకు నష్టము కలుగును. ఈస్థితినిఁ జూచి ప్రబలశత్రువు లెపుడెపుడు పురము నాక్రమింతుమా యని పొంచియుందురు. ఈ నలువురు శత్రువులు

చోరకుండ నన్నరపతి, తనవీటి (పురము) వాకిళ్లు పదిలంబుగా సంవృతంబు (మూసికొనుట) చేసికొనియెనేని తాను నిరాతంకుండు (నిర్భయుఁడు) సమాధి స్వాస్థ్యబలసంపన్నుండును, నిరతిశయానందభరితుండు నగు. ఆవాకిళ్లు గట్ట (మూయ) నసమర్థుం డయ్యెనేని, కామమహాశత్రుఁడు నేత్రాదిద్వారముల ప్రవిష్టుండై సర్వంబును వ్యాపించును. అతనివెనుకనె యమ్మువ్వురుశత్రువులు ప్రవేశింతురు. ఆ నలువురుం గూడి యింద్రియములతోడను, మనస్సుతోడను గాఢస్నేహం బొనరించి, వానినన్నింటిని అవ్వాకిళ్లనుఁ దమవశంబుఁ జేసికొని, దురాసదులై (అన్యుల చొరనీయక,అసాధ్యులై) యకోట్టంబు బడఁగొట్టి, అయ్యమాత్యులం గీటడఁగించి, యంతయుఁ దామే యై వర్తింతురు. అంత నమ్మహీకాంతుఁడు (జీవుఁడు) మంత్రిరహితుండును, విగతపరివారుండును నై నశించు. ఇవ్విధంబున కామాదిశత్రువులు మనుష్యస్మృతినాశకు లగుదురు. తలుపులు తెఱచి, అజాగ్రతతో నుండినపుడు దొంగలు లోపల ప్రవేశించి దీపమునార్పి ధనము నపహరించుచందమున ఈ కామాది చోరులును ఇంద్రియనిగ్రహము లేనపుడు ఇంద్రియద్వారములలోపలఁ బ్రవేశించి జ్ఞానదీపమును మఱుఁగుపఱచి పుణ్యవిజ్ఞాన వివేకధనముల నపహరింతురు. కాఁబట్టి రేయింబవలును జాగరూకుఁడై దొంగల రానీయక పురమును రక్షించుకొనవలయును.

శ్లో. కామః క్రోధశ్చ లోభశ్చ దేహే తిష్ఠంతి తస్కరాః,
జ్ఞానరత్నాపహారాయ తస్మాజ్జాగృత జాగృత.

"ప్రబోధదీపిక"

కామక్రోధాదులను చోరులు జ్ఞానధనము నపహరించుటకై శరీరము నాశ్రయించియుందురు. కాఁబట్టి వివేకధనులు ఇంద్రియద్వారములును జాగ్రతగ మూసి మేల్కొని యుండవలెనని తత్త్వజ్ఞులు బోధించుచున్నవారలు.

అరిషడ్వర్గము జయింపక యేమియొనరించినను వ్యర్థము.

విమలజ్ఞానమునకు ప్రతిబంధకు లగుటంబట్టి శత్రువులనియు, విజ్ఞానధనరత్నము లపహరించుటంబట్టి చోరులనియు, ధ్యానధారణాదులు లభింపమింబట్టి మానసదోషములనియు, నీకామక్రోధాదుల ననేకవిధముల వర్ణించియున్నారు. చెఱువుకు దృఢముగ కట్ట వైచినయెడల, నీళ్లునిలిచి ప్రాణికోటి కుపయోగించుచేందంబున, ఆత్మశక్తికిని ఇంద్రియసంయమము లేనిచో కామక్రోధాదులచే నయ్యది తగ్గిపోవుచుండును. కావున కామక్రోధాదులఁ జొరనీయక శక్తిని రక్షించుకొనిన యెడల ధ్యానధారణాదులు చేక్కఁగ నిలుకడఁ జెందును. ప్రథమమున మానసదోషములగు కామక్రోధాదులను జయించేక యేమియొనరించినను వ్యర్థమనియు, భగవదుపాసన కర్హత కలుగదనియు శ్రీభాగవతమునఁ జెప్పఁబడెను.

శ్లో. ఏభిర్నిర్జితషడ్వర్గైః క్రియతే భక్తిరీశ్వరే,
వాసుదేవే భగవతి యయా సంలభతే రతిం.

శ్రీభాగవత - సప్తమస్కంధము.

కామక్రోధలోభమోహామదమాత్సర్యములను అంతశ్శత్రువులను జయించలేనివారు పరమేశ్వరునియం దత్యంత ప్రేమనుఁ గలిగించుభక్తినిఁ బడయఁజాలరనియు, నీభక్తియోగంబున కరిషడ్వర్గము ప్రతిబంధకమనియు తాత్పర్యము. సామాన్యముగ నెచటఁ జూచినను అరిషడ్వర్గమును జయించవలెనని యున్నదికాని, నాశనము చేయవలసినట్టుల కన్పించుట లేదు. జయింపఁబడినవారు లోఁబడి యనుచరులుగఁగాని మిత్రులుగఁగాని యుండవచ్చును. నాశనము చేయుటకన్న జయించుటయే సుసాధ్యము. కొందఱు తిండిలేక పేదఱికముచే నేమియు వృత్తిలభింపక దొంగతనము చేయఁబూనుకొందురు. వారిని మంచిమార్గములోనికిఁ దెచ్చి చెడ్డతనము మాన్పుట మంచిదా? నాశనముచేయుట మంచిదా? యని యాలోచించిన చెడుగునుండి మాన్పుట మంచిదనియే తోఁచును. జీవదయాపరులగు మహాశయులు, కొండలు అడవులు లోనుండు దొంగజాతులవారినిఁ జేర్చి పాఠశాలలుపెట్టి వారికి చేతిపనులు కూలిపనులు నేర్పి, చదువుఁజెప్పి చెడునడవడికలు దొంగతనమువలనఁ గలుగుబాధలను బోధించి మంచిమార్గము లోనికిఁ దెచ్చుచున్నందున వారును బాగుపడుచున్నారు.

చోరులు వశవర్తులై మంచివారగుటకు నిదర్శనము.

ధనసంపన్నుఁడగు ప్రభువునింటికి చోరులు కన్నము వేసి ధనాదిపదార్థములను గొనిపోవుచుండ, వారిలోఁ గొందఱినిఁబట్టి చెఱసాలలోఁబెట్టినను విడుదలయైనతర్వాత నాచోర స్వభావము పోవకుండి మఱల చోరత్వమునే చేయుచుండిరి. వారలు చిక్కకుండ నపహరించుచు నెంతయు నష్టమును కష్టమునుఁ గలిగించుచుండ నొకమహనీయుని నీబాధ తొలఁగు నట్టుల యుపాయము చెప్పుమని ప్రార్థించెను. అనుభవముగల యామహనీయుఁడు వారలను మంచితనముచేత లోఁబఱచు కొనుమని యుక్తిచెప్పెను. ఈప్రభువు తనయింట గొప్ప వివాహకార్యము లొనరించుచు, నెల్లఱకు నన్నవస్త్రముల సత్కరించుచుండి దొంగలను బిలిచి మీరు మాయింట జరుగు ప్రతిశుభకార్యమునకు వచ్చి, తృప్తిగ భుజించి వస్త్రములు ధరించిపోవలయును. మీకుఁ గావలసినసాహాయ్య మొనరించెదనని చెప్పఁగ నాదొంగలందఱు తమకుఁ గావలసినది అన్నము వస్త్రమే కదా! యని సమ్మతించి అట్లువచ్చి భుజించి పోవుచుండిరి. వారి యన్నవస్త్రములఁ గైకొనినవిశ్వాసముచే నన్నముఁ బెట్టినప్రభువునింట దొంగతనము చేయఁగూడదని మానుకొనిరి. ఓప్రభూ! మాకు వృత్తులను జీవికనుఁ గల్పించే వలసినదని ప్రార్థింప నాతేఁడు వ్యవసాయముసేయ భూముల నిచ్చి ఇండ్లు కట్టించుచు, కాలువలు త్రవ్వించుచు, కూలిపను

లనుఁ గల్పించి వారికిఁ దృప్తికలుగునట్టుల ధనమిచ్చుచున్నం దున దొంగతనముసేయుట మానుకొని సద్వృత్తుల నవలంబించి బాగుపడిరి. ఈదృష్టాంతమువలన కామాదులకు మంచి త్రోవఁ జూపి లోఁబఱచుకొనవలయు. కాముఁడు సంకల్పములు ఇచ్ఛలు లేక జీవింపలేఁడు. గనుక సద్గ్రంథశ్రవణపఠన సత్సంగతి లోనగు మోక్షసాధనములం దిచ్ఛఁ గలిగింపవలయు. ప్రధానశత్రువగు కాముఁడు లోఁబడినట్టులయితే యెల్లఱు లోఁబడినట్టుల భావింపఁదగు. క్రోధము నుపశమింపఁజేసి కొలఁదిగ ధర్మోపప్లవములు సాధుబాధలు గలిగినపు డుపయోగింపవలయు. లోభమును సద్విషయములందు వినియోగింపవలయు. ఆయా ప్రకరణఘట్టములందు వానినెట్లుపశమింపఁ జేయవలసినది, ఎట్లు జయించేవలసినది సముచితముగ వివరింపఁబడెను.

దుర్వృత్తిజయసాధనసంగ్రహము.

శ్లో. అసంకల్పాజ్జయేత్కామం క్రోధం కామవివర్జనాత్,
అర్థేఽనర్థేక్షయా లోభం భయం తత్త్వావమర్శనాత్.
ఆన్వీక్షిక్యా శోకమోహౌ దంభం మహదుపాశ్రయాత్,
యోగాంతరాయా న్మౌనేన హింసాం కామాద్యనీహయా.
కృపయా భూతజం దుఃఖం దైవం జహ్యాత్సమాధినా,
ఆత్మజం యోగవీర్యేణ నిద్రాం సత్త్వనిషేవయా.
రజస్తమశ్చ సత్త్వేన సత్త్వంచోపశమేన చ,
ఏతత్సర్వం గురౌ భక్త్యా పురుషోహ్యాంజసా జయేత్.

శ్రీభాగవత - సప్తమస్కంధ.

సంకల్పించకుండుటవలన కామమును, కామమును విడుచుటవలన క్రోధమును, ధనమునఁ గీడుకలుగుననుదృష్టిచే లోభమును, తత్త్వజ్ఞానముచే భయమును, ఆత్మానాత్మవివేకముచే శోకమోహములను, సాత్త్వికపురుషాశ్రయముచే డంబమును, యోగవిఘ్నకరములగు లోకవార్తాదులను మౌనముచేతను, దేహాదులయందు వైరాగ్యముచే హింసను, దయచేత హితము నాచరించుటచే ప్రాణులయందలి దుఃఖమును, దైవికములగు వ్యథామనఃపీడాదులను సమాధిచేతను, శారీరక దుఃఖమును ప్రాణాయామాదియోగబలముచేతను, సాత్త్వికాహారముచేత నిద్రను, సాత్త్వికగుణముచే రజస్తమస్సులను, పరమశాంతిచేత సాత్త్వికమును జయించవలయును. సద్గురునందు భక్తిఁ గలిగియుండుటచే వీనినన్నింటిని సులభముగా జయింపవచ్చునని తాత్పర్యము. అరిషడ్వర్గమును జయింపక కావించిన ఇష్టాపూర్తాది విధులన్నియు వ్యర్థము లనియు, యోగములన్నియు శ్రమనుఁ గలిగించునవియే కాని సార్థకములు కావనియు నొక్కి వక్కాణించినవారలు కాఁబట్టి అరిషడ్వర్గమును ముఖ్యముగ జయింపవలయును. ఈజగత్తునందు ప్రవృత్తిమార్గమున నింద్రియవిషయములలోఁ జిక్కువడి దుర్బలుఁ డగుమానవుఁడు శ్రీపరమేశ్వరు ననుగ్రహము లేక ప్రబలులగు కామాదిశత్రువులను జయింపఁజాలఁడు గనుక భగవంతుని శరణుఁజొచ్చుటయే కర్తవ్యాంశమని ముచికుంద స్తోత్రమునఁ దెలియఁబడుచున్నది.

శ్లో. చిరమిహ వృజినార్తస్తప్యమానోఽనుతాపై
రవితృషషడమిత్రో ఽలబ్ధశాంతిః కథంచిత్,
శరణద సముపేత స్త్వత్పదాబ్జం పరాత్మ
న్నభయమృతమశోకం పాహి మాఽఽపన్నమీశ.
(శ్రీభాగవత - దశమస్కంధము.)

అక్షీణకృపాకటాక్షవీక్షణ అంతశ్శత్రుశిక్షణ శరణాగతజనరక్షాదీక్ష పుండరీకాక్ష! చిరకాలము నేనొనరించిన పాపకర్మలచే బాధితుఁడ నగుచు, తాపత్రయములచే సంతప్తుఁడ నగుచు, నెంతఁ బొందినను తనివిఁజెందని యంతశ్శత్రువులగు కామాదులచేఁ బీడితుఁడ నగుచు నెవ్విధంబున నేని శాంతిఁ బొందఁజాలక యున్నాఁడను. ఓ పరమేశ్వరా! అభయంబును, అమృతంబును విశోకంబునగు నీపాదారవిందమును శరణుఁ జొచ్చుచేన్నాఁడ. ఈశత్రువుల నీతాపంబులను నేను జయింపఁజాల నేసైపఁజాల. ఆపన్నుఁడ నగునన్ను రక్షింపుము. నిరతిశయసుఖంబగు నీపాదాబ్జభక్తి నొసంగి, నన్ను గ్రహింపవే యని ముచికుందుండు ప్రార్థించెను.

ఇది, ఆపస్తంబసూత్ర, వాసిష్ఠసగోత్ర పవిత్ర, ముక్తినూతులపాటి
వంశపయఃపారావారరాకాసుధాకర, సీతారామామాత్య
విద్వత్కపీంద్రపుత్ర, జ్యోతిర్విద్వర, విద్యాశేఖర
బిరుదాంచిత, గోపాలకృష్ణశాస్త్రి ప్రణీతంబగు
మనస్తత్త్వశాస్త్రమునందు అరిషడ్వర్గమను
ద్వితీయప్రకరణము సమాప్తము.

మనస్తత్త్వశాస్త్రము.

తృతీయ ప్రకరణము.



Instincts, వాసనలు - సంస్కారములు.

Latent Desires - Impressions.

పూర్వప్రకరణమున మోక్షసాధన మగుజ్ఞానమునకు ప్రతిబంధకములును, మానసదోషములునగు కామక్రోధములు వివరింపఁబడెను. ఆకామక్రోధాదు లుత్పత్తియగుటకుఁ గారణములగు వాసనలు, సంస్కారములు, వానిస్వరూపధర్మములు ఈప్రకరణమున విస్తరించి చెప్పఁబడును.

వాసనాస్వరూపము.

జీవునిచేఁ జేయఁబడు శుభాశుభకర్మలన్నియు వాసనారూపముగ అంతఃకరణమునందు స్థితినిఁ జెందును. ఈవాసనలన్నియు కర్మబీజము లనఁబడు. "బీజవృక్షన్యాయముగ" వాసనవలన కార్యమును, కార్యమువలన వాసనయు నేర్పడుచు నన్యోన్యాశ్రయముగ నుండును. మనమేదేని కార్యమొనరించిన వాసనా (సంస్కార) రూపముగ స్థితినిఁ జెంది, నియమితకాలంబున క్రియారూపముగ పరిణమించును.

"వాసయతి కర్మణా యోజయతి జీవమనాంసీతి"

జీవులమనస్సులను కర్మచేతఁ గూర్చునది వాసన యనఁబడునని వ్యుత్పత్త్యర్థము.

శ్లో. వసత్యదృష్టా సర్వేషు భూతేష్వంతర్హితా య చ,
ధాతుర్వస నివాసేతి వాసనా తేన సా స్మృతా.

దేవీపురాణే. ౪౫ అధ్యాయము.

"వస్ నివాస" యను ధాత్వర్థమునుఁబట్టి సకలప్రాణుల మనస్సులందు హితమొనరించుటకై కనఁబడకుండ నుండునది కాఁబట్టి వాసన యనఁబడునని తాత్పర్యము. దీనింబట్టి జీవుని మనస్సంతయు, వాసనామయంబనియు, జన్మాంతరకృత శుభాశుభకర్మలన్నియు, కర్మాశయమందు వాసనారూపముగనుండి సంకల్పముద్వారా క్రియారూపముగఁ బరిణమించును. వాసనానుగుణ్యమగు సంకల్పమేర్పడి కార్యము లొనరించునని స్పష్టమగుచున్నది.

వాసన కర్మబీజము.

వాసన యన సూక్ష్మావస్థాపదవ్యవహార్యమై అంకురించేని సంస్కారవిశేషము. సూక్ష్మములగు బీజములును, భూమియందు కన్పింపకయుండి, వర్షింపగనే క్రమముగ నంకురించి పల్లవించి కుసుమించి ఫలించువిధంబున, హృదయక్షేత్రంబున నిగూఢముగనుండు వాసనాబీజములును, కాలకర్మవిపాకము ననుసరించి విషయేంద్రియసంయోగమున కామనచే నంకురించి,

సంకల్పముచే పల్లవించి, కర్మచే కుసుమించి, అనుభవముచే ఫలించును. కర్మేంద్రియ జ్ఞానేంద్రియములచేఁ గావించు కృత్యములన్నియు సంస్కారరూపముగ హృదయమందు వాసనాస్థితినిఁ జెంది, జననమరణరూపసంసారచక్రమునందు జీవుని పరిభ్రమింపఁ జేయుచున్నవి ఈవాసనాబీజములే, అవిచ్ఛిన్నమగు సంసారవృక్షమునకుఁ గారణములు. యోగవాసిష్ఠమునందును వాసనాస్వరూపము చక్కఁగ వివరింపఁబడెను.

శ్లో. దృఢభావనయా త్యక్త్వా పూర్వాపరవిచారణం,
యదాదానం పదార్థస్య వాసనా సా ప్రకీర్తితా.

చిరకాలమునుండి దృఢముగ భావింపఁబడియున్నందున, ముందువెనుక మంచిచెడ్డలను యోజించకయే యొకవస్తువును గ్రహించుటకు కారణము వాసన యనఁబడు. దృఢభావనానిశ్చితపదార్థముయొక్క గుణదోషములనుఁ గనిపెట్టక, మంచిదనేకాని చెడ్డదనేకాని యభిమానముంచుటకుఁ గారణము వాసన యని భావము.

శ్లో. భావితం తీవ్రసంవేగా దాత్మనా యత్తదేవ సః,
భవత్యాశు మహాబాహో విగతేతరసంస్మృతిః.

పురుషుఁడు ఇతరవస్తువులను స్మరింపక తీవ్రభావనచే (నిశ్చలమనస్సు) నేవస్తువును భావించునో, ఆవస్తువుగా నేర్పడును.

శ్లో. తాదృగ్రూపో హి పురుషో వాసనావివశీకృతః,
సంపశ్యతి యదేవైతత్సద్వస్త్వితి విముహ్యతి.

భావనాభావితస్వరూపుం డగుపురుషుఁడు ఆయావస్తు భావనలవలనఁ గలిగిన సంస్కారమనువాసనచే పరవశుఁడై, యే వస్తువునుఁ జూచునో, ఆవస్తువు మంచిది కాకపోయినను, మంచిదిగనే తలఁచును.

శ్లో. వాసనావేగవైవశ్యాత్స్వరూపం ప్రజహాతి తత్,
భ్రాంతం పశ్యతి దుర్దృష్టిః సర్వం మదవశాదివ.

అతిశీఘ్రములగు వాసనలచే నాకర్షింపఁబడినవాఁడు తన స్వరూపమునే తాను వాస్తవముగఁ దెలిసికొనఁజాలక, మత్తతచే కనులు దిరుగువాఁడు, సర్వపదార్థములు తిరుగుచున్నట్టుల యేవిధముగఁ దలఁచునో, అట్టుల సర్వపదార్థములను మంచివానిని చెడుగుగను, చెడువానిని మంచిగను విపరీతముగఁ దలఁచునని భావము

శ్రు. స యథా కామో భవతి తత్క్రతుర్భవతి,
తత్కర్మ కురుతే యత్కర్మ కురుతే తదభిసంపద్యతే.

బృహదారణ్యకోపనిషత్.

పురుషుఁ డేవస్తువును తాను కోరునో, అందుకుఁ దగిన సంకల్పమునుఁ జేయును. సంకల్పానుగుణ్యముగ కర్మనుఁ జేయును. కర్మానుగుణ్యముగ ఫలమును బొందును. అనఁగా కామనాసంకల్పాదులచేత సంస్కారరూప వాసనగలిగి, యా వాసనచేతనే సంకల్పకర్మాద్యుత్తరకృత్యములయందుఁ బ్రవర్తించునని భావము.

సత్కర్మలవలన (పుణ్య) శుద్ధవాసనలును, దుష్కర్మల వలన (పాప) మలినవాసనలు నుత్పన్నములై హృదయక్షేత్ర మందు (కర్మాశయమందు) నెలకొనును.

శ్లో. వాసనా ద్వివిధా ప్రోక్తా శుద్ధా చ మలినా తథా,
మలినా జన్మహేతుస్స్యాచ్ఛుద్ధా జన్మవినాశినీ.

శుద్ధవాసన యని, మలినవాసన యని వాసన రెండు విధములు. అందు మలినవాసన జన్మకు కారణముగను, శుద్ధ వాసన జన్మవినాశనమునకు (మోక్షమునకు)ను హేతువుగఁ జెప్పఁబడుచున్నవి.

శ్లో. అజ్ఞానసుఘనాకారా ఘనాహంకారశాలినీ,
పునర్జన్మకరీ ప్రోక్తా మలినా వాసనా బుధైః.

యోగవాసిష్ఠము.

అన్నమయాది పంచకోశములకును, వీనికాధారమై ప్రకాశకమై సాక్షియైన చిదాత్మకును, సహజముగ భేదము కలిగియున్నప్పటికి, భేదము కనుపడకుండ నాచ్ఛాదించునది యజ్ఞానము. మజ్జిగ మేళనముచేత పాలువలెను, మంచుప్రదేశ ములో నుంచుటచే నెయ్యివలెను, అజ్ఞానముచేత వాసన ఘనీ భవించును అజ్ఞానముతోఁ జేరి భ్రమపరంపరనుఁ గలుగఁజేయు నదియు, ప్రబలమైన యహంకారముతోఁ గూడియుండు నదియు, ఉత్తరకాలమున జన్మపరంపరను గలుగఁజేయు సామ ర్థ్యముగలదియు మలినవాసన యని పండితులచేఁ జెప్పఁబడు చున్నది.

శ్లో. దైవీ సంపద్విమోక్షాయ నిబంధాయాఽసురీమతా.

దైవసంపదగు "అభయసత్త్వసంశుద్ధ్యాదులు" శుద్ధ వాసనలు మోక్షమును, ఆసురసంపదయగు "అశౌచానాచారాజ్ఞానాదులు మలినవాసనలు బంధమునుఁ, గలిగించునని శ్రీకృష్ణభగవానులు భగవద్గీతల పదియాఱవయధ్యాయమందు విస్తరించి యానతిచ్చినవారలు.

మలినవాసనలు - ఆసురసంపద.

శ్లో. ప్రవృత్తిం చ నివృత్తిం చ జనా న విదురాసురాః,
న శౌచం నాఽపి చాచారో న సత్యం తేషు విద్యతే. 7
అసత్య మప్రతిష్ఠం తే జగదాహు రనీశ్వరం,
అపరస్పరసంభూతం కిమన్యత్కామహైతుకం. 8
ఏతాం దృష్టిమవష్టభ్య నష్టాత్మానోఽల్పబుద్ధయః,
ప్రభవంత్యుగ్రకర్మాణః క్షయాయ జగతోఽహితాః. 9
కామమాశ్రిత్య దుష్పూరం దంభమానమదాన్వితాః,
మోహాద్గృహీత్వా ఽసద్గ్రాహాన్ ప్రవర్తంతే ఽశుచివ్రతాః. 10
చింతామపరిమేయాం చ ప్రళయాంతా ముపాశ్రితాః,
కామోపభోగపరమాః ఏతావదితి నిశ్చితాః. 11
ఆశాపాశశతైర్బద్ధాః కామక్రోధపరాయణాః,
ఈహంతే కామభోగార్థమన్యాయేనార్థసంచయాన్. 12

భగవద్గీత 16-వ అధ్యాయ, (7-12 శ్లోకము.)

7. రాక్షసాంశములోఁ బుట్టినవారు ధర్మకార్యముల యందుఁ బ్రవర్తించుటకాని, అధర్మకార్యములనుండి నివర్తిం

[illegible]కాని, ఏపని చేయవచ్చును. ఏపని చేయఁగూడదనికాని గుర్తెఱుఁగరు. శౌచముగాని ఆచారము వారికి లేదు. యథార్థముగ మాట్లాడరు.

8. శ్రుతిస్మృతీతిహాసపురాణములు వాస్తవములును ప్రమాణములును కావనియు, సుఖదుఃఖములను హేతుభూతములగు ధర్మాధర్మములు లేవనియు, చార్వాకమతము నవలంబించి భగవంతుఁడుకాని, జీవుఁడుకాని లేఁడనియుఁ జెప్పుదురు. ప్రపంచము తనంతట తానే పుట్టినదనియు, సృష్టికర్తగు నీశ్వరుఁడు లేఁడనియు, స్త్రీపురుషుల పరస్పరసంయోగమే సృష్టికిఁ గారణమనియు, పరలోకము లేదనియు వీరు వాదింతురు. దీనం బట్టి శాస్త్రములు చెప్పునవి నిష్ప్రయోజనములనియుఁ జెప్పుదురు.

9. ఇట్టి నాస్తికదృష్టి నవలంబించి, మలినాంతఃకరణములు గలవారగు అల్పబుద్ధులైన లోకులకు అహితము భయంకరములగు పనులు చేయుచుందురు. కొట్టుట, తిట్టుట, తప్పుపత్రములు సృష్టించుట యిట్టివన్నియు నాసుర ప్రకృతిలక్షణములు. [illegible] లోకవినాశనమునకే వీరు పుట్టుదురు.

10. లోకములలోనుండు సువర్ణమణిగృహక్షేత్రాది పదార్థములు ఎన్ని లభించినను తృప్తిఁబొందక దురాశగలవారై, డంబమును, మదము, అభిమానము వీనితోఁ గూడికొని, పట్టుదలతో నశుద్ధమగు పనులు చేయుదురు. స్త్రీలను, ధనికులను,

నిధులను వశపఱచుకొనుటకై, మద్యమాంసాదిద్రవ్యసహాయముతో శ్మశానములో పీనుగలపైనిఁ గూర్చుండి లేక, యొంటికాలితో నిలుచుండి లోకనింద్యము లగువ్రతముల నవలంబింతురు.

11. ప్రళయకాలమున నన్ని నశించినను, నాశముఁజెందని విపరీతమగుచింతకు లోఁబడి, ప్రక్చందనవనితాదికామముల ననుభవించుటయే, పరమపురుషార్థమని తలఁచి తదనుగుణముగఁ బ్రవర్తింతురు.

12. అనేకవిధములయిన దురాశాపాశములచే నీడ్వఁబడుచు, కామక్రోధముల నాశ్రయించి, కామభోగముల ననుభవించుటకొఱకే దొంగతనము, జూదము, మోసము మొదలగు నన్యాయమార్గములచే ధనము నార్జింపఁదలంతురు. (లంచాలు మామూళ్లు వగైరా తీసికొనుట.)

పై శ్లోకములచే దుర్వాసనల భ్రాంతిపరంపర చెప్పఁబడినది.

శ్లో. ఇదమద్య మయా లబ్ధమిమం ప్రాప్స్యే మనోరథం,
ఇదమస్తీదమపి మే భవిష్యతి పునర్ధనం. 13
అసౌ మయా హతశ్శత్రుర్హనిష్యే చాఽపరానపి,
ఈశ్వరోఽహమహం భోగీ సిద్ధోఽహం బలవాన్ సుఖీ. 14
ఆఢ్యోఽభిజనవానస్మి కోఽన్యోఽస్తి సదృశో మయా,
యక్ష్యే దాస్యామి మోదిష్యే ఇత్యజ్ఞానవిమోహితాః. 15

అనేకచిత్తవిభ్రాంతా మోహజాలసమావృతాః,
ప్రసక్తాః కామభోగేషు పతంతి నరకే ఽశుచౌ. 16
ఆత్మసంభావితాః స్తబ్ధా ధనమానమదాన్వితాః,
యజంతే నామ యజ్ఞైస్తే దంభేనాఽవిధిపూర్వకం. 17
అహంకారం బలం దర్పం కామం క్రోధం చ సంశ్రితాః,
మామాత్మపరదేహేషు ప్రద్విషంతోఽభ్యసూయకాః. 18
భగవద్గీతా 16-వ అధ్యాయ. (13-18 శ్లోకం.)

పై శ్లోకములచే అహంకారమున్ను చెప్పఁబడినది.

శ్లో. తానహం ద్విషతః క్రూరాన్ సంసారేషు నరాధమాన్,
క్షిపామ్యజస్రమశుభా నాసురీష్వేవ యోనిషు. 19
ఆసురీం యోని మాపన్నా మూఢా జన్మని జన్మని,
మామప్రాప్యైవ కౌంతేయ తతో యాంత్యధమాం గతిం. 20
భగవద్గీత 16-వ అధ్యాయము.

13. ఇట్టి యాసురప్రకృతిగలవారు ఈ చెప్పఁబోవు విధముగఁ దలఁచుచుందురు. నామనస్సునకు సమ్మతమయినవిషయము నిప్పుడు పొందినాఁడ. ఇంకొకవిషయమును గూడఁ బొందఁగలను. ఇంతధన మిప్పటికి నాకుఁ గలదు. ఇంకను కొంత ధనము రాఁగలదు. (తనధనము నెల్లప్పుడు చూచి మురియుచు, గొంతెమ్మకోరికల కోరుచుండును.)

14. ఈశత్రువు నిప్పటికిఁ జంపితిని. ఇంక నితరశత్రువులను జంపివేయఁగలను. నాతో విరోధముఁ బెట్టుకొన్నవాఁ డెవ్వఁడు బ్రదుకును ? నే నెందఱనో చంపినాఁడను. కొంపలుఁ

గూల్చినాఁడను. దేవుఁడనఁగ నెవఁడు? నాకన్న నెవఁడు భోగి? ఎవఁడు బలవంతుఁడు? నన్నుమించినవారు ముల్లోకములలో లేరు. నేనే పరమసుఖము ననుభవించుచున్నానని విఱ్ఱవీఁగు చుండును.

15. నేనే ద్రవ్యముఁగలవాఁడ, గొప్పకులమునందుఁ బుట్టినాఁడ, నాతో సమునఁడగుమనుష్యుఁ డొకఁడును లేఁడు, యాగముల చేయుచున్నాఁడ, నటవిటగాయకగణికలకు బహుళద్రవ్యమును దానము చేయుచున్నాఁడ, దానిచేతనే మహానందభరితుఁడుగ నున్నాఁడ” నని యిటువంటియజ్ఞానముచే రాక్షసాంశసంభూతులు మోహమునుఁ బొంది, ఆత్మస్తుతిఁ జేసికొనుచు, డంబము (బడాయి) కొట్టుకొనుచు, వివేకహీనులై నరకములయందుఁ బడుదురు.

16. అనేక మనోరథములయందుఁ బ్రవర్తించుచిత్తముచే నాకర్షింపఁబడినవారై, అజ్ఞానమను వలలోఁ జిక్కి, విషయభోగములయం దత్యంతాసక్తులై కొంతకాలము బ్రదికియుండి చివరకు మృతిఁజెంది మహారౌరవాదినరకములందుఁ బడుదురు.

17. ఈరాక్షసప్రకృతిఁ గలవాఁడు తనబుద్ధిచేతనే తనను పూజ్యునిగఁ దలఁచువాఁడును, ఎట్టియోగ్యత గలపురుషులకును నమ్రుఁడు కానివాఁడును, ధనముచేత అభిమానము, గర్వము గలవాఁడునై కీర్తినిఁ బొందుటకై అశాస్త్రీయముగఁ గొన్నియాగముల నొనరించును.

18. అహంకారము, బలము, గర్వము, కామక్రోధములతోఁ గూడికొని, తమదేహమందును ఇతరులదేహమందును చిద్రూపముగనున్న పరమేశ్వరునియందు ద్వేషముఁగలవారై భగవదాజ్ఞారూపములగు శ్రుతిస్మృతిప్రమాణములను విశ్వసింపక, తమకిష్టమయినవానిని ప్రమాణముగా నమ్మియుందురు.

19. క్రూరస్వభావముగల యీ యధములను, ఆసురస్వభావముగల సర్పవ్యాఘ్రాదిజన్మలయందే ప్రవేశపెట్టుచున్నాను.

20. అట్టిమూఢులు క్రూరస్వభావముగల పశుపక్షిసర్పవ్యాఘ్రాదిజన్మలను బొంది పరమేశ్వరుఁడగునన్నుఁ బొందుమార్గముఁ దెలియక, అతినీచమయినగతినిఁ బొందుదురని శ్రీభగవాను లానతిచ్చుచున్నవారలు.

శు ద్ధ వా స న.

శ్లో॰ పునర్జన్మాంకురం త్యక్త్వా స్థితా సంభృష్టబీజవత్,
దేహార్థం ధ్రియతే జ్ఞాతజ్ఞేయా శుద్ధేతి చోచ్యతే.

యోగవాశిష్ఠం.

వేయించిన విత్తనపుగింజలు మొక్కమొలచుటకు యోగ్యత లేకయుండునటుల శుద్ధవాసనయు పునర్జన్మకుఁ గారణముగాక, దేహధారణమాత్రమున నుపయోగముగ నుండి, తెలియఁదగినతత్త్వమును చక్కఁగఁ దెలిసికొనియుండునది.

జ్ఞేయతత్త్వస్వరూపము బ్రహ్మభావన - శుద్ధవాసన.

శ్లో. జ్ఞేయం యత్తత్ప్రవక్ష్యామి యజ్జ్ఞాత్వా ఽమృతమశ్నుతే,
అనాదిమత్పరం బ్రహ్మ న సత్తన్నాసదుచ్యతే. 13
సర్వతః పాణిపాదం తత్సర్వతోఽక్షిశిరోముఖం,
సర్వతశ్శ్రుతిమల్లోకే సర్వ మావృత్య తిష్ఠతి. 14
సర్వేంద్రియగుణాభాసం సర్వేంద్రియవివర్జితం,
అసక్తం సర్వభృచ్చైవ నిర్గుణం గుణభోక్తృ చ. 15
బహిరంతశ్చ భూతానా మచరం చరమేవ చ,
సూక్ష్మత్వాత్తదవిజ్ఞేయం దూరస్థం చాంతికేచ తత్. 16
అవిభక్తం చ భూతేషు విభక్తమివ చ స్థితం,
భూతభర్తృ చ తజ్జ్ఞేయం గ్రసిష్ణు ప్రభవిష్ణు చ. 17
జ్యోతిషా మపి తజ్జ్యోతి స్తమసః పరముచ్యతే.

భగవద్గీత 13 అధ్యాయము.

13. అమానిత్వాదిసాధనములచే తెలియఁదగినతత్త్వమును దెలిసికొనినచో పురుషుఁడు మోక్షమును బొందుచున్నాఁడు. ఆయాత్మతత్త్వ మెట్టిదన? ఎనుబదినాలుగులక్షల యోనివర్గములకు మూలప్రకృతి; జన్మ లేక యున్న సర్వాధికమైన పరబ్రహ్మస్వరూపము. ఈపరమాత్మస్వరూప మవాఙ్మానసగోచర మయినందున, "సత్" అని చెప్పుటకుఁగాని "అసత్" అని చెప్పుటకుఁగాని వీలులేదు. వేదమునందుండు విధి నిషేధవాక్యములచే ప్రతిపాదింపఁబడునది కాదు. పంచేంద్రియములకు గోచరించునది ప్రత్యక్షము, "సద్వస్తువు" అట్టిది కాదు.

"అసత్తు" అందుమా? అది యుండుటవలననే పంచేంద్రియములు పనిచేయుచున్నవి. ప్రాపంచికవిషయములరీతిని ఉన్నదనికాని, లేదనికాని చెప్పుటకు వీలులేదు. జ్ఞేయము విచిత్రమైనతత్త్వము.

14. ఈ పరబ్రహ్మ సర్వవ్యాపకమై, సర్వాత్మకమునై యున్నందున సర్వప్రదేశములయందుండు హస్తపాదాద్యవయవములు తనవిగాను, సర్వప్రదేశములయందుండు నేత్రములు, శిరస్సులు, ముఖములు తనవిగాను కలిగియుండు. మన కండ్లు, కాళ్లు ఆయనవియే. మనవి యనుకొనునవియన్నియు నాపరమాత్మవియే. మనమును పరమాత్మసొత్తు అనుకొనుట బ్రహ్మభావన శుద్ధవాసన.

15. పరమాత్మ సకలమయిన చక్షురాదీంద్రియములును, వీనికి విషయములయిన రూపాద్యర్థములను బ్రకాశింపఁ జేయుచు, స్వతఃచక్షురాదీంద్రియములు గాని రూపాదిధర్మములుగాని లేనిదై యుండును. సమస్తపదార్థములతోడి సంబంధము లేనిదై యున్నప్పటికి సమస్తపదార్థములకు నాధారమై యుండును. సహజముగ సత్త్వరజస్తమోగుణములు లేనిదైనప్పటికి, సత్త్వాదిగుణములను సన్నిధానమాత్రముచేతఁ బ్రవర్తింపఁ జేయుచుండు.

16. పరబ్రహ్మ సమస్తభూతములకుఁ గారణమయినందున, కటకమకుటాదిభూషణములయందు సువర్ణము లోపల

[illegible]

[illegible]

17. [illegible]

చెప్పఁబడేసత్త అంతట నేకరూపముగా నున్నందున, పరబ్రహ్మ సత్తాస్వరూపముచేత నంతట నభేదముగా నుండియు, ఘట పటాదిపదార్థోపాధిభేదముచేత భిన్నముగఁ గనుపడుచుండు నని భావము.

సమస్తభూతములను స్థితికాలమునందు పోషించుచు, లయకాలమునందు నశింపఁజేయుచు, సృష్టికాలము రాగానే తిరిగి యథాపూర్వముగ స్వమాయాశక్తి నవలంబించి సృజించు చుండును. ఇదియునుంగాక ప్రకాశింపఁజేయు స్వభావముగల సూర్యాది తేజస్సులను గూడ ప్రకాశింపఁజేయు స్వభావము గలదియు, అజ్ఞానముచే నెంతమాత్రముఁగనైన స్పృశింపఁబడ నిదియునని చెప్పఁబడుచున్నది. వెలుతురుఁగలిగించు ప్రాకృతిక సూర్యాదితేజస్సులు ఉత్తచీకటినిఁ బోఁగొట్టునవి కాని, పర మాత్మతేజస్సు అనిన, అజ్ఞానాంధకారమునుఁ బోఁగొట్టును. కాఁబట్టి వానికన్న నధికమైనదని భావించుటచే బ్రహ్మభావన శుద్ధవాసన యగును.

అమానిత్వాదిజ్ఞానసాధనములును - శుద్ధవాసనలు.

శ్లో. అమానిత్వ మదంభిత్వ మహింసా క్షాంతిరార్జవం,
ఆచార్యోపాసనం శౌచం స్థైర్య మాత్మవినిగ్రహః. 8
ఇంద్రియార్థేషు వైరాగ్య మనహంకార ఏవ చ,
జన్మమృత్యుజరావ్యాధి దుఃఖదోషానుదర్శనం. 9

అసక్తి రనభిష్వంగః పుత్రదారగృహాదిషు,
నిత్యం చ సమచిత్తత్వమిష్టానిష్టోపపత్తిషు. 10
మయి చానన్యయోగేన భక్తిరవ్యభిచారిణీ,
వివిక్తదేశసేవిత్వ మరతి ర్జనసంసది. 11
అధ్యాత్మజ్ఞాననిత్యత్వం తత్త్వజ్ఞానార్థదర్శనం,
ఏతత్ జ్ఞానమితి ప్రోక్త మజ్ఞానం యదతోఽన్యథా. 12

భగవద్గీతా 13 అధ్యాయం.

పై నయిదుశ్లోకములలోఁ జెప్పఁబడిన అమానిత్వాది జ్ఞానసాధనలు ఇరువదియు (Calendar Slokas) నతిముఖ్యములు గనుక యెదుటనున్నపటములోఁ గన్పించునట్లు భావింపవలయు. ఇవి శుద్ధవాసనలు. క్రమముగా వివరింపఁబడును.

1. **అమానిత్వము** - Unhaughtiness = విద్యాధనకులాభిజాత్యాధికారములఁబట్టి కలుగు పొగరుఁబోతుతనము, తా నితరులకన్న నధికుఁ డనుకొనుట మానము, అది లేకుండుట అమానిత్వమనఁబడు.

2. **అదంభిత్వము** - Unpretentiousness = గౌరవలాభార్థము తన్నుఁ బ్రకటించుకొనుట, పొగరుఁబోతుతనమును బయటఁ జూపించుట దంభము. ఇది నడకలో చూపులో మాటలలోఁ గన్పడును. ఇది లేకుండుట అదంభిత్వము.

3. **అహింసా** - Harmlessness = మానసిక, వాచిక, కాయికములచే నెవ్వరికి నేవిధమైనహింస చేయకుండుట, పరులను పీడింపకుండుట.

4. క్షాంతి - Forgiveness = ఇతరులు తనయెడ నెంతయపరాధ మొనర్చినను, నిందాతిరస్కారాదులు గావించినను, వికారముఁ జెందక యాయపరాధమును సహించుకొనుట.

5. ఆర్జవము . Rectitude = సర్వవ్యవహారములయందు కౌటిల్యము లేకుండుట, అనఁగా మనోవాక్కాయముల నేకరూపముగఁ బ్రవర్తింపఁజేయుట

6 ఆచార్యోపాసనము Service of the teacher = తనకు సద్విద్యను బోధించినగురువును, శుశ్రూషానమస్కారాదులచే సేవించుట, వారికి పరిచర్య సేయుట, గురువుగారిపనులను శిష్యులు కాపాడుట, శిష్యునాత్మను గురువు [illegible].

7. శౌచము Purity మృజ్జలాదులచే శరీరక్షాళనము బాహ్యశౌచము, రాగద్వేషాదుల మనంబునుండి పోఁగొట్టుకొనుట అంతశ్శుచి.

8. స్థైర్యము - Steadfastness = మోక్షసాధనమందుఁ బ్రవర్తించి, అనేకవిఘ్నములు వచ్చుచున్నప్పటికిని దానియందే పట్టుదల కలిగియుండుట. (నిష్ఠ కలిగియుండుట).

9. ఆత్మవినిగ్రహము - Self-control = శరీరేంద్రియవర్గమును దుష్కార్యములనుఁ జేయకుండ నిరోధించుట.

10. ఇంద్రియవిషయవైరాగ్యము - Dispassion in the objects=ఇంద్రియ విషయసుఖములన్నియు తాత్కాలికములు.దుఃఖపరిణామములని ఇహలోకపరలోకముల యందుండెడు శబ్దాదివిషయములం దిచ్ఛలేకయుండుట.

11. అనహంకారము - Non-egoism ="నేను తపస్సు దానము సత్కర్మ లొనరించుచున్నాను." నాకన్న నధికు లెవరనెడు గర్వములేకుండుట (నేనధికుఁడనని)

12. జన్మమృత్యు x x x x దర్శనము - Insight into the pain and, evil of birth, death, oldage, & Sickness = జన్మము, మరణము, ముసలితనము, రోగములు, దుఃఖములు వీనియందు ప్రసిద్ధములైనదోషములను విచారించుట, అనఁగా గర్భవాసములోని నరకము, మరణవేదన, ముదిమిన స్వాధీనముతప్పి కష్టపడుట, జ్వరాతిసారములు గలిగినపుడు బాధ, ఇష్టబంధువియోగము గలిగినపుడు దుఃఖము, వీనినిం జూచుచున్నయెడల విషయవైరాగ్యము కలుగును.

13. అసక్తి - Unattachment = దారాపుత్రగృహక్షేత్రాదులయందు ఇవి నావి యని మమత్వము లేకుండుట (ప్రీతిలేక యుండుట.)

14. అనభిష్వంగము - Non self-identification = పుత్రకళత్రాదుల కేమైన కొంచెము హాని కలిగినచో, తాను

జీవించేనట్లుల చేయుప్రేమ, అధికప్రేమ యనఁబడు. అట్టి యధికప్రేమము (మమకారము) ఉండరాదు.

15. సమచిత్తము - Equal-mindedness = ప్రారబ్ధకర్మచేత సుఖదుఃఖములు ప్రాప్తించినపుడు, హర్షవిషాదములనుఁ బొందక సమానచిత్తముఁ గలిగియుండుట.

16. అవ్యభిచరితభక్తి - Unflinching devotion = సర్వేశ్వరుఁడైన భగవంతునియం దేకాగ్రభక్తి గలిగియుండుట, వాసుదేవుఁడే పరమగతియని, యే ప్రతికూల హేతువుచేతను నివారింప శక్యముకాని నిశ్చలభక్తి.

17. వివిక్తదేశసేవిత్వము - Resort to lonely places = జనశూన్యమైన యేకాంతప్రదేశమందుఁ గూర్చుండి, భగవంతు నారాధించుట, యోగము చేయుట, ఎట్టి యుపద్రవము లేక మనస్సున కానందమగుప్రదేశ మందుండుట.

18. ప్రాకృతజనసంఘమునందరతి - Non-pleasure of men in the crowd = ఆత్మజ్ఞానవిముఖులును విషయలంపటులు నగు జనసంఘమునందు నివసించుట కిచ్ఛలేకుండుట.

19. అధ్యాత్మజ్ఞాననిత్యత్వము - Constancy in the wisdom of the self = ఆత్మజ్ఞానకారణములైన శాస్త్రములయం దాసక్తి కలిగియుండుట, నిద్రాహారములచే వ్యర్థ

ముగ కాలముఁ బుచ్చక, సాధనానుష్ఠానముచే జ్ఞానముఁ బడయవలె ననుట.

20. తత్త్వజ్ఞానార్థదర్శనము-Understanding of essential wisdom = ఆత్మతత్త్వజ్ఞానముచేఁ గలుగు మోక్షము నందు సర్వాధికత్వజ్ఞానము. సర్వకాలములయందు ఆత్మతత్త్వజ్ఞానము నాలోచించుట.

దైవసంపద - శుద్ధవాసన.

శ్లో. అభయం సత్త్వసంశుద్ధి ర్జ్ఞానయోగవ్యవస్థితిః,
దానం దమశ్చ యజ్ఞశ్చ స్వాధ్యాయ స్తప ఆర్జవం. 1
అహింసా సత్య మక్రోధస్త్యాగ శ్శాంతి రపైశునం,
దయా భూతేష్వలోలుత్వం మార్దవం హ్రీ రచాపలం. 2
తేజః క్షమా ధృతి శ్శౌచ మద్రోహో నాతిమానితా.
భవంతి సంపదం దైవీ మభిజాతస్య భారత. 3

భగవద్గీతా 16 అధ్యాయం.

1. అభయము - Fearlessness = ఒంటరిగానుండను, ఏమియు సంగ్రహముఁ జేసికొనలేదనెడు భయము, ధర లెక్కువగానున్నను వ్యాధులు ప్రబలియున్నను భయపడుట, ధర్మబోధ చేయునపు డెవ రేమనుకొనియెదరో యని భయపడుట, అట్టిభయము లేకుండుట.

2. సత్త్వసంశుద్ధిః - Mental Purity = పరవంచన మాయారహితమై మనస్సు ప్రసన్నమై యుండుట (నిర్మలముగ నుండుట).

3. జ్ఞానయోగవ్యవస్థితి - Steadfastness in the Yoga of wisdom = ఆత్మజ్ఞానసాధనములయందు నిష్ఠ లేక జ్ఞానసంపాదనయందే దృష్టి నిలిపి నిష్కటికన్న నేఁడే దయినా భగవత్సంబంధమయినవిషయము నేర్చుకొని యున్నానా? యని ఆత్మపరీక్ష చేసి చూచుకొనుట.

4. దానము - Charity = తనకుఁగలిగిన యన్నాదిపదార్థముల నితరులకు యథాశక్తిగ నిచ్చుట.

5. దమము-Self restraint or control over the mind = బాహ్యేంద్రియనిగ్రహము (మనోనిగ్రహము.)

6. యజ్ఞము - Sacrifice = వారివారి మతవర్ణాశ్రమధర్మముల ననుష్ఠించుట, వారివారి యధికారములకుఁ దగి నట్టుల కర్మల నాచరించుట.

7. స్వాధ్యాయము - Scriptural Study = ప్రత్యహముఁ బ్రహ్మయజ్ఞమునందు వేదపారాయణమునుఁ గావించుట.

8. తపస్సు - Austerity = శారీరకమగు బ్రహ్మచర్య అహింసాదికము, వాచికమగు మృదుప్రియహితవాక్యము, మానసికమగు ప్రసన్నమనస్కత్వ నిర్మలత్వాదికము నగు త్రివిధమగు తపస్సు.

9. ఆర్జవము - Frankness = సర్వవ్యవహారములయందు కౌటిల్యములేక వర్తించుట.

10. అహింస - Non injury or Harmlessness = భూతములకు హింస కలుగకుండ సంచరించుట, ఇతరుల జీవనోపాయములకు హానిలేకుండ వర్తించుట.

11. సత్యం - Truthfulness = చూచినదానిని చూచినట్టుల చెప్పుట.

12. అక్రోధము - Absence of wrath = ఇతరులు తనను కొట్టినను, తిట్టినను, మనస్సునందు కోపములేక శాంతముగ నుండుట.

13. త్యాగము - Spirit of Self-sacrifice = కామ్యకర్మలను పరిత్యజించుట, సమయమువచ్చినపుడు ధర్మముకొఱకై త్యజించుట.

14. శాంతి - Calmness or Peacefulness = అంతఃకరణోపశమనము (అంతరింద్రియనిగ్రహము.)

15. అపైశునము - Not carrying tales = ఒకరియొక్క దోషమును మఱియొకరియెదుట చెప్పకపోవుట, చాడీలు చెప్పకుండుట

16. భూతదయ - Kindness to living beings = సమస్త భూతములదుఃఖమునుఁ జూచి సహింపలేకపోవుట.

17. అలోలత్వము - Uncovetousness = విషయసన్నిధానమందు ఇంద్రియముల కతితృష్ణ కలుగకుండుట, లోభము లేకపోవుట.

18. **మార్దవము** - Softness or Mildness = మృదుత్వ మనఁగా పూర్వపక్షులయందును, శిష్యాదులయందును, అప్రియభాషణము లేక బోధించుట (అనఁగా క్రౌర్య ము లేకయుండుట.

19. హ్రీ - Modesty = అకార్యములయందు బుద్ధి ప్రమాదముగాఁ బ్రవర్తించినపుడు లజ్జించుట.

20. అచాపలము - Stability of purpose or Absence of Fickleness= వ్యర్థములగు తృణచ్ఛేదన కండూయనాదివ్యాపారములను విడుచుట.

21. తేజస్సు - Effulgence or Vigour = పరుల నభిభవించుటకుఁ దగినసామర్థ్యము కలిగియుండుట.

22. క్షమ - Forbearance = తన కొరుఁడు పరిభవముఁ గలుగఁజేసినపుడు శిక్షింప సామర్థ్యమున్నను సహించియుండుట.

23. ధృతి - Fortitude or Spiritual courage = బంధువియోగ ద్రవ్యనష్టాదిదుఃఖములచే బాధింపఁబడు సమయమునందుఁ గూడ, చిత్తమునందు ధైర్యము నొందియుండుట.

24. శౌచము - Cleanliness = మృజ్జలాదులచేత బాహ్యశుద్ధి, అహింస, అక్రోధాదులచేత అంతఃకరణశుద్ధి గలిగియుండుట.

25. అద్రోహము - Not betraying = నమ్మించి గొంతు కోయకుండ నుండుట, లేక ఒకరిని హింసించవలయు ననే ఇచ్ఛలేకయుండుట.

26. అతిమానిత్వాభావము - Self Esteemlessness = నేను కులాచారపాండిత్యాదులచేత నందఱికంటె నధికుఁడను, సర్వజనపూజ్యుఁడననే యభిమానము, అతిమానిత్వ మనఁబడు. అది లేకుండుట. నాతిమాన మనఁబడును.

ఈ ఇరువదియాఱుగుణములు దైవాంశసంభూతుల కుండును. ఇయ్యవి శుద్ధవాసన లనఁబడు.

మైత్రీముదితాది శుద్ధవాసనాచతుష్టయము.

సూ. మైత్రీకరుణా ముదితోపేక్షాణాం,
సుఖదుఃఖ పుణ్యాపుణ్యవిషయాణాం,
భావనాతశ్చిత్తప్రసాదనం.

పాతంజలయోగశాస్త్రం, 33 సూత్రము, 1 అధ్యాయం.

సుఖము ననుభవించువారియెడ మైత్రిని (ప్రేమను) దుఃఖము ననుభవించువారియెడ కరుణను, పుణ్యాత్ములయెడ సంతోషమును, పాపాత్ములయెడ నౌదాసీన్యమును, దృఢముగ భావించుటవలన, చిల్లగింజ నుంచుటచే కలుషితజలము నిర్మలమయినటుల రాగద్వేషాదులచే కలుషితమయిన చిత్తము నిర్మలము (ప్రసన్నము) అగునని సూత్రార్థము.

1. మై త్రి.

ఈసుఖ మనుభవింపఁబడుచుండఁగ నిట్టిసుఖములే తన కెల్లప్పుడును సంభవించుచుండవలయుననేబుద్ధి రాగ మనఁ బడు. ఇహలోకసుఖములు: పుత్త్రకళత్రగృహక్షేత్రవాహన రాజ్యైశ్వర్యప్రతిష్టిజనస్వత్వములు. పరలోకసుఖములు: స్వర్గాదులు. వీనిని సంపాదించు సాధనసామగ్రి లేనందున ఈసుఖములు తనకు ననుభవింపనపోగొనని రాగముచే చిత్తము వ్యాకులిత మగుచుండును. రాగవ్యాకులితచిత్తుఁడు సుఖముల ననుభ వించువారలను జూచి, వీరందఱు "నాకు మిత్త్రులు" అని వారియెడల నెప్పుడు మైత్రిని భావించునో, అప్పుడు తనకుమా త్రమే కాక తనరాజ్య మైనటుల వారియొక్క సుఖము తన సుఖముగనే యెంచును. కాఁబట్టి సుఖములయందు తనకుం గల రాగము నివర్తించును. ఇటుల ఎవరెవ రేసుఖముల ననుభవించుచుండిరో వీరందఱు తనమిత్త్రులని దృఢముగ భావించుటచే నన్నిసుఖములు తనకు ప్రాప్తించినటుల యేర్ప డును. [illegible] మైత్రి కలిగినందున ననూయపొడముట కవ కాశ ముండదు. ఇటుగాక వారి సుఖోపభోగములఁ జూచి యోర్వఁజాలక కుళ్లఁబోతుతనము కలిగియుండినచో వారి [illegible]మునకు లోపము కలుగదు కాని తనకు మాత్రము పరి తాపము గలిగి దుస్సహమగు వేదన పొడముచుండును. దాని వలన చిత్తము కలుషితమగును కాని, ఉపయోగ ముండదు.

కాఁబట్టి సుఖవంతులు అందఱు తనమిత్రులని దృఢముగ భావించినచో రాగము నివర్తించి వర్షాకాలము గడచిపోయిన పిమ్మట నదీజలము నిర్మలమైనటుల చిత్తమును నిర్మలమై యుండును. చిత్తకాలుష్యకారణమగు రాగము మాత్రమే నివర్తించుట గాక అసూయ, ఈర్ష్య మొదలగుదోషములును నివర్తించును. కాఁబట్టి మైత్రీవాసన శుద్ధవాసనలలో ముఖ్యమైనది.

2. కరుణ.

ఒకదుఃఖ మనుభవించుచుండఁగ నిట్టిదుఃఖము తన కెప్పటికిని రాకుండ నుండవలయు ననెడిబుద్ధి, ద్వేషమనఁబడును. శత్రువ్యాఘ్రసర్పాదులు దుఃఖకారణములు. ఇవి యుండఁగ దుఃఖమును రాకుండఁజేయుటకు శక్యము కాదు. దుఃఖకారణములగు శత్రు సర్పవ్యాఘ్రాదుల నన్నింటిని నశింపఁజేయుటకును సాధ్యము కాదు. గనుక ఆద్వేష మెల్లప్పుడు తనహృదయమును తపింపఁ జేయుచుండును. తన దుఃఖమువలన తన కెంతకష్టమో, యితరులకును దుఃఖమువలన నంతకష్టము కలుగునని తలఁచి, సమస్తప్రాణులకును ప్రతికూలమయిన దుఃఖము కలుగకుండ నుండవలయునని దుఃఖవంతుల యెడ కరుణను దృఢముగ భావించినచో, శత్రుసర్పవ్యాఘ్రాదులయందుఁగూడ ద్వేషము నివర్తించును. దానం జేసి చిత్తము ప్రసన్నమై యుండును.

శ్లో. ప్రాణా యథాఽత్మనోఽభీష్టా భూతానామపి తే తథా,
ఆత్మౌపమ్యేన భూతానాం దయాం కుర్వంతి సాధవః.
సర్వేఽత్ర సుఖినస్సంతు సర్వే సంతు నిరామయాః,
సర్వే భద్రాణి పశ్యంతు మాకశ్చిద్దుఃఖమాప్నుయాత్.
"స్మృతి."

తనప్రాణములు తనకెట్లు ప్రియంబులుగా నుండునో, అట్లులే సమస్తభూతములకును ప్రాణములు ప్రియంబులై యుండునని తమసాదృశ్యమునుఁ జూచుకొని సజ్జనులు సకల భూతముల కెట్టిహింసనుఁ గావింపక, వానియందు మిగుల దయనుఁ జూపుదురు. ఈలోకమునందుండు భూతములన్నియు సుఖము గలిగియుండవలయు, రోగాద్యుపద్రవములు లేకుండ నుండవలయు, శుభములనే పొందుచుండవలయు, ఏభూతము గూడ దుఃఖమును బొందకుండ నుండవలయు నను భావనలచే సజ్జనులు భూతములయందు దయనుఁ జూపుదురు. ఇది కరుణా వాసన. సర్వభూతమయుఁడగు పరమేశ్వరుఁడు భూతదయచేఁ బ్రీతుఁ డగును గనుక యీవాసన నభ్యసించుట ఆత్మావశ్యకము.

3. ముదిత.

శ్లో. పుణ్యస్య ఫల మిచ్ఛంతి పుణ్యం నేచ్ఛంతి మానవాః,
న పాపఫలమిచ్ఛంతి పాపం కుర్వంతి యత్నతః.
"స్మృతి."

ఈలోకమునందలి జనులు స్వభావముగ పుణ్యఫలమగు సుఖమునుమాత్రము కోరుదురు కాని, పుణ్యమునుమాత్రము చేయరు. పాపఫలమగు దుఃఖమును కోరరు కాని, పాపములనుమాత్రము ప్రయత్నముతో సలుపుచుందురు. ఇట్టిస్థితిలో పుణ్యాత్ములుచేయు పుణ్యకార్యములఁ జూచి వీరెంత ధన్యులో యని, వారియెడ (ముదితను) సంతోషమును దృఢముగ భావించునో, తానుగూడ పుణ్యవాసనచేత జాగ్రతగా పుణ్యమును జేయుచుండును.

శ్రు. కి మహం సాధునాఽకరవం,
కి మహం పాపమకరవమితి.

"ఉపనిషత్.

నేను పుణ్యకర్మ నెందుకు చేయకపోయితి. పాపకర్మ నెందుకు చేసితినని పరితాపమును పుణ్యపాపములు కలిగించుచుండు. ఈపరితాపముచే వీరయినను పుణ్యముఁ జేసిరి. నేను చేయలేకపోయితినని "సంతోషమును" దృఢముగ భావించుటచే పరితాపమును పోవును.

4. ఉపేక్ష.

పాపాత్ములుచేయు పాపకార్యములఁ జూచి, వీరు దీని ఫలమగు దుఃఖమునుఁ బొందుదురు. చెప్పినను చేయకమానరని వారియెడ "ఉపేక్షను" అనఁగ అనాదరమును దృఢముగ భావించినచో, తానును పాపములఁ జేయక మానును. దానం

బట్టి పశ్చాత్తాపము కలుగనేరదు. గనుక చిత్తము ప్రసన్న ముగ నుండును.

శ్లో. ప్రసన్నచేతసోహ్యాశు బుద్ధిః పర్యవతిష్ఠతి,
భగవద్గీత 2 అధ్యాయ. 65 శ్లోకం.

చిత్తప్రసన్నతఁ గలవానికి బుద్ధి నిలుకడయు శాంతి యుఁ గలుగును.

మలినవాసన లెవ్వి? శుద్ధవాసన లెవ్వియనుట, వానిఫలితములు.

పరిశీలింపఁగ మలిన(పాప)వాసనలు, భగవద్గీతా 13-వ అధ్యాయము 7-20 శ్లోకములవఱకునుఁ జెప్పఁబడిన దంభదర్పా హంకారక్రోధమోహాది అసురసంపదయను తీవ్రబంధరూప తమోగుణమువలన పశుపక్షివ్యాఘ్రతిర్యక్ స్థావరజన్మలను, శుద్ధ(పుణ్య)వాసనలు, 13-17 శ్లోకములవఱకుఁ జెప్పఁబడిన జ్ఞేయ తత్త్వస్వరూపంబును.

అమానిత్వాదిజ్ఞానసాధనలు ఇరువదియును.

అభయసత్త్వసంశుద్ధ్యాదిదైవసంపద ఇరువది మూఁడు గుణంబులును.

మైత్రి, కరుణ, ముదిత, ఉపేక్ష యను నాలుగు శుభ వాసనలు.

భగవద్గీతా 12-వ అధ్యాయమునఁ జెప్పఁబడిన భగవ ద్భక్తలక్షణములును గల దైవసంపదయను సాత్త్వికగుణము

వలన దేవజన్మమును, లోకవాసన, శాస్త్రవాసన, దేహవాసన యను మృదుబంధరూపరజోగుణమువలన దైవాసుర సంపన్మిశ్రమనుష్యత్వమును, పుణ్యపాపమిశ్రకర్మలచే బొందుచున్నారని యోగవాసిష్ఠమునఁ జెప్పఁబడెను.

శ్లో. శుభైరాప్నోతి దేవత్వం నిషిద్ధైర్నారకీం గతిం,
ఉభాభ్యాం పుణ్యపాపాభ్యాం మానుష్యం ప్రాప్యతేఽవశః.

సత్త్వగుణము.	రజోగుణము.	తమోగుణము.
(పుణ్య)శుద్ధవాసన	మిశ్రవాసన	(పాప)మలినవాసన
దైవసంపద	మృదుబంధము	ఆసురసంపద
దేవజన్మము	మనుష్యజన్మము	తీవ్రబంధము
		పశుపక్షిసర్పవ్యాఘ్రి
		స్థావరజన్మము.

దేవాసురయుద్ధమున దేవతలు అసురులను జయించి అణఁచివేసినటుల శుద్ధవాసనలగు దైవసంపదచేత మలినవాసనలగు ఆసురసంపద నణఁచివేయవలెను.

శ్లో. వాసనాసంపరిత్యాగే యది యత్నం కరోష్యలం,
తాస్తే శిథిలతాం యాంతి సర్వాధివ్యాధయః క్షణాత్.

"యోగవాసిష్ఠము."

ఓ రామా! మలినవాసనలను నివర్తింపఁజేయుటకుఁ బ్రయత్నించినట్టులయితే నీమనస్సునందుండు తాపత్రయములు, వ్యాధులన్నియు శీఘ్రముగా నశించునని తాత్పర్యము.

పురుషప్రయత్నమున కసాధ్యమగుకార్య మొకటి యును లేదు. కాఁబట్టి దృఢప్రయత్నముచేత కామక్రోధా దులకు విరుద్ధములగు శమదమాదులవలె నితర మలినవాసన లును వానికి విరుద్ధములగు శుద్ధవాసనలచేత నశింపఁ జేయ వలెను. సర్వవ్యాధులనుఁ బోఁగొట్టునటువంటి దివ్యౌషధములు ఆయుర్వేదవైద్యాలయమున నుండఁగ నిపుణుఁడగు వైద్యుఁడు నిదానముచే వ్యాధినిఁ గనిపెట్టి, తగునౌషధ మిచ్చి వ్యాధినిఁ బోఁగొట్టునటుల మనస్తత్త్వజ్ఞుఁడును మానసికవ్యాధులగు మలినవాసనలను శుద్ధవాసనలగు దివ్యౌషధముల నొసంగి పోఁ గొట్టును. మలినవాసనలన్నియు నొకరియం దుండవు. శుద్ధ వాసనలన్నియు నొకఁడే యభ్యసించుటకును వలనుపడదు. కాఁబట్టి ఎవనియం దేమలినవాసన యుండునో, కనిపెట్టి దానికి విరుద్ధమగు శుద్ధవాసనచే దానిని నివర్తింపఁ జేయవలయు.

మఱియు ఈమలినవాసన, లోకవాసన, శాస్త్రవాసన, దేహవాసన యని మూఁడువిధములు. ఈత్రివిధములగు మలిన వాసనలచే తత్త్వజ్ఞాన ముదయింపదు కాఁబట్టి ముముక్షువు ఆమూఁడింటిని విడువవలయు.

1. లో క వా స న.

తమదేశ కులమతాచారభాషాదులు ఇతరులకన్న శ్రేష్ఠములయినవనెడు అభినివేశ మేది కలదో అయ్యది లోక వాసన యనఁబడు. మఱియు లోకములోనుండు జనులందఱు

నన్ను నిందింపక స్తుతించునట్లు ప్రవర్తించవలెననెడు నభినివేశము లోకవాసన. జగత్పూజ్యులగు జానకీరామచంద్రులకే లోకాపవాదముఁ గలిగినపుడు నితరులసంగతి నిఁకేమి చెప్పవలయు! గుణదోషము లాయాపురుషుల రుచిభేదముచేఁ గలుగుచుండును. కావున సదాచారుని అనాచారవంతుఁడు, సురూపిని కురూపి, విద్యావంతుని విద్యావిహీనుఁడు, పరస్పరము నిందించుకొందురు. ఎంత బాగుగఁ బ్రవర్తించినప్పటికి నసూయాగ్రస్తులు నిందింపక మానరు. కాఁబట్టి నిందింపఁబడకుండ ప్రవర్తించుట యెంతవానికేని నసాధ్యము. ఎల్లఅచే భూషింపఁబడవలెనని యభినివేశ ముండును. లోకములో నుండు నెల్లవారలను తృప్తులుగావించుట నెరికిని సాధ్యము కాదు. కాఁబట్టి ధర్మన్యాయనీతిమార్గముల నంతరాత్మకు విరుద్ధముఁ గానట్లు ప్రవర్తించెద. లోకులు దూషించినను సరే భూషించినను సరే యని ముముక్షువగుజ్ఞాని ధర్మమార్గము తప్పకుండ ప్రవర్తించినట్లయినచో లోకవాసన తొలఁగును.

శ్లో. తుల్యనిందాస్తుతి ర్మౌనీ సంతుష్టో యేన కేనచిత్,
అనికేతః స్థిరమతిర్భక్తిమాన్ మే ప్రియో నరః.

భగవద్గీతా 12 అధ్యాయ, 19 శ్లోకము.

భగవద్భక్తుఁ డగుజ్ఞానికి స్తుతినిందలు సమానములు. గనుక లోకుల భిన్నాభిప్రాయముల గమనింపఁడు. విషయాసక్తులగు లోకులసంసర్గము యోగికి జ్ఞానప్రతిబంధకము గనుక వారి దూషణభూషణముల గమనింపఁడు. గనుక లోకవాస

ననుఁ బూర్తిగ విడుచును. ప్రవృత్తిమార్గప్రవర్తకుఁడు దేశాభిమానము, మతాభిమానము, కులాభిమానము, భాషాభిమానము విడువఁజాలఁడు గనుక దేశసేవ చేయుచు, సదాచార ప్రవర్తకుఁడై అభిమానమును లోపల తగ్గించుకొని, సత్సాంగత్యముచే దేశకులమతభాషాభిమానులకు సాహాయ్య మొనరించుటచే, క్రమముగ లోకవాసన వీడును. ఈలోకవాసన ఆసురసంపదవలె తీవ్రబంధము కానేరదు.

2. శా స్త్ర వా స న.

శాస్త్రవాసనయు:—పాఠవ్యసనమని, బహుశాస్త్రవ్యసనమని, అనుష్ఠానవ్యసనమని మూఁడువిధములు.

(1) పాఠవ్యసనమనఁగా:—జీవితకాలమంతయు అధ్యయనము సేయవలయుననెడు తలంపు. పూర్వము భరద్వాజుఁడనుముని మూఁడు పురుషాయుష్యకాలములచేత మూఁడు వేదముల నధ్యయనముఁ జేసి, దేవేంద్రుఁడు వచ్చి మీకేమి కావలయునని యడుగగ, నాలుగవపురుషాయుష్యములో నాల్గవవేదము నధ్యయనముసేయున ట్లనుగ్రహింపుమని వేఁడగ, సురేంద్రుం డిది యొకపురుషునకు శక్యముకాదు. ఈ వృథాపాఠమును ప్రయోజనకారి కాదు. తత్త్వజ్ఞానమునుఁ గలిగించేనందున మలినవాసన యని బోధించి సగుణబ్రహ్మవిద్య నుపదేశించెను. ఆసురసంపదవలె తీవ్రబంధము కాదు, మృదుబంధము.

(2) బహుశాస్త్రవ్యసనము:—సమస్తశాస్త్రపుస్తకములను సంపాదించి జీవితకాలమంతయుఁ జదువవలయునను నభినివేశము. తత్త్వజ్ఞానముఁ గలిగించు సారాంశము తెలియని బహుశాస్త్రపఠనము మోక్షప్రతిబంధకము గనుక మలినవాసన యని చెప్పఁబడినది. పూర్వము దూర్వాసుఁ డనుముని బహుశాస్త్రపుస్తకములనుఁ దీసికొని సాంబమూర్తిని దర్శించుటకు కైలాసమునకుఁ బోవగ నచట సభలోనుండు నారదమహాముని దూర్వాసమహామునినిఁ జూచి కస్తూరీకర్పూరాది పరిమళవస్తుభారమును మోయు గార్దభమువలె వీనిలో సారము తెలియక మోయుచున్నావని చెప్పఁగ, కోపోద్దీపితుఁడై యా పుస్తకముల నన్నింటిని సముద్రమునఁ బారవైచి సాంబమూర్తిచే నాత్మవిద్య యుపదేశింపఁబడి కృతార్థుఁడైనట్లు కావషేయగీతలయందుఁ జెప్పఁబడినది.

శ్రు. నాయమాత్మా ప్రవచనేన లభ్యో,
న మేధయా న బహునా శ్రుతేన.

"శ్రుతి."

శ్లో. బహుశాస్త్రకథాకంథా రోమంథేన వృథైవ కిం,
అన్వేష్టవ్యం ప్రయత్నేన తత్త్వజ్ఞైర్జ్యోతిరాంతరం.
అధీత్య చతురో వేదాన్ ధర్మశాస్త్రాణ్యనేకశః,
బ్రహ్మతత్త్వం న జానాతి దర్వీ పాకరసం యథా.

"జీవన్ముక్తివివేకము."

ఈపరమాత్మతత్త్వము గురుకటాక్షపాత్రులు కాని వారికి కేవల వేదాంతశాస్త్రము ననేకపర్యాయములు శ్రవణము చేసినను, మననము చేసినను, ధ్యానము చేసినను తెలియఁబడదు. అనేకశాస్త్రములను మాటిమాటికి నావృత్తి చేసినందున ప్రయోజన మేమియు లేదు. తత్త్వజ్ఞులు హృత్పుండరీకమునందు స్వప్రకాశరూపమగు పరమాత్మనుఁ బ్రయత్నపూర్వకముగఁ దెలిసికొనవలయును. ఋగాది నాలుగు వేదములను, మన్వాదిధర్మశాస్త్రములను, మీమాంసాదిశాస్త్రములనుఁ జదివియు వానిలో సారమగు పరబ్రహ్మతత్త్వము నెఱుఁగకపోయినచో, అన్నాది రసపదార్థములను పాకము చేయుగరిటె, వానిరుచి,యెఱుఁగనట్టుల యగునని తాత్పర్యము. నారదమహాముని ఋగ్వేదాది నాలుగు వేదములను, సకలశాస్త్రములనుఁ జదివి బ్రహ్మతత్త్వజ్ఞానము లేనివాఁడై, సనత్కుమారులవారియొద్దకుఁ బోయి ఆత్మతత్త్వజ్ఞానముఁ బడసినట్టుల ఛాందోగ్యోపనిషత్తునందుఁ గలదు. సాధకునకు సకలశాస్త్రపఠనముఁ గావలయు కాని, ఇదియే పరమార్థమని సాధ్యమగు నాత్మతత్త్వజ్ఞానము లేమిచే మలినవాసన యనఁబడుచున్నది. ఆసురతత్త్వమువలె తీవ్రబంధము కాదు. మృదుబంధము.

(౩) అనుష్ఠానవ్యసనము:—గృహస్థాశ్రమమును స్వీకరించి, యథాశాస్త్రముగ సమస్తకర్మల నాచరింపవలయునను నభినివేశము. పూర్వమున నిదాఘుఁ డను బ్రాహ్మణుఁడు ఋభు

మహాముని యొద్ద సమస్త వేదవేదాంగశాస్త్రములనుఁ జేదివి, కర్మలయం దభినివేశముఁ గలిగియుండఁగ, బ్రహ్మవిద్యయం దాభిముఖ్యముఁ గలుగునట్లు శిష్యున కుపదేశించి, మఱల వచ్చి చూడఁగ కర్మలయందే నిష్ఠఁ గలిగియుండె. తిరిగి బ్రహ్మవిద్యయం దభినివేశము కలుగునట్టుల బోధించిరని విష్ణుపురాణము నందుఁ గలదు. నిరంతరము కర్మల ననుష్ఠించుచు, తత్సాధ్యమగుజ్ఞానముఁ బడయమిచే, మలినవాసన యనఁబడును. ఈ కర్మవాసన పునర్జన్మకుఁ గారణమయినందున మలినవాసన యని చెప్పఁబడినది కాని, ఆసురసంపదవలె తీవ్రబంధము కాదు. ప్రవృత్తిమార్గప్రవర్తకుఁడు కర్మల ననుష్ఠించవలయును గాని విడువఁగూడదు. అవి నిష్కామముగ నుండినచో, జ్ఞానసాధకములయి మోక్షమునుఁ గలిగించును. కర్మల ననుష్ఠింపకుండుటకు సాధ్యము కాదు. కాఁబట్టి మృదుబంధమని చెప్పఁబడియె.

3. దేహ వా స న.

దేహవాసనయు:— దేహాత్మత్వభ్రాంతి, గుణాధానభ్రాంతి, దోషాపనయనభ్రాంతి యని మూఁడువిధములు.

(1) దేహాత్మత్వభ్రాంతి :— చైతన్యముతోఁ గూడిన యీదేహమే ఆత్మయని, శాస్త్రజ్ఞానము లేనివారును, శాస్త్రజ్ఞానము కలవారిలో చార్వాకమతస్థులును తలఁచుచున్నారు. ఆకాశము కాక తక్కిన నాలుగుభూతములచే స్త్రీపురుషశరీర

ములందు శుక్లశోణితములుగా నేర్పడి పరస్పరమేళనముచే దేహాకారముఁ బొందినపుడు వీనియందు చైతన్యమను నొక గుణవిశేషము పుట్టును ఇట్టి చైతన్యముతోఁ గూడిన దేహమే, ఆత్మయని చెప్పఁబడును. కాని యీదేహముకంటె విలక్షణ మయిన ఆత్మయను జీవుఁ డొకఁడు లేఁడనియు, ప్రత్యక్ష మొకటియే ప్రమాణమనియు, వైకుంఠాదిలోకములు కల్పిత ములనియు, సుఖానుభవమే స్వర్గము, దుఃఖానుభవమే నరక మనియు, వేఱొక స్వర్గనరకములు లేవనియు, నాలుగుభూత ములవియోగమే మరణమనియు, నిదియే మోక్షమనియు, వారు వాదింతురు. దేహాత్మత్వభ్రాంతి అధోగతికి కారణము. ఇది యాసురసంపదలోఁ జేరినదని యిదివఱలో భగవద్గీతా 13-వ అధ్యాయమునఁ జెప్పఁబడినది. ఈమలినవాసన తీవ్రబం ధములోఁ జేరినది. సర్వానర్థకరము.

(2) ఈదేహమునందు గుణములనుఁ గలుగఁజేయవలె ననెడుభ్రాంతి గుణాధానభ్రాంతి:—ఇయ్యది లౌకిక గుణా ధానభ్రాంతియని, శాస్త్రీయగుణాధానభ్రాంతి యని రెండువిధ ములు. సౌందర్య, సౌరభ, కంఠమాధుర్యాదిగుణములను దేహమునకుఁ గలుగఁ జేయవలెననుట లౌకికగుణాధానభ్రాంతి యనఁబడు. మూత్రపురీషాది దుర్గంధములతోఁ గూడికొని క్షణక్షణమునకును స్వేదాదిమలములవిడుచు నీశరీరమునకు సుగంధద్రవ్యలేపనాదులచే నెంత ప్రయత్నించినను అయ్యది దుర్గంధము విడుచును. శరీరమునందు విరక్తిఁజెందక గుణము

లనుఁ గలిగించవలెననుట మలినవాసన యనఁబడు. గంగా స్నాన సాలగ్రామతీర్థాదులచేఁ బావనత్వాదిగుణములఁ గలుగఁ జేయవలెననుట శాస్త్రీయగుణాధానభ్రాంతి యనఁ బడు. అహింస, భూతదయ,శాంతి,దాంతి,భగవద్భక్తి లోనగు సద్గుణములు లేనివారికి గంగాస్నానాదు లొనరించినను ఆత్మ తత్త్వజ్ఞానము కలుగమిచే మలినవాసన యని చెప్పఁబడును.

(3) దోషాపనయనభ్రాంతి యనఁగా లౌకికములగు ముఖదుర్గంధాదిదోషములను శాస్త్రీయములగు నపవిత్ర త్వాదులనుఁ బోఁగొట్టఁ దలఁచుట. ఇవియునుఁ బూర్వోక్త ములువలెనె ఆత్మజ్ఞానము కలిగింపమిచే మలినవాసనలని చెప్పఁ బడును.

ప్రవృత్తిమార్గప్రవర్తకుఁడు కర్మల ననుష్ఠించవలెననుట.

నిష్కామకర్మానుష్ఠానమువలన నంతఃకరణశుద్ధియు, దాని వలన జ్ఞానమును గలుగును. సత్కర్మానుష్ఠానమునకు దేహ మత్యంతావశ్యకము కావున, దేహమందలి దోషములనుఁ బోఁగొట్టి గుణములనుఁ గలుగఁజేయుటకు బాహ్యశౌచము లగు స్నానాదులు, అంతశ్శౌచములగు భూతదయ శాంతి మైత్రి లోనగునవి ఆవశ్యకములు. అదియునుంగాక ఆయు ర్వేదసిద్ధములగు నౌషధాదులచే దోషమునుఁ బోఁగొట్టి గంగాస్నాన సత్సాంగత్య సద్గ్రంథశ్రవణాదులచే గుణము

లనుఁ గలిగింపవలయును. ఆత్మజ్ఞానమునకు సాధనముగ దేహ మును రక్షించుకొనుటవలన దోషము లేదు కాని, ఆత్మజ్ఞానమున కై కాక కేవలము దేహమునే చూచుకొనుట ఆసురసంపద మలినవాసన యనఁబడును. ఆత్మజ్ఞానమునకు సాధనముగ నిరభి మానముగఁ జూచుకొని ప్రవర్తించిన మృదుబంధ మగును. శుద్ధవాసనగ మార్చుకొనవచ్చును.

శుద్ధవాసనలున్నను, యోగికి జన్మహేతువులు కావనుట.

మలినవాసన లనఁగ పాపకర్మలవలన దుఃఖము నరకము గలుగును. శుద్ధవాసన లనఁగ పుణ్యకర్మలవలన సుఖము స్వర్గ ము కలుగును. పరుగిడువానికి ఇనుపసంకెళ్లయినను బంగారు సంకెళ్లయినను పరుగెత్తఁజాలక ప్రతిబంధక మయినట్టుల ముముక్షువుకు పుణ్యమువలన లభించు స్వర్గసుఖమయినను, పాపమువలనఁ గలుగు నరకదుఃఖమయినను ప్రతిబంధకమె.

శ్లో. బుద్ధియుక్తో జహాతీహ ఉభే సుకృతదుష్కృతే.

భగవద్గీత 2 అధ్యాయ, 30 శ్లోకము.

జ్ఞానయోగి సుకృతదుష్కృతముల రెండింటిని విడిచి ముక్తుఁ డగుచున్నాఁడు. శుద్ధవాసనలచేత మలినవాసనలను బోఁగొట్టి, యోగియగు ముముక్షువు శుద్ధవాసనలతోఁ గూడి యున్నను, వేయించఁబడిన శనగలు ధాన్యము మొదలయిన గింజలు బొట్టనిండనింపినను అన్నము వండుటకుఁగాని పైరను

నపుడంతయు తా నాడఁబోవునది సత్యమవునా? కాదా? యని మనసునఁ దలఁచి పిమ్మట నోటఁ బలుకవలెను.

దుర్విషయములమీఁదికి మనసు పోయినపుడు, వాని నుండి మనస్సును మరల్చుటకు వానియందు దోషానుసంధానము చేయుట మాత్రమే చాలదు. మఱియు నాదోషానుసంధానమును దీర్ఘకాలముగూడ సేయఁదగదు. అందలిదోషములను కొంతతడవు దలంచి, ఆదుర్విషయమునకు విరోధమయిన సద్విషయమును స్మరించుచు, తత్సంబంధమగు కర్మ చేయుట కుపక్రమింపవలెను.

లోకములో నొకబాలుఁడు మంటిని దినుచుండఁగ, పిండితినుటను నేర్పి మృద్భక్షణమునుండి మఱలించినచందంబున,మనస్సును,మలినవాసనలగు పాపకృత్యము పరధనదారాపహరణాద్యభిలాషలనుండి నివారించి, సద్వాసనలగు (పుణ్యకృత్యములు) సత్సహవాస సద్గ్రంథశ్రవణపఠన దేవతారాధన పరోపకారములయెడఁ బ్రవేశపెట్టవలయు. ఏదేని మలిన వాసనాదోషమును బోఁగొట్టవలసియున్నచో నాదోషమునకు విరుద్ధమగు సద్వాసనాగుణమును శ్లాఘించుచు, నాగుణము తనయందు స్వభావముగ పట్టుఁబడుపఱకు ప్రయత్నపూర్వకముగ నభ్యసించుచుండవలయు.

ఎన్నిదినములనుండియో భూమియందు పడి, కన్పింపక యుండిన విషపువిత్తనములు (దుండిగపుచెట్లవిత్తనములు) వర్షము కురియగనే మొలకెత్తి చిన్నచెట్లుగానుండి, పూచి

కాచి విత్తనములై మఱల భూమియందు పడి కన్పింపకయుండి, మొలకెత్తి చెట్లయి విత్తనము లేర్పడును. ఇటుల యెడతెగకుండ కాలము ననుసరించి బీజవృక్షము లభివృద్ధిఁ జెందుచుండును. ఇయ్యది పురుషప్రయత్నము లేకుండనే జరుగుచుండును. పురుషప్రయత్నముచే భూమియందు నెలకొనిన విషపువిత్తనములను కాల్చి నాశనముఁ జేసి, మంచివిత్తనములు చేల్లినచో, పూలచెట్లు, పండ్లచెట్లు మొలచి యభివృద్ధియై సుందరోద్యాన మగును. ఫలవృక్షములు ప్రాణికోటి కుపకరించును. ఇవ్విధంబుననే చిరకాలము కర్మాశయంబున (హృదయక్షేత్రమున) నెలకొనియున్న మలినవాసనలవలన పాపకృత్యములును, పాపకృత్యములవలన మలినవాసనలును, అవిచ్ఛిన్నముగఁ బురుషప్రయత్నము లేకుండనే యేర్పడి పురుషునికి నధోగతిఁ గలిగించును. కావున దృఢమగు పురుషప్రయత్నముచే, మలినవాసనలను నాశనముఁ జేసి, శుద్ధవాసనలు నెలకొలిపినచో నుత్తమగతి కలుగును. ముముక్షువగు సంయమీంద్రుఁడు శుద్ధవాసనలచే మలినవాసనలను నాశనముఁ జేసి, వేయించినవిత్తనములవలె శుద్ధవాసనలును దేహధారణార్థము గలిగియున్నను పునర్జన్మకుఁ గారణములు కాఁజాలవు. ఈవిషయమునే శ్రీశంకరాచార్యులువారు వివేకచూడామణి యందు విశదీకరించిరి.

శ్లో. కార్యప్రవర్ధనాద్బీజప్రవృద్ధిః పరిదృశ్యతే,
కార్యనాశాద్బీజనాశ స్తస్మాత్కార్యం నిరోధయేత్.

వాసనావృద్ధితః కార్యం కార్యవృద్ధ్యా చ వాసనా,
వర్ధతే సర్వథా పుంసస్సంసారో న నివర్తతే.
సంసారబంధవిచ్ఛిత్త్యై తద్ద్వయం ప్రదహేద్యతిః,
వాసనావృద్ధిరేతాభ్యాం చింతయా క్రియయా బహిః.
తాభ్యాం ప్రవర్ధమానాఽసౌ సూతే సంసృతిమాత్మనః,
త్రయాణాం చ క్షయోపాయస్సర్వావస్థాసు సర్వదా.
సర్వత్ర సర్వతస్సర్వం బ్రహ్మమాత్రాఽవలోకనైః,
సద్భావవాసనా దార్ఢ్యాత్తత్త్రయం లయ మశ్నుతే.
క్రియానాశే భవేచ్చింతానాశోఽస్మాద్వాసనాక్షయః,
వాసనాప్రక్షయో మోక్షస్సా జీవన్ముక్తిరిష్యతే.

"వివేకచూడామణి."

సద్వాసనల గ్రహించువిధము.

మనస్సు అనునది అనేకజన్మార్జితపుణ్యపాపరూపవాసనా ఙువులచే ఘనీభూతమగుపదార్థము. అయ్యది మాధుర్యానంద హాస్య విస్మయకలితములగు వాక్కులచేతను, శ్రావ్యరాగ గీతాదులచేతను ద్రవించుచున్నట్టుల శాస్త్రజ్ఞులు విజ్ఞానముచేఁ దెలిసికొనిరి.

శ్లో. చిత్తద్రవ్యం హి జతువత్స్వభావాత్కఠినాత్మకం,
తాపకైర్విషయైర్యోగే ద్రవత్వం ప్రతిపద్యతే.

"హరభక్తిరసాయనం"

లక్క స్వభావముగ కఠినముగ నుండి, తాపజనకము లగు అగ్న్యాది సన్నికర్షసంయోగములవలన కఱఁగినట్టుల,

మనస్సును స్వభావముగ కఠినముగ నుండి తాపజనకము లగు కామక్రోధాదివిషయసన్నికర్షసంయోగమువలన కఱఁగు (ద్రవించు) చుండును.

శ్లో. కామక్రోధభయస్నేహహర్షశోకభయాదయః,
తాపకాశ్చిత్తజతునః తచ్ఛాంతౌ కఠినం తు తత్.
ద్రుత్యన్వితే వినిక్షిప్తస్సాకారో యస్తు వస్తునః,
సంస్కారవాసనాభాసభావనాశబ్దభాగసౌ.
శిథిలీభావమాత్రం తు మనోగచ్ఛత్యతాపకైః,
న తత్ర వస్తు విశతి వాసనాత్వే న కించన.

"హరిభక్తిరసాయనం"

లక్కను ఎండలోనుంచిన మెత్తఁబడునుగాని కఱగదు. కఱఁగనిలక్కయం దేవస్తువు నిడిన కలిసికొనిపోవదు. కఱఁగిన లక్కయం దేరంగునుంచినను దానితోఁ గలిసి గట్టిపడి, మఱల కఱఁగినను గలిసినరంగు వీడిపోవదు. అట్టుల తాపరహిత విషయసన్నిధానమందు మనస్సు ద్రవింపకయుండి, కామక్రోధ భయస్నేహాది తాపజనకములగు విషయసన్నిధానమునందు ద్రవీభావమునుఁ జెంది, ఆకాలమం దేవిషయములను భావించునో, ఆవిషయములు సంస్కారరూపవాసనలుగ స్థితినిఁ జెందును. తాపరహితవిషయసన్నిధానమందు మనస్సు మెత్తఁబడును గాని ద్రవింపదు. ద్రవీభావమునుఁ జెందనిచిత్తమున వాసనారూపముగ నేవిషయము స్థితినిఁ జెందదు.

శ్లో. కఠినా శిథిలా బుద్ధిర్న గృహ్ణాతి న వాస్యతే,
ఉపేక్షా జ్ఞానమిత్యాహు స్తద్బుధాః ప్రస్తరాదిషు.

హ-భ-ర.

కామాదివిషయసన్నిధానమున మనస్సు ద్రవించి, విషయములు వాసనారూపముగఁ జేరినంతట, విషయతిరోధానమందు కాఠిన్యమునుఁ జెందును. కఱఁగిన లక్కయందుఁ గలిసికొనిపోయినరంగు గట్టిపడినపిమ్మట కట్టెలు మొదలగువాని తాఁకుడు గలిగినను వీడిపోవనట్టుల, ద్రవీభూతావస్థయందుఁ జిక్కఁగ నెలకొనిన విషయవాసన కఠినావస్థపర్యంతముండి, మఱల మనస్సు ద్రవించినను వీడిపోవఁ జాలదు. దీని నే వాసన యనియు, భావన యనియు ననెదరు. మెత్తఁబడిన మనస్సునందుఁ జేరినవిషయము కాఠిన్యావస్థపర్యంత ముండకుండినను, యుండినను విషయాంతరముఁ జేరినపుడు వీడిపోవుచున్నందునను, వాసనాభాస యని చెప్పఁబడును. దీనివలన దృఢభావనయే వాసన యని స్పష్టమగుచున్నది. ఎవ్విధంబుననేని మనస్సును ద్రవింపఁజేసి సద్వాసనలనుఁ జేర్చవలయును. వీనికార్యములవలన నుత్తమగతి కలుగును.

గానము మనస్సును ద్రవింపఁ జేయుననుట.

మనస్సును ద్రవింపఁజేయు సాధనములలో గానము ముఖ్యమైనది. చిత్తము నాదమునందు లయించునని కని పెట్టిన ప్రాచీనాచార్యులు ఆధ్యాత్మికతత్త్వమును భగవత్కళ్యాణగుణ

ములను గేయరూపకృతులయందుఁ బొదిగి, మానవకోటి కను గ్రహించినవారలు. విక్షిప్తమగుచిత్తము నేకాగ్రత నొనరించుటకు గానమునకన్న సులభవగుసాధన మఱియొకటి కనుపింపదు.

శ్లో. శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తి గానరసం ఫణీ.

ఏడ్చుచున్నటువంటి శిశువులు జోలపాటలచే హాయిగ నిదురింతురు. వేణుగానముచే జింకలు మేఁతను మేయక చొక్కుచుండును. కఱవఁబోవు పామును నాగస్వరమాధుర్యముచే పరవశతఁ జెందును. కాఁబట్టి చిత్తమును ద్రవింపఁజేయుటయందు శ్రావ్యకంఠముఁ గల గాయకులకు శక్తికలదు. శ్రుతులచే మేళగింపఁబడిన రాగములచే, ఱాళ్లు కఱగుచుండఁగ నిఁక మనస్సు కఱఁగుటయం దాశ్చర్య మేమి కలదు? గానామృతంపుటను పానముతోడ భగవత్తత్త్వ దివ్యౌషధమును భవరోగనివారణార్థము నారదాదిమహర్షులు భక్తుల కనుగ్రహించినవారలు. త్యాగబ్రహ్మము, రామతత్త్వగానామృతంబున ప్రాణుల తాపత్రయమునుఁ బోఁగొట్టెను మహనీయులగు హరికథకులు గానమాధుర్యముచే చిత్తము నాకర్షించి, కథాకథనకౌశలముచే ద్రవింపఁజేసి, భగవత్తత్త్వమును, భక్తిజ్ఞాన వైరాగ్యబోధకవిషయములను నెలకొలుపుదురు. దుర్జ్ఞేయములును దుర్గ్రాహ్యములు నగు విషయములు చమత్కారకథలచేతను, గానమాధుర్యముచేతను, మనస్సును ద్రవింపఁ

జేసి సులభముగ నందుఁ జేర్చినటుల పంచతంత్ర హితోపదేశ యోగవాసిష్ఠాది గ్రంథములవలనఁ దెలియఁబడుచున్నది. శ్రీకృష్ణమిశ్రపండితులు దుర్గ్రాహ్యమగు వేదాంతతత్త్వమును ప్రబోధచంద్రోదయనాటకరూపమున శిష్యులకు బోధించిరి. ఇట్టివెన్నియో కలవు.

లోకమున బాలుర కజీర్తిఁ జేసినపుడు, గర్భశోధనకై కసటుగల విరేచనమాత్ర నొసఁగినపుడు వారలు పుచ్చుకొన నొల్లరు. అంతట తత్త్వజ్ఞుఁడగు వైద్యుఁడు, ఆమాత్రలనే తేనియలో ముంచి, చెక్కెరలో పొదిగి ఇది చెక్కెరయుండ. దీనినిఁ బుచ్చుకొనుఁ డనఁగ నాటంకముఁ జెప్పక యతిసంతోషమునఁ బుచ్చుకొనియెదరు. నాలుకమీఁదఁబడి యంగటిలోనికిఁ బోవునంతకు తేనియ చక్కెర కఱఁగిపోయి, ఆమాత్ర లోనికిఁ బ్రవేశించి, గర్భశోధనఁ గావించి, ఆరోగ్యముఁ గలిగించుట లోకానుభవము. అట్టుల దుర్గ్రాహ్యములగు మత నీతి తత్త్వజ్ఞానవిషయములను, చమత్కారకథాసుధారస గానమాధుర్యములలోఁ బొదిగి, తత్త్వజ్ఞులు మందాధికారులకు బోధింతురు.

ద్రవీభూతచిత్తమునందు సద్వాసనలు జేర్చవలెననుట.

రూపగ్రహణ యంత్రముద్వారా దుఃఖభయంకర ఘోరాకృతులనుఁ దీసి, విద్యుద్దీపప్రకాశమున తెరపైఁ బ్రదర్శింపఁబడినపుడు ప్రేక్షకులకు దుఃఖమును భయమునుఁ గలి

గించునటుల, కామక్రోధాదులచే ద్రవించిన చిత్తమందు దుర్వి షయములగు మలినవాసనలుఁ జేర్చినట్టులయిన దుఃఖబంధము లచే నధోగతి కలుగును. అటుగాక సంతోషానందజనక మనో హారసౌమ్యాకృతులనుఁ దీసి ప్రదర్శించిన సంతోషానంద ములుఁ గలిగినటుల, సద్విషయములగు నీతిజ్ఞాన వైరాగ్య బోధకవిషయములును, భగవత్తత్త్వ కథావిషయములను, సద్వాసనలుఁ జేర్చినట్టులయిన భక్తిజ్ఞానవైరాగ్యములుఁ గలిగి, మలినవాసనల నశింపఁజేసి యుత్తమగతిఁ గలిగించును. చిత్తము ద్రవించుచున్నందులకు చిహ్నములు చెమర్చుట, గగుర్పాటు, వడఁకుట, కన్నీరువిడుచుట, పరవశతచే నిశ్చేష్టితమగుట, మాటరాక తడఁబడుట, వెలవెలఁబోవుట అను సాత్త్వికభావము లెనిమిది.

శ్లో. సర్వభూతేషు యః పశ్యే ద్భగవద్భావమాత్మనః,
భూతాని భగవత్యాత్మ న్యేష భాగవతోత్తమః.

శ్రీభాగవతే - ఏకాదశస్కంధము.

సమస్తభూతములయందు భగవంతుని, భగవంతుని యందు సమస్తభూతములను, భావనచేఁ జూచువాఁడు మహా యోగి భాగవతోత్తముఁడు. ద్రవించిన చిత్తమందు భగవదా కార మొకపర్యాయము ప్రవేశించిన, వాసనారూపముగ నెల కొని యితరవాసనలను నాశనముఁ జేసి, మోక్షసాయుజ్య మును గలిగించును. కామక్రోధాద్యుద్దీపనద్వారా ద్రవించిన చిత్తమందు, తైలధారవలె నవిచ్ఛిన్నమగు భగవద్విషయక

వృత్తి, బ్రహ్మాకారవృత్తి, భగవదాకారత యనఁబడు. ఈ వృత్తిచే నెచటఁ జూచినను, భగవత్స్వరూపమే కన్పించును.

శ్లో. ప్రోక్తేన భక్తియోగేన భజతో మాం సకృన్మునే,
కామా హృదయ్యా నశ్యంతి సర్వే మయి హృది స్థితే.
విషయాన్ ధ్యాయత శ్చిత్తం విషయేషు విషజ్జతే,
మా మనుస్మరత శ్చిత్తం మయ్యేవ ప్రవిలీయతే.

శ్రీభాగవత - ఏకాదశస్కంధం.

ఎల్లప్పుడు నన్ను భావనఁజేయుచున్న (భజించుచున్న) వానిహృదయమందు సర్వేశ్వరుఁడగు నేనుండుటచే, అనాది కాలమునుండి మలినవాసనలుగనున్న కామాదివిషయములు నశించుచున్నవి. విషయములు ధ్యానించువానిచిత్తము విషయాకారితమై విషయములందు సక్తమగును. పరమేశ్వరుఁడగు నన్ను ధ్యానించువానిచిత్తము నాయందు లీనమగును" అని శ్రీకృష్ణభగవానులానతిచ్చినారు.

కుంపటిలో మూషయందుంచఁబడిన బంగారము ఊదకబడి కఱఁగి మాలిన్యమును విడిచి మేలిమివన్నెఁ బొందినట్లుల మనస్సును భక్తియోగముచే ననాదిగనుండిన మలినవాసనలు విడిచి, స్వచ్ఛమును శాంతము నగు భగవత్స్వరూపముఁ బొందును.

శ్లో. యత్తత్సత్త్వగుణం స్వచ్ఛం శాంతం భగవతః పదం,
యదాహుర్వాసుదేవాఖ్యం చిత్తం తన్మహదాత్మకం.
స్వచ్ఛత్వ మవికారిత్వం శాంతత్వమితి చేతసః,

శ్రీభాగవత - తృతీయస్కంధం.

స్వచ్ఛమును శాంతమునగు సత్త్వగుణము వాసుదేవాఖ్యమగు మహత్తత్త్వము.అట్టి మహత్తత్త్వమునుండి చిత్తము గలిగినది గనుక వాస్తవములో స్వచ్ఛత్వము, నిర్వికారిత్వము, శాంతత్వము చిత్తస్వరూపమై యున్నది. కాని విషయాకారిత్వము లేదు.

శ్లో. గృహ్ణాతి విషయాకారం మనో విషయయోగతః.
మూషాసిక్తం యథా తామ్రం తన్నిభం జాయతే తథా,
ఘటాది వ్యాప్నువచ్చిత్తం తన్నిభం జాయతే ధ్రువం.
"సూత్రభాష్యమ్"

మూసలోనుంచి కఱఁగఁబడిన తామ్రము గాడిలో పోయఁబడి ప్రతిమాద్యాకారమునుఁ బొందుచున్నట్టుల, మనస్సును ఘటాదివిషయములందు వ్యాపించి, తత్తద్విషయాకారముగఁ బరిణమించును. అట్టుల విషయాకారముగఁ బరిణమించిన మనస్సును ద్రవింపఁజేసి, భగవదాకారమునుఁ జేర్చినట్టులయిన చిరకాలముండిన మలినవాసనలు నశించి, శుద్ధసత్త్వమై భగవదాకారిత్వమునుఁ జెందును.

కాఁబట్టి సర్వవిధమ్ముల మనస్సును ద్రవింపఁజేసి, భగవత్కల్యాణగుణములను నిశ్శ్రేయస్సు నొసంగు భగవదాకారిత్వమును అందుఁజేర్చిన బ్రహ్మాకారవృత్తి కలుగుచున్నది. అట్టిమహానీయునకు మోక్షము కరతలామలకము.

వాసనాప్రకరణము ముగిసెను.

సంస్కారములు. Impressions.

సంస్కారమనఁగ చేక్కఁగఁజేయుట, లేక ఉన్న దానిని జేక్కఁబఱచుట. గనినుండి పుట్టినమణిని సానఁబట్టినచో ధరెం చుటకు యోగ్యత కలిగినట్టుల గొప్పవంశమందుఁ బుట్టినవారి కయినను పాపములు పోయి, బుద్ధివికాసముకొఱకుఁ జేయఁ బడుకర్మలు సంస్కారము లనఁబడు. ఇయ్యవి గర్భాధా నాది చత్వారింశత్సంస్కారములు, ఆత్మగుణములగు నెనిమిది సంస్కారములు, మొత్తము నలువదియెనిమిది సంస్కారము లచే జీవుఁడు బ్రహ్మసాయుజ్యమునుఁ బొందుచున్నాఁడని గౌతమధర్మసూత్రమునందుఁ జెప్పఁబడినది.

సూ. యస్యైతే చత్వారింశత్సంస్కారా అష్టావాత్మగుణా బ్రహ్మణ స్సాయుజ్యం సలోకతాం గచ్ఛతీతి.

గౌతమధర్మసూత్రం. ౧-౮-౨౩.

నలువదిసంస్కారము లుండి, ఆత్మగుణములగు భూత దయ, క్షాంతి, అనసూయ, శౌచము, అనాయాసము, మంగ ళము, అకార్పణ్యము, అస్పృహ యను నీయెనిమిది లేకుండి నచో, బ్రహ్మసాయుజ్యము సాలోక్యమునుఁ బొందఁజాలఁడు అని ౨౪-వ సూత్రమునఁ జెప్పఁబడినది. మలాపకర్షణ గుణా ధానసంస్కారములచే జీవుఁడు సంస్కరింపఁబడి యుత్తమగతినిఁ బొందుచున్నాఁడు. మతధర్మమునందును సంస్కరింపఁబడని వాఁడు అపవిత్రుఁడని యెన్నఁబడుచుండును. జీవుఁడు జడ ప్రకృతి చిత్ప్రకృతి విశిష్టగ్రంథిస్వరూపుఁ డనఁబడు. సంస్కా

ములచే మాలిన్యముఁ బోయి ప్రకాశత్వమునుఁ జెంది బ్రహ్మాభిముఖుఁ డగుచుండెడిని.

మతమునందును, సంఘమునందును, భాషయందును, సంస్కారణములుఁ గావలసినవియే కాని, అయ్యవి శాస్త్రీయములుగ నుండవలయు.

శ్లో. యశ్శాస్త్రవిధిముత్సృజ్య వర్తతే కామకారతః,
న స సిద్ధిమవాప్నోతి న సుఖం చ పరాం గతిం.

భగవద్గీత. 16 అధ్యా. 23 శ్లోకం.

ఎవ్వఁడు శాస్త్రనియమమును విడిచి రజస్తమోహతబుద్ధియుక్తుఁడై స్వేచ్ఛాచారుఁడై సంస్కారములుఁ గావించునో వాఁడు సిద్ధిని సౌఖ్యమునుఁ బడయఁజాలక యనర్థములఁ బొందునని తాత్పర్యము.

కాఁబట్టి శాస్త్రీయసంస్కారము ఆవశ్యకమని స్పష్టమగుచున్నది.

శ్లో. గార్భైర్హోమై ర్జాతకర్మ చౌళమౌంజీ నిబంధనైః,
బైజికం గార్భికం చైనో ద్విజానా మపమృజ్యతే.

మనుస్మృతి. ౨ అధ్యాయం, ౨౭ శ్లోకం.

గర్భసంబంధమైన హోమాదిక్రియలచేతను, ద్విజులకు జాతకర్మము, చౌళము, మౌంజీబంధనము, ఉపనయనము వీని చేతను ప్రతిషిద్ధ మైథునాదులచేతఁ గలిగిన పైతృక రేతోదోషజనితపాపమును, మాతృగర్భవాసజనిత యపరిశుద్ధతయుఁ దొలఁగిపోవునని తాత్పర్యము.

శ్లో. బీజం చ కర్మణో జ్ఞేయం సంస్కారో నాఽత్ర సంశయః.
"కర్మమీమాంసదర్శనమ్"

కర్మవలన సంస్కారమును, సంస్కారమువలన కర్మము, "బీజాంకురన్యాయముగ" నవిచ్ఛిన్నముగ నన్యోన్యాశ్రయముగఁ గలుగుచుండునని వాసనాప్రకరణమందు విస్తరించి చెప్పఁబడెను.

జీవునికి ప్రవృత్తి నివృత్తి యని రెండుమార్గములు కలవు. ఈ రెండుగతులకు పోషకమగు సంస్కారమును, స్వాభావికము (ప్రాకృతము) అస్వాభావికము (అప్రాకృతము) అని రెండువిధములు.

శ్లో. స్వాభావికోఽస్తి సంస్కారస్సహి మోక్షస్య కారణం,
ధర్మస్య ధారికా శక్తిస్తస్య చాభ్యుదయప్రదః,
క్రమః కైవల్యద శ్చైవ సహజే ప్రాకృతే శుభే.
నిత్యం జాగర్తి సంస్కారే ప్రాణినాం హితసాధకే,
విశ్వకళ్యాణదే నిత్యే సర్వశ్రేష్ఠే మనోరమే.
అస్వాభావికసంస్కారో నిదానం బంధనస్య హి,
స ఏవ సతతం జీవా న్సంబధ్నాతి సునిశ్చితమ్.
"కర్మమీమాంసాదర్శనమ్"

సత్త్వరజస్తమోగుణాత్మిక యగు ప్రకృతి పరిణామస్వరూపము గలది. చేతనాత్మకపురుషుఁడు పరిణతిఁ జెందనివాఁడు. ఈ రెండింటి సంయోగమువలన సృష్టి కలుగుచుండు. త్రిగుణాత్మకయగు బ్రహ్మప్రకృతి సంస్కారబలమువలన, జీవులను

తమోగుణమునుండి రజోగుణమునకును, రజోగుణమునుండి సత్త్వగుణమునకును దీసికొనిపోయి, కైవల్యముఁ గలిగించు నటుల సహజమగు స్వాభావికసంస్కారమును, జీవులను అభ్యుదయమార్గమునుఁ బొందించుచు, ఉద్భిజ్జమునుండి క్రమముగ స్వేదజ, అండజ, జరాయుజములుగను, అనార్యులనుండి ఆర్యులగను, బ్రాహ్మణ సన్న్యాస పరమహంసలగను, కడపట జీవన్ముక్తులగనుఁ జేసి మోక్షమునుఁ గలిగించుచున్నది.

ధార్మికశక్తి సకలప్రాణుల కభ్యుదయము (మేలును) కలిగించుచుండు; జగత్కల్యాణదాయకమును, సర్వభూతహిత సాధకము నగు స్వాభావికసంస్కారము (సహజము ప్రాకృతము శుభము) ధార్మికశక్తి గలదియై సత్కర్మల నభివృద్ధిఁ గావించుచు, జీవులను క్రమముగ బ్రహ్మాభిముఖముఁ బొందించి మోక్షము నొసఁగుచుండు. అస్వాభావికసంస్కారము (అప్రాకృతము-అశుభము) అధర్మముతోఁ గూడినందున, దుష్కర్మలచే జీవుల బద్ధులఁ గావించి సంసారచక్రమున పరిభ్రమింపఁ జేయుచుండు. ఎట్టులనఁగ: జీవుఁడు మనుష్యశరీరమునఁ బ్రవేశించి, స్వాతంత్ర్యముచే స్వేచ్ఛాచారుఁడై, తనగుణమునకుఁ దగునట్టుల కామక్రోధాదివేగముచే విషయాసక్తుఁడయి ప్రకృతికి విరుద్ధము లగుకర్మలుఁ గావించుచున్నందున నయ్యవి అస్వాభావికసంస్కారము లగుచున్నవి.

ఈ యస్వాభావికసంస్కారము బంధమును (నిరయము) గలిగించును. కాఁబట్టి స్వేచ్ఛాచారుఁడై దుష్కర్మలఁ గావిం

పక, సత్కర్మలఁ గావింపవలయు. సంస్కారములన్నియు కర్మల వలనఁ గలుగుచున్నవి. సంస్కారము లేక యెట్టి కర్మయుఁ గలుగనేరదు. విత్తనము లేక చెట్టును, చెట్టు లేక విత్తనమునుఁ గలుగనేరవు కదా ? సంస్కారములు వికాసమూలకములు, గుణసంబంధముచేత రెండువిధములు, భావసంబంధముచేత మూఁడువిధములు నగుచున్నవి. అస్వాభావికసంస్కారము జీవసంకల్పమువలనఁ బుట్టినదగుటచే, సహజమగు స్వాభావికసంస్కారగతిని నిరోధించి, జటిలములు క్లిష్టములు నగు కర్మలనుఁ గలింగిచుచున్నది.

స్వాభావికసంస్కారమన్ననో ప్రకృతిప్రవాహగతి ననుసరించి, శాస్త్రీయముగ సరళముగఁ బోవుచున్నది. స్వాభావికసంస్కారబలముచేతనే జీవుఁడు క్రమముగ నభివృద్ధిఁ బొందినవాఁడై ఉద్భిజ్జమునుండి మానవజన్మను, అటనుండి క్రమక్రమముగ ముక్తిపదవి నందుచున్నవాఁడు.

ఆధ్యాత్మిక, ఆధిదైవిక, ఆధిభౌతిక భేదములచే మూఁడువిధములుగ నేర్పడిన స్వాభావికసంస్కారము, జ్ఞానమూలకము, కర్మమూలకము, స్థూలశరీరమూలకమునని చెప్పఁబడును.

1. సర్వభూతములకు ముఖ్యముగ సంపాదింపఁ దగినదగుట వలనను, మోక్షమునిచ్చుటకు సామర్థ్యముఁ గలిగి యుండుటవలనను జ్ఞానమూలక మనఁబడు.
2. కర్తవ్యకార్యపరాయణతయందును నిష్కామకర్మాచరణమందును అధికారముండుట కర్మమూలక మనఁబడును.

3. మలరాహిత్యము, సత్త్వగుణవర్ధకము నగునది స్థూల శరీరమూలక మనఁబడు.

పైనఁ జెప్పఁబడిన స్వాభావికసంస్కారము వేదోక్తము లగు చత్వారింశత్సంస్కారములు అష్టవిధ ఆత్మగుణములు గలది యగును.

న్యాయమతమునందలి త్రివిధసంస్కారములు.

1. వేగజన్యము కర్మజన్యము = మూర్తపదార్థమం దుండు నది.
2. స్థితిస్థాపకసంస్కారము = పృథివియందుండుగుణము చాపలాగి విడిచినట్లయిన ముడుచుకొనిపోవుట, కొమ్మను లాగి విడిచినట్లయిన యీడ్చుకొనిపోవుట, అప్పుడు కన్పింపకపోయినను, స్పందనమువలనఁ దెలియును.
3. భావనాఖ్యసంస్కారము = అనుభవమువలనఁ గలిగి స్మృతిహేతువైనది.

శ్లో. భావనాఖ్యస్తు సంస్కారో జీవవృత్తిరతీంద్రియః,
ఉపేక్షానాత్మకస్తస్య నిశ్చయః కారణం భవేత్.

"భాషాపరిచ్ఛేద, 160 శ్లోకము.

ఈ భావనాసంస్కారము ఆత్మవృత్తి యనఁగా, మానసికవ్యాపారము అతీంద్రియమును నిశ్చయజ్ఞానము గలదియు నగును. అనుభవమువలనఁ గలిగి స్మరణకు హేతువుగా నుండునని తాత్పర్యము. మన మేది చూచినను, వినినను, చేసి

నను, మనస్సునందు సంస్కారరూపముగ (Impression) నెలకొనును.

మనమేవిషయము దృఢముగ భావించినచో నయ్యది మనస్సునందు సంస్కారరూపముగ నెలకొనుననియు, నిదియే వాసన యనఁబడుననియు వాసనాప్రకరణమందుఁ జెప్పఁబడెను.

పూర్వజన్మార్జిత సంస్కారవిశేషములచేతఁగాని, యిప్పటి సంస్కారబలమువలనఁగాని, మేధాశక్తి, ధారణాశక్తి, జ్ఞాపకశక్తి కలుగుచుండును. బృహన్మస్తిష్కమునందలి మేదోధాతువునందు సూక్ష్మాతిసూక్ష్మరేఖలుగ చాళ్లుగ దృఢభావనచేఁ గలుగుటవలన వీనినే సంస్కారము లనియెదరు. రూపగ్రహణ శబ్దగ్రహణయంత్రములయందు పరమసూక్ష్మాకృతులుగ విషయము లాకృతులు బింబములు నెలకొలుపఁబడినటుల యీ సంస్కారములును నెలకొలుపఁబడును. సంస్కారబలముచేతనే పూర్వజన్మస్మృతియు స్మృతివలన ననుభవంబును గలుగును.

ఇది, ఆపస్తంబసూత్ర, వాసిష్ఠసగోత్ర పవిత్ర, ముక్తినూతులపాటి
వంశపయఃపారావారరాకాసుధాకర, సీతారామామాత్య
విద్వత్కవీంద్రపుత్ర, జ్యోతిర్విద్వర, విద్యాశేఖర
బిరుదాంచిత, గోపాలకృష్ణశాస్త్రిప్రణీతంబగు
మనస్తత్త్వశాస్త్రమునందు వాసనాసంస్కా-
రంబులను తృతీయప్రకరణము
సమాప్తము.

మనస్తత్త్వశాస్త్రము

చతుర్థప్రకరణము.



రసములు - భావములు

రసతత్త్వవిచారము.

మనస్సునందలి మలినవాసనలు పోయి, శుద్ధవాసనలు చేరినంతట దర్పణమువలె స్వచ్ఛమగును. స్వచ్ఛమగు నంతఃకరణమందు సచ్చిదానందస్వరూపము ప్రతిబింబించుటవలన జీవుఁడు బ్రహ్మానందరసార్ణవమగ్నుఁడై, విగళితవేద్యాంతరుఁడై, నిరతిశయసుఖవంతుఁడై, యుత్తమపురుషార్థమగు నమృతత్వముఁ బడయును. పరమాత్మ ఆనందరసస్వరూపుఁడని ఉపనిషత్తులవలననే గాక యెల్లఱ అనుభవమువలననుఁ గూడఁ దెలియఁబడుచున్నయది.

శ్రు. రసో వై సః రసగ్ హ్యేవాయం లబ్ధ్వాఽనందీ భవతి కో హ్యేవాన్యాత్ కః ప్రాణ్యాత్, యదేష ఆనందో న స్యాత్.

"తైత్తిరీయోపనిషత్"

పరమాత్మ రసస్వరూపుఁడు, రసస్వరూపమునుఁ బొందియే జీవుఁడు ఆనందించుచున్నాఁడు. బ్రహ్మానందమునుఁ గలిగించు నీరసమే లేనిచో నెవఁడు జీవించును? సకలప్రాణివర్గము

తనవ్యాపారము నెట్లు నిర్వర్తించును? నిరీహులగు బ్రహ్మవేత్తలు ఆనందరసతృప్తులై బాహ్యరసలాభముఁ జెందినవారివలె సంతుష్టు లగుచున్నవారలు. పరమప్రేమాస్పదమగు నాత్మ ఆనందమయము గనుక సకలప్రాణులు ఆనందరసస్వరూపుఁడగు పరమాత్ము నాశ్రయించి, జీవించి పరవశత్వముఁ జెందుచున్నవి.

శ్రు. ఆనందమయోయమాత్మా ఆనందాద్ధ్యేవ ఖల్విమాని భూతాని జాయంతే, ఆనందేన జాతాని జీవంతి; ఆనందం ప్రయంత్యభిసంవిశంతీతి. "తైత్తిరీయోపనిషత్"

ఈ సమస్తభూతజాతములు ఆనందరసస్వరూపునివలననే కలుగుచు, సత్ప్రవృత్తిఁ జెందుచు, జీవించుచు నానందముఁ జెందుచు నచటనే లయించుచున్నవి. అంతటికి ఆనందమయుం డగు ఆత్మ ప్రధానకారణము.

శ్లో. అత్తి సర్వాన్ పదార్థాన్ యస్సర్వత్రాతతియ స్సదా,
అత్యేత్యపి జగత్సర్వం యస్స ఆత్మేతి కథ్యతే.
"వేదాంతసారం"

ఎయ్యది సమస్తపదార్థముల నాస్వాదించుచున్నదో (భక్షించుచున్నదో) అంతట నద్ది వ్యాపించియున్నదో, సర్వోత్కృష్టమై జగంబులనన్నింటి నతిక్రమించుచున్నదో, అయ్యది ఆత్మయని చెప్పఁబడును. ఆయాత్మ ఆనందమయుఁడు, రసస్వరూపి, తనమే సకలభూతములకు జీవనము, పోషకము, సుఖదము నైయున్నది.

రసస్వరూపము.

శ్లో. విభావై రనుభావైశ్చ సాత్త్వికై ర్వ్యభిచారిభిః,
ఆనీయమాన స్స్వాదుత్వం స్థాయీభావో రసస్స్మృతః.
"దశరూపకం"

శ్లో. కారణాన్యథ కార్యాణి సహకారీణి యాని చ,
రత్యాదే స్థాయినో లోకే తాని చేన్నాట్యకావ్యయోః.
విభావా అనుభావా స్తత్కథ్యంతే వ్యభిచారిణః,
వ్యక్తస్సతై ర్విభావాద్యై స్స్థాయీభావో రసస్స్మృతః.
"కావ్యప్రకాశము"

కారణములగు విభావములచేతను, కార్యములగు అనుభావములచేతను, సహకారులగు వ్యభిచారభావములచేతను మాధుర్యమును బొంది, విభావాదులచే నభివ్యక్తమై సహృదయులగు సామాజికుల హృదయములందుఁ బ్రకాశించుచు, ననుభవింపఁబడుచున్న స్థాయీభావము రసమని చెప్పఁబడును.

సముచిత లలిత సన్నివేశ చారుణాకావ్యేనసమర్పితై స్సహృదయహృదయం ప్రవిష్టై స్తదీయసహృదయతాసహకృతేన భావనావిశేషమహిమ్నా విగళితదుష్యంతరమణీయత్వాదిభి రలౌకిక విభావానుభావ వ్యభిచారిశబ్దవ్యపదేశ్యై శ్శకుంతలాదిభి రాలంబనకారణైశ్చంద్రికాదిభి రుద్దీపనకారణై రశ్రుపాతాదిభిః కార్యైశ్చింతాదిభిస్సహకారిభిశ్చ సంభూయ ప్రాదుర్భవితేనా లౌకికేన వ్యాపారేణ తత్కాలనివర్తితానందాంశావరణాజ్ఞానేన అతఏవ ప్రముష్టపరిమితప్రమాతృత్వాదినిజధర్మేణ ప్రమాత్రా స్వప్రకాశ

తయా వాస్తవేన నిజస్వరూపానందేన సహ గోచరీక్రియమాణః ప్రాగ్వి నిష్టవాసనారూపో రత్యాదిరేవ రసః.

"రసగంగాధరే."

సముచిత మృదుమధుర పదార్థసందర్భసన్నివేశముచే రమణీయమగు కావ్యమందుఁ గూర్పఁబడినవియు, సహృదయ హృదయములనుఁ బ్రవేశించినవియు, వారి నిర్మల భావనా మహిమచే దుష్యంతరమణీయత్వాదులను మఱచినవియు, శకుంతలాదులను ఆలంబనకారణములు, చంద్రచంద్రికాదు లగు ఉద్దీపనకారణములు, అశ్రుపాతాదులగు కార్యములు, చింతాదులగు సహకారములను, అలౌకిక విభావానుభావ సాత్త్వికసహచారిభావములతోఁ గూడి లోకోత్తరవ్యాపార ముచే నుత్పన్నమైనందున ఆనందాంశము నావరించిన అజ్ఞాన మును తత్కాలమందు నివర్తింపఁ జేసినందున, సంకుచితము లగు ప్రమాతృత్వాది నిజధర్మమును విడిచి స్వప్రకాశముచే స్వస్వరూపానందమును సాక్షాత్కరింపఁ జేసికొని విగళిత వేద్యాంతరమై పరమానందరూపమునుఁ బొందింపఁబడి మున్ను నెలకొనియున్న వాసనారూపమగు రత్యాదిస్థాయిభావమే రస మనఁబడునని తాత్పర్యము.

శ్రావ్యదృశ్యప్రబంధములగు కావ్యనాటకాదులయందు రసము ప్రాధాన్యము. రసము లేనిచో నీరసము లగును. నిర్జీ వము లగును.

శిక్షణాభ్యాసపాటవముగల నిపుణులగు నటులచే నభినయముద్వారా నాయకులగు శ్రీరామ దుష్యంతాదులభావములు నాయికలగు సీతాశకుంతలాదిభావములు ప్రదర్శితములై సహృదయులగు సామాజికులచే నేకాగ్రవృత్తితో ననుభవింపఁబడుచు, నానందపారవశ్యమునుఁ గావించు రత్యాది స్థాయీభావము రసమని పర్యవసితము.

రసము సహృదయసామాజికనిష్ఠగాని, అర్థార్జనముకొఱకును, సామాజికుల చిత్తరంజనముకొఱకు నభినయించు నటాశ్రయముఁ గానేరదు. నటుఁడు శిక్షణాభ్యాసపాటవముచే అశ్రుపాతము, గద్గదికము, పులకాంకురితములు, రసానుభవచిహ్నములు చూపించుచున్నాఁడు గాని, నిక్కముగ రసమనుభవించి చూపుటలేదు. చిత్తవిక్షేపముగల నటుఁడు రసాస్వాదనకు పాత్రుఁడు కాఁజాలఁడు. అయినచో సామాజికత్వమునుఁ బొందినవాఁడే యగును.

స్థాయీభావవిచారము.

సజాతీయములగు నాయికాంతర విషయానురాగభావములచేతను, విజాతీయములగు బీభత్సాదిభావములచేతను తిరస్కరింపఁబడక యవిరుద్ధముగ రసానుభవపర్యంతము స్థిరత్వముఁ జెందియుండునది స్థాయీభావ మనఁబడు. మహాప్రవాహములోని సుడిగుండము, తనలో వచ్చిపడిన ప్రవాహములనన్నింటినిఁ జేర్చుకొని తనభావమునుఁ గలిగించినట్టులను,

మహార్ణవములోని లవణోదకము తనలోనికివచ్చిన నదీజలము మధురంబయినను తనలవణభావమునుఁ బొందించినట్లులను,ఎన్ని భావాంతరములు చేరినను వానినన్నింటిని తనలో నైక్యముఁ జేసికొని స్థిరత్వమునుఁ బొంది, సామాజికులచే నాస్వాదింపఁ బడురసము స్థాయీభావ మనఁబడు.

చిరకాలము సహృదయప్రేక్షకులహృదయమందు వాసనారూపముగ నెలకొనియుండు సంస్కారమను పేరుగల భావము,విభావానుభావాదులచే నభివ్యక్తమై, రసరూపముగఁ బ్రకాశించును. అనాదిగ మానవుల హృదయక్షేత్రమందు సుఖదుఃఖాదివృత్తులు హర్షశోకాదిభావములు సంస్కార వాసనారూపముగ నెలకొనియుండి భూమియందు గూఢముగ నున్నవిత్తనములు వర్షించినంతట అంకురిత పల్లవిత కుసుమిత ఫలితావస్థలనుఁ జెందినట్టులే విభావానుభావాదులచే నభివ్యక్తమై యంకురితత్వాద్యవస్థలను బొంది రసమని వ్యవహరింపఁబడును.

> పటమునకు తంతువువలె, రసమునకు స్థాయీభావము ఆకారమాత్రవ్యవహిత మనఁగ సన్నిహితము. కువిందాదులు (నేఁతగాఁడు లోనగువారు) వలె విభావాదులు వ్యవహితము

అన్నము, కూరలు వ్యంజనసంబంధముచే మాధుర్యమునుఁ బొంది, భుజింపఁబడినట్టుల స్థాయీభావ మగురసమును, విభా

వానుభావాదులచే స్వాదుత్వమును బొంది యనుభవింపఁ బడును.

నవరసములు.

శ్లో. శృంగార హాస్యకరుణా రౌద్ర వీర భయానకాః,
బీభత్సాద్భుతశాంతాశ్చ రసా నవ సమీరితాః.

"దశరూపకం."

శృంగారము, హాస్యము, కరుణ, రౌద్రము, వీరము, భయానకము, బీభత్సము, అద్భుతము, శాంతము నని రసములు నవవిధములు. శమదమాదిసంపన్నులగు మహర్షుల యందుఁ జూపట్టు శాంతరసము నాట్యమందు నటునిచే నభినయింపఁబడి చూపుటకు వీలుకానందున అష్టరసములే యని కొందఱు వాక్రుచ్చిరి. మఱికొందఱు భక్తి, వత్సల, ప్రేమ రసములఁజేర్చి ద్వాదశరసములఁ జెప్పిరి. భక్తివత్సల ప్రేమలు స్థాయీభావములు గాక భావము లగుటవలన రసములలోఁ జేర్పక, నవరసములే యని స్థిరీకరించిరి. నిర్వేదము స్థాయీభావ మగుటవలన శాంతముఁ గూడ రసమే యగునని కావ్యప్రకాశకారుఁడు వాక్రుచ్చెను. రసగంగాధరకారుఁడు గూడ నంగీకరించెను.

"శృంగమియర్తీతి" శృంగారమనెడు వ్యుత్పత్తిచే రసములలోనికెల్ల శ్రేష్ఠమగుటచేతను, సకలప్రాణిప్రవృత్తులు

కామసంకల్పజనితము లగుటవలనను, కామపురుషార్థ మూలమగుటం బట్టియు; శృంగారమొకటియే రసమనియు, దాని నుండియే తక్కినవి పుట్టినవనియు, శృంగార తిలకకారాది రసనిబంధకారులు వాక్రుచ్చిరి. సకలప్రాణులకు చిత్తశాంతిఁ గలిగించి సంసారాసక్తప్రాణమునుఁ బోఁగొట్టి మోక్షము నొసంగుటచే శాంతరసము ప్రధానమని మఱికొందఱు నిర్ణయించిరి.

చతుర్విధపురుషార్థములు మూలములుగాఁగల నవరసములు ముఖ్యములని గొల్లఱు నంగీకరించిరి.

నవరసములు, పురుషార్థమూలములు.

కామపురుషార్థమూలమయినది	...	శృంగారరసము
శృంగారరసమువలన జనితమయినది	...	హాస్యరసము
హాస్యరసమునకు విరోధి	...	కరుణారసము
కరుణారసప్రధానమై అర్థపురుషార్థమూలమయినది	...	రౌద్రరసము
అర్థకామములకు, ధర్మము మూలమగుటవలన ధర్మప్రధానమయినది	...	వీరరసము
వీరరసమునకు భీతాభయప్రదానము సాధనమగుటవలన	...	భయానకరసము

భయానకమే కారణభూతమగుట వలన ... బీభత్సరసము

వీరరసఫలభూతమయినది ... అద్భుతరసము

మోక్షఫలము కలది ... శాంతరసము

విభావాదిసమాగమమందు మనోధర్మములు.

శ్లో. వికాస విస్తర క్షోభ విక్షేపాఖ్యా శ్చతుర్విధాః,
జాయంతే చేతసో ధర్మా విభావాది సమాగమే.
వికాసః కుసుమస్యేవ పాదపస్యేవ విస్తృతిః,
చేతసోఽబ్ధేరివ క్షోభో విక్షేపో మరుతో యథా.

"రసార్ణవసుధాకరే."

విభావాదిసంయోగమువలన చిత్తమునకు వికాస విస్తర క్షోభవిక్షేపములను నాలుగువిధములగు ధర్మములు కలుగుచున్నవి. ఎట్లన: పుష్పమునకువలె వికాసంబును, వృక్షమునకువలె విస్తృతియు (విస్తరించుట), సముద్రమునకుఁ బోలె సంక్షోభమును, వాయువునకువలె విక్షేపము (అంతట వ్యాపించుట) ఈ చతుర్విధధర్మములు చిత్తము నాశ్రయించు రసములకునుఁ గలుగుచున్నవి. చిత్తైకాగ్రత రసాస్వాదనకు హేతువు గనుక ఆశ్రయధర్మములు ఆశ్రయికినిఁ గలుగుచున్నవని పర్యవసానము.

పరస్పరమిత్రములు.

శృంగారహాస్యములు	...	వికాసమూలములు	...	పుష్పముపగి
వీరాద్భుతరసములు	...	విస్తృతిమూలములు	...	వృక్షముఃబోలె
రౌద్రభయానకములు	...	సంక్షోభమూలములు	...	సముద్రముఃబలె
బీభత్సకరుణలు	...	విక్షేపమూలములు	...	వాయువుఃబోలె

పరస్పరవిరోధములు.

శృంగారమునకు	...	బీభత్సరసము
వీరరసమునకు	...	భయానకరసము
రౌద్రమునకు	...	అద్భుతరసము
కరుణారసమునకు	...	హాస్యరసము

రసోచిత - కావ్యవృత్తులు.

శృంగారకరుణలు	...	అతికోమలసందర్భము	...	కైశికీవృత్తి
రౌద్రబీభత్సములు	...	అతిప్రౌఢసందర్భము	...	ఆరభటీవృత్తి
హాస్యశాంతాద్భుతములు	...	నాతిసుకుమారసందర్భము	...	భారతీవృత్తి
వీరభయానకములు	...	నాతిప్రౌఢసందర్భము	...	సాత్వతీవృత్తి

రసములు	అధిదేవతలు	వర్ణము	రసోచితపురుష రాగము	రాగభార్యా పుత్రికాదులు
1. శృంగారరసము	విష్ణువు	నీలవర్ణము	భూపాళరాగము.	1. బిలహరి 2. మలహరి 3. భాండి.
2. హాస్యరసము	విఘ్నేశ్వరుఁడు ప్రమథులు	శుక్లము	వసంతరాగము.	1. రామక్రియ 2. వరాళి 3. గౌళ.
3. కరుణారసము	యముఁడు	కషాయము	ఫలమంజరి.	1. దేశి 2. ముఖారి 3. లలిత.
4. రౌద్రరసము	రుద్రుఁడు	రక్తవర్ణము	భైరవీరాగము.	1. దేవక్రియ 2. మేఘరంజి 3. కురంజి.
5. వీరరసము	ఇంద్రుఁడు	గౌరవర్ణము (జాతిపుష్పవర్ణము)	నాటరాగము.	1. ఘంటారవము 2. కాంభోజి 3. శంకరాభరణము.

6. భయానకరసము -	మృత్యుదైవతము -	శ్యామవర్ణము (అతసీకుసుమవర్ణము) -	మాళవరాగము.	1. గుండక్రియ 2. ఘూర్జరి 3. బవుళి.
7. బీభత్సరసము -	నందీశ్వరుఁడు (మహాకాలుఁడు) -	నీలమేఘవర్ణము -	శ్రీరాగము.	1. ఆందోళి 2. భల్లాతి 3. సాహుళి.
8. అద్భుతరసము -	బ్రహ్మదైవతము (గంధర్వుఁడు) -	పీతవర్ణము (తప్తసువర్ణవర్ణము) -	బంగాళీరాగము.	1. కళ్యాణి 2. ఆహిరి. 3. సావేరి.
9. శాంతరసము -	పరబ్రహ్మదైవతము- (నారాయణుండు)	(శుక్ల)శుద్ధస్ఫటిక- సదృశవర్ణము	ఆనందరాగము. సర్వరాగనాదములు.	

ప్రాచీనార్యులు దివ్యదృష్టిచే రసాధిష్ఠానదైవతములను వర్ణములను రాగములనుఁ గనిపెట్టి, సముచితసన్నివేశములను, లలితకళలయందును శ్రావ్యదృశ్యప్రబంధములయందునుఁ గలుగఁజేసికొని,యానంద మనుభవింపుఁడని యనుగ్రహించిరి. ఈభూలోకమునందుఁ గన్పించు స్థావరజంగమనునులును, వివిధ పదార్థములును, రాగములు, రసములు, భావములు, మనోవృత్తులు, దృశ్యములు లోనగునవియన్నియు తేజోమూర్తులయి దేవతారూపముతో నాయా సూక్ష్మలోకములయందున్నవని మహాభారత సభాపర్వమున దిక్పాలకుల లోకముల వర్ణించుతఱి నారదమహాముని యుధిష్ఠిరునకుఁ దెలిపెను. మన మేమి యొనరించినను సూక్ష్మాకాశమునందు (Eather) ప్రతిఫలించుననియు, మాటాడినను పాటఁ బాడినను విద్యుచ్ఛక్తి సాహాయ్యంబున రేడియో యంత్రముద్వారా తెలియఁబడుననియు ప్రకృతపు విజ్ఞానశాస్త్రము బోధించుచున్నది.

అట్టి ప్రాచీనార్యుల యుద్దేశ్యములను రసభావప్రయోజనములనుఁ దెలిసికొనక దుర్వినియోగము చేయువారికన్న శోచనీయులు మఱియొక రుండరు. మానసిక, వాచిక, కాయిక ప్రతిక్రియయు ప్రకృతియందుఁ జేరి ప్రతిఫలము నిచ్చును. కాఁబట్టి శ్రేయోదాయకములగు మంచిపనులనే చేయవలయును.

భా వో ద్రే క ము.

ప్రజ్ఞాధురీణుఁడును ప్రతిభావంతుఁడు నగు మహాకవి రసోచితములగు శైలి, వృత్తి, రీతుల నాశ్రయించి, పదార్థ

ముల సన్నివేశపఱిచి, చమత్కార రమణీయ ధ్వనిప్రధానంబు లగు శ్రావ్యదృశ్యప్రబంధములు రచియించినచో, మాధుర్య కంఠము గలగాయకులు వాచకులు నిపుణు లగునటులు తత్తద్రసోచితరాగముల నాశ్రయించి ప్రదర్శించినపుడు, చిరకాలము ప్రేక్షకసామాజికుల హృదయమునందు సంస్కారవాసనారూపముగ నెలకొనిన స్థాయీభావము విభావానుభావాదులచే నుల్లసితమై యభివ్యక్తమై రసము పూర్తీభవించి మహాప్రవాహమై మహోదధివలె నుప్పొంగి తన్మయత్వమునుఁ బొందించి ముంచివైచును. తాదాత్మ్యస్థితినిఁ జెందిన ప్రేక్షకసామాజికులు వారేమి యొనరించినది యేమి చూచినది యేమి వినినది తెలుపఁజాలక ఆనందపారవశ్యమును బొందుదురు. ఇదియే రసోదయము.

స్థాయీభావములు.

శ్లో. రతిర్హాసశ్చ శోకశ్చ క్రోధోత్సాహౌ భయం తథా,
జుగుప్సా విస్మయశమా స్థాయీభావా నవ క్రమాత్.

"కావ్యప్రకాశ"

రతి, హాసము, శోకము, క్రోధము, ఉత్సాహము, భయము, జుగుప్స, విస్మయము, శమము అను నీ తొమ్మిది శృంగారాదినవరసములకు క్రమముగ స్థాయీభావము లగుచున్నవి.

విభావములు.

స్థాయీభావమగు రసోత్పత్తికిఁ గారణమగువిభావము రెండువిధములు. ఆలంబనవిభావము, ఉద్దీపనవిభావమునని;

"విశేషేణ భావయత్యుత్పాదయతీతి" విశేషముగ నుత్పాదక మనఁగా ఉద్బోధనము చేయుటంబట్టి విభావమని వ్యుత్పత్త్యర్థము. రత్యాదిభావమును విశేషముగ భావించుటంబట్టియు విభావ మనఁబడును

దేనిని విషయముగఁ జేసికొని (ఆలంబించి)రసము ప్రవర్తించుచున్నదో అయ్యది ఆలంబనవిభావము. ఆలంబమనఁగా ఊత పట్టుఁగొమ్మ. శృంగారరసమునకు నాయికానాయకులే ఆలంబనవిభావము. ఏది రసము నుజ్జ్వలింపఁ జేయునో అయ్యది ఉద్దీపనవిభావ మనఁబడును. ఇంధనములు ఘృతము లోనగు వానిచే నగ్నిహోత్ర ముజ్జ్వలించినటుల రూప-యౌవన-గుణ చేష్టాదులచే శృంగారరస ముద్దీపిత మగును.

ఆలంబనగుణ, తచ్చేష్ట, తదలంకార, తటస్థభేదములచే ఉద్దీపనవిభావము నాలుగువిధములు.

ఆలంబనవిషయులగు నాయికానాయకగుణములు ధీరోదాత్తాది నాయకలక్షణములు గుణములు. వారిసహాయులు నాయికాభేదములు. వారిగుణములు అనేకములుగా సాహిత్యదర్పణ రసచంద్రికాదులందుఁ జెప్పఁబడినవి. ఆలంబనచేష్టలనఁగా యౌవనమందుఁ గలుగు భావహావాదులు పదునెనిమిది శృంగారచేష్టలు. ఆలంబనాలంకారము లనఁగా నూపురాంగదహారాదులు తటస్థు లనఁగా ఉద్యానవనవిహార కోకిలాలాప సరోవరక్రీడా సంగీతశ్రవణ చంద్రచందన మలయా

నిలాదులు. స్థాయీభావమునకు వీనికి కార్యకారణ భావసంబంధము.

ఆలంబన నాయికానాయకుల శృంగారచేష్టలు.

శ్లో. "యౌవనే సత్త్వజా స్తాసామష్టావింశతి సంఖ్యకాః,
అలంకారా స్తత్ర భావ హావ హేలా స్త్రయోఽఙ్గజాః.
శోభా కాంతిశ్చ దీప్తిశ్చ మాధుర్యం చ ప్రగల్భతా,
ఔదార్యం ధైర్య మిత్యేతే సప్తైవ స్యు రయత్నజాః.
లీలా విలాసో విచ్ఛిత్తి ర్బిబ్బోకః కిలికించితం,
మోట్టాయితం కుట్టమితం విభ్రమో లలితం మదః.
వికృతం తపనం మౌగ్ధ్యం విక్షేపశ్చ కుతూహలం,
హసితం చకితం కేళి రిత్యష్టాదశ సంఖ్యకాః.
స్వభావజాశ్చ భావాద్యా దశ పుంసాం భవంత్యమీ."

సాహిత్యదర్పణం.

వారికి యౌవనమందు సత్త్వజములగు అలంకారములు ఇరువదియెనిమిది కలవు. అందు 1 భావ, 2 హావ, 3 హేలలు, మూఁడును అంగజములు. 4 శోభ, 5 కాంతి, 6 దీప్తి, 7 మాధుర్యము, 8 ప్రగల్భత, 9 ఔదార్యము, 10 ధైర్యము అను నీయేడును అయత్నజములు.

1 లీల, 2 విలాసము, 3 విచ్ఛిత్తి, 4 బిబ్బోకము, 5 కిలికించితము, 6 మోట్టాయితము, 7 కుట్టమితము, 8 విభ్రమము, 9 లలితము, 10 మదము, 11 వికృతము, 12 తపనము, 13 మౌగ్ధ్యము, 14 విక్షేపము, 15 కుతూహలము, 16 హసితము,

17 చకితము, 18 కేళి అను నీ పదునెనిమిది స్వభావజములు. భావము మొదలు ధైర్యము తుదిగాఁగల పదియును పురుషులకుఁగూడ సంభవించును. మొత్తము ఇరువదియెనిమిదియు నాయికాశ్రితములుగానే శోభావిశేషమునుఁ గావించును.

అనుభావములు.

శ్లో. భ్రూవిక్షేప కటాక్షాది వికారో హృదయస్థితం,
భావం వ్యనక్తి యస్సోఽయ మనుభావ ఇతీరితః.

కారణానంతరము కార్యముఁ గలుగవలయు గనుక భ్రూవిక్షేప కటాక్షాదివికారములు హృదయమందలిభావమును అనుభవగోచరములు చేయుచున్నవి. కావున అనుభావములనఁబడు. తనతన కారణములచేత నుద్బుద్ధమయిన భావమును బయటికి వెల్లడించుచు, లోకములో నేది కార్యత్వమునుఁ బొందియున్నదో అది "అనుభావమని చెప్పఁబడు" నని సాహిత్యదర్పణకారుని మతము. కాయిక మానస ఆహార్యభేదములచే త్రివిధము.

భుజాక్షేపాదులు కాయికములు, ప్రమోదాదులు మానసములు, నాట్యమందు చతుర్భుజత్వజ్ఞానమాహార్యము.

శృంగారరసమునందు కటాక్షవిక్షేప భుజాక్షేప నయన వదనప్రసాద మధురవచనస్మిత ప్రమోదాదులు అనుభావములగును. ఇయ్యవి స్థాయీభావమునకు జ్ఞాప్యజ్ఞాపకభావసంబంధము లగును.

సాత్త్వికభావనిర్వచనము.

శ్లో. "పరస్య సుఖదుఃఖాదే రనుభావేన చేతసః,
అత్యంతానుకూల్యేన యేన తద్భావ భావనం.
త త్సత్త్వం తేన నిర్వృత్తా స్సాత్త్వికా ఇత్యుదీరితాః."

రసమంజరిక.

పరగతసుఖదుఃఖభావనయందు మనస్సున కత్యంతాను కూలత్వము సత్త్వము, దానివలన వెలువడిన వికారములు సాత్త్వికము లనఁబడు. ఇతరు లనుభవించిన సుఖదుఃఖాదు లనుఁ జక్కఁగ భావనఁజేసి,తాదాత్మ్యమునుఁ జెంది తానే యను భవించినట్టుల భావించినవానిచిత్తమునకు (తద్భావభావనకు) సత్త్వోద్రేకము గలిగి వెలువడిన స్తంభప్రళయరోమాంచాదు లు సాత్త్వికభావము లనఁబడు. సత్త్వమనఁగ ప్రాణివాచకము, జీవశరీరధర్మములు సాత్త్వికము లనియుఁ జెప్పఁబడును నేనే రాముఁడను, నేనే దుష్యంతుఁడ ననున భేదాధ్యవసాయబుద్ధి, సత్త్వగుణము, దానివలననయినఁ బుట్టినవని చెప్పనగును. భావ సత్త్వశబ్దములు భేదము లేని పర్యాయవాచకములు. అను భావములం దివి పరిగణింపఁబడినను, శారీరధర్మము లగుట వలన వేఱుగఁ జెప్పఁబడియె. మనస్సు ద్రవించినదా? లేదా యని కనుఁగొనుటకు సాత్త్వికభావములే దృష్టాంతము. మానసో (సాత్త్విక)ద్రేకము లేక శారీరధర్మములగు స్తంభప్రళయరో మాంచాదులు కలుగవు కాఁబట్టి సాత్త్వికభావములని చెప్పఁ బడెను. సత్త్వమునకును ప్రాణిశరీరమని ప్రాచీనులు సాధించిరి.

సాత్త్వికభావములు.

శ్లో. "స్తంభప్రళయరోమాంచాః స్వేదో వైవర్ణ్యవేపథూ,
అశ్రువైస్వర్యమిత్యష్టౌ సాత్త్వికాః పరికీర్తితాః."

రసార్ణవసుధాకర.

"స్తంభము, ప్రళయము, రోమాంచము, స్వేదము, వైవర్ణ్యము, వేపథువు, అశ్రువు, స్వరభంగము" అని సాత్త్విక భావములు ఎనిమిదివిధములు.—

1. **స్తంభము** = రాగభీతిహర్షవిషాదవిస్మయక్రోధాదులచేత, జడత్వ నిష్కంపనత్వాదులు కలిగి, శారీరచేష్టం దప్పుట, గతినిరోధము (మ్రాన్పడుట.) స్తంభమనంబడు.

2. **ప్రళయము** = సుఖమదనిద్రాప్రహారజన్యమై, దుఃఖాతిశయముచే మైమఱచి చేష్టాజ్ఞానము లేకుండుట, (మూర్ఛనాచే, నష్టచేష్టతం గలుగుట) ఇంద్రియములు నిశ్చలములగుటయుం జెప్పదగు. త్రిగుణముల చేష్ట లుడుగుట.

3. **రోమాంచము** = సుఖోత్సాహభయవిస్మయాదులవలనం గలిగి శీతానిలగాత్రసంస్పర్శనాలింగనాదులచే ననుభావములయినది రోమాంచము, లేక గగుర్పాటు (పులకితము) వెండ్రుకలందుం గలుగు విక్రియ.

4. **స్వేదము** = నిదాఘశ్రమహర్షవ్యాయామాదులజ్జాభయక్రోధాదిజన్యమై గాలిసోఁకు విసనకఱ్ఱలోనగునవి యనుభావములై, దేహజలము వెలికి వచ్చుట (చెమర్చుట) స్వేదమనంబడు.

5. వైవర్ణ్యము = రోషాతపశీతభయాదులవలనఁబుట్టి కృశత్వము సౌందర్యవిప్లవములచేఁ దెలియఁదగి వర్ణము మాఱుట, వైవర్ణ్యము. జ్వరరోగాదులచేతను వెల్లఁబాఱుటయు, గర్భిణీస్త్రీలకు గండపాండిమఁ గలుగుటయు వివర్ణత్వ మనఁబడు.

6. వేపథువు = అనురాగ రోషభయజ్వర జరాదులవలనఁ గలిగిన దేహకంపము, వేపథువనఁబడు. (వణఁకుట)

7. అశ్రువు = క్రోధ హర్ష భయ జృంభాదిజన్యమై, కన్నుఁ దుడుచుచు కారుచున్నట్టి కన్నీరు అశ్రువనఁబడు. ప్రహర్షమువలనఁ గలుగు కన్నీరు ఆనందబాష్పములనియు, దుఃఖమువలనఁ గలుగుబాష్పములు కన్నీరనియు (దుఃఖబాష్పములు) జెప్పుదురు.

8. స్వరభంగము = హర్షశోకభయజ్వరాదిజన్యమై స్వరవర్ణస్ఖాలిత్యము చే తెలియఁదగు గద్గదభాషిత్వము, స్వరభంగ మనఁబడు. మదసమ్మద పీడాదులవలనను గద్గదభాషిత్వము కలుగును.

పంచభూతాత్మకమగు అన్నమయకోశకత్వము చే. మనోమయుంబును, మనోమయతాదాత్మ్యమునుఁ బొందిన ప్రాణమయంబును, సత్త్వమని చెప్పఁబడును. సత్త్వము ప్రాణముగనుక పంచభూతాంశములవలన నీసాత్త్వికభావము లుత్పన్నమగుచున్నవని కొందఱు రసతత్త్వజ్ఞులు నుడివెదరు. ఎట్లనిన: భూభాగానుగ్రహామువలన స్తంభము, జలభాగానుగ్రహాము వలన అశ్రువు (కన్నీరు) తేజోనుగ్రహామువలన స్వేదము, వైపరీత్యమువలన వివర్ణత, ఆకాశానుగ్రహామువలన ప్రళయము, అనిలానుగ్రహామందమందు రోమాంచము, మధ్య

మందు దేహకంపము, ఉత్కృష్టతయందు గద్గదభాషిత్వము కలిగెనని నిరూపించిరి.—

సహకారిభావనిర్వచనము (వ్యభిచారిభావములు.)

శ్లో. "విశేషాదాభిముఖ్యేన చరంతో వ్యభిచారిణః,
స్థాయిన్యున్మగ్ననిమగ్నాస్తే కల్లోలా ఇవ వారిధౌ.
తథా స్థాయిని నిర్మగ్నా ఉన్మగ్నా వ్యభిచారిణః,
పుష్ణంతి స్థాయినం స్వాంశ్చ తత్ర యాంతి రసాత్మతాం."

రసార్ణవసుధాకర.

స్థాయియందు తేలినవియు, మునిఁగినవియునై విశేషముగా ఆభిముఖ్యముతో చరించును గావున వ్యభిచారు లనఁబడును మహార్ణవమునందు అలలు మునుఁగుచు తేలుచు నంభోధిని తమ్మును పోషించుకొనినట్లుల స్థాయీభావమగు రత్యాదియందు నిర్వేదాదులు ప్రాదుర్భావ తిరోభావముల నొందుచు, తమ్మును స్థాయీభావమును పుష్టిఁ బొందించుకొనుచు రసాత్మత్వమునుఁ జెందుచుండును సర్వత్ర సంచరించుటవలన సంచారిభావములనియు,స్థాయీభావమునుఁ బోషించుటవలన సహకారిభావములనియు, విశేషముగ నంతట ఆభిముఖ్యముతో చరించుటవలన వ్యభిచారిభావములనియుఁ జెప్పఁబడును. స్థాయీభావమునకు వీనికి పోష్యపోషకభావసంబంధము.

వ్యభిచారిభావములు (సహకారిభావములు.)

శ్లో. "నిర్వేదగ్లాని శంకాఖ్యా స్తథాఽసూయా మదశ్శ్రమః,
ఆలస్యం చైవ దైన్యం చ చింతా మోహః స్మృతిర్ధృతిః.

వ్రీడా చపలతాహర్ష ఆవేగో జడతా తథా,
గర్వో విషాద ఔత్సుక్యం నిద్రాపస్మార ఏవ చ.
సుప్తి ర్విబోధోఽమర్ష శ్చాప్యవహిత్థ మథోగ్రతా,
మతి ర్వ్యాధి స్తథోన్మాద స్తథా మరణ మేవ చ.
త్రాస శ్చైవ వితర్కశ్చ విజ్ఞేయా వ్యభిచారిణః,
త్రయస్త్రింశ దమీ భావా రసస్య సహకారిణః."

భరతరసప్రకరణమ్.

1. నిర్వేదము	12. ధృతి	23. సుప్తి
2. గ్లాని	13. వ్రీడ	24. విబోధ
3. శంక	14. చాపల్యము	25. ఆమర్షము
4. అసూయ	15. హర్షము	26. అవహిత్థ
5. మదము	16. ఆవేగము	27. ఉగ్రత్వము
6. శ్రమము	17. జడత్వము	28. మతి
7. ఆలస్యము	18. గర్వము	29. వ్యాధి
8. దైన్యము	19. విషాదము	30. ఉన్మాదము
9. చింత	20. ఔత్సుక్యము	31. మరణము
10. మోహము	21. నిద్ర	32. త్రాసము
11. స్మృతి	22. అపస్మారము	33. వితర్కము

స్థాయిభావమగు రసమునకు సహకారులగు నిర్వేదాది భావముల లక్షణములు సాత్త్వికాదిచిత్తవృత్తుల వివరించు సందర్భమున సముచితముగ విశదీకరింపఁ దలఁచి యిచట విరమితము.——

శృంగారాదినవరసములు.

రసములు.	స్థాయీభావములు.	విభావములు.	అనుభావములు.	వ్యభిచారములు.
1. శృంగారరసము	- రతి	- నాయికానాయక గుణ చేష్టాలంకారములు.	కటాక్ష భుజాక్షేపణ ఘటనస్మిత ప్రమోదాదులు.	శంకాసూయా మద గ్లానిస్మయ హర్షవిషాద చింతా క్రీడాదులు.
2. హాస్యరసము	- హాసము	- [illegible] నట విభావములు. వికృత వేషభాషాలంకారాదులు.	నాసా కపోల స్పందన [illegible] దృష్టి [illegible]దులు.	చపలత్వ నిద్రాసూయా శంకా స్వప్నగ్లాని శ్రమాదులు.
3. కరుణారసము	- శోకము	- ఇష్టజనవినాశ క్లేశబంధ [illegible]. ప్రియజన [illegible] క్రి[illegible]కము.	[illegible]	దైన్య చింతా గ్లాని [illegible] జడతా [illegible]దులు.
4. రౌద్రరసము	- క్రోధము	- క్రూరా[illegible]. [illegible]	క్రో[illegible] [illegible]దులు.	ఉత్సాహామర్ష గర్వాసూయాదులు.

5. వీరరసము	- ఉత్సాహము -	రామాద్యుత్తమ నాయకాదులు. బలపరాక్రమప్రతాపాధ్యవసాయక్రోధాదులు.	శౌర్య ధైర్య స్థైర్యపరాక్రమప్రభావ తిరస్కారవాక్యాదులు.	గర్వమదోగ్రత్వక్రోధాసూయా మోహావేగాదులు.
6. భయానకరసము	- భయము -	వ్యాఘ్రసర్ప ప్రతిభటాదులు. తద్దర్శనభీకరాకారతర్జనభర్జనాదులు	కాళరాత్రి వీక్షణా ఉత్కోశననేత్రమస్తకకంపనఓష్ఠతాలుశోషణాదులు	సంత్రాసమరణ దైన్యగ్లానిసంభ్రమ శంకాపస్మారము.
7. బీభత్సరసము	- జుగుప్స -	మాంసకీకస రక్తాదులు. దుర్గంధదుష్టరసదుష్టస్పర్శాదులు.	నాసాలోచన పిధాన, వైముఖ్యానన నేత్రవిఘూర్ణన నిష్ఠీవనాదులు.	అపస్మారవిషాదభయరోగోన్మాదమదాదులు.
8. అద్భుతరసము	- విస్మయం -	చమత్కారవస్తు.	నాసికాంగుళీ స్పర్శ దంతజిహ్వాగ్రపీడన నిర్నిమేషప్రేక్షణ హాహాకార సాధువాదములు.	ఆవేగ జడతా మోహాహర్షణవిస్మయధృతులు.
9. శాంతరసము	- శమము -	పరతత్త్వవస్తునిర్ణయవిషయదోష విచారనిత్యానిత్యవస్తు వివేకాదులు. పురాణ శ్రవణ తీర్థాటన, సత్సంగాదులు.	నిస్సంగత్వ నిర్నిమేషత్వ యమనియమ ప్రాణాయామ ఆనందాశ్రుపులక హర్షాదులు.	ధైర్యనిర్వేద శమమతిస్మృతిహర్షాదులు.

శృంగారమునకు స్థాయీభావమగు రతి.

శ్లో. "సంపన్నైశ్వర్య సుఖయో రశేషగుణయుక్తయోః,
నవయౌవనయోశ్శ్లాఘ్యప్రకృత్యోశ్శ్రేష్ఠరూపయోః.
నారీపురుషయో స్తుల్యా పరస్పరవిభావికా,
స్పృహాహ్వా యా చిత్తవృత్తి రతి రిత్యభిధీయతే.

తత్ర స్త్రీపుంసయోరనోన్యాలంబనః ప్రేమాఖ్యశ్చిత్తవృత్తివిశేషః రతిః స్థాయీభావః. గురుదేవతాపుత్రాద్యాలంబనస్తు వ్యభిచారీ !"

రసగంగాధరం.

నవయౌవన రూపగుణ భాగ్యైశ్వర్యసుఖసంపన్నులగు స్త్రీపురుషుల కొండొరులమీఁద (అన్యోన్యము) గలుగు ప్రేమాఖ్యమను చిత్తవృత్తి రతియనఁబడు.

మనస్సున కనుకూలముగ నుండువిషయంబున మనస్సు ఆసక్తిం జెందుట రతి యనఁబడునని సాహిత్యదర్పణకారుని మతము.

సంభోగవిషయకేచ్ఛావిశేషము స్పృహా ఈహాదిపర్యాయపదములు గలిగి ప్రమోదాత్మకమగు మనోవృత్తి రతి యనఁబడునని భావప్రకాశకారునిమతము. ఈరతి అంకురితత్వాద్యవస్థలచే ప్రేమము, మానము, ప్రణయము, స్నేహము, రాగము, అనురాగము అనునామములచే నొప్పుచుఁ బ్రకాశించుచుండునని 151 పుట కామప్రకరణమందు విశదీకరింపఁ బడియె.

ఈరతిరూపమగు లౌకిక ప్రీతి తనకన్న తక్కువవారగు పుత్త్రీ పుత్త్రకాదులయందు స్నేహ వాత్సల్య భావములతో

నిమ్న గామినియై ప్రవహించుచుండు; తనతో సవర్ణసవయస్కు-లగు భార్య మిత్రులు లోనగువారియెడ ప్రేమభావముతో సమముగఁ బ్రవహించును; తనకన్న నుత్తములగు మాతృ పితృ గురుజనులయెడ శ్రద్ధాభావముతో నూర్ధ్వగామినియై ప్రవహించును. గంగవలె నీప్రీతియు త్రిపథగయై మానవులనుఁ బవిత్రముఁ జేయుచు, చతుర్విధ జీవాంతఃకరణములందు ప్రవహించుచుండును. అలౌకిక ప్రీతి భగవద్విషయకాను రాగమై భక్తి యనఁబడు. వినశ్వరంబులగు లౌకికవిషయములందు స్నేహప్రేమ శ్రద్ధారూపమగు ప్రీతి రాగాత్మికమై విషయములు నశించినంతట ద్వేషాత్మకమై దుఃఖముఁ గలిగించి భవబంధహేతు వగును. వినశ్వరము కాని అలౌకిక భగవద్విషయక ప్రీతి భక్తియై శాశ్వతానంద సుఖదాయకమై మోక్షమునుఁ గలిగించును.

రతిశబ్దపర్యాయవాచకనిర్వచనము.

సూ. "రసో రతిః ప్రీతిర్భావో రాగో వేగస్సమాప్తిరితి రతిపర్యాయాః."

వాత్స్యాయనకామసూత్ర. ౨-౧-౭౫.

రసము, రతి, ప్రీతి, భావము, రాగము, వేగము, సమాప్తి యని ఇయ్యేడును రతికిఁ బర్యాయపదములు.

1. రసః—(ఉపస్థేంద్రియేణ రసనాద్రసః.) ఉపస్థేంద్రియముద్వారా రసనము (సుఖానుభవనము) ఉండుటచేత రసమనఁబడు.

2. రతి:—[illegible]

3. ప్రీతి:—[illegible]

4. భావ:—[illegible]

5. రాగ:—[illegible]

6. వేగ:—[illegible]

7. సమాప్తి:—[illegible]

[illegible] "[illegible]" [illegible] 1. [illegible] ప్రీతి, 2. [illegible] ప్రీతి, 3. [illegible] ప్రీతి, 4. [illegible] ప్రీతియని. [illegible] ముసుబట్టి [illegible]

శ్లో. "ప్రేమాదిదృక్షా రమ్యేషు తచ్చింతా త్వభిలాషకః,
రాగ స్తత్సంగబుద్ధిస్స్యా త్స్నేహ స్తత్ప్రవణక్రియా.
తద్వియోగాఽసహం ప్రేమ రతి స్తత్సహవర్తనం,
శృంగార స్తన్మయక్రీడా సంభోగే సప్తధాక్రమః."

రసాకరే.

అభీష్టపదార్థమునుఁ జూడవలెననెడుకోరిక ప్రేమ యనియు, అట్టి రమణీయపదార్థము లభించవలెననెడి చింత అభిలాషమనియు, ఆరమ్యపదార్థమునందు సక్తి (రమించవలె ననెడిబుద్ధి) రాగమనియు, దానియందే లోలుపత్వముఁ గలుగుట స్నేహమనియు, దానియెడఁబాటు నోర్వఁజాలకుండుట ప్రేమయనియు, దాని నెడఁబాయకుండుట (సహవర్తనము) రతియనియు, తన్మయక్రీడావిహారము శృంగారమనియు, సంభోగము సప్తవిధములు గలది.

శ్లో. "హృదయసంగమ ఏవ సుసంగమో న తనుసంగమ ఏవ సుసంగమః."

హృదయసంగమమే (మానసికసక్తి) సుసంగమముకాని కేవల శారీరకసంగమము సుసంగమము కాదని చెప్పుటచేత శారీరకమునకన్న మానసికమే మిన్నయని స్పష్టమగుచున్నది. పూర్వమందుఁ జెప్పఁబడిన సంభోగవిషయకేచ్ఛావిశేషము స్పృహా ఈహాదిపర్యాయపదములుగల ప్రమోదాత్మకమయిన మనోవృత్తి రతియని పర్యవసితాభిప్రాయము.

హాసము - షడ్విధములు.

శ్లో. "జ్యేష్ఠానాం స్మితహసితే మధ్యానాం విహసితాఽవహసితే చ,
నీచానా మపహసితం తథాఽతిహసితం తదేషషడ్భేదః."

రసార్ణవము.

ఉత్తములకు స్మిత హసితములును, మధ్యులకు విహసిత అవహసితములును, నీచులకు అపహసిత అతిహసితములును అని హాసము ఆఱు భేదములు గలది.

శ్లో. "ఈషద్వికాసినయనం స్మితం స్యాత్స్పందితాధరం,
కించిల్లక్ష్యద్విజం తత్ర హసితం కథితం బుధైః.
మధురస్వరం విహసితం సాంసశిరఃకంప మవహసితం,
అపహసితం సాస్రాక్షం విక్షిప్తాంగం చ భవత్యతిహసితం."

సాహిత్యదర్పణం.

ఇంచుక నేత్రవికాసము అధరచలనంబును దశనము కలిన్పించని మధురహాసము స్మితమనఁబడు. వికసించిన వక్త్ర నేత్ర కపోలములచే నుపలక్షితమై యించుక దంతము లగపడుచున్నచో హసిత మనఁబడును. ముఖమునందు రక్తిమగలిగి ఆకుంచితాక్షిత్వమును, మధురస్వరమును గలది విహసిత మనఁబడును. అంస శిరఃకంపసమేతము వంకరచూపు ఉత్ఫుల్ల నాసికముగలది అవహసిత మనఁబడు. భుజములు శిరోజములు కదలుచు బాష్పములతోఁ గూడి కారణములేక వెకిలినగవు అపహసిత మనఁబడు. కనుగ్రుడ్లనిండు నీరు చెవులు నిక్కించి చీకారపరుషధ్వని ప్రక్కలు (గుంటలుపడి) ముడుచుకొని

పోయి ఒడలు విసరుట కలిగి వెకిలి పిచ్చినగవు అతిహాసిత మనఁబడు.

నరముల బలహీనతవలనఁ గలిగిన ఆధివ్యాధులను హాస్యప్రదర్శనములచేతను, చమత్కారంపు వచనములచేతను నవ్వించి అతిహసితములుఁ గావించి ఆధునికవైద్యశాస్త్రజ్ఞులు పోఁగొట్టుచున్నారు. మిత్రబంధువియోగపరదుఃఖాదులనుఁ జూచినంత కరుణ కలుగును. కరుణాతిరేకమువలన శోకము కలుగును. దుఃఖమునకు శోకమునకు భేదము లేదు. దుఃఖము విషాదమనునామముతో వ్యభిచారిభావములలో నొకటి. శోకము కరుణారసమునకు స్థాయీభావము. భవభూతిమహా కవి ఉత్తరరామచరితనాటకమందు కరుణారసమును మూర్తీ భవింపఁ జేయఁగ, కాళిదాసమహాకవి అభిజ్ఞానశాకుంతలము నందు శృంగారమునుఁ జక్కఁగ పోషించెను. రౌద్రరసమునకు స్థాయీభావమగు క్రోధమునుఁ గూర్చి, కామక్రోధప్రకరణ ములో విస్తరముగ వివరింపఁబడియె.

వీరరసమునకు స్థాయీభావము ఉత్సాహము. ఉత్సాహ సంపన్నునకు ఊహాపోహలు, బుద్ధిబలము, మేధాశక్తి, కార్య సిద్ధి, భాగ్యైశ్వర్యప్రాప్తి లోనగునవి కలుగును. శక్తిత్రయ ములో ఉత్సాహశక్తి పృథివీపతులకు ముఖ్యమైనది. మాన వుఁడు నిరుత్సాహుఁడైనచో నేమియుఁ జేయఁజాలక బెండు వలె నిస్సారుఁ డగును. బలసంపన్నుఁడయ్యు, దుఃఖములలో మునిఁగి యేమియుఁ దోఁచక నిరుత్సాహుఁ డయినతఱి

ప్రామాణికులగు ప్రాజ్ఞులచే నుద్బోధితుఁడై యుత్సాహవంతుఁడగును. పరోపకారనిరతులును తత్త్వజ్ఞులునగు సజ్జనులు, తాపత్రయబాధితులై నిరుత్సాహవంతులయిన దీనులను తమ వాక్యామృతములచేఁ బ్రోత్సహింతురు. ఎట్టివానికేని ప్రోత్సాహముచే బలము కలుగును. గొప్పకార్యములు చేయుచున్నపుడు ప్రోత్సహింపవలయుఁ గాని నిరుత్సాహ పఱచఁగూడదు.

దానవీర, ధర్మవీర, యుద్ధవీర, దయావీరులనెడు భేదముచే చతుర్విధవీరులు.—

1. **దానవీరుఁడు**—పరశురాముఁడు సప్తసముద్రపరివేష్టితమగు భూమండలమునంతయు, కశ్యపప్రజాపతికి నిర్వ్యాజముగ దాన మొసంగెను. దానంజేసి భూమికి కాశ్యపి యని పేరు.

2. **ధర్మవీరుఁడు**—యుధిష్ఠిరుఁడు రాజ్యము, ధనము, దేహము, భార్య, సోదరులు, సుతులు లోనగువారును, ఇంక లోకములో నాకధీనమున నేదికలదో, అదియును సర్వస్వమును సర్వదా నాధర్మమునకై వినియోగించుటకు సిద్ధమని చెప్పెను.

3. **యుద్ధవీరుఁడు**—శ్రీరామచంద్రుఁడు లంకేశ్వరునిఁ జూచి, ఇఁకనయిన జానకి నిమ్ము. నీకేమి యీ మతివిభ్రమము? నీతిని స్మరింపుము! అట్లు చేయవేని ఖరదూషణత్రిశిరసుల కంఠరక్తముచేఁ దడుపఁబడిన యీనాబాణము సంసిద్ధముగ నున్నది. ఓర్వదు సుమా!

4. **దయావీరుఁడు**—జీమూతవాహనుఁడు సర్పరాజునిమిత్తము గరుత్మంతునకు దేహమర్పించుచు, ఓ వైనతేయా! నరములనోళ్లనుండి రక్తము పాఱుచున్నే యున్నది. ఇంకను నాదేహమున మాంసమున్నది.

సీకును ఆకలితీఱినట్లు అగపడదు. ఏల భక్షించుటకు మాఱిలిచ్చి యడిగెను.

మహావీరచరితనాటకమందు వీరరసమును భవభూతి మహాకవి చక్కఁగాఁ బోషించెను. దీనానాథులను సాధుప్రజలను రక్షించుటకు పరమేశ్వరుఁడు వీరరసము నధిష్ఠించి వీరులను సృజించుచున్నవాఁడు. వీరులు లేనిచో పరస్పరోపహతి కలుగును.

రసశబ్దనిర్వచనము.

ఇట్లు విభావ, అనుభావ, సాత్త్విక వ్యభిచారిభావము లతోఁ (నభివ్యక్తమై) గూడి సముల్లసితమయిన స్థాయీభావము, చిరకాలము సహృదయసామాజికచిత్తములయందు (స్థాయిగ) నెలకొనిన సంస్కారవాసనారూపబీజముగ నుండి అంకురితపల్లవిత కుసుమిత ఫలితత్వావస్థలఁ బొంది, చిత్తములచే నాస్వాదింపఁబడుటవలన రసమని వ్యవహరింపఁబడుచున్నది.

ద్రాక్షామధూకఖర్జూరకాశ్మర్యరూపకముల సమాంశములుగఁ జేర్చి, పానకముఁ జేసి పచ్చకర్పూరమునుఁ గలిపినట్లయిన, పరిమళమును చల్లఁదనము గలిగి దాహతృష్ణానివర్తకమయినట్టుల, విభావాదులతోఁ గూడిన స్థాయియు, రసస్వరూపమై (మానసిక) ఆధ్యాత్మికతాపమునుఁ బోఁగొట్టును. ద్రాక్షామధూకాదిపదార్థములు భిన్నములుగ నున్నను, పానకములోఁ

గలిసి పానకమాధుర్యము నభివృద్ధిఁజేసినట్టుల విభావాదులు వేఱుగనున్నను, స్థాయిలోఁ గలిసి స్థాయికిఁ బుష్టిఁ గలిగించు చున్నవి. తంతువులు, వేమతుర్యాదిసాధనక్రియలతోఁ గూడి, పటరూపముగ (వస్త్రము) పరిణమించినట్టుల స్థాయీభావము లును విభావాదులతోఁ గూడి రసరూపముగఁ బరిణమించి, రసములని పేర్కొనఁబడుచున్నవి.

రసము, ఆనందస్వరూపము పరబ్రహ్మమని నిరూపణము.

"నానావిధ విమలకర్మనిర్మలాంతఃకరణేషు శమదమాదిసాధన సంపన్నేషు శ్రవణమనననిదిధ్యాసనపరేషు పరమయోగిషు నిర్వికల్పకసమాధ్యభివ్యక్త్యా బ్రహ్మేతి పరమాత్మేతీశ్వర ఇతి శబ్ద్యతే." రసమీమాంసా.

నానావిధనిర్మలకర్మల ననుష్ఠించుటచే పరిశుద్ధాంతఃకర ణులును, శమదమాదిసాధనసంపన్నులును, శ్రవణమనననిది ధ్యాసనపరులు నగు పరమయోగీంద్రులచిత్తమందు నిర్వికల్పక సమాధిచేఁ బ్రకాశించు నఖండానందరసము పరబ్రహ్మయని, పరమాత్మయని, పరమేశ్వరుఁడని చెప్పఁబడుచున్నాఁడు.

మూఁకుడు మొదలగువానిచేఁ గప్పఁబడిన దీపము, ఆచ్ఛాదనము తొలఁగించినంత సన్నిహితపదార్థములనుఁ బ్రకాశింపఁజేయుచు, తానును బ్రకాశించునటుల అఖండా నందమగు ఆత్మచైతన్యమును, ఆవరణము తొలఁగినంతట, విభావాదులతోఁ గూడిన రత్యాదిస్థాయీభావములనుఁ బ్రకా శింపఁజేయుచు, తానును బ్రకాశించును.

శ్లో. "యా స్థాయిభావరతిరేవ నిమిత్తభేదా
చ్ఛృంగారముఖ్యనవనాట్యరసీ భవంతి,
సామాజికాం త్సహృదయాన్నటనాయకాదీ
నానందయేత్సహజపూర్ణరసోఽస్మి సోఽహమ్."

స్వాత్మయోగప్రదీపే.

ఏ రత్యాదిస్థాయీభావము నిమిత్తభేదమువలన శృంగారాదినవరసముగ నాట్యమం దగుచున్నదో, అట్టి అఖండానందరసస్వరూపుం డగు నేను నాయకులను, నటులను, సహృదయులగు సామాజికుల నెల్లఱ నానందింపఁజేయుచున్నాడను. ఎల్లరహృదయములయందు ఆనందరసస్వరూపుఁడనై ప్రకాశించుచున్నాఁడనని తాత్పర్యము.

చిత్తవృత్తులే విభావానుభావసాత్త్వికవ్యభిచారిరూపములై, స్థాయీభావమునుఁ బోషించి, రసరూపమునుఁ జెందుచున్నవి. దృశ్యప్రబంధములగు నాట్యములందు నటులచే భావములు ప్రదర్శితములై, సామాజికులకు రసానుభూతినిఁ గలిగించుచున్నవి. శ్రావ్యప్రబంధములగు కావ్యములందు నటప్రదర్శనము లేమిచే, పాఠకులును, శ్రోతలును శబ్దార్థోపహితబలముచే రసానుభూతినిఁ జెందుచున్నారు.

పూర్వము మానవుల (నాయకుల) చిత్తములనుండి వెలువడిన భావములను నాట్యమందు నటులు అభినయముద్వారా ప్రదర్శించి, సామాజికుల ప్రేక్షకులహృదయమందు రసప్రాదుర్భావమునుఁ గావించుచున్నందున నాట్యరసములగుచున్నవి. రసాస్వాదనమంతయు నొక్కటియే భేదముండదు.

రసప్రయోజనము.

న్యాయ వేదాంతశాస్త్రములు మానవుల చిత్తముల నుండి సహజముగ వెలువడు వృత్తులను, భావములను, వాని ధర్మములను ప్రయోజనములును వివరించి వానిని సంస్కరించి యుత్తమపురుషార్థమున కుపయోగించునటుల బోధించును.

నాటకములందును, కావ్యములందును, మత-నీతి-భక్తి-ధర్మ-జ్ఞానబోధకవిషయము లుండినచో, శ్రోతలకును, ప్రేక్షకులకునుఁ బ్రయోజనము కలదు. అటుగాక అర్థార్జనము కొఱకు నీతిబాహ్య భక్తిజ్ఞానశూన్య అధర్మబోధకవిషయములఁ జేర్చి రచించినచో, వానిం జూచువారు క్రమముగ నీతిమాలినవారు, భక్తిజ్ఞానశూన్యులు, అధర్మపరులు నగుదురు. దైవీసంపదయగు శుద్ధవాసనలనుఁ జేర్చికొనక, ఆసురసంపద యగు మలినవాసనలఁ జేర్చికొని యనర్థపరంపరలఁ బొందెదరు. రసభావములకు అవినాభావసంబంధము. రసములేనిభావము, భావములేనిరసము, నుండదు.

సత్కావ్యము అశుభములనుఁ బోఁగొట్టి స్వర్గమును పరమానందరూపమగు మోక్షము నిచ్చునని మమ్మటాచార్యుఁడు చెప్పెను. సత్కావ్యరచనముఁ గావించు మహాకవి దేశమతసంఘభాషోద్ధారకుఁడగును. మహోపన్యాసకుఁడును, తన మధురగంభీరభావములచే మానవకోటికి మహోపకారముఁ గావించును. మత నైతిక ధార్మిక సాంఘికాధ్యాత్మిక రాజకీయ

విషయములను, జనసామాన్యమునకు బోధించుటకు దృశ్య ప్రదర్శనములే ప్రబలసాధనములుగ నున్నవి. ప్రబంధ కారులు మహోపన్యాసకులు, ప్రదర్శకులు, పత్త్రికాలేఖకులు, సంపాదకులు, కడుంగడు జాగరూకతమెయి జనసంఘ మునకు దేశమతభాషాసాంఘికవిషయాములయందభినివేశముఁ గలుగఁజేసి, ధర్మజ్ఞాననీతిపరులనుగాఁ జేయవలసియున్న బాధ్యత వారియెడఁ గలదు. కొన్నిపత్త్రికలుఁ జదువునపుడు వీరరసముచే ధర్మవీరులుగా యుద్ధవీరులుగా నుండఁ దలఁతురు. మఱికొన్నిపత్త్రికలలో భూకంపము మహోపప్లవములు గలిగి, జననష్టమగునపుడు కరుణారసముఁ గలిగి, వారికి సాహాయ్య మొనరింపఁ దలఁతురు. కొన్నిగ్రంథములుఁ జదువుటవలన జ్ఞానపిపాసువులై శాంతాశ్రమములందు మహాత్ములసన్నిధి నుండి శాంతిరూపపరమానందము బొందఁగోరుదురు. ఇట్టులే శృంగారప్రబంధములను, లలితకళలనుఁ జేదువుకొలఁది తద్రచ నాకుతూహలము కలుగును. ఇదియంతయు లేఖకుని ప్రతిభా శక్తినిఁబట్టి రసభావస్ఫూర్తులుఁ గలిగి పాఠకులను ప్రేక్షకు లను తదాయత్తచిత్తులఁ గావించును.

భావతత్త్వవిచారము - భావములు.

"వికారో మానసో భావః."

అమరః.

మనోవికారము భావమని చెప్పఁబడును. "భావయతీతి భావః" భావించుటవలన భావమని వ్యుత్పత్త్యర్థము. "భావ్యతే

ఒనేనేతి భావః” దీనిచే భావింపఁబడునని కర్మణ్యర్థమునందును వ్యుత్పత్తి కలదు. వికారము, క్షోభము, ఆవేశము, ఆవేగము, సంవేగము, ఉద్వేగము, ఇవి మనస్సునకుఁ గలుగుటవలన భావములని చెప్పఁబడును.

రసానుకూలవికారభావమని అన్యథా వికారభావమని భావము రెండువిధములు. ఆంతరవికారము శారీరవికారమని వికారము రెండువిధములు. ఆంతరము,స్థాయీభావ వ్యభిచారి భావములని రెండువిధములు. శారీరము, సాత్త్వికభావములు ఎనిమిది. రసానుకూలమనోవికారములగు భావములు, రసప్రక రణమందు విస్తరించి చెప్పఁబడెను. ప్రకృతము అన్యథారూప మనోవికారములగు భావములను గుఱించి న్యాయవేదాంత తత్త్వశాస్త్రములయం దెట్లు వివరించినది ప్రాకరణికాంశము లనుఁబట్టి తెలియనగును.

మనస్సు సంకల్ప వికల్పాత్మికమని యిదివఱలోఁ జెప్పఁ బడెను. మనస్సేదే నొకదానిని చింతించుచుండు. దానిని భావ మనియెదరు. దృఢముగ భావించినట్లయితే భావన యనఁ బడును. దీనినే సంస్కారమని, వాసన యని తత్త్వజ్ఞులు వచిం తురు. సుఖదుఃఖాదిచిత్తవృత్తులును భావము లనఁబడును. మనస్సు దేనిని భావించితే తద్భావాకృతిఁ జెందును. సాత్త్విక రాజస తామసగుణయుక్త చిత్తవృత్తుల ననుసరించియు భావము లేర్పడును.

పూర్వభావము, ఉత్తరభావము—ఇచ్చట భావము స్థిత్యర్థకము. భావము, అభావము—ఉండుట, లేకుండుట యని యర్థము. వానిభావ మేమి యనఁగా: వానియుద్దేశ్యమని యర్థము. వ్యాకరణశాస్త్రమందు భావార్థికతద్ధితప్రత్యయము విశేషార్థస్ఫురణముఁ గావించును. సుజనభావము–సౌజన్యము, సౌందర్యము, మాధుర్యము లోనగునవి.

శాస్త్రాంతరములందు భావశబ్దార్థము.

హోరా(జాతక) శాస్త్రమునందు, తను - ధన - భ్రాతృ-మాతృ-పుత్ర - శత్రు - కళత్ర - ఆయుర్ - భాగ్య - రాజ్య-లాభ-వ్యయములను, ద్వాదశభావములు గలవు. ఇయ్యవి ఫలితజ్యోతిషమునందు ముఖ్యములై మానవుల జీవయాత్ర యం దెంతయుఁ దోడ్పడుచున్నవి. భావములు తెలియని జాతకము వ్యర్థము. భావస్ఫుటముఁ జేసి, గ్రహము భావాది యందు, మధ్యమందు, అంతమందు, సంధియం దున్నవిషయము చేక్కఁగఁ బరిశీలించి ఫలముఁ జెప్పవలయును. భావపరిశీలనముఁ జేయక చెప్పిన ఫలములు తప్పిపోవుటచేత, శాస్త్రమున కప్రామాణ్యతఁ గలిగించినట్లగును గావున దైవజ్ఞుఁడు భావజ్ఞుఁడై యుండవలయును.

వైద్యశాస్త్రమునందును భావనచేయుపద్ధతి గలదు. హారీతకి భావనచేయఁబడి కొన్నివ్యాధులఁ బోఁగొట్టును. కాఁబట్టి ప్రతిశాస్త్రమునందును ముఖ్యతాత్పర్యమును బోధించు భావముండును.

"భూంధాత్వర్థమునుండి, సత్తార్థమునందు చిత్తవృత్తి నుండి కలుగునది భావమనియుఁ జెప్పఁదగును."

భా వ భే ద ము.

కొందఱు ముఖ్యాధికారులు భావభేదము పొందుటచే వ్యాపారసంస్థలుగాని, కార్యనిర్ణయసంఘములుగాని, సభలు గాని చెడిపోవును. ఇచ్చట భావమనఁగా, అభిప్రాయమని యర్థము.

అన్యోన్యమిత్రులకు ద్వేషభావముఁ గలిగించినట్టు లయితే భిన్నాభిప్రాయు లగుదురు. పూర్వమొకప్పుడు ఉన్న తాధికారు లిరువురు పరస్పరమిత్రులుగా నుండిరి. అందులో నొకనికి మాధ్యాహ్నికఫలాహార మీయఁ దలఁచి, మఱియొకఁడు మిక్కిలి మాధుర్యము గల పెద్దమామిడిపండ్లను రెండింటినిఁ దెప్పించి వంటఁజేయు సేవకునిపరముగా నిచ్చి, వీనిని చెక్కుఁదీసి ముక్కలుగాఁ జేసియుంచినచో రెండు ఘంటలకాలమున మన్మిత్రుఁడు వచ్చి ఫలాహార మారగించునని చెప్పెను. అతి స్వాదుతరములగు పండ్లకు చెక్కుఁ దీసి ముక్కలు చేసి, యీముక్క యెట్లుండునో రుచిజూతునని నోర వైచికొనెను. కలకండకన్న నతిమధురముగ నమృతమయముగ నుండెను. రసనేంద్రియాకృష్టుఁడై మఱియొకముక్క వైచికొనెను. ఈరెండుముక్కలతోఁ దృప్తిలేదు. వ్రతముఁ జెడినను సుఖముఁ దక్కవలెనని లోకోక్తినిబట్టి యీరెండు

ముక్కులనుఁ దినినందున యజమానివలన నెట్టులయినను మాట వచ్చును. వచ్చినది పూర్తిగా రానిమ్ము. కొలువుపోనిమ్ము. ఇట్టి ఫలము లీజన్మలో లభింపవు." అని పూర్తిగా భక్షించి, తప్పించుకొనునుపాయమున పదనులేని యొక కత్తిని దగ్గరనుంచుకొని నూరుచుండఁగ యజమానుఁడు చూచి మిత్రుఁడు వచ్చుసమయ మాసన్నమగుచున్నది, నేను కత్తి నూరెదను. మిత్రునిఁ బిలుచుకొని రమ్మని యాసేవకునిఁ బంపించెను. ఆతఁడు మిత్రమహాశయునియొద్దకుఁ బోయి పిలుచుకొనివచ్చుచు, "అయ్యా! మాయజమాని తమ్మునేల పిలువనంపించుచున్నా"రని యడుగ, "నోయీ! ఫలాహారార్థ"మని చెప్పెను. అంతట నతఁడు "అయ్యా! మన్నింపవలయు, తమ మేలుఁ గోరి చెప్పుచున్నాఁడను, మాయజమాని తమముక్కు చెవి కోయఁ దలఁచి రప్పించుచున్నాఁడు సంశయమున్నచో కిటికీనుండి చూడుఁ"డని విన్నవించెను. సేవకుఁడు చెప్పినవిధంబున కత్తి నూరుచుండుటం జూచి, యిందఱుసేవకు లుండఁగ నితఁ డేల కత్తి నూరవలయును. నాముక్కు చెవి కోయఁదలఁచి నూరుచున్నాఁడని పరుగెత్తసాగెను. అంతట సేవకుఁడు యజమానియొద్ద వచ్చి, "అయ్యా! మిత్రుఁడు గొప్పవాఁడని చెప్పితిరి. మధురతరంబులగు మామిడిపండ్లను రెండింటిని గ్రహించి పరుగిడుచున్నాఁ"డని చెప్పగ, వెంటనే యజమానుఁడు పరుగెత్తి, "మిత్రమా! ఒకటి ఒకటి" యని అఱవసాగెను. దాని వలన ముక్కు చెవిలో నేదే నొకదానిని మాత్రమే కోయుదు

ననినట్లుల భావించుకొనెను. యజమానియుద్దేశ్య మేమనఁగా: "రెండుపండ్లలో నొకదానిని మాత్రముఁ దీసికొని, యొకటి నిచ్చిపొమ్మని" కోయుననుభావముతో నతఁడును, పండునుఁ దీసికొనవలెననుభావముతో నీతఁడును, పరుగిడి పరుగిడి తుదకు వారి స్వస్థానములఁ జేరిరి. ఇచట సేవకుఁడు గావించిన యుక్త్యుపాయములతో భావభేదము లెట్లు కలిగినవో తత్త్వజ్ఞులుఁ దెలిసికొందురు గాఁత.

భాషావిషయికభావభేదము.

ఆంధ్రభాషయం దర్ధానుస్వారము కలిమిలేములచే నర్థభేదము కలుగును. "బోఁటి"యన వంటి మాదిరి యని యర్థము. "బోటి" యనఁ స్త్రీ యర్థము. అర్ధానుస్వారము పాటించు వైయాకరణమిత్రునికిని, పాటింపని యర్థమాత్రగ్రాహకమిత్రునికిని కడు చెలిమి కలదు. ఉభయులు ఘోషాపద్ధతిగల జనానా (అంతఃపురస్త్రీలు) కలవారు. "సువర్ణపదాలంకారశోభితకావ్యరసజ్ఞులగు మీబోఁటుల చెలిమిఁ గోరి వచ్చుచున్నాఁడ"నని వైయాకరణమిత్రునికి లేఖ వ్రాసి పంపెను. మీబోటు లనగ మీ తలిసంబోఁడసుల చెలిమిఁ గోరినట్లు అర్థమయ్యెను. ఘోషాస్త్రీలని తెలియక మిత్రరూపఘోరపాపాత్ముఁ డిట్లు వ్రాసెనని కోపోద్దీపితుఁ డయ్యెను. భావభేదములచే మనస్తాపములు కలిగెను. పిమ్మట "అయ్యా! నేను అర్థానుస్వారముల నెచట నుపయోగించువాఁడఁ గాను. అర్థమాత్రము గ్రహించువాఁడను మీ

బోటులనఁగా మీవంటిసరసులని నాయర్థము. నాభావము మీరు తెలిసికొనలేక కేవలశబ్దముపై నాధారపడి, పండు వంటిచెలిమిని పాడుసేయఁ దలఁచితిరి. ఇంతకాలము నాతోడ చెలిమి సలిపి నాభావముఁ దెలిసికొనఁ జాలరయితిరని చింతిలు చున్నాఁడ”నని మఱియొకలేఖ వ్రాసి పంపినంతట, వైయాకరణి తానుపడినభావమును మార్చుకొని క్షమింప వేఁడెను. కాఁబట్టి యిట్టిసందర్భములందును భావభేదము కలుగును. కొందఱు గొప్పకార్యములందు నిమగ్నమనస్కులై దీర్ఘాలోచనాపరులై యుండి యెవరు వచ్చినది పోయినది తెలిసికొనలేక యుందురు. అట్టిసమయములో మిత్రబంధువులు వచ్చి యీఘనజనుఁడు అభిమానధనాధికారగర్వముచే తమరి నాదరింపలేదనియు, తగిన సంభాషణమర్యాదలు సలుపలేదనియు, భావభేదమును బొంది ద్వేషముచే మనస్తాపములఁ జెందెదరు. పిమ్మట సందర్భసన్నివేశపరిస్థితులఁ దెలిసికొని, యవసరపడి భేదభావమునుఁ బొందితిమని చింతిలి సవరించుకొందురు.

“సహసా విదధీత న క్రియాం” అను నార్యోక్తినిబట్టి సజ్జను లవసరపడి యేభావమును నిశ్చయించుకొనరు. సందర్భసన్నివేశపరిస్థితులఁబట్టి భావజ్ఞులు భావములను నిశ్చయించుకొందురు.

వారివారి వాసనారుచి వైచిత్ర్యమునుబట్టి భావములు కలుగుచుండును.

“అస్తమేతి గభస్తిమాన్”

సూర్యుఁ డ స్తమించుచున్నాఁడని చెప్పినంతట, కర్మానుష్ఠాన పరులకు సాయంసంధ్యాసమయమయినదనియు, చోరులకు చోరత్వము సేయ రాత్రికాల మాసన్నమయినదనియు, జారులకు స్వైరిణులకు స్వేచ్ఛగ విహరింప సమయము తటస్థించినదనియు, నటీనటులకు నాటకప్రదర్శనసమయమయినదనియు, విద్యార్థులకు పాఠములను వల్లింప వేళయైనదనియు, వారివారి చిత్తవృత్తినిఁ బట్టి భావములు పొడముచుండును.

వాసనారుచివైచిత్ర్యమునుఁబట్టి భావములు.

గొప్ప గొప్ప విందులు జరుగునపుడు గోష్ఠినిమిత్తము పలువురు వత్తురు. వారిచిత్తవృత్తి (వాసన) అనుగుణ్యాముగ నుండుభావములు గలవారితోడనే చేరి గోష్ఠి సలుపుదురు. ఎట్టులనిన: వ్యాపారులు వ్యాపారులతోడను, వేకాటాడువారు వేకాటాడువారితోడను, ఖేలనవ్యాయామపరులు వ్యాయామాసక్తులతోడను, విద్వత్కవులు విద్వత్కవులతోడను, తత్త్వజ్ఞులు తత్త్వజ్ఞులతోడను, రాజకీయవిషయాసక్తులు రాజనీతివిదులతోడను, పానాసక్తులు పాయులతోడనుఁ గూడి గోష్ఠి సలుపుదురు. ఎవరి కేభావన లుండునో ఆభావనఁ గలవారిచే నాకర్షింపఁబడుదురు. కాఁబట్టి సజాతీయభావనలుగలవా రొకరిమీఁద నొకరికి మైత్రి యుండును.

శ్లో. పరివ్రాట్కాముకశునా మేకస్యాం ప్రమదాతనౌ,
కుణపః కామినీ భక్ష్యమితి త్రేధా వికల్పనా.

"భట్టాచార్యసూక్తి"

నవయౌవనవతియగు సుందరీదేహమునందు మేదోమజ్జాస్థిపురీషాత్మకమై హేయమగు శవకళేబరంబని వైరాగ్య భావము సన్న్యాసికిని, ఉపభోగ్యపదార్థంబని అనురాగభావము కాముకునికిని, స్తన్యమొసంగుటవలన ఆహార (భక్ష్య) పదార్థమని ప్రీతిభావము శిశువగు పుత్త్రునకునుఁ గలుగుచున్నవి. ఒకవస్తువునందు వారివారి చిత్తవృత్తికిఁ దగినట్లు భావములు పొడముచుండును.

భా వ న లు.

భావమును భావించుటవలన భావన యేర్పడును. దీనినే వాసన యని సంస్కారమని పర్యాయపదములచే వ్యవహరింతురు. మనము దృఢముగ భావించిన విషయములన్నియు, వాసనారూపముగ చిత్తమున నెలకొని యుండునని వాసనాప్రకరణమందు విస్తరించి చెప్పఁబడెను. వాసనానుగుణ్యముగ నెదుట కనుపించు వస్తువులందు భావము లేర్పడును.

శ్లో. గజత్రాతేతి వృద్ధాభిశ్శ్రీకాంత ఇతి యౌవతైః,
యథాస్థితశ్చ బాలాభిర్దృష్టశ్శౌరిస్సకౌతుకం.

"కువలయానందం"

శ్రీకృష్ణపరమాత్మ మధురాపురికి వచ్చినపుడు గజేంద్ర వరదుఁడు శరణాగతరక్షకుఁ డాపద్బాంధవుఁడని భక్తిభావముతో పెద్దలును, జగదేకసుందరుఁడు మన్మథమన్మథుఁడని అనురాగభావముతో యువతీబృందమును, పాత్రములు కద

లింపకుండ నెట్లు నవనీతము నపహరించెనని విస్మయభావము తో చోరబాలకులునుఁ జూచుచుండిరి. ఇట వారివారిచిత్త వృత్తులకుఁ దగినభావములు ఒకవస్తువునందే చూపిరి.

భావనానుగుణ్యఫలసిద్ధి.

శ్లో. మంత్రే తీర్థే ద్విజే దేవే దైవజ్ఞే భేషజే గురౌ,
యాదృశీం భావనాం కుర్యా త్సిద్ధిర్భవతి తాదృశీ.

మంత్రము, తీర్థము, విప్రుఁడు, దైవతము, జ్యోతిష్కుఁడు, వైద్యుఁడు, గురువు వీరియందు ఎట్టిభావన (విశ్వాసము) ఉండునో ఆభావనానుగుణ్యముగ ఫలితము గలుగును.

ఇది మహామంత్రము దీనిని జపించిన నభిమతార్థసిద్ధిఁ గలుగునని భావించినచో సిద్ధిఁ గలుగునుగాని, ఇందలియక్షరములు నాకుఁ దెలిసినవే యిందేమి కలదని నిస్సారముగఁ దలఁచినచో ఫలింపదు. అటులే ఇది పవిత్రతీర్థము దీనినిఁ బుచ్చుకొనిన సకలపాపములు నశించి పుణ్యముఁ గలుగునని భావించినచో పాపపరిహారము కలుగును గాని ఇదియును మాబావిలోని జలమువంటిదే కదా యని తలఁచినచో ఫలింపదు. విప్రుఁడు వేదవిదుఁడు,భగవత్స్వరూపుఁడు వీరియాశీర్వాదము ఫలించునని భావించినచో సిద్ధించునుఁగాని, ఈయనయు పంచాంగబ్రాహ్మణుఁడు నాకన్న నధికమేమని తలఁచినచో నాశీర్వచనము వ్యర్థమగును. మహాత్ములగు ఋషులు యంత్రప్రతిష్ఠాపనఁ జేసి తపశ్శక్తిని విగ్రహమందు నిలిపి అర్చామూ

_ర్తినిఁ బ్రతిష్ఠించిరని భక్తిచే భావించినచో ఆదైవతానుగ్ర హము కలుగును. లేక ఇదియు నొకపాషాణకాష్ఠప్రాయమని తలఁచినచో ననుగ్రహము కలుగదు. జ్యోతిష్కునియందు ఆయన చెప్పినది ఫలించునని ప్రామాణ్యబుద్ధి యున్నచో ఫలిం చును. కర్మానుభవమీయన తప్పించునా యని తలఁచినచో ఫలింపదు.అటులే వైద్యునియందును వీరపరధన్వంతరి యనియు వీరిచ్చునౌషధమువలన తప్పక వ్యాధి ప్రశమించుననియు దృఢ విశ్వాస ముండినచో, ఔషధము పనిచేయునుఁ గాని, లేనిచో ఇవియు నాకుఁదెలిసిన యంగడిదినుసులని తలఁచినచో వ్యర్థ మగును. గురువాక్యమునందు ఉపదేశమునందు శ్రద్ధాభక్తులు లేనిచో నవియు ఫలింపవు అంతయు వానిభావము ననుసరించి యున్నది.

శ్లో. భావే హి విద్యతే దేవో న పాషాణే న మృణ్మయే.

విశ్వాసముఁ గల తనభావమందు దేవుఁడు ప్రకాశించు చున్నాఁడుగాని పాషాణమందుఁగాని మృణ్మయవిగ్రహమందుఁ గాని లేఁడు. ప్రాణప్రతిష్ఠాపనము కళాఽవాహనము మూర్తుల యందుఁ జేయునభిప్రాయ మేమనఁగా: తనయాంతరదివ్య జ్యోతిని భావముద్వారా ఆమూర్తులయందు ప్రతిష్ఠించుట యని భావము.

శ్లో. దేవాన్ భావయతాఽనేన తే దేవా భావయంతు వః,
పరస్పరం భావయంతః శ్రేయః పరమవాప్స్యథ.

భగవద్గీత. అధ్యా. శ్లో.

దేవతలను మీరు భావించినట్లయిన (యజ్ఞాదులచేఁ బూజించిన) ఆదేవతలు మిమ్ముల ననుగ్రహింతురు. ఇట్లు పరస్పరశ్రేయోలాభములఁ బొందుఁడని భగవానుఁ డానతిచ్చెను.

"పరం భావమజానంతః" అనుచోట పరతత్త్వమని యర్థము. భావము సద్భావముగా నుండవలయును. భావమనఁగ కొన్నిచోట్ల శ్రద్ధావిశ్వాసములు, మఱికొన్నిచోట్ల అంతరభిప్రాయము, ఉద్దేశ్యము తాత్పర్యములుగ సందర్భసన్నివేశములఁబట్టి యర్థనిర్ణయముఁ గావించిరి.

శ్రీభాగవతమునం దంతట భావమనఁగ ప్రేమభక్తి యనియు, రాగమనియు, రతియనియు, భక్తిశాస్త్రసంప్రదాయమునుబట్టి నిర్ణయించిరి. "కేవలేనైవ భావేన" "భావయుక్తేన చేతసా" ఆత్యంతికమయిన భగవత్ప్రేమ భక్తియనఁబడు. దీనినే భావశబ్దముచే వాడిరి.

"రతిగ్న యావన్మయి వాసుదేవే"
"న ముచ్యతే దేహయోగేన తావత్"
"సత్సంగమో యర్హి తదైవ సద్గతౌ"
"పరావరేశే త్వయి జాయతే రతిః"
"త్వయి మేఽనన్యవిషయా రతి ర్మధుపతేఽసకృత్"
"రతి ముద్వహతా మద్ధా గంగేవౌఘముదన్వతి"
"మంగళాచరితైర్దానై రతిర్నః కృష్ణ ఈశ్వరే."

శ్రీభాగవతం.

ఇచట రతిశబ్దమంతయు భగవద్విషయికప్రేమభావమని యర్థము.

భావప్రపంచమునందు విహరించు మహాకవి దివ్యచక్షువుచే లోకాంతరములు, అచ్చటి దివ్యపురుషులు వారికృత్యములు విహారములు లోనగువానిని, దూరదేశములు, దూరస్థద్వీపములు, సాగరములు, గంధమాదన హిమాలయాదిపర్వతములు, పుణ్యారణ్యములు, తాపసాశ్రమములలో నుండు మహాపురుషులు, మునీంద్రులు, అచ్చటి ప్రకృతివైచిత్ర్యములను తనకావ్యమునందుఁ గూర్చి వర్ణించును. సహృదయులగు పాఠకులకు పొడఁగట్టిన ట్లుండును. ప్రతిభాశక్తిగల మహాకవి భావమునకుఁ దోఁచనిది యొకటియు నుండదు. కాళిదాసమహాకవి తాపసాశ్రమములు, అచ్చటికృత్యములు ప్రకృతివైచిత్ర్యములను శాకుంతలనాటకమునందు వర్ణించి యున్నాఁడు. జన్మాంతరసుకృతవిశేషముచే ప్రతిభాశక్తిగల భావక మహాకవి యగును. కవులలోనెల్ల భావకకవి శ్రేష్ఠుఁడని, ప్రతిభాశక్తిచే నంతయు భావింపఁగలఁడనియు కావ్యమీమాంసాశాస్త్రమునందుఁ గలదు.

సంభావన యనఁగ లెస్సగ భావించుట (చింతించుట) యని యర్థము. ఉత్ప్రేక్షాలంకారమునకు సంభావన మూలమగును. నేనీలాగు ఊహించుచున్నాను, తలంచుచున్నాననుట. ఉత్ప్రేక్ష-వాచ్యప్రతీయమానములచేతను, జాతిగుణద్రవ్యము

లచేతను, ఫలహేతుక్రియలచేత నీయలంకారము పెక్కు విధములని అలంకారశాస్త్రములందు వివరించి యున్నవారలు.

భావమందు స్థూలప్రపంచము కలిగినట్టుల, సూక్ష్మప్రపంచము స్వప్నములు లోకాంతరమునకుఁ బోయి యచ్చటి మహాపురుషుల సందర్శించి, వరములు అస్త్రములుఁ బడసినట్లును కనుపించుచున్నవి. భావకకవి అభూతకల్పనలు రసోచితముగఁ గావించి రంజింపఁ జేయును. దేనిని భావించితే భావకునకు (భావితవస్తు) దానియందలిగుణములు పట్టువడును. సరసమహాకవి కావ్యము ననవరతము భావించుచున్నట్టు లయినచో అట్టి రసమాధుర్యకవిత్వ మలవడును. శ్రీనాథమహాకవి శృంగార నైషధశైలిని భావించిన ఆంధ్రకవితాపితామహుని కట్టిశైలి యలవడెనని విమర్శకులు రెంటిలోని పద్యములుఁ దీసి చూపించిరి. ఇట్టుల కాళిదాసమహాకవిని ఇతర మహాకవులను మహోపన్యాసకుల భావగాంభీర్యవాఙ్నిచయమును పత్త్రికాసంపాదకుల సంపాదకీయవ్యాసములను, గాయకులగేయమును భావనఁ జేసి భావకులు తద్గుణములను బడయుదురు.

తద్భావ భావన.

శ్లో. "సుఖదుఃఖాదిభిర్భావై ర్భావస్తద్భావభావనమ్."

రసతరంగిణి.

శ్లో. "యస్తుష్టా తుష్టిమాప్నోతి శోకే శోకముపైతి చ,
క్రోధే క్రుద్ధో భయే భీరు స్స శ్రేష్ఠః ప్రేక్షకః స్మృతః."

రసచంద్రిక.

ఒరుఁడు అనుభవించుచున్న సుఖమును తా ననుభవించుచున్నట్లును, ఒరుఁడు అనుభవించుచున్న దుఃఖమును తా ననుభవించుచున్నట్లును ఎవఁడు భావించునో, ఆతఁడు భావకుఁడనఁబడును. ప్రదర్శనములందు సామాజికుఁడు రామాదిగత సుఖదుఃఖాదిభావములను తాదాత్మ్యముచే తా ననుభవించినట్టుల భావించినట్టులయితే తద్భావభావన మనఁబడు.

ఒరుఁడు సంతోష మనుభవించుచున్నపుడు తాను సంతోష మనుభవించుచున్నట్టులను, దుఃఖించుచున్నపుడు దుఃఖించుచున్నట్టులను, కోపించుచున్నపుడు క్రుద్ధుఁ డయినట్టులను, భీతిఁ జెందినపుడు భీరువయినట్టులను, తాదాత్మ్యభావముచే నెవఁడు భావించునో, అట్టిప్రేక్షకుఁడు శ్రేష్ఠుఁ డనఁబడు.

శ్లో. "సవాసనానాం సభ్యానాం రసస్యాస్వాదనం భవేత్,
నిర్వాసనాస్తు రంగాంతః కాష్ఠకుడ్యాశ్మసన్నిభాః."

సాహిత్యదర్పణం.

పూర్వవాసనాసుకృతవిశేషమువలన రసాస్వాదనభాగ్యము కలుగును. ఎల్లరు రసజ్ఞులు కాఁజాలరు. రామాదినాయకగత సుఖదుఃఖాదిభావములను తాదాత్మ్యమనఁగ, తమ్ముఁ దాము మఱచి, వారే తామనుకొని భావించి యనుభవించినట్టు లయితే వారికిఁ గలిగిన సాత్త్వికభావములు రోమాంచము, అశ్రువులు, వేపథువు, గద్గదికము, స్వేదము లోనగుచిహ్నములు తమకుఁ గలుగవలయు. అటులఁ గలుగ

నిచో రసాస్వాదనభాగ్యము లభింపలేదని భావింపవలయు. చిత్తము ద్రవింపక సాత్త్వికభావములు పొందని అరసికశిరోమణులకును రంగస్థలమందున్న స్తంభములు గోడలు రాళ్లకునుఁ గల భేద మేమి యని తలంపవలయు. సచేతనులు సవికారులు (భావకులు) అచేతనములు నిర్వికారములు. రసజ్ఞత మనోవికారముఁ దెలియఁజేయు.

శ్లో. "సుభాషితేన గీతేన యువతీనాం చ లీలయా,
మనో న భిద్యతే యస్య స యోగీ హ్యథవా పశుః."
సుభాషితరత్నభాండాగారం.

రసమాధుర్యమగు సుభాషితముచేతను, గీతము (పాట) చేతను, యువతీమణుల విలాసముచేతను, ఎవనిమనస్సు కలఁగదో వికారముఁ జెందదో అతఁడు నిస్పృహుఁడును లోకాతీతుఁడు నగు యోగి యైయుండవలెను. లేక తమోగుణభూయిష్ఠుఁ డయిన ద్విపాదపశువుగ నైన నుండవలెను. మధ్యస్థుఁడగు సామాన్యమానవుఁ డయినచో మనస్సు ద్రవించి రసాస్వాదనపరుఁ డగును.

శ్లో. "ఆత్మౌపమ్యేన సర్వత్ర సమం పశ్యతి యోఽర్జున,
సుఖం వా యది వా దుఃఖం స యోగీ పరమో మతః."
భగవద్గీత. 6 అధ్యా. 32 శ్లో.

తనకు సుఖముఁ గలిగిన నెంత సంతోషమో, యితరులకు నంత సంతోషమే కదా యని సుఖమునుఁ గలిగించు పనులు చేయవలెను. అట్లు సుఖించువారినిఁ జూచి సంతో

షించి వారితోడి మైత్రి సలుపవలయును. తనకు దుఃఖము గలిగిన నెంత కష్టమో, యితరులకు నంత కష్టమే కదా యని దుఃఖమును గలిగించుపనులు చేయఁగూడదు. అట్లు దుఃఖించు వారినిఁ జూచి కరుణఁ గలిగి వారి దుఃఖోపశమనమార్గముల నాలోచింపవలయును. ఆత్మ సర్వవ్యాపకము కావున తాదాత్మ్య భావనచే నితరు లనుభవించు సుఖము తా ననుభవించుచున్న ట్లును, ఇతరు లనుభవించుదుఃఖమును తా ననుభవించుచున్న ట్లును భావించినచో భావకుఁ డగును.

భావకుఁడు భావనచే భావితాకారవిషయముగఁ బరిణమించునని యీ క్రింది తత్త్వశాస్త్రప్రమాణముచేఁ దెలియఁబడుచున్నది.

శ్లో. "మాతుర్జ్ఞానాభినిష్పత్తి ర్నిష్పన్నం మేయమేతి తత్,
మేయాభిసంగతం తచ్చ మేయాభత్వం ప్రపద్యతే."

న్యాయవార్తికం.

ప్రమాత - ప్రమాణం - ప్రమేయం - ఇది త్రిపుటి. ప్రమాతయొక్క ప్రమాణము, ప్రమేయత్వమును బొంది నిష్పన్నమగుచు ప్రమేయాకారత్వమునుఁ జెందుచున్న అంతఃకరణావచ్ఛిన్నచైతన్యము చక్షురాదిద్వార ఘటపటాది విషయములమీఁదఁ బ్రవేశించి, విషయావచ్ఛిన్నచైతన్య మగుచున్నది. అంతఃకరణము ఘటపటాది విషయాకారముగఁ బరిణమించుచున్నదని భావము. వినశ్వరములగు బాహ్యవిషయములయం దాసక్తమయిన చిత్తవృత్తి, విషయములు నశించి

నంతట సంస్కారవాసనారూపముగ నెలకొని, సుఖదుఃఖవృత్తు లచే ననర్థదాయకమగు సంసారబంధనమునుఁ గలిగించును.

అవ్యయము ననంతము నఖండానందమయమగు భగవ ద్రూపమునందు చిత్తవృత్తిఁ జేర్చిన సద్వాసనారూపముగ నెల కొని భవబంధనకరములగు మలినవాసనలు నశింపఁజేసి అమృ తత్వమగు మోక్షము నొసంగును. చిత్తవృత్తి భగవదాకార తనుఁ జెందుటయే భావ మనఁబడును.

శ్లో. "విషయాన్ ధ్యాయతశ్చిత్తం విషయేషు విషజ్జతే,
మా మనుస్మరతశ్చిత్తం మయ్యేవ ప్రవిలీయతే.
తస్మాదసదభిధ్యానం యథా స్వప్నమనోరథం,
హిత్వా మయి సమాధత్స్వ మనో మద్భావభావితం."

శ్రీభాగవత. 11 స్కంధం.

శ్లో. "యం యం వాపి స్మరన్ భావం త్యజత్యంతే కళేబరం,
తం తమేవైతి కౌన్తేయ సదా తద్భావభావితః.
అంతకాలే చ మామేవ స్మరన్ ముక్త్వా కళేబరం,
యః ప్రయాతి స మద్భావం యాతి నాస్త్యత్ర సంశయః."

భగవద్గీత, 8 అధ్యాయం, 5-6 శ్లోకము.

శ్లో. "యదా పుమాంస్త్యక్తసమస్తబంధన
స్తద్భావభావానుకృతాశయాకృతిః,
నిర్దగ్ధకర్మానుశయో మహీయసా
భక్తిప్రయోగేణ సమేత్యధోక్షజం."

శ్రీభాగవతం.

అంత్యకాలమం దేయే భావమును స్మరించుచు ప్రాణమును విడుచునో, ఆభావమును భావించిన భావకుఁడు ఆ భావాకారమునుఁ జెందును. బాహ్యములగు గృహక్షేత్ర పుత్రకళత్రవిత్తాదులను స్మరించుచు ప్రాణమును విడిచిన తద్భావానుగుణ్యములగు నాకృతులఁ బొందును. భవబంధములఁ జెందును. కాఁబట్టి ఓభక్తుఁడా! స్వప్నమనోరథతుల్యమగు నసద్విషయకభావమును విడిచి పరమేశ్వరుఁడనగు నా భావమును మదాకారమును మత్స్వరూపమును భావించినట్లయితే (తద్భావభావితుఁ డనఁగ) భావకుఁడు సమస్త కర్మబంధములను నశింపఁజేసికొని (మద్భావము) మదాకారత్వము అఖండామృతానందస్వరూపమునుఁ బొందుచున్నాఁడని శ్రీ భగవానుఁ డానతిచ్చెను గనుక తద్భావభావితమనస్కుఁడై సతతము భగవంతుని ధ్యానించుచుండవలయును. విషయాంతరము లేక చిత్తము బ్రహ్మభావనచే బ్రహ్మాకారవృత్తి యగునని భావము.

పరభావజ్ఞత.

శ్లో. "బాహ్యై ర్విభావయేల్లింగై ర్భావమంతర్గతం నృణాం,
స్వరవర్ణేంగితాకారై శ్చక్షుషా చేష్టితేన చ. 25 శ్లోకం.

ఆకారై రింగితై ర్గత్యా చేష్టయా భాషితేన చ,
నేత్రవక్త్రవికారైశ్చ గృహ్యతేంతర్గతం మనః." 26 శ్లోకం.

మనుస్మృతి 8, అధ్యాయ 2.

బాహ్యములగు కంఠధ్వని ముఖవర్ణము క్రిందిప్రక్క చూచుట (అధోనిరీక్షణాదికము) అభిప్రాయములు, ఆకారములు, చూపులు, నడకలు, చేష్టలు, మాటలు, కంటిచూపులు, ముఖవికారము వీనిచేత నితరుల మనోభావములు తెలియఁబడుచున్నవి. న్యాయస్థానములందు సాక్షులు వాఙ్మూల మిచ్చునపుడు వారిమాటలు, చేష్టలు, ముఖవర్ణము, ఆకారము లోనగువానిచే నభిప్రాయములను నిపుణులగు న్యాయవాదులు రాఁబట్టుచుందురు. సత్యమునుఁ గప్పి యనృతము చెప్పఁ దలఁచినపుడు ముందు వెనుక మాటలసందర్భమున పొరఁబాటు కల్పనలు కన్పించుచున్నందున అనృతమని తోఁచకమానదు. గద్గదస్వరమువలనను దైన్యమువలనను తడఁబాటువలనను తోఁచక దిక్కులు మిత్రులనుఁ జూచుటవలనను అనృతము చెప్పఁజాలక మనస్సున సంకటపడుచున్నట్లుల తోఁచును. హర్షభావమున్నచో నేత్రవికాసము ముఖమునందు కాంతి, ధీరధ్వని, సిర్భీతి, సౌమ్యాకారత లోనగునవి కన్పించును. విషాదభావమున్నచో కన్నీరుఁ గార్చుట, వడఁకుట, నోరు ముఖము శుష్కించుట, దైన్యము గలచూపు, హీనస్వరము, గతిమాంద్యము లోనగునవి కన్పించును. మేధాశాలురగు తిమ్మరసు, చాణక్యుఁడు, యుగంధరుఁడు లోనగు మంత్రిసత్తములు ఆపాదమస్తకము పురుషునియాకారము, చేష్టలు, నడకలు, మాటలు గమనించినంతట నిట్టిభావముగలవాఁడు యోగ్యతఁ గలవాఁడని నిరూపింతురు. మనస్తత్త్వజ్ఞులగు బుద్ధిమంతులు

ఆకారేంగిత గతిచేష్టాభాషణాదులచే పరులభావములఁ గని పెట్టఁ గలుగుదురు. ఎవరి మనోభావములఁ గనిపెట్టఁ దలఁతురో, వారి సాత్త్వికరాజస తామస చిత్తవృత్తుల కనుగుణ్యముగఁ బ్రవర్తించి వారికి విశ్వాసము కలుగునట్టుల తోఁపింపఁజేసి మనోభావములఁ దెలిసికొనవలయును. కొందఱు ధీరులు గంభీరహృదయులు బాహ్యవికారములను చేష్టలఁ గనఁబఱచనందున వారి మనోభావములు తెలియఁబడవు. నిస్తరంగమగు సముద్రపులోఁతు తెలియఁబడనటుల వారిహృదయములో నుండు గాంభీర్యభావము తెలియఁబడదు.

ఇష్టానిష్టములు లాభనష్టములు సుఖదుఃఖములుఁ గలిగినను ముఖనేత్రభాషణగమనాదులయందు ఆకారమునందు నేమాత్రము మార్పు (వికారము) చూపింపమిచే వారిహృదయము (మనోభావము) ఇట్టిదని యేరికిని నెఱుకపడదు.

అయినను మేధావియగు భావజ్ఞుఁడు అట్టి భావగాంభీర్యము గలవారితో క్లిష్టచమత్కారవిషయముల సంభాషించుచు నుండఁగ వారెంత దాఁచినను మనోహరభాషణముల ద్వారా భావములు వెలికి దోఁపకమానవు.

పరభావముల గ్రహించునుపాయము.

శ్లో. "లుబ్ధమర్థేన గృహ్ణీయాత్ స్తబ్ధమంజలికర్మణా,
మూర్ఖం ఛందానురోధేన యాథాతథ్యేన పండితం."

నీతిశాస్త్రం.

ధనముచేత లుబ్ధుని, నమస్కారముచేత సాధువును, ఇచ్ఛానుసారముగ వర్తించి మూర్ఖుని, సత్యప్రవర్తనచే పండితుని లోఁబఱచుకొనవలయును. ఎవరి కేది ప్రియమో ఆ ప్రియవర్తనచే వారి నాశ్రయించి వారిభావమును గ్రహింపవలయునని పర్యవసితము.

శ్లో. "నామంత్రమక్షరం కించిన్న చ ద్రవ్యమనౌషధం,
నాఽయోగ్యః పురుషః కశ్చిత్ప్రయోక్తైవ తు దుర్లభః."
మార్కండేయపురాణం.

ఈప్రపంచమున మంత్రముకాని అక్షరము లేదు. ఔషధము కానివస్తువు లేదు. యోగ్యతలేని పురుషుఁడు లేఁడు. వానిం దెలిసి కూర్చుకొని యుపయోగించువాఁడు మాత్రము (దుర్లభము) కనుపింపఁడు. అక్షరములన్నియు శక్తిమంతములె. వానిశక్తినిఁ దెలిసికొని బీజాక్షరములుగఁ గూర్చినట్లయిన మహామంత్ర మగును. వస్తుమూలికలు ఓషధులగుణములఁ దెలిసి యోగముఁ గావింప దివ్యౌషధ మగును. సకల రోగములఁ బోఁగొట్టును. పురుషుల మానసికస్వభావగుణములఁ దెలిసి వారిగుణములకుఁ దగినట్లు కర్మలు గావించి యుపయోగించుకొనిన యోగ్యతాగుణసంపన్ను లగుదురు. వ్యర్థుఁ డొకఁడు నుండఁడు. అయితే వస్తుగుణధర్మరహస్యములఁ దెలిసికొని కూర్చి ఉపయోగించువాఁడు దుర్లభుఁడు. అనేకవేలలో నొకఁ డుండిన నుండునేమో చెప్ప వలనుపడదు.

కాఁబట్టి భగవత్సృష్టిలో వ్యర్థమయినపదార్థ మొకటియును లేదని స్పష్టము.

భావకల్పన. (Imagination).

1. అనుభూతవిషయముల స్మరణకుఁ దెచ్చుకొని తల పోసికొనుచు భావముల కల్పించుకొనుట యొకటి. అననుభూత అపూర్వవిషయముల కల్పించుకొని భావించుట మఱి యొకటి. అందు మొదటిదానిలో కొంతవఱకు ననుభవము కలదు. ఎట్టులన తాను ఉత్తమోత్తమ న్యాయస్థానమందు వ్యవహరించుచున్న అభియోగము జయము పొందినట్లయితే కొన్ని వేలధనము వచ్చును. ఆధనముతో భూములఁ గొని ధాన్యము పండించి, పుట్లుపుట్లుగా కొట్లకుఁ బోసి నిలువఁజేసి యుద్ధముక్షామము వచ్చినపుడు రూపాయకు రెండుమాని కెలు ఖంతున అమ్మినట్లయితే లక్షలధనము వచ్చును, ఈధనముతో మహాపట్టణమునందు దివ్యప్రాసాదసౌధహర్మ్యములు సినిమా ప్రదర్శనాలయములు కట్టించినట్లయితే అపారముగ బాడుగ ధనమువచ్చును. దీనివలన కోటీశ్వరుఁడనై నగర పురపాలకాధ్యక్షుఁడనై నన్నాశ్రయించినబంధువులకు మిత్రులకు గొప్ప ఉద్యోగముల నిప్పింతును. అనాథరక్షణాలయములు, విద్యా వైద్యశాలలు, ధర్మసత్త్రములు, పఠనాలయములు లోనగు వానికిధనము వెచ్చించినట్లయిన దిగంతవిశ్రాంతకీర్తి కలుగును. దొరతనమువారు గొప్పబిరుదముల నొసంగి సత్కరింతురు.

ఇంతకన్న నఖండయోగము మఱియేమి కలదని ఉవ్విళ్లూరుచు భావన లపారముగఁ గల్పించుకొని తనలో తాను మురిసి కొనుట. ఇది తత్త్వశాస్త్రప్రకారము ఆసురసంపద మలినభావ ములోఁ జేరి భవబంధముకు హేతువగునని అంతరాత్మ (Super consciousness)బోధించినట్లయిన, ఈభావనలన్నియు నడఁగిపోవును. అంతరాత్మ వీక్షణముకు ముందు మనస్సు స్వేచ్ఛగా విహరించి సాధ్యమా? అసాధ్యమా? యుక్తమా? అయుక్తమా యను విచక్షణత్వము లేక ఆకాశమునందు విహంగము స్వేచ్ఛగా విహరించినట్లు కల్పితభావప్రపంచము నందు మనస్సు అడ్డులేక విహరించును.

మనస్సు మాయాకల్పిత భావప్రపంచమునందు భోక్త యగు జీవుని భ్రమింపఁజేయుచున్నందున భ్రాంతుఁడై మనస్సు ఏవలనికి లాగుచుండిన నాప్రక్కకుఁ బోవుచుండును. పోయి పోయి ఉద్బుద్ధుఁడై తాను కల్పించుకొనినదంతయు స్వప్న మనోరథతుల్యంబనియు, వినశ్వరంబును దుఃఖదాయకంబనియుఁ దలఁచును. ఉద్బోధ కలుగుపర్యంతము కల్పితభావప్రపంచము నందు భ్రమించుచుండును.

2. అననుభూత అపూర్వవిషయికభావకల్పన యెట్టి దనఁగా: తాను దివ్యఘుటికారసప్రభావముచే హిమాలయ శిఖరము మీఁదికిఁ బోయినట్లు, అచట దివ్యోద్యానములందు విహరించుచు, పరిమళపుష్పసుగంధముల నాఘ్రాణించినట్లు,

గాంధర్వకిన్నరమిథునంబుల దివ్యగానంబుల నాలించుచు, సృష్టి వైచిత్ర్యములఁ జూచుచు, సౌరభమాంద్యశీతలానిలస్పర్శచే పరవశమగుచు, దివ్యఫలంబుల రసామృతంబుఁ గ్రోలుచు నున్న తఱి, దేవతలు కొందఱు విమానములతో వచ్చి తన భక్తి నమ్రతలఁ జూచి తనను విమానముమీఁద నెక్కించుకొని స్వర్గలోకమునకుఁ గొంపోయి ఇంద్రసభనుఁ జూపింప నచట దివ్యాంగనానాట్యగానములఁ జూచి మహర్షుల పరిచయ మునుఁ బొంది, కామరూపసిద్ధినిఁ బడసినట్లు తాను కొంత కాలము గంధర్వుఁడై గంధర్వలోకమున నున్నట్లు, పాతాళ లోకమునకుఁ బోయినట్లు, యమపురికిఁ బోయి పితరులఁ జూచి మాట్లాడినట్లు, పిమ్మట మానవత్వము నొంది భూలోకమునకు వచ్చినట్లు, స్వప్నమనోరథతుల్యంబులగు అపూర్వభావముల కల్పించుకొని పరమానందముఁ జెందుట మఱియొకటి. ఇదియు నంతరాత్మచేఁ జూడఁబడి అభూతకల్పనము గగనకుసుమాయ మానము శశవిషాణప్రాయమని యుద్బుద్ధుఁడై భోక్తయగు జీవుఁడు కల్పితభావప్రపంచమును విడిచి ప్రత్యక్షప్రపంచము నకు వచ్చును. ఇచ్చటను జీవుఁడు భ్రాంతుఁడై మాయిక మనః కల్పితభావప్రపంచమునందు పరిభ్రమించినవాఁడే. ఈభావనలు భావించుపర్యంతము ఆనందాబ్ధి నోలలాడించుచుండును. ఇయ్యవి హర్షదాయకభావనలు.

3. విషాదదాయకకల్పితభావన లెట్టివన: తాను వ్యవ హరించుచున్న అభియోగము అపజయము నొందినట్లయితే

ప్రతిపక్షులు భూములును ఆస్తినంతయు వేలము వేసికొని పోవుదురనియు, భిక్షాటనముఁ జేసికొనవలసి వచ్చుననియు, బ్రతుకు దెరువుమార్గ మెయ్యదియనియు, మిత్రబంధువర్గ మధ్యమున అవమానము సంభవించుననియు, నింతకుటుంబ మున కెట్లు జీవనాధారమనియు, నింక ననేకభావనలు కల్పించుకొని సాలీడు తా నల్లినవలయందుఁ దాను చిక్కుకొని నట్లును, దావాగ్నిమధ్యమందు చిక్కుకొనిన మృగబృందము నట్లును, కుడిచి కూర్చుండి దుఃఖసాగరమున మునిఁగి లేవలే కుండును; ఇటుల ఉద్యోగము పోవుననియు, కారాగారప్రాప్తి యనియు ననేక దౌర్భాగ్యభావనలు కల్పించుకొని కుమిలిపోవు చుండును. భోక్తయగు జీవుఁడు మాయాకల్పిత దుఃఖభావనా ప్రపంచమందు మునిఁగి దిక్కు తోఁచకుండఁగ నంతరాత్మ సం స్కారధైర్యబుద్ధిచే నుద్బోధముఁ గావించి నంతట ధీరుఁడై తాను భావించినదంతయు కల్పితమనియు, వాస్తవముగ నట్లు కలుగదనియు, కలుగనిదానిని కలిగినట్లు భావించుకొని దుర్భర దుఃఖవేదనఁ బొందినట్లు తెలిసికొని, మనస్సును స్వేచ్ఛగా విడి పింపఁగూడదనియు, మాయికమగు నీమనస్సు కల్పితభావన లచే నెట్టివానినేని నిరయగర్తములోఁ గూల్చుననియు, నీమన స్సును శిక్షించి సన్మార్గములోఁ బోవునట్లు సంస్కరించుకొనవలె ననియు నిశ్చయించుకొనును.

4. ఎంతతపం బొనరించినను వ్రతానుష్ఠానములు సలిపి నను, కౌటిల్యవంచనములు లేని సద్భావ ముండవలెను. భావ

శుద్ధి లేనిదంతయు వ్యర్థమగును. శీలముచే భావనను జెక్కఁ బఱచుకొనవలయును.

తర్కశాస్త్రమువలన జ్ఞానంబును, రసశాస్త్రమువలన భావములును, నీతిశాస్త్రమువలన ఇచ్ఛలును సంస్కరింపఁబడి నియమితములై చక్కగ ప్రకాశించును.

Cognition — Logic.
Emotion — Esthetics.
Volition — Ethics.

ఇది, ఆపస్తంబసూత్ర, వాసిష్ఠసగోత్రపవిత్ర, ముక్తినూతులపాటి
వంశపయఃపారావారరాకాసుధాకర, సీతారామామాత్య
విద్వత్కవీంద్రపుత్ర, జ్యోతిర్విద్వర, విద్యాశేఖర
బిరుదాంచిత, గోపాలకృష్ణశాస్త్రి ప్రణీతంబగు
మనస్తత్త్వశాస్త్రమునందు రసతత్త్వభావ
స్వరూపవిచారంబను చతుర్థప్రక
రణము సమాప్తము.

మనస్తత్త్వశాస్త్రము

పంచమ ప్రకరణము.



గుణములు - వృత్తులు. Three qualities of Nature.

గుణతత్త్వవిచారము.


రసభావతత్త్వవిచారానంతరము దానికిఁ గారణమగు త్రిగుణాత్మకయగు ప్రకృతియు, తద్గుణములు, చిత్తవృత్తులు, శమాదిషట్కసంపత్తియు నీప్రకరణమందు విశదీకరింపఁబడును.

సూ. "సత్త్వరజస్తమసాం సామ్యావస్థా ప్రకృతిః, ప్రకృతేర్మహాన్మహతో ఽహంకారో ఽహంకారాత్పంచతన్మాత్రాణి ఉభయమింద్రియం, తన్మాత్రేభ్య స్థూలభూతాని, పురుష ఇతి పంచవింశతిర్గణః."

సాంఖ్యసూత్ర. ౧ అధ్యా. ౬౧ సూత్ర.

సత్త్వరజస్తమోగుణములయొక్క సామ్యావస్థ ప్రకృతి యనఁబడు. దీనినే సాంఖ్యులు మూలప్రకృతి యని, ప్రధానమని, అవ్యక్తమని చెప్పెదరు. ప్రకృతివలన మహత్తత్త్వము, మహత్తువలన అహంకారము, అహంకారమువలన

శబ్ద-స్పర్శ-రూప-రస-గంధము లనెడు పంచతన్మాత్రలును, అంతరింద్రియ మగు మనస్సును, బాహ్యేంద్రియములగు శ్రోత్ర-త్వ-క్చక్షు-జిహ్వా-ఘ్రాణములనెడు జ్ఞానేంద్రియపంచకంబును, వా-క్పాణి-పాద-పా-యూపస్థ లనెడు కర్మేంద్రియపంచకంబును, తన్మాత్రలవలన ఆకాశ-వాయు-తేజ-స్సలిల-పృథువులనెడు స్థూల మహాభూతములును పుట్టెను. ఇవి యిరువదినాలుగుతత్త్వములు. పురుషునితోఁగూడ నిరువదియైదు తత్త్వములు (గుణములు) అయ్యెను. ఇరువదియైదవతత్త్వము జీవుఁడు (ఆత్మ) ఇరువదియాఱవతత్త్వము నిర్గుణ సచ్చిదానందస్వరూపుఁడగు పరమాత్మ (పురుషోత్తముఁడు). అవ్యక్తమగు నీ పరమాత్మవలననే వ్యక్తమగు మహదాదిసృష్టియంతయుఁ గలిగెనని వేదాంతులు చెప్పెదరు. అసంగుఁడు నిర్గుణుఁడగు పరమాత్మ సాన్నిధ్యబలంబున త్రిగుణాత్మికయగు ప్రకృతివలన చరాచరప్రపంచముత్పన్నమయ్యెనని సాంఖ్యులు వేదాంతు లొప్పుకొనుచున్నారు. పురుషుఁడు (చైతన్యము Spirit) ప్రకృతి (జడము Matter) ఈ రెండింటి కలయికవలననే సృష్టికలిగినదని తత్త్వజ్ఞు లొప్పుకొనియున్నారు.


26 పరమాత్మ (పురుషోత్తముఁడు)
నిర్గుణుఁడు
సచ్చిదానందస్వరూపుఁడు
25 పురుషుడు
24 ప్రకృతి (త్రిగుణాత్మకము)
23 మహత్ (బుద్ధి)
22 అహంకారము.
(పంచతన్మాత్రలు.)
6 శబ్దము
7 స్పర్శము
8 రూపము
9 రసము
10 గంధము
1 ఆకాశము
2 వాయువు
3 తేజము
4 జలము
5 పృథివి
(పంచభూతములు.)
11 ఉపస్థ
12 పాయువు
13 పాదము
14 పాణి
15 వాక్కు
5 కర్మేంద్రియములు
16 ఘ్రాణము
17 జిహ్వ
18 చక్షువు
19 త్వక్కు
20 శ్రోత్రము
5 జ్ఞానేంద్రియములు
బాహ్యేంద్రియములు.
21 మనస్సు
అంతరింద్రియము

శ్లో. "మూలప్రకృతి రవికృతిః మహదాద్యాః ప్రకృతి వికృతయస్సప్త,
షోడశకస్తు వికారో న ప్రకృతిర్న వికృతిః పురుషః."

సాంఖ్యకారిక.

ప్రకృతి యనఁగా ఒకదానిపుట్టుకకు (వికారమునకు) మూలము. వికృతి యనఁగఁ బ్రకృతివలనఁ బుట్టినది. సాంఖ్యులు ఈ యిరువదియైదు తత్త్వములకును, మూలప్రకృతి ప్రకృతి వికృతి, వికృతి న-ప్రకృతి, న-వికృతి యని నాలుగువిధములుగ వర్గీకరణముఁ గావించిరి. (1) ప్రకృతితత్త్వము మఱియొక దానియందుండి పుట్టినది కాకపోవుటచే దానిని మూలప్రకృతి యని చెప్పుదురు. (2) మూలప్రకృతిని వదలి రెండవమెట్టగు మహత్తత్త్వము (బుద్ధి) మూలప్రకృతివలనఁ బుట్టినది గనుక వికృతియు, అహంకారతత్త్వమునకు మూలమగుటవలనఁ బ్రకృతియు నని చెప్పఁబడును. ఇట్లు మహత్తు అహంకారము పంచతన్మాత్రలు ప్రకృతి వికృతి వర్గములోఁ జేరును. (3) అంతరింద్రియమగు మనస్సును, బాహ్యేంద్రియములగు జ్ఞానేంద్రియ కర్మేంద్రియములును, అహంకారమువలనఁ బుట్టినందువలనను పంచతన్మాత్రలవలన పంచమహాభూతములు పుట్టినందువలనను, ఏకాదశేంద్రియములు పంచమహాభూతములు వికారములని చెప్పఁబడును. (4) పురుషుఁడు ప్రకృతి కాఁడు, వికృతియును కాఁడు. స్వతంత్రుఁడు ఉదాసీనుఁడు ద్రష్టయునై యున్న వాఁడు.

1. శుద్ధసత్త్వంబును శాంతంబును స్వచ్ఛంబునయిన మహత్తత్త్వ రూపకంబగు చిత్తము భగవంతునిస్థానము.	వాసుదేవ వ్యూహము. క్షేత్రజ్ఞుఁడు, అధిష్ఠాత.
2. మహత్తత్త్వవికారము (పుట్టి) క్రియాశక్తిరూపము వైకారిక తైజస తామస రూపములుగ నుండు అహంకారతత్త్వము; మనస్సు ఇంద్రియములు మహాభూతములు తన్మాత్రలకుఁ బుట్టినిల్లు (ప్రకృతి) మహత్తుకు వికృతి.	సంకర్షణ వ్యూహము రుద్రుఁడు, అధిష్ఠాత.
3. ఇంద్రియముల కధిపతి సంకల్ప వికల్పాత్మకమగు మనస్తత్త్వము వైకారికాహంకారమువలనఁ బుట్టినది.	అనిరుద్ధవ్యూహము చంద్రుఁడు, అధిష్ఠాత.
4. ఇంద్రియజ్ఞానమునుఁ బ్రకాశింపఁ జేయుచు, సంశయవిపర్యయ నిశ్చయస్మృతివృత్తులు గలిగి తైజసాహంకారమువలనఁ బుట్టినది బుద్ధితత్త్వము.	ప్రద్యుమ్న వ్యూహము బ్రహ్మ, అధిష్ఠాత.

త్రిగుణాత్మకమగు నామాయచే ముల్లోకములు మోహితము లయినవి. దానంజేసి గుణాతీతుండును, పరుండు నగు నన్నుఁ దెలిసికొనఁ జాలరు. ఎవరు నన్ను ప్రపత్తిఁ జేయుచున్నారో ఆప్రపన్నులు నామాయను దాటుచున్నారని భగవానుఁ డానతిచ్చుటవలన త్రిగుణాత్మకమగు ప్రకృతి పరబ్రహ్మశక్తి యని తెలియఁ దగును. ఇరువదియైదవతత్త్వము పరమపురుషప్రభావమని కాలమని అవ్యక్తమని సదసద్విలక్షణమని పలువిధంబుల వర్ణించుచున్నారు. లోపల నియంతృత్వ పురుషరూపము చేతను, వెలుపల కాలరూపముచేతను సృజించుచున్నాఁడని శ్రీభాగవతమునఁ జెప్పఁబడినది. వాస్తవములో పురుషుఁడు; అసంగుఁడు నిర్గుణుఁడు ద్రష్ట ఉదాసీనుఁడు ప్రకృతి; జడస్వరూపము కేవల అసంగునివలన సృష్టికలుగదు. జడాత్మకమగు ప్రకృతివలనను సృష్టి కలుగదు. ఉభయుల సమ్మేళనవలనఁ గలుగును. ఎట్టులన? కుంటివాఁడును, గ్రుడ్డివాఁడును, ఉభయులు నొకచోటనుండి మఱియొకచోటికిఁ బోవఁ దలఁచిరి. కాళ్లులేమిచే కుంటివాఁడును, కండ్లు లేమిచే గ్రుడ్డివాఁడును గమ్యస్థానమునకు పోవఁజాలకుండిరి. బుద్ధిమంతుఁ డొకఁడు వచ్చి, గ్రుడ్డివాఁడు కాళ్లు చక్కగనుండి పరుగెత్తఁగలఁడు గనుక వాని బుజములమీద చక్కనిదృష్టిగల కుంటివాఁ డెక్కి మార్గముఁ జూపుటచే గమ్యస్థానమునకు వెళ్లఁ గలుగుదురని ఉపాయము చెప్పెను. అట్టులే గమ్యస్థానము చేరిరి. అట్టుల ద్రష్టయగు పురుషుఁడు జడమగు త్రిగు

ణాత్మిక ప్రకృతి నధిష్ఠించుటవలన సృష్టికలిగెనని సాంఖ్యశాస్త్ర మునందు దృష్టాంతముగఁ జెప్పఁబడెను.

ప్రకృతిస్వరూపము.

1. పరమేశ్వరుని ప్రకృతులు పరాప్రకృతి (జీవప్రకృతి) అపరాప్రకృతి (జడప్రకృతి) యని రెండువిధములు. అపరా ప్రకృతి యనఁగ కనిష్ఠము జడము, భూమి, జలము, వాయువు, తేజము, ఆకాశము, మనస్సు, బుద్ధి, అహంకారము ననెడు నీయెనిమిది జడప్రకృతి. ఇందు దశేంద్రియములు పంచతన్మాత్రలు గలవని యూహింపవలెను. చిత్ప్రకృతి (జీవప్రకృతి) పరాశ్రేష్ఠమయినది. చిత్ప్రకృతియు జడప్రకృతియు నీరెండును పరమేశ్వరుని విభూతులే. ఈ రెండింటిచేతనే చరాచర ప్రపంచసృష్టి కలుగుచున్నది.

2. మూలప్రకృతికిఁ దర్వాత మహత్తత్త్వము (బుద్ధి) గొప్పది. దీనికే జ్ఞానము, మతి, ఆసురి, ప్రజ్ఞ, ఖ్యాతి యని నామాంతరములు గలవు. ఇయ్యది ప్రకృతివలనఁ బుట్టినందున ప్రాకృతికగుణములు సత్త్వరజస్తమస్సులు దీనికిఁ గలవు. మహత్తత్త్వమువలన (బుద్ధి) అహంకారతత్త్వ ముత్పన్న మయ్యెను. దీనినే తైజసమని, అభిమానమని, భూతాదియని, ధాతువని యుఁ జెప్పిరి. బుద్ధి యుత్పన్నమైనఁగాని యహంకార ముత్పన్నము కానేరదు. మహత్తత్త్వమువలెనే దీనికిని సత్త్వరజస్తమోగుణములు కలవు.

3. వేదాంతములో కర్మయని చెప్పఁబడుదానినే సాంఖ్య శాస్త్రములో సత్త్వరజస్తమస్సులను మూఁడుగుణముల హెచ్చుతగ్గులచేఁ గలుగు బుద్ధియొక్క వ్యాపారమనియైనను, ధర్మమనియైనను, వికారమనియైన నందురు. బుద్ధియొక్క యీ ధర్మములకు "భావము" లని పేరు కలదు. సత్త్వరజస్తమో గుణముల తారతమ్యముచే నీభావము లనేకవిధములుగ నుండును.

4. మహత్తు, అహంకారము, మనస్సు, జ్ఞానేంద్రియపంచకము, కర్మేంద్రియపంచకము, పంచతన్మాత్రలు ఈ పదునెనిమిది తత్త్వములుగలది లింగ (సూక్ష్మ) శరీర మనఁబడును. ఈ లింగశరీరము నధిష్ఠించి, సత్త్వరజస్తమోగుణముల తారతమ్యముచే జీవుఁ డనేకజన్మములఁ బొందుచుండు. చిత్తము గుణబద్ధమయినందున జీవుఁడు సంసారచక్రమందు పరిభ్రమించుచుండు. సత్త్వరజస్తమోగుణములకు శాంతఘోరమూఢవృత్తులు పర్యాయవాచకములని పాతంజలయోగశాస్త్రమునందును సాంఖ్యశాస్త్రమునందును గలదు. నిఖిలచరాచరసృష్టికి సత్త్వరజస్తమోగుణముల హెచ్చుతగ్గులే (తారతమ్యము) ముఖ్య కారణములని సృష్టిశాస్త్రజ్ఞులు నిశ్చయించుచున్నారు. ఈ త్రిగుణములయం దేదిలేకను ఎట్టిభావము నుదయింపదు. అంతటికి గుణత్రయమే కారణమని భగవద్గీతలయందును జెప్పఁబడెను.

సాత్త్వికగుణములు. Illumination-Harmony.

గుణములలోని కెల్ల ప్రధానమయినది సత్త్వగుణము. దీనివలన జ్ఞానానందసుఖములు గలుగును. ఒక చిమ్నీదీపము నిర్మలమగుచుండు గాజు (Glass) సున్నముచేఁ దుడిచినయెడల స్వచ్ఛమై దీపములోపల వెలుపలఁ బ్రకాశించునట్టుల అంత ర్జ్ఞానము సత్త్వగుణమువలన విమలప్రకాశము గలది యగును. శుద్ధసత్త్వము స్వస్వరూపస్థితిఁ గలది యగును.

శ్లో. "సత్త్వమానంద ఉద్రేకః ప్రీతిః ప్రాకామ్యమేవ చ,
సుఖం శుద్ధత్వ మారోగ్యం సంతోషః శ్రద్దధానతా.
అకార్పణ్య మసంరంభః క్షమా ధృతి రహింసతా,
సమతా సత్యమానృణ్యం ఆర్జవం హ్రీ రచాపలం.
శౌచం మార్దవ మాచార మలౌల్యం హృద్యసంభ్రమః,
ఇష్టానిష్టవియోగానాం కృతానా మవికత్థనం.
దానేన చాత్మగ్రహణం అస్పృహత్వం పరార్థతా,
సర్వభూతదయా చైవ సత్త్వస్యైతే గుణాస్స్మృతాః."

మహాభారత, శాంతిపర్వ, 3౧౮ అధ్యాయ.

1. సత్త్వము.
2. ఆనందము.
3. ఉద్రేకము.
4. ప్రీతి.
5. ప్రాకామ్యము.
6. సుఖము.
7. శుద్ధత్వము.
8. ఆరోగ్యము.
9. సంతుష్టి.
10. శ్రద్ధాళుత.

11. అకార్పణ్యము.
12. అసంరంభము.
13. క్షమ.
14. ధృతి.
15. అహింస.
16. సమత్వము.
17. సత్యము.
18. ఆనృణ్యము.
19. ఆర్జవము.
20. హ్రీ.
21. అచాపల్యము.
22. శౌచము.
23. మృదుత్వము.
24. ఆచారము.
25. అలోలత్వము.
26. ఇష్టానిష్టములయెడ అసంభ్రమము.
27. అవికత్థనము.
28. దానము
29. నిస్పృహత్వము.
30. పరార్థత.
31. సర్వభూతదయ.

శ్లో. "శమో దమ స్తితిక్షేక్షా తప స్సత్యం దయాస్మృతిః,
తుష్టిస్త్యాగోఽస్పృహాశ్రద్ధా హ్రీర్దయాదిస్స్వనిర్వృతిః."
శ్రీభాగవత. ౧౧ స్కంధ. ౨౫ అ.

1. శమము = అంతఃకరణనిగ్రహము.
2. దమము = బాహ్యేంద్రియనిగ్రహము.
3. తితిక్ష = ద్వంద్వసహిష్ణుత్వము, ఓర్పు, తాలిమి.
4. ఈక్షా = తత్త్వవిమర్శము.
5. తపస్సు = కాయేంద్రియశోషణము, త్రివిధము.
6. సత్యము = యథార్థభాషణము.
7. దయ = సర్వభూతదయ, (కరుణ.)
8. స్మృతి = అనుభూతవిషయమును మఱవకుండుట.

9. తుష్టి = సంతోషము.

10. త్యాగము = దానము.

11. అస్పృహా = వైరాగ్యము.

12. శ్రద్ధ = గురూపదిష్టశాస్త్రవాక్యములయందు విశ్వాసము (ఆస్తిక్యత).

13. హ్రీ = అనుచితకర్మయందు లజ్జ.

14. దయాది = ఆర్జవము, వినయము మొదలగునవి.

15. స్వనిర్వృతిః=ఆత్మానుభవమువలనఁ గలిగినసుఖము(ఆనందము)

పైనిఁ జెప్పఁబడిన పదునయిదు సాత్త్వికగుణవృత్తులు. సాత్త్వికగుణము నిర్మలమయిన దగుటవలనఁ బ్రకాశించు నదియు, నేదోషము లేనిదియునై సుఖము జ్ఞానము వీనిసంగ మముచే ప్రాణులను బంధింపుచున్నది. ఈ దేహమునందలి ద్వారములనఁగ ఇంద్రియము లన్నింటియందును ప్రకాశమా నమగు జ్ఞాన ముత్పన్నమైనపుడు సత్త్వగుణము వృద్ధిఁబొందిన దని తెలియఁదగును. పుణ్యకర్మకు నిర్మలమును సాత్త్వికము నగుఫలము కలుగును. సాత్త్వికమువలన జ్ఞానము కలుగును.

రజస్తమోగుణముల నడఁచి సత్త్వగుణము విజృంభిం చినపుడు, వాసుదేవాఖ్యమగు చిత్తమునందు విశుద్ధజ్ఞాన ముద యించి, పరమాత్మావలోకనము గలుగును. వృత్త్యంతరములు లేని చిత్తము శుద్ధసత్త్వస్వరూపమనియు, సమాధినిఁ గలిగిం చునదియు, సర్వోత్కృష్టధర్మము జనింపఁజేయునదియు, మోక్ష ఫలము నిచ్చునదియు నగును. సాధనచతుష్టయసంపత్తిలో

నొకటియగు శమాదిషట్కము సాత్త్వికగుణవృత్తిజాతమని యు, ముముక్షువు సాత్త్వికగుణము నభివృద్ధిఁ జేసికొనవలె ననియుఁ దెలియఁబడుచున్నది. సత్త్వగుణమభివృద్ధిఁ బొంది నపుడు మృతులయినవారు దేవలోకమునుఁ బొందుదురు. వేయేల? దైవీసంపత్తులోఁ జేరిన శుద్ధవాసనలన్నియు సాత్త్విక గుణవృత్తులె. సాత్త్వికాహారము భుజించుటవలనను, సద్గ్రంథ శ్రవణ మననాదులవలనను, సత్కార్యానుష్ఠానమువలనను సాత్త్వి కగుణ మభివృద్ధిఁ జెందును.

రాజసగుణములు. Mobility; Activity.

శ్లో. "రజోగుణానాం సంఘాతో రూపమైశ్వర్యవిగ్రహౌ,
అత్యాగిత్వ మకారుణ్యం సుఖదుఃఖోపసేవనమ్.
అహంకారస్త్వసత్కార శ్చింతా వైరోపసేవనం,
పరితాపోఽభిహరణం హ్రీనాశోఽనార్జవం తథా.
పరాపవాదేషు రతి ర్వివాదానాం చ సేవనం,
భేదః పరుషతా చైవ కామక్రోధౌ మదస్తథా,
దర్పో ద్వేషోఽతిమానశ్చ ఏతే ప్రోక్తా రజోగుణాః."

మహాభారత శాంతిపర్వ. ౩౧౮ అ.

1. రూపము.
2. ఐశ్వర్యము.
3. విగ్రహము.
4. అత్యాగిత్వము.
5. అకారుణ్యము.
6. సుఖదుఃఖోపసేవనము.
7. అహంకారము.
8. అసత్కారము.

9. చింత.
10. వైరోపసేవనము.
11. పరితాపము.
12. అభిహారణము.
13. హ్రీనాశము.
14. అనార్జవము.
15. పరాపవాదరతి.
16. వివాదసేవనము.
17. భేదము.
18. పారుష్యము.
19. కామము.
20. క్రోధము.
21. మదము.
22. దర్పము.
23. ద్వేషము.
24. అతిమానము.

వీనిలో ననేకములు మద ప్రకరణములో వివరింపఁబడి నవి. క్రోధము తమోగుణములలో పరిగణింపఁబడినను, సామాన్యకోపము రజోగుణములోను, విశేషకోపము (క్రోధము) తమోగుణములోనని తెలియఁదగును. ముస్ముందు వృత్తులలో వివరింపఁబడును.

శ్లో. "కామ ఈహా మద స్తృష్ణా స్తంభ ఆశీర్భిదా సుఖం,
మదోత్సాహో యశః ప్రీతి ర్హాస్యం వీర్యం బలోద్యమః."
శ్రీభాగవత. ఏకాదశస్కంధ.

1. కామము = విషయోపభోగాభిలాషము.
2. ఈహా = చేష్టలు.
3. మదము = అధికుఁడనను అహంకారము.
4. తృష్ణ = అసంతుష్టి.
5. స్తంభము = గర్వము.

6. ఆశీర్భిద = ధనాదులయెడ నాశ, వైషమ్యము.
7. సుఖము = విషయోపభోగము.
8. మదోత్సాహములు = సాహసకర్మాభినివేశము.
9. యశఃప్రీతి = స్తుతిప్రియత్వము.
10. హాస్యము = ఇతరుల నపహసించుట.
11. వీర్యము = సామర్థ్యమునుఁ బ్రకటించుకొనుట.
12. బలోద్యమము = బలాతిశయముచే నుద్యమించుట.

పైనిఁ జెప్పఁబడిన పండ్రెండు రాజసగుణవృత్తులు. రాజసగుణము అనురాగస్వరూపము గలదియు, తృష్ణచేతను, ఆసక్తిచేతను బుట్టునదియు, కర్మసంగముచే ప్రాణులను బంధించునదియు నగును. ఎల్లప్పుడు నేదే నొకపని చేయుదమని యూహ కలిగించుచుండు. సత్త్వతమస్సుల నడఁచి రజోగుణము విజృంభించినపుడు లోభమును కర్మలయందుఁ బ్రవృత్తియు వానియారంభమును, అతృప్తియు, ఇచ్ఛయుఁ గలుగుచుండు. రజోగుణము ప్రబలించినపుడు మృతులయినవారు కర్మలయందాసక్తములగు జన్మల నెత్తుదురు. రాజసకర్మకు దుఃఖము ఫలంబును, లోభగుణంబును గలుగును. "నీవు, నేను" అను భేదబుద్ధినిఁ గలిగించు అహంకారము రజోగుణమువలనఁ గలుగును. ఈ యహంకారమువలన దర్పము, గర్వము, అతిమానిత్వము, ఆత్మస్తుతిప్రియత్వము, అసంతుష్టి, లోభము లోనగునవి కలుగును. ఎడతెగకుండ కర్మలనుఁ జేయవలెననెడు నాసక్తి కలుగును.

కామక్రోధములు రజోగుణమువలనఁ బుట్టుననియు, అనర్థదాయకములనియు, మోక్షప్రతిబంధకములనియు, కామక్రోధప్రకరణమున విస్తరించి చెప్పఁబడెను. రజోగుణజన్యములగు మిశ్రవాసనలవలన మనుష్యజన్మముఁ గలుగును. మానవుఁడు సత్కర్మలవలన నూర్ధ్వలోకమును, అసత్కర్మలవలన నధోలోకమును బొందును. గనుకను కర్మభూమియే యుభయలోకములకు మార్గదాయక మయినందునను, సత్కర్మల నాచరించి యూర్ధ్వలోకమును, దేవత్వమునుఁ బొందవలయునుకాని, అసత్కర్మల నాచరించి అధోలోకమును, పశురాక్షసఘోరజన్మలనుఁ బొందఁజనదు.

తామసగుణములు. (Obscuration, Inertia).

శ్లో. "తామసానాం తు సంఘాతాన్ ప్రవక్ష్యామ్యవధార్యతాం,
మోహోఽప్రకాశస్తామిస్ర మంధతామిస్రసంజ్ఞితం.
మరణం చాంధతామిస్రం తామిస్రక్రోధ ఉచ్యతే,
తమసో లక్షణా నీహ భక్షణాద్యభిరోచనం.

భోజనానా మపర్యాప్తి స్తథా పేయేష్వతృప్తతా,
గంధవాసో విహారేషు శయనే ష్వాసనేషు చ.

దివాస్వప్నే వివాదే చ ప్రమాదేషు చ వై రతిః,
నృత్యవాదిత్ర గీతానా మజ్ఞానాచ్ఛ్రద్దధానతా,
ద్వేషో ధర్మవిశేషాణా మేతే వై తామసా గుణాః."

మహాభారత. శాంతిపర్వణి.

1. మోహము.
2. అప్రకాశము.
3. తామిస్రము=క్రోధము.
4. అంధతామిస్రము=మరణము
5. నిద్ర.
6. ప్రమాదము.

భక్షణమునం దభిలాషము, ఎంత భుజించినను తృప్తి లేకుండుటయు, సుగంధద్రవ్యభూషణాంబర విహారములయందును శయనాసనములయందును, భోగములయెడను చాలునని తృప్తిలేకుండుటయు, పగటినిద్రయందును వివాదమందును పోరబాట్లు సేయుటయందును ప్రీతియు, నృత్యవాద్యగీతములయెడ నజ్ఞానముచే శ్రద్ధఁ గలిగియుండుట తనకుఁ దెలియక యితరు లభినందించునపుడు తా నభినందించుట, వారు తలలూచినపుడు తానును తలఁ ద్రిప్పుట, విశేషధర్మములయెడ ద్వేషము, శోకము, మోహము, భీతి, నిరుద్యమము లోనగునవి తామసగుణలక్షణములు

శ్లో. "క్రోధో లోభోఽనృతం హింసా యాచ్ఞా దంభః క్లమః కలిః,
శోకమోహౌ విషాదార్తీ నిద్రాఽఽశాభీ రనుద్యమః."

శ్రీభాగవత ౧౧ స్కంధము.

1. క్రోధము=అసహిష్ణుత్వము.
2. లోభము=వ్యయముసేయకుండుట.
3. అనృతము=అశాస్త్రీయము ప్రమాణమని పలుకుట. (అసత్యము)
4. హింసా = ద్రోహము.
5. యాచ్ఞా = యాచించుట.
6. దంభము = వంచనము.
7. క్లమము=శ్రమము (ఆయాసము)
8. కలి = కలహము.

9. శోకము = ఏడ్చుట.
10. మోహము = భ్రాంతి.
11. విషాదము = దుఃఖము.
12 ఆర్తి=దైన్యము (బాధ)
13. నిద్ర = నిదురించుట.
14. ఆశ = ఇది నాకుఁ గావలె ననెడి అభిలాషము.
15. భీః = భయము.
16. అనుద్యమః = జడత్వము.

పైనఁ జెప్పఁబడిన పదునాఱును తామసగుణవృత్తులు. తామసగుణము. అజ్ఞానమువలనఁ బుట్టునదియు, సకలప్రాణులను మోహింపఁజేయునదియు, ప్రమాదము,అలసత్వము, నిద్రలచే బంధించునదియు నగును. ఇది జ్ఞానమునాశ్రయించి కర్తవ్యమూఢతయందు (కర్తవ్యమును మఱచిపోవుటయందు) ఆసక్తినిఁ గలిగించును. రజస్సత్త్వముల నడఁచి తమోగుణము విజృంభించినపుడు, అంధకారమును ఏమియు చేయక పోవలయు ననుకోరికయు, సోమరితనంబును కర్తవ్యమును మఱచుటయు, మోహంబును బుట్టును. తామసకర్మకు అజ్ఞానఫలంబును, అధోలోకప్రాప్తియుఁ గలుగును. తమస్సు, మోహము, మహామోహము, తామిస్రము, అంధతామిస్రమని. అవిద్య అయిదురూపములు గలదని మోహప్రకరణములో విస్తరించి చెప్పఁబడెను. నాస్తికత, నింద్యకర్మాచరణమం దాసక్తి, రేయింబవలు నిద్రఁబోవుట, అజ్ఞానము, కౌటిల్యము, వంచన, దంభము, లోభము, భయము, మోసము, అసత్యములోనగునవి తమోగుణవృత్తులు. లేనిది ఉన్నట్టుల, ఉన్నది లేనట్టుల తోఁచునది, విపరీతజ్ఞానము, అయథార్థజ్ఞానము మోహ మనఁ

బడు. మూఢవృత్తి ప్రకాశములేక యుండును. దీపమున కుండు చిమ్నిగ్లాసు పూర్తిగా మసితోఁ గ్రమ్మఁబడి తుషువ కుండినచో దీపప్రకాశము కనుపింపదు. అటులే అజ్ఞానము ఆవరించినందున జ్ఞానము ప్రకాశింపదు.

సత్త్వరజస్తమస్సులు సామ్యావస్థలోనుండిన ప్రకృతి అవ్యక్త మనఁబడు. పరమేశ్వరు దృక్సంకల్పమున వీనిలో హెచ్చుతగ్గులు (తారతమ్యములు) కలిగినపుడు వ్యక్తమై సృష్టి ప్రారంభమగును. పరబ్రహ్మశక్తియే ప్రకృతి అవ్యక్తము అవ్యాకృతమునని చెప్పఁబడును. నిజమాయాశక్తి నధిష్ఠించి పరమాత్మ రజోగుణప్రధాన బ్రహ్మయై సృజించును. సత్త్వగుణ ప్రధాన విష్ణువై రక్షించును. తమోగుణప్రధాన రుద్రుఁడై లయింపఁజేయును. సృష్టిస్థితిలయములు త్రిగుణముల నధిష్ఠించి త్రిమూర్తులచేఁ గావింపఁబడుచున్నవని శ్రీభాగవతాదిపురాణములయందుఁ జెప్పఁబడియె. సత్త్వము తెలుపు, రజస్సు ఎఱుపు, తమస్సు నలుపు నని త్రిగుణములవర్ణములచే మూర్తిత్రయము తద్భావముఁ జెందును. సత్త్వములో సత్త్వము, రజస్సు, తమస్సునని. రజస్సులో రజస్సు, సత్త్వము, తమస్సు నని తమస్సులో తమస్సు, రజస్సు, సత్త్వము నని. ఒక్కొక్క దానిలో మూఁడేసి భేదములుగను, అందులో ననేక భేదములును గలిగి, ఉద్భిజ్జ, అండజ, స్వేదజ, జరాయుజములను చతుర్విధసృష్టులును, దేవగంధర్వ కిన్నరకింపురుష యక్షరాక్షస మనుష్య పశుపక్షిసరీసృపకీటక గిరితరువనాది చరాచర సమస్త సృష్టి ప్రాదుర్భవించెను.

చిత్తవృత్తులు. (Moods of the mind.)

సూ. "ప్రమాణ విపర్యయ వికల్పనిద్రాస్మృతయః."

పాతంజలయోగశాస్త్ర ౧-౬.

ప్రమాణము, విపర్యయము, వికల్పము, నిద్ర, స్మృతి యని చిత్తవృత్తులు అయిదువిధములు. ఇయ్యవి క్లిష్టవృత్తులు, అక్లిష్టవృత్తులు నని ఇరుతెఱంగులు. క్లిష్టవృత్తులనఁగ క్లేశముఁ గలిగించు అవిద్య, అస్మిత, రాగము, ద్వేషము, అభినివేశము ననునవి. అక్లిష్టవృత్తులనఁగ క్లేశముఁ గలిగించనివి. వివేకఖ్యాతి సంబంధించినవియు, గుణకార్యారంభవిరోధులగు అవిద్యా కామకర్మాది రూపకారణములను నశింపఁజేయునవియు నగును. చిత్తవృత్తులన్నియుఁ బైనిఁజెప్పిన అయిదువృత్తులలోనే యంతర్భూతము లగును. క్లిష్టవృత్తులన్నియు రజస్తమోగుణములకు సంబంధించినవనియు, అక్లిష్టవృత్తులన్నియు, సాత్త్వికగుణమునకు సంబంధించినవనియు తెలియఁదగును. న్యాయశాస్త్రమునందు చిత్తవృత్తులన్నియు సుఖ, దుఃఖ మోహములలోనే యంతర్భూతములని నిరూపించిరి.

ప్రమాణము.

(Correct knowledge or Accurate cognition)

సకలజీవుల హితాహితములు జ్ఞానము నాశ్రయించి యుండును. యథార్థజ్ఞానము హితముఁ గలిగించును. అయథార్థజ్ఞానము అహితముఁ గలిగించును.

యథార్థజ్ఞానము ప్రమయనియు, అయథార్థజ్ఞానము భ్రమయనియుఁ జెప్పఁబడును. కాఁబట్టి ప్రమను సంపాదించుకొనుటయు, భ్రమనుఁ బరిహరించుకొనుటయు నావశ్యకము గావున భ్రమప్రమలం దెలిసి, భ్రమము రాకుండునటులను, ప్రమ గలుగునటులను జేసికొనుటకు వానిసాధనంబులును దెలియుట యావశ్యకము. అందులో నొక్కటి తెలిసిన, రెండవది దానికి విరుద్ధమని తెలియుట సులభంబు గాన, ప్రమాసాధనము ప్రమాణ మిట్టిదని తెలుపఁబడును.

ప్రపంచమందలి పదార్థతత్త్వమెల్లఁ దెలుపునది—ప్రమాణము.
" " తెలియువాఁడు —ప్రమాత.
" " తెలియఁబడునది—ప్రమేయము.
" " తెలియుట —ప్రమితి.

2. Sensation: జ్ఞానమునకు సాధనము లనేకములు గలవు. అన్నిసాధనములకు నాధారములుగాఁ బరమేశ్వరుఁడు శ్రోత్రత్వక్చక్షుజిహ్వాఘ్రాణంబులను జ్ఞానేంద్రియములను, మనస్సును అనుగ్రహించి యున్నవాఁడు. అందు జ్ఞానేంద్రియములు బాహ్యసాధనములును (కరణములును) మనస్సు అంతస్సాధనమును (కరణమును) అని చెప్పఁబడును.

3. Perception: తత్కాలమున సన్నికృష్టములగు విషయంబులఁ దెలిసికొనుటకు సాక్షాత్సాధనము లింద్రియములు. అట్టిజ్ఞానమె ప్రత్యక్షము, సాక్షాత్కారము ననం

బడును. అది యింద్రియభేదమున చాక్షుషము, శ్రావణము, త్వాచము, రాసనము, ఘ్రాణజము, మానసము నని యాఱు విధములు గలది యగును.

4. Inference: ప్రత్యక్షసిద్ధములగు విషయంబులం బట్టి యసన్నికృష్టంబులు నప్రత్యక్షంబులు నగు విషయంబులం దెలియు సాధనములలో ననుమానప్రమాణ మొక్కటి. అనుమితియను తెలివిం బుట్టించునది యనుమానము. అంతియ కాని సంశయమనెడి గ్రామ్యవ్యవహారసిద్ధము గాదు.

5. Eternal word: శబ్దము పౌరుషేయంబు నపౌరుషేయంబు నని రెండువిధములు గలదు. అస్మదాదులు సెప్పు వాక్యములెల్లం బౌరుషేయంబులు. వానికి భ్రమ విప్రలిప్సాప్రమాదాలస్యదోషశంకచే నప్రామాణ్యశంకావకాశంబు గలదు. అపౌరుషేయం బనఁగా పురుషబుద్ధి మూలకముగాని శబ్దము. అదియే వేదము. ఆగమప్రమాణము. మఱియు శబ్దమనఁగ వాక్యము, వాక్యమనఁగ పదసమూహము. పదార్థముఁ దెలుపుటకు శక్తియు, లక్షణావ్యంజనావృత్తులును గలవు. వాక్యార్థజ్ఞానమునకు శాబ్దబోధము, అన్వయబోధము నని చెప్పుదురు. అట్టి తెలివి పుట్టుటకు ఆకాంక్షాయోగ్యతాసత్తి తాత్పర్యజ్ఞానములు సహకారములు.

6. Comparison: గవయశబ్దార్థము నెఱుంగనివానికి నది గోవువలె నుండునని గ్రామీణుండు చెప్పినపై నొక

ప్పుడు గవయముఁ జూచుట తటస్థించినచో, గోసాదృశ్యజ్ఞానముచేఁ దొల్లింటిమాట తలంపునందగిలి యిదియే గవయంబను తెలివిగలుగునది యుపమితి. దానిం బుట్టించు సాదృశ్యజ్ఞానము ఉపమానము.

7. ఇట్లు ప్రత్యక్ష, అనుమాన, శబ్ద, ఉపమానప్రమాణంబులునుం గాక, అర్థాపత్తి, అనుపలబ్ధి, సంభవ, ఐతిహ్యంబులను ప్రమాణములును గలవు. ప్రమాణముల నంగీకరించువారు ప్రామాణికు లనఁబడుదురు.

ఆస్తికదర్శనములు నాస్తికదర్శనములు నని దర్శనములు ద్వివిధములు.

1. న్యాయము (గౌతమము)
2. వైశేషికము (కాణాదము)
3. సాంఖ్యము (కాపిలము)
4. యోగము (పాతంజలము)
5. పూర్వమీమాంస (జైమినీయము)
6. ఉత్తరమీమాంస (బాదరాయణీయము)

పైనఁజెప్పఁబడిన షడ్దర్శనములు, వేదప్రామాణ్యము నంగీకరించిన గౌతమాదులచే రచియింపఁబడినవి ఆస్తికదర్శనములు.

1. చార్వాకదర్శనము
2 బౌద్ధదర్శనము
దర్శనము
4. ఆర్హతదర్శనము
5. దిగంబరదర్శనము
6. సోమదర్శనము

పైనఁ జెప్పఁబడిన యాఱును వేదప్రామాణ్యము నంగీకరింపని చార్వాకాదులచే రచియింపఁబడిన నాస్తికదర్శనములు.

ప్రత్యక్షమొక్కటియే ప్రమాణము.	చార్వాకమతము.
ప్రత్యక్షము- అనుమానము - రెండు మాత్రమే ప్రమాణములు.	బౌద్ధమతము. జైన-ఆర్హత-దిగంబర-సౌమమతములు.
ప్రత్యక్ష-అనుమాన - ఉపమాన - శబ్దములను నాలుగుప్రమాణములు.	న్యాయదర్శనము (గౌతమము)
ప్రత్యక్ష-అనుమానములు రెండుమాత్రమే ప్రమాణములు.	వైశేషికదర్శనము (కాణాదము)
ప్రత్యక్ష-అనుమాన-శబ్దములు మూఁడుప్రమాణములు.	యోగదర్శనము (పాతంజలము)
,, ,, ,,	సాంఖ్యదర్శనము (కాపిలము)
ప్రత్యక్ష-అనుమాన-ఉపమాన - శబ్ద. అర్థాపత్తి, అనుపలబ్ధియను ఆఱు ప్రమాణములు.	మీమాంసాదర్శనము (జైమినీయము)
,, ,, ,,	వేదాంతదర్శనము (బాదరాయణీయము) (శాంకరీయము)

ప్రత్యక్షప్రమాణము (Perception)

నిఖిల వ్యవహారములకును కారణమయిన బుద్ధియే జ్ఞానమనఁబడును. అది స్మృతి అనుభవమని ద్వివిధము.

1. స్మృతి, సంస్కారజన్యజ్ఞానము (మనస్సంస్కారమునఁ బుట్టినజ్ఞానము.)

2. అనుభవము తద్భిన్నజ్ఞానము. స్మృతికానిజ్ఞానమే అనుభవ మనఁబడును. ఇదియును యథార్థానుభవము, అయథార్థానుభవమని ద్వివిధము.

1. యథార్థము తద్వతి తత్ప్రకారకమగు అనుభవము.

ఉదా. వెండి ఖడ్డీయందుఁబుట్టిన వెండిజ్ఞానము యథార్థ మనఁబడును. అదియే ప్రమయని చెప్పఁబడు.

2. అయథార్థము తదభావవతి తత్ప్రకారకానుభవము.

ఉదా ముత్తెపుచిప్పనుఁ జూచి వెండిగా నెంచుట. అయథార్థమనఁబడు. ఇదియే భ్రమ యనఁబడు.

యథార్థానుభవము ప్రత్యక్షము, అనుమానము, ఉపమానము, శబ్దము అని నాలుగువిధములు.

ప్రత్యక్షప్రమాణకరణము, ప్రత్యక్షకరణము.

ఇంద్రియార్థ సన్నికర్ష జన్యజ్ఞానము ప్రత్యక్షము. (ఒక పదార్థమునుఁ జూచి పుట్టినజ్ఞానము ప్రత్యక్షమనఁబడును.)

ఇది సవికల్పము, నిర్వికల్పకము అని రెండువిధములు.

1. నిష్ప్రకారకము నిర్వికల్పకము. అనఁగా ఇంద్రియార్థసన్నికర్ష మైనపిదప నామజాత్యాదియోజనము లేక ఇది కించిత్తు అని వస్తుమాత్రావగాహియై యొదవుజ్ఞానము నిర్వికల్పకము.

2. సప్రకారకము సవికల్పకము. అనఁగా ఇది డిత్థము, ఇతఁడు బ్రాహ్మణుఁడు, ఇది శ్యామము అను ప్రత్యక్షజ్ఞాన విశేషకము సవికల్పకము.

చాక్షుష ప్రత్యక్షము. (Visual Sensation)

1. సన్నికృష్టంబులగు విషయంబులను చక్షురింద్రియము ద్వారా తెలిసికొనుట చాక్షుషప్రత్యక్ష మనంబడు. అందు రూపమును రూపముగల వస్తువును, వానిధర్మంబులలోఁ గొన్నింటిని చాక్షుషవిషయంబులు. రూపమనఁగ తెలుపు, నలుపు, ఎఱుపు, పసుపు, మొదలగునవి. అవి తెలియుటకు తేజంబు సహకారి. బాహ్యములగు నాకృతులను రూపములను, నేత్రనాడి (Optic Nerve) మస్తిష్కమునందు (గోళ్రమునందు) ప్రతిఫలింపఁజేయఁగ, నచట మనస్సు సాధక బాధకములను, హేయోపాదేయములను హితాహితములను నిశ్చయించి జ్ఞాననాడులద్వారా తెలుపగ చలననాడులు వాని ననుసరించి నుచితకార్యముల జరుపును. లోపలివిషయములను వెలుపలికిని, వెలుపలివిషయములు లోపలికినిఁ దెలుపుటకును,

చక్షురింద్రియము జీవునికి ప్రధానభృత్యునిఁ బోలియుండును. వ్యాఘ్ర, సర్ప వృశ్చికాది క్రూరసత్త్వంపుటాకృతుల లోపలికిఁ దెలిపినంతట నివి ఘోరసత్త్వములు, విపత్తునుఁ గలిగించునను జ్ఞానము కలిగి, వెంటనే వానినుండి తప్పించుకొనుటకై పరుగిడుట, లేక వానిని నాశముఁ జేయునుపాయమాలోచించుట, ఆక్రందనము చేయుట లోనగు క్రియలు జరుగును. నేత్రేంద్రియ మాకృతులఁ జూపించుఁగాని మేలు, కీడులు, సాధక బాధకముల నాలోచించుపని బుద్ధిదై యున్నది.

2. మనస్సు చక్షురింద్రియముద్వారా వెలికిఁ బ్రసరించి ఘటపటాద్యాకారముగఁ బరిణమించును. ఇదియే వృత్తి యనఁబడు. మనస్సు, చక్షురింద్రియము, దోషయుక్తము గాక గుణయుక్తమైనచో బాహ్యవిషయకయథార్థజ్ఞానము కలుగుఁగాని, అటు కానిచో విపరీతజ్ఞానము కలుగును. అది ఎట్టులనిన: మనస్సు ద్వేషక్రోధయుక్తమైనచో బాహ్యపదార్థము రమణీయముగ నున్నను, నేత్రేంద్రియము దానిని కురూపముగను, అప్రియముగనుఁ జూపించును. సౌరభ కుసుమములు, సుందరాకృతులు, ప్రకృతిరమణీయత్వము, ప్రీతిపదార్థములు వీని యథార్థజ్ఞానము తెలియఁ బడదు. ఇది అంతరింద్రియ గత దోషము; కన్ను పసిరికవ్యాధిఁ గలిగి పటలముఁ గ్రమ్మినియెడల శంఖము పచ్చగాఁ గనిపించును. అదరుచున్నయెడల నొక వంటవస్తువుగఁ గన్పించును. ఇచ్చట నంతరింద్రియము

చక్కఁగ నున్నను, బాహ్యేంద్రియమగు చక్షుర్గతదోషముచే యథార్థజ్ఞానము కలుగుట లేదు.

3. ప్రమాత-ప్రమాణ-ప్రమితి యను త్రితయము నిర్దుష్టమయినచో ప్రమేయజ్ఞానము యథార్థముగ నుండును. అటుగానిచో విపరీతముగ నుండును. కొన్ని అద్దములఁ జూడఁగ సురూపములు కురూపములుగఁ గనిపించును. ఇది సాధనగతదోషము.

4. చక్షురింద్రియమున బాహ్యపటలము, అంతరపటలము, మధ్యపటలములును గలవు. అందు మధ్యపటలమున ఎఱుపు, తెలుపు, నలుపు, పసుపు, ఊదా, ఆరంజి, చాపన చాయ లోనగువన్నెలు గలవు. ఆంతరంగిక తేజస్సహకారమున బాహ్యవర్ణజ్ఞానము కలుగును. కంటివ్యాధులు గలిగినపుడు రంగుగల అద్దములను వేసికొని, చికిత్సనుఁ బడయుదురు. వెలుతురునుండి చీకటి లోనికిఁగాని, చీకటినుండి వెలుతురు లోనికిఁగాని పోయినపుడు దృగ్భ్రమ కలుగును. నేత్రేంద్రియజ్ఞానము చక్కగానుండిన మానవునిజీవితము సుఖవముగ నుండును. కంటిపాపలోనే యాత్మ గలదని, ఉపాసకులు కొందఱు భ్రూమధ్యమందు దృష్టి నిలిపెదరు. యోగాభ్యాసముచే దూర(దివ్య)దృష్టి గలుగును. అయోమార్గమునందుండెడి ఉద్యోగియుల్లు, రైళ్లరాకపోకలు (Signal) పతాకసంజ్ఞలచేఁ జక్కఁగఁ గనుఁగొని నడపుదురు. వానిని వైపరీత్యముగ

గ్రహించినచో నెంతటివిపత్తు వాటిల్లునో తెలియనగును. అటుల నావికులు యుద్ధరంగమున యోధులు ఆయాసంజ్ఞలఁ జెక్కఁగ నేత్రేంద్రియముద్వారా గ్రహించి లోకోపకారకు లగుదురు.

5. రసాయనశాస్త్రజ్ఞులు కొన్నిపదార్థముల సమ్మేళనమున అద్దముల సంసిద్ధముఁ జేసి, నేత్రములకుఁ గలుగు చత్వారి(Long Sight)హ్రస్వదృష్టి సంకుచితదృష్టిదోషములను బోఁగొట్టియెదరు. సూర్యునినుండి తేజఃకిరణములు ప్రసరించినటుల అంతర్జ్యోతికిరణంబులు చక్షురింద్రియముద్వారా ప్రసరించును. సూర్యునియందు సప్తవర్ణము లుండినటుల నేత్రమునందును వర్ణములు గలవు. తెలుపునుండియె అన్నివన్నెలు కలిగెను. కటాక్షవీక్షణము,కుటిలవీక్షణము, రోషేక్షణము, ఆంతరంగికభావములఁ దెలుపును. అనేకయోజనముల దూరములో నుండు నక్షత్రగ్రహకాంతులను గ్రహించుటయందు నేత్రేంద్రియమునకుఁ బాటవ మెక్కువ. దానంజేసి యింద్రియములలోఁ బ్రధానమయ్యె. పిడుగుపాటును దుస్సహతేజస్సునుఁ జూచినయెడల సున్నితములగు నరములు తెగి అంధత్వమును గలుగును. నేత్రేంద్రియరక్షణమునకై తెప్ప లమర్పఁబడియున్నవి.

శ్రావణప్రత్యక్షము. Auditory Sensation.

1. సన్నికృష్టంబులగు విషయంబులను శ్రవణేంద్రియముద్వారా తెలిసికొనుట శ్రావణప్రత్యక్షం బనంబడు. అందు

శబ్దంబును, శబ్దధర్మంబులును శ్రావణవిషయములు. శబ్దము ధ్వన్యాత్మకము, వర్ణాత్మకమునని రెండువిధములు. ధ్వన్యాత్మక మనఁగ: భేరి వీణా వేణు మృదంగ వాద్యసంబంధ మయినది. వర్ణాత్మకమనఁగ: పంచాశద్వర్ణములు (అక్షరములు) గల పదములు, వాక్యములు లోనగునవి. ఆకాశమునుండి శబ్ద ముత్పన్నమై వాయువులో తరంగపరంపరలుగ వ్యాపించి శ్రవణకుహరము ప్రవేశించినంతట (Auditory Nerve) కర్ణనాడి మేదస్సునకుఁ గొనిపోవును. అచ్చట నిది వాద్యధ్వని, వర్ణధ్వని, జంతుధ్వని, శకటధ్వని, ఆక్రందనధ్వని, మధురధ్వని యని బుద్ధిచేఁ దెలియఁబడి ఆయాయింద్రియములకు జ్ఞాననాడుల చలననాడులద్వారా వార్తలు పంపఁబడగ నయ్యది అప్పటికిఁ దగినక్రియ లొనరించును.

2. వెనుకనుండి (Car) బండిగాని (Cycle) ద్విచక్రయాంత్రిక శకటముఁగాని వచ్చుచుండినపుడు దానిహెచ్చరిక శబ్దము విని యిది విపత్తునుఁ గలిగించునని మనము తొలఁగి పోదుము. ఒకతటాకములో రాయి పడవైచినచో తరంగ పరంపరలు వ్యాపించినట్లుల, వాయువులోను వస్తుచలనము వలనఁ గలిగినధ్వని తరంగములును క్రిందికిని మీదికిని ప్రక్కలకును నానాముఖముల వ్యాపించి కర్ణగోచర మగును. తేజస్సు శీఘ్రముగ వ్యాపించును. శబ్దమించుక యాలస్యముగ వ్యాపించును. మెఱుము మెఱసినతరువాత ఉఱుము మన కెంత సేపటికి వినఁబడునో ఆ కాలమునుఁ జూచి యేకకాలమునందే

పుట్టిన యీ యుఱుమునకు మెఱుమునకును కారణమయిన మేఘము మనకెంతదూరములో నున్నదో కనిపెట్టవచ్చును. న్యాయస్థానములయందు పాఠశాలలయందు రైలుస్టేషనుల యందు కొట్టఁబడు ఘంటాధ్వనులవలన నియమితకాలము కార్యక్రమము గోచరించును.

3. సప్తస్వరములవలనఁ గలుగుధ్వని వీనులకింపుగా నుండును. కంఠమాధుర్యముగల గాయకులగానములు శ్రోత్రేంద్రియముద్వారా మనస్సున కానందముఁ గలిగించును. కఠిన ధ్వనులు,ఘోరధ్వనులు,వ్యాఘ్రసింహభల్లూకాది క్రూరసత్త్వ ధ్వనులు, మనస్సునకు వ్యాకులతను, ద్వేషమును, భయమును గలిగించును. గద్గదికస్వరమువలన పరులభావము దెలియును. అంధులకు శ్రవణేంద్రియపటుత్వ మధికముగ నుండినందున గ్రహణధారణశక్తులు సామాన్యులకన్న నమితముగ నుండును. రణభేరీధ్వనులు, ఫిరంగుధ్వనులు, బాంబుధ్వనులు వినఁబడినచో దుర్బలులు భయపడుదురు. హాస్యకాండ్రు కొందఱు మఱుగుననుండి నక్క కోడి కుక్క పిల్లి పక్షికూఁతలనుఁ గూయునపుడు శ్రోత్రేంద్రియ మీధ్వనులు మేదస్సునకుఁ దెలియఁజేయుఁ గాని, యథార్థము తెలియక బుద్ధికి భ్రమ కలుగును. సన్నివేశపరిస్థితులచే నియ్యవి ఆయాజంతువుల ధ్వనులుకావనియు, నిపుణుఁడగు మానవుఁడు వాక్కౌశలముచే నిట్లు శబ్దించెననియు నెఱుకపడును. (భ్రమ కలుగును.) కర్ణరంధ్రము లోపలనుండు కర్ణభేరియందలి సున్నితమగు చర్మముమీద

సన్నని సుత్తివంటి యెముకలతాఁకిడిచే లోపల ధ్వనులు వ్యాపించును. అతితీక్ష్ణతేజస్సు కంటికెట్లు చెఱుపుచేయునో, అట్లే అతికఠోరధ్వని చెవికి చెఱుపును గలుగఁజేయును. సమీపమున పిడుగుపడినప్పుడును ఫిరంగులధ్వనిని విన్నప్పుడును బధిరులయినవార లనేకులున్నారు. చెవుడు కలుగకుండుటకయి కఠోరశబ్దము లున్నప్పుడు చెవులలో గుడ్డలుపెట్టుకొనుట మంచిది. నేత్రేంద్రియముతర్వాత శ్రోత్రేంద్రియము జీవునిభృత్యులలో ప్రధానమయినది.

ఘ్రాణజప్రత్యక్షము. Alfactory Sensation.

1. వస్తువులయొక్క గంధమును గ్రహించుటకు సాధనమయిన యింద్రియము ఘ్రాణేంద్రియ మనఁబడును. గంధంబును గంధధర్మంబులును ఘ్రాణజవిషయములు. పృథివీగుణము గంధము. పార్థివవస్తువులవలన గంధము కలుగుచుండెడిని. ఈ గంధము సురభి యని, అసురభి యని రెండువిధములు. సురభి యనఁగ మంచివాసన. పుష్పములనుండి కస్తూరినుండి మఱికొన్ని పరిమళద్రవ్యములనుండి సూక్ష్మాతిసూక్ష్ములైన యణువులు లేచి గాలిలోనుండి నానాముఖముల వ్యాపించినపుడు, ఆ యణువులతోడి సంయోగము ముక్కునకుఁ గలిగినపుడు వాసన తెలియును. ఈ సువాసనవలన ఆనందము గలుగును.

2. వాసనను గ్రహించెడిది ముక్కుయొక్క పయిభాగము. ఆభాగమునందే ఘ్రాణనాడీతంతువులు వ్యాపించి,

వీనికి మూలాధారములయి మేదస్సునుండి వచ్చెడి మొదటి జతయైన ఘ్రాణనాడు లెముకలలోని చిన్నరంధ్రములగుండ నాసికలో ప్రవేశించును. ఇట్లు ప్రవేశించిన ఘ్రాణనాడులు, వాసనలను నాసికలోనుండి మేదస్సునకుఁ గొనిపోయి మనస్సునకు నివేదించును. అంతట మనస్సు పునుగు, జవ్వాజి, అత్తరు, పన్నీరు లోనగు పరిమళద్రవ్యభేదముల గ్రహించును. ఊదువత్తులధూమంబును ఆనందముఁ గలిగించును. ఘ్రాణేంద్రియము గ్రహించు సుగంధములు దేహములోనుండు దుర్గంధములను మాలిన్యములఁ బోఁగొట్టి యారోగ్యమును, ఆనందమునుఁ గలిగించును. కుళ్లిన, ముఱిగిన, వస్తువులనుండి విషవాయువులతోఁ గూడి దుర్గంధసహితమయినగాలి ముక్కుసమీపమునకు రాఁగానే సహింపలేక ముక్కు మూసికొనుటచేతఁ గాని, మొగ మావంకనుండి త్రిప్పుకొనుటచేతఁ గాని, దూరముగ తొలఁగుటచేతఁగాని, మన మాదుష్టవాయువును తప్పించుకొందుము.

3. ఇవ్విధంబున మనకుఁ గలుగు విషవాయువులవలని యపాయము కలుగకుండ నాసిక కాపాడుచుండును. కుళ్లిన పండుఁగాని, పాసినయన్నముగాని, నోటియొద్దకు వచ్చినపుడు ముక్కు దుస్సహమయిన దానిదుర్గంధమును దెలిపి, దానిని తినక పాఱవేయునట్లు చేయును. ఈ ప్రయోజనముకొఱకే ముక్కు సరిగా నోటికి మీఁదుగా నమర్పఁబడి యున్నది. దుస్సహదుర్గంధము నాఘ్రాణించుటవలన సుకుమారమగు

ఘ్రాణేంద్రియము గంధరమణీయత్వము గ్రహించుశక్తినిఁ గోల్పోవును. శస్త్రచికిత్సలయందు (Chloroform) వాసనఁ జూపినందున ప్రజ్ఞ నశించును. యుద్ధములయందును విష వాయువుల (గంధము) ప్రయోగించి నిశ్చేష్టితులఁ గావింతురు. ముక్కు శైత్యాధిక్యతచే దిబ్బెడ వేసినయెడల ఏవాసన అయినది గ్రహింపఁజాలము. ఇది కరణగతదోషము.

త్వాచప్రత్యక్షము. Touching Sensation.

1. స్పర్శమును గ్రహించుటకు సాధనమయిన యింద్రియము త్వగింద్రియము. స్పర్శమును స్పర్శముగలవస్తువును వానిధర్మములలోఁ గొన్నియును త్వాచప్రత్యక్షవిషయములు. త్వాచమే స్పార్శనంబనియుఁ జెప్పఁబడును. ఏవస్తు వెక్కడ శరీరమునకుఁ దగిలినను స్పర్శమువలన వెంటనే తెలియును. చేతివ్రేళ్లయొక్క కొనలయందు స్పర్శజ్ఞాన మత్యధికముగా నుండును. అటుతరువాత నాలుకచివరను, పెదవుల కొనలను స్పర్శజ్ఞాన మంతకంటె కొంచె మల్పముగా నుండును. స్పర్శజ్ఞానమువలన మనము తాకినవస్తువులయొక్క మృదుత్వము, కఠినత్వము, నున్నఁదనము, కఱుకుఁదనము, పలచన, చిక్కన, ఆకారము మొదలయినవిమాత్రమే కాక వానియొక్క శీతోష్ణాదులు సహితము తెలియును.

2. స్పర్శజ్ఞానము చర్మమునందే యున్నట్లు కానఁబడుచున్నను నిజముగా చర్మమునే యనుసరించియున్నది కాదు.

అంతశ్చర్మమయిన స్థూలయందు కండకము లనఁబడెడు చిన్న బుడుపులుండి (Papillae) వానిలోపల జ్ఞాననాడులును కేశ నాళికలును చేరియుండును. కండకములలో పయికున్న జ్ఞాన నాడులు ఏపదార్థము శరీరము నెంతమాత్రము సోఁకినను, దానిగుణమును గొనిపోయి వెంటనే మెదస్సునకుఁ దెలుపు చుండును. స్పర్శజ్ఞానమును మెదడునకుఁ గొనిపోయెడు జ్ఞాన నాడి నెక్కడనైనను ఛేదించినపక్షమున, దానితో సంబంధిం చిన శరీరభాగమునందు గాయమయినను, వేఁడివస్తువును పెట్టి నను తెలియక నొప్పిగాని, స్పర్శముఁగాని లేకయుండును. ఇది సాధనగతదోషము.

3. ఈ స్పర్శజ్ఞానము గ్రుడ్డివాండ్రయం దధికముగా నుండును. వారికి నేత్రసాహాయ్యము లేకపోవుటచేత మనము కన్నుల నుపయోగించెడి యనేక కార్యములకు వారు చేతు లనే యుపయోగించుటవలన వారి కీజ్ఞాన మతిసూక్ష్మ మయిన దగును. అంధు లనేకులు, ఎత్తుగా ముద్రించిన యక్షరములను వ్రేలిమొనలతో తడవి గ్రంథములు చేదువుదురు. నేత్ర సాహాయ్య మక్కఱలేకుండ, స్పర్శజ్ఞానముచేతనే కుట్టుట మొదలయినపను లనేకములు చేయుదురు.

4. వైద్యుతోష్ణము (Electrical) రసాయనప్రయోగ ములం దుష్ణమునుఁదెలియక స్పృశించినయెడల, అపాయమును సంభవించును. విద్యుద్వాహినిఁగల తీఁగెలనుఁ గొందఱు తెలి యక స్పృశించి ప్రాణములు కోల్పోవుదురు. తద్విజ్ఞానశాస్త్ర

జ్ఞాలు చేతులకు తన్నిరోధకచర్మములను, పరికరములను ధరించి క్రియలు గావించుచుందురు.

రాసనప్రత్యక్షము. Taste Sensation.

1. పదార్థములయొక్క వివిధములయిన రుచులను దెలిసికొనుటకు సాధనమయిన యింద్రియము జిహ్వేంద్రియ మనఁబడును. దీనినే రసనేంద్రియమనియుఁ జెప్పుదురు. రసంబును రసధర్మంబులును రాసనవిషయంబులు. ఉప్పు, పులుసు, కారము, తియ్యఁదనము, వగరు, చేదు, అనునవి షడ్రసములు. ఈరసములను గ్రహించెడిశక్తి కొంతవఱకు నోటియొక్క పయిభాగమునకుఁ గూడ నున్నను, నాలుకయే రసములను గ్రహించుటకు ప్రధానసాధనము.

2. రుచి తెలిసికొనుటకు వస్తువును నాలుకకు తాఁకించుట యావశ్యకమైనను, వస్తువులను నాలుకమీఁద వేసికొన్నంత మాత్రముచేతనే రుచి తెలియక నాలుకతో వానిని నోటియొక్క పయిభాగముతో నదిమి చేప్పరించి మఱి చవిచూతుము. అంతియే కాక రుచిని గ్రహించుటకై యుమ్మినీరుగాని వేఱొకద్రవ పదార్థముగాని యవశ్యముగా కావలయును. రుచిపుట్టుటకు పదార్థములో కొంతభాగ మఱిగి, రసముతోఁగలియుట యావశ్యకమని స్పష్టపడుచున్నది. రుచినిఁ బుట్టించుటకు ఘ్రాణేంద్రియము కూడ చాలవఱకు తోడుపడును. రెండుముక్కులను గట్టిగ చేతులతో మూసికొని నోటిలో నేవస్తువును వేసికొని

నను రుచి తెలియకుండుటయు, చేతులు పట్టువిడిచి ముక్కులలోనుండి శ్వాసమాడునట్లు చేయఁగానే రుచి తెలియుటయు, నెల్లఱకు ప్రత్యక్షానుభవము.

3. రుచినిబట్టి యాహారపదార్థములు స్వీకరించినంతట, కొన్ని సమయములలో నతిమాధుర్యముగలవి వెగటుఁ బుట్టించి అపాయకరములుగ నుండును. కషాయములును తిక్తములుగా నుండునవి పుష్టికరములుగ నుండును. రాసాయనికులు మాధుర్యమును, పుష్టికరములును, సువాసనయును గలిగిన యాహారపదార్థములను జేయుదురు. వానియోగ్యతనుబట్టి స్వీకరింపఁదగును. రాజసపదార్థములగు మిక్కిలి వేఁడిగల చుఱుకుఁగల దాహమునుఁ గలిగించు ఉప్పు పులుసు కారములను గ్రహించినయెడల వ్యాధులుఁ గలుగుననియు, మనశ్శాంతి లేక కోపముఁ గలుగుననియు, తత్త్వజ్ఞులు శాస్త్రముఖంబునఁ దెలిపిరి.

4. నాలుకమీఁద మిక్కిలి చిన్నవిగా నుండు కండకములు (Papillae) శరీరముమీఁదనుండు కండకములకంటె పెద్దవిగా నుండును. ఈ కండకములలోనికి జిహ్వానాడులతోఁ జేరిన నాడీతంతువు లుండును. మేదస్సునుండి వచ్చెడునాడులలో నయిదవ జతయు, తొమ్మిదవ జతయు జిహ్వానాడులు. ౘో నయిదవ జత నాలుకయొక్క ప్రక్కలకును పయిభాగ తొమ్మిదవ జత యడుగుభాగమునకును వ్యాపిం

చును. ఈ జిహ్వానాడులే నాలుకనుండి రసభేదములను మేదస్సునకుఁ గొనిపోవును. పిత్తాధిక్యతచే నాలుక చెడినపుడు మధురపదార్థములు గ్రహించిన చేదుగానుండును. ఇది సాధన గతదోషము. మనస్సు వేఱొకవిషయమున లగ్నమైనపుడు ఏపదార్థము భుజించినదియు, ఎట్టిరుచియైనదియు తెలియఁ బడదు. ప్రమాత ప్రమాణములు నిర్దుష్టము లయినప్పుడే ప్రమేయజ్ఞానము చక్కఁగఁ గలుగును.

మానసప్రత్యక్షము. Mental Perception.

1. ముందుఁ జెప్పఁబడిన అయిదు ప్రత్యక్షంబులయం దును, తత్తదింద్రియములకు మనస్సంయోగం బావశ్యకంబు. జ్ఞానంబును ఇచ్ఛాద్వేషప్రయత్నసుఖదుఃఖాది తద్విశేషంబు లును మానసప్రత్యక్షవిషయంబులు.

2. అవి సాక్షిభాస్యంబులని కొందఱు చెప్పుదురు. సాక్షి యనఁగా జీవస్వరూపాత్మకమయిన జ్ఞానము. సాక్షిభాస్య మనఁగా నింద్రియవ్యాపారాదుల నపేక్షింపక సాక్షివిషయ మగునది యని యర్థము. ఈ ప్రత్యక్షంబు లన్నియు లౌకిక ప్రత్యక్షంబు లనంబడును.

అలౌకికప్రత్యక్షంబు.

3. అలౌకికప్రత్యక్షంబులు మూఁడు. అందుకు సాధ నంబులు.

1. సామాన్యలక్షణ. 2. జ్ఞానలక్షణ. 3. యోగజ ప్రత్యాసత్తులు.

1. ఒక్కవస్తువు ఇంద్రియసన్నికృష్టంబయినను దానిం బురస్కరించికొని దానిజాతిలోని వస్తువులనెల్ల నవగాహించు నది సామాన్యలక్షణ.

2. ఒక్క జ్ఞానముపయి నింద్రియసన్నికర్షంబునం బుట్టు ప్రత్యక్షములో, తదింద్రియాసన్నికృష్టంబగు పూర్వజ్ఞానవిష యము గూడ గోచర మగును. అందుకు జ్ఞానలక్షణప్రత్యా సత్తి కారణంబు.

3. యోగులకు యోగప్రభావంబునం గలుగు ప్రత్య క్షంబు యోగజప్రత్యక్షము. ఈమూఁడును న్యాయమతసిద్ధ ములు. ఇతరమతములవారు కొందఱు సామాన్యలక్షణ కొప్పుకొనరు. మఱికొందఱు యోగజప్రత్యక్షము నొప్పు కొనరు.

అనుమానప్రమాణము. Inference.

1. ప్రత్యక్షప్రమాణమూలకముగా నూహించుటకుఁ గారణమైనవస్తువు నాకారమై పరిణమించు చిత్తవృత్తి అను మానప్రమాణమనంబడు. అసన్నికృష్టంబులు నప్రత్యక్షంబులు నగు విషయంబులను దెలియు సాధనములలో ననుమానప్ర మాణ మొక్కటి. అనుమితి యను తెలివిం బుట్టించునది.

2. అట్టి తెలివిపుట్టుటకు లింగజ్ఞానము, సాధనము. అట్టి తెలివికి ముఖ్యవిషయము సాధ్యము. అది యున్నటుల భావించినచోటు పక్షము. ఉదా. కొండమీఁద పొగఁ జూచినవానికి నిప్పున్నదను తెలివి కలుగును. అది యనుమితి. అందు సాధ్యము నిప్పు, కొండ పక్షము, పొగ లింగము (గుఱుతు). అయినను పొగఁ జూచినవాఁడెల్ల నిప్పున్నదని యెఱుఁగఁడు. అందువలన పొగయున్నదని తెలియుట చాలదు. పొగయున్నచోనెల్ల నిప్పుండునని తెలియువాఁడు పొగ కొండమీఁద నున్నదని తెలిసెనేని నిప్పున్నదని యూహించును. పొగయున్నచోనెల్ల నిప్పుండునని తెలియుట వ్యాప్తిజ్ఞానము. అట్టిపొగ కొండమీఁదనున్నదని తెలియుటయే పక్షధర్మతాజ్ఞానము.

3 లింగమే హేతువనియు, సాధనమనియుఁ జెప్పఁబడును. వ్యాప్తి యనఁగా హేతువున్నచోనెల్ల సాధ్యముండును నను నియతసాహచర్యము. (అబాధితముగ నుండవలయు) అట్టిగల హేతువు వ్యాప్య మనఁబడును. అట్టివ్యాప్యము పక్షమందుండుట పక్షధర్మత. వ్యాప్తితోఁగూడిన పక్షధర్మత తెలియుటయే పరామర్శమనియు, లింగపరామర్శమనియుం జెప్పఁబడును. అదియే యనుమితికారణమని తార్కికమతము. వ్యాప్తిజ్ఞానంబును పక్షధర్మతాజ్ఞానంబునుఁ గూడి, అనుమతికారణములని మీమాంసకమతము.

4. వ్యాప్తి. 1. అన్వయవ్యాప్తియనియు, 2. వ్యతిరేకవ్యాప్తియనియు రెండువిధములు. అందు హేతువున్నచోట

నెల్ల సాధ్యముండుట అన్వయవ్యాప్తి; సాధ్యము లేనిచో హేతువు లేకుండుట వ్యతిరేకవ్యాప్తి. అందు మొదటిదానికి దృష్టాంతము. పొగయున్నచోటనెల్ల నిప్పుండుననుటకు వంటయిల్లు. అది అన్వయదృష్టాంతము. అదియే సపక్ష మనఁబడును. రెండవదానికి నిప్పులేనిచో పొగ యుండదనుటకు నీళ్ల మడుగు దృష్టాంతము. అదియే వ్యతిరేకదృష్టాంతము. ఇదియే విపక్ష మనంబడు.

నిశ్చితసాధ్యముగలది సపక్షము. నిశ్చితసాధ్యాభావము గలది విపక్షము.

5. ఇట్లు అన్వయవ్యాప్తి, వ్యతిరేకవ్యాప్తి గలలింగము అన్వయవ్యతిరేకి యనంబడును.

(1) అన్వయవ్యాప్తి మాత్రముగలది కేవలాన్వయి యనఁబడును. ఉ॥ ఘట మభిధేయము, ప్రమేయత్వమువలన పటమువలె అను నిచట ప్రమేయత్వాభిధేయత్వములకు వ్యతిరేకవ్యాప్తి లేదు. తెలియంబడునవియెల్లం బలుకంబడును గాన,నిది పలుకంబడుననుచోఁ దెలియం బడుట యను హేతువు కేవలాన్వయి.

(2) వ్యతిరేకవ్యాప్తిమాత్రము గల హేతువు. కేవల వ్యతిరేకి. ఉ॥ పృథివి గంధవత్త్వమువలన, ఇతరములకన్న భిన్నము. ఈదేవదత్తుఁడు పగలు తినుట లేకున్నను బలిసి

యున్నాఁడు గాన రాత్రిం దినుచుండుననుచో నట్టి స్థితియను హేతువు కేవలవ్యతిరేకి. ఇట్టిచోట నర్థాపత్తి యను ప్రమాణాంతరంబే కాని, కేవలవ్యతిరేకి యను నది అనుమానంబు గాదని మీమాంసకమతము.

6. ఈయనుమానంబు (1) స్వార్థము, (2) పరార్థము, అని యిరుతెఱంగులు.

(1) స్వార్థానుమానము తనకు తానే యూహించినది. ఎట్లనఁగా: తానే మహానసాదుల (వంటయిల్లు) యొక్క భూయోదర్శనముచే నెచట ధూమమో అచట వహ్ని యనువ్యాప్తిని గ్రహించి, పర్వతసమీపమును బొంది అచట అగ్నిచే నెరయు పర్వతమును, ధూమమును జూచి ఎచట ధూమమో అచట అగ్ని యనువ్యాప్తిని స్మరించును. అవ్వల వహ్నివ్యాప్యమగు ధూమవంత మీపర్వతమనుజ్ఞానము కలుగును. ఇదియే లింగపరామర్శ యనంబడును. కనుక పర్వతము వహ్నిమంతమను జ్ఞాన ముత్పన్నమగును. ఇదియే స్వార్థానుమాన మనంబడును.

(2) పరార్థానుమానము. తానే ధూమమువలన అగ్నిని యనుమానించి మఱియొక్కనికి బోధించుకొఱకుఁ గాని, మఱియొక్కండు ప్రయోగించినవాక్యముల తాఁ దెలి

సికొని యూహించుకొనుటకుఁగాని, పంచావయవవాక్యముసు ప్రయోగించుట.

పంచావయవవాక్యము.

ధూమ మునికివలన పర్వతము వహ్నిమంతము. మహానసమువలె ఏదియేది ధూమవంతమో అదియది అగ్నిమంతము గనుక ఇదియు నటుల నగును. అని దీనిచే ప్రతిపాదితము. లింగమునకన్న పరమైనను అగ్నిని ప్రతిపాదించును. ఆవాక్యమునందలి అయిదు అవయవములు 1. ప్రతిజ్ఞ, 2. హేతువు, 3. ఉదాహరణము, 4. ఉపనయము, 5. నిగమనము అని పేర్కొనఁబడును.

1. అందు పర్వతము వహ్నిమంతము అనుట ప్రతిజ్ఞ.
2. ధూమ మునికివలన అనుట హేతువు.
3. మహానసమువలె ఏదియేది ధూమవంతమో, అది యది అగ్నిమంత మనుట. ఉదాహరణము.
4. ఇదియు నటువలె (అట పొగయున్నది) అనుట ఉపనయము.
5. కనుక అటుల నగును. (ఇందు నిప్పుగలదు) అనుట నిగమనము.

స్వార్థానుమితికిని, పరార్థానుమితికిని లింగపరామర్శయే కరణము గనుక లింగపరామర్శ అనుమాన మగును.

హేత్వాభాసములు. (దుష్టహేతువులు.)

సాధనంబులవలెఁ దోఁచియు సాధకంబులు గాని హేతువులు హేత్వాభాసములు. అవి 1 సవ్యభిచారము, 2 విరుద్ధము, 3 సత్ప్రతిపక్షము, 4 అసిద్ధము, 5 బాధితము, అని అయిదువిధములు.

వానిదోషంబులు, 1 వ్యభిచార, 2 విరోధ, 3 ప్రతిపక్ష, 4 అసిద్ధి, 5 బాధమ్ములు.

ఉదాహరణము:—

(1) ఇందు నిప్పున్నదిగాన పొగ యుండునని యిట్టిచో వ్యభిచారము.

(2) ఇందు నీరున్నదిగాన నిప్పున్నదని యిట్టిచో విరోధము.

(3) నీరున్నచో నిందు గడ్డియున్నదిగాన నిప్పుండునని యిట్లనుకొన్నచో ప్రతిపక్షము.

(4) నీరున్నచో నిప్పుండుననినంతనే బాధము.

(5) ఈమడుగున నిప్పున్నది గాన వెలుఁగుండుననియు,నచ్చటనే బంగరుమడుగు అనిగాని, బంగరు నిప్పనిగాని, బంగరు వెలుఁగనిగాని చెప్పిన నిట్టిచో అసిద్ధి.

ఉపమానప్రమాణము. Comparison.

ఉపమితికరణము ఉపమానము సంజ్ఞాసంజ్ఞిసంబంధజ్ఞానము ఉపమితి యగును. (దీనికి సాదృశ్యమున్నది యని తెలి

యుట) ఉదా. ఒకానొకఁడు గవయపదముయొక్క అర్థము నెఱుంగకుండి, యొకానొక ఆరణ్యకపురుషునివలన గోసదృశుఁడు గవయుఁడు అని విని వనమునకుఁ బోయి, గోసదృశునిఁ జూచి వాక్యార్థమును స్మరించెడిని. ఆపిదప వీఁడు గవయపద వాచ్యుఁడను ఉపమితిఁ బుట్టించు సాదృశ్యజ్ఞాన ముపమాన ప్రమాణ మనంబడును.

శబ్దప్రమాణము.

(1) ఆప్తవాక్యము శబ్దము. ఆప్తుఁడనఁగా యథార్థముగఁ జెప్పువాఁడు. భ్రమవిప్రలిప్సాకరణాపాటవ ప్రమాదాలస్య దోషరహితుఁడు. వాక్య మనఁగా పదసమూహము. ప్రయోగార్హములు, అనన్వితములు; ఏకార్థబోధకములు నగు వర్ణములు పదమనఁబడును.

ప్రయోగార్హము లనఁగా ప్రాతిపదికరహితఘటపటాదులు. అనన్వితము లనఁగా మహావాక్యములను దొలఁగించునవి. ఏకమనఁగా, సాకాంక్షితములైన పెక్కుపదముల తొలఁగించుట. అర్థబోధకము లనఁగా. కచటతపేత్యాదులు కానివి; వర్ణములు.

(2) పదజ్ఞానసాధనమువలన; పదార్థజ్ఞానము కలుగును. పదార్థజ్ఞానము కలుగుటకు అనఁగా. శాబ్దబోధకు; శక్తియు లక్షణయు నను రెండువృత్తులు గలవు. శక్తి యనఁగా; పదముతోడి పదార్థమునకుఁ గల నియతసంబంధము ఈశబ్ద

మువలన నీ యర్థము తెలియఁదగినదనియెడు ఈశ్వరేచ్ఛ సంకేతము శక్తి యనంబడు. శక్తివలనఁ దెలియఁబడునర్థము శక్యార్థము. దీనిని గ్రహించుటకు పెక్కు సహకారము లుం డును. ధాతుప్రకృతిప్రత్యయాదులను దెలుపువ్యాకరణము, ఉపమానము, అమరకోశాది నిఘంటువులు, ఆప్తవాక్యము, వ్యవహారము వాక్యశేషము, వివరణము; సిద్ధపదసాన్నిధ్యము. వీనివలన శక్యార్థము (శక్తిగ్రహము) తెలియఁబడును.

అభిధ (శబ్దశక్తి)

ఈపదమున కీయర్థమని ఆప్తోపదేశమువలనను, లోక వ్యవహారమువలనను తెలియఁబడును. దీనినే సంకేతితార్థ మనియెదరు. ఈసంకేతితార్థమును జెప్పునది శక్త్యంతరముచే మఱుగుపడనిది - శబ్దశక్తి - అభిధ యనఁబడును. సంకేతము, జాతియందు గుణద్రవ్యక్రియలయందును గ్రహింపఁబడును.

(1) జాతి యనఁగా గోపిండాదులయందు గోత్వాదికము.

(2) గుణమనఁగా, విశేషము గలిగించునట్టి హేతువు సిద్ధ మయిన వస్తుధర్మము. ఎట్టులన: శుక్లాదిగుణములు గవాదికమును, సజాతీయములయిన కృష్ణగవాదుల నుండి వేఱుపఱచును.

(3) ద్రవ్యశబ్దములు ఏకవ్యక్తివాచకములు, హరి హర డిత్థ డవిత్థాదులు.

(4) క్రియలు సాధ్యరూపములు వస్తుధర్మములు పాకాదులు. ఎట్లన: వీనియందు ప్రొయి యెక్కించుట మొదలిదిగా ప్రొయినుండి దించుట తుదిదిగా ముందు వెనుకలుగాఁ గలుగు వ్యాపారపరంపర లోనగునవి పాకాదిశబ్దములకు వాచ్యములు. వీనియందే వ్యక్తి యొక్క యుపాధులందు (ధర్మములందు) సంకేతము గ్రహింపఁబడును; వ్యక్తియందుఁ గాదు.

శబ్దము—వాచకము, లక్షణ, వ్యంజన యని మూఁడువిధములు.

అర్థము—వాచ్యము, లక్ష్యము, వ్యంగ్యము, అని మూఁడు విధములు.

వృత్తులు—అభిధ, లక్షణ, వ్యంజన అని మూఁడువిధములు.

అభిధావృత్తి.

1. పై మూఁడువృత్తులు శబ్దశక్తు లనఁబడు. అందు వాచ్యార్థము సంకేతింపఁబడిన యర్థమును బోధించునది. అభిధావృత్తి (శక్యార్థము)

ఉ. ఉత్తమవృద్ధుఁడు మధ్యమ వృద్ధునితో "గామానయ)" ఆవును తెమ్ము అని చెప్పుటయు, ఇతఁడు ఆవును తేఁబూనుటయుఁ జూచి బాలుఁడు, ఈవాక్యమునకు "గంగడోలు లోనగునవి గలిగిన గోత్వపిండమును తెచ్చుట" అర్థము

అని తొలుత గ్రహించును. మఱి యనంతరము (గాం బధాన అశ్వమానయ) ఆవును కట్టుము, అశ్వమును తెమ్ము, ఇత్యాది యందు ఆవాపోద్ధారములచేత (నాటుటచేతను ఎత్తివైచుట చేతను) ఆవుశబ్దమునకు గంగడోలు గలది యర్థమనియు, తెచ్చుట శబ్దమునకు కొనివచ్చుట యర్థమనియు సంకేతమును గ్రహించును. కొన్నియెడల, ఆప్తుని యుపదేశమువలన. ఎట్లన: దీనిపేరు గుఱ్ఱము, దానిపేరు శునకమని సంకేతమును గ్రహించును.

లక్షణావృత్తి.

2. శక్యార్థమునకు (ముఖ్యార్థము) అనుపపత్తి సంభవించినచో దానితో సంబంధించిన మఱియొక యర్థముం దలంపనచ్చును. ఆయర్థము లక్ష్యము. దానిం దలంపించుసంబంధమే లక్షణావృత్తి యనంబడు. రూఢివలనఁ గాని, ప్రయోజనమువలనఁగాని, సాదృశ్యసంబంధములవలనఁగాని లక్షణ యేర్పడును. సంబంధనిబంధన జహదాచ్యా, అజహదాచ్యా యని రెండువిధములును, సాదృశ్యనిబంధన సారోపసాధ్యవసాయములని రెండువిధములును, ఇట్లు నాలుగువిధములుగ నుండును.

ఉ. "అగ్నిమాణవకుఁడు" అన్నచో పైంగళ్యదాహకాదిగుణవిశిష్ట మగునగ్నియందు, మాణవకత్వ మనుపపత్తి గనుక, అగ్నిసదృశ తేజఃపావనత్వాదిగుణవిశిష్టుఁడు మాణ

వకుఁడని లక్ష్యార్థ మేర్పడుచున్నది. ఇది సాదృశ్యనిబంధము. ఉ. గంగయందున్నది గొల్లపల్లె యనుచో గంగాపదమునకు శక్యార్థము ప్రవాహము. అది యనుపపన్న మగుటంబట్టి దానితో సంబంధించిన తీరం బర్థమగునుగాన, గంగాపదంబునకు గంగాతీరంబునందు, పావనత్వాదిగుణవిశిష్టమగు గొల్లపల్లెయని లక్ష్యార్థము. ఇది సంబంధనిబంధము. ఉ. శ్వేతము దవుడు సేయుచున్నది. ఈఁటెలు ప్రవేశించుచున్నవి. అచేతనములగు, శ్వేతము ఈఁటెలు, చేతనక్రియలగు ధావన ప్రవేశకార్యము లొనరింపఁజాలవు గనుక, శ్వేతమగునశ్వమనియు, ఈఁటెనుధరించిన పురుషుఁడనియు లక్ష్యార్థ మేర్పడుచున్నది. ఇవి రూఢిప్రయోజనములకు దృష్టాంతములు. శక్యార్థమునకు బాధ కలుగునపుడు సాదృశ్య - సంబంధ - రూఢి-ప్రయోజనములఁబట్టి లక్ష్యార్థము అన్వయింపఁదగును.

వ్యంజనావృత్తి.

3. అభిధ, లక్షణ, తాత్పర్యము లనెడు మూఁడు వృత్తులు విరమించినపిమ్మట ఏవృత్తి వేఱు అర్థమును బోధించునో శబ్దముదియు, అర్థాదికముదియు నగు నావృత్తి, వ్యంజనావృత్తి యనఁబడును.

"శబ్దంబు, బోధయు, కర్మయు విరమించిన వ్యాపారము ఉండదు. ఈవ్యంజనావృత్తి అభిధామూల యని, లక్షణామూల యని, వ్యంజన యిరుదెఱంగులు.

అనేకార్థమైనశబ్దమునకు సంయోగాదులచేత, ఒకదాని యం దర్థము నియంత్రితము కాఁగా, అన్యబోధకు హేతు వయిన వ్యంజన అభిధామూల.

తాత్పర్యార్థజ్ఞానమునకు హేతువులగు (ప్రకరణాది జ్ఞానము.) సంయోగాదులు.

1. సంయోగము = కూడిక - "సశంఖచక్రుఁడు హరి" శంఖచక్ర యోగముచే "హరి" విష్ణువునే చెప్పుచేన్నది. సూర్యసింహాదుల యందు లేదనుట.

2 విప్రయోగము = ఎడఁబాటు - "అశంఖచక్రుఁడు హరి" శంఖచక్రములు లేమిచే హరి యనఁగ విష్ణువునందే.

3. సాహచర్యము = సహకారిత్వము - "భీమార్జునులు" అను నెడ, అర్జునుఁడు ధనంజయుఁడు కాని కార్తవీర్యార్జునుఁడు కాఁడు.

4. విరోధిత్వము = వైరము - "కర్ణార్జునులు" అనుచోట కర్ణ శబ్దము రాధేయుఁడుకాని శ్రవణేంద్రియము కాదు. "రామార్జును లనునెడ, అర్జునశబ్దము కార్తవీర్యుఁడు కాని పార్థుఁడు కాఁడు.

5. ప్రయోజనము = ఉపయోగము - "స్థాణుని మ్రొక్కు చేన్నాను" ఇట స్థాణుశబ్దము భవబంధవిచ్ఛేదముకొఱకు శివునకు వందనము కాని, శాఖాపల్లవవర్జితమగు ఎండిన మోడుగుచెట్టునకుఁ గాదు.

6. ప్రకరణము = ప్రకృతవిషయము (ప్రస్తావము) "సర్వమును దేవరకు ఎఱుక" అనుచోట దేవర యనఁగ తమరు అని గాని, దేవ

తాంతరవిషయము కాదు. భోజనసమయమందు సైంధవమును తెమ్ము, అనునెడ లవణము కాని గుఱ్ఱము కాదు.

7. చిహ్నము = లింగము (గుఱుతు) "కుపితుఁడు మకరధ్వజుఁడు" కోపచిహ్నమునకు మకరధ్వజుఁ డనఁగ మన్మథుఁడని యర్థము కాని, అచేతనమగు సముద్రము కాదు.

8. అన్యశబ్దసన్నిధి = "దేవుఁడు పురారి" అనునెడ పురారిశబ్దసాన్నిధ్యమువలన దేవుఁడు అనఁగ శివుఁడు కాని దేవతాంతరము కాదు.

9. సామర్థ్యము = నియతశక్తి - "మధువుచేత మత్తము పికము" ఇట మధుశబ్దము కోకిల మత్తిల్లుటకు వసంతర్తువు సామర్థ్యముకాని మద్యపానవిశేషము కాదు.

10. ఔచిత్యము = ఉచితత్వము - "మిమ్ము దయితాముఖము రక్షించుఁగాత" ఇట ముఖము సాము్ముఖ్యముకాని వదనాదికము కాదు.

11. దేశము = నియమితస్థానము - "చంద్రుఁడు మింట వెలుఁగుచున్నాఁడు" ఇట చంద్రశబ్దము శశిపర్యాయము కాని కర్పూరాదులు కాదు.

12. కాలము = నిర్దిష్టసమయము - "రాత్రి చిత్రభానుఁడు" ఇట "చిత్రభాను"శబ్దము అగ్నిపర్యాయము కాని రాత్రికాల మగుటం జేసి సూర్యవాచకము కాదు.

13. వ్యక్తి = పుంస్త్వాదికము - "రథాంగము ప్రకాశించుచున్నది" ఇచట రథాంగశబ్దము నపుంసకలింగమగుటచే రథచక్రము కాని, చక్రవాకాదికము కాదు. "భాతి రథాంగమ్" అని మూలము.

14. స్వరాదులు = ఉదాత్త, అనుదాత్తస్వరాదులు - వేదమందే కాని, వాక్యాదులయందు తెలియఁబడవు. కావ్యాదులయందుఁ గలుగునని కొందఱి యభిప్రాయము.

వాక్యార్థజ్ఞానము (శాబ్దబోధ)

వాక్యము విన్నవాఁ డందలి పదములయర్థములం దలంచును. అట పయిని వాక్యార్థము తెలియంబడును. ఆతెలివియే శాబ్దబోధంబనియు, అన్వయబోధంబనియుఁ జెప్పంబడును. అట్టి జ్ఞానము కలుగుటకు ఆకాంక్ష, యోగ్యత, ఆసత్తి, తాత్పర్య జ్ఞానములు సహకారులు.

1. ఏపదము లేనిచో నేపద మన్వయబోధమును బుట్టింపఁజాలదో, ఆపదముతో నాపదముఁ గూడియుండుట ఆకాంక్ష. అనఁగా పదార్థోపస్థితికి పర్యవసానము లేకుండుట. దానిస్వరూపము వినువాని జ్ఞానేచ్ఛ. ఉ॥ "పట్టణమున దొర గలఁడు." అనుచో నాకాంక్ష గలదు. "పట్టణము, దొర, కలుగుట," అనుచో నాకాంక్ష లేదు. నిరాకాంక్షము వాక్యమగునేని "ఆవు, గుఱ్ఱము, పురుషుఁడు, ఏనుఁగు" ఇత్యాదులకును వాక్యత్వము కలుగును.

2. అర్థమునకు బాధ లేకుండుట యోగ్యత యనఁబడు. ఉ॥ "నిప్పుతో తడుపుచున్నాఁడు" అనినచో యోగ్యత లేదు. "నీటితో తడుపుచున్నాఁడు" అన్నచో యోగ్యత గలదు.

3. పదములు సమీపమునం బలికిన నాసత్తి యగును. ఇదియే సన్నిధి. పదముల అవిళంబోచ్చారణ. అది లేనిచో పదార్థోపస్థితి కలుగనందున శాబ్దబోధంబు పుట్టదు. ఉ॥ "పశు

వును—తోలుకొని—రమ్ము.”అని జామున కొక్కొక్కపదంబు జెప్పినచో నాసత్తి (సన్నిధి) కలుగదు.

4. వక్తృబుద్ధియందు నెలకొనియుండి, వాక్యముచేఁ దెలుపఁబడి వాక్యార్థరూపమగు రసాదిభావము తచ్ఛబ్దముచే చెప్పఁబడును. ‘తత్’ ఆరసాదిభావమందు పరులు ఆసక్తులు, తత్పరులు, వారియొక్క భావము, తాత్పర్యమనఁబడును. తాత్పర్యమనఁగా: ప్రయోగించువానితలంపు. అది తెలియక శాబ్దబోధము పుట్టదు. అందుకు పూర్వమందుఁ జెప్పఁబడిన సంయోగవిప్రయోగరూపప్రకరణాదిజ్ఞాన మావశ్యకము. ఉ॥ “భోజనప్రకరణమున సైంధవముం దెమ్మన్నచో” ఉప్పు తేవలయునని తెలియఁబడును కాని, గుఱ్ఱము కాదు. ప్రయాణసన్నాహప్రకరణమున గుఱ్ఱముఁ దేవలయునని తెలియఁబడును గాని, ఉప్పు కాదు. ఒకరిభావము నొకరికిఁ దెలుపుటకు భాషముఖ్యము. భాష, శబ్దమూలకము. శబ్దార్థములకు అవినాభావసంబంధము. శబ్దములేని యర్థమును, అర్థము లేనిశబ్దమునుండదు. మణిని కాంతివలె, పువ్వును తావివలె, చంద్రుని చంద్రికవలె శబ్దము నర్థము నాశ్రయించి యుండును. వాగర్థములు పార్వతీపరమేశ్వరులవలె నవినాభావసంబంధ మయినట్టుల కాళిదాస మహాకవి వర్ణించెను. తనకుఁ దెలిసినది అన్యులకు బోధ యయినదా? లేదా యని? శబ్దార్థశక్తులఁ దెలిసికొని వక్త,వాక్యమును ప్రయోగించవలయును. దానివలన నన్యునకు శాబ్దబోధము (వాక్యార్థజ్ఞానము) కలుగును. కొందఱు తామను

కొనిన (బోధ) భావమునకన్న నధికముగఁ దోఁచునట్లుల శబ్ద శక్తుల తెలియక పదముల నుపయోగింతురు. మఱికొందఱు తామనుకొనినంతభావముఁ దెలుపు శక్తిగలపదముల నుపయోగింపఁజాలరు. అన్యబోధకు హేతువులగు పదార్థముల నుపయోగించుసామర్థ్యము పాండిత్యమువలనఁ గాని కలుగ నేరదు.

అయథార్థానుభవములు.

విపర్యయజ్ఞానము. False Apprehension.

సూ. "విపర్యయో మిథ్యాజ్ఞానమతద్రూపప్రతిష్ఠమ్."

పాతంజలయోగ, ౧ అధ్యా, ౮ సూత్ర.

లేకయుండు వస్తువుయొక్క రూపమునందు, ఆవస్తువు ఉన్నదనెడు మిథ్యాజ్ఞానము విపర్యయవృత్తి యనఁబడును.

ఉదా॥ ముత్తెపుచిప్పను జూచి వెండి యనుకొనుట విపర్యయము. అనఁగా తాను తెలిసికొనినరూపమునందు తాను అనుకొన్నప్రకారము లేకపోయినను, తాననుకొనిన ట్లున్న దని యెంచుకొనునట్టి మిథ్యాజ్ఞానమే విపర్యయవృత్తి. ఇదియే భ్రమ అయథార్థానుభవము: ప్రమాణముచేత అప్రమాణము బాధితమగును. ఎట్లనఁగా: ద్విచంద్రదర్శనము, సద్విషయమగు నేకచంద్రదర్శనముచే బాధింపఁబడుచున్నది. ఇది అవిద్యా రూపకమోహావృత్తి. ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు నిశ్చయించుట విపర్యయజ్ఞానము. అయథార్థనిశ్చయ మనఁబడు.

మఱియు నిల్లే కంబమును చూచి, ఇది కంబమా మనుష్యుఁడా? యని కలిగెడు సంశయజ్ఞానము కూడ విపర్యయ మనఁబడును. విచికిత్స, ఇదియా? అదియా యని నిశ్చయ జ్ఞానము లేక సంశయించుట, Perplexity, Doubt తర్కము? సందేహము, మోహవృత్తి.

వికల్పజ్ఞానము.

సూ. "శబ్దజ్ఞానానుపాతీ వస్తుశూన్యో వికల్పః."

పాతంజలయోగ, ౧ అధ్యా, ౯ సూత్ర.

శబ్దమువలనఁ గలిగిన అర్థజ్ఞానముచేత అనుసరింపఁబడి నప్పటికిని వస్తువు మాత్రము లేక యుండునది వికల్పవృత్తి యనంబడును. (విషయము నపేక్షింపక శబ్దజ్ఞానము (అర్థజ్ఞానము) ననుసరించి కలుగుట వికల్పము.) శబ్దజ్ఞానమునకు విషయమైయుండు వస్తువు సంపూర్ణముగా లేక యుండినను, ఆ వస్తువు సంపూర్ణమై యున్నది యనెడుజ్ఞానము వికల్పజ్ఞానము. ఎట్లన్నను? రాహువుయొక్క శిరస్సు, పురుషునిచైతన్యము మొదలగునవి. ఇచట రాహువుయొక్క శిరస్సు అనునప్పుడు తన ఆకారమంతయు శిరస్సు మాత్రమే అయియుండు రాహువునకు వేఱేశరీరము కలదనేజ్ఞానము పుట్టుచున్నది. పురుషుని చైతన్య మనునప్పుడు, పురుషుఁడు వేఱు (తెలివి) చైతన్యము వేఱు అను భేదమును తెలియఁజేయును. ఇదియే వికల్పజ్ఞానము. ఇచట పురుషుఁడే చైతన్యము ఇట్టులే గగనకుసుమము, శశవిషాణము మొదలగునవి.

నిద్రావృత్తి (సుషుప్తిజ్ఞానము)

సూ. "అభావప్రత్యయాలంబనా వృత్తిర్నిద్రా."

పాతంజలయోగ, ౧ అధ్యా, ౧౦ సూత్రం.

జాగ్రత్స్వప్నావస్థలు లేని జ్ఞానమును ఆశ్రయించి యుండుట నిద్రావృత్తి యనఁబడును. భావమనఁగా విషయము, ప్రత్యయమనఁగా జ్ఞానము. విషయము జ్ఞానము ఏదియును లేక చిత్తమునకుఁ గలిగెడు వృత్తియే నిద్ర. అభావమనఁగా జాగ్రత్స్వప్నములు లేకుండుట, ప్రత్యయమనఁగా కారణము, ఆలంబనమనఁగా విషయము, జాగ్రత్స్వప్నములు లేకపోవుటకు కారణమైన తమోగుణోద్రేకముచేత సమస్తవిషయానుభవములను విడిచియుండు సుషుప్తికాలమే నిద్ర యనఁబడును. సుషుప్తికాలమందు చిత్తవృత్తి లయించియుండి, సుషుప్తి అనంతరము నేను సుఖముగా నిద్రపోయితినని నిద్రావస్థను స్మరించుట కలదు. నిద్రపోనియెడల అట్లు స్మరించుటకు అవకాశము కలుగదు. హాయిగ నిద్రపోయితిని, నామనస్సు నిర్మలముగ నున్నదని స్మరించుటవలన నిద్రకుఁ గూడ వృత్తిత్వము సిద్ధించుచున్నది. సుషుప్తియందు అంతఃకరణాభిమానియగు ప్రాజ్ఞనామక జీవుఁడు,. ఆనందమయకోశమునందు చిదానందుఁడగు పరమాత్మతో తాదాత్మ్యమునుఁ బొంది, పరవశుఁడై యానందముచేఁ జొక్కును. పుణ్యక్షయానంతరము, మఱల జాగ్రదవస్థలోనికి వచ్చి అనుభూతానందమును స్మరించుచుం

డును. ఆనందస్పర్శమువలన, ఇంద్రియములకు మనస్సునకు నైర్మల్యము సుఖంబును గలుగును. సుషుప్తిసుఖముతో సమమయినసుఖంబు లేదని తెలిసికొనుట నిద్రకు వృత్తిత్వమని స్పష్టము.

స్మృతివృత్తి, (జ్ఞాపకశక్తి) Memory.

సూ. "అనుభూత విషయాఽసంప్రమోషస్స్మృతిః."

పాతంజలయోగ, ౧ అధ్యాయ, ౧౧ సూత్ర.

ప్రమాణవృత్తిచే ననుభవింపఁబడిన విషయములు జ్ఞప్తికి వచ్చుటయే స్మృతివృత్తి యనఁబడును.

అనాదిగ ననేకజన్మలయందును, ఈజన్మమునందును ప్రత్యక్షప్రమాణములచే ననుభవింపఁబడిన విషయములు చిత్తమునందు వాసనా (సంస్కార)రూపకమై యుండి, బుద్ధికి నెదురుగా వచ్చుట (బుద్ధియందు నెలకొని యుండుట) స్మృతి యగును. అనఁగా మనమొకపదార్థమును చూచినది మొదలు, మఱచిపోవువఱకు, అది మనచిత్తమున నాటియుండును. ఆ పదార్థమును తలంచవలసినపుడు అది జ్ఞప్తికి వచ్చుటయే స్మృతి, యనఁబడును.

గ్రహణాకారికవృత్తి బుద్ధి, గ్రాహ్యాకారికవృత్తి స్మృతి. పూర్వోక్తములగు వృత్తులయొక్క అనుభవమువలన స్మృతులు కలుగుచుండును. ప్రమాణ, విపర్యయ, వికల్పములను మూఁడు వృత్తులు జాగ్రదవస్థ యనఁబడు. పైమూఁడు వృత్తులలోని

విషయములు, అనుభవబలముచేత చిత్తమందు వాసనారూప ముగనుండి, స్మృతిరూపమై బుద్ధికి గోచరించుటయే స్వప్నావస్థ యనఁబడును. ఈవృత్తులు మూఁడును బుద్ధికి గోచరము కాక యుండుటయే సుషుప్త్యవస్థ (నిద్రావృత్తి) యనఁబడును.

సువర్ణము మూసయందు కఱఁగఁబడి, గాడిలో పోయఁబడి, అందలి ప్రతిమాద్యాకారములనుఁ బొందినట్టుల, బుద్ధిద్రవ్యంబును, ప్రమాణాదివృత్తులుగ పరిణమించుచున్నది. 4-వ పుటయందు వృత్తిస్వరూపము చక్కఁగ వివరింపఁబడినవి, కావున అటఁ జూడఁదగును. అనుభవమువలన సంస్కారమును, సంస్కారమువలన స్మృతియుఁ గలుగుచున్నది. ఈమూఁడును ఆత్మయొక్క ధర్మములై యున్నవని నైయాయికమతము.

స్మృతి కలుగుటకు హేతువులు (ఉద్బోధకములు)

సూ. "ప్రణిధాననిబంధనాభ్యాసలింగలక్షణసాదృశ్యపరిగ్రహాశ్రయాశ్రితసంబంధానంతర్యవియోగైకకార్యవిరోధాతిశయప్రాప్తివ్యవధాన సుఖదుఃఖేచ్ఛాద్వేషభయార్థిత్వక్రియారాగధర్మాధర్మనిమిత్తేభ్యః."

న్యాయదర్శనమ్, 3 అధ్యాయ, ౪౪ సూత్రం.

ప్రణిధానాదులవలన స్మృతి (పూర్వానుభూతవిషయముజ్ఞప్తి) కలుగుచుండును.

1. ప్రణిధానము = స్మరింపఁదగినవిషయేచ్ఛచేత మనోధారణము. స్మరింపఁదగిన దానిహేతువు (గుఱుతు) చింతనము. అర్థస్మృతికారణము. విషయాంతరము లేనిచిత్తము ధ్యానమం దుంచుట ప్రణిధానము.

2. నిబంధము = ఒకగ్రంథమునందలి యర్థములు, అనుపూర్వికసంబంధమువలన అన్యోన్యస్మృతిహేతువులు. ఒకదానియందు గూర్పఁబడినవి. ప్రమాణమువలన ప్రమేయస్మరణము.

3. అభ్యాసము = సమానవిషయమందు జ్ఞాపకార్థమై వర్తించుట. ఉద్బోధమునొఁఅకు దృఢతరసంస్కారము, సంతతాభ్యాసమువలన శీఘ్రముగ జ్ఞప్తికి వచ్చును.

4. లింగము = హేతువు (చిహ్నము) ధూమమువలన అగ్ని, ఆవుకొమ్ము, పాణి పాదమునకు; వ్యాప్యమువలన వ్యాపకము జ్ఞప్తికి వచ్చుట.

5. లక్షణము = కపిధ్వజాదులు అర్జునాదుల స్మరింపఁజేయును. వారివారిచిహ్నములవలన వారు జ్ఞప్తికివత్తురు.

6. సాదృశ్యము = చిత్రగతమగు ప్రతిరూపము, దేవదత్తాదిమిత్రులను స్మరింపఁజేయును. కొన్ని ప్రతిబింబరూపములు చూచినపుడు జ్ఞప్తికి వత్తురు.

7. పరిగ్రహము = స్వీకరించినవస్తువువలన, తానుగాని ఇచ్చినవాఁడుగాని జ్ఞప్తికి వచ్చును. ఒకదానిచేత మఱియొకటి జ్ఞప్తి.

8. ఆశ్రయము = అధీశ్వరుఁడగు రాజాదులచేత తదధీనులగు పరిజనులు జ్ఞప్తికి వత్తురు.

9. ఆశ్రితులు = పరిజనులవలన అధీశ్వరులగు రాజాదులు స్మరింపఁబడుదురు.

10. సంబంధము = గురువు శిష్యునిచేత, యజ్ఞము ఋత్విక్కునిచేత స్మరింపఁబడును. ఇట పరస్పరసంబంధము.

11. ఆనంతర్యము = చేయఁదగిన కృత్యములయందు, ఆవశ్యకకరణీయములయందు.

12. వియోగము = దారాపుత్రాదుల నెడఁబాయుటవలన, వియుక్తమయినవిషయమును గూర్చి మిగుల స్మరించుట.

13. ఏకకార్యము = కర్త్రంతరదర్శనమువలన మఱియొక కర్తయందు స్మృతి కలుగుట శిష్యులు లోనగువారు పరస్పరము స్మరింపఁ దగినవారు.

14. విరోధము = పాము ముంగిస లోండోరులలో నొకరిచే నొకరిస్మరణము. జయింప నిచ్ఛగలవారిలో నొకరిదర్శనమువలన మఱియొకరిస్మరణము.

15. అతిశయము = ఉపనయనాదులవలన ఆచార్యాదిసత్కారము జ్ఞప్తికి వచ్చుట.

16. ప్రాప్తి = తనకు ప్రాప్తించిన ధనాదులవలన దాతను స్మరించుట.

17. వ్యవధానము = ఒర మొదలగువానివలన (కోశాదుల) కత్తులను ఆయుధములను స్మరించుట.

18. సుఖదుఃఖములు = వీనిలో నొకదానికి హేతువగుదానిచే, మఱియొకదానిని స్మరించుట, సుఖముచే దుఃఖముగాని, దుఃఖముచే సుఖముగాని, తత్ప్రయోజనమును జ్ఞప్తిఁ జేసికొనుట.

19. ఇచ్ఛాద్వేషములు = ఇచ్ఛచే ప్రేమించినవానిని, ద్వేషముచే ద్వేషించినవానిని స్మరించుట.

20. భయము = దేనివలన భీతి కలుగునో, అట్టి జరామరణాదిహేతువులను స్మరించుట.

21. అర్థిత్వము = భోజనము, వస్త్రము లోనగువాని నిచ్చిన దాతృస్మరణము.

22. క్రియ = రథమును జూచి రథకారుని స్మరించుట, శాఖాదిచలనమునకు వాయ్వాదులను స్మరించుట.

23. రాగ = ప్రీతివలన పుత్రాదులను, అనురాగమువలన కాంతాదులను స్మరించుట.

24. ధర్మము = ధర్మమువలన జన్మాంతరసుఖము, జాత్యంతరస్మరణము, అధీతవేదవిద్యాధారణము లోనగునవి స్మరించుట.

25. అధర్మము = అధర్మమువలన జన్మాంతరమం దనుభవించిన దుఃఖాదులను, తత్సాధనములను స్మరించుట.

పైనఁ జెప్పఁబడిన ఇరువదియైదును స్మృతిహేతువులు, వీని నాధారముఁ జేసికొని పూర్వానుభూతవిషయములు జ్ఞప్తికి వచ్చుచుండును.—

స్మృతి (Memorising) ధారణ (Retention) జ్ఞప్తికిఁ దెచ్చుకొనుట (Recall) ప్రత్యభిజ్ఞానము (Recognition) ఈ నాల్గింటివలన స్మృతి కలుగును. అనుభూతవిషయమును స్మరించుట, స్మరించినవిషయమందు విషయాంతరము లేని మనోధారణము, ధారణవిషయమును జ్ఞప్తికిఁ దెచ్చుకొనుట, జ్ఞప్తికి వచ్చినవిషయమును అది యిదియేనని (గుర్తుపట్టుట) సమ్మతించుట. స్మృతి బుద్ధిశక్తులలో నొకటి. జ్ఞాపకశక్తి మేధాశాలిత్వమును దెలియఁజేయును. వయఃకాలమునందు బుద్ధిబలము

చక్కఁగా నుండుటవలన జ్ఞాపకశక్తి యుండును. వార్ధకము నందు బుద్ధిబలము తగ్గుటవలన జ్ఞాపకశక్తి లేక, మఱపు కలుగు చుండును. తెలిసిన బంధుమిత్రులపేళ్లుగాని వారిగ్రామాదులు గాని కొన్నిసమయములందు జ్ఞప్తికి రాఁజాలవు. కొంత ప్రయత్నించి మనోధారణముఁ గావించిన జ్ఞప్తికివచ్చును. బాల్యము నందు బాలురకు ధారణాశక్తి హెచ్చుగా నుండును. గ్రహణశక్తి తక్కువగా నుండును. వయస్సుమించినవారికి, పైదానికి వ్యతిరేకముగ గ్రహణశక్తి (Apprehension) హెచ్చుగను, ధారణాశక్తి(Retentiveness) తక్కువగ నుండును. బాల్యము నందు అనఁగా బ్రహ్మచర్యమునందు విషయాసక్తి తక్కువనై వృత్త్యంతరములు లేని బుద్ధియందు కావ్యశాస్త్రపఠనము, శ్లోకములు, సూత్రములు వల్లించుటంజేసి ధారణాశక్తిచే దృఢతర సంస్కారము కలుగును. వయోధికులయినను మఱపు కలుగదు. అయితే వారికి ఆకావ్యశాస్త్రములలోని సూక్ష్మాతిసూక్ష్మవిషయములు సారస్వార్థములు గ్రహించునంతటి గ్రహణశక్తి తక్కువగా నుండును. వయోఽధికులు కష్టపడి పఠించినను, విని నను బహువిషయాసక్తు లగుటంజేసి సాంసారికక్లేశములవలన ఏకాగ్రతలేని బుద్ధియందు ధారణ సేయఁజాలరు. కాని అందలి సూక్ష్మాతిసూక్ష్మ విషయములను, సారస్వార్థములను లోకానుభవముఁ గలిగియుండుటవలన నెక్కువగా గ్రహింపఁ జాలుదురు.

బుద్ధివృత్తులు.

శ్లో. "శుశ్రూషా శ్రవణం చైవ గ్రహణం ధారణం తథా,
ఊహాపోహోఽర్థవిజ్ఞానం తత్త్వజ్ఞానం చ ధీగుణాః."

విచారణేచ్ఛ (ఆసక్తి) శ్రద్ధాపూర్వకముగ వినుట, వినిన దానిని గ్రహించుట, గ్రహించినదానిని బుద్ధియందు నిలుపుకొనుట, తర్కించుట, సంశయత్యాగము, అర్థవిషయకజ్ఞానము (నిశ్చయము) యథార్థమునుఁ దెలిసికొనుట (తత్త్వజ్ఞానము) ఇయ్యేడును బుద్ధివృత్తులు.

శ్లో. "ఇష్టానిష్టవిపత్తిశ్చ వ్యవసాయస్సమాధితా,
సంశయః ప్రతిపత్తిశ్చ బుద్ధేః పంచగుణా స్మృతాః."

1. ప్రియాప్రియరూపవృత్తివిశేషముయొక్క నాశము, అనఁగా నిద్రావృత్తి, 2. నిశ్చయవృత్తి (ఉత్సాహము), 3. చిత్తైకాగ్రవృత్తి, 4. విపర్యయవృత్తి, 5. ప్రమాణవృత్తి, ఈయైదును బుద్ధివృత్తులు.

ప్రజ్ఞ. (Intution)

శ్లో. "స్మృతిర్వ్యతీతవిషయా మతిరాగామిగోచరా,
బుద్ధిస్తాత్కాలికీ జ్ఞేయా ప్రజ్ఞా త్రైకాలికీ మతా."

1. గతించిన (అనుభూత) విషయములనుఁ దెలుపునది స్మృతి యనియు, రాఁబోవువిషయములఁ దెలుపునది మతి యనియు, అప్పటివిషయములను గమనించి తెలిసికొనునది బుద్ధి

యనియు, త్రికాలవిషయంబులఁ దెలిసికొనునది ప్రజ్ఞ యనియుఁ జెప్పఁబడును.

2. అనుభూతవిషయములను జ్ఞప్తికిఁ దెచ్చుకొనుట కనేక మార్గములు గలవు. ఒక గొడుగునుగాని, పుస్తకముఁగాని ఏదేనొకవస్తువు నెచటనో మఱచి దానివిషయమై జ్ఞప్తి చేసికొనుటకు మొదట తానెక్కడ బయలువెడలినది, యెచట నెచట నిలిచి యెవరెవరితో మాటాడినది, యేకాగ్రచిత్తముతో నాలోచించుకొలఁది తాను ఫలానిచోట మఱచి వచ్చినట్లు జ్ఞప్తికి వచ్చును. అంత నచేటికి వెళ్లి ఆవస్తువు తనదియే యని గుర్తించి గ్రహించుట (Recognise) ప్రత్యభిజ్ఞానమనఁబడును. తాళపుచెవులు, నోట్లు,మూల్యమగు కాగితములు, ఏదేనొకవిషయాంతరముగల చిత్తవృత్తితో గమనము లేక యుంచటనో యొకచోటఁ బెట్టి మఱచి సంకటపడినవార లనేకులు గలరు. ఇది ముఖ్యమయిన వస్తువు. జాగ్రతతో (జ్ఞప్తితో)నుంచవలెనని వారికప్పుడు తోఁచేదు. వారు మిగుల శ్రమపడి యాలోచింపగా కొంతసేపటికి స్ఫురించును. విస్మృతి వలన మనస్సంకోచము, భీతియు, దైన్యము కలుగును. స్మృతి వలన మనోవికాసము, నిర్భయము, ధైర్యము కలుగును. స్మృతి సాత్త్వికగుణములలోఁ జేరినది. విస్మృతి తామసగుణములలో జేరినది. మఱచినవస్తువు జ్ఞప్తికి వచ్చినంతట సంతోషించి యటుపిమ్మట నెప్పటికిని అజాగ్రత లేక జ్ఞప్తితో కొన్నిగుర్తులుంచుకొని వస్తువును దాఁచిపెట్టును. ఒకటిరెండు అనుభవ

ములవలనఁగాని నిశ్చితబుద్ధి (వివేకము) కలుగదు. దృఢతర సంస్కారము బుద్ధియందు లేక జ్ఞప్తికి రాలేదు. అదిమొదలు దృఢతరసంస్కారము చేయుటవలన జ్ఞాపకశక్తి అతిశయించును.

3. వివాహాదివిషయములు జరిగినపుడు అచటఁ గలిగిన మర్యాదలు, బంధుసందర్శనము లోనగునవియు, మహాసభలు జరిగినపుడు అచటఁ గలిగిన సన్మానములు, మిత్రజనగోష్ఠిలోనగు నవియు జ్ఞప్తికివచ్చి స్మృతిసంతాన మవిచ్ఛిన్నముగనుండి సుఖముసుఁ గలిగించును. పుత్రకళత్రబంధువియోగము కలిగినంతట వారిగుణములు, ప్రేమాదులు జ్ఞప్తికివచ్చి స్మృతిపరంపరలచే దుఃఖ మతిశయించును. దుఃఖమును, భయమును, క్లేశములనుఁ గలిగించు స్మృతులను తలంపునకు తేఁగూడదు. మనస్సు సంతోషమును, నిర్భయమును, నిర్మలమును గలిగియున్నపుడు జ్ఞాపకశక్తి చేక్కగానుండును. ఒకతీగెను పట్టిలాగిన దాని ననుసరించిన తీగెలన్నియు కదలి వచ్చినట్టుల ఒకవిషయమును జ్ఞప్తికిఁ దెచ్చుటకు ధారణచేయగా దాని ననుసరించి యనేక విషయములు గలస్మృతులు బయలుదేరును. స్వప్నమునం దనుభవించిన విషయము కొంతవఱకు జ్ఞప్తికివచ్చి పిమ్మట రాదు. దాని నప్పుడు (అనువ్యవసాయము) దృఢముగ భావించిన సంస్కారమేర్పడి జ్ఞప్తికివచ్చును. దృఢతరభావనలవలన మేదస్సునందు పరమసూక్ష్మములగు చాళ్లలో రేఖలుగ గుర్తులు పడి, మఱల తలంచినపుడు రక్తము ప్రసరించి స్మృతులు ఉద్బోధకములగునని శారీరశాస్త్రజ్ఞులు నుడివెదరు.

అవధానత. Attention.

అవధాన మనఁగా మనస్సు విషయాంతరములఁ జెందక యేకాగ్రవృత్తినిఁ బొందుట. ఇది బుద్ధిగుణములలో (శక్తులు) నొకటి. ఏకాగ్రవృత్తినిఁ బొందిన చిత్తమునందు గ్రహణధారణలు నెలకొనును. విద్యార్థులుగాని, శ్రోతలుగాని, గమనముతో (Attention) వినినయెడల చెప్పఁబడిన విషయములు బుద్ధిస్థము లగును. సంస్కారముఁ బొందినందున తిరుగ చెప్పఁగలుగుదురు. అటుగానిచో చెప్పఁజాలరు చుఱుకుఁదనము గలవారు ప్రతివిషయమునందును జాగ్రతతో నుందురు. అలసులుగా నుండువారికి జాగ్రత తక్కువ. దీనినే విశేషావస్థలో నున్నపుడు శ్రద్ధ యందురు. తనకు ప్రియము కానట్టియు, క్లిష్టములగు విషయములందు మనస్సునకు శ్రద్ధ యుండదు. ప్రియమయినట్టియు సుఖవయినట్టి విషయములందు శ్రద్ధ యుండును. రమ్యమును సుఖోపభోగములయినట్టి విషయముల సాధనయందు ప్రతివానికిని జాగ్రత శ్రద్ధ యుండును. శ్రేయోదాయకంబులగు విషయములయెడ శ్రద్ధ లేనందున, శ్రద్ధాళువు కాఁడని యనుకొనుచున్నారు కాని, తదితరవిషయములయెడ శ్రద్ధకలిగియే యుండును. జాగ్రత,గమనము,శ్రద్ధ, అవధానత ఇవి క్రమముగ నుత్తరోత్తరము బలీయములు.

2. సహజముగ జాగ్రతకలవారు కొందఱు, ప్రయత్నముగ జాగ్రతను (శ్రద్ధను) అభివృద్ధిఁ జేసికొనువారు మఱి

కొందఱు. ఏయేవిషయమునందు మనస్సు శ్రద్ధఁ గలిగియుండునో, తద్విషయకగ్రహణధారణలు మనస్సునకుఁ గలిగియుండును. కొందఱు అష్టావధానులు, శతావధానులు, అద్భుత ప్రజ్ఞ కలిగి, ప్రేక్షకులగు రసజ్ఞుల నానందాబ్ధి నోలలాడింతురు. చదురంగము, పేకాట, ఆకాశపురాణము, గంటలు కొట్టుట, సమస్యాపూరణము, సంఖ్యాకథనము, కవిత్వము, నిషేధాక్షరి లోనగునవి ప్రేక్షకులగు సదస్యులు అప్పుడప్పు డడుగుదురు. జ్ఞాపకశక్తిని, ధారణను తప్పించేవలయునని పలువిధముల పరీక్షింతురు. మేలిమిబంగార మెన్ని శోధనలకును వన్నె తఱుగనట్లు, ఎన్ని విషమపరీక్షలకును నెగ్గి అవధానమును జయప్రదముఁ గావించుకొనును వివిధవిషయములందు మనస్సు బహు జాగ్రతతో నుండి, గ్రహించి ధారణఁ జేసికొనవలయును. గ్రహణశక్తిలో పొరఁబాటు గలిగిన ధారణాశక్తిలో నజాగ్రత కలిగిన నవధానమంతయు చెడిపోవును. ప్రతివిషయమును గ్రహించి ధారణఁజేయునపు డేదేనొక గుఱుతు నుంచుకొనును. ఆగుఱుతులు సాంకేతికములు. మఱపునకు రాఁగూడదు. పృచ్ఛకులు తామడిగిన యొక్కొక్కవిషయమునందే తమకు సామర్థ్యముఁ జాలదని యనుకొనుచున్నప్పు డిందఱి ప్రజ్ఞాసామర్థ్యము లొక్కఁడు నిర్వహించుట అద్భుతవిషయము. శ్లో. "బుద్ధిర్బుద్ధిమతామస్మి" యను గీతావాక్యప్రకారము ప్రజ్ఞావంతులలోని ప్రజ్ఞ భగవద్విభూతి యగుచున్నది. ఒక విషయమునుండి మఱియొక విషయము మీఁదికి మనస్సు మఱ

లించినపుడు దృఢతరసంస్కారపుసాంకేతికములు కలుగుచుం డును. సంతతాభ్యాసమువలన బుద్ధి పరిశ్రమమువలన నిట్టి యద్భుతశక్తి కలుగును. యతిప్రాసస్థానములు జ్ఞాపకశక్తికి సహాకారులుగ నుండును. సర్కసు మొదలగువ్యాయామము లందు తీగెమీఁద సైకిలుతో నాటాడుచు నాశ్చర్యకరకార్యము లొనరించుట శారీరకము. అవధానము మానసికము.

మానము. Self-respect or Honor.

మానమనఁగా ఇతరులచే పూజింపఁబడుట, దీనిచే చిత్తము, ఉన్నతత్వమునుఁ జెందును. "మానశ్చిత్తసమున్నతి" యని అమరకోశమునఁ గలదు. "మత్సమో నాస్తీతి మననం మానః" నాతో సముఁడు లేఁడని యనుకొనుట మానమని వ్యుత్పత్త్యర్థము.

శ్లో. "విత్తం బంధుర్వయః కర్మ విద్యా భవతి పంచమీ,
ఏతాని మానస్థానాని గరీయో యద్యదుత్తరమ్."
మనుస్మృతి, 2 అధ్యాయ, 136 శ్లోక.

ధనము, బాంధవ్యము, (ఆభిజాత్యము, కులము) వయస్సు, అధికారము (జీవనవృత్తి) విద్యాధిక్యత ఈలోకంబున నీయైదు మానస్థానము లనఁబడును. అనఁగా పూజింపఁబడును. ధనమునకన్న కులము, కులమునకన్న వయస్సు, వయస్సునకన్న అధికారము, అధికారమునకన్న విద్యాధిక్యత (జ్ఞానము) ఒకదానికన్న నొకటి శ్రేష్ఠమయినందున గౌరవింపఁ బడుచున్నవి.

1. సామాన్యముగ ప్రతిమానవుఁడును జ్ఞాతిబంధుమిత్ర జనమధ్యమందు పూజ్యతను,రాజసన్మానమును, కీర్తినిఁ బడయ వలెనని కోరుచుండును. ఎల్లఱలో నే నధికుఁడను, పూజ్యుఁడను అనుకొనుట మాన మనఁబడును. లోకోపకారక కార్యాచరణమువలనను, సత్యశౌచసదాచార శీలాదులవలనను మాన్యత యేర్పడును. మాన్యులను మహాజనసభలయందును, రాజసభలయందును, మణిరత్నభూషణాంబర స్వర్ణపదకాదుల చేతను, వినతిపత్త్రబిరుదములచేతను సన్మానింతురు. ఈసన్మానమువలన సర్వోత్కృష్టుఁడను నాకన్న పూజ్యుఁ డొరుఁడు లేఁడను అతిమానిత్వమనుగర్వ మేర్పడుననియు, నిది మోక్షప్రతిబంధకమని భగవద్గీతా 16-వ అధ్యాయము దైవీసంపత్తు కడపట "అద్రోహో నాఽతిమానితా" ఈ అతిమానిత్వమును ముముక్షువు శ్రేయస్కాముఁడు విడువవలెననియుఁ జెప్పఁబడినది. నే నధికుఁడను, పూజ్యుఁడనను మానిత్వమును, జ్ఞానప్రతిబంధకమని 13-వ అధ్యాయమునఁ జెప్పఁబడినది.

2. కాఁబట్టి శ్రేయస్కాముఁడు సన్మానముఁ గలుగుచున్నపుడు, ఈశ్వరవిభూతులగు సద్గుణములకుఁ గలిగినదనియు, తనకుఁ గాదనియుఁ దలఁచి గర్వింపఁగూడదు. గర్వింపక యెల్లఱతో ననుకూలముగ నుండి, స్నేహభావమును వినయభావమునుఁ జూపినచో నితఁడు సత్కులసంభవుఁడు, యోగ్యుఁడు నిగర్వియని యభినందింతురు. సన్మానముఁ గలిగినపుడు కొందఱు స్తుతించుటవలన మోదమును, కొంద ఱసూ

యాగ్రస్తులు నిందించుటవలన ఖేదమును గలుగును. ఈసమ్మానము తనకుఁ గాదు, ఈశ్వరగుణములకని తలఁచి గర్వింపకున్నచో మోదఖేదములచే వికారముఁ జెందఁడు. గర్వించినచో హర్షవిషాదములు, రాగద్వేషములు కలుగును.

౩. మానముయొక్క దృఢావస్థ అభిమానము అనఁగా ఆసక్తి పట్టుదలతోఁ గూడినప్రేమ, ఇది వ్యావహారికప్రపంచమున ముఖ్యము. దేశాభిమానము, కులాభిమానము, మతాభిమానము, భాషాభిమానము, ఈయభిమానము లేనివాఁడు నిష్ప్రయోజకుఁడు వ్యర్థుఁడనియుఁ దలఁతురు. ఇతరులకన్న తమదియే యధికమని గర్వించుట ఇందలి ముఖ్యోద్దేశ్యము.

అభిమానము అహంకారముయొక్క రూపము. అభిమానమును మానమును విడిచినవాఁడు ఈ వ్యావహారిక ప్రపంచమునకుఁ బనికిరాకపోయినను పారమార్థికప్రపంచమున ముఖ్యుఁడు. ప్రవృత్తిమార్గప్రవర్తకులకు అభిమానము, మానములేక యేకార్యమును జరుగదు. అభిమానము, మానమును (అహంకారమును) విడిచినవాఁడే నివృత్తిమార్గప్రవర్తకుఁడగుజ్ఞాని యగును. అహంకారము: లోపల నేననెడు అభిమానము (Iness); మమకారము: వెలుపల నాది యనెడు అభిమానము (Myness). ఈ రెండును బంధమునకుఁ గారణములు. ఈ రెండింటిని విడిచినవాఁడు ముక్తుఁడగును. ఈసృష్టియందు అహంకారమును విడుచుటకు బ్రహ్మాదిదేవతలకును సాధ్యమ

కాదు. శ్రీపరమేశ్వరు ననుగ్రహామువలన సమ్యగ్జ్ఞాననిష్ఠుఁడగు బ్రహ్మవేత్తకు విడిచిపోవును.

శ్లో. "న వై మానం చ మౌనం చ సహితౌ వసతస్సదా,
అయం హి లోకో మానస్య హ్యసౌ మౌనస్య తద్విదః."
సనత్సుజాతీయము, ౨ అధ్యా, ౪౨ శ్లోకము.

శ్లో. "అన్నాంగనాది భోగేషు భావో మాన ఇతి స్మృతః,
బ్రహ్మానందసుఖప్రాప్తిహేతు ర్మౌన ఇతి స్మృతః."
హైరణ్యగర్భే.

గృహక్షేత్రవిత్తకళత్రాదిభోగములయం దభిమానమును, అధికుఁడను, పూజ్యుఁడనను నభిమానమును మానమనఁబడును. అది యీలోకమునకు ముఖ్యము. బ్రహ్మానందసుఖప్రాప్తికి హేతువయినది మౌనము. ఇది పరలోకమునకు ముఖ్యము. ఈలోకమున మానవిషయముల నాశ్రయించుటవలన ఐశ్వర్యము, అధికారము, ధనము, కీర్తి, పూజ్యతలోనగునవి కలుగును. అయితే శ్రేయోమార్గప్రతిబంధకము. బ్రహ్మానందపదవినిఁ బొందఁజాలఁడు.

4. మౌనవ్రతుఁడగు బ్రహ్మవేత్తయందలి శమదమ ఘహిమాదులఁ జూచి, సత్పురుషులు స్తుతించినచో నిది వారి స్వభావమనియు, దుర్జనులు నిందించినచో నిదియు వారి స్వభావమనియుఁ దలఁచి, మానావమానములకు హర్షవిషాదములఁ జెందరు. మహిమాదులఁ జూపి మాటాడినచో జనులు

స్సానింతురనియు, దానివలన గర్వముఁ గలుగుననియు, భయ పడి బ్రహ్మవిదులగు జ్ఞానులు మౌనవ్రతము నవలంబింతురు.

శ్లో. "సమ్మానాద్బ్రాహ్మణో నిత్యముద్విజేత విషాదివ,
అవమానస్య చా కాంక్షే దవమంతా వినశ్యతి."

మనుస్మృతి.

జనసమ్మానమువలన బ్రహ్మవేత్త విషమునుఁ జూచి భయ పడినట్లు భయపడును, అవమానమునే కోరును. నింద గలిగి నపుడు తితిక్ష లభించినదా? లేదా? యని చూచుకొనును. అవమానించినవాఁడు నశించును.

శ్లో. "తుల్యనిందాస్తుతిర్మౌనీ సంతుష్టో యేన కేనచిత్,
అనికేతః స్థిరమతిర్భక్తిమాన్ మే ప్రియో నరః."

భగవద్గీత, ౧౨ అ, ౧౯ శ్లోకం.

ఎవనికి నిందాస్తుతులు సమానమో, ఎవఁడు మిత భాషియో, ప్రాప్తమగుదానిచేత నెవఁడు సంతుష్టుఁడో, స్థిరమగు చిత్తముగలవాఁ డగుటచే అనికేతుఁడో, అట్టి భక్తుఁడు నాకు ప్రియుఁడని భగవంతునిచేఁ జెప్పఁబడినది. దీనింబట్టి బ్రహ్మవేత్తయగు సన్న్యాసికి మానావమానములు సమానములనియు, సమ్మానమువలన భయపడుననియు స్పష్ట మగుచున్నది.

వ్యావహారికప్రపంచమందలి మానము.

ఈ వ్యావహారికప్రపంచమునందు మానము ప్రధా నము. ప్రతిమానవుఁడును పరువు ప్రతిష్ఠలకై పాటుపడును.

మానహీనుఁడు జీవన్మృత తుల్యుఁడుగ నెన్నఁబడును. మానము (పరువు) పోయినతర్వాత ధనముతోఁగాని, జీవితముతోఁగాని ప్రయోజనమేమని మానవంతులు (ఆత్మగౌరవము) (Self-respect) మానమును కాపాడుకొనియెదరు. మానమునకు భంగము కావించినవారిమీఁద అభియోగము జరిపించి, జరిమానా వేయించి నష్టపరిహారమును పుచ్చుకొనియెదరు. మహాజనసభలోఁ గాని, స్వజనమధ్యమందుగాని, మానవంతున కవమానము సంభవించెనేని మరణమునకన్న నధికమని గీతాశాస్త్రమునందుఁ జెప్పఁబడియె. మానవంతులు తమకెన్ని యిక్కట్టులు వచ్చినను క్షుద్రుల నాశ్రయింపక శీలమును, ఆత్మగౌరవమును కాపాడుకొనియెదరు. కుసుమస్తబకము ఎల్లఱ శిరస్సులనయిన నధిరోహించును; లేక మ్రగ్గిపోవును గాని మధ్యమావస్థ యుండనటుల మానవంతుఁడు ఎల్లఱచేఁ బూజింపఁబడును. లేదా ? నశించును గాని నీచస్థితినిఁ బొందఁజాలఁడు.

శ్లో. "ప్రాణమేవ పరిత్యజ్య మానమేవాభిరక్షయేత్."

మానహానికన్న ప్రాణహాని మేలని, మానమునుఁ గాపాడుకొనియెదరు.

శ్లో. "అధమా ధనమిచ్ఛంతి ధనమానౌ హి మధ్యమాః,
ఉత్తమా మానమిచ్ఛంతి మానో హి మహతాం ధనం.

అధమా కలిమిచ్ఛంతి సంధిమిచ్ఛంతి మధ్యమాః,
ఉత్తమా మానమిచ్ఛంతి మానో హి మహతాం ధనం."

గారుడే, ౧౧౪ అధ్యాయం.

5. అధములు ధనమునుఁ గోరెదరు. తన్నిమిత్తము కలహములు బెట్టుకొనియెదరు. మధ్యములు ధనమును, గౌరవమునుఁ గోరెదరు. సంధిఁ గావించుకొనియెదరు. ఉత్తములు మానమును (గౌరవము) కోరెదరు. మహనీయులకు మానమే ధనము. వారిశీలము, సౌజన్యము, సత్యసంధత, వైదుష్యము, భూతదయ, సామర్థ్యము లోనగునవి లోకమాన్యతకు హేతువులు. వీనిచే ఆత్మగౌరవమును కాపాడుకొనియెదరు. లోకులు ఉత్తములగు మహనీయులనుఁ బూజింతురు. అధములు శీల సౌజన్య సత్యసంధతాదు లెట్లు పోయినను, తమకు ధనమే ప్రధానమని ఉత్తములతో లేనిపోని కలహములు పెట్టుకొని, అల్లరికిఁ బ్రారంభించు మానహీనులు: ఉత్తములు ఈనీచులతోడ సంబంధముఁ గూడదని ధనాదులనైన వదలుకొని గౌరవమునుఁ గాపాడుకొనియెదరు. మధ్యములు కేవల గౌరవమునుఁ జూచినట్లయితే జీవితమున కాధారమగు ధనము లభింపదనియు, కేవలము ధనమే చూచినట్లయితే అధముల వలె మానహీనుల మగుదుమనియుఁ దలఁతురు. కాఁబట్టి ధనమును, గౌరవమును రెండింటినిఁ గోరి, వ్యవహారములసంధిఁ (రాజీ) గావించుకొనియెదరు.

శ్లో. "విద్యాతపోవిత్త వపుర్వయఃకులై
స్సతాం గుణైష్షడ్భిరసత్తమేతరైః,
స్మృతౌ హతాయాం భృతమానదుర్దృశ
స్తధానపశ్యంతి హి ధామ భూయసాం."

శ్రీభాగవత, 4 స్కంధ, 3 అధ్యాయం.

విద్య, తపస్సు, ధనము, రూపము, వయస్సు, కులము వీని నాశ్రయించి ఉత్తములగు సజ్జనులు సద్వినియోగముచే మాన్యు లగుచున్నవారలు. పైనఁజెప్పిన విద్యాదుల నాశ్రయించి, అధములగు నీచులు దుర్వినియోగముచే గర్వితు లగుచున్నవారలు. అట్టిగర్వితులు దురహంకారపూరితులై మదాంధులై మదితప్పి మహనీయుల తేజస్సును కనుఁగొనఁ జాలక యున్నారని పరమేశ్వరుఁడు సతీదేవితో దక్షాధ్వరము నకుఁ బోవునపుడు చెప్పెను. విద్యాతపోధనాదులు మహదాశ్రయంబున మానమనియు, నీచాశ్రయంబున గర్వమనియుఁ జెప్పఁబడును.

శ్లో. "తృణాదపి సు నీచేన తరోరివ సహిష్ణునా,
అమానినా మానదేన కీర్తనీయస్సదా హరిః."

6. తా నెంత గొప్పవాఁ డయినను గడ్డిపోచకన్న నీచుఁ డనుకొనవలయును. చెట్టు, గాలికి ఎండకు వానకు సోఁకుకొని తనకొమ్మను కొట్టువానిపైని ఆగ్రహపడక నీడను, పండ్లను ఇచ్చినట్లే భక్తుఁడును, ఓర్పుగలిగి తనకు

మహోపకారముచేసినవానికిని ఉపకారము చేయవలయును. తన కెంత సన్మానము పూజ్యతయుఁ గలిగినను, గర్వింపక తృణము వలె నమ్రత్వమును వృక్షముఁబోలె సహిష్ణుతనుఁ బొంది, మాన్యులగు మహనీయులను, ధనప్రశస్త్యాభరణాంబరము లచేతను, నతులచేతను, నుతులచేతను, సన్మానింపవలయు. అట్టి సత్పురుషుఁడే శ్రీహరిని కీర్తించుచుండును. ఈ విషయ ముఁనే "అమానీ మానదః కల్య" యనుశ్లోకముచే శ్రీకృష్ణ భగవానుఁడు భాగవతోత్తముని లక్షణమును ఉద్ధవునకుఁ జెప్పెను.

ఇతరులను గౌరవించి, తాను గౌరవమునుఁ బడయ వలయు. ఇది ఉత్తములగు సజ్జనులలక్షణము. పారమార్థిక చింతలోనుండి, మానాదుల గమనింపనివానికి మది తప్పినదనియు, (Balance) తుల్యత తొలఁగినదనియు చెప్పెదరు కాఁబట్టి మానవిషయమున బహుజాగ్రతతో నుండవల యును.

గొప్పవారికి వినతిపత్త్రములు వీడ్కోలుసమయమున సమర్పించునపుడు వారు దానికిఁ బ్రత్యుత్తర మిచ్చుచు నిందుఁ జేర్కొనఁబడిన సుగుణములు తమకు లేవనియు, ఏవేనియున్న పరమేశ్వరుసంబంధ మయినవనియు, నిట్టి ఘనకార్యము లొనరించుటకు మిముబోఁటివారిసహకారము సానుభూతియే కార ణమనియు, ఇట్టి కార్యము లొనరించుటకు తానొక ఉపకరణ మనియు, నిట్టి సద్గుణములు కలుగునట్లు అలవఱచుకొనునట్లు

ఆశీర్వదింపుఁడనియు, మీయందఱ సోదరులలో నొక్కఁడ ననియుఁ జెప్పి తనన మ్రతను నిగర్వత్వమునుఁ జూపును. ఇట్లు చూపుట చేతనే వారు మహనీయులయిరి.

సుఖదుఃఖతత్త్వవివేచనము. Pain and Pleasure. Happy and Unhappy.

1. సత్త్వరజస్తమోగుణములవలన సుఖదుఃఖమోహ వృత్తులు లేక శాంతఘోరమూఢవృత్తులు కలుగునని యిది వఱలోఁ జెప్పఁబడెను. లోకములో ప్రతిప్రాణియు సుఖమునుఁ గోరుటయు, దుఃఖమును ద్వేషించుటయు సహజమై యున్నది. సుఖమనఁగా నేమి యని విచారించితిమేని, సు=లెస్స, ఖం= ఇంద్రియము. ఇంద్రియములకు లెస్స యనఁగ అనుకూల్యము, ఏజ్ఞానము (వేదన) ఇంద్రియముల కనుకూలమో ప్రీతిని ఆనందమునుఁ గలిగించునదియో అది సుఖమనియు, ఏజ్ఞానము (వేదన) ఇంద్రియములకు ప్రతికూలమో, బాధను వ్యథనుఁ గలిగించునదియో అది దుఃఖమనియు నెల్లఱకు ననుభవైక వేద్యము.

2. ఈ సుఖదుఃఖములు అనేక జన్మములనుండి అనుభూతము లగుటవలన చిత్తమునందు సంస్కారరూపముగ వాసనలయి యుండును.

ఈసుఖదుఃఖములు సామాన్యముగ 1 అధిదైవికములు, 2 అధిభౌతికములు, 3 ఆధ్యాత్మికములని మూఁడువిధములుగ విభజింపఁబడినవి.

చెప్పుటవలన, ఒకప్పుడు సుఖముగ నుండునది, మఱియొకపుడు దుఃఖముగను, కొండొకకాలమున దుఃఖముగ నుండునది. వేఱొకకాలమున సుఖముగ నుండును. వినశ్వరము లగుట వలన నిజమయిన సుఖదుఃఖములు కాఁజాలవు.

సుఖతత్త్వవివేచనము. Happiness.

ఒకసుఖ మనుభవించుచున్నపుడు ఈసుఖ మెప్పటికి తగ్గిపోఁగూడదనియు, నిట్టిసుఖమే కావలయునని కోరుట రాగ మనఁబడును. సుఖముల నెక్కువ యనుభవించుకొలఁది రాగ మధికమై తృష్ణ యనఁబడు నొకవ్యాధి కలుగును. ఈ తృష్ణావ్యాధి కుపశమనముగా నెన్నిసుఖంబు లనుభవించినను, ఆవ్యాధి యుపశమింపదు. అగ్నియందు కట్టెలు వైచుకొలఁది అగ్ని ప్రజ్వలించునట్టుల తృష్ణయు సుఖోపభోగములవలన నతిశయించును గాని క్షయింపదు.

శ్లో. "యచ్చ కామసుఖం లోకే యచ్చ దివ్యం మహత్సుఖం,
తృష్ణాక్షయసుఖస్యై తే నార్హతష్షోడశీం కలాం."

మహాభారత, శాంతి, ౧౭౪ అ. ౪౮ శ్లోకం.

ఇహలోకములో కామముయొక్క తృప్తిచే నావిర్భూతమగు సుఖంబుగాని, స్వర్గమునం దనుభవించు మహాసుఖంబుగాని, తృష్ణాక్షయముచే లభించు సుఖముయొక్క పదియాఱవభాగముతో సమముగాదని చెప్పుటవలన, విషయోపభోగంబువలనఁ గలుగుసుఖము తృష్ణవలన దుఃఖముగ

పరిణమించును. గాని నిజమయిన సుఖము గాదు. దురద గలిగి (కండూతి) బరికినకొలఁది అప్పుడు సుఖముగ నుండును; పిమ్మట ఎంతదుఃఖము గలుగునది యనుభవైకవేద్యము.

4. ఎల్లప్పుడును ఎడతెగకుండ సుఖముల ననుభవించు వానికి సుఖముయొక్క రుచి తెలియదు. దుఃఖముల ననుభవించినతర్వాత సుఖము కొంచెమయినను సుఖపురుచి తెలియును. ఎట్టులనఁగా: నీడలో నెల్లప్పుడు నుండువానికి నీడయొక్క సుఖము తెలియక దుస్సహమగు ఎండలో తాపముఁ జెంది వచ్చినవానికి నీడయొక్కసుఖము తెలియును. ఈ ద్వైత ప్రపంచమున నొకటియే యుండదు. ద్వంద్వంబులు ఒకదాని వెంబడి మఱియొకటి వచ్చుచుండును. శుక్లపక్షముతర్వాత కృష్ణపక్షము, కృష్ణపక్షము తర్వాత శుక్లపక్షము, కాలచక్రమున తిరిగివచ్చుచున్నట్లు సంసారచక్రమునను సుఖదుఃఖములు జననమరణములు పరిభ్రమించుచుండును.

శ్లో. "సుఖమాపతితం సేవేత్ దుఃఖ మాపతితం తథా,
చక్రవత్పరివర్తంతే దుఃఖాని చ సుఖాని చ.
సుఖస్యానంతరం దుఃఖం దుఃఖస్యానంతరం సుఖమ్."

మహాభారత, శాంతిపర్వ. ౨౫-౨౩.

శ్లో. "కస్యైకాంతం సుఖముపనతం దుఃఖమేకాంతతో వా,
నీచైర్గచ్ఛత్యుపరి చ దశా చక్రనేమిక్రమేణ."

మేఘసందేశ, ౧-౧౪.

చక్రాకారముగ తిరిగివచ్చుచుండు సుఖదుఃఖములలో సుఖము వచ్చినపుడు సుఖమును, దుఃఖము వచ్చినపుడు దుఃఖమును, దేహి అనుభవించి తీరవలయును. ఎవనికిఁగాని యెల్లప్పుడును సుఖముఁగాని దుఃఖముగాని యుండదు. చక్రనేమి (అంచు)వలె నొకప్పుడు సుఖ మనుభవించినవారు క్రిందికి రావలయును. దుఃఖ మనుభవించినవారు మీఁదికి రావలయును. లోకమున సౌఖ్యవంతులు దుఃఖవంతులుగను, దుఃఖవంతులు సౌఖ్యవంతులుగను, పర్యాయముగ మారుచుందురని భావము.

1. **ధర్మమువలన పుణ్యకర్మాచరణము – సుఖఫలము.**
   అధర్మమువలన పాపకర్మాచరణము – దుఃఖఫలము.

జీవుఁడు మున్నొనరించిన పుణ్యపాపకర్మలవలన సుఖదుఃఖముల ననుభవించుచుండు. వృక్షంబున ఋతుకాలానుగుణ్యముగ ఫలము లుద్భవించునటుల దేహంబునను కాలానుగుణ్యముగ కర్మ పరిపక్వమై సుఖదుఃఖఫలములు కలుగుచుండ జీవుఁ డనుభవించుచుండును. ఇతరుఁడు సుఖదుఃఖములఁ గలిగించుచున్నాఁ డనుకొనుట వెఱ్ఱితనము.

శ్లో. "సుఖస్య దుఃఖస్య న కోఽపి దాతా
పరో దదాతీతి కుబుద్ధి రేషా,
స్వయంకృతం స్వేన ఫలేన యుజ్యతే
శరీర హే నిస్తర యత్త్వయాకృతం."

గారుడే.

జీవుఁడు యమునిసన్నిధినిఁ జెప్పుచున్నాఁడు. "ఓ శరీరమా ? సుఖదుఃఖముల నితరుఁడు గలిగించినాఁ డనుకొనుట వెఱ్ఱితనము. ఎవఁడేని తాను జేసికొనిన కర్మానుగుణ్యఫలము తా ననుభవించి తీరవలయును. ఇపుడు నీవు చేసికొనిన కర్మఫలమును నీ వనుభవింపుము." కాఁబట్టి యేకాలమునం దేకర్మఫలము వచ్చునో దాని ననుభవింపవలయును.

శ్లో. "అప్రార్థితాని దుఃఖాని యథైవాయాంతి దేహినాం,
సుఖాని చ తథా మన్యే దైన్యమత్రాతిరిచ్యతే."

మహాభారత. శాంతిపర్వ.

జీవులకు కోరకుండ దుఃఖము లేవిధమున ప్రాప్తించినవో, సుఖములును అవ్విధముననే ప్రాప్తించును. సుఖములకై ప్రయత్నించుట దీనత్వము. ధీరుఁ డన్నవో చీకటిపోయినంతట వెన్నెలవచ్చి తీరవలయును. అట్టుల దుఃఖానంతరము సుఖము వచ్చి తీరుననియు, ఋతువు కానికాలమందు పండుపుట్టునా యనియుఁ దలఁచి ధైర్య మవలంబించి యుండును.

(6) దారి నడచినడచి శ్రమపడు బాటసారికి బండిచిక్కి యెక్కినచో సంతోషముచే సుఖము కలుగును. బండియెక్కి పోవువానికి మోటారుకారు చిక్కినయెడల, ఒడలు అదరక బడలిక లేకపోవుటచే సంతోషము కలుగును. మోటారుకారు ఎక్కి పోవువానికి వాయువిమానము చిక్కిన మిగుల సంతోషించును. సంతోషమువలన సుఖము కలుగును. అసంతోషమువలన దుఃఖము గలుగును. బండి యెక్కినవాఁడు పూర్వము

గలిగిన మార్గశ్రమము తొలఁగినదని సంతోషింపక మోటారు కారు కోరుటయు, నతఁడు వాయువిమానమును గోరుటయు, దీనివలన తృప్తిలేక అసంతోషము కలుగును. దాని కంతము ఉండదు. తనకుఁ గలిగినదానితో తృప్తిఁజెంది సంతోషించి నచో సుఖము కలుగుననియు నీక్రిందిశ్లోకమునఁ జెప్పఁబడినది.

శ్లో. "అసంతోషస్య నాస్త్యంత స్తుష్టిస్తు పరమం సుఖం".

మహాభారత-వనపర్వ, ౨౧౫-౨౨.

శ్లో. "అధోఽధః పశ్యతః కస్య మహిమా నోపచీయతే,
ఉపర్యుపరి పశ్యంత స్సర్వ ఏవ దరిద్రతి."

మహాభారత. శాంతిపర్వ.

ఈ సుఖదుఃఖములు మనోభావనలచే నేర్పడును. ఇవి మానసికములు. ఎట్లనఁగా: తనకన్న తక్కువవారినిఁ జూచి, వారికన్న తనకు సుఖసాధనములు గృహక్షేత్రవిత్త పుత్రకళత్రాదులు దైవానుగ్రహమువలనఁ గలిగినందున, తా నధికుఁడ నని తలఁచువానికి సంతోషమును సుఖమును గలుగును. తన కన్న నధికులనుఁ జూచి, వారి భాగ్యైశ్వర్యాధికారములు, సుఖోపభోగములు తనకు లేవని చింతించువానికి, అసంతోష మును దుఃఖమును గలుగును. దీనిచే నెంతకలవాఁ డయినను తనకన్న నధికులనుఁ జూచి తనకు లేదని దుఃఖించుచుండును. కలిగినదానితోడ తృప్తిఁ జెంది, తనకన్న తక్కువవారినిఁ జూచి వారికంటె నధికము తనకుఁ గలదనియు, నింతమాత్ర మును వారికిలేదని తలఁచిన వాఁడు సుఖించుచుండును. ఈ సుఖదుఃఖములు ఆత్మాధీనము లైయున్నవి.

శ్లో. "సర్వం పరవశం దుఃఖం సర్వ మాత్మవశం సుఖమ్,
ఏతద్విద్యాత్సమాసేన లక్షణం సుఖదుఃఖయోః."

మనుస్మృతి.

పరవశంబున నున్న దంతయు దుఃఖమనియు, తనవశంబున నున్న దంతయు సుఖమనియు, సుఖదుఃఖములకు లక్షణము చెప్పఁబడెను. పరకీయములగు పుత్రకళత్రాదివిషయములవలన సుఖమనినచో వారు ప్రతికూలురను, విముఖులు నయినయెడల దుఃఖమే కదా ? పరాధీనమందు లేక స్వాధీనమం దుండినది యనఁగా మనస్సునందు భావితమగునది సుఖమని సుఖరహస్యమును మనువు విశదీకరించెను.

శ్లో. "మనసి చ పరితుష్టే కోఽర్థవాన్ కో దరిద్రః."

భర్తృహరి.

మనస్సు సంతుష్టిఁ (తృప్తి) జెందినయెడల, ధనవంతుఁ డెవఁడు ? దరిద్రుఁ డెవఁడు ? ఎల్లరు సమానులని భర్తృహరి వక్కాణించెను. దీనివలన సంతోషము సుఖమనియు, అది కలవాఁడే భాగ్యవంతుఁ డనియు, అసంతోషము దుఃఖమనియు, అదికలవాఁడే దరిద్రుఁడనియు తాత్పర్యము.

శ్లో. "సంతోషామృతతృప్తానాం యత్సుఖం శాంతచేతసాం,
కుతస్తద్ధనలుబ్ధానా మితశ్చేతశ్చ ధావతాం.
పీయూషమివ సంతోషం పిబతాం నిర్వృతిః పరా,
దుఃఖం నిరంతరం పుంసా మసంతోషవతాం పునః."

మహాభారత శాంతిపర్వ.

సంతోషామృతపానతృప్తులగు శాంతాత్ముల కెట్టిసుఖము కలదో, అట్టి పరమసుఖము ధనపిశాచికాగ్రస్తులై యిటునటు పరుగిడు ధనలుబ్ధుల కెన్నఁటికయినా కలుగునా? కలుగనేరదు. వారికి మనస్సంతుష్టి లేకుండుటంబట్టియె.సంతోషామృతపానము చేసినవారికి పరమసుఖము గలుగుననియు, అసంతుష్టాత్ములకు ఎడతెగనిదుఃఖము కలుగుచుండుననియు తాత్పర్యము.

(7) ఇహలోకమున శారీరకసౌఖ్యమగు ఆరోగ్య ముండవలయును. ఆరోగ్యము చేకూఁగలేనిచో మనస్సునకు వికాసము కలుగదు. మనోవికాసము లేక ఆత్మ ప్రకాశింపదు. ఇంతకుమున్ను చెప్పఁబడినది. (Mental) మానసిక సౌఖ్యము. ఇఁకను ఆత్మీయ (Spiritual) సౌఖ్యమునుగూర్చి విచారింపవలెను.

శ్లో. "సుఖమాత్యంతికం యత్తద్బుద్ధిగ్రాహ్యమతీంద్రియం,
వేత్తి యత్ర న చైవాయం స్థితశ్చలతి తత్త్వతః.
యం లబ్ధ్వా చాపరం లాభం మన్యతే నాఽధికం తతః,
యస్మిం స్థితో న దుఃఖే న గురుణాఽపి విచాల్యతే."

భగవద్గీతా, 6 అధ్యాయ, 21, 22 శ్లోకములు.

ఆత్మ నిష్ఠమయినబుద్ధియొక్క ప్రసన్నతచేఁ బ్రాప్త మగునదియు, ఇంద్రియములకు గోచరము కానిదియునగు నీ పరమసుఖానుభవ మొకసారి యగునేని, పిదప నెంత గొప్ప దుఃఖము వచ్చినను, ఈస్థితిలోనుండి చలింపఁజాలఁడో, ఇంత కన్న నధికమగులాభము (పురుషార్థము) మఱియొకటి లేదని తలఁచుచున్నాఁడో, అట్టి నిరతిశయసుఖమునకై పురుషుఁడు

ప్రయత్నించవలయును. బాహ్యవిషయములతోడ నింద్రియములకుఁ గలుగు శారీరక లేక బాహ్యములగు సుఖములు (Pleasures) క్షణికములును, వినశ్వరములును, వికారములును, దుఃఖజనకములు నగును. ఇంద్రియముల కగోచరంబును నిర్మలబుద్ధి గ్రాహ్యంబునగు సుఖము ఆత్యంతికసుఖమనియు, పరమసుఖమనియు, ఆనందమనియు, శాంతి సుఖమనియు (Eternal Happiness or Bliss) చెప్పఁబడును.

ఈసుఖము సాత్త్విక రాజస తామసములని మూఁడు విధములు.

శ్లో. "యత్తదగ్రే విషమివ పరిణామేఽమృతోపమమ్,
తత్సుఖం సాత్త్వికం ప్రోక్త మాత్మబుద్ధిప్రసాదజం.
విషయేంద్రియసంయోగా ద్యత్తదగ్రేఽమృతోపమం,
పరిణామే విషమివ తత్సుఖం రాజసం స్మృతం.
యదగ్రే చానుబంధే చ సుఖం మోహన మాత్మనః,
నిద్రాలస్యప్రమాదోత్థం తత్తామస ముదాహృతం."
భగవద్గీత, 18 అధ్యాయం.

(1) ప్రారంభమున విషముతో సమానముగ నుండి, పరిణామంబున అమృతతుల్యంబును, ఆత్మనిష్ఠమగు బుద్ధియొక్క ప్రసన్నతచేఁ గలుగునది సాత్త్వికసుఖము (ఆధ్యాత్మికము) శ్రేష్ఠమయినది.

(2) ఇంద్రియములయొక్కయు, వాని విషయములయొక్కయు, కలయికనుండి కలిగినదియు, మొదట నమృతము

వలెనున్నను పరిణామంబున విషమువలె నుండునదియు నగు సుఖము రాజసము (ఆధిభౌతికము) మధ్యమము.

(3) ఆరంభమందును, పరిణామమందును, తనకు మోహముఁ గలుగఁజేయునదియు నిద్ర, అలసత్వము, ప్రమాదము (కర్తవ్యమును మఱచుట) ననువానివలనఁ గలుగు సుఖము తామసము. కనిష్ఠమయినది.

దుఃఖతత్త్వవివేచనము. (Pain Grieb Sorrow.)

ఆధ్యాత్మికములు, ఆధిభౌతికములు, ఆధిదైవికములని దుఃఖములు మూఁడువిధములు. ఈ త్రివిధదుఃఖనివృత్తియే పరమపురుషార్థము, మోక్షమని, యీ దిగువ సూత్రముచే సాంఖ్యశాస్త్రమునఁ జెప్పఁబడినది.

సూ. "త్రివిధదుఃఖాత్యంతనివృత్తిరత్యంతపురుషార్థః."

సాంఖ్యశాస్త్ర. ౧ అధ్యాయ. ౧ సూత్ర.

అత్యంతనివృత్తి యనఁగా? తాత్కాలికముగ సుఖముచే దుఃఖము నివర్తించి మఱల కలుగుచుండును. అట్లు కలుగక సమూలముగ నశింపఁజేయుట, భూతకాలికదుఃఖములు గతించినవి. వర్తమానకాలికదుఃఖము లనుభవించుచున్నను భావికాలికదుఃఖములు రాకుండ జ్ఞానముచే నశింపఁజేయుట.

1. ఆధ్యాత్మికదుఃఖములు = శారీరకములు, మానసికములు అని ద్వివిధము. వాతపిత్తశ్లేష్మముల హెచ్చుతగ్గులవలన తన శరీరేంద్రి

యములకుఁ గలిగెడి తలనొప్పి, శ్వాసకాస, క్షయ, మూత్రకృచ్ఛ్ర జ్వరాతిసారాదులవలన సంభవించుబాధలును, అంధత్వ బధిరత్వ మూకత్వాదులును, శారీరకము లనఁబడును. కామ క్రోధ లోభ మోహ భయేర్ష్యావమానాది విషయములవలనఁ గలుగువ్యథలు మానసికము లనఁబడును. వీనికి ఆధులని పేరు. ఈరెండును అంతరోపాయసాధ్యత్వము లగుటచే ఆధ్యాత్మికము లనఁబడును.

2. ఆధిభౌతికదుఃఖములు = సర్ప వృశ్చిక వ్యాఘ్ర సింహాది క్రూర జంతువులవలనను, ఇతర పశుపక్ష్యాదులవలననుఁ గలిగెడిబాధలును, చోరకిరాతాదిమనుష్యులవలనను, దారపుత్త్రమిత్రాదులకు సంభవించు వ్యాధులవలన తనకుఁ గలుగుబాధలును ఆధిభౌతికము లనఁబడును.

3. ఆధిదైవికదుఃఖములు = అతివృష్టి, అనావృష్టి, అత్యాతపవాత భూకంప అశనిపాత భూతప్రేతపిశాచ యక్షరాక్షస వినాయక గ్రహావేశములు లోనగు దైవకృతములగు ఉత్పాతములు కలుగునపుడు సంభవించుదుఃఖములు ఆధిదైవికము లనఁబడు. పైనఁ జెప్పఁబడిన రెండును బాహ్యోపాయసాధ్యత్వము లగుటచే బాహ్యము లనఁబడును. ఇవియే తాపత్రయములనియుఁ జెప్పఁబడు.

మరియు నీదుఃఖములు పాతంజలయోగశాస్త్రప్రకారము పరిణామతాప సంస్కారములచే మూఁడువిధములు.

1. పరిణామదుఃఖము - అనఁగా: తా ననుభవించుచున్న విషయసుఖము ముగిసిపోవుటవలనఁ గలుగుదుఃఖము. మఱియుఁ దానిని తిరిగి సంపాదించుటకుఁ గలుగుదుఃఖము.

2. తాపదుఃఖము = తా ననుభవించుచున్నట్టి విషయసుఖమునకు విరోధియైనది పోలేదనెడు దుఃఖము.

3. సంస్కారదుఃఖము = అనఁగా: తనకిష్టమయిన పదార్థముతోఁ గూడ, అయిష్టమయినపదార్థ ముండుటవలనఁ గలుగుదుఃఖము.

పైనిఁ జెప్పఁబడిన దుఃఖములను నివర్తింపఁ జేసికొనుటయే వివేకిలక్షణము. సంసారమునందు సుఖోపభోగములు కోరుట యనఁగా దుఃఖములఁ బొందుటయే యని భావము. వ్యాధునిచే వికీర్ణములయిన తండులములు, అమిషాదులనుఁ జూచి ఆహారమని భ్రాంతిఁ జెంది వలలోఁ జిక్కుపడిన పశుపక్ష్యాదులవలె కాలపురుషునిచే నిర్మితములగు భోగములందు జీవులు తగుల్కొని దుఃఖము లనుభవించెదరని మహాభారత శాంతిపర్వమునఁ జెప్పఁబడినది.

శ్లో. "సుఖాద్బహుతరం దుఃఖం జీవితే నాస్తి సంశయః,
స్నిగ్ధత్వం చేంద్రియార్థేషు మోహా న్మరణమప్రియమ్."

మ-భా. శాంతిపర్వ, 330 అధ్యాయ. ౧౬ శ్లోకం.

ఈ జీవితమునందు (సంసారము) సుఖముకంటె దుఃఖమే యధికముగ నున్నదనియు, సుఖ మావగింజంత, దుఃఖము పర్వతమంత యనియు, సుఖసంజ్ఞితములగు నింద్రియవిషయములందు స్నిగ్ధత్వమే దుఃఖకారణమనియు, మహనీయులు దెలిపిరి. పయోముఖవిషకుంభములవలెఁ జూపట్టు సుఖసంజ్ఞిక దుఃఖములకై ప్రయత్నింపఁ గూడదనియు, నట్టిదుఃఖములు గలిగించుకర్మల నాచరింపఁ గూడదనియు నొక్కి వక్కాణించిరి.

ప్రవృత్తిమార్గప్రవర్తకుఁడు దుఃఖములననుభవించుననుట.

సర్వసంగపరిత్యాగియు, నివృత్తిమార్గప్రవర్తకుఁడు నగు సంయమీంద్రుఁడు విషయసుఖముల విడిచిన విడువఁగలఁడు గాని, ప్రవృత్తిమార్గప్రవర్తకుఁడు కర్మనిష్ఠుఁడు విషయసుఖముల నెట్లు విడువఁగలఁడని ప్రశ్నించినచో ? లోకయాత్రాపరుఁడు, సామాన్యమానవుఁడు, గృహస్థుఁడు ఇంద్రియవిషయముల విడువఁజాలఁడు ; దారాపుత్రాదిపోషణకై ధన మార్జింపవలయును. ధనమువలన నైహికసుఖములును, దానధర్మములవలన పారలౌకికసుఖములును, పరోపకారక కార్యములవలన పుణ్యములను, యశంబునుఁ బడయును గాని ఇంద్రియవిషయసుఖంబు లెప్పుడును దుఃఖములుగ పరిణమించుటంజేసి స్థిరములయినసుఖములు గావనియు, విషమిశ్రితస్వాద్వన్నమువలె దుఃఖమిశ్రితములనియు, వీనియందు సక్తుఁడు గాక పథ్యాన్నమువలెఁ దెలిసి దేహధారణకై మితముగ ననుభవించవలెననియుఁ బెద్దలు దెలిపిరి. కాని సంసారమునందు నిజమయినసుఖములు లేవనియు, వైరాగ్యము కలుగువఱకు ననుభవించుచుండుననియు, ప్రజ్ఞావంతుఁడు బుద్ధిబలముచే సుఖము లనుభవించుచున్నను, సక్తత లేమింజేసి దుఃఖితుఁడు కాఁడనియు, కర్మయోగి ఫలత్యాగముచే నంతఃకరణశుద్ధినిఁ బొందుచున్నాఁడనియు, ననేకవిధముల తత్త్వశాస్త్రములయందు బోధించిరి.

శ్లో. "రాగద్వేషవియుక్తైస్తు విషయానింద్రియైశ్చరన్,
ఆత్మవశ్యైర్విధేయాత్మా ప్రసాదమధిగచ్ఛతి."
భగవద్గీతా. ౨ అధ్యాయ, ౬౪ శ్లోకము.

శ్లో. "వసన్ విషయమధ్యేఽపి న వసత్యేవ బుద్ధిమాన్,
సంవసత్యేవ దుర్బుద్ధి రసత్సు విషయేష్వపి.
నాధర్మ శ్లిష్యతే ప్రాజ్ఞం పయః పుష్కరపర్ణవత్,
అప్రాజ్ఞ మధికం పాపం శ్లిష్యతే జతుకాష్ఠవత్."
మహాభారత, శాంతిపర్వ. అ. ౨౯౯.

శ్లో. "ప్రాయేణ చ గృహస్థస్య మమత్వం నామ జాయతే,
సంగాగతం నరశ్రేష్ఠ భావై రాజస తామసైః."
మ. భా. శాంతి, అ. ౨౯౬.

శారీరకవ్యాధి దుఃఖోపశమనము.

శారీరకదుఃఖములు వ్యాధులు పూర్వజన్మకృతకర్మవలనఁ గాని, యిప్పటి కర్మవలనఁ గాని కలిగినవి. అయ్యవి సిద్ధౌషధముల చేతను, చికిత్సల చేతను, పోఁగొట్టఁ దగినవి. శ్వాసకాసము చేతను, రాజయక్ష్మ చేతను,జ్వరాతిసారముల చేతను, గుహ్యస్థానీయవ్యాధుల చేతను బాధపడుచు, ఆహారేచ్ఛ లేక కృశించుచు దుఃఖములననుభవించువారు, ఆరోగ్యము గలవారు మహాభాగ్యవంతులనియు, నట్టి యారోగ్యమును దుష్కర్మలచే పాడుఁ జేసికొంటిమనియు పరితాపముఁ జెందుదురు. ఈ వ్యాధులన్నియు పాపకర్మవలనఁ గలిగి దుఃఖముల ననుభవించుచుంటిమని వివేకముఁ దెచ్చుకొని, యిఁకను దుష్కర్మలఁ జేయ

కుండుటకై దైవముచేఁ బంపఁబడిన దూతలనియుఁ దెలిసి ప్రారబ్ధమగుదుఃఖముల ననుభవింతురు. ఇఁకమీఁద దుఃఖముఁ గలుగునట్టి దుష్కృతముల నాచరింపవలదని యంతరాత్మ తెలుపును.

శ్లో. "సర్వాణి కర్మాణి పురాకృతాని
శుభాశుభాన్యాత్మనో యాంతి జంతోః,
ఉపస్థితం కర్మఫలం విదిత్వా
బుద్ధిం తథా చోదయతేఽంతరాత్మా."

మహాభారత. శాంతిపర్వ. అ ౩౦౮.

శ్లో. "ప్రజ్ఞయా మానసం దుఃఖం హన్యా చ్ఛారీరమౌషధైః,
ఏత ద్విజ్ఞాన సామర్థ్యం న బాలైః సమతామియాత్."

మహాభారత. శాంతిపర్వ. అ ౩౦౧.

మానసదుఃఖములు ప్రజ్ఞాబలముచేఁ బోఁగొట్టుకొన వలయును. శారీరదుఃఖములు ఔషధములచేఁ బోఁగొట్టుకొన వలయును. ప్రజ్ఞాసామర్థ్యము లేనిచో నవి వేకిత్వమునుఁ బొందును.

ఆధిభౌతికములు, ఆధిదైవికములు నగుదుఃఖములు బోఁగొట్టుటకు ముందు వానికి హేతువులగు కిరాత చోర సర్పవృశ్చికక్రూరసత్త్వములవలనఁ గలుగు భయమును గూర్చి విచారింపఁ దగును.

భయము: Fear.

1. భయము, దీనివలన మనస్సునకు విక్షోభము, చాంచల్యము, నిశ్చేష్టత గలుగును. మనస్సుగల మానవులకే కాక,

పశుపక్షి సరీసృపకీటకాది నిఖిలప్రాణివర్గమును, తమప్రాణమున కేదేని అపాయము గలుగునని భీతిల్లుచు నాక్రందనధ్వనులు గావించుచుండును. ఆహారనిద్రామైథునములువలె భయమును సకలప్రాణులకు స్వాభావికము. వ్యాధులు (కిరాతులు) హంత కులనుఁ జూచినపుడు శునకములు, మృగములు, పక్షులు, ఆక్రందనధ్వనులు చేయుచుండుటచే వానికేదేని భీతికలిగినదని మన. మూహింపవచ్చును.

ఆకస్మికభయమువలనఁ గలుగు మనోవిక్షోభము త్రాస మనఁబడును. మనోవిక్షోభము, ఉత్కటము, అనుత్కటమని ద్వివిధము. ఉత్కటము (భయము) భయానకరసమునకు స్థాయీభావము. ఇది ఉత్కటావస్థయందుఁ గలుగును.

అనుత్కటము = పూర్వాపరవిచారమువలనఁ గలిగి నది భీతియనియు, ఆకస్మికముగఁ గలిగినది త్రాసమనియు ద్వివి ధము. ఉఱుము, పిడుగుపాటు, భూకంపము మొదలగువాని వలనఁ గలిగినది త్రాస మనఁబడు. ఆధిదైవిక దుఃఖములలోఁ జేరినది. సర్పవృశ్చికవ్యాఘ్రాది క్రూరసత్త్వదర్శనమువలనను, చోరకిరాత శాత్రవద్వేషివర్గమువలననుఁ గలిగినది భీతియ నియుఁ జెప్పఁబడును. ఆధిభౌతికదుఃఖములలోఁ జేరినది. ఇంత కంటె నుత్కటమయినది మహాభీతి. అత్యాహిత మనఁబడు. మృత్యు యమఘోరాకృతిదర్శనమువలనఁ గలిగినది.

2. దుఃఖమువలన భయము కలుగునా ? భయము వలన దుఃఖము కలుగునా? యని విచారించునెడల, ఒకదాని వలన మఱియొకటి పరస్పరము కలుగుచున్నటుల అనుభవము

వలనఁ దెలియుచున్నది? ఎట్లనగా: జరామృత్యువులు రాఁబోవు చున్నవనియు, ఉద్యోగభంగము రాజదండనము మహాధన నష్టము కలుగఁబోవుచున్నవనియు ననెడు భయమువలన దుఃఖము కలుగును. ఇతరులదుఃఖములఁ జూచికాని, తా నిది వఱలో ననుభవించిన మహాకష్టములుకాని, తనకు మఱల వచ్చునేమో యని భయము కలుగును. ఇట్లు భయమువలన దుఃఖమును, దుఃఖమువలన భయమునుఁ గలుగుచుండును. భయము గలిగినపుడు నోటిమాట రాదు. నిశ్చేష్టత, వడఁకుట, చెమర్చుట, స్తబ్ధత లోనగునవి కలుగును. తుపాను కొట్టి నపుడు చెట్లు చేమలు తీఁగెలు విఱిగి కల్లోలమయినట్టుల భయమువలన అంతస్సంక్షోభము గలిగి జ్ఞాననాడులు, చలన నాడులు, సూక్ష్మతంతువులు, చెల్లాచెదరై వైకల్యముఁ జెందును. రక్తప్రసార ముండదు. శరీరములో గొప్పమార్పు కలుగును. మనోభీతికలవారి నాడులయందు వైద్యులకు దోషము వ్యాధి స్ఫురింపదు. శరీరము నాశ్రయించి మనస్సును, మనస్సు నాధా రముఁ జేసికొని శరీరమును, పరస్పరసహకారమున స్వీయ కార్యముల నిర్వర్తించుచుండును. మనోభీతి కలవారు ఆహా రము స్వీకరింపక కృశించి ధాతునష్టమునుఁ బొంది, తుదకు మృత్యువుపాలగుదురు. ఈభీతి దేనివలనఁ గలిగినది కనుఁగొని తత్త్వజ్ఞులు ప్రజ్ఞాబలముచే చికిత్సఁ గావించి పోఁగొట్టెదరు.

భయనివారణోపాయము.

3. రజోగుణజన్యము దుఃఖము, తమోగుణజన్యము భయము, దుఃఖమునందు వివేకము వేదన యుండునుగాని,

భయమునందు అజ్ఞానము, మోహ ముండును. ఒకఁడు దారిని వచ్చుచుఁ బోవుచుండిన నల్లత్రాఁచును రాతితోఁ గొట్టినఁగాని, కఱ్ఱతోఁ గొట్టినఁగాని, అది తప్పించుకొని పోయి పగఁబట్టి సాధించునేమో యని మహాభీతి కలుగును. ఎక్కడ చప్పుడైన, ఏది కదలినా పాము అని ఉలికిపడును. ఈభీతిచే నేమియుఁ దోఁచేదు. ఆహారము రుచింపదు. నిదుర పట్టదు. ఇఁకను మృత్యువు తప్పదని కృశించుచు క్రుంగిపోవుచుండును. దీని కౌషధము గరుడమంత్రముఁ దెలిసిన మహామాంత్రికుఁడు వచ్చి, ఆసర్పము ఈతనిజోలికి రాకుండ ఆనకట్టినఁగాని లేక యంత్ర మొసఁగికాని ఆసర్పమును రప్పించి పాములవాని కప్పగించి వానికిఁ గొంత యిప్పించికాని వానిభీతినిఁ బోఁగొట్టును. రాహువుచే విడువఁబడిన చంద్రునివలె దైన్యము వీడి కళాపూర్ణుఁడై ఆహారము స్వీకరించి లోకవ్యవహారము లొనరించును. ఇంటిలో పామున్నను, చూచినను మహాభీతిచే నిదురపట్టదు. దీనికిని పూర్వోక్తప్రకారము చికిత్సఁ గావించేవలెను. వ్యాఘ్రసింహాదిదర్శనమువలనఁ గలిగినదానిని ఉపాయముచే తప్పించుకొనవలయును. చోర కిరాతాదులవలనఁ గలుగుభీతిని వారితో ద్వేషింపక యించుక త్యాగ మొనరింపవలయును. ఋణదాతలసొమ్ము నెగవేసినపుడు వారు కోర్టు మూలముగా (Arrest warrent) సేవకులు వచ్చి, తనను నిర్బంధింతురని భీతిలుచుండును. శత్రువునుఁ జూచినపుడు అభియోగముఁ దెచ్చి ధనము నపహరించునేమో? లేక క్రూరులనుఁ బంపించి కొట్టించునేమో యని భీతినిఁ జెందుచుండును. ఇట్టిసందర్భముల ద్వేషభావము విడిచి, సద్భావముతో వారల

సంధించి, సమాధానపఱచుకొనుటవలన భీతితొలఁగి మనశ్శాంతి కలుగును.

4. కామక్రోధలోభములు భయమునకు హేతువులు. పరధనదారాపహారణముఁ గావించుటవలన వారేమి యొన రింతురో యని స్త్రీమూలక కామజనితభయంబును నీచులగు వారిని బాధించి ద్వేషించినందున వారేమిచేయుదురో యని క్రోధమూలకభయంబును, దానధర్మము లొనరింపక యితరుల సొత్తుల నపహరించి కూడఁబెట్టుటవలన రాజులు చోరు లపహ రింతురేమో యని లోభమూలకభయంబును గలుగుచుండును. తాను లోకోపద్రవకార్యము లొనరించుటవలన తనవలన లోకము భయపడును. జనసంఘము తిరుగఁబడి తనకేమి యుప ద్రవముఁ గావించునో యని లోకులవలన తాను భయపడును.

శ్లో. "యస్మా న్నోద్విజతే లోకో లోకా న్నోద్విజతే చ యః,
హర్షామర్షభయోద్వేగై ర్ముక్తో యస్సచ మే ప్రియః.
భగవద్గీతా, ౧౨ అధ్యా. ౧౫ శ్లోకం.

ఎవనివలన లోకము భయపడదో, లోకమువలన నెవఁడు భయపడఁడో, ఇష్టలాభముచేఁ గలుగుహర్షము, ఇష్ట ప్రతిఘాతమువలనను పరోత్కర్షను సహింపని అమర్షమును, వ్యాఘ్రసర్పచోరాదులవలనఁ గలుగుభయము, చిత్తవ్యాకుల తారూపమగు ఉద్వేగము, వీనిని, విడిచిన మద్భక్తుఁడు నాకు ప్రియుఁడని భగవానుఁడు చెప్పుటవలన భక్తుఁ డగుయోగి అహింసావ్రతుఁ డనియు, ఏప్రాణిని ద్వేషింపఁ డనియు,

ద్వేషింపనివాఁ డెవరితచేతను భయముఁ జెందడనియు, నిర్భయుఁడనియు స్పష్టముగఁ దెలియుచున్నది.

సర్వభూతహితరతులును, అహింసావ్రతపరులు' నగు మహర్షుల శాంతాశ్రమములందు మూషికమార్జాలములును, గజసింహములును, నకుల భుజంగములును, వ్యాఘ్రమేషములును, పరస్పరజాతివైరము గలవియయ్యు అమ్మహనీయుల ప్రశాంతతేజస్సుచే వైరము లేక భయమువీడి స్వేచ్ఛగా సంచరించుచుండునని యితిహాసములందుఁ జెప్పఁబడినందున తపస్సంపన్నులగు మహనీయులు సర్వత్ర ఆత్మసందర్శనముఁ గలవారగుటచే నంతటనాత్మ యొకటియే యని ప్రేమింతురు కాని ద్వేషింపరు. దానం జేసి నిర్భయులుగా నుందురు.

5. అవిద్య, అస్మిత, 'రాగ, ద్వేష, అభినివేశములను పంచక్లేశములలో అభినివేశమను క్లేశము జ్ఞానులకును, అజ్ఞానులకును, సకల ప్రాణులకును, అనాదినుండి యుండుననియు' పూర్వజన్మములం దనుభవించిన మరణ, ధననష్ట,బంధువియోగ' సర్పవ్యాఘ్ర చోరాదులవలనఁ గలిగినదుఃఖము, వాసనారూపముగ నుండి యీజన్మమునందు వానినిఁ జూచినపుడు స్మరించినపుడు ద్వేషమును, భయమును గలుగుననియు, అపరిహార్యములనియు, ఈభయము అనాదిగ వచ్చుచున్నదనియు పాతంజలయోగశాస్త్రమునందుఁ జెప్పఁబడినది.

భయముఁ గలుగుటకు హేతువులు.

భయములన్నియు ముఖ్యముగా ప్రాణ, మాన, ధనములకు సంబంధించి యుండును. సర్పవృశ్చిక వ్యాఘ్రాదిక్రూర

స త్త్వసందర్శనమువలన ప్రాణహాని కలుగునని భీతియు, కిరాత చోర, కున్నృపతి లోనగువారివలన ధనహానిభీతియు, దానిని విడువనియెడల ప్రాణహానిభీతియు, అధికారులవలన శత్రువుల వలన క్షుద్రులువలన మానహానిభీతియు, తన్నిమిత్త ధనహాని భీతియుఁ గలుగును.

మహాపట్టణములలో నగరములలో నుండువారికి గొప్పసౌఖ్యము కలదు కాని, యుద్ధోపద్రవములు పొసఁగి నపుడు మహాభీతి కలుగును. సముద్రతీరపు పట్టణములలో నుండువారు, సమయము వచ్చినపుడు రాజాజ్ఞమీద దివ్యభ నములు, హార్మ్యములు విడిచి వెళ్లవలసివచ్చుననియు, ధనని ధులలో (Banks) నున్నసొమ్ము, యుద్ధసాహాయ్యమున కీయక తప్పదనియు, వానికి నష్టము వాటిల్లుననియు మహాభయము కలుగును. అతివృష్టి గురియునపుడు సముద్రము ఉప్పొంగి వచ్చుచేన్నదని బెస్తలు చెప్పినందున కొందఱు భీతులై ఇండ్లు తోటలు విడిచి దిక్కుతోచక యాత్మరక్షణకై వెడలినవారు కొందఱును, (Emden) గుండుపడినప్పుడు భీతులై వివిధ వస్తుపరికరములతోడ గ్రామాంతరములు వెడలినవారు కొందఱును, ఇంతధనము ఆస్తి సొత్తు పోవుచేన్నదే యని భయపడి మృతిఁజెందినవారు మఱికొందఱును గలరు. ఇవ్విధం బున నే నదులు పొర్లివచ్చి గ్రామములను, పొలములను పంట లను పాడుచేయునని భీతియుఁ గలుగును.

వ్యావహారికన్యాయస్థానములకుఁ గాని, కచ్చేరీలకుఁ గాని, నియమితోద్యోగ స్థానములకుఁ గాని, కాలము నతి క్రమించిపోయినచో, అధికారివలన మాటగలిగి మానభం

గము కలుగునని భీతియు, దానివలన నుద్యోగభంగము, జీవనభంగము, వ్యవహారనష్టము, తన్నిమిత్త ధననష్టము కలుగునని భయములు పలువిధములుగ మనస్సునందు ధైర్య హీనులకుఁ గలుగుచుండును. అట్టి భీతులనన్నింటిని సమ యోచిత బుద్ధిబలముచే ప్రజ్ఞాసామర్థ్యముచేఁ బోఁగొట్టు కొనవలయును.

సాముద్రికుఁడు చెయిఁ జూచికాని, దైవజ్ఞుఁడు జాత కము చూచికాని పరేంగితము శాస్త్రరహస్యముఁ దెలియక వీరికి కొలఁదికాలములోనే మరణము ప్రాప్తించును. ఆపదలు సంభవించునని చెప్పినంతట వినినవారికి మహాభీతి కలిగి అన్న పానాదులు లేక నానాటికి కృశించి పోవుదురు. మరణము, ఆపదలు సంభవించునప్పటి బాధకన్న, సంభవింపఁ బోవుచున్న వని చెప్పినప్పుడు మితిలేనిబాధ కలుగును. ఇట్టిమనోవ్యథ దేని చేత పోవఁజాలదు. అంతకన్న నెక్కువ ప్రామాణికు లయినట్టి యు, జగద్విఖ్యాతిఁగల సాముద్రికులు దైవజ్ఞులు వచ్చి మర ణము,ఆపద సంభవింపదు.క్లేశకాలమయినందున కొన్నిచిక్కులు పెట్టిపోవును. అట్టి షష్ఠాష్టమస్థితిగల క్రూరగ్రహదశాభుక్తుల కాలమందు శాంతిహోమాదులు గావించినట్లయినచో దోష ములు తొలఁగుననియు, ననేకములుఁ గావించి పోఁగొట్టితి మనియు ధైర్యముఁ జెప్పి మహాభీతినిఁ బోఁగొట్టుదురు.

శ్లో. "సత్యం బ్రూయాత్ప్రియం బ్రూయా న్నబ్రూయా త్సత్యమప్రియం."

సత్యమును, ప్రియము నయినట్టివాక్కును దైవజ్ఞుఁడు సాము ద్రికుఁడు జెప్పవలయును గాని, అప్రియమయిన సత్యమునుఁ బలుకఁగూడదని శాస్త్రము శాసించుచుండఁగ, లోకశాస్త్రధర్మ

రహస్యములు తెలియనివారు తాత్కాలిక లాభముకొఱకు అసంబద్ధముగఁ బలుకుదురు. బుద్ధిమంతులు వారివాక్యమును ప్రమాణముగఁ జేసికొనరు. తమకుఁదెలిసిన సత్యవిషయము రోగికిఁ గాని, పృచ్ఛకునికిఁ గాని, యప్రియముగ నుండినట్లు తోఁచినచో, వారితోఁ బ్రత్యక్షముగఁ జెప్పక, వారియాప్తులతోఁ జెప్పి, కర్తవ్యాంశములను నిర్వహింపఁ దగును. వారును ధీమంతులు గనుక ఎటుల ప్రవర్తింపవలెనో అటుల వర్తింతురు.

శ్లో. "భోగే రోగభయం కులే చ్యుతిభయం విత్తే నృపాలాద్భయం
మానే దైన్యభయం బలే రిపుభయం రూపే జరాయా భయం,
శాస్త్రే వాదిభయం గుణే ఖలభయం కాయే కృతాంతా ద్భయం
సర్వం వస్తుభయాన్వితం భువి నృణాం వైరాగ్యమేవాఽభయమ్."
భర్తృహరి. వైరాగ్యశతకమ్.

సంపూర్ణభోగము లనుభవించుచో రోగభయంబును, సత్కులమునందు అప్రతిష్ఠభయంబును, ధనమునందు రాజులవలనిభయంబును, అభిమానమునందు దీనత్వభయంబును, బలముఁ గలిగినచో శత్రువులభయంబును, చేక్కఁదనమునందు ముసలితనమువలనిభయంబును, శాస్త్రమునందు ప్రతివాదిభయంబును, సద్గుణములందు దుర్జనులవలనభయంబును, శరీరమునందు మృత్యుభయంబును, ఇట్లు లోకములోని సర్వవస్తువులును భయముతోఁ గూడినవియే. వైరాగ్య మొక్కటియే నిర్భయమయినది. అజ్ఞానమోహములవలన భయము కలుగును. తత్త్వజ్ఞానమువలన అభయము కలుగును.

Complex Emotion. సంశ్లిష్టభావములు.

(6) ఆత్మగౌరవవంతులును మానధనులు నగుకొందఱు భృత్యప్రాయులతోడను, అల్పబుద్ధులగు నీచులతోడను, వేడుకగా నాటాడుదురు. అప్పు డానీచులు తమకిచ్చినచేనువు పరిచయము నవకాశముఁ జేసికొని, ఆటలో జయముకలిగినట్లు నెపమిడి, ఆ మానధనులను మర్యాద విడిచి మాటాడెదరు. అమర్యాదగా నీచముగా మాటాడిన వీనిని దండించుటకు శక్తిఁగలవాఁ డయ్యు నీక్షుద్రుని శిక్షింపడు. శిక్షించినచో నీతఁడు పరువు తెలియక తిరుగఁబాటుచేసి తిట్టును. అవి నీతిగాఁ బ్రవర్తించినచో గుట్టము, గాడిదె నొకటిగ నుండు ననియు, తెలిసినవారు ఈ నీచునితోడ మాటాడనేల? సాంగత్య మేల? తగినట్లు చేయవచ్చును. వీనినేల శిక్షింప వలయు ననెదరు. ఆ కారణమునుఁబట్టి శిక్షింపఁడు. పదు గురిలోఁ గలిగిన యవమానమునకు రోషంబును చింతయు, ఈనీచుఁడు మనకు లోఁబడి మనవలన బ్రదికెడివాఁ డిట్లు గావించెనే యని విస్మయంబును, ఇట్లు రోషవిషాదవిస్మయం బులు ముప్పిరిగొనును. అవివేకి, నీచుఁడు, సాటివాఁడు గాఁడు. వీఁడు నిందించిన మనకేమని క్షాంతితో నూరకుండినచో, నితరులకు చులకన యగును. భృత్యులవద్ద బెట్టు తొలఁగును. నీచుల కవకాశము కలుగును. వీనికి తగినట్లు శాస్తిఁజేసి శిక్షిం చినచో నీతఁడు శత్రువులతోఁ గలిసి పగఁబట్టి యేమిచేయునో యనియు భీతి కలుగుచుండును. యథార్థములోఁ జూచిన ఈనీచుఁ డెంతలోనివాఁడును గాఁడు. ఈతనిచర్య మనోవిక్షో భమునకు వ్యాకులతకుఁ గారణ మయ్యెడిని. కొంతకాలమున

కా యల్పబుద్ధి వృత్తికై దేశాంతరమున కేగును. ఆనీచుఁ డంతటితో ఆవిషయమును మఱచినను, మానధనునిమనస్సు బాధిత మగుచుండును. తత్త్వగ్రంథపఠనమువలనను, సత్సాంగత్యమువలనను, బుద్ధిబలముచేతను, విమర్శించి క్రమముగా నీభయమును పోఁగొట్టుకొనవలయును.

(7) యుద్ధములు, క్షామములు కలుగునపుడు వస్తువులకు ధరలు అధికముగ పెరుగుచున్నవి. ఎట్లు జీవింతుమా యని భయపడువారు కొందఱును, ఉపన్యసించునపుడు ధర్మతత్త్వమును వ్యక్తపఱచునపుడు ఎవరికేమి కోపమువచ్చునో యని భయపడువారు మఱికొందఱును గలరు. భయమువలన మనస్సంకోచమును, అభయమువలన మనోవికాసమును గలుగును. తనకన్న పెద్దలగువారును, పూజ్యులును, గురువులగువారికి కోపము వచ్చునేమో యని భయపడుట ఆత్మనిష్ఠయగు (Subjective) భయమనియు, తననుండి యితరులకనఁగా; తనభృత్యులకును తనకన్న తక్కువవారికిని గలుగు భయము అన్యనిష్ఠమగు (Objective) భయమనియుఁ జెప్పఁబడును. తా నపరాధము సేయకుండినచో గురువులకు కోపము రాదనియు, తాను శాంతుఁడైనచో నితరులు భీతిఁ జెందరనియు తెలియవలెను. ఇవి సామాన్యమయిన భీతులు వ్యాకులతనుఁ గలిగించును.

అపరాధజన్యభీతి.

ఇతరులను చంపి, చంపించి (హత్యలు) తప్పుపత్త్రములను సృష్టించి, నాణెములు వేయించి, రాజద్రోహము లొనగు

మహాపరాధములు గావించినవారు మహాభీతులై రాజకీయాధి కారభటులు వచ్చి పట్టుకొనుటకుముందే, శరణ్యస్థానములగు పరరాజ్యములకు వెళ్లి దాఁగికొందురు. లేక ప్రచ్ఛన్నముగ స్థానాంతరములందు గోప్యముగ నుందురు. ఈభీతి స్వకీయ దుష్కృత్యములవలనఁ గలిగినది. మనస్సంక్షోభము, బుద్ధి చెడుట, విస్మృతి, దీర్ఘనిశ్శ్వాసము, కంపము, నిశ్చేష్టత, దైన్యము, వైవర్ణ్యము లోనగుచిహ్నము లేర్పడును.

(3) హత్యలు జరిగినపుడు మొండెములను, శిరస్సు లను, కపాలమును, రక్తపాతములను, ఆంత్రములు లోనగు బీభత్సకరములగు దృశ్యములనుఁ జూచినపుడు మహాభయ ము గలిగి గుండె చెదరును. పిమ్మట జ్వరముగలిగి మృతిఁ జెందినవారలు కొందఱుకలరు. ధీరులు కానివారు అట్టి దృశ్య ములఁ జూడఁజేనదు.

భ్రాంతిజన్యభీతి.

మందాంధకారసమయమున ఊరివెలుపల తోటయొద్ద వంకరగానుండు త్రాటిని దాటి "పాము" అని భ్రాంతిచే భీతిఁ జెందినవారు కొందఱును, వెన్నెలలో కాకరపాద, మల్లెపాద లలో నీడనుఁ జూచి దయ్యమని భ్రాంతిచే భీతులయినవారు మఱికొందఱును గలరు. వీరును ముందుఁ జెప్పఁబడినవారి వలెనే యుద్విగ్నులై ఆప్తులచే ప్రబోధితులై భీతినుండి విముక్తు లగుదురు.

శిశువులు మనోవికాసము లేనివారు కాఁబట్టి భయం కరవస్తువులఁ జూపినను, బెదరించినను దడిసికొందురు. వారికి

అర్జునునకు చరమశ్లోకము ననుగ్రహించెను. దీనివలన నిఖిల భూతేశ్వరు నాశ్రయించినయెడల అజ్ఞానరూపభయము లన్నియు నశించునని పర్యవసితము.

విషయసుఖములు దుఃఖహేతువులు.

శ్లో. "శోకస్థాన సహస్రాణి భయస్థాన శతాని చ,
దివసే దివసే మూఢ మావిశంతి న పండితం."

మహాభారత. శాంతి, అ. ౧౭౪.

శోకహేతువులగు విషయములును, భయహేతువు లగు విషయములును ప్రతిదినము మూఢునిఁ బొందుచున్నవి కాని ప్రాజ్ఞునిఁ బొందుట లేదు. అజ్ఞానియగు మూఢుఁడు విషయస్వరూపము తెలియక వానియందు సక్తుఁ డగుననియు, ప్రాజ్ఞుఁడు విషయస్వరూపముఁ దెలిసి సక్తుఁడు కాఁడనియు భావము.

ఈ లోకమునందలి విషయసుఖములన్నియు దుఃఖ సంస్పృష్టములనియు, క్షణికములనియు వానికొఱకై బుద్ధి మంతుఁ డాశపడఁగూడదనియు, నటుగాక ఆశపడెనేని గాల మునందుఁ గ్రుచ్చఁబడిన మాంసమునకై ఆశపడి మత్స్యము నశించినట్లును, దీపశిఖనుఁ జూచి యాహారమని భ్రాంతిఁజెంది అందుపడిన మిడుతవలెను, ఈతఁడు దుఃఖములలోఁ బడి నశిం చుననియు మహాభారత శాంతిపర్వములో యుధిష్ఠిరునకు గాంగేయుఁ డనేకవిధముల బోధించెను.

స్నేహబంధము దుఃఖహేతువు.

శ్లో. "స్నేహేన తిలవత్సర్వం సర్గచక్రే నిపీడ్యతే,
తిలపీడై రివాక్రమ్య క్లేశై రజ్ఞానసంభవైః.
సంచినో త్యశుభం కర్మ కళత్రాపేక్షయా నరః,
ఏకః క్లేశా నవాప్నోతి పరత్రేహ చ మానవః.
పుత్రదార కుటుంబేషు ప్రసక్తా స్సర్వమానవాః,
శోకపంకార్ణవే మగ్నా జీర్ణా వనగజా ఇవ."
మహాభారత, శాంతి. అ. ౧౭౪ శ్లో. ౨౧-౨౩.

గానుగవాండ్రు (తైలికులు) నువ్వులను యంత్రచక్రమునఁ ద్రిప్పి నలిపి పీడించి నూనెను దీసినట్లు, అజ్ఞానసంభవములగు క్లేశములను తెలికలవాండ్రచే సంసారచక్రమందు సకలప్రాణుల పీడించి స్నేహమను తైలము తీయఁబడుచున్నది. మానవుఁడు పుత్రకళత్రాదులయం దుండెడు వ్యామోహముచే ననేకపాపకర్మల నొనరించి తత్ఫలములగు దుఃఖములను ఈలోకమునందు పరలోకమునం దనుభవించుచున్నాఁడు. పుత్రకళత్రవిత్తగృహక్షేత్రాత్మకమగు సంసారమునందు సక్తులై, ముదుసలి అడవియేనుఁగులు సరోవరపంకార్ణవమందు మునిఁగి లేవలేక నశించినట్లు మానవులును శోకపంకార్ణవమందు మునుగుచున్నారని భావము. పూర్వజన్మమునందు తా మొనరించిన దుష్కృతఫలములగు దుఃఖములను దరిద్రుఁడుగాని, ధనవంతుఁడుగాని, బలవంతుఁడుగాని, బలహీనుఁగాని, పండితుఁడుగాని, పామరుఁడుగాని, ఎట్టివాఁడైనను అనుభవింపక తీరదు.

శ్లో. "విస్రంభే పరమాం కాష్ఠా మారూఢే దర్శనాదిభిః,
యేనాంతరంగం ద్రవతి సస్నేహ ఇతి కథ్యతే." భావప్రకాశే.

ప్రియములగు పుత్త్రకళత్త్రాదుల దర్శనస్పర్శనసంభాషణాదులచే మమకారవిశ్వాసము, పరమావధినిఁ జెంది దేనిచే నంతరంగము ద్రవించి స్నిగ్ధత యగుచున్నదో అయ్యది స్నేహ మనఁబడును. స్నేహముచే రాగ మభివృద్ధిఁ జెంది దుఃఖముగ పరిణమించును. ప్రియములగు పుత్త్రకళత్త్రాదుల దర్శనస్పర్శన సంభాషణాదులు వారు జీవించినపుడు స్నేహాను. రాగములచే నెంత సుఖదాయకము లయ్యెనో, అవియే వారు నష్టముఁ జెందినపుడు దుస్సహదుఃఖవేదనముఁ గలిగించును.

పుత్త్రకళత్త్ర బంధుమిత్త్రాదులయెడ మమకార రూప స్నేహపాశము హృదయమునందు గ్రంథిగా నేర్పడి సంవర్థిత మయినంతట, కాలపురుష శస్త్రచికిత్సకుఁడు కర్మపరిపాకాను గుణ్యముగ వియోగకాలమున నాగ్రంథిని ఛేదించును. అదియే దుర్భరదుఃఖవ్రణము. వ్రణితమగుదానిని ఆధ్యాత్మిక జ్ఞానోపదేశములచేతను, తత్త్వవిచారముచేతను, మానసిక శాస్త్రజ్ఞుఁడు భైషజ్యమొనర్చి మాన్పును. మానినది వాసనా రూపముగ నుండి యెప్పటికేని స్మృత్యనుభవముఁ గలిగించును.

శ్లో. "అనిష్ట సంప్రయోగాచ్చ విప్రయోగా త్ప్రియస్య చ,
మనుష్యా మానుషై ర్దుఃఖై ర్యుజ్యంతే స్వల్పబుద్ధయః.
ప్రాక్సంప్రయోగాద్భూతానాం నాస్తి దుఃఖం పరాయణం,
విప్రయోగాత్తు సర్వస్య న శోచే త్ప్రకృతి స్థితః.

సర్వేక్షయాంతా నిచయాః పతనాంతా స్సముచ్ఛ్రియాః,
సంయోగా విప్రయోగాంతా మరణాంతం హి జీవితం."

మహాభారత. శాంతి. అ. ౩౩౧ శ్లోకం.

అనిష్టవస్తుసంయోగము (కూడిక) చేతను, ఇష్టవస్తు వియోగము (ఎడఁబాటు) చేతను, అల్పబుద్ధులగు మానవులు దుఃఖములు బొందుచున్నారు. సంయోగమునకు పూర్వమున దుఃఖము లేదు. సంయోగానంతరము వియోగము కలుగుట వలననే దుఃఖము ప్రాప్తించుచున్నది. సంయోగము వియోగముకొఱకు, అత్యున్నతిగ పెరుగుట పతనముకొఱకు, హెచ్చుట తగ్గుటకొఱకు, జీవితము (జననము) మరణము కొఱకునని తెలిసి ప్రాజ్ఞులు దుఃఖింపరు.

దుఃఖోపశమనోపాయము.

శ్లో. "ద్రవ్యేషు సమతీతేషు యే గుణాస్తాన్న చింతయేత్,
న తా నాద్రియమాణస్య స్నేహబంధః ప్రముచ్యతే.
దోషదర్శీ భవేత్తత్ర యత్ర రాగః ప్రవర్తతే,
అనిష్టవర్ధితంపశ్యే త్తథాక్షిప్రం విరజ్యతే.
మృతం వా యది వా నష్టం యోఽతీత మనుశోచతి,
దుఃఖేన లభతే దుఃఖం ద్వావనర్థౌ ప్రపద్యతే.
దుఃఖోపఘాతే శారీరే మానసే చాప్యుపస్థితే,
యస్మిన్న శక్యతే కర్తుం యత్న స్తన్నానుచింతయేత్.
భైషజ్యమేత ద్దుఃఖస్య యదేతన్నానుచింతయేత్,
చింత్యమానం హి న వ్యేతి భూయశ్చాపి ప్రవర్ధతే."

మహాభారత. శాంతి. అ. ౩౩౧.

పుత్రకళత్రద్రవ్యాదులకు నష్టము గలిగినపుడు వాని గుణములను తలంపునకు తేఁగూడదు. ఆనష్టవస్తువులను వాని గుణములను ప్రశంసించుకొలఁదిని స్నేహబంధము వీడి పోవదు. వేనియందు రాగము గలదో వాని నష్టకాలమందు దుఃఖము కలుగునని దోషము జూచుచున్నట్టులయిన ఆవిష యములందు వైరాగ్యము కలుగును.

1. మృతిఁ జెందినటువంటి దారాపుత్రాదులను, నష్ట మయినట్టి ధనమునుగూర్చి దుఃఖించుకొలఁదిని దుఃఖ మేర్ప డును. ప్రియవస్తువియోగ మొకదుఃఖము. ఇట్టిదుఃఖ మెవరి కేని కలదా? ఆప్రియవస్తువునం దిట్టిసుగుణము లున్నవి, అది నశించెనే యని దుఃఖించుట మఱియొకదుఃఖము. ఇట్లు రెం డనర్థములు కలుగుచున్నవి. అజ్ఞానులు దుఃఖప్రాప్తిస్వరూపము తెలియక, "వీరివలన నీనష్టము కలిగినది. వీరివలన మృతిఁ జెందెను. సరియైనచికిత్స ఉపచారములు సేయఁబడలేదు." అని యితరులను నిందించి తిట్టి కొట్టి దుర్భాషణము లాడుటవలన మఱికొంతపాపము. దానివలన దుఃఖము ప్రాప్తించును. ఇట్లు దుఃఖమువలన దుఃఖము అతిశయించును గాని తగ్గదు. అగ్నిలో పుడకలు వైచుకొలఁదిని మండుచున్నట్లు శోకాగ్ని తలంచు కొలఁదిని ప్రజ్వరిల్లును గాని ఉపశమింపదు. తలపోయకున్నచో (చింతింపక) ఉపశమించును.

2. ప్రాజ్ఞులు దుఃఖప్రాప్తితత్త్వమునుఁ దెలిసికొని ప్రియతములగు పుత్రకళత్రాదులు మృతిఁ జెందుటకును, ధనము నష్టమగుటకును, ఇతరులు కారణము కానేరరనియు పూర్వజన్మకృతదుష్కృత మాదుఃఖరూపముగ ప్రాప్తించిన

దనియు, తొలిజన్మమున నేయవస్థయం దెట్టి సుకృతదుష్కృతములు చేయఁబడినవో, వానిఫలములగు సుఖదుఃఖములు ఈ జన్మమునందు చేసినవానినిఁ బొందుచుండుననియు, వారు చేసిన కర్మవలన ఆయువు తీరి మృతిఁజెందిరనియు, వీరికర్మవలన నీరూపమగుదుఃఖ మనుభవించుచుండిరనియు, ఒరులు సుఖదుఃఖముల నీయఁజాలరనియు, వారికర్మలే వారికి సుఖదుఃఖము లొసంగుననియుఁ దలంతురు. వారు దీనికి కారకులు. వీరివలన తగినచికిత్స ఉపచారము చేయఁబడలేదనితలఁచుట వెఱ్ఱితనము. తత్త్వము తెలియక మూఢు లితరుల నిందించి పాపముల మూటఁగట్టుకొనుట మఱికొంతదుఃఖము నతిశయింపఁజేయుటకే కాని వేఱుకాదని వివేకి ఆధ్యాత్మికదృష్టిచే గతించినదానికి చింతింపక ప్రజ్ఞాబలముచే దుఃఖము నుపశమింపఁ జేసికొనును.

3. అజ్ఞునకును ప్రాజ్ఞునకును దుఃఖానుభవము సమమయినప్పటికిని,అజ్ఞుఁడు తెలియక దుఃఖ మనుభవించుచు, ఆయాసపడుచు, రాఁబోవుదుఃఖమునకుఁ గారణమగు పాపకృత్య మొనరించుకొనును. ప్రాజ్ఞుఁ డన్ననో దుఃఖతత్త్వముఁ దెలిసి, కర్మానుభవమని యనుభవించుచు,ఆయాసపడక యొరుల నిందించి పాపకృత్యము లొనర్పమిచే, రాఁబోవు దుఃఖమునకు బీజములేనందున దుఃఖ మనుభవింపడు.ప్రాజ్ఞులు గతించినదానికి దుఃఖింపరు. వర్తమానదుఃఖమునుఁ దెలిసి యనుభవించినను వారిని బాధింపదు. మఱల దుఃఖించి పాపకృత్యము లొనరింపనందున రాఁబోవు దుఃఖము కలుగనేరదు. కాఁబట్టి ప్రజ్ఞాబలముచే దుఃఖను నుపశమింపఁ జేసికొనియెదరు.

శ్లో. "ఉన్మజ్జంశ్చ నిమజ్జంశ్చ జ్ఞానవాన్ ప్లవవాన్ భవేత్,
ప్రజ్ఞయా నిశ్చితా ధీరా స్తారయంత్యబుధాన్ ప్లవైః,
నాఽబుధా స్తారయంత్యన్యా న్నాత్మానం వా కథంచన."

మ-భా-శాంతిపర్వ. అ ౨౩౬.

4. ప్రజ్ఞావంతుఁడు సంసారప్రవాహమునందు మునుఁగుచు, తేలుచు, ప్రజ్ఞయను తెప్పచేత ప్రవాహమును దాఁటును. దుఃఖప్రవాహమునందు మునిఁగి దరిఁ గానకయుండు అజ్ఞానులను ప్రజ్ఞాప్లవముచే దాటించును. అజ్ఞానులు తాము స్వయముగ దాటఁజాలరనిన, ఇతరుల నెటుల దాటింప గలుగుదురు ? ప్రాజ్ఞుఁడు దుఃఖితులగు నజ్ఞానులకు జ్ఞానబోధచే నజ్ఞానరూపమగు దుఃఖమునుఁ బోఁగొట్టుటయే తనధర్మమని తలఁచును.

శ్లో. "ఉద్ధరే దాత్మనాఽత్మాన మాత్మాన మవసాదయేత్."

భగవద్గీతా. ౬ అ. ౫ శ్లోకం.

వివేకయుక్తమగు బుద్ధిచేత దుఃఖములో మునిఁగిన ఆత్మను లేవఁదీయవలయును గాని ముంచేఁగూడదు. ఆత్మను దుఃఖములోను శోకములోను ముంచి వ్యథపఱచువాఁడు ఆత్మద్రోహి యగునని భావము. తమకుఁ దెలియక యొరులు చెప్పినను వినక నష్టవస్తువునుఁ గూర్చి దుఃఖించుకొలఁది శోక మతిశయించును. ఈశోకము పలువిధములచే ప్రాణులకు నష్టముఁ గలిగించును.

శ్లో. "అనివార్యేణ శోకేన శరీరం చోపతప్యతే,
అమిత్రాశ్చ ప్రహృష్యంతి శోకే నాస్తి సహాయతా.

సంతాపాద్భ్రశ్యతే రూపం సంతాపాద్భ్రశ్యతే శ్రియః,
సంతాపాద్భ్రశ్యతే చాయుర్ధర్మశ్చైవ సురేశ్వర.
పుత్రదారై స్సుఖైశ్చైవ వియుక్తస్య సుఖేన వా,
మగ్నస్య వ్యసనే కృచ్ఛ్రే ధృతిశ్శ్రేయస్కరీ నృప.
ధైర్యేణ యుక్తం సతతం శరీరం న విశీర్యతే,
విశోకతా సుఖం ధత్తే ధత్తే చారోగ్య ముత్తమం.
ఆరోగ్యాచ్చ శరీరస్య స పున ర్విందతే శ్రియం,
యశ్చ ప్రాజ్ఞో నర స్తాత సాత్త్వికీం వృత్తి మాస్థితః.
తస్యైశ్వర్యం చ ధైర్యం చ వ్యవసాయశ్చ కర్మసు,"

మహాభారత. శాంతిపర్వ. అ ౨౨౬.

5. పుత్త్ర కళత్ర మిత్ర బంధుజనవిత్తాదులకు నష్టము కలిగినపుడు నివారింప శక్యముకానిశోకము కలుగును. శోకించుటచే రూపము చెడును. సంపద తొలఁగును. ఆయువు ధర్మము నష్టముఁ జెందును. కాఁబట్టి శోకింపఁగూడదు. దారపుత్త్రాదులవియోగము కలిగినపుడుకాని, సుఖములు తొలఁగినపుడుకాని, మహత్తరవిపత్తునందు మునిఁగియున్నప్పుడుకాని, ధైర్య మవలంబించుటచే శ్రేయస్సు కలుగును. ధైర్యావలంబనము శరీరమును క్షీణింపఁజేయదు. ఆరోగ్యముఁ గలిగించును. ఆరోగ్యమువలన నైశ్వర్యముఁ బొందును. తేజస్సు కలుగును. ఎవఁడేని సాత్త్వికగుణ మవలంబించినవానికి ఐశ్వర్యము, ధైర్యము, కార్యములయందు నిశ్చలత్వము, దార్ఢ్యము కలుగును. కాఁబట్టి శోకార్ణవమును తరించుటకు ధైర్యప్లవమే ముఖ్యసాధనమని గాంగేయుఁడు యుధిష్ఠిరున కుపదేశించెను.

పుత్ర కళత్ర మిత్రబంధునష్టమున దుఃఖోపశమనము.

1. మాతృ పితృ భ్రాతృ పుత్ర కళత్ర మిత్ర బంధు జనులు మృతిఁ జెందినపుడు మహత్తరమయిన దుఃఖప్రవాహము ప్రవహించుచుండును. అద్దానికి కట్టవేసి యెట్లు ఉపశమింపఁ జేయునది? స్నేహపాశగ్రంథి ఛేదింపఁ బడినందునఁ గలిగినవ్రణమునకు ఆధ్యాత్మికదృష్టిచే నెట్లు చికిత్సఁజేసి మాన్పవలసినది? తత్త్వశాస్త్రజ్ఞులూ పలువిధంబులఁ దెలిపిరి. ఆధునిక వ్యావహారికప్రపంచమందలి దృష్టాంతములచేతఁ గాని, సామాన్యులకు బోధపడదు కావున ఇప్పటి ప్రకృతిశాస్త్ర యంత్రకర్మాగారాద్యనుభవవిషయములే నిదర్శింపఁ బడును.

శ్లో. "యథా కాష్ఠం చ కాష్ఠం చ సమేయాతాం మహోదధౌ,
సమేత్య చ వ్యపేతాయాం కా తత్ర పరివేదనా.
ఏవం పుత్రాశ్చ పౌత్రాశ్చ జ్ఞాతయో బాంధవాస్తథా,
తేషాం స్నేహో న కర్తవ్యో విప్రయోగో ధ్రువో హి తైః.

శ్లో. "పాంథానామివ వర్త్మని క్షితిరుహాం నద్యామివ భ్రశ్యతాం
మేఘానామివ పుష్కరే జలనిధౌ సాంయాత్రికాణామివ,
సంయోగః పితృమాతృబంధుతనయభ్రాతృప్రియాణాం సదా
సిద్ధో దూరవియోగ ఏవ విదుషాం శోకోదయః కస్తవ."

ప్రబోధచంద్రోదయే.

సముద్రము ప్రవాహమున ఒకకొయ్యయు, మఱియొక కొయ్యయు కొట్టుకొని వచ్చి కలిసి కొంతకాలముండి మఱి యొకప్రవాహమున వీడిపోవునట్లును, మార్గమున బాటసారు లందఱు నొకటిగఁ గలిసిపోవుచు, వారిగమ్యస్థానములు వచ్చి

నపుడు ఎడఁబాసిపోవునట్లును, నదియందు వృక్షములన్నియుఁ గొట్టుకొని వచ్చి కొంతకాలము కలిసియుండి వీడిపోవునట్లును, ఇట్టులే ఆకాశమునందు మేఘములును, సముద్రప్రయాణంబున యాత్రికులును, ఒకటిగఁ గలిసియుండి, వాయు వెళ్లవలసినచోట్లకు వీడిపోయినట్లును, సంసారమహాప్రవాహమునందును, జీవులు వారివారి కర్మానుగుణ్యముగ నొకటిగఁ జేరి పితృ మాతృ భ్రాతృ పుత్ర కళత్ర మిత్ర బంధుజనులవేరితో నన్యోన్య స్నేహపాశబద్ధులై కొంతకాల ముండి, కర్మరూప ఋణము తీరినంతట నొకరి నొక రెడఁబాపి తా మొనరించిన సుకృత దుష్కృత రూపకర్మలకుఁ దగినట్టి లోకములకుఁ బోవుదురు. జననము కలిగినపుడు మరణము తప్పదు. సంయోగ మున్నపుడు వియోగము తప్పక కలుగునని తెలిసినవారికి దుఃఖ మెట్లు కలుగును ? కలిగినను ఉపశమించును. సత్త్రములలో యాత్రికు లొకటిగఁ జేరి, సంభాషించుకొనినంతట పరిచయవశంబున స్నేహపాశబద్ధు లగుదురు. ప్రయాణసమయ సూచక ఘంటానినాదము విన్నఁబడినంతనే యొకరినొక రెడఁబాసిపోవునపుడు వియోగదుఃఖము కలిగినట్లు సంసారసత్త్రములందును, కర్మవశంబున నొకరినొకరు వీడిపోవునపుడు దుస్సహ దుఃఖము కలుగును.

ప్రయాణికుల వియోగమువలె మృతుల వియోగదుఃఖ మనుట.

2. ధూమశకటములోఁ (రైలు) బోవుచుండు ప్రయాణికుల సంయోగవియోగములు, స్నేహానురాగములు, ఎడఁ

బోటుదుఃఖములఁ దలఁచినను దుఃఖము తగ్గిపోవును. పుణ్య కర్మవిశేషమువలన శ్రీమంతుల కుటుంబములందు జన్మించి, సుఖభోగైశ్వర్యము లనుభవించినటుల ధనమును వెచ్చించు కొలఁది మొదటి రెండవ మూఁడవ తరగతులపెట్టియలలో (Compartments) పయనము సలుపుటకు టిక్కెట్లు (శుల్క) లభించును. మొదటి రెండవతరగతుల పెట్టియలలో మెత్తని పఱుపులు, సోఫాలు, సుఖశయనాసనములు, స్నానపానములకుఁ దగుపసతులు గలిగి స్వర్లోకసౌఖ్యమువలె నుండును. ఇట్టి సౌఖ్యము ధనమను పుణ్యకర్మవిశేషముచే నార్జితమయిన టిక్కెట్టువలనఁ గలుగును. మూఁడవతరగతి ప్రయాణికులకు సౌఖ్యము తక్కువ. సమ్మర్ద మెక్కువ మిశ్రమముగా నుండును. ఒకఁడు కలకత్తాకు మొదటితరగతిపెట్టెలో ప్రయాణము సేయఁదలఁచి, దూరమునకు తగునట్లు ధనము వెచ్చించి టిక్కెట్టు దీసి ఆపెట్టెలో తనవిలువగల వస్తువులను పెట్టియను బెట్టి ఆపెట్టెయగది తనది యనియు, నింకొక రాక్రమింపఁ గూడదనియు, మమకారము, అభిమాన మేర్పడును. కొంత దూరము పోయినతర్వాత మఱియొకస్టేషనులో నొకస్త్రీ ఖరగ పురముస్టేషనులో దిగునట్లు ఒకటిక్కెట్టు కొని అం దెక్కును. కొంతదూరము పోయినతర్వాత శ్రీజగన్నాథముపురములో దిగునట్లును, ఇట్టుల విజయనగరము, సింహాచలము, బెజ వాడలో నగుస్టేషనులులో దిగునట్లు చెన్నపురినుండి టిక్కెట్లుఁ దీసికొని, ఆబండిలోనే యెక్కుదురు. రు 100 లు టిక్కెట్టు మొదలుకొని 80,70,60, కడపట రు 0-8-0 లు. రు 0-4-0 టిక్కెట్టువఱకుఁ దీసికొని పదుగురు ఆపెట్టియలోఁ జేరి

అన్యోన్యస్నేహప్రేమభావంబులతో ఆహార ఉపాహారముల నొండొరుల కిచ్చుకొనుచు, దృఢస్నేహపాశములతోఁ గట్టఁబడియుండిరి. వాద్యములు వాయించుకొనుచు, గ్రామ్ఫోను యంత్రములపాటలఁ బాడించుకొనుచు, వినోదములతో కాలక్షేపము సేయుచుండఁగా, వారిటిక్కెట్లు యెంతవఱకు చెల్లినవి, ఎంతదూరము పోవలయునను గమనము బొత్తిగా లేక ప్రేమస్నేహవ్యామోహములలో మునిఁగియుండిరి. ప్రతిస్టేషన్లోను దిగవలసినవారికి హెచ్చరికలు జరుగుచుండెను. వీరందఱు నొక కుటుంబములోనుండు భర్త, భార్య, పుత్రులు, పుత్రికలు, సోదరీసోదరులు, మిత్రులు, ఆత్మబంధువులుగా భావింపుఁడు. మొదట రు 0-4-0 లు టిక్కెట్టుకలవాఁడు దిగవలసివచ్చినపుడు, వీఁడు సుందరుఁడు, నగుమోముగలవాఁడు, ముద్దుమాటలాడుచు ఎడఁబాసి పోవుచున్నాఁడని దుఃఖింతురు. మఱికొంతదూరము పోయినతర్వాత రు 0-8-0 లు పిమ్మట 5,10,20,30,40,50,60 మొదలుకొని రు 90 లు టిక్కెట్టుగలవారు క్రమముగా వారివారిస్టేషన్లలో దిగునపుడు మిగిలినవారికి దుస్సహమగుదుఃఖము కలుగుచుండును. కడపట తాను ఒక్కఁడే కలకత్తాస్టేషన్లో దిగవలయును. వీరందఱు మధ్య కలిసికొని, స్నేహప్రేమ మమకారములు గలిగించి, వారివారి టిక్కెట్లుప్రకారము దిగిపోయి దుర్భరదుఃఖము కలిగించిరే యనియు, నిఁకమీఁద వీరితో సంసక్తి పెట్టుకొనఁగూడదనియు, దుఃఖకారణమనియు ననుభవము వలనఁ దెలిసికొనును. అట్టులే సంసారమహాపథమునందు కుటుంబములను పెట్టియలలో, వారివారి కర్మానుభవమునకుఁ

దగినట్టిటిక్కెట్లు కర్మదేవతలవలనఁ బొంది భర్త, భార్య, పుత్రికాపుత్ర సోదరీసోదర మిత్రబంధువులను నామములతో నొకరిమీద నొకరికి వ్యామోహము కలిగి స్నేహపాశబద్ధులై, అహోరాత్రములచే నాయువు క్షయించుచున్నదని తెలియక, స్థిరమని విషయోపభోగముల ననుభవించుచుందురు. కాల నియతిప్రకారము కర్మ పరిపక్వమై ఋణముఁ దీరినంతట (టిక్కెట్లు) యేయే పితృవనములలోఁ జేరవలయునో, అచట నెడఁబాయుదురు. కర్మానుభవము (ఋణము) తీరినంతట నించుకసేపయిన నుండరు. కాఁబట్టి రైలుమార్గపు ప్రయాణి కుల దృష్టాంతముఁ జూచి చక్కఁగా భావించి ఆత్మబంధు వియోగమునకు దుఃఖింపఁగూడదు.

శ్లో. "పుత్రదారాప్తబంధూనాం సంగమః పాంథసంగమః,
కుటుంబేషు న సజ్జేత న ప్రమాద్యే త్కుటుంబ్యపి.
ఇత్థం పరిమృశ న్ముక్తో గృహేష్వతిథివద్వస న్,
న గృహై రనుబధ్యేత నిర్మమో నిరహం కృతిః."

శ్రీభాగవత. ౧౧ స్కంధ. అధ్యా.

3. పుత్ర కళత్ర మిత్రబంధువులతోడి కూడిక, ప్రయాణికులతోడి కలయికవంటిది. కాఁబట్టి కుటుంబముల యందు సక్తుఁడు కాఁగూడదు. కుటుంబి అయినను స్వస్వరూప మును మఱచి అజాగ్రతగ నుండఁజనదు. గృహస్థులయిండ్లకు వచ్చిన అతిథి వారితో సక్తుఁడు గాక, భుజించి వెడలినటుల గృహస్థుఁడును, గృహసంబంధవిషయములతోడి సక్తుఁడు గాక అతిథివలె నివసించుచు, అహంకారమమకారముల తగ్గించు

కొని యుండవలెనని భావము. ఇట్లు చెప్పుటచే తలిదండ్రులకు, సోదరీసోదరులకు దారాపుత్రమిత్రాది బంధువర్గమునకు వ్యాధులుగాని, విపత్తులుగాని వచ్చినపుడు ఉపేక్షించి వెడలవలయునని యభిప్రాయము కాదు. వారు తనయెడ ప్రేమఁజూపి తన సహాయము నాశించినందులకు కృతజ్ఞతాపూర్వకముగఁ గాని, లేక ఈశ్వరకళ జీవరూపముగా నున్నదని కాని, లేక కర్మరూప ఋణమునుఁ దీర్పవలయునని కాని తలఁచి, యజమానునకును, ఆతని బంధువులకును సేవకుఁడు ఉపచారము సలిపినట్లు తన వారికి ఔషధము లిప్పించి ఉపచారములు చేసి, వ్యాధులను విపత్తులనుఁ బోఁగొట్టవలయును. అటుకానిచో తనధర్మము నతిక్రమించినదోషముచే పాపము లొడిగట్టుకొనును. మానవుఁడనేకఋణములతోఁ గూడి జన్మించేను. ధర్మ్యముగా నాఋణములఁ దీర్చినఁగాని బంధములనుండి విడువఁబడఁడు. పరమేశ్వరుఁడు తనకొసంగిన ధనబలభాగ్యైశ్వర్యంబులు కుటుంబములోఁ తన్నాశ్రయించిన జీవుల రక్షణపోషణలకొఱకనియు, తనకే కాదనియు, ధర్మము నతిక్రమింపక వారి కుపచరించి ఋణముఁ దీర్చికొనవలెననియుఁ దెలిసికొని నిరభిమానముగ వర్తింపవలెనని తాత్పర్యము.

శ్లో. "నాఽతిస్నేహః ప్రసంగోవా కర్తవ్యః కేనచిత్క్వచిత్,
కుర్వన్ విందేత సంతాపం కపోత ఇవ దీనధీః."

శ్రీభాగవత. ౧౧ స్కంధ. అధ్యా.

4. అతిస్నేహముగాని, అతిపరిచయముకాని, ఎప్పుడును ఎవరితోఁగాని చేయఁగూడదు. అట్లు చేసినచో దీన

త్వముఁ జెందిన కపోతమువలె సంతాపముఁ బొందును. అతి స్నేహమువలన మమకార మధికమై దృఢబంధ మేర్పడును. అజ్ఞులగు విషయాసక్తులతోడి సంగము బంధమునకును, తత్త్వజ్ఞులగు సజ్జనులతోడి సాంగత్యము మోక్షమునకును హేతువగును.

ఆధ్యాత్మికవిచారముచే దుఃఖోపశమనము.

1. ఆత్మ నిత్యుఁడు, నిర్వికారుఁడు, అవ్యయుఁడు, శాశ్వతుఁడనియు, దేహము అనిత్యము, వికారముఁ బొందునది, నశించునది అశాశ్వతమనియు, ఆత్మానాత్మవివేకము గలిగి విచారించిన దుఃఖతత్త్వము తెలియును.

లోకమందలిజనులు దుఃఖించుట ఆత్మకొఱకా? దేహముకొఱకా ? ఎల్లప్పుడు నుండువాఁడు నాశరహితుఁడు, వికారముఁ బొందనివాఁడు, అదృశ్యుఁడు నగు ఆత్మకొఱకు దుఃఖించుట అవివేకము. నశించుస్వభావముఁ గలదియు, దహింపఁబడునదియు, వికారములఁ బొందునదియు, అనిత్యమునగు దేహముకొఱకు దుఃఖించుట మిక్కిలి యవివేకము. కంటికిఁ గన్పడు దేహపు రూపరేఖావిలాసములయెడ వ్యామోహముఁ గలిగినందున అది నశించిపోవుచున్నదే యని యెల్లఱకు దుఃఖముఁ గలుగుచుండు. షడ్భావవికారములు గల (ఉండుట, పుట్టుట, పెరుగుట, మారుట, తగ్గుట, నశించుట.) యీ పాంచభౌతికపదార్థములు ఉత్పత్తియగునపుడు నశించి తీరవలయును. అట్టియెడ నియతవినాశ్యములగు దేహాదులునశించునపుడు దుఃఖించుట వ్యర్థము.

2. ఒకఁడు వయస్సభివృద్ధి యగుకొలఁదిని శరీరపుష్టినిఁ బట్టియు, ప్రాఁతచొక్కాయిలను విడిచి క్రొత్తచొక్కాయిలను ధరించినట్టుల, జీవుఁడును కర్మలచే సుఖదుఃఖాదుల ననుభవించుటకొఱకు శిథిలదేహముల విడిచి నూతనదేహములఁ బొందుచున్నాఁడనఁగా, మృతిఁ జెంది జనన మందుచున్నాఁడు. ప్రాఁత చొక్కాయిలను విడిచినపుడు దుఃఖముపొందనట్లు శిథిలదేహములను విడిచిన (మృతులయిన) ఆత్మలగుఱించి దుఃఖింపఁ జేనదు. నిత్యుఁడగు ఆత్మ నూతనదేహములఁ బొంది లోకాంతరయాత్రఁ గావించుచుండును. బాడుగయిండ్లలో నుండి మాఱి క్రొత్తయిండ్లలోనికిఁ బ్రవేశించునపుడు. ఇల్లుపోయిన దని దుఃఖించుచుంటిమా? అట్టుల దేహములు మాఱుటకు జ్ఞానులు చింతింపరు.

శ్లో. "నాఽసతో విద్యతే భావో నాఽభావో విద్యతే సతః,
ఉభయోరపి దృష్టోఽన్త స్త్వనయో స్తత్త్వదర్శిభిః."
భగవద్గీతా. ౨ అధ్యాయ. ౧౬ శ్లోకం.

అసత్తు అగు "అనాత్మకు సద్భావము లేదు. సత్తు అగు "ఆత్మకు" అనాత్మత్వము లేదు. అనిత్యమును, అశుచియు, దుఃఖభూయిష్ఠమును, అనాత్మయు నగు దేహాదికమునందు (అసత్తు) నిత్యమును, శుద్ధమును, నిరతిశయసుఖంబును, సర్వవ్యాపకమునగు (సత్తు) ఆత్మధర్మముల నారోపించియు, ఆత్మయందు అనాత్మ (దేహ) ధర్మముల నారోపించియు, అన్యోన్యాధ్యాసచే దుఃఖములఁ బొందుచున్నారు. ఓడలోఁగాని, బండిలోఁగాని వేగముగాఁ బోవునపుడు వెలుపలనున్న చెట్లు,

చేమలు, కొండలు, గుట్టలు, స్థిరముగనున్నను, వేగముగా పోయినట్లును, ఆకాశమున మేఘములలో చంద్రుఁడు పరుగెత్తినట్లును, చరము స్థిరముగాను, స్థిరము చరముగాను, భ్రాంతిచేఁ గనుపడినట్లు అనిత్యములగు దేహాదులు నశించుచుండ, నిత్యమగు ఆత్మ నశించుచున్నట్లు కన్పించును. అధ్యాసచేఁ గలుగు అజ్ఞానము. ఆత్మానాత్మవివేకమును, నిత్యానిత్యవస్తు పరిజ్ఞానంబునుఁ గలిగినయెడల అనిత్యములగు దేహాదులు నశించుచున్నప్పుడు దుఃఖము కలుగదు. భగవద్గీత అర్జునవిషాదయోగమునందు నిత్యానిత్యవస్తువివేకమును, ఆత్మానాత్మజ్ఞానమును బోధింపఁబడినది గనుక దానిం దెలిసికొని దుఃఖము విడువఁదగును.

మాతాపితృదుఃఖము.

1. మాతృపితృవియోగంబున పెంచి పెద్దవానినిఁ జేసి యింకను కొంతకాల ముండి పోవక, పోయిరే యని దుఃఖము కలుగును. వారికి ఔర్ధ్వదైహికకర్మల నొనరించి యుత్తమగతినిఁ గలిగించినయెడల, పుత్త్రత్వము ధన్యతఁ జెందును. వారును కృతార్థు లగుదురు. కడువృద్ధులయినను లేవలేకపోయినను పూజ్యతములగు తలిదండ్రులు చిరకాల ముండవలయుననియే పుత్త్రులకు వ్యామోహ ముండును. తనకేదేని విపత్తు కలుగక ముందే వారు ధన్యులగుటకు సంతసింపవలయును. పుత్త్రులు పుత్త్రికలు మిక్కిలి చిన్నవారలయినపుడు వీరికెవరు దిక్కు. ఎవరు పోషింతురు. వీరికార్యములు జరుపువా రెవరని యెల్లజనులకు కరుణారసముచే శోకము కలుగును. తల్లి లేనిబిడ్డలనుఁ

జూచినపుడు మిగుల దుఃఖము గలుగును? వీరలిట్టి దుష్కర్మముఁ గావించుకొనినందున మాతృపితృవియోగము కలిగెను. సర్వలోకపిత జగదీశ్వరుఁడు ఎల్లలను రక్షించువాఁడు. వీరలను రక్షించునని మనస్సమాధానముచే దుఃఖోపశాంతిఁ గావించుకొందురు.

భార్యాభర్తలదుఃఖములు.

2. యౌవనమందు భార్యావియోగము దుస్సహమగు దుఃఖము. అందు సంతానవతి యైనయెడల మిక్కుటమగు దుఃఖము. బిడ్డలు మాతృవియోగముచే దుఃఖితు లగుదురు. వారినిఁ జూచి కరుణచే తల్లినిఁ గోల్పోయిరే యని యితరులు దుఃఖింతురు. సుఖదుఃఖములయందు సమభాగినియు, సద్గుణవతియు, సౌశీల్యవతియు, సదాచారవతియు, బంధుప్రియురాలును, ధార్మికురాలు నగు గృహలక్ష్మి నెడఁబాయుట యనఁగా లక్ష్మి తొలఁగుటయే యని యర్థము. ఏకాంతపు సంభాషణలును, వలఁపులును, మమతలును, తలంపునకు వచ్చినపుడు హృదయము విదారమగుచుండు. అన్యోన్యప్రేమగల దంపతులవిషయ మిది. పురుషుఁడు కఠినుఁడై, దయారస మించుకేని లేక భార్యను పోరాడి, కొట్టి, తిట్టి బాధించుచున్న యెడల నీ యిల్లాలిబాధ నేటితో దీరినదని జను లనుకొనిగొదరు. దీనింబట్టి పురుషునికి భార్యావియోగంబును, జనాపవాదంబును నగు రెండువిధములగు దుఃఖములు ప్రాప్తించును. ధనాధికార భాగ్య బంధుబలంబులంబట్టి కొందఱు సరకు సేయరు. కొందఱు పాపమువలన భీతులును, దుఃఖితులు నగు

దురు. యౌవనదశలో నుండువారు మఱల వివాహముఁ జేసి కొనినందున శ్లో. "భార్యాదుఃఖం పునర్భార్యా" యనులోకోక్తిచే ప్రథమభార్యావియోగదుఃఖము తొలఁగును. సంతానవంతులు పునర్వివాహముఁ జేసికొనక బిడ్డలను పోషించుకొనుచు, భార్యాదుఃఖమునుఁ బాపికొందురు. అనపత్యులు వంశోద్ధారక సంతతికొఱకై పునర్వివాహముఁ జేసికొనియెదరు. భార్య జీవించియుండఁగనే సమ్మతితోఁగాని,సమ్మతి లేకగాని మఱియొకవివాహముఁ జేసికొనియెదరు. వీరిరువురను సంతృప్తి పఱచుటకై విశేషశ్రమఁ జెందును. ఇది మఱియొకదుఃఖము. భార్య విరక్తురాలుగ నుండినను, చండిగానున్నను, స్వైరిణి దుశ్చారిణిగ నున్నను, మితిలేనిదుఃఖము. అనుకూలభార్యావంతులఁ జూచి యిట్టిభాగ్యము తనకు లభింపకపోయెనని దుఃఖించును. సంతానవతి యగుభార్య పుత్రపౌత్రాదులను భర్తను విడిచి పరపురుషాసక్తయైనను, దేశాంతరగతయైనను, అపారదుఃఖము. ఇట్టులే భర్తగూడనుండిన యోగ్యురా లగు భార్యకు మితిలేనిదుఃఖము సంభవించును. సంసారమునందు రాగముచే దుఃఖ మతిశయముగా నుండును. తన పూర్వజన్మకృత పాపవిశేషముచే, భార్యావియోగము కలిగినదనియు, దుశ్చారిణియైనదనియుఁ దలఁచి కలిగినదుఃఖము నుపశమింపఁ జేసికొనును. బాల్యమునందు స్త్రీలకు వైధవ్యముఁ గలిగినను తలిదండ్రులకు, ఆప్తబంధువులకు మితిలేనిదుఃఖము. ఆయువతి సచ్చరిత్రయై వ్రతోపవాసములు సలుపుచు జీవితమును సుకృతకార్యములచేతను, ధర్మకార్యములచేతను, జ్ఞానవైరాగ్యముల చేతను గడపును. ఈవైధవ్యము మహాదుష్కృతఫలమని తెలిసి

కొని దుఃఖోపశాంతిఁ గావించుకొనును. భార్యయు తొల్లి పున్నెంపు నోము నోచలేదనియు, ఎట్టిపాపకర్మముఁ జేసికొంటినో, భర్తృసుఖములేనిజన్మ మనుభవింపవలసివచ్చినదనియుఁ దలఁచికొని సుకృతములఁ జేసికొనుచు, దుఃఖముఁ బాపుకొనును.

3. వ్యాధిగ్రస్తులను బెంగళూరు మదనపల్లి లోనగు ఆరోగ్యకరప్రదేశములకుఁ దీసికొని వెళ్లి ప్రఖ్యాతిఁజెందిన వైద్యులకును, చికిత్సకులనుఁ జూపి ద్రవ్యలోభముచే మందు లిప్పించక, తగినచికిత్సలు చేయించేక యుపేక్షించినందున భార్యాపుత్త్రాదులు మృతిఁజెందిరని వారి యాత్మబంధువులు విలపింతురు. అందుకొఱకుఁగాని, లేక ప్రేమాతిశయముచేఁ గాని, కర్తవ్యాంశమయినందునగాని, ధనసంపన్నులు వ్యాధిగ్రస్తులగు భార్యాపుత్త్రాదులను బెంగుళూరు, మదనపల్లి లోనగుస్థలములకుఁ దీసికొనివెళ్లి ప్రసిద్ధవైద్యులకుఁ జూపి ధనమును వెచ్చించి తగుచికిత్సలుఁ గావింతురు. అటుపిమ్మట మృతిఁ జెందినట్లయితే పురుషప్రయత్నమునఁ జేయవలసిన దంతయుఁ జేసితిమి. దైవానుకూల్యము లేక మృతిఁజెందిరని చెప్పెదరు. కాని పురుషప్రయత్నలోపము ఔదాసీన్యమని చెప్పఁజాలరు. ఇట్లొనరించుటవలన మనస్సమాధానమున కొంతదుఃఖము తగ్గును. వ్యాధిగ్రస్తులు పొందు బాధలుకన్న తదీయాత్మబంధువులు స్నేహపాశ మమకారములచేఁ బొందు మానసికబాధలు, వ్యథలు వేయిమడుంగులు. వారు శారీరక దుఃఖములు, వీరు మానసికదుఃఖములు మితిలేక యనుభ

వింతురు. అహంకారమమకారములు తగ్గించుకొని కర్తవ్య ధర్మము నిర్వహించునది.

పుత్రమూలకదుఃఖము.

1. లోకములో దారేషణ పుత్రేషణధనేషణ యని ఈషణాత్రయము మానవులకుఁ గలిగియుండు. అందు దారేషణ పశువులకును, పుత్రేషణ పక్షులకును, ధనేషణ మనుష్యులకును, అధికమని తత్త్వజ్ఞులు నుడివెదరు. బింబమునుండి ప్రతిబింబము కలిగినట్లు, తననుండి జనించినందున పుత్త్రునకు ఆత్మజుఁడు తనూజుఁడని పేళ్లు కలిగెను. భార్యాభర్తల ప్రేమలతాఫలము నందనుఁడని పెక్కుతెఱంగుల వర్ణించియున్నారు. "పున్నామ" నరకమునుండి తొలఁగించువాఁడు కావున పుత్త్రుఁడనఁబడు. పుత్త్రునిఁ బడసి పితౄణముఁ దీర్చి, కుటుంబభారమతనిపై వైచి మోక్షార్థము తపోవనముల కరుగుట కలదు. సుకృతవిశేషమువలన వంశోద్ధారకుఁడును, గుణవంతుఁడును, విద్యావంతుఁడు నగు పుత్త్రుఁడు జనించుటవలన పిత భాగ్యవంతుఁడును ధన్యుఁడు నగు. పుత్త్రలాభముతోడ సమానమగు భాగ్యము ఆనందమును మఱియొకటి యుండదు. తద్వియోగంబుతో సమానమగుదుఃఖమును, శోకమును మఱియొకటి యుండదు.

శ్లో. "అలభ్యమానస్తనయః పితరౌ క్లేశయేచ్చిరం,
లబ్ధోఽపి గర్భపాతేన ప్రసవేన చ బాధతే.

జాతస్య గ్రహరోగాది కుమారస్య చ మూర్ఖతా,
ఉపనీతేఽప్యవిద్యత్వ మనుద్వాహశ్చ పండితే.
పునశ్చ పరదారాది దారిద్ర్యం చ కుటుంబినః,
పిత్రోర్దుఃఖస్య నాస్త్యంతో ధనీ చేన్మ్రియతే సదా.
పంచదశి. ఆత్మానంద. ౬౫,౬౭ శ్లోకం.

పుత్త్రుఁడు పుట్టలేదనియు, గర్భవతియైనపుడు గర్భస్రావమగునేమో యనియు, ప్రసవకాలమప్పు డేమివిపత్తు గలుగునో యనియు, శిశువు జన్మించినతర్వాత బాలగ్రహ అజీర్తి రోగాదులచేతను, బాలుఁ డయినపుడు చెప్పినమాట వినక, చేదువుకొనక, మూర్ఖత్వముతో నుండెననియు, ఉపనయనమయిన తర్వాత కావ్యశాస్త్రపఠనము లేదనియు, శాస్త్రజ్ఞుఁడయిన తర్వాత వివాహము కాలేదనియు, పరస్త్రీలంపటుఁడనియు, వివాహమయినతర్వాత బిడ్డలు కలుగలేదనియు, బిడ్డలు కలిగినతర్వాత అన్నవస్త్రములకు చాలక దారిద్ర్యము కలిగినదనియు, భాగ్యము లభింపలేదనియు, భాగ్యము లభించినతర్వాత అచిరకాలములోనే మృతుఁడయ్యెననియు నిట్లు పుత్త్రమూలకదుఃఖము తలిదండ్రుల కంతము లేకయుండును.

2. పుత్త్రులు కలిగి వారివలన సుఖముఁ బడయవలయునని తలిదండ్రులు మహాత్ముల నాశ్రయించి వ్రతోపవాసతపంబులు బహుక్లేశముల నోర్చి సలిపెదరు. పుత్త్రుఁడు పుట్టి వానికేదేని వ్యాధికలిగినపుడును, దుస్సహవాసముచేఁ జేదువుకొనక దురభ్యాసములు పట్టువడి ధనమును దుర్వ్యయము సేయుట చేతను, తమకు సరిపడనివారితోఁ జేరి మంతనములు సలుపుట చేతను, గర్భములోఁ బుట్టినవ్రణము బాధించుచున్నట్లు, ఈ

దుష్టపుత్త్రునివలన మితిలేని మనోవ్యథయు, దుఃఖమును గలుగును. వివాహ మయినతర్వాత భార్యవైపువారును, జ్ఞాతిశత్త్రువులును, వీనిని లోఁబఱచుకొని ఆస్తిలోనుండి భాగము పంచుకొని తెప్పించి వారపహరించుటచేతను, ఈపుత్త్రునివలన మితిలేనిదుఃఖమును గలిగి ఈతఁడు జన్మింపకున్న మనకింత దుఃఖము లేదనియు, వ్యాధివచ్చి మృతుండయినను నాటికిదన ముతో దుఃఖము తీరుననియు, ఈదుఃఖము వాఁడున్నంత వఱకు, కంటఁబడుచున్నంతవఱకు నుండుననియుఁ దలంతురు. వానికాస్తి పంచిపెట్టి స్వాతంత్ర్యము లేక పౌత్త్రులకుఁ దక్కునట్లు వ్యవహారపు టేర్పాట్లు చేసి తన్మూలకదుఃఖమునుఁ బోఁగొట్టుకొనవచ్చును. లేక యోగ్యులును మిత్త్రులు నగు వారిచే హితములుఁ జెప్పించి సన్మార్గములోనికిఁ ద్రిప్పుటచే దుఃఖము తగ్గింపవచ్చు. తండ్రియు భార్యావియోగానంతరము చిన్నబిడ్డలను విడిచి మఱియొకవివాహముఁ జేసికొనినఁ గాని, లేక దుశ్చరిత్త్రుఁ డైనఁగాని, బిడ్డలవైపువారు వ్యవహారముఁ జేసి తండ్రియాస్తిలోనుండి బిడ్డలకొఱకు రాఁబట్టుదురు. ఆస్తి సొత్తునిమిత్తమై పితృపుత్త్రులకు ప్రబలద్వేష మన్యోన్యముగఁ గలుగును. ఇందు పితృదోషముగాని, పుత్త్రులదోషము లేదు. ఇది ద్వేషమూలకదుఃఖము. మృతుఁ డయినచో కరుణారస మూలకశోకము దుఃఖము.

3. వృద్ధులగు తలిదండ్రులయెదుట యోగ్యుఁడును, గుణవంతుఁడును, ధనార్జనపరుఁడై పోషించు సుపుత్త్రుఁడు మృతిఁజెందినచో వారికి తీరని గర్భదుఃఖము, శోకము కలుగును. వానిసొమ్మును పూర్వజన్మమున మన మనుభవించితిమి.

ఋణముఁ దీర్చి కర్మ విపక్వమయినంతట విడిచి వెళ్లెను. పూర్వ జన్మకర్మ ఋణానుబంధమనియు, వార్ధకమున పుత్త్రశోకము ననుభవించునంతటి మహాపాపము తొలిజన్మమునఁ జేసికొంటి మనియు, ఆకర్మఫల మనుభవింపక తీరదనియు నిశ్చయించి, సర్వశరణ్యుఁడును, పుత్త్రులు లేనివారికి తన్నాశ్రయించుటచే సద్గతిఁ గలిగించువాఁడును నగు పరమేశ్వరు భక్తిచే నారా ధించుచు, పెద్దలవలన తత్త్వజ్ఞానముఁ బడసి అవిద్యామూలక దుఃఖమును నశింపఁ జేసికొనియెదరు.

4. గుణవంతుఁడగు పుత్త్రునివలన సుఖముఁ బడయుట, దుర్గుణవంతుఁ డగు కుపుత్త్రునివలన దుఃఖము ననుభవించుట, రెండును పూర్వజన్మకృత సుకృత దుష్కృతఫలములని ప్రజ్ఞా వంతులు హర్షవిషాదములఁ జెందరు. అజ్ఞులు అధ్యాససంబంధ వ్యామోహమువలన దుర్భరదుఃఖములఁ బొందెదరు. ప్రియ తములగు దారాపుత్త్రాదులయెడ వ్యామోహమున మమకార మున, వారికి కాలిలో ముల్లు గ్రుచ్చుకొనినదనిన వీరికి కంటిలో గ్రుచ్చుకొనిన ట్లుండును. అతివ్యామోహము కూడదు. రోగా దులు వచ్చినపు డుపేక్షింపఁ జనదు. సంపన్నులగృహమున దాదులు, పరిచారకులు, బిడ్డలను పోషించుచు, నౌషధముల నిప్పించుచు, లాలించుచు నుండి యాంతరంగికమున తమవారు కానట్లు తలఁచినవిధమున పరమేశ్వరకళలగు జీవులు ఋణాను బంధరూపముగఁ జేరియున్నారని, ధర్మము ననుసరించి జీవకా రుణ్యము గలిగి, ఔషధాదుల నిప్పించుచు, ఉపచారములు సేయుచు నుండవలయును.

5. పుత్త్రులు లేనివారు స్వీకారపుత్త్రునిఁ గొనియెదరు. ఇతఁడు పాలకపితృవాక్యము విని గుణవంతుఁ డయ్యెనేని పితకు సంతోషము గలుగును. అటు కానిచో ద్విగుణదుఃఖ మేర్పడును. స్వీకారపుత్త్రుని జననీజనకులు దరిద్రులయి రేని తద్వర్గమువారు ఈయాస్తినంతయు ననుభవించి స్వీకృతుని కేమియు లేక చేయుదురనియు, లేక యీదత్తుఁడే దుర్వ్యయము చేసి సొత్తును పాడుచేయునేమో యనియు దుఃఖము కలుగును. ఇట్టి భావితదుఃఖముల కంతము లేదు. తాను వంశాభివృద్ధికై చేయఁదగినదానినిఁ జేసితిననియు, పిమ్మట వారివారి కర్మానుగుణ్యముగ జరుగుననియు, మనస్సమాధానముఁ జేసికొని దుఃఖము విడువవలయును. గర్భజనితులకన్న పెంచిన వారియెడ మమకారము స్నేహబంధ మధికముగ నుండును. దత్తులు కాకపోయినను, బాలికలను, బాలురను పెంచి వారికి వివాహాదిశుభకార్యము లొనరించినపిమ్మట మృతులగుదు రేని కన్నవారికన్న పెంచినవారికి ద్విగుణదుఃఖ మతిశయించును. ఇది ప్రేమబంధముచే తెచ్చిపెట్టుకొనిన దుఃఖము. ఇట్టి దుఃఖములకన్నియు పూర్వమునందుఁ జెప్పఁబడిన కర్మరూప ఋణానుబంధమని తలఁచి యాధ్యాత్మిక తత్త్వవిచారముచేసిన దుఃఖ ముపశమించును.

6. పూర్వ మొకప్పుడు సువర్ణష్ఠీవియను రాకుమారుని చోరులు గొనిపోయి చంపగ, తండ్రి దుర్భర దుఃఖసంతప్తుఁడయి విలపించుచుండ, నారదమహాముని తత్త్వ ముపదేశించినను, ఆకుమారునే తిరిగి బ్రదికించుఁడని పట్టుఁబట్టి యాశ్ర

యించెను. అంతట నామహాముని తపోయోగబలముచే ఆ జీవుని రప్పించి దేహములో ప్రవేశపెట్టి నీకొఱకై నీతండ్రి మిగుల విలపించుచున్నాఁడని చెప్పగ ఎక్కడ తండ్రి? ఎక్కడి కుమారుఁడను? ఈదేహము విడిచినంతట నాకర్మఫలము నేనను భవించుచున్నాఁడను. ఈ సంసారచక్రమున ఎందఱుతండ్రులు తల్లులు తోఁబుట్టువులయిరో తెలియదు. ఇఁక నెందఱికి నేను తండ్రిగను, పుత్త్రుఁడుగను జన్మించవలయునో తెలియదు? ఈదేహములో నున్నంతవఱకు కుమారుఁడు, తండ్రి యని భ్రాంతి కలుగును. వదలినపిమ్మట నొకరికొకరికి సంబంధము లేదని చెప్పినంతట రాజునకు వ్యామోహము వదలి వైరాగ్యము కలిగెను.

7. నే నెవఁడను? పూర్వమం దెచట నుంటిని? ఇఁక నెచటికిఁ బోవలయునని విచారించినయెడల, తనను దాను దెలిసికొనినయెడల బోధ కలుగును. తనదేహమే స్థిరముకాక నశించునపుడు దేహముననుసరించిన దారాపుత్త్రమిత్ర బంధువులగుఱించి యిఁక నేమి సెప్పవలయును? రావిచెట్టున పైయాకు రాలునపుడు క్రిందియాకు స్థిరముగనుండినట్లు నవ్వును. అదియును కొంతకాలమునకు రాలును. దానిక్రిందియాకు ఇట్టుల యనుకొనును. ఇవ్విధంబుననే ఆత్మబంధుమిత్త్రులు మృతులగుచున్నపుడు తాను స్థిరమని తలఁచుకొనును. పైదృష్టాంతముచే భూతకోటియంతయు ఉత్పత్తివినాశములచే సంసారచక్రమున పరిభ్రమించుచున్నట్టుల తెలిసికొని బంధుమిత్త్రాదులకొఱకు దుఃఖింపఁజనదు

ధననష్టవిషయికదుఃఖోపశమనము.

ధనవిషయికదుఃఖము.

1. లోకములో మానవులకు ఈషణత్రయమందు ధనేషణ మధికమని యిదివఱలోఁ జెప్పఁబడెను. ధనమువలన ధర్మమును, ధర్మమువలన పుణ్యకర్మాచరణము, దానివలన సుఖభోగములు కలుగును. నిఖిలసుఖసాధనము ధనము. ధనము లేనివానికి నిధనము కలుగును. నిర్ధనునకును, మృతునకును భేద మేమియని వర్ణించియున్నారు. లోకములో ప్రాణముకన్న ధనము నధికముగఁ జూతురు. ప్రాణముపోయిన నొకనికే నష్టము కలుగును. అనేకప్రాణులను రక్షించునట్టి ధనమునకు నష్టము కలిగెనేని, పలువురకు ప్రాణనష్టము కలిగిన ట్లుండును.

2. కొందఱు హెచ్చుధర లున్నప్పుడు భూముల నమ్ముకొని, బంగారము నమ్ముకొని, పితంతువులు భరణమునకై యీయఁబడిన ఆస్తి నమ్ముకొని, వడ్డీల కిచ్చినట్లయితే నెలసరిగను, సంవత్సరపువారిగను వచ్చునని బ్యాంకీలలో(ధననిధులు) కొన్నిసంస్థలలోను, వాణిజ్యముఁ గావించు వర్తకులకును, విశ్వసనీయులకును, భూములమీఁదను, ఆస్తిమీఁదను, తాకట్టు పెట్టుకొని ధనము నొసంగుదురు. దేశకాలవైపరీత్యమున ఆ ధననిధులకును, వణిజులకును, ఋణగృహీతలకును, ధననష్టము కలిగినట్లయితే, ధనమునిచ్చిన (స్వాములు) వారికి మితిలేని దుఃఖమును, కష్టనష్టములు కలుగును. ఇఁక నెట్లు జీవింతుమా? ఉన్న దంతయు వడ్డికి నాసపడి యిచ్చితిమి? మునిఁగిపోయెనే? ఇఁక నేమిగతి యని ఆత్మబంధువియోగదుఃఖమునకన్న మితి

లేనిదుఃఖము కలుగును. మహాధననష్టము కలిగినపుడు కొందఱు దుర్భరదుఃఖమును సహింపఁజాలక, విషముఁ ద్రాగియు, బావులలో దుమికియు, నాత్మహత్యలనుఁ గావించుకొని యున్నారు. కొందఱు బుద్ధిచెడి, పిచ్చివాండ్రయి, దేశాటనముఁ గావించుచుండిరి. ఇదియే మనకాధారము, సర్వప్రేమాస్పదమని, అధికకాంక్ష కలిగినచో దాని కేవిధముననేని నష్టము కలిగినపుడు దుర్భరమగుదుఃఖము కలుగక మానదు. ఆదుఃఖము నివర్తించుట ఎట్లు? ఈ మనోవ్యాధికి చికిత్స యేమి? యని విచారించినట్లయితే అనుభవజ్ఞులగు తత్త్వదర్శు లీ క్రిందివిధమునఁ దెలిపిరి.

శ్లో. "పుత్రనాశే విత్తనాశే జ్ఞాతిసంబంధినామపి,
ప్రాప్యతే సుమహద్దుఃఖం దావాగ్నిప్రతిమం విభో.
దైవాయత్తమిదం సర్వం సుఖదుఃఖే భవాభవౌ,
అసుహృత్స సుహృచ్చాపి స శత్రుర్మిత్రవానపి.
న చ ప్రజ్ఞాలమర్థానాం న సుఖానామలం ధనం,
న బుద్ధి ర్ధనలాభాయ న జాడ్య మసమృద్ధయే.
లోకపర్యాయవృత్తాంతం ప్రాజ్ఞో జానాతి నేతరః,
త్యజ్యతే దుఃఖ మర్థాహి పాలనే న చ తే సుఖాః,
దుఃఖేన చాధిగమ్యంతే నాశమేషాం న చింతయేత్.
అన్యా మన్యాం ధనావస్థాం ప్రాప్య వైశేషికీం నరాః,
అతృప్తా యాంతి విధ్వంసం సంతోషం యాంతి పండితాః."

మహాభారత శాంతి ౩౩౧ అధ్యాయ

"నష్టం మృతమతిక్రాంతం నానుశోచంతి పండితాః,
పండితానాం చ మూర్ఖాణాం విశేషోఽయం యతః స్మృతః."

3. ధనము లభించుట, నష్టమగుట దైవాయత్తములు ప్రాణి శుభకాలమున ధనలాభము, అశుభకాలమున ధననష్టమును గలుగును. ప్రాప్తకాలమున సరిగ వడ్డీలాభము, నానావిధలాభములు కలుగుచుండె. ప్రాప్తకాలము దీరినపుడు ధననష్టము వస్తునష్టము కలుగుచుండె. పూర్వకృతకర్మవిశేషమున ధననిధికి నష్టమును, అడిగినను నిధిపాలకునకు బుద్ధి పుట్టకుండుటయు,క్లేశజీవన మనుభవించుటయు,లోనగునవి కలిగెను. కర్మఫల మనుభవింపక తీరదు. ఎన్నియో ధననిధులుండఁగ నెందరో ధార్మికసంపన్ను లుండఁగ, వీరియొద్దనుంచి ధనమునుఁ గోల్పోవుట,పూర్వజన్మమున వీరికి ఋణపడితిమి. ఋణముఁ దీర్చితిమని ప్రాజ్ఞులు కర్మఫలవైచిత్ర్యమునుఁ దలఁచుకొని దుఃఖము నుపశమింపఁ జేసికొనెదరు. ధనప్రాప్తికి మానవుని ప్రజ్ఞాతిశయమును, నష్టమునకు అజాగ్రత బుద్ధిమాంద్యతయు, సాహాయ్యమొనరించుటకు మిత్రులు, అపకార మొనరించుటకు శత్రువులును, కారణము కాఁజాలరు. వీరికర్మఫలము వారిలోఁ బ్రవేశించి వారి కావిధముగ బుద్ధి పుట్టించుచుండును గాని వారికిని స్వాతంత్ర్యము లేదనియు, సకలప్రాణులు వారివారి కర్మఫలములకు అన్యులు నిమిత్తమాత్రులుకాని వేఱుకాదనియు, శాస్త్రములవలనను, పెద్దలవలననుఁ దెలిసికొని వివేకులు దుఃఖింపరు. అవివేకులు వస్తుకర్మస్వరూపము తెలియక, యొరులు జెప్పినను వినక దుఃఖింతురు. ఈదుఃఖమువలన శరీరేంద్రియములు నష్టముఁ జెంది మఱియొకింతదుఃఖ మతిశయించును గాని, నష్టవస్తువు ప్రాప్తించదు. ఆత్మహత్యఁ జేసికొనుటవలన కర్మానుభవము తప్పకపోవుటయే గాక అంత్యకాలమున మహా

దుఃఖముతో ప్రాణము విడిచినందున ఘోరమగుజన్మము గలుగును. ఆ జన్మమందును కర్మానుభవము తప్పదు. "జీవన్ భద్రాణి పశ్యతి" యను లోకోక్తిప్రకారము బ్రతికియుండిన నెన్నఁటికేని శుభములుఁ బడయవచ్చు. పురుషార్థము సాధింపఁ దగును. అట్లు ఆత్మహత్యఁ జేసికొనుటవలన మహత్తరపాపము కలుగును.

శ్లో. "యద్భావి తద్భవత్యేవ యదభావి న తద్భవేత్,
ఇతి నిశ్చితబుద్ధీనాం న చింతా బాధతే క్వచిత్.
గతార్థాన్ నానుశోచంతి నార్థయంతే మనోరథాన్,
వర్తమానేన వర్తంతే తేన మే పాండవాః ప్రియాః."

మహాభారత. శాంతి.

కాఁదగినది యెటులేని అయ్యే తీరును. కాఁజాలనిది యెన్నిప్రయత్నంబులను కానేరదని నిశ్చయించి ప్రజ్ఞావంతులు దుఃఖింపరు. కడచినవిషయములఁ గూర్చి దుఃఖింపక, సుఖభోగములు రావలయునని యపేక్షింపక, వర్తమానవిషయములతోడనే యుండినందున పాండవులు నాకుఁ బ్రియులని శ్రీకృష్ణభగవానుఁ డానతిచ్చెను. కాఁబట్టి వివేకులు గతించిన విషయములకు చింతింపక ధనములు వినశ్వరములని, లాభనష్టములకు హర్షవిషాదములఁ జెందక లోకయాత్రకై వలసిన విషయములతోడ ప్రజ్ఞాబలముఁ గలిగి వర్తింతురు. పాంచభౌతికము లగు దేహములే నశించుచుండఁగ, వాని సుఖసాధనములగు ధనాదులు నష్టమగునపుడు విశేషముగ దుఃఖింపరు. ప్రకృతిసంబంధమువలన దుఃఖము కలుగుచున్నను ప్రజ్ఞాబల

ముచే నివర్తింపఁ జేసికొనియెదరు. ధనమదమును గూర్చి దాని వలనఁ గలుగునష్టములఁ గూర్చి మదప్రకరణమున, లోభ ప్రకరణమున, వివరింపఁబడియెఁ గావున నటఁ జూడఁదగు.

4. కొందఱు కుటుంబములోని సోదరులును, వ్యాపారములోని భాగస్వాములను ద్రోహము సేయఁదలఁచి గొప్ప ధనపు మొత్తములను, ఆత్మబంధువులగు బావ మామ లోనగువారియొద్ద దాపఱికము సేయుదురు. మఱికొందఱు ఇండ్లను భూములను వారిపేరిట విక్రయమయినట్లు వ్రాసిదాగుదురు. వారు వారివారుదానిని గుట్టుగ అపహరింతురు. ధనలోభ మెట్టివారికేని దుర్బుద్ధికలిగించును. పిమ్మట దాఁచినవారు వచ్చి అడిగినను, మొదుకొనినను, ఏడ్చినను ఉపయోగ ముండదు. ఇది బయల్పడినచో తనకేయవమానము కలుగునని దొంగకు తేలుకుట్టినట్లుగుట్టుగనుండి, తాను జేసినద్రోహము తనయెడనే ఫలించినదనియు,ధన మన్యాక్రాంత మయినదనియు దుఃఖించును. ఇది ఉన్నధనములో కొంతభాగము పోయినందున విశేషదుఃఖ ముండదు.

వ్యాపారమూలక నష్టదుఃఖము.

5. వాణిజ్యమునందు గొప్పలాభము కలిగినపుడు, తమ ప్రజ్ఞాబలమనియు, నైపుణముగ బేరముఁ జేసితిమనియు, తమ యదృష్టమనియుఁ దలఁచి హర్షముఁ జెందుదురు. మహత్తర నష్టము గలిగినపుడు చేసినవానికి ప్రజ్ఞలేదనియు, తెలివి తక్కువయనియు, దేశకాలములను గమనించి బేరముఁ జేయ లేదనియు నిందించి, అదృష్టములేదని దుఃఖింతురు. అట్లు తలఁ

చుట యవివేకము. లాభనష్టములకు వీరెవరు కారణము కాఁజాలరు. లాభనష్టములు చక్రమువలె పరిభ్రమించుచుండును. వ్యాపారమున ఎక్కువలాభము వచ్చినప్పుడు నష్టముకూడ వచ్చునని బుద్ధిమంతుఁడు తెలిసికొని కొంతధనమును నష్టము నెదుర్కొనుటకు నిలువఁ జేసియుంచును. బుద్ధిమంతులు విశేషలాభము గలిగినపుడు సంతుష్టులై వ్యాపారము సేయకుండినచో నష్టము లేదు కాని, పదుగురు జీవనమునకాధారమగు వ్యాపారము నిలుపుట, ధర్మము కాదని ఆశాప్రేరితులై సేయగ మహత్తరనష్టముచే పూర్వముఁ గలిగిన లాభ మీప్రవాహమునఁ గొట్టుకొని పోవును ఏల చేసితిమని దుఃఖింతురు. కర్మానుభవ మట్లుండినపు డూరకుండనేల బుద్ధిపుట్టును? కొందఱు వ్యాపారమునుఁ జాలించి యింటియందే కాంతముగనున్నను, కర్మప్రేరితులై లాభము రాఁదగినకాల మగునపుడు లాభమును, నష్టము రాఁదగినకాలమున నష్టమును బొందుదురు. రెండును కర్మాధీనములు. యుద్ధకాలములందు విపరీతముగ ధరలు పెరిగి కొందఱికి మహాలాభములును, కొందఱికి నష్టములును గలుగును. ఈలాభము సరస్వతీప్రసన్నరూపముగ నుండునుగాని, లక్ష్మీప్రసన్నమయినపుడెట్లుండునో చూడఁదగును? కొంతవఱకు ద్యూతముతో సమానము. విశేషలాభముల కాసపడక ప్రాప్తముచే సంతుష్టులై మితముగనుండిన నష్టము కలుగఁజాలదు.

శ్లో. "అర్థానామార్జనే దుఃఖ మార్జితానాం చ రక్షణే,
నాశే దుఃఖం వ్యయే దుఃఖం కిమర్థం దుఃఖభాజనమ్."

నీతిశాస్త్రం.

6. ధనసంపాదనమందు దుఃఖము, సంపాదించినధనముల రక్షించుటయందు మఱియొక దుఃఖము, ఆ సంపాదితధనము నాశమయినను, వ్యయమయినను దుఃఖము. ఇట్లు దుఃఖైక మూలమయినధనము కాల్పనా ? ఎందుకని ధనమువలనఁ గలిగిన క్లేశములవలనఁ జెప్పవచ్చును కాని, ఈజగత్తు ధనప్రధానమయినది. ఏకార్యమయినను ధనము లేక జరుగదు. ధనమువలన ప్రజ్ఞ ప్రకాశించును. కీర్తి కలుగును. ఉత్సాహము కలుగును మిత్రబంధు జ్ఞాతిజనులలో గౌరవము, రాజమన్ననయుఁ గలుగును. వేయేల ? సకలగుణములు ధనము నాశ్రయించే యుండును ? ధనవంతునికే పలుకుబడి కలదు ? నిర్ధనుఁడు జీవన్మృతుఁడని చెప్పఁబడును. కాఁబట్టి లోకమున సుఖగౌరవజీవనము జరుగుటకై ధన మార్జింపక తప్పదు. తానొక్కఁడే జీవించుటకై కాదు. తన నాశ్రయించినవారికిని, ధర్మకార్యములకును ధనము కావలయును. ధర్మన్యాయమార్గములచేత నెక్కువధనము కూడదు. కూడినను ధర్మకార్యముల కుపయోగించుటచేఁ దక్కును. దానము, భోగము, నాశము అని ధనముపోవుటకు మూఁడుమార్గములు. మొదటి రెండునయినను గొంత సంతృప్తి కలుగును. మూఁడవదియైన దుఃఖము కలుగును. తటాకోదరజలములు నిండినచో అలుగువిడిచిన నిలుచునుఁ గాని, లేనిచో కట్ట తెగికాని, గండ్లుపడికాని పోవును. కాఁబట్టి దానధర్మకార్యముల కుపయోగింపవలయును. అట్లు గావించినచో దానిని రక్షించి కూడఁబెట్టినట్లే యగును.

మహాధనసంచయమువలన దుఃఖము.

శ్లో. "కర్తవ్యస్సంచయో నిత్యం కర్తవ్యో నాఽతిసంచయః."

7. లోకయాత్రకై, కుటుంబసంరక్షణకై ధనము నార్జించి కూడఁబెట్టవలయుఁ గాని, యెక్కువ ఆర్జించి లక్షలాదిగ కూడఁబెట్టిన దుఃఖము కలుగకమానదు. ఆసంపాదిత మహాధనపాలనమందు రక్షణమందు జాగ్రతతో నుండినను, అందు కొంత నష్టమగునపుడు మనోవ్యథ కలుగుచుండు. తనకు సంతానములేనపు డెవరనుభవింతురో యనియు, నెట్లుపోవునో యనియు మరింత దుఃఖము కలుగును. ఈ దుఃఖనివృత్తికై కొంతభాగ మాశ్రిత బంధుమిత్రులకును, కుటుంబాభివృద్ధి కొఱకు దత్తునకును, కొంతభాగము పాఠశాల, వైద్యాలయ దేవాలయ అన్నదానాది ధర్మకార్యములకు మూలనిధిగాను, ధర్మపాలకులపరముగ నొసంగి, కొంతభాగము తన జీవితపర్యంతము యోగభోగసుఖములకును, దానధర్మకార్యములకొఱకును విభజించి, చక్కనియేర్పాట్లతో మనశ్శాంతినిఁ గావించుకొనవచ్చును.

బహుపుత్రపుత్రికాసంతానము గలవారల కధికధన మున్నచో, విద్యాగంధశూన్యులును, సంపాదనపరులు కానివారును, అవినీతులునగు వీరు దుష్టసహవాసమువలన దుర్వినియోగముఁ జేసి పాడుసేయుదురేమో యనుదుఃఖమును, వీరు ధనమునుఁ గోల్పోయి యెట్లు గౌరవముగా జీవింతురో యనుదుఃఖమును వీరిని బాధించుచుండును. ఈభావి ధననాశ దుఃఖములకు మితిలేదు. బహుకుటుంబియు, వృత్తిశూన్యుఁ

శ్లో. "పూర్వపుణ్యవిభవవ్యయలబ్ధా
శ్శ్రీభరా విపదఏవ విమృష్టాః."

నైషధీయచరితే. 5 సర్గ. 17 శ్లోకం.

9. ఇప్పుడనుభవించు లక్ష్మీవిలాససంపదలు, సుఖోపభోగములు, పూర్వజన్మకృతపుణ్యకర్మవిభవమును ఖర్చుపెట్టుకొనుటచే లభించినవనియు, తత్త్వమును విమర్శింపఁగా నంతమున విపత్తులుగ పరిణమించుననియుఁ జెప్పఁబడినవి. ఇప్పుడు సుఖభోగముల ననుభవించుచున్నాఁడనఁగా పుణ్యఫలముల ననుభవించుచున్నాఁడనియు, దారిద్ర్యదుఃఖము ననుభవించుచున్నాఁ డనఁగా పాపకర్మ ఫలముల ననుభవించుచున్నాఁడనియు భావము పూర్వపుణ్యవిశేషమువలన నఖండభాగ్యము, ధనము లభించినదని ధార్మికసంపన్నులు సత్సంగమువలనఁ దెలిసికొని అనేకప్రాణులకు జీవనోపాయము కలుగునట్లు కర్మాగారములు సంస్థలు యంత్రాగారములు నిర్మించి మూలధనమునకు నష్టము కలుగకుండ వ్యాపారముఁ జేసి, తన్మూలముగ వచ్చు లాభమువలన ననేకులకు సాహాయ్య మొనరించుచున్నారు. దీనివలన ననేకకుటుంబములు జీవించుటంజేసి పుణ్యమును కీర్తియుఁ గలుగును. ధనమునభివృద్ధి యగును. దుఃఖము కలుగదు. చిరస్థాయిగనుండు వ్యాపారములలో విశేషలాభము లేకున్నను పదుగురు జీవించుచున్నారను ధర్మబుద్ధితో కష్టపడి వ్యాపారము సాగించుచుందురు.

10. గొప్పవ్యాపారములు చేసి యఖండైశ్వర్యములఁ బొంది కాలవశంబున వ్యాపారమున నష్టంబుగలిగి భాగ్యము

నంతయు కోల్పోయి (ఋణదాతలకిచ్చి)న మానధనులు కుటుం బగౌరవరక్షణపోషణలకై యవస్థలు పడుచు, మఱల మంచి కాల మెప్పుడు వచ్చునా ? క్లేశములు తొలఁగునా ? యని నిరీక్షించుదురు. వారు ధనమును దాఁచుకొనక ఋణదాతలకొసంగి నందున నీతిధర్మప్రవర్తకులని లోకు లాదరించి సాహాయ్య మొనరింతురు. అఖండవర్షము కురిసినపుడు గుంటలలో, చెఱువులలో నిలిచిన నీరే యుండి తక్కినదంతయు ప్రవాహరూపముగ సముద్రగామి యైనట్టుల, దానధర్మకార్యముల కొసంగిన ద్రవ్యము, ధర్మశాలలు, పాఠశాలలు, వైద్యాలయములుగా నిలుచుఁగాని, తక్కినవేవియు నిలువవు. ధర్మకార్యములు చేసిన వానికి దారిద్ర్యము కలిగినప్పటికిని, ధనము సద్వ్యయమయినందున పరలోకమున పుణ్యమును, ఇహలోకమునఁ గీర్తియుఁ గలిగినందున దుఃఖము బాధింపదు. సుకృతవిశేషమువలన మనోబలముగలిగి దుఃఖ మంతరించును.

వ్యాపారనష్టదుఃఖము.

11. గొప్ప ధనసంపన్నులు ఉపకారవేతనము నందిన, జడ్జీలు, కలెక్టరులు, ఉన్నతోద్యోగీయులు, తమకుమారులు విద్యావంతులు కానందునను, అయినను ఒకరియొద్ద కొలువు సేయుటకు వారు సమ్మతింపనందునను, వృత్తిఁ గల్పింపవలెనని కొంతధనము నొసంగి వ్యాపారము సేయున ట్లనుమతింతురు. వ్యాపారమర్మములు అందలికష్టసుఖములు వీరికిఁ దెలియమిచే వ్యాపారమర్మనిపుణులును, మిత్రరూపవంచకులునగు కొందఱు చేరి వ్యాపారము నిర్వహించుచు లాభము కలిగినటుల

చూపించి ధనమపహరించుటవలన నష్టము కష్టము కలుగును. వ్యాపారమర్మనిపుణులును, చిరకాలానుభవముగలవారును, కుటుంబభరణ జీవనోపాయములకై ఆస్తి కుదువఁబెట్టియు, ఋణముఁ దీసియు,ధనము తెచ్చి వ్యాపారము సేయుచుందురు. కొన్నిసమయములలో విశేషలాభములు గలిగి సుఖభోగముల ననుభవింతురు. కాని నష్టములు రాఁబోవుననియు, ఋణదాతలకు ధనము ప్రత్యర్పణము సేయవలెననియుఁ దలంపరు. కొంతకాలమునకు విశేషనష్టములు కలిగినపుడు చాలినంత ధనము లేక, భీమా చేసి ధనము తెచ్చి వ్యాపారము జరుపుచుందురు. బ్యాంకీలకు నియమితకాలమున ధనము చెల్లింపనపుడొక గండము, ఋణదాతలు పలుమాఱు తిరిగి యడిగినపు డొకగండము. ఆస్తియంతయు పోవునేమో యనియు, మానహాని కలుగునేమో యనియు ననేకదుఃఖములలో మునిఁగి యుందురు. మానవంతుఁడగు నాతనిమనోవ్యథ చెప్ప నలవి కాదు.

జీవికావృత్తి లభింపమి దుఃఖము.

1. చేదువుచు పరీక్షలయందు జయము కలుగమి యొక దుఃఖము. పరీక్షలయందు విజయమొందియు, వృత్తివిద్యయందు శిక్షితుఁడయ్యు, పట్టభద్రుఁడయ్యు, ఉద్యోగము లభింపమి యొకదుఃఖము. అర్హతఁగలిగియు, సిఫారసులుండియు, ఖాళీలు లేకపోవుట, ఖాళీలున్నను, దైవానుకూలత లేక తనకన్న తక్కువ యోగ్యతగలవానికి లభించుట, లోనగు

వృత్తివిషయికదుఃఖము లనేకములు బాధించుచుండ దీని నివారణోపాయ మెట్టులనిన,

శ్లో. "వృత్త్యర్థం నాఽతిచేష్టేత సా హి ధాత్రైవ నిర్మితా,
గర్భాదుత్పతితే జంతౌ మాతుః ప్రస్రవతః స్తనౌ.
యేన శుక్లీకృతా హంసా శ్శుకాశ్చ హరితీకృతాః,
మయూరా శ్చిత్రితా యేన స తే వృత్తిం విధాస్యతి."
మహాభారతం. శాంతిపర్వం.

జీవనవృత్తికై తిరిగి తిరిగి, శ్రమచే విశేషముగ నాయాస పడఁగూడదు. శిశువు పుట్టఁగనే మాతృస్తనములందు క్షీరములుంచినట్లు సకలప్రాణులకును జీవికావృత్తులను ముందుఁ గల్పించి, పిమ్మట ప్రాణులను సృజించినాఁడు. ఏజగద్రక్షకుఁడు దయానిధి. హంసలను తెల్లగను, చిలుకలను పచ్చగను, నెమిళ్లను చిత్రవన్నెలుగను సృజించెనో,ఆకృపానిధి వృత్తిఁ గల్పింపక మానఁడని, పురుషప్రయత్నమునుఁ జేయుచుండవలెను. మనము ప్రయత్నింపనేల; పరమేశ్వరుఁడే సేయునని తలంచినచో, వ్యావహారికప్రపంచమునందు ప్రయత్నింపనందున లభింపలేదని యపవాదము కలుగును. పారమార్థికమున అట్టి ప్రయత్నమునుఁ జేయించువాఁడు పరమేశ్వరుఁడే? పురుషప్రయత్నము నిమిత్తమాత్రము; ఘటింపనేయునదంతయు దైవమే. కర్షకుఁడు దున్ని విత్తనములు చల్లినచో, సకాలమున వర్షించి పంటకలుగును. దైవానుకూలరూపమగు వర్షమున్నను, పురుషప్రయత్నరూపకృషి బీజావాపము లేనిచో పంట పం

డునా ? అట్టులే కార్యసిద్ధికి పురుషప్రయత్నము దైవాను కూలము రెండును గావలయును.

2. తండ్రి అన్నవస్త్రము లిచ్చి పోషించి ధనము వ్యయముచేసి విద్య గఱపించును. వివాహముగూడ సేయును. పిమ్మట జీవనవృత్తిని సంపాదించుకొని తనకుటుంబమును పోషించుకొనుబాధ్యత యువకునిది. విద్యార్థులు పెక్కండ్రు, ఎక్కువ ధనము వ్యయముఁజేసి పలుకష్టములకు లోనై, ఉత్తమ పరీక్షలయందు తీర్ణులై యుద్యోగము లేక, జీవనవృత్తి లభింపక, దుఃఖముల పాలగుచున్నవారలు. ఉన్నతోద్యోగము లభించు ననియు, న్యాయవాదివృత్తియం దధికము గడించుననియు, భూములనమ్మి ఋణములఁ దీసి చేదువు చెప్పించుచుండఁగ, నీతఁడు తగినవరుఁడని యెక్కువ ధనము వ్యయముఁజేసి కట్నములతోఁ గూడ కన్యకల నొసంగి వివాహము సేయుదురు. భార్యయు కాపురమునకు వచ్చును. సంతానము కలుగును. ఎంతప్రయత్నించినను,సిఫారసు లుపయోగించినను, అధికారుల నాశ్రయించినను, దేశకాలపరిస్థితులఁ బట్టి యుద్యోగము లభింపదు. జీవికావృత్తికిఁ గావలసినధనము ప్రాప్తింపదు. ఇట్టి స్థితిలో దుర్భరమగుదుఃఖము కలుగును. దైన్యముఁ జెందక ధీరుఁడై సచ్ఛీలుఁడై ప్రాక్తనకర్మపక్వము కాలేదు. అయినచోఁ బిలువనంపించి యిత్తురను నమ్మకముతో నుండెనేని, వానికి కర్మానుగుణ్యముగ నర్హతకుఁ దగిన యుద్యోగము లభించి క్లేశములు వీడిపోవును. తనతో సమానులును, తక్కువ యర్హతగలవారికి లభించెను. తనకు లభింపలేదే యని వ్యసన ముతో నుండునుగాని, తనకు ప్రాప్త (అదృష్ట) కాలము రాలే

దనియు, ఓపికతోనుండిన వచ్చితీరుననియునను దృఢభావనతో నుండవలయును.

శ్లో. "ప్రాప్తవ్యమర్థం లభతే మనుష్యో
దేవోఽపి తం లంఘయితుం న శక్తః,
తస్మాన్న శోచామి న విస్మయో మే
యదస్మదీయం న హి తత్ పరేషామ్."

పంచతంత్రమ్.

మానవుఁడు కర్మానుగుణ్యముగ పొందఁదగిన విషయమును (ఫలితమును) తప్పక పొందును. దైవమునకుఁ గూడ దానిని తొలఁగించుటకు శక్యము కాదు. ఏది తనదో, తనకే లభించును గాని యితరులకు లభింపదు. ఏది కాఁదగునో అది తప్పక అయ్యే తీరును. ఏది కాఁజాలదో యెన్ని ప్రయత్నంబులకేని కానేరదు అనున్యాయము ననుసరించి, వివేకికి దుఃఖము కలుగదు, ఆశ్చర్యమును గలుగదు. ప్రాణులకు కష్టసుఖములు వచ్చుచుండును, కష్టముల ననుభవింపఁ జాలక సుఖములఁ గోరుచుందురు. అది ప్రాణిధర్మమే. అయితే ప్రకృతి ధర్మప్రకారము ఏకాలమం దేది రావలయునో అధి వచ్చితీరును. కష్టమువచ్చినది గనుక అనుభవించేవలయును. వెంటనే సుఖముఁ గూడ వచ్చును గనుక యోర్పుతో నుండవలెనని బుద్ధిమంతుఁడు తలఁచి దుఃఖోపశమనముఁ గావించుకొనుచుండును.

ఉద్యోగములఁ బోఁగొట్టుకొనిన దుఃఖము.

3. కొందఱు ఉద్యోగము లేక కష్టపడుచుండఁగా, ఉద్యోగములో నుండువారు బ్యాంకీలలో నుండువారు ధన

మపహరించి, ఉన్నతాధికారులయు యజమానులయు నమ్మక మునుఁ బోఁగొట్టుకొని, ఉద్యోగములనుండి తొలఁగింపఁబడి దుఃఖించువారు మఱికొందఱు కలరు. శీలము యోగ్యత లేనిచో లక్ష్మీకటాక్షమునకు దూరుఁడై పదభ్రంశమునుఁ బొందును. వారి దుష్కృతమే వారి దుఃఖకారణమని తలంపఁ దగును. ఉద్యోగములో నుండువారు తమకాపదవి స్థిరపడ లేదనియు,స్థిరపడినపిమ్మట అభివృద్ధి(Promotion) కాలేదనియు, అయినపిమ్మట పరంపరోన్నతపదవు లీయలేదనియు, తమ జ్యేష్ఠత్వమును (Seniority) నిరాకరించిరనియు, తక్కువవారి కిచ్చి తమ కన్యాయ మొనర్చిరనియు, తమయభ్యుదయమున కాటంకము కలిగించిరనియు, పలువిధముల దుఃఖింతురు. తనపేరు పట్టికలో నుత్తమశ్రేణిలో నున్నను, అధిపతికి కన్పడలేదనియు, తనకు మంచికాలము రానందున, ప్రమోషన్‌గాని, స్థిరపడుట కాని ప్రాప్తించలేదనియు, అధీశ్వరుని లోపము కాదనియు, తన కాలమును కర్మఫలమును దలఁచుకొనుచు దుఃఖోపశమనము గావించుకొనును.

4. భూస్వాములును, రైతులును, పొలములు దున్ని విత్తనములు చల్లి సకాలమున వర్షముఁ గురియక పంటలు పండక క్షామము గలుగుటవలన దుఃఖముఁ జెందుదురు. అనావృష్టి వలన నెంతఫలితమో,అతివృష్టివలన నంతియే ఫలితము. పంటలు పండనందున పశువులకు మేతలేక యింటియం దాహారధాన్యములు లేక ఋణములుఁ జేయుదురు. ఇట్లు నాలుగయిదు సంవత్సరములు క్రమముగనుండిన రైతుకుఁ గలుగు కష్టనష్టములకు మితిలేదు. సర్కారుశిస్తు కట్టవలెను. జీతగాండ్రకు, పాలె

గాండ్రకు ధాన్యముఁగాని ధనముఁగాని యీయవలెను కుటుం బగౌరవమునకుఁ దగునట్లు శుభకార్యము లొనరింపవలెను. మిత్రబంధువులకు సాహాయ్య మొనరింపవలెను. ఈసందర్భము లవలన ఋణము లధికమగుటచే, కుటుంబములు తక్కువస్థితి లోనికి వచ్చును. ఋణదాతలబాధ లధికముగ నుండును. కొలఁదికాలములోనే ఆస్తియంతయుఁ బోవునని దుఃఖము అపరిమితముగఁ గలుగును. ఇట్టి దుఃఖములకును పూర్వోక్త మగు భావనయే నివారణోపాయము. రాఁబడికిఁ దగునట్లు ఖర్చులు సేయుచు, మంచికాలమునకై నిరీక్షించుచు, శక్తి కొలఁది ధర్మకార్యము లొనరించుచు,సచ్ఛీలుఁడై, భగవద్భక్తి పరాయణుఁడయ్యేనేని, ఆధార్మికకర్షకునకు దైవము తోడ్పడి కష్టములనుండి తొలఁగించును.

సాంసారిక ఆర్థికక్లేశములు.

1. ప్రతిమానవుఁడును ఉదయమున లేచినతోడనే సాంసారికచింతలచేతను, ఆర్థికక్లేశములచేతను దిగులుఁ జెందు చున్నాఁడు. ధనసంపన్నుఁడు తాను ఇతరులకిచ్చినధనము రాలే దనియు, దరిద్రుఁడు జీవనోపాయమునకు ధనము లభింపలేదని యు, నిరువురు చింతిలుచున్నారు. దారిద్ర్యము దానికితోడు బహుకన్యకాసంతానము, వారికి వివాహాదికార్యము లొన రింపవలసి యుండుట, ఇదియంతయు దుఃఖకారణము.

2. చిల్లర దుకాణములుఁ బెట్టుకొని వ్యాపారములు చేయువారు, పారిశ్రమిక శిల్పకళలవృత్తులచే జీవించువారు, ఇతరు లీయవలసినధనము నీయక త్రిప్పుటచేతను, ఖండిత

ముగ నడిగినట్లయిన మఱల పనులఁ జేయించుకొనరేమో యనియు, దిగులుపడి జీవనమునకు వలయుధనము లభింపక దిగులు పడియెదరు. చిల్లరదుకాణవ్యాపారములు, అప్పుల నీయక సాగవు. ఇచ్చినచో శీఘ్రముగ నీయరు. కొంద రెగ వేయుదురు. ఈకారణములచే జీవనము జరుగక వారును దుఃఖింతురు. ఇట్లు ఆర్థికక్లేశములచేత సాంసారికదుఃఖములు మితిలేక యుండును.

3. ఈ దుఃఖములనన్నిటిని ప్రజ్ఞాబలముచేతను, ఉపాయముచేతను, ఓర్పుచేతను, నిర్వర్తించుకొనఁ దగును. దుఃఖించి దిగులుపడినంతనే ఫలితము కలుగదు. ఏకాలమందు కలుగవలయునో, అప్పుడే కలుగును. అయితే దైన్యముఁ జెందక పురుషప్రయత్నము సేయుచుండవలయు. భయదుఃఖహారియు, ఆపద్బాంధవుఁడు నగు భగవంతు నాశ్రయించినట్లయిన దుఃఖములు తగ్గును. వెలుఁగు ప్రవేశించినంతట, చీఁకట్లు పటాపంచలయినట్టుల భగవత్స్వరూపము హృదయములోఁ జేరినంతట దుఃఖములన్నియు నశించును. అంతయు నా జగదీశ్వరునిపై నిడి, ఆయన నాశ్రయించి కర్తృత్వాభిమానము వీడినచో, నింతకన్న దుఃఖశమనోపాయము, చికిత్స మఱియొకటి యుండదు.

శ్లో. "హే లోకాశ్శృణుత ప్రసూతిమరణవ్యాధేశ్చికిత్సామిమాం
యోగజ్ఞాస్సముదాహరంతి మునయః యాం యాజ్ఞవల్క్యాదయః,
అంతర్జ్యోతి రమేయ మేక మమృతం కృష్ణాఖ్య మాపీయతాం
తత్పీతం పరమౌషధం వితనుతే నిర్వాణ మాత్యంతికం."

ముకుందమాల.

ఓ జనులారా! వినుఁడు. జననజరామరణరూప సాంసారికవ్యాధులకు, భిషగ్వరేణ్యులగు యాజ్ఞవల్క్యాదియోగీశ్వరులు, కృష్ణనామామృతరసాయనమును గనిపెట్టిరి సచ్చిదానందరూపంబగు నీయమృతరసాయనమును బానము చేసినచో తాపత్రయదుఃఖవ్యాధులన్నియు నశించి, నిరతిశయానందసుఖరూపంబగు మోక్షము గలుగును. ఇదియే ఆత్యంతిక దుఃఖనాశనమునకు దివ్యౌషధము.

ఓ పరమేశ్వరా! వినశ్వరములగు ధనసమూహ కామోపభోగభాగ్యైశ్వర్యములయందు నా కాసక్తి లేదు. ఏలనగా: పూర్వకర్మానురూపముగ నా సుఖాదిభోగములు వచ్చును. వానివలన సాంసారికదుఃఖములలోఁ జిక్కుకొని, నీ నామస్మరణమును మఱతును గనుక, జన్మజన్మాంతరమందును నీ పాదారవిందములందు భక్తి నిశ్చలముగ నుండునట్లు అనుగ్రహింపుమని ప్రార్థించుచున్నాఁడను.

మనస్సమాధానము.

"నాన్యం తతః పద్మపలాశలోచనా
దుఃఖచ్ఛిదం తే మృగయామి కంచన."

శ్రీ భాగవత. చతుర్థస్కంధం.

4. మహత్తరదుఃఖము గలిగినపుడు పుండరీకాక్షునాశ్రయించుటకన్న మఱియొక దుఃఖనాశోపాయము లేదని ధ్రువునితో తల్లి చెప్పెను. దీనింబట్టి దారిద్ర్యమును, విపత్తులు గలిగినపుడు భగవదాశ్రయ తపశ్చరణంబులకన్న నుత్తమంబు మఱియొకటి లేదు.

శ్లో. "విపదో నైవ విపద స్సంపదో నైవ సంపదః,
విపద్విస్మరణం విష్ణోస్సంపత్తస్యైవ సంస్మృతిః."

విపత్తులు (దుఃఖములు) విపత్తులు కావు. సంపదలు (సుఖములు) సంపదలు కావు. పరమాత్ముఁడగు విష్ణువును మఱచుటయే విపత్తి. నామసంస్మరణమే సంపద. ఇట్లనుటచే భగవన్నామస్మరణమువలన సకలదుఃఖములు నశించునని భావము.

౫. అనాద్యవిద్యాబంధములోఁ జిక్కుకొని, తాపత్రయదుఃఖములలో మగ్నులగుచుండు మానవులయెడ కరుణ కలిగి వారి నుద్ధరించి మోక్షమొసంగుటకు సకలదర్శనములును ప్రవర్తిల్లినవి. దుఃఖితులగు సకలప్రాణులఁ జూచి, కరుణ గలిగి బుద్ధదేవుఁడు దుఃఖనివారణోపాయముఁ గనిపెట్టి మతమును వ్యాపింపఁజేసెను. జగత్తంతయు దుఃఖమయము. ఎట్లనఁగ: జన్మజరామరణములు దుఃఖములు. అనారోగ్యము దుఃఖము. అప్రియసంయోగము ప్రియవియోగము దుఃఖము. వాంఛితార్థము సిద్ధింపకుండుట దుఃఖము. ఇవి చతురార్య సత్యములు. ఇంద్రియవిషయములు (వాంఛలు) ఆశ నభివృద్ధిఁ జేయును. ఆశాభివృద్ధి యనఁగ తృష్ణ. దీనివలన దుఃఖము కలుగును. తృష్ణ యడఁగిన దుఃఖ మంతరించును. దుఃఖాంతమే నిర్వాణము. ఈ నిర్వాణప్రాప్తికి సమ్యగ్దృష్టి, సమ్యక్సంకల్పము, సమ్యగ్వాక్కు, సమ్యక్కరణము, సమ్యగాజీవము లోనగు నష్టాంగమార్గము చక్కని రాచబాట. ఇయ్యది బౌద్ధ మతసిద్ధాంతము. సాంఖ్యదర్శనమందును, ఆత్యంతిక దుఃఖ నివృత్తియే మోక్షము.

శ్లో. "యా దుస్త్యజా దుర్మతిభి ర్యా న జీర్యతి జీర్యతః,
యోఽసౌ ప్రాణాంతికో రోగ స్తాం తృష్ణాం త్యజతస్సుఖం."
మహాభారత. శాంతి. 174 అధ్యాయ.

6. అవివేకులచే విడువ శక్యముకానిదియు, మానవుఁడు ముసలితనముచే క్షీణించుచున్నను తానుమాత్రము వృద్ధిఁ జెందునదియునగు తృష్ణారోగము ప్రాణమును అపహరించునది. ఎంతనీరు త్రావినను దప్పి (తృష్ణ) తీరనట్లు, ఎన్ని సుఖోపభోగముల ననుభవించినను, తృప్తిఁ జెందని తృష్ణారోగమును నివర్తింపఁ జేసికొనవలయును. ఈతృష్ణను విడిచినట్లయితే దుఃఖము నశించును. సంతోషసౌఖ్యములు గలుగును. దేహావయవములన్నింటికి వార్ధకమున శిథిలావస్థ వచ్చినను, తృష్ణకు మాత్రము యౌవనము కలుగుచుండునని భర్తృహరి యోగీంద్రుఁడును జెప్పెను.

ఆశ (Ambition) సద్విషయాభిలాషము, ఇచ్ఛ మానవమాత్రున కుండక తప్పదనియు, దానివలన నంత నష్ట ముండదనియు, అత్యాశ లేక తృష్ణవలన నష్టము కలుగుననియు, కామప్రకరణమున వివరింపఁబడెను గనుక అటఁ జూడఁదగును.

మనస్సమాధానము.

1. అర్థార్థులగు యాచకులయెడ ఆశ (తృష్ణ) అధికముగ నుండును. ఆశాప్రేరితులై పెనుగాలిచే పుల్లియాకు కొట్టుకొనిపోఁబడినట్లు అగమ్యస్థలములకును, గుంట, పల్లము, నూయి తెలియక పడిపోవుచుందురు. కొండకన్న సముద్రము

గొప్పది. సముద్రమునకన్న ఆకాశము గొప్పది. దానికన్న బ్రహ్మము గొప్పది. ఆ బ్రహ్మముకన్న ఆశ (తృష్ణ) గొప్పది యని పెద్దలు వర్ణించియున్నారు. అట్టి ఆశాపూర్తి కలుగనపుడు దుఃఖము కలుగును. తన్నివారణోపాయ మెట్లనిన:

శ్లో. "యద్ధాత్రా నిజఫాలపట్టలిఖితం స్తోకం మహద్వా ధనం
తత్ప్రాప్నోతి మరుస్థలేఽపి నితరాం మేరౌ చ నాఽతోఽధికం,
తద్ధీరో భవ విత్తవత్సు కృపణాం వృత్తిం వృథా మాకృథాః
కూపే పశ్య పయోనిధావపి ఘటో గృహ్ణాతి తుల్యం జలం."

భర్తృహరి.

ఓ యాచకా! బ్రహ్మదేవునిచే నొసట వ్రాయఁబడిన ఫలితము (ధనము) కొద్దియైనను, గొప్పదైనను, ఎడారిలోనికిఁ బోయిన నంతియ చిక్కును. బంగారుకొండ యని మేరువు నొద్దకుఁ బోయిన నంతియే చిక్కును కాని యెక్కువ ప్రాప్తింపదు. కాఁబట్టి ధనాఢ్యులఁ జూచి యాసపడి నీ దీనవృత్తినిఁ జూపవలదు. ధీరుఁడవై యుండుము. ఘటము కొద్దిజలముగల నూతిలోఁగాని, మహాజలముగల సముద్రమునఁగాని, తనకు వలసినజలమునే పొందునుగాని అధికము పొందఁజాలదు. అట్టుల నీకెంతపాత్ర మీశ్వరుఁ డొసంగెనో దానికిఁ దగినంత ఫలితమే (ధనము) ప్రాప్తించుఁగాని యెక్కువ లభింపదు. అల్పధనుఁడని, మహాధనుఁడని, వారి కొద్దిగొప్పలు నీ కక్కఱ లేదు. వా రెంతయిన నేమి, నీకెంత లభించునో అంతకన్న నెక్కువ లభింపదు. వారి మణిభూషణాంబర ధననిచయములఁ జూచి, యెక్కువ యిచ్చునేమో యని ఆశ పడవలదు. ఆశా

భంగము గలిగినచో దుఃఖము ప్రాప్తించును. కాఁబట్టి వారి నాశ్రయించి యెంత ప్రాప్తించునో, దానితోడ సంతృప్తిఁ జెందియుండునది కాని వగవఁగూడదు. ఇట్టుల విద్యాగంధ శూన్యులగు నవివేకులు కొందఱు వ్యాపారములు చేసి నందున వారికిఁ జెందవలసినధనమును బ్యాంకిచెక్కులుగా నిత్తురు. వానినిఁ గొని కొద్ది ధననిధులవద్దగాని, గొప్ప ధన నిధులయొద్దగాని మార్చినచో చెక్కులలో నెంత వ్రాయఁబడి నదో, అంతియే వచ్చునుగాని యెక్కువ రాదు. వాని కెక్కువ వచ్చినది, నాకు తక్కువవచ్చినదని వివాదపడినపుడు ఓ యవి వేకులారా! మీ చెక్కులలో నెంత వ్రాయఁబడినదో అంతియే యిత్తురు కాని యెక్కువ యీయరని అధ్యక్షుఁడు బుద్ధిచెప్పి పంపును. ఈబోధను అర్థార్థులెల్లఱు జ్ఞప్తియం దుంచుకొనఁ దగును.

2. ఈధనమును అల్పులడిగిన తిరిపమని, మధ్యము లడి గిన యాచ్నయని, ఉత్తము లడిగిన చందా యని, ప్రభువు లడిగిన సాహాయ్యనిధియని చెప్పఁబడును. ఉత్తములగు గొప్ప వారు సంపన్నులు, విద్యాలయ వైద్యాలయ దేవాలయ వాపీ కూపతటాకాది ధర్మకార్యములనిమిత్తము ధనార్థులయి వచ్చిన యెడల, వారి సొంతమునకుఁ గాదు, వారుకూడ పట్టికలో వేసినారని, ధనికులు చందాధనమును పట్టికలో వైతురు. ధనముగల లుబ్ధులు కొద్దిగ వైతురు. ఉదారసంపన్నులు తమ శక్తికొలఁది వైతురు కార్యగౌరవమును, అర్థులగౌరవమునుఁ గనిపెట్టి తనగౌరవమునకుఁ దగినట్లు వదాన్యసంపన్నులు వైతురు. కొందఱు ధనగర్వితలుబ్ధాగ్రేసరులు యాచకులనుఁ

ద్రిప్పి యాశపెట్టి కొలఁదిగ నిత్తురు. మఱికొందఱు బొత్తిగ నీయరు. ఆశాభంగముఁ జెందిన ఆయాచకుల మనఃకష్టము చెప్ప నలవికాదు. సామర్థ్యముఁ గలిగియు, యాచకులమనోరథముఁ బూర్తిసేయఁ జాలనివారిదేహములు భూమికి భారము కాని, కొండలు చెట్లు మృగములు లోనగునవి భారముకావని నైషధీయచరితమునందు చెప్పఁబడియె.

3. యాచ్ఞావృత్తి గలవారును, మానాభిమానములు లేనివారును, ధనలుబ్ధుల కోపాటోపంబులను, నీచంపుఁబలుకులను, అర్థార్థులయి సహింతురు కాని, కుటుంబక్లేశములచే నర్థార్థియై వచ్చిన మానవంతుఁడు సహింపఁజాలఁడు. యాచ్ఞావృత్తి యెఱుంగని యాతనిమనంబు ఈధనలుబ్ధుఁ డేమనునో యని భీతిలుచుండును. పరేంగితజ్ఞులును, వదాన్యశేఖరులు నగు సంపన్నులు మనస్విజనంబులమనంబుల నొంపరు. వారి నాదరింతురు. ధన మీయకున్నను, ప్రియవాక్యాదరముచే వారు సంతుష్టు లగుదురు.

శ్లో. "ప్రియవాక్యప్రదానేన సర్వే తుష్యంతి జంతవః,
తస్మాత్తదేవ కర్తవ్యం వచనే కా దరిద్రతా."

నీతిశాస్త్రం.

ప్రియవాక్యాదరములచేత సకలప్రాణులును సంతోషించును గనుక ధన మీయ లేకున్నను ప్రియవాక్యామృతము నొసంగి యాచకులతాపమునుఁ బోఁగొట్టవలయు కాని, ప్రియవాక్యప్రదానమందును దారిద్ర్య మేల కలుగవలయును? కొందఱు మాటాడినచో, తమ గౌరవము తగ్గునని మూతి ముడుచుకొందురు. వక్తృత్వసామర్థ్యము లేమికాని మఱి

యొకటి కాదు. కాఁబట్టి యాచకుల ప్రియవాక్యములచే నాదరించి, శక్తికొలఁది యెంత యొసంగినను సంతుష్టు లగుదురు. భగ్నమనోరథులుఁ గావించినచో అధికపాపము నొడఁగట్టుకొందురు.

శ్లో. "అకృత్వా పరసంతాప మగత్వా ఖలమందిరం,
అక్లేశయిత్వా చాత్మానం యదల్ప మపి తద్బహు."

స్మృతి.

ఇతరులను పీడింపక, దుర్జనులయిండ్ల కడుగిడక, తనమనస్సును వ్యథపఱచుకొనక యెంత స్వల్పము ప్రాప్తించినను, అదియే మహాధనముగ నుండును. యదృచ్ఛాలాభసంతుష్టిచే సజ్జనులు ప్రశాంతమనస్కులుగ నుందురు.

4. యాచ్ఞావృత్తిఁగల యాచకులు వివాహోపనయన ధర్మకార్యములకని పేరుపెట్టుకొని పెక్కండ్రుధనికుల పీడించుచుండఁగ వారికి విసుగుదలయు కోపమును గల్గును. యథార్థకార్యార్థు లెవరు? మిథ్యాకార్యార్థు లెవరని కనిపెట్టఁజాలక, అందరిని సమానులుగఁ జూతురు. మిథ్యాకార్యార్థులవలన యథార్థ కార్యార్థులకు నష్టమును కష్టమును గలుగును ధనికులును కొంతభాగము ధర్మకార్యార్థమై విభజించియుందురు. యాచకులసంఖ్య మిక్కుటమైనందున ధర్మార్థముగ విభజించిన ధనమునకన్న నధికమగుమొత్తము వినియోగింపఁ బడుటవలన ఆయాసమును,విసుగుదలయును గల్గును. కాఁబట్టి దాతకు సంకటముఁ గలుగునట్లు యాచకులు ప్రవర్తింపఁ గూడదు. ఎంత ధనవంతుఁ డయినను, మంచివాఁడయినను, ధర్మార్థము మితముగ వ్యయము సేయును గాని, ఉన్నదంతయు పోఁగొట్టు

కొనఁడు. అందువలన యాచ్నావృత్తిగౌరవమునుఁ బోఁగొట్టును. అర్థార్థులగు మానవంతులు దాతృమిత్రపరిచయంబునను, గొప్పవారివలన తెలుపఁబడి లబ్ధమనోరథు లగుదురు. పరిచయము లేనిచోటికి, తన స్వరూపవృత్తిధర్మములు తెలియని చోటికి మాననీయులు వెడలఁగూడదు.

విపత్తులయందు వివేకునిదృష్టి.

శ్లో. "అపగచ్ఛతి మూఢచేతనో ప్రియనాశం హృది శల్యమర్పితం,
స్థిరధీస్తు తదేవ మన్యతే కుశలద్వారతయా సముద్ధృతం."

సూక్తిసుధానిధి.

ఇష్టవస్తువియోగము (నాశము) కలిగినపుడు మూఢుఁడు హృదయమునందు చీల గ్రుచ్చుకొనినట్లు వ్యథఁ జెందును. వివేకి యనినసో, ముందు మేలు గలుగుటకుఁగాను హృదయమునుండి మేకు నూడఁబెఱికినట్లు హితముగఁ దలఁచి దుఃఖింపఁడు! తమకుఁ గలుగు విపత్తులన్నియు, నీశ్వరునుండి పంపఁబడిన హితదూతికలుగ భావించి జ్ఞానులు (భక్తులు) వానినుండి యేదియో యొకనీతిని బోధను గ్రహింతురు. మనము చీఁకటిలో దారినిఁ బోవునపుడు ఒక స్తంభమునుఁగాని, రాతిఁ బండనుగాని కొట్టుకొని యిది మార్గము కాదు తప్పివచ్చితిమని వెనుకకు తిరిగి వెలుతురుసహాయమున చక్కనిమార్గమునఁ బోయి గమ్యస్థానము చేరినట్లు, అజ్ఞానాంధకారములో అహితమార్గమునఁ బోవునపుడు విపత్తులను కంబములు, రాళ్లు తగులుకొని జ్ఞానముచే నిది అహితమార్గమని తెలిసికొని, సన్మార్గమునఁ బోయి, అభయంబును అమృతత్వంబు నగుపదవినిఁ

జెందును. విపత్తులు దుఃఖములు లేనప్పుడు జ్ఞానవైరాగ్యములు కలుగవు. విపత్కాలమునందే భగవంతుని స్మరించుట, కర్మాను భవమని తలఁచుకొనుట, తన్నివారణమునకై జపహోమపూ జార్చనాదులఁ గావించుట, పేదలకు ధర్మ మొనరించుట, పెద్ద లను సేవించుట, అట్టివిపత్తులే లేనిచో సంపదంధుఁడై విశ్రాంతి లేక యీలోకమును సృష్టించిన దేవరు? వీరేల యిట్లుండ వలయునని కీటకములతో సమానముగ నెల్లరినిఁ జూచు చుండును. కుంతీదేవియు ఎల్లప్పుడు భగవత్సందర్శనముఁ గలి గించువిపత్తులు కావలెననియే కోరెను.

ఆత్మశిక్షణము. (Self Discipline or Training)

ఈ ప్రకృతిపాఠశాలలో మానవుఁడు ప్రతివిషయము నుండి యేదే నొకనీతిని గ్రహించి, మనస్సును శిక్షించుకొన వలయును. అనఁగా మంచిమార్గములోనికిఁ ద్రిప్పుకొనవల యును. శ్రీభాగవత ఏకాదశస్కంధమున నిశ్చింతుఁడు ఆనంద స్వరూపుఁడు నగు ఆవంతికబ్రాహ్మణునిఁ జూచి యీస్థితి నీకెట్లు కలిగినదని యదునృపతి యడుగగా నామహానీయుఁ డిట్లనియె. ఓ నృపోత్తమా! "నాకు ప్రకృతియందు ఇరువదినలుగురు గురువులు కలరు. వారివలన నీసుగుణములను గ్రహించి మన స్సును శిక్షించుకొని, యానందపరవశుఁడ నయితినని చెప్పెను. ఆగురువులలో కొందఱి నిట దిఙ్మాత్రముగా సూచించు చున్నాఁడ.

1. భూమి = అనేకభూతములచే నాక్రమింపఁబడి పీడింపఁబడినప్పటి కిని, ఓర్పుకలిగియుండుట (క్షమ) భూమివలన గ్రహింపవలయు.

2. వృక్షములు = తాము ఎండకు నెండుచు, వానకుఁ దడియుచు, పశుపక్షిమృగాదులకు నాశ్రయమై తమ్మును ఛేదించువారికిఁగూడ తమఫలములను నీడ నిచ్చునట్టి పరోపకారధర్మమును వృక్షములనుండి గ్రహింపవలయు.

3. వాయువు = నానావస్తువులమీదఁ బ్రసరించినప్పటికి ఆయావస్తువుల గుణదోషముల తాను బొందక, తనవలననే వానికి వికాసముఁ గలిగించుచున్నట్లు యోగియు, ఆయాధర్మముల నాశ్రయించినప్పటికి వాయువువలె నసంగతుఁడుగ నుండవలయు.

4. మధుకరము = నానాపుష్పములందు సంచరించుచు, వానియందున్న తేనియ నంత నొకచోట తెట్టెఁ గూర్చినట్లు యోగియు, ఆయాగ్రంథములనుండి మహాత్ములనుండి శ్రవణాదులచే జ్ఞానమును గ్రహించి యొకచోటఁ జేర్చి యానందించు.

5. అజగరము = ఆహారముకొఱకు నెచటికిఁ బోవక స్థైర్యముగ నొకచోటనుండిన మధ్యాహ్నపువేళకు వచ్చినమేకను భక్షించి తృప్తిఁ జెందియుండును, అట్టులే యోగియు, సంప్రాప్తముచే తుష్టుఁడై యుండవలెను.

ఇట్టుల తక్కినవిషయములను శ్రీభాగవత ఏకాదశ స్కంధమునఁ జూచి తెలిసికొనఁ దగినవి.

శ్లో. "ఆకించన్యం సుఖం లోకే పథ్యం శివమనామయం,
అనమిత్రపథో హ్యేష దుర్లభ స్సులభో మతః.
అకించనస్య శుద్ధస్య ఉపపన్నస్య సర్వతః,
అవేక్ష్యమాణస్త్రీన్ లోకాన్న తుల్య మిహలక్షయే.

ఆకించన్యం చ రాజ్యం చ తులయా సమతోలయం,
అత్యరిచ్యత దారిద్ర్యం రాజ్యాదపి గుణాధికం."

మహాభారత. శాంతి. అ 176.

5. అకించనుఁడు అనఁగా ఏమియు లేనివాఁడు; దరిద్రుఁడు. వివేకముతోఁ జూచిన దారిద్ర్యము సుఖము శత్రుబాధ లేనిదియును, కళ్యాణప్రదమయినదియును, ఆరోగ్యదాయక మయినదియునై యున్నది. అయితే ఇట్టిభావన, సామాన్యముగ నెవరికి నుండదు. దుర్లభము. అట్టిభావన యుండినట్లయితే మోక్షము సులభము. దరిద్రునకు మదగర్వాహంకారాదు లుండవు. శాంతుఁడును, భగవదేకపరాయణుఁడుగ నుండును. ఎల్లఅయెడ సమదర్శి యగును. రాజ్యము, దారిద్ర్యము ఈరెంటిని త్రాసులోఁ బెట్టి తూచినపుడు రాజ్యమునకన్న దారిద్ర్యమే శ్రేష్ఠముగ కన్పించినది. ఏలన: రాజ్యమున పరరాజశాత్రవులభీతి, చోరులభీతి, దుండగీంద్రభీతియుఁ గలదు. దారిద్ర్యమున నట్టిభీతి యేమియును లేదు. కాఁబట్టి దారిద్ర్యము శ్రేష్ఠము. భగవంతుని దగ్గరకుఁ జేర్చును. భగవంతుఁడును నిష్కించన ప్రియుఁడని పేరు. కాఁబట్టి దారిద్ర్యము కలిగినపుడు భగవదుపాసనముఁ గావించినట్లయితే ఇహలోకభాగ్యము, పరలోకసౌఖ్యము కలుగును. కుచేలుఁడు నిష్కించనుఁడు తపస్వియే కదా? వివేకము, ధీరత్వముఁ కలిగినపుడు దరిద్రునకుఁగల మహాభాగ్యము, స్వాతంత్ర్యము, భగవదనుగ్రహము మఱియొకనికుండవు. మహదైశ్వర్యము రాజ్యమునుఁ గలిగిన జనక పృథు పురూరవాదులు పెద్దల సేవించి జ్ఞానసంపన్నులయిరి. మమకారాదులు తగ్గించుకొనిరి.

మనోవ్యాకులము దుఃఖముఁ గలిగినపుడు మనస్సు విష యాంతరములమీఁదికిఁ బోనిచ్చి (Diversion of mind) వృత్త్యంతరముఁ గలిగింపవలయు శరీరమునకు వ్యాధులు గలిగినపుడు మనోబలము గలిగినయెడల ఆవ్యాధిబాధ అంత యుండదు. మనోవ్యాధి కలిగినపుడు శరీరారోగ్య మున్నను దౌర్బల్యము కలుగును.

జ్యోతిశ్శాస్త్రమువలన దుఃఖోపశమనము.

శ్లో. "యదుపచితమన్యజన్మని శుభాశుభం తస్య జన్మనః పక్తిం,
వ్యంజయతి శాస్త్రమేతత్తమసి ద్రవ్యాణి దీప ఇవ."

వరాహమిహిర. లఘుజాతకం.

6. ప్రాణులు పూర్వజన్మమునఁ జేసికొనిన శుభాశుభ కర్మ పక్వమును (కాలమును) చీఁకటియం దుండువస్తువులను దీపము ప్రకాశింపఁ జేసినట్టుల జ్యోతిశ్శాస్త్రంబు తెలుపును. ఉన్నకర్మనుఁ బోఁగొట్టదు. క్రొత్తకర్మనుఁ దెచ్చిపెట్టదు. కర్మ పరిపక్వమును కాలమును దెలుపును. అశుభకాలము (దుఃఖ) ఇంతవఱకు నుండునని తెలిసినంతట ధైర్యము గలిగి యోర్చు కొనియుండును. సత్కర్మల నొనరించుచుండును. రోగముపోవు టకు ఔషధము సేవించినటుల, దుష్కర్మ ఫలిత దుఃఖనివార ణార్థము జపహోమసురార్చనలుఁ గావించినచో నొకింత మన శ్శాంతి కలుగును.

శ్లో. "మిథష్షష్ఠాష్టమగయో ర్దశాభుక్త్యోస్తు ఖేటయోః,
చోరాగ్నినృపభీతిశ్చ బంధునాశో ధనక్షయః." ఉడుదశాప్రదీపిక.

నిపుణులగు జ్యోతిషశాస్త్రజ్ఞులు, దైవజ్ఞశేఖరులు, జాతకములఁ జూచి యీజాతకునకు ఈవయస్సున పరస్పర షష్ఠాష్టమదశాభుక్తికాలమున చోరశత్రుభయము, రాజభీతి, ధననష్టము, కళత్రపుత్రబంధువియోగము, ఆయాభావములనుఁబట్టి ఏడున్నరశని గోచారస్థితినిఁబట్టి కలుగునని చెప్పినపుడు ధీరుఁడు ఆస్తికుఁడు భీతినిఁ జెందక, ఆయాబంధువియోగము, ధననష్టము కలిగినపుడు శాస్త్రజ్ఞులు ముందుగనే కర్మఫలితమునుఁ జెప్పిరి. రాఁదగినది వచ్చినందున, దీనికెవరు కారణము కాదని సహించుకొనియెదరు. మనస్సమాధానముఁ జేసికొని శుభకాలము వచ్చుననుధైర్యముతో దుఃఖమును వీడుదురు. తమనాలుకను తాము కొఱుకుకొని యితరులను తిట్టి యేమి ప్రయోజనము. కాఁబట్టి తాము చేసికొనినకర్మఫలమును తామనుభవించి తీరవలయు ననుకొనియెదరు. అధీరులకు, అవివేకులకు శాస్త్రరహస్యముఁ దెలుపఁగూడదు.

మనస్సంబోధనము.

శ్లో. "చేతః కా తే చికీర్షా మురమథనపదాంభోజరాజన్మరందే
స్వాకృష్యాకృష్య భూయోఽప్యహితవిషయతస్సమ్యగావేశితం చ,
ధావం ధావం పరేషాం ధనభవనతటిల్లోచనాస్వప్యసక్తం
తచ్చాప్రాప్యాతురం త్వం కిమితి విదధసే మాం వృథా పాపపాత్రం."
సూక్తిసుధాలహరి.

1. ఓ మనసా! లోకములో (చెడు) దుర్విషయముల నుండి పలుమాఱు నిన్ను లాగి లాగి శ్రీహరి పాదారవిందములయం దుంచినప్పటికి, ఇతరుల గృహక్షేత్రధనదారాదుల

మీఁదికి పరుగిడుచు, దానినిఁ బొందఁజాలక ఆయాసపడుచు, నిన్ను కట్టుకొనినందులకు, నన్ను పాపపాత్రునిగ (పాపాత్ముఁడు దురాత్ముఁడు) దుర్మార్గునిగఁ జేయుచున్నావు. ఎన్నిపర్యాయములు నిన్ను మంచిదారిలో నుంచినప్పటికిని తప్పించుకొని పోవుచున్నావు. నిన్నేమిసేయఁదగునని భక్తుఁడు చెప్పుచున్నాఁడు.

2. శ్వానము ప్రొయ్యిలోఁ బరుండినంతవఱకు నెచటికిఁ బోవ ననుకొనుచుండి లేవఁగనే యెవరు తలుపులు తెఱచియుందురా? అజాగ్రతగా నుందురా? యని వెదకుచు, పరుల గృహములలోనికిఁ బ్రవేశించుచుండును. బాలుఁడొకఁడు మిఠాయిని తినమఱఁగి అంగళ్లయొద్దకు వెళ్లి దొంగతనము చేసి మిఠాయినిఁ దినుచుండును. వానిం గొనివచ్చి యొక గదిలో నుంచి తలుపు వేసినంతసేపు తలుపువద్ద చేరియుండును. తలుపు తెఱచినంతనే పాఱిపోయి యెప్పటివలెనే తినుచుండును. దుర్విషయముల మఱిగిన మనస్సును హఠయోగము చేత నొకచో ధ్యానమందు నిలిపినంతసేపు నిశ్చలముగ నుండును. ధ్యానము వదలినంతనే విచ్చలవిడిగ విషయముల మీఁదికిఁ బరుగిడును. (విషయదోషము వైరాగ్యము లేక)

శ్లో. "సదా మోహాటవ్యాం చరతి యువతీనాం కుచగిరౌ
నటత్యాశా శాఖాస్వటతి ఝుడితి స్వైరమభితః,
కపాలిన్ భిక్షో మే హృదయ కపిమత్యంతచపలం
దృఢం భక్త్యా బద్ధ్వా శివ భవదధీనం కురు విభో."

శివానందలహరి.

3. ఎల్లప్పుడు మోహారణ్యమున యువతీజనకుచపర్వతములమీద సంచరించుచు, ఆశయను కొమ్మలమీద నొకదాని నుండి మఱియొకదానిమీదికి దుముకుచు, ఆడుచు నత్యంత చపలమగు నామనోవానరమును భక్తియనుత్రాటిచే గట్టిగఁ గట్టి, యో కపాలి! భిక్షూ! పరమశివ! స్వామీ! నీయధీనముఁ జేసికొనుము. నాకుఁ జిక్కక త్రిప్పటలు బెట్టుచు నాయాస పఱచుచున్నదని భక్తుఁడు చెప్పెను. భౌతికశాస్త్రజ్ఞులు, సృష్టివాదులు, ఆదిని వానరముగ నుండి, నరుఁడుగ పరిణమించి యభివృద్ధిఁ జెందుచున్నట్లు చెప్పుచున్నందున, వానరగుణములు మానవునిమనస్సునం దున్నవని స్పష్టమగుచున్నది. కాఁబట్టి మనస్సు అతి చంచలస్వభావముగల కోతివంటిది.

శ్లో. "రే రే మనో మమ మనోభవశాసనస్య
పాదాంబుజద్వయమనారతమామనంతం,
కిం మాం నిపాతయసి సంసృతిగర్తమధ్యే
నైతావతా తవ గమిష్యతి పుత్రశోకః."

ఆనందలహరి.

4. ఓ మనమా! నీపుత్త్రుని (మనోభవుని = మన్మథుని) నాశనముఁ జేసిన పరమేశ్వరుని పాదారవిందముల నిరంతరము ధ్యానముచేయునట్టి నన్ను సంసారగర్తమునందు పడవైచి నీ యాక్రోశమునుఁ జూపుచున్నావు. ఇట్లొనరించుటచే నీకు పుత్రశోకదుఃఖము పోవునా? పోఁజాలదు. నన్నేల శ్రమ పెట్టెదవు?

5. మధురపదార్థము లున్నను, ఊరఁబంది యాదివెలుపలనున్న అమేధ్యపదార్థములను భక్షించుచున్నట్లు, భగవత్కథాసుధారసమును, సద్గ్రంథశ్రవణము, సద్గోష్ఠి, తత్త్వజ్ఞాన విషయములను విడిచి యీదుష్టమనము దుర్విషయములలోఁ బ్రవేశించి దుఃఖమునే యనుభవించుచుండునని శ్రీభాగవతమునందుఁ జెప్పఁబడియె.

6. ఓ మనమా! తాపత్రయముచే పిపాసువై, జలముకొఱకు సంసారపు టెండమావులయందు పరుగిడుచున్నావు. ఎంత పరుగిడినను స్వాదూదకము నీకు లభింపదు. సద్గురువు నాశ్రయించినట్లయిన మార్గముఁ జూపి నీప్రక్కనేయున్న వటవృక్షము అమృతసరోవరమునుఁ జూపి, నీతాపమునుఁ బోఁగొట్టును. ఆంతరదృష్టి లేక బాహ్యవిషయముల మీఁదికే పోవుచున్నావు. ఆభాససుఖవిషయములచే నీతాపముఁ బోవునా? శ్రీగురుమూర్తియనుగ్రహంబున అమృతపానముఁ జేసి తాపత్రయముఁ బోఁగొట్టుకొనుమా ?

7. ఓ మనమా! చపలస్వభావముచేత నీరథము నెక్కి, పాతాళమునకుఁ బోవుచున్నావు. ఆకసమున కెగురుచున్నావు. దిఙ్మండలము తిరుగుచున్నావు. ఎచ్చట తిరిగినను నీకు శ్రమాయాసంబులకాని పరమసుఖము లేదు. నీలోపలనే యున్నట్టి బ్రహ్మానందరసమును నీవు చూచుటలేదు. సద్గురుకృపచే బ్రహ్మానందరసమునుఁ గ్రోలినట్లయిన నీ బాహ్యవిషయసుఖములు తుచ్ఛములుగఁ గన్పించును.

8. కేవల విషయపరాయణులు అజ్ఞానులునగు దుర్జనులతోఁ జేరి, శమామృతరసాయనమును వెదకుచున్నావు. "బొగ్గులలో

మాణిక్యము చిక్కునా? చిక్కదు. రత్నపుగనులలో చిక్కును. అట్టులె జ్ఞానులగు సజ్జనులతోఁ జేరిన జ్ఞానమణియు, శమామృతరసాయనమును లభించును. సకలాభీప్సితములు నొసంగునట్టి చింతామణి, కల్పవృక్షము, కామధేనువు, నీలోనుండఁగ వెలుపలనున్నవని భ్రాంతిచే పరిభ్రమించుచున్నావు. నీ చంచలస్వభావమును విడిచి పరమగురువు నాశ్రయించినట్లయిన పైనిఁ జెప్పఁబడిన దివ్యమణి వృక్ష ధేనువులస్వరూపమును బొంది, యేదియు నపేక్షింపక యఖండానందమును బొందెదవు సుమా ?

౯. అతి చంచలస్వభావమగు పారదమును, శుద్ధియు పుటము భస్మమునుఁ జేసినట్లయిన ఎట్టిమహిమ కలిగియుండునో, నిన్ను నావిధముఁ గావించిన అట్టిమహిమ నీకును గలుగును.

శ్లో. "రసస్య మనసశ్చైవ చంచలత్వం స్వభావతః,
రసబంధో మనోబంధః కిన్న సిద్ధ్యతి భూతలే,
మూర్ఛితో హరతి వ్యాధిం మృతో జీవయతి స్వయం
బద్ధః ఖేచరతాం ధత్తే బ్రహ్మత్వం రసచేతసి."

జ్ఞానవాసిష్ఠే.

శ్లో. "చిత్తం చిదితి జానీయాత్ తకార రహితం యదా,
తకారో విషయాధ్యాసో జపారాగో యథా మణౌ.
జ్ఞేయవస్తు పరిత్యాగాత్ జ్ఞానం తిష్ఠతి కేవలం."

శంకరాచార్య. సదాచారే.

10. తకారరహితంబగు "చిత్తం" "చిత్" అగును. "జ్ఞానమ్" శుద్ధస్ఫటికంపుమణియందు జపాకుసుమ రక్తిమ భాసించునట్లు "చిత్" శుద్ధజ్ఞానమను మణియందు తకార రూపమగు విషయజాలము అధ్యస్తమగుటవలన, చిత్త మాయెను. కాఁబట్టి ఓ చిత్తమా! నీయందలి తకారమును బోఁగొట్టుకొని చిత్స్వరూపముఁ గమ్మా!

శ్లో. "దృష్టిస్సేవితుమాగతోత్పలదృశాం వక్షోజయోర్ధావతి
శ్రోత్రం నిర్జితకోకిలారవకలాలాపేషు విశ్రామ్యతి,
చేతస్తత్సుకృతైకలభ్యసురతారంభేషు సన్నహ్యతి
స్వీకృత్యాంజలిమేవ మాధవ జగన్నాథ ప్రసీదాధునా."

భక్తిసుధ.

11. ఓ జగన్నాథ! నిన్ను సేవించుటకు వచ్చితిని. అశిక్షితమగు నామనస్సు తనపరివారముతోడ నాకుఁ దెలియ కుండ మోసముచేసి పోవుచున్నది? ఎట్లనఁగా: సేవించుటకు వచ్చినటువంటి యువతీమణుల కుచములమీఁదికి నాకండ్లు పరు గిడుచున్నవి. కోకిలధ్వనులకన్న నింపగువారి గానమాధుర్య మందు నాచెవులు చేరిపోయినవి. వారి గాత్రాలింగనాదిభోగ ములకై నాచిత్తము వారియెడ సక్తమాయెను. అంజలి మాత్రము మిగిలిన నాయెడ ననుగ్రహింపుమా యని భక్తుఁడు ప్రార్థించెను.

12. మిడుత దీపమునుఁ జూచి యాహారమని భ్రాంతిఁ జెంది యందుపడి నశించెను. ఏనుగు కృత్రిమప్రదేశమున లేఖ్యరూపకరిణినిఁ దాఁకి స్పర్శకాంక్షచే గోతిలో పడెను. జింకలు వేణునాదముచే సొక్కి మృగయుని యురులలోఁ

జిక్కుకొనెను. తుమ్మెద సంపంగిపుష్పవాసనఁ జూచి యందు పడి నశించెను. మీనము గాలమునఁ గ్రుచ్చఁబడిన మాంసమును గ్రసింపఁదలఁచి యందు పట్టువడెను. శబ్ద-స్పర్శ-రూప-రస-గంధ ముల కాసపడి, కురంగ, మాతంగ, పతంగ, మీనభృంగము లొక్కొక్క యింద్రియముచేతనే నశించుచుండ, పంచేం ద్రియములు గలిగి, వానికి వశ్యమయిన మనస్సుగల మాన వునిసంగతి నీఁకేమి చెప్పవలయును.

13. ఓ మనమా! పంచేంద్రియవిషయములకు లోఁ బడక సద్గురుకటాక్షమున సహస్రారచక్రపద్మమందలి దివ్యా మృతరసమునుఁ గ్రోలినట్లయిన చెఱకు, చేక్కెర, బెల్లము లోనగు బాహ్యమధురపదార్థములన్నియు నీరసములుగా నుండును. ఓ మనోభ్రమరమా! నీరసవిషయములమీదికిఁ బోయి పరిభ్రమింపనేల? సంపంగిపువ్వు వాసనకు ఆశపడి నశింప నేల? శ్రీరమణచరణారవిందాశ్రమముఁ జేరి అందు శాంత సుధారసముఁ గ్రోలి అమృతానందస్వరూపమును బొందుము. జనన జరామరణరూపసంసారబంధము దొలఁగును. ఇంతకన్న బోధింపఁదగినది లేదు. శ్రీరమణచరణములు శ్రీహరిపాదార విందముల నాశ్రయింపుమా యనియు, శ్రీరమణమహర్షి చరణముల నాశ్రయించిన శాంతసుధారసముఁ గలుగుననియు, శ్లేష; అరవిందాశ్రమము = అరవిందయోగి దివ్యాశ్రమము నాశ్రయించినను, పరంజ్యోతిరూప శాంతసుధారసము లభించు ననియు తాత్పర్యము.

మానుషజన్మసాఫల్యము.

శ్లో. "దుర్లభం త్రయ మేవైతద్దైవానుగ్రహహేతుకం,
మనుష్యత్వం ముముక్షుత్వం మహాపురుషసంశ్రయః."

వివేకచూడామణి.

మానవజన్మము కలుగుట, అందు మోక్షాపేక్ష, మహాపురుషు నాశ్రయించుట ఈమూఁడును దుర్లభములు. దైవానుగ్రహమువలనఁ గాని కలుగఁజాలవు. ఆహారనిద్రాభయమైథునములు పశుపక్ష్యాదులకును, మానవులకును సమానముగఁ గలవు. వానికన్న మనుష్యునందు జ్ఞానమును ధర్మమును అధికముగ నున్నవి. అవి లేనిచో పశుసమానులని వేఱుగఁజెప్పనక్కఱలేదు. మానవుని కర్తవ్యాంశ మేమి? యని విచారించినచో జననజరామరణ దుఃఖరూపసంసారబంధమునుండి తొలఁగి మోక్షము నొందుటయే? అది సద్గురుకృపాకటాక్షముచే భగవదనుగ్రహమువలనఁ గలుగును.

శ్లో. "లబ్ధ్వా సుదుర్లభమిదం బహుసంభవాంతే
మానుష్యమర్థదమనిత్య మపీహ ధీరః,
తూర్ణం యతేత న పతేదనుమృత్యుయావత్
నిశ్శ్రేయసాయ విషయః ఖలు సర్వత స్స్యాత్."

శ్రీభాగవత. ౧౧ స్కంధ.

అనేకజన్మములెత్తి కడపట నెంతో దుర్లభమగు నీమనుష్యజన్మముఁబొంది మృత్యువు రాకముందే శీఘ్రముగా పరమపురుషార్థమగు మోక్షముకొఱకుఁ బ్రయత్నింపవలయు. సకల

్రుపార్థముల నిచ్చునదియు, అనిత్యమగు నీజన్మమును వ్యర్థ
ముc గావింపcగూడదు. విషయసుఖమన్నను పశుపక్ష్యాదుల
ను గలదు. ధీరుcడు దానికై ప్రయత్నింపc బనిలేదు.

గొప్పపుణ్యధనమువలన మనుష్యశరీర మనుఓడ లభించి
ది. ఇది ఛిద్రములచే శిథిలము కాకముందే సంసారసముద్ర
మును దాటవలయును. ఈ శరీరపుటోడను గురువను (కర్ణ
ధారుcడు) నావికుcడు నడపుచు నుండcగ, అనుకూలవాయు
వను భగవదనుగ్రహము కలిగినపుడు, ఎవcడు భవసాగర
మును దాటcడో వాcడు వ్యర్థుcడు, ఆత్మ హంతకుcడనియుc
జెప్పcబడును. శ్రేష్ఠమగు నీ మానవజన్మమును వ్యర్థములును
దుఃఖదాయకములు నగువిషయములc బాల్పడక యుత్తమ
పురుషార్థమునకై ప్రయత్నింపవలయు.

మోక్షమునకు సాధనచతుష్టయసంపత్తి.

1. నిత్యానిత్యవస్తువివేకము = నిత్యమగు ఆత్మను, అనిత్యమగు దేహాదులను విచారించి తెలిసికొనుట.
2. ఇహాముత్రార్థఫలభోగవిరాగము = ఇహలోక స్త్రీవిత్తపుత్ర గృహక్షేత్రాదులయందును, పారలౌకిక స్వర్గభోగాదులయందును విరక్తిc గలుగుట.
3. శమాదిషట్కసంపత్తి = శమ, దమ, ఉపరతి, తితిక్ష, శ్రద్ధ సమాధానములు.
4. ముముక్షుత్వము = సంసారబంధమునుండి విడువcబడవలెననెడి (ఇచ్ఛ) దృఢబుద్ధి.

శ్లో. "మోక్షద్వారే తు చత్వారస్తిష్ఠంతి ద్వారపాలకాః,
శమో దమస్తితిక్షా చ చతుర్థస్సాధుసంగమః.

మోక్షద్వారమునందు శమ దమ తితిక్ష సాధుసంగతులను నలుగురు ద్వారపాలకులు గలరు. వారినాశ్రయించిన ముక్తిపురమునఁ బ్రవేశింపఁ దగును. ఆత్మానాత్మవిచారము వేదాంతప్రకరణములయందును, ఇహాముత్రార్థ ఫలభోగవిరాగము, యోగవాసిష్ఠ, భర్తృహరివైరాగ్యప్రకరణములయందును జూడఁదగినది.

త్రికరణశుద్ధి. (Purity of mind)

అంతఃకరణశుద్ధి లేక యేమి యొనరించినను వ్యర్థమగును. కర్మానుష్ఠానమువలనఁ గాని అంతఃకరణశుద్ధి కలుగదు.

శ్లో. "జ్ఞానముత్పద్యతే పుంసాం క్షయాత్పాపస్య కర్మణః,
యథాదర్శతలప్రఖ్యే పశ్యత్యాత్మానమాత్మని."

స్మృతి.

పాపకర్మలు క్షయించుటవలన జ్ఞానము కలుగుచున్నది. పిమ్మట అద్దమువలె నిర్మలమైన తనయందు పరమాత్మనుఁ జూచుచున్నాఁడు.

కర్మయోగులును సక్తులు గాక అంతఃకరణశుద్ధికొఱకు కర్మలు గావించుచున్నారు.

కాయికకర్మలు = పుణ్యక్షేత్ర పుణ్యతీర్థగమనము, భగవత్పూజార్చనలు, పూజ్యులకు ప్రణిపతనము, కృచ్ఛ్రచాంద్రాయణాదులు, దానధర్మ

ములు గావించుట, పరోపకారము మొదలయినవి పుణ్యకర్మలు. అగమ్యాగమనము, తాడనము, మద్యపానము, హింస మొదలగునవి పాపకర్మలు.

వాచికకర్మలు = సత్యసంభాషణము, భూతహితప్రియవాక్కులు, భగవన్నామసంకీర్తనము, సద్గ్రంథస్తోత్రపారాయణము లోనగునవి పుణ్యకర్మలు. పరులను దూషించుట, అనృతము పలుకుట, కఠినంపుఁ బలుకులు, తిట్టుట, ప్రగల్భపువాక్కులు లోనగునని పాపకర్మలు.

మానసికకర్మలు = సత్సంకల్పము, సర్వప్రాణుల మేలుకోరుట, భగవద్ధ్యానము, వేదాంతవాక్యమననము లోనగునవి పుణ్యకర్మలు. సర్వప్రాణులకు కీడుతలఁచుట, ఈర్ష్యాసూయామాత్సర్యములు, ద్రోహముఁ దలఁచుట, దుష్టసంకల్పములు లోనగునవి పాపకర్మలు.

త్రివిధకరణములచేతను పుణ్యకార్యములనుఁ జేయవలయును. పాపకార్యములనుఁ జేయరాదు. త్రికరణశుద్ధి గలిగియుండవలయు.

శ్లో. "మనస్యేకం వచస్యేకం కర్మణ్యేకం మహాత్మనాం,
మనస్యన్యద్వచస్యన్యత్కర్మణ్యన్యద్దురాత్మనామ్."

పంచతంత్రమ్.

మహనీయులకు మనస్సునందు, వాక్కునందు, కర్మయందు నొక్కవిధముగనే యుండును. దుర్జనులు తలఁచునదొకటి, చెప్పునదొకటి, చేయునదొకటి. త్రికరణములు వేఱుగా నుండును. త్రికరణశుద్ధిఁ గలిగి యేకార్యము నేని సేయవలయు. సన్నని మూఁడుగొట్టములు ఒకదానితో నొకటి సంధించి,

చెక్కగఁ జూచిన తేజఃప్రసరణము కలుగుఁగాని, వంపుగ నుండిన కలియిక లేకపోయిన, తేజఃప్రసరణము, అమృత ధారయు స్రవించేదు. అట్టులే త్రికరణములు శుద్ధిగలి చక్కగనుండిన పరమేశ్వరునుండి జ్యోతిఃప్రసరణము, ఆనంద మృతధారయు లభించును గాని త్రికరణశుద్ధి లేక వేలు నుండిన ధ్యానయోగఫలము లభింపదు. కర్మకాండ అంతయు స్థూలశరీరశుద్ధిని, ఉపాసనాకాండ (భక్తి) అంతయు సూక్ష్మ శరీరశుద్ధినిఁ గలిగించుటచే, తన్మూలమున మోక్షము ప్రాప్తి చును.

శమాదిషట్కసంపత్తి.

శమము.

(Peace of Mind, or Tranquillity Calmness.)

శమము అనఁగా అంతరింద్రియనిగ్రహము. సర్వకర్మ నుండి నివృత్తి, ఉపశమమని వ్యాఖ్యాతలు నిర్వచించిరి బాహ్యవిషయములందు సత్యత్వ సుఖత్వబుద్ధిచేత ఇంద్రియ ములద్వారా మనస్సు అనాద్యవిద్యావాసనవలన కామక్రో ధాదివేగమువలన పరుగిడుచుండఁగ నాయాపదార్థములయం దోషముఁ జూపించి విషయములనుండి నివర్తింపఁజేసి ధ్యేయ మునందు (లక్ష్యమునందు) మాటిమాటికి నిలుఁపుట శమ మన బడును. నిస్తరంగ సముద్రమువలెను, నివాతప్రదేశమంద దీపమువలెను, కామక్రోధాదివిషయములచే చలింపక నిశ్చ ముగనుండు మనోవృత్తి శమ మనఁబడు.

శ్లో. "తుషారకరబింబాచ్ఛం మనో యస్య నిరాకులం,
మరణోత్సవ యుద్ధేషు స శాంత ఇతి కథ్యతే.
శ్రుత్వా స్పృష్ట్వా చ దృష్ట్వా చ భుక్త్వా ఘ్రాత్వా శుభాశుభం,
న హృష్యతి గ్లాయతి యస్స శాంత ఇతి కథ్యతే.
న రసాయనపానేన న లక్ష్మ్యాఽలింగితేన చ,
తథా సుఖమవాప్నోతి శమేనాంతర్యథా జనః."

జ్ఞానవాసిష్ఠే. ముముక్షుప్రకరణే.

మరణము, సంతోషము, యుద్ధము ఇవి ప్రాప్తించినపుడు ఎవనిమనస్సు వ్యాకులతఁ జెందక, చంద్రబింబమువలె నిర్మలముగ నుండునో, అతఁడు శాంతుఁ డనఁబడు. ప్రియాప్రియవిషయములను విని తాకి చూచి భుజించి ఆఘ్రాణించి హర్షవిషాదములఁ జెందఁడో, అతఁడు శాంతుఁ డనఁబడు. లోపల శమామృతపానముచే నెట్టి సుఖముకలుగునో, అట్టి సుఖము రసాయనముచేతఁగాని, మహదైశ్వర్యప్రాప్తిచేతఁగాని కలుగఁజాలదు. దుస్సహములగు మనోవ్యాధులు శారీరక దుఃఖములు, ఆశాపరంపరలు లోనగు సర్వమును సూర్యుని తమఃపటల మంటఁజాలనియట్లు ప్రశాంతచిత్తుల నంటఁజాలవు. తల్లియొద్ద మృదుప్రకృతులును, విషమప్రకృతులును, విశ్వాసముఁ బొందినట్లు సకలభూతములును ప్రశాంతచిత్తుని నాశ్రయించుచున్నవి.

శ్లో. "మహాశయ్యా భూమిర్విస్తృణముపధానం భుజలతా
వితానం చాకాశం వ్యజన మనుకూలోఽయమనిలః,

స్ఫురచ్చంద్రో, దీపస్స్వధృతివనితాసంగముదిత
స్సుఖం శాంతశ్శేతే విగతభవభీతిర్నృప ఇవ.''

శాంతిశతకం.

భూమియే హంసతూలికాపర్యంకము, భుజములు మెత్తనితలగడలు, ఆకాశము మేల్కట్టు, చేక్కనిగాలియే చామరము, ఆకసమున ప్రకాశించుచున్న చంద్రుఁడు దీపము, ధృతివనితాసంగముచే సంతుష్టుఁడగు శాంతయోగి సంసారభీతి లేనివాఁడై, మహారాజువలె సుఖముగ పరుండి నిద్రించు చున్నాఁడు.

శ్లో. ''అవశ్యం యాతార శ్చిరతర ముషిత్వాపి విషయాః
వియోగే కో భేద స్త్యజతి న జనో యత్స్వయమమూన్.
వ్రజంత స్స్వాతంత్ర్యాదతులపరితాపాయ మనస
స్స్వయం త్యక్తా హ్యేతే శమసుఖమనంతం విదధతి.''

భర్తృహరి. వైరాగ్యశతకం.

విషయములతోడి సంబంధముఁ గలిగి యెంతకాల మనుభవించినను ఆవిషయములు విడిచిపోవునది నిశ్చయము. విషయాసక్తుఁ డావిషయముల విడుచుటయందును, విషయ ములు వీనిని విడుచుటయందును భేదమేమి? వియోగము నిశ్చితమయినపుడు ఎవరు విడిచినను ఒకటే యని చెప్పఁ గూడదు. ఏలనః విషయాసక్తుఁడు విషయసుఖముల మరగి, భోగములు పోవునేమో యనుదుఃఖముచే విడువఁజాలనపుడు నిర్ణీతకాలము వచ్చినపుడు విషయములే ఈయాశ్రితుని విడ నాడి పోయి మితిలేనిదుఃఖముఁ గలిగించును. నిర్ణీతవియోగ

కాలము ప్రాప్తించినదని తెలిసికొనిన వివేకి ధీరుఁడావిషయము లను విడుచునపుడు అపరిమితశాంతిని సుఖమునుఁ బొందు చున్నాఁడు. వ్యావహారిక ప్రపంచమునందును మూఁడు అయిదు సంవత్సరములు కాలపరిమితిగల గౌరవాధికారపదవుల వీడ వలసివచ్చినపుడు కొందఱు వానిని వీడఁజాలక, యించుక కాలము దీర్ఘముఁ జేసి యెన్నియో కుతంత్రములు పన్ని తమకే యుండునట్లు చేయఁదలఁచుకొందురు కాని, నిర్ణీత వియోగకాలము ప్రాప్తించినపుడు వీరిప్రయత్నము లక్కఱకు రాకనే వీరిని వీడి మఱికొందఱి నాశ్రయించును. అప్పుడు వీరికి మితిలేనిపరితాపము మనోవ్యథ కలుగును. కొందఱు ధీరులు, వివేకులు, ఎన్నఁటికైన వీడవలయును, లేనిచో నవియే వీడిపోవునని నిశ్చయించి, నిర్ణీతవియోగకాలమునకు ముందే ధైర్యసంతోషములతో విడనాడుదురు. అప్పుడు వీరికి మనోవ్యథ లేక శాంతి కలుగును. లోకులును వీరినిఁ జూచి ధీరులు, శాంతులు, మనోనిగ్రహముఁ గలవారని కొనియాడు దురు. అటుల నిత్యానిత్యవస్తువివేకము గలవారును, వైరాగ్య వంతులు నగు మహనీయులు లోకములోని పుత్రకళత్రగృహ క్షేత్రవిత్తవస్తువాహనాదివిషయముల అనిత్యత్వమును, దుఃఖ దాయిత్వమునుఁ దెలిసికొని ముందుగనే వానియం దాసక్తి విడిచి భగవంతునందు మనంబుఁ జేర్చి నిరతిశయసుఖరూపం బగు శాంతినిఁ బొందెదరు. ఇట్టిమహనీయులే ప్రశాంతచిత్తులు, సమదర్శులు, తత్త్వజ్ఞు లనఁబడుదురు. యౌవనకాలమున ఇంద్రియపటుత్వముఁ గలిగినపు డెవరు శాంతులో వారే శాంతులుకాని, ఇంద్రియపటుత్వ ముడిగినపుడు, వార్ధకమున

నెవరికి శాంతి కలుగదు ? "వృద్ధాంగన పతివ్రత యైనట్లు" ఆశాంతియు నట్లుండును.

దమము. (Control of the Mind.)

దమము అనఁగా బహిరింద్రియనిగ్రహము. జ్ఞానేంద్రియ కర్మేంద్రియములను వానివానివిషయములనుండి మఱలించి వానివానిగోళకములందు నిలుపుట. అన్నిటికి అంతఃకరణము ప్రధానము గనుక అయ్యది తృష్ణనుండి నివర్తింపఁ బడెనేని ఇంద్రియములును వానివానివిషయములునుండి విముఖము లగును. ఇదియే దాంతి యనఁబడును.

శ్లో. "దమమేవ ప్రశంసంతి వృద్ధా శ్శ్రుతిసమాధయః,
సర్వేషామేవ వర్ణానాం బ్రాహ్మణస్య విశేషతః.
నాదాంతస్య క్రియాసిద్ధిర్యథావదుపపద్యతే,
క్రియా తపశ్చ సత్యం చ దమే సర్వం ప్రతిష్ఠితం.
దమస్తేజో వర్ధయతి పవిత్రం దమ ఉచ్యతే,
విపాప్మా నిర్భయో దాంతః పురుషో విందతే మహాత్.
సుఖం దాంతః ప్రస్వపితి సుఖం చ ప్రతిబుధ్యతే,
సుఖం లోకే విపర్యేతి మనశ్చాస్య ప్రసీదతి.
ఆశ్రమేషు చ తుర్ష్వాహుర్దమమేవోత్తమం వ్రతం,
తస్య లింగాని వక్ష్యామి యేషాం సముదయో దమః.
క్షమా ధృతి రహింసా చ సమతా సత్య మార్జవం,
ఇంద్రియాభిజయో దాక్ష్యం మార్దవం హ్రీ రచాపలం.
అకార్పణ్య మసంరంభ స్సంతోషః ప్రియవాదితా,
అవిహింసాఽనసూయా చాప్యేషాం సముదయో దమః."

మహాభారత. శాంతిపర్వ.

సర్వాశ్రమములందును సర్వవర్ణులకు దమమే యుత్తమ వ్రతము. కర్మలు, తపస్సు, సత్యము, దమమునందే ప్రతిష్ఠింపఁబడినవి, దమము తేజస్సు నభివృద్ధిఁ బొందించు, దమము పరమ పవిత్రమయి పాపమునుఁ బోఁగొట్టును. దాంతుఁడు సుఖముగ నిద్రించును, మేల్కాంచును. ఆతనిమనస్సు నిర్మలముగ నుండు. లోకమునకు సుఖముకలుగునట్లు తలఁచును. క్షమ=ఓర్పు,ధృతి=ధైర్యము, అహింస = త్రికరణములతో భూతములకు హింస కలుగఁజేయకుండుట, సమత=సమదృష్టి, సత్యము=యథార్థవచనము, ఆర్జవం = కుటిలస్వభావము లేకుండుట, ఇంద్రియాభిజయః=ఇంద్రియములను లోఁబఱచుకొనుట, దాక్ష్యం=సామర్థ్యము (నేర్పు), మార్దవం = మృదుస్వభావము, హ్రీ=అనుచిత కార్యములయందు లజ్జ, అచాపలం=స్థిరత్వము (ఇంద్రియవిషయములమీఁదికిఁ బోవకుండుట), అకార్పణ్యం = కృపణస్వభావము లేకుండుట, అసంరంభః = తొట్రుపాటు లేకుండుట, సంతోషః = సంతుష్టి, ప్రియవాదిత = ప్రియసంభాషణము, అవిహింస = హింసింపకుండుట, అనసూయ = ఈర్ష్య, మాత్సర్యములు (ఓర్వలేనితనము) లేకుండుట, ఇవియన్నియుఁ జేరి దమ మనఁబడును. గురుపూజనము పిశునత్వము లేకుండుట, స్తుతినిందలయందు సమత్వము, జనులమృషావాద స్తుతి నిందలయం దౌదాసీనత, సదాచారము, సత్ప్రవర్తనము, సచ్ఛీలము దాంతున కుండును; కామక్రోధలోభదంభదర్పస్తంభవికత్థనావమానాదులు దాంతున కుండవు. దమము, దానయజ్ఞాధ్యయ

నములకన్న నధికమయినది. దాంతి లేక యేకార్య మొనరిం చినను సిద్ధి కలుగదు. కాఁబట్టి దాంతితో సమానమైనది యే దియు కాదని పెద్దలు చెప్పుదురు.

శ్లో. "ఏక ఏవ దమే దోషో ద్వితీయో నోపపద్యతే,
యదేనం దమసంయుక్త మశక్తం మన్యతే జనః.
ఏకోఽస్య సుమహాప్రాజ్ఞ దోషస్స్యాత్సుమహాన్ గుణః,
క్షమయా విపులా లోకాస్సులభా హి సహిష్ణుతా.
దాంతస్య కిమరణ్యేన తథా దాంతస్య భారత,
యత్రైవ నివసేద్దాంత స్తదరణ్యం స చాశ్రమః."

మహాభారత. శాంతిపర్వం 106 అధ్యాయము.

ఇన్ని సుగుణములు కలిగియున్న దాంతుఁడు ఏదిపోయి నను, ఎవరు దూషించినను, ఏమన్నను, ఊరకయుండుననియు, ఇతనికి శక్తిసామర్థ్యములు లేవనియు, పౌరుషహీనుఁడనియు జనులు దోషము నారోపింతురు. ఈ యారోపితదోష మొక్కటి తప్ప తక్కినవన్నియు సుగుణము లుండును. లోకు లట్లు దోష మారోపించినను, ఇంచుకేని కోపగించుకొనక క్షమఁ గలిగినందున సకలపుణ్యలోకములు అతనికి వశ్యములు; సహిష్ణు తతో (సహనము) సమానమయిన గొప్పగుణము లేదు. దాంతుఁ డరణ్యమువెళ్లి తపస్సు చేయనేల? ఎచట దాంతుఁడు నివసించునో అదియే యరణ్యము, అదియే పుణ్యాశ్రమము, అదియే తపోభూమి.

శ్లో. "వనేషు దోషాః ప్రభవంతి రాగిణాం
గృహేషు పంచేంద్రియనిగ్రహ స్తపః,
అకుత్సితే కర్మణి యః ప్రవర్తతే
నివృత్తరాగస్య గృహం తపోవనం."

శాంతిశతకం.

ఇంద్రియవిషయాసక్తులగు రాగులు అరణ్యములకుఁ బోయినను, గృహములందునువలెనే దోషములు కలుగును. వీతరాగులగు దాంతులు గృహములందుండినను తాపసాశ్రమములుగ నుండును.

మహాతటాక జలనిర్గమనము. Project Delta.

ఒకపర్వతాగ్రమునుండి జలప్రవాహము నదీరూపముగ వచ్చి గొప్పతటాకములోఁ జేరును. ఈ మహాతటాకములోని జలము పెక్కుభూములకు పాఱి పంటలు ఫలించి, భూతకోటి కుపకరించును. దానికి పదితూము లుండును. పంటపండుట కావశ్యకమయినకాలమునందు వాస్తుశాస్త్రజ్ఞుఁడు (Engineer) నీరు విడిచి, తక్కినకాలములో తూములు బిగించి, కట్ట చేక్కగ వైచి గండ్లుపడకుండ జాగ్రతగ నుంచినచో, ఆ జలము పశుపక్షిమృగాదులకు సకలప్రాణికోటి కుపకరించును. అటుగాక కట్ట చేక్కగవేయక తూములు బిగించేనియెడల కట్ట తెగియు, తూములుగుండ నీరంతయుఁ బోయి మందు వేసవి కాలమున భూతకోటికి నీరు దొరకకయు, పంటలు పండకయు

క్షామము కలుగును. అట్టులే అచలస్వరూపుఁడగు పరమాత్మ నుండి వచ్చు సంకల్ప (Thought power) శక్తి మనస్తటాకములోఁ బ్రవేశించి, దశేంద్రియములగుండ వెలికిఁ బోవునపుడు గురువు అను వాస్తుశాస్త్రజ్ఞుఁడు (Engineer) ఇంద్రియనిరోధముఁ గావించి యేయేపురుషార్థములకు (ధర్మకార్యములకు) నెంతవఱకు నుపయోగించవలెనో, అంత యుపయోగించి తక్కినది స్థిరముఁ గావించినందున, వార్ధకమునను, శ్రవణమనన నిదిధ్యాసములకును, యోగమునకును ఉపయోగపడి తద్ద్వారా మోక్షముఁ గలిగించును. లేనిచో సంకల్పశక్తి యింద్రియములద్వారా దుర్వ్యయమై, ధ్యానయోగాదుల కుపకరింపక ఖిన్నుఁడై భవాబ్ధియందు పడును. ఇటుల విద్యుద్దీపము లున్నవని (Electric lights) ఎక్కువ వెలిఁగించుకొలఁదిని నిక్షిప్తనిధినుండి (Capacity power) శక్తి దుర్వ్యయ మగును. కాఁబట్టి మితముగ వెలుఁగుశక్తిని వినియోగించుకొనినచో లాభమును ఉత్తరోత్తరసౌఖ్యమును గలుగును.

శ్లో. "ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవ తు,
బుద్ధిం తు సారథిం విద్ధి మనః ప్రగ్రహమేవ చ.
ఇంద్రియాణి హయానాహుర్విషయాం స్తేషు గోచరాన్,
ఆత్మేంద్రియమనోయుక్తం భోక్తేత్యాహుర్మనీషిణః."

కఠోపనిషత్.

మహనీయులతోఁ గూడిన విందువినోదముల జరుగు సుందరోద్యానమునకుఁ బోఁదలఁచి ఒక ప్రభువు తనరథమునకు బాగరుఁబోతుగుఱ్ఱములను పదింటినిఁ గట్టించి, తగినసారథి నేర్పఱిచికొని దానినెక్కి యొకవారావధిమీాద రెండుకమ్ములు గల పట్టాలమీాదఁ బోవుచుండెను. వారావధి (Bridge) క్రింద దుర్గంధ క్రిమికీటకాకీర్ణమలినపంకిలజలము నదీరూపముగ పారుచుండెను. మార్గమున కిరుప్రక్కల రమ్యపుష్పస్తబకములతోడను, లేఁజిగురులతోడను, పండ్లతో నొప్పు లతావితానములు విరాజిల్లుచుండ,సారథి మద్యపానపరవశుఁడై పగ్గములు సడలునట్లు పీడగా నాగుఱ్ఱములు ఇరుపార్శ్వములఁ గనుపట్టు పుష్పపల్లవఫలముల గ్రసించుటకై మెడలు చాపగా, రథచక్రములు పట్టాలు తొలఁగి, సారథి ప్రభువు అశ్వములతోడ రథము క్రిందపాఱు ప్రవాహములోఁబడి నశించెను. అట్టుల జీవుఁ డనుప్రభువు, శరీరమను రథమునకు మనోవృత్తులను పగ్గములచే దశేంద్రియము లనుగుఱ్ఱములఁ గట్టించి, బుద్ధియనుసారథి నేర్పఱిచికొని నీతిన్యాయపద్ధతులను పట్టాలుగల సన్మార్గము, వారావధి యను ప్రవృత్తిధర్మమునం దుండఁగా, దానిక్రింద నానావిధపాపజాలములను క్రిమికీటకములును, హింసాసూయారాగద్వేష దుఃఖరూప పంకిలజలములును గల సంసారప్రవాహము ప్రవహించుచుండును. బుద్ధిసారథి మదోన్మత్తుఁడై ప్రమాదమునుఁ బొందెనేని ఇంద్రియాశ్వములు ఇరుప్రక్కలనున్న కామినీకాంచ

నాది విషయములమీఁదికిఁ బోయినపుడు నీతిన్యాయపద్ధతులు తొలఁగి, ఆత్మేంద్రియశరీరములతోడ సంసారనిరయగర్తమునఁ బడును. కాఁబట్టి సుశిక్షితములగు అశ్వముల నేత్రముల కిరుప్రక్కల గంతలుకట్టి, సారథి ప్రమాదపరవశుఁడుఁ గాక చక్కఁగ నడపిన గమ్యస్థానమునకుఁ జేరినట్లు, విజ్ఞాన సంపన్నమయిన బుద్ధిసారథి మనోవృత్తు లనుపగ్గముల స్వాధీనమందుంచుకొని, ఇంద్రియాశ్వముల వశ్యములఁ గావించుకొని, పరమపదమునకుఁ జేర్చుచున్నాఁడు. ఇదియే దమమని ఆ యుపనిషత్తాత్పర్యము. దమవిషయము మదప్రకరణమున విస్తరించి చెప్పఁబడెను గాన అచటఁ జూడఁదగును. దమము సాక్షురులగు ప్రాజ్ఞులకును, మదము రాక్షసులగు అజ్ఞులకు నుండునని చెప్పఁబడెను. దమమే వ్యత్యయమయిన మద మగును.

ఉపరతి. (Cessation.)

ఉపరతి అనఁగ బాహ్యాంతరకరణవిషయవ్యాపారముల నుండి విరమించుట. బాహ్యభూతజగద్విషయిక వ్యాపారము నుండి విరమించి బ్రహ్మాభిముఖత్వ మగుట ఉపరతి యనఁబడు. సర్వేషణలనుండి వినిర్ముక్తుఁ డయినవాఁడు సన్న్యాసి ఉపరతుఁ డనఁబడునని బృహదారణ్యకభాష్యమునందుఁ గలదు. ఉపరతి ముఖ్యముగ సన్న్యాసికవిషయము. విద్వత్సన్న్యాసము, వివిదుషాసన్న్యాసమని సన్న్యాసము ద్వివిధము. త్రిదండిసన్న్యాసి యనఁగా: మనోవాక్కాయములను త్రికరణము

లను దండించి లోఁబఱచుకొనినవాఁడని త్రిదండధారణ సూచనము. మఱియు కుటీచక, బహూదక, హంస, పరమహంస, తురీయాతీత, అవధూత యని సన్న్యాసులు ఆఱువిధములు. వీనిభేదములు వీనిధర్మములు శాస్త్రాంతరములయందు తెలియఁదగినది.

తి తి క్ష.

(Forbearance or Toleration Enduranace.)

"తితిక్ష" యనఁగా సర్వదుఃఖములను సహించుకొనుట. బాహ్యములగు శీతోష్ణాదులు, లాభనష్టములు, మానావమానములు, ఆంతరములగు హర్షవిషాదములు, ఖేదమోదములు అను ద్వంద్వముల సహిష్ణుత.

శ్లో. "సహనం సర్వదుఃఖానా మప్రతీకారపూర్వకం,
చింతావికారరహితం సా తితీక్షా నిగద్యతే."

వివేకచూడామణి.

సర్వదుఃఖములు ప్రాప్తించినపుడు ప్రతిక్రియఁ గావింపక చింతావికారాదులు లేక సహించుకొనుట తితిక్ష యనఁబడును.

శ్లో. "యం హి న వ్యథయం త్యేతే పురుషం పురుషర్షభ,
సమదుఃఖసుఖం ధీరం సోఽమృతత్వాయ కల్పతే."

భగవద్గీతా, 2 అధ్యాయ. 15 శ్లోకం.

శీతోష్ణ సుఖదుఃఖాదిద్వంద్వములు ఏధీరుని బాధింపఁజాలవో, ఏపురుషుఁడు వీనిచే వికారములఁ జెందఁడో, అట్టి

ధీరుఁ డగుయోగి మోక్షమున కర్హుఁడు. పూర్వజన్మకృతకర్మ వలన సుఖదుఃఖాదులు మానావమానాదులు గలుగుచున్నవని హర్షదైన్యాదివికారములు లేక ధైర్యముతో సహించుట తితిక్ష యనఁబడు. ఇతరమతములయందును, మతావలంబుల యెడను, వారివారిధర్మములు వారు శ్రద్ధతో నవలంబించు చున్నారని ద్వేషములేక సహనభావము (Toleration) తితిక్ష యనఁబడును.

శ్రద్ధ. (Faith)

శ్రద్ధ అనఁగా గురు వేదాంతవాక్యములయందు ఆస్తిక్య బుద్ధి. (విశ్వాసము) నిగమాచార్యవాక్యములయందు ఇది యిట్లేనని ప్రామాణ్యబుద్ధి శ్రద్ధ యనఁబడునని అపరోక్షాను భూతియందుఁ జెప్పఁబడినది.

శ్లో. "శ్రద్ధావాన్ లభతే జ్ఞానం తత్పరస్సంయతేంద్రియః,
జ్ఞానం లబ్ధ్వా పరాం శాంతి మచిరేణాధిగచ్ఛతి."
భగవద్గీత. 4 అ. 39 శ్లోకం.

"శ్రద్ధామయోఽయం పురుషో యో యచ్ఛ్రద్ధ స్స ఏవ సః,
అజ్ఞశ్చాశ్రద్దధానశ్చ సంశయాత్మా వినశ్యతి."
భగవద్గీత. 17 అధ్యాయ. 40 శ్లోకం.

1. శ్రద్ధావంతుఁడు గురూపాసనాదులయందు జ్ఞాన ప్రాప్తియందాసక్తికలవాఁడై జితేంద్రియుఁడై జ్ఞానముఁ బొందుచున్నాఁడు. జ్ఞానమును బొంది శీఘ్రములోనే నిరతి

శయానందరూపమగు పరమశాంతిని (మోక్షమును) జెందు చున్నాఁడు. పురుషుఁడు శ్రద్ధామయుఁడు. శ్రద్ధ యేవిధముగ నుండునో, పురుషుఁడును ఆవిధముగ నుండును. పట్టుదల, దీక్ష, శ్రద్ధయొక్కరూపములు.

(2) 1. అజ్ఞుఁడు, 2. అశ్రద్ధఁగలవాఁడు, 3. సంశయాత్మ= ఈముగ్వురిలో సంశయించువానికి ఈలోకము లేదు. పర లోకము లేదు. నష్టముఁ బొందును. (1) శాస్త్రజ్ఞానము లేని వాఁడు అజ్ఞుఁడు. (2) శాస్త్రగురువాక్యములయందు ఈవిధ ముగ నెందు కుండఁగూడదని విపర్యయజ్ఞానము, నాస్తిక్యబుద్ధి గలవాఁడు, అశ్రద్ధఁ గలవాఁడు. (3) వేదాంతశాస్త్ర గురు వాక్యములు కల్పితములా? అందుఁ జెప్పినట్లు జరుగునో జరు గదో? ఫలించునో ఫలింపదో? యను ప్రతివిషయమందును సంశయముగలవాఁడు ఉభయలోకములకుఁ గాక నశించును. పాపిష్ఠుఁడని శంకరభాష్యమునందుఁ గలదు.

3. లోకములో సామాన్యముగా గొప్పవారివాక్యము లందు చర్యలయందు విశ్వాసము (Confidence) (నమ్మకము) కలిగియుండును. కొన్నికారణములచే అనుమానము కలిగిన విశ్వాసము నశించును. విశ్వాసమునకన్న శ్రద్ధ యొక్కువ దార్ఢ్యము కలది. మతవిషయమునందు (Faith) శ్రద్ధయందురు. లౌకికవిషయములందు (Confidence Trust) విశ్వాసము, నమ్మక మందురు. శత్రువును తాంత్రికుని సామాన్యముగ నమ్మరు. సచ్ఛీలురు, యోగ్యులు, సత్యవ్రతులు నగువారి

వాక్యములందు, ప్రవర్తనమునందు విశ్వాసము (నమ్మకము) కలుగును. కొందఱు కుటిలప్రవర్తకులు, వంచకులు, ఆత్మ సామ్యముచే నితరులు తమరిని నమ్మఁజాలనట్లు తామును ఇత రుల నమ్మఁజాలరు. కొందఱు వంచకులు, మోసగాండ్రు, అమాయికు లగువారిని నమ్మించి, ధన మపహరింతురు. కార్య మును సాధించుకొందురు. విశ్వసించుట యనఁగా మనస్సును పట్టియిచ్చుట, నమ్మినవారిని మోసపుచ్చుట ప్రజ్ఞాకౌశల మను కొనియెదరు కాని, వారి నీతిబాహ్యత వెల్లడింపఁబడును. మఱి యొకసారి నమ్మరు.

సమాధానము. (One pointedness of mind,

పరబ్రహ్మయందు సర్వవిధముల మనస్సును నిలుపుట సమాధాన మనఁబడును. గాని దుఃఖించుచున్న మనస్సును లాలించుట సమాధాన మనఁబడదు. నిద్రాలస్యప్రమాదా దులు లేని మనస్సును లక్ష్యమందు ఏకాగ్రముగఁ జేయుట (One pointedness of mind) సమాధాన మనఁబడునని భాష్యకారులు నిర్వచించిరి.

శ్రుతి. "నావిరతో దుశ్చరితా న్నాశాంతో నాఽసమాహితః,
నాశాంత మానసో వాపి ప్రజ్ఞానే నైన మాప్నుయాత్."

కఠవల్ల్యుపనిషత్.

పాపకర్మనుండి విరతుఁడు కానివాఁడును, తృష్ణను విడు వనివాఁడును, ఏకాగ్రమనస్సు (సమాధానచిత్తము) లేనివాఁ

డును, ప్రశాంతమనస్సును బొందనివాఁడును, ఈపరబ్రహ్మ
ముసు (కైవల్యమును) ప్రజ్ఞానముచేతఁ బొందఁజాలఁడు.
యోగాభ్యాసముచే చిత్తైకాగ్రతఁ గలిగి, భగవదుపాసనచే
నంతఃకరణశుద్ధియు, తదనుగ్రహముఁ బడసినఁగాని సచ్చిదా
నందరూపునిఁ బొందఁజాలఁడని తాత్పర్యము.

సత్సంగము.

శ్లో. "ప్రసంగమజరం పాశం బంధనం కవయో విదుః,
స ఏవ సాధుషు కృతో మోక్షద్వార మపావృతం.
తితిక్షవః కారుణికా స్సుహృద స్సర్వ దేహినాం,
అజాతశత్రవ శ్శాంతా స్సాధవ స్సాధుభూషణాః.
సంగ స్తేష్వథ సంప్రార్థ్య స్సంగదోషహరా హి తే."

శ్రీభాగవత. తృతీయస్కంధం.

"గంగా తాపం శశీ తాపం దైన్యం కల్పతరు స్తథా,
పాపం తాపం చ దైన్యం చ హంతి సంగో మహాత్మనాం.
సత్సంగత్వే నిస్సంగత్వం నిస్సంగత్వే నిర్మోహత్వం,
నిర్మోహత్వే నిశ్చలతత్త్వం నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః."

శ్రీశంకరాచార్య.

ఎల్లవిధంబుల సత్సాంగత్యము నిఖలశ్రేయోదాయ
కము, తలుపు తెఱచిన మోక్షద్వారము, అజ్ఞానులతోడ
సాంగత్యము సంసారబంధమునకు కారణము. సజ్జనులతోడి
సాంగత్యము భవబంధమును, సంగదోషమునుఁ బోఁగొట్టి

మోక్షమును గలిగించును. సర్వభూతహితులు, కృపావంతులు, శాంతులు, తితిక్షావంతులు, సౌజన్యభూషణులు, ఆశ్రితవత్సలురు. ఇట్టి లక్షణములుగల మహనీయులు అజ్ఞానాంధకారములో మగ్నులగు మానవుల నుద్ధరించుటకై అచ్చటచ్చట సంచరింతురు. అట్టిమహనీయుల నాశ్రయించిన సాంసారికదుఃఖములు నశించును. మనోవికాసము, ధైర్యము కలుగును. గంగాస్నానము పాపమును, చంద్రుఁడు బాహ్యతాపమును, కల్పవృక్షము దారిద్ర్యమునుఁ బోఁగొట్టును. ఈ మూఁడుగుణములు సత్సంగతివలనఁ గలుగును. సత్సాంగత్యమువలన ఆత్మానాత్మవివేకము గలిగి మోహము నశించి తత్త్వజ్ఞానముచే ముక్తి కలుగును. సత్సంగతికన్న మించిన భాగ్యము ప్రాణులకు మఱియొకటి లేదు. సత్సాంగత్యముచే తనే రాక్షసులు, కిరాతులు, దైత్యులు, దానవులు, ఖగములు, మృగములు, చదువురాని స్త్రీలు, ప్రాకృతులు లోనగువారు భగవంతుఁ డగునన్నుఁ బొందిరని శ్రీభాగవతమునఁ జెప్పఁబడినది. కాఁబట్టి సత్సాంగత్యము గొప్ప మోక్షసాధనము.

ఆత్మగుణములు, సర్వసాధారణధర్మములు.

శ్లో. "దయా క్షమాఽనసూయా చ శౌచాఽనాయాసమంగళం,
అకార్పణ్య మస్పృహత్వం సర్వసాధారణాని చ."

బృహస్పతిస్మృతి.

దయ, క్షమ, అనసూయ, శౌచము, అనాయాసము, మంగళము, అకార్పణ్యము, నిస్పృహత్వము ఈయెనిమిదియు

నాత్మగుణములు (సంస్కారములు) సర్వవర్ణాశ్రమములు వారికి సాధారణధర్మములు. ఈధర్మముల నవలంబించినఁ గాని మోక్షము కలుగదని గౌతమధర్మసూత్రములందుఁ జెప్పఁ బడినది.

1. దయ = మిత్రుఁడుగాని,శత్రువుఁగాని, స్వకీయుఁడుగాని, పరకీయుఁడుగాని, ఆపదఁ జెందినపుడు రక్షించుట దయ యనఁబడును.

2. క్షమ = ఆధ్యాత్మిక శారీరదుఃఖములు గలిగినపుడు ఒకరిని కొట్టక తిట్టక కోపగించుకొనక సహించియుండుట క్షమ యనఁబడు.

3. అనసూయ = గుణవంతుల గుణముల చెడఁగొట్టక వారి స్వల్ప గుణములనైన కొనియాడుచు, పరదోషములయందు ప్రీతిలేకుండుట అనసూయ యనఁబడు.

4. శౌచము = అభక్ష్యవస్తుపరిహారమును దుర్గుణసంసర్గము లేకుండుట, స్వధర్మమున నిలుకడ కలిగియుండుట శౌచ మనఁబడును.

5. అనాయాసము = ఏకర్మ రమణీయముగ నున్నను శరీరమును పీడించునో, అట్టికర్మనుఁ జేయకుండుట అనాయాస మనఁబడును.

6. మంగళము = కొనియాడఁదగిన పనులు చేయుట, దూష్యము లగు పనులు చేయకుండుట మంగళ మనఁబడును.

7. అకార్పణ్యము = తనకుఁ గలిగినదానిలో కొద్దియైనను, సంతోషముతో ప్రతిదినము నొరుల కిచ్చుట, యిచ్చినదానికి వగవకుండుట అకార్పణ్య మనఁబడును.

8. అస్పృహత్వము = ఇతరులసొమ్ము నపేక్షింపక ప్రాప్తించిన దానితో సంతోషించి కార్యముల జరుపుకొనుట అస్పృహత్వ మనఁబడు.

అభ్యుదయనివేదిక.

దినచర్య వ్రాయునపుడు, భక్తుని వయోవత్సరములు, దినములు సూచింపవలయును. పుణ్యము, పాపము, దశగుణములుగా భావించి 10-కి ఎన్నిభాగములు పాపము, ఎన్నిభాగములు పుణ్యము అయినది సంఖ్య సూచింపవలయు. మొదటి గీటుమీాద, అనుభవించినకర్మలను రెండవగీటుమీాద చేయుచున్న చేసినకర్మలను వ్రాయవలెను.

శ్లో. "యతః ప్రవృత్తి ర్భూతానాం యేన సర్వమిదం తతం,
స్వకర్మణా త మభ్యర్చ్య సిద్ధిం విందతి మానవః."

భగవద్గీతా. ౧౮ అధ్యాయ. ౪౬ శ్లో.

ఏపరమేశ్వరునివలన సమస్తభూతములు కలిగినవో, యెవనిచే నీ విశ్వమంతయు వ్యాప్తమయ్యెనో, అట్టి పరమేశ్వరుని తనధర్మము పూర్వకకర్మచేతనుఁ బూజించి మానవుఁడు ఉత్తమస్థితినిఁ బొందుచున్నాఁడు. అట్టి పరమేశ్వరుని తన దైనందిన జీవితమందు ప్రతికార్యమునం దున్నవాఁడని తలఁచి, తత్ప్రీతిగ భూతహితముగ కార్యముల నొనరించునది.

ఆత్మపరీక్ష - అభ్యుదయనివేదిక - దినచర్య.

	సంవత్సరం నెల తేది	భక్తుని వయస్సు సంవత్సరం	దినములు	కాయిక		వాచిక		మానసిక			పుణ్య సంఖ్య మొత్తం	పాప సంఖ్య మొత్తం	ఆధ్యాత్మిక తత్త్వ అభివృద్ధి
				పుణ్య ధర్మ	పాప అధర్మ	పుణ్య ధర్మ	పాప అధర్మ	సాత్త్విక పుణ్య	రాజస మిశ్ర	తామస పాప			
అనుభవ కర్మలు													
అనుష్ఠిత కర్మలు													

వారమున రెండు పర్యాయములు గాని, లేక ప్రతిభానువారము సాయంకాలమునఁ గాని, గోష్ఠీసభలు జరిపి; శ్రవణప్రవచనములచే నుద్బోధముఁ గావించుచుండవలయును. అథమపక్షము, ప్రతిశనివారము నయినను భజనము సలుపుచుండఁదగును.

జీవితము-దినచర్య.

1. మానవుఁడు ప్రతిదినము ఉషఃకాలముననే మేల్కొని జగదీశ్వరుని స్తుతించుచు లేచి ప్రాఙ్ముఖముగఁ గూర్చుండి, ఓ పరమేశ్వరా! నీయనుగ్రహమున సుఖసుప్తిఁ జెందితిని. నేటిదినము నేను చేయఁబోవు ప్రతికార్యమునందు తోడ్పడి దేహబలము, మనోబలము నొసంగి ధర్మమార్గము నందుఁ బ్రవర్తించునట్లు, నిన్ను మఱవకుండునట్లు, క్లేశములు లేక సంతోషోత్సాహములు కలుగునట్లు, అనుగ్రహింపుమా యని ప్రార్థింపవలెను. ఆయన దివ్యమంగళస్వరూపమును, భక్తరక్షణత్వమును, దయామయత్వమునుఁ దెలుపుస్తోత్రములను పఠించునది. తా నెవరయినది? ఎందుకువచ్చినది? తన్నుఁ దాను విచారించుకొనవలయును.

2. కాలోచితకృత్యములనుఁ దీర్చికొని స్నానము చేసి ధౌతవస్త్రధారియై గృహమందలి దేవతామందిరము లేక ధ్యానమందిరమునఁ బ్రవేశించి తమతమ మతసంబంధము లగు కర్మలు నిర్వర్తించి, పరమేశ్వరుని పూజించి ధ్యానించేవలెను. మనోహరములగు పుష్పములందు గొప్పగుణము కలదు. పుష్పములచేతను, తులసీదళములచేతను పూజింపవలెను. ఉపాస్యదేవతామంత్రమును గురూపదేశప్రకారము నియమితసంఖ్య జపించేవలెను. ఇతరసంకల్పములు లేక ఏకాగ్రవృత్తిగల మనస్సుతో ధ్యానించేవలెను. సర్వజ్ఞ, సర్వశక్త, సర్వేశ్వరా, సచ్చి

దానందస్వరూప, యేనీశక్తిచే పిపీలికాది బ్రహ్మపర్యంతము సమస్తభూతకోటులు సూత్రమునందుఁ గ్రుచ్చఁబడిన మణులవలెఁ బ్రకాశించుచున్నవో, సూర్యచంద్రాదులు ఏ నీయాజ్ఞచే నియమితకాలమున గతి నతిక్రమింపక చరించుచుందురో, సకలభూతకోటులహృదయమం దే నీతేజస్సు ప్రకాశించుచున్నదో, పవిత్రమైనట్టియు, శ్రేష్ఠమయినట్టియు, చరాచరసృష్టికిఁ గారణమయినట్టియు నగు నీ దివ్యతేజస్సును ధ్యానము సేయుచున్నాఁడను. అట్టితేజస్సు మాబుద్ధులను ధర్మమార్గమునందుఁ బ్రవర్తించునట్లు ప్రేరేపించు గాక యని గురూపదిష్టపద్ధతి ప్రకారము ధ్యానింపఁ దగినది. ఇట్లు రామతారక దత్తాత్రేయ శ్రీరాజరాజేశ్వరి శైవ వైష్ణవ శాక్తేయ (సంబంధ)ములగు నిష్టదైవతములను సగుణముగాఁ గాని, నిర్గుణముగఁ గాని ధ్యానింపఁదగును.

3. శ్రీవిష్ణుసహస్రనామస్తోత్ర భగవద్గీతాపారాయణ స్వశాఖాధ్యయనము లోనగునవి యథాశక్తి కాలపరిమితి కొలఁది పఠింపవలయు. దేవతార్చనఁ గావించి పదార్థములను నివేదనఁ జేసి భుజింపవలెను. ఇదియంతయు ప్రతివాఁడును నిత్యకర్మాష్టకప్రకారముఁ గావించునది. కాలపరిమితికొలఁది యథాశక్తిగ కొంతయైనను నిర్వర్తించునది. ఇందు అతిథిపూజ, దానధర్మములు, పరోపకారములు అన్నియు నిమిడియున్నవి.

4. ప్రతిమానవుఁడును తనవృత్తిలోనికిఁ బ్రవేశించునపుడు భగవంతుఁడు సర్వాంతర్యామియై చూచుచున్నాఁడని కపటవంచన ద్రోహాపహారహింసాదులు లేక స్వధర్మమును నిర్వ

ర్తించునది. ప్రతికార్యమును భగవంతునిచే యనియు, శక్తి లోపమును ఆత్మవంచనయు లేక చేయఁబడినదే యనియు తలంచేఁ దగినది. ఇట్లు తన వృత్తిధర్మమును నిర్వర్తించి సాయంకాలమయినంతట శరీరవ్యాయామమును ఆరోగ్యముకొఱకు కొంత చేసి, మనోవికాసముకొఱకు గోష్ఠిసంఘములందును, ఖేలనమేళన పఠనమందిరములందును, మిత్రులతోడను, వార్తాపత్రికాపఠనముతోడను కొంత కాలము గడపి గృహమునకు వచ్చునది.

5. మఱల సాయంకాలమునందు దేవతోపాసనను ప్రార్థనాదికముఁ గావించి రాత్రి భుజించి పరుండబోవునప్పుడు పగటి కాలమునందుఁ జేసిన అధర్మ పాపకృత్యములను క్షమింపుమనునట్లు భగవంతుని ప్రార్థించి దినచర్య వ్రాసి ముగించి సుఖముగ నిద్రించునది.

ఇది దినచర్య.

గ్రంథప్రయోజనము.

ఇట్లు జీవితమును సర్వభూతహితముగ జగత్కల్యాణకరముగ జరుపుకొనునది. యమనియమాది అష్టాంగములు, చతుర్విధయోగములు, తద్భేదములు, యోగజ్ఞానభక్తిసామికలు, షట్చక్రనిరూపణము, అణిమాదిసిద్ధులు, మంత్రదేవతోపాసనాసిద్ధి లోనగువిషయములు. "యోగవిద్యాప్రకాశిక" యను గ్రంథమున విసరముగఁ దెలుపఁబడును కాన అటఁ జూడఁదగును. ఈ మనస్తత్త్వశాస్త్రంబున మనస్స్వరూపము, ఆత్మస్వరూపము, మానసమలములగు కామక్రోధాద్యరిషడ్వర్గము, వాసనాసంస్కారములు, సుఖదుఃఖములు, దుఃఖో

పశమనమార్గములు,శమాదిషట్కసంపత్తి వివరముగఁ దెలుపఁ బడెను. అన్నింటికి మనస్సు ప్రధానసాధనము కాఁబట్టి అట్టి మనస్సు నిర్మల మయ్యేనేని యేదేని సిద్ధి గలుగును. మనస్సునకు సంబంధించిన విషయము లెవ్వేవియో? యెంతవఱకు ఉపపాదింపవలయునో, అంతవఱకు నుపపాదింపఁబడినవి. మానవుఁడు మనశ్శుద్ధినిఁ బడసి యిహలోకసుఖంబగు అభ్యుదయంబును, పరలోకసుఖంబగు నిశ్శ్రేయస్సునుఁ బొందఁదగును. ఈ శాస్త్రపఠనంబున మానవులెల్లఱు నిరతిశయసుఖంబుఁ బడయునట్లు పరమేశ్వరుఁ డనుగ్రహించుఁ గాఁత.

శ్లో. "సర్వేత్ర సుఖినస్సంతు సర్వే సంతు నిరామయాః,
సర్వే భద్రాణి పశ్యంతు న కశ్చిద్దుఃఖమాప్నుయాత్."

శ్లో. "ప్రమాద్యబ్దే మార్గశీర్షే కవనేశమితే కలౌ,
సమాప్తిమగమద్గ్రంథః కృష్ణపాదసమర్పితః."

ఇది, ఆపస్తంబసూత్ర, వాసిష్ఠసగోత్రపవిత్ర, ముక్తినూతులపాటి
వంశపయఃపారావారరాకాసుధాకర, సీతారామామాత్యవిద్వ
త్కవీంద్రపుత్ర, జ్యోతిర్విద్వర, విద్యాశేఖరబిరుదాం
చిత, గోపాలకృష్ణశాస్త్రిప్రణీతంబగు మనస్తత్త్వ
శాస్త్రమునందు గుణతత్త్వవిచార, సుఖ
దుఃఖతత్త్వవిచార శమాదిషట్క
సంపత్తివిచారంబులను
పంచమప్రకరణము సమాప్తము.

సర్వం శ్రీకృష్ణార్పణమస్తు ఓం తత్సత్.

చెన్నపురి : 'వావిళ్ల' ప్రెస్సున ముద్రితము.—1940.

తప్పొప్పుల పట్టిక.

పుట	పఙ్క్తి	తప్పు	ఒప్పు
37	12	వెలిసికొను	తెలిసికొను
95	19	ఏయస్థలు	ఏయవస్థలు
96	12	దక్షిణామూత్ర్యష్టకం	దక్షిణామూర్త్యష్టకం
102	5	ధారిణ్యత్షాణి	ధారీణ్యత్షాణి
107	20	స్వయంద్రష్టమై	స్వయంద్రష్టయై
178	13	బడినది	బడినవి
217	8	సంరంభాం	సంరంభో
320	4	లోకపర్యాయ	లోకపర్యాయ
366	10	మప్రతిష్టం	మప్రతిష్ఠం
409	15	ఊదక	ఊదఁ
416	14	కలిన్పించని	కన్పించని
547	1	మాణము	మానము
566	7	Crieb	Grief
625	2	నుండవలయును	నుండఁజాలఁడు
632	23	యిచ్చునేమో	యిత్తురేమో
636	4	తన	తమ
637	1	జెందును	జెందుదుము
641	6	ధీరుఁడు	ధీరులు
641	6	ఆస్తికుఁడు	ఆస్తికులు
647	1,13	సంపంగి	సంపెఁగ
652	2	కలియిక	కలయిక
670	16	తనధర్మము	తనధర్మ